# జాతీయ సదస్సు

## ఆధునిక సాహిత్యము – సామాజిక చైతన్యము


**ప్రధాన సంపాదకులు**

డా. బి. మేరి కుమారి

**సహ సంపాదకులు**

డా. డి. విజయలక్ష్మి

| | |
|---|---|
| Book Subject | : Telugu |
| Book Category | : Conference book |
| Copy Right | : Authors |
| First Edition | : January, 2026,Volume-1 |
| Book Size | : B5(Double Crown) |
| Paper | : 21kg, Maplitho NS |
| Price | : Rs.800/- |

Published by : Sahithyatharangini
ISSN: 3048-5908
Andhra Pradesh, India
www.sahithyatharangini.com
Contact: 91 21 03 98 99

ISSN Supported by
ISSN National Centre, India
National Science Library
CSIR-NIScPR, 14 Satsang Vihar Marg
New Delhi - 110067

First Edition January, 2026

Disclaimer: The Publisher and editor cannot be held responsible for errors or any consequences arising from the use of information in this Book; the views and opinions expressed herein are of the authors and do not necessarily reflect those of the publisher and editors. © All rights reserved. No part of the book may be reproduced, in any form or any means, without permission in writing from the publisher and the author.



**సిస్టర్ థెరిసమ్మ గాదే**
కళాశాల కరస్పాం డెంట్
జె.యం.జె.మహిళా కళాశాల (స్వయం ప్రతి పత్తి)
తెనాలి.

## శుభాకాంక్షలు

ఆధునిక తెలుగు సాహిత్యం సమాజం పై లోతైన ప్రభావం చూపి, సామాజిక చైతన్యానికి అద్దం పట్టింది. కందుకూరి వీరేశలింగం, గురజాడ వంటి స్మృస్కరణ వాదులతో మొదలై, అభ్యుదయ, విప్లవ సాహిత్యాల ద్వారా సామాజిక సమస్యలైన కుల వ్యవస్థ, పేదరికం, మహిళ అభ్యుసృతి పర్యావరణం వంటి అంశాలను సాహితీ రూపంలో ప్రజలకు చేర్చి, వారిలో చైతన్యం తెచ్చి, సమాజ గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించింది.

ఆధునిక తెలుగు సాహిత్యం కేవలం కాలక్షేపానికి కాకుండా, సమాజంలో మార్పు తీసుకురావడానికి, ప్రజలను చైతన్యపరచడానికి ఒక శక్తి వంతమైన సాదనంగా పని చేసింది, ఇది తెలుగు సాహిత్యానికి ఒక విశిష్ట గుర్తింపును తెచ్చింది.ఆధునిక తెలుగు కథ సాహిత్యం పర్వరణం సమస్యలను, మానవుడు-ప్రకృతి సంబంధాన్ని వివరిస్తూ పర్యావరణ చైతన్యాన్ని కూడా పెంపొందించింది.

స్వాతంత్రోద్యమ సమయంలో అనేక మంది ఆధునిక కవులు తమ పాటల ద్వారా, మాటల ద్వారా ఎంతో మక్కువ చూపి స్వతంత్రోధ్యమానికి ఒక కీలక పాత్ర్రగా, పోషించి దానిని నిలబెట్టారు.

కాలినడకన గ్రామీణ ప్రమ్తలల్లో తిరిగి,పేదల జీవన విధానాన్ని,వారి ఆర్ధిక, సామాజిక పరిస్తుతులను. చిత్రించి, వారి పట్ల కరుణ, పరిష్కరణ మార్ఘలను చూపించడంలో ఆధునిక కథకులు కృషి చేసారు. ఈ ఆధినిక సాహిత్య సామాజిక చైతన్యం కోసం.సమాజంలోని అసమానతను, అనచివేతలపై పోరాడుతూ ప్రజల విముక్తిని ఆకంక్షిస్తు అభ్యుదయ కవత్వాన్ని ప్రకటించింది.

గురజాడ అప్పారావు వంటి వారు సామాజిక స్థితిగతులను.మనవ సంబందాలను వాస్తవ ధృక్పదంతో చిందింది, ప్రజల సమస్యలను సాహిత్యం ద్వారా ఎత్తి చూపారు ఆధునిక తెలుగు సాహిత్యం సమాజంపై లోతైన ప్రభావం చూపింది. సామాజిక చైతన్యాన్ని రేకెత్తించింది. ముఖ్యంగా 19వ శతాబ్దం చివరిలో, 20వ శతాబ్దం ప్రారంభంలో కందుకూరి వీరేశలింగం వంటి సంస్కర్తల ద్వారా సామజిక సమస్యలను రచనల్లోనికి తీసుకువచ్చి, ప్రజలల్లో చైతన్యం నింపింది. ఇది సామాజిక న్యాయం, స్త్రీ విముక్తి పర్యావరణం వంటి అంశాలను స్పృశిస్తూ అభ్యుదయ కవిత్వం కథలు, నవలలు రూపంలో

వికసించింది, సమాజాన్ని ప్రతిబింబిస్తునే మార్పునకు దోహదపడింది.పాటల రూపంలో సామాజిక చైతన్యం, అవగాహన పెంచే గీతాలు ముఖ్య పాత్ర పోషించాయి.

ఆధునిక సాహిత్యం కేవలం సమాజాన్ని చూపించడమే కాకుండా, దానిలోని లోపాలను ఎత్తి చూపి, ప్రజలను ఆలోచింపజేసి, సామాజిక మార్పులకు ప్రేరనమగా నిలిచింది.నవల సాహిత్యం సామాజిక వాస్తవికతను ప్రతిబిమ్బిస్తూ, పర్యావరణ సమస్యలు పేదల జివన విధానం వంటి అంశాలను చర్చించింది, సామాజిక చైతన్యానికి వేదికైంది.

# ముందుమాట

ఆధునిక సాహిత్యం – సామాజిక చైతన్యం అనే అంశంపై ఒక రోజు జాతీయ సదస్సు నిర్వహించాలనే సంకల్పం పై తెలుగు శాఖ పోనుకొనే ప్రిన్సిపాల్ గారి అనుమతితో కార్యాచరణ మొదలు పెట్టింది. సదస్సుకు ఈ అంశాన్ని ఎన్నికోవడం ప్రదాన కారణం. సమాజంలో వచ్చిన అనిక మార్పులకు కారణం ఆధునిక సాహిత్యం.

ఆ నాడు బ్రిటిష్ వాళ్ళు మనల్ని పాలిస్తున్నప్పుడు వాళ్ళన్ని భారతదేశం నుండి వెల్లగోట్టడానికి భారతీయులలో స్వాతంత్ర్యం బిజము  నాటటానికి ప్రధానకారణం ఈ ఆధునిక సాహిత్యమే, దీనిలో భాగంగా అనిక మంది కవులు కళాకారులు తమ యొక్క మాటలు  పాటలు, ఉపన్యాసాలు ,పద్యాలు ద్వారా ప్రజలలో  చైతన్యాన్ని కలిగించారు.

సంఘంలో  మూడాచారాలు, వితంతువులు దీనావస్థ ,  బాల్యవివహాలు, ఆడపిల్లలకు చదువు లేకపోవటము  ,  అనే  మూడనమ్మకాలు  సంఘంలో  ఎక్కువగా  ఉండేవి.  వాటి  అన్నింటిని సంఘసంస్కర్తలు తమ జివితాలను త్యాగం చేసి సంఘం లో మార్పులు తీసుకొని రావాలని కృషి చేసారు. వారి అందరి త్యాగ ఫలితమే ఈ నాడు మనము సుఖంగా ఉంటున్నాము. వీటి అన్నింటికీ ప్రధాన కారణం ఆధునిక సాహిత్యమే. ప్రాచిన సాహిత్యములో కావ్యాలు పురాణాలూ,  , ప్రభందాలు దైవ భక్తి  అనేక అంశములపై సాహిత్యము ఉండేది. మనిషి మనుగడకు కావలసిన విషయాలు ఆధునిక సాహిత్యములో ఉంది.

తెలంగాణా, మద్రాసు, బెంగుళూరు రాష్ట్రాలనుంచి ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు తమ పత్రాలను  సదస్సులో సమర్పించారు.ఈ సదస్సు ఏర్పాటు చేసుకోవడానికి ం.డి కల్పించిన డా.యన్. నారాయణ భరత్ గుప్తా గారికి, కళాశాల ప్రాచార్యులు డా.శాంత గారికి, మరియు నాతోటి సహోధ్యాపకులకు, సదస్సు ప్రారంభించినప్పటి నుంచి విజయవంతంగా ముగుసే వరకు సహకరించి మా తెలుగు శాఖ బోర్డు ఆఫ్ స్టడీస్ మెంబర్  కె .సురేష్ కుమార్ గారికి ధన్యవాదములు తెలియజేస్తున్నాను.

**సంపాదకులు**



**డా. సిస్టర్ రోస్ లి**

వైస్ ప్రిన్సిపాల్ (సందేశం)

జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి.

## అభినందనలు

మా JMJ కాలేజ లో జరుగుతున్న "ఆధునిక తెలుగు అధ్యయనాలు" అంతర్జాతీయ సెమినార్ సందర్భంగా ఈ సంకలన గ్రంథాన్ని మీ ముందుకు తెస్తుండటం అపూర్వమైన ఆనందంగా భావిస్తున్నాను. ఈ సందర్భంగా రచయితలు, పరిశోధకులు, నిర్వాహకుల సృజనాత్మక భాగస్వామ్యాన్ని హృదయపూర్వకంగా అభినందిస్తూ, ఈ ప్రయాసకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ఈ సెమినార్‌లో ఆధునిక సాహిత్య దృక్కోణాలు, సామాజిక మార్పులు, సాంకేతిక విప్లవం ప్రభావం, విలువల మార్పు, యువత అభిరుచులు, ప్రజా సంస్కృతి, మీడియా, అనువాద సాహిత్యం వంటి అనేక కీలక అంశాలు చర్చకు వస్తుండటం ఎంతో గర్వంగా ఉంది.ఇవన్నీ మన సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లను, అవకాశాలను, భవిష్యత్ దిశలను పరిశీలించే ముఖ్యమైన అంశాలని భావించాలి.

తెలుగు ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి, గ్లోబల్ స్థాయిలో తన ప్రాధాన్యతను పెంపొందించుకుంటున్న ఈ వేళ, ఆధునిక తెలుగు సాహిత్యాన్ని అంతర్జాతీయ పరిశోధనలతో అనుసంధానించడం అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ జర్నల్ రూపంలో పరిశోధన పత్రాలను ప్రచురించాలనే ఈ ప్రయత్నం తెలుగు భాష, సాహిత్యాల శాస్త్రీయ అధ్యయనానికి బలమైన వేదికగా నిలుస్తుంది.

ప్రస్తుత తరంలో ద్రుతగామి సాంకేతిక పరిణామాలు, మారుతున్న జీవన శైలులు, ప్రతిరోజూ రూపాంతరం చెందుతున్న విలువల నేపథ్యంలో మన సాహిత్య బోధన, పరిశోధన పద్ధతులు కూడా నవీకరణను కోరుతున్నాయి. అలాంటి సందర్భంలో ఈ సెమినార్‌లో ప్రతిపాదించిన వివిధ థీమ్‌లు అధ్యాపకులకూ, విద్యార్థులకూ, పరిశోధకులకూ కొత్త ఆలోచనల దారులను తెరుస్తాయని నమ్మకంగా చెప్పవచ్చు.

ఈ సంకలనంలో చోటుచేసుకున్న ప్రతి రచన ఆధునిక తెలుగు అధ్యయనాలపై గంభీరమైన చర్చకు దోహదపడాలని, భవిష్యత్ పరిశోధనలకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ శ్రమను సార్థకంగా మలిచిన ప్రధాన నిర్వాహకులు, సంపాదక వర్గం, సిబ్బంది, పాల్గొనే ప్రతీ ఒక్కరికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు.



**డా.పి.శాంత**
ప్రాచార్యులు
జె.యం.జె. మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి)
తెనాలి

## శుభాభినందనలు

ప్రియమైన సాహితీ ప్రియులారా ...!

ఈ రోజు మన జె.యం.జె. మహిళా కళాశాల, తెనాలిలో "ఆధునిక సాహిత్యం - సామాజిక చైతన్యం" అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి ఒక రోజు సదస్సు అనేది మన సమాజానికి, మన సాహిత్య లోకానికి ఒక మహత్తరమైన గుర్తింపు తెచ్చే ప్రక్రియలో భాగమే.

ఈ ఆధునిక తెలుగు సాహిత్యంలో నాటకం, నవల , కథ, కథానిక, అనే ప్రక్రియలు కేవలం వినోదం కొరకు మాత్రమే కాదు, అవి ఈ సమాజాన్ని మెరుగుపరచే ఒక శక్తివంతమైన సాధనాలు. తెలుగు సాహిత్య రంగంలో నాటకం ,నవల,కథ, కథానికలనేవి మన సామాజాన్ని అచేతన స్థితి నుండి చేతనత్వంలోనికి నడిపించేందుకు ప్రధాన పాత్రను పోషిస్తాయి. తెలుగు సమాజంలో ఎందరో మహానుభావులు తమ సాహిత్యం ప్రక్రియల ద్వారా స్వాతంత్ర్య కాంక్షను, సామాజిక సంస్కరణలను ప్రజల ముందుంచారు. సమాజంలో గూడుకట్టుకుపోయిన సాంఘిక దురాచారాలను రూపుమాపి, సమాజ రూపురేఖల్ని అభ్యుదయకరంగా మార్చింది వారి వారి సాహిత్యమే. ఉదాహరణకు "కందుకూరి" కొడవటిగంటి, చలం, మధురాంతకం, కాళీపట్నం , గోపీచంద్, బుచ్చిబాబు, లాంటి మొదలుగాగలిగిన అనేకమంది రచయితలు ఈ సమాజాన్ని పట్టి పల్లారుస్తున్న అనేకానేక సమస్యలకు పరిష్కారాలను తమ రచనల ద్వారా చూపించారు. ఆ రచయితల రచనల ఫలాలనే నాటి నుండి నేటి వరకూ ఈ సమాజం అనుభవిస్తూనే వుంది.

నేటి ఆధునిక డిజిటల్ యుగంలో అనేక రంగాలలో వస్తున్న సామాజిక మార్పుల్ని మనం నిత్యం గమనిస్తూనే వున్నాము. ఈ సాహిత్య ప్రక్రియలన్నింటిని భర్తీ చెయ్యగలిగింది సినిమా అని అనేక అపోహల్లో కొద్దిమంది ఉండొచ్చుగాక, కానీ నాటకం నవల కథ కథానికల నుండి పుట్టిన సినిమా లాంటి ఎన్ని నూతన మార్పుల్ని ఈ సమాజం సంతరించుకుంటున్నా, సమాజాన్ని ఒక మంచి కథానిక ద్వారా, ఒక మంచి నవల ద్వారా, ఒక మంచి నాటకం అనే సాహిత్య ప్రక్రియల ద్వారా మార్చి చూపించగలిగినంత ప్రభావవంతంగా మరే ప్రక్రియ చూపించలేదనేది జగమెరిగిన సత్యం.

సాహిత్యమనేది ఎప్పుడూ సామాజిక దర్పణం మాత్రమే కాక, మార్పుకు అదొక తీర్మా మార్గం కూడా. ఇది మనల్ని సమస్యలను గుర్తించి, పరిష్కారాలు చూడమని పిలుస్తుంది. ఈ సదస్సు ద్వారా మన విద్యార్థులు సాహిత్యం యొక్క సామాజిక బాధ్యతను అర్థం చేసుకుని, సమాజ సేవకు మార్గదర్శకులుగా మారాలని ఆశిస్తున్నాను. తెలుగు సాహిత్యం అంతే అది మన సంస్కృతి మన గుండె ఆయువు పట్టు.

ఈ సదస్సు విజయవంతం కావాలని, మీ అందరి చర్చలు ఫలవంతం కావాలని కోరుకుంటూ...

**మాతృభాషా సాహిత్యం వర్ధిల్లాలి.**

# విషయ సూచిక


| క్ర.సంఖ్య | శీర్షిక | రచయిత | పుట సంఖ్య |
|---|---|---|---|
| 1 | అనువాద సాహిత్యం – సామాజిక చైతన్యం | డా. నారగోని సైదులు | 1 |
| 2 | ‘అర్ధ నారి’ నవల – సామాజిక చైతన్యం | డా. రమేష్ దాసరి | 6 |
| 3 | ఆధునిక పద్య కావ్యాలు-కర్షక చైతన్యం | డా. నల్లపనేని విజయలక్ష్మి | 11 |
| 4 | ఎమ్వీ రామిరెడ్డి ‘రైతు కథలు’ – సామాజిక స్పృహ | షేక్ జరీనా | 23 |
| 5 | ఒక దశాబ్ది కథలు- సామాజిక సంబంధాల విశ్లేషణ | మామిడి విజేత | 28 |
| 6 | పల్లేటి లక్ష్మీ కులశేఖర్ గారి సాంఘిక నాటకాలు - సామాజిక విశ్లేషణ | గనుముల తిరుమల రాజు | 32 |
| 7 | ఆధునిక కథా సాహిత్యము - సామాజిక చైతన్యము | జి. గిరి ప్రసాద్ | 38 |
| 8 | పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథల విశిష్టత | డా. అనిత మార్గరెట్ నేలటూరి | 41 |
| 9 | ‘పేరడీ పిత’ జరుక్ | డా. జె. సీతాపతి రావు | 45 |
| 10 | మెరుపుల మరకలు నవల – ఉషా రాణి పాత్ర విశ్లేషణ | డా. వి. పూర్ణ చంద్రశేఖర రావు | 53 |
| 11 | సలీం 'లోహముద్ర' - సంకెళ్ల నుండి విముక్తి పొందిన గిరిజన జీవితం | డా. జరుపుల రమేష్ | 58 |
| 12 | కుంకుడాకు కథ - సామాజిక చైతన్య దీపిక | డా. చుండూరు పవన్ కుమార్ | 69 |
| 13 | గరిమెళ్ళ – జాతీయ తత్త్వం | డా. బి మేరి కుమారి | 77 |
| 14 | గోరా శాస్త్రి ‘ఆశ ఖరీదు అణా’ నాటికలో సామాజిక చైతన్యం | డా. నాగ రాజు గొడవర్తి | 85 |
| 15 | దేవులపల్లి కృష్ణశాస్త్రి సాహిత్యం : సౌందర్య దృష్టి | యం . భీమయ్య | 90 |
| 16 | నవల ఆవిర్భావ వికాసాలు | సి.హెచ్. వేణుగోపాలకృష్ణ | 95 |
| 17 | పాపం కుంటేలు గాడు – కథలోని వాస్తవికత | డా. చిలక అనిత | 99 |
| 18 | వడలి రాధాకృష్ణ కథాసంపుటాల ఇతివృత్తం - సామాజికత | డా. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు | 104 |
| 19 | షాజహానా రచనలలో ముస్లిం స్త్రీవాదం: ఒక పరిశీలన | శ్రీమతి షేక్ జరీన బేగం | 110 |

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 20 | సాంబయ్య చదువు నవల - వస్తు విశ్లేషణ | డా. గడ్డం లింగరాజు | 115 |
| 21 | దాశరథి రంగచార్య నవలల్లో సామాజిక చైతన్యం | నిమ్మల గంగాలక్ష్మి | 123 |
| 22 | కరుణశ్రీ ఖండ కావ్యాలలో కరుణరసం | డా.శ్రీపాద సీతామహాలక్ష్మి<br>సత్యవతీ పేరమాంబ | 133 |
| 23 | చైతన్య దీప్తి - కుసుమ ధర్మన్న | కె. ఎం. సౌందర్యవతి | 139 |
| 24 | తెలుగు నాటకం ఒక పరిశీలన | తోటే చిట్టిబాబు | 143 |
| 25 | తెలుగు నాటకం: చారిత్రక పరిణామం మరియు ఆధునిక దృక్కోణం | శాంతి ధనావత్ | 148 |
| 26 | తెలుగు సాహిత్యంలో వచన కవిత్వం - సామాజిక చిత్రణ | పి. యామిని అమ్మాజీ | 155 |
| 27 | పాలేరు నాటకంలోని ప్రేమతత్వం- ఒక పరిశీలన | సాదే యాకోబు | 161 |
| 28 | బోయి భీమన్న - గేయ సాహిత్యం | డా. బి. సుబ్బలక్ష్మి, | 166 |
| 29 | శ్రీకాకుళం జిల్లా కథా సాహిత్యం - ప్రాంతీయ అస్తిత్వ వివేచన | తూలుగు ప్రసాదరావు<br>డా. ఎస్. ఢిల్లీశ్వరరావు | 172 |
| 30 | దాశరధి నవలలు - సామాజిక చైతన్యం | డా. జి. వెంకట లాల్ | 176 |
| 31 | తెలుగు సాహిత్యంలో సామాజిక స్పృహ | డా. కోలా శేఖర్ | 186 |
| 32 | అంటరాని వసంతం – దళిత జీవనం ఒక విశ్లేషణ | గంజి. కుమార్ రాజా | 193 |
| 33 | “ఇప్పపూలు” కథలు – సామాజిక చైతన్యం | డా. జడా సుబ్బారావు | 197 |
| 34 | ఎండపల్లి భారతి జక్కికు నవల ఇతివృత్త విశ్లేషణ | పి. షకీల | 203 |
| 35 | కన్నెగంటి అనసూయ కథల్లో లో సామాజిక చైతన్యం | డా. యస్. దివిజాదేవి, | 210 |
| 36 | చలం ' సుశీల ' కథ - స్త్రీ వాద సాహిత్య మార్మిక దృక్పథం | డా . దాసరి విజయలక్ష్మి<br>డా. పిల్లి వాసు | 213 |
| 37 | డాక్టర్. బోయి భీమన్న "పాలేరు నాటకం" - సామాజిక చైతన్యం | శ్రీమతి ప్రఖ్యా నాగరేఖ, | 223 |
| 38 | నల్లద్రాక్ష పందిరి - దళిత చైతన్యం | డా. నెల్లూరు విజయకుమార్ | 227 |
| 39 | నీలిమేఘాలు కవితాసంపుటి – స్త్రీ చైతన్యం | డా. గోపినాథ్ రాథోడ్ పి | 233 |
| 40 | వాసిరెడ్డి సీతాదేవి కథలలో సామాజికత | డా. వాసిరెడ్డి భవాని | 239 |
| 41 | శ్రీశ్రీ మహాప్రస్థానం – ప్రతీకలు | డా. దోమల ధాత్రికుమారి | 245 |

# విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 42 | సగం తెరిచిన తలుపు – జీవిత గమ్యానికి మలుపు | డా. పరుచూరి విజయలక్ష్మి, | 252 |
| 43 | తెలుగు కథాసాహిత్యంలో స్త్రీల గిరిజన కథలు | డా. గుగులోతు ఫూల్ సింగ్ | 257 |
| 44 | రూబిడి (తెలంగాణ కథ-2019)- సామాజిక స్పృహ | డా. డి. లక్ష్మినరసింహం | 269 |
| 45 | సంస్కరణల స్వరం -ఆధునిక తెలుగు నాటక త్రయం | డా. ఎం. పద్మగౌరి | 273 |
| 46 | సమకాలీన కథా సాహిత్యంలో ఆధ్యాత్మిక సత్యాలు: ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిగారి కథలు. | ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు | 278 |
| 47 | శారద లేఖలు స్త్రీల చైతన్యం | దిట్టకవి కృష్ణమాచార్యులు | 289 |
| 48 | తెలుగు సాహిత్యంలో నూతన సారస్వత, భావోద్యమాల | డా. పి. జన్నమ్మ | 299 |
| 49 | మేల్కొన్న మనుష్యులు నవల-సామజిక చైతన్యము | యం. నిర్మల | 303 |
| 50 | తిలక్ కథలు – సామాజిక చైతన్యం | పి. నాగచందన | 306 |
| 51 | అతడు అడవిని జయించాడు - ప్రతీకాత్మకత | ముత్తే జ్యోతి శివ కాళీ కృష్ణ<br>ఆచార్య ఇరపని మాధవి | 308 |
| 52 | కర్శకుని –సౌశీల్యము | ఫణి రాజ్య లక్ష్మీ | 316 |
| 53 | కొవ్వలి నవలల్లో అణచబడిన స్త్రీ స్వరం | డా. డి. జ్యోతమ్మ<br>అరిగేల శ్రీకాంత్ | 319 |
| 54 | తెలుగు కథానిక ప్రక్రియల - ఆవిర్భావం - వికాసం | కట్ట రజిత | 327 |
| 55 | అభ్యుదయ కవిత్వం - భావజాల విశృతి | డా. జి. వి. ఎస్. జయపాల రావు | 332 |
| 56 | సినిమా చాటున ప్రశస్థి కోల్పోయిన నాటక రంగ కథే రంగస్థలం నాటకం | డా. పి శ్రీనివాసులు<br>డా. కే బలరాం | 342 |
| 57 | వచన కవితా వనమాలి కుందుర్తి | డా. కే సురేష్ కుమార్ | 346 |
| 58 | కాకాణి చక్రపాణి | మల్లెంబాక ఉదయశ్రీ | 358 |
| 59 | వీధి నర్తకి నవల - సామాజికత - అనుశీలన | గొల్ల నరేష్ కుమార్<br>ఆచార్య ఇరపని మాధవి | 367 |
| 69 | రైతుకోసం మహిళా పోరాటం నాటకం - సామాజిక చైతన్యం | పాలపర్తి ఫిలిఫ్ రాజు | 374 |

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# అనువాద సాహిత్యం – సామాజిక చైతన్యం

**డాక్టర్. నారగోని సైదులు**
తెలుగు అధ్యయన శాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం బెంగళూరు- 560056
చరవాణి: 9490585645, మెయిల్: saidulu645@gmail.com

**వ్యాస సంగ్రహం:** 'హితేన సహితం సాహిత్యమ్' అన్నారు ఆర్యులు. అంటే- సాహిత్యం మేలు కూర్చేదని, ప్రీతిదాయకమైందని, నీతిని బోధించేదని, ధర్మ ప్రతిపాదనం చేసేదని అర్థం. అంతేకాదు 'సహితస్య భావః సాహిత్యమ్' అని కూడా అన్నారు. అంటే- సాహిత్యం ధర్మంతో కూడిన సకలశాస్త్ర రహస్యాలతో సహితమైందని, ప్రకృతి సత్యాన్ని సౌందర్యవంతం చేసి ఆనందాన్ని అందజేస్తుంది అని అర్థం. అందుకే సాహిత్యానికి - సమాజానికి అవినాభావ సంబంధం ఉంటుందని, సమాజంలోంచే సాహిత్యం పుడుతుందని, సాహిత్య మనుగడ సమాజంపైనే ఆధారపడి ఉంటుందని సాహితీవేత్తలు వారి వారి గ్రంథాల్లో నొక్కి వక్కాణించారు. ఈ ప్రకారం సాహిత్యం సార్వజనీనమయింది, సర్వకాలికమైంది. ఏదైనా ఒక రచన లేదా గ్రంథం ఏ భాషలో రాయబడినా, ఏ దేశంలో వెలువడినా అది మానవాళికి ఒక సందేశాన్ని, మానవ పురోగతికి ఒక మార్గాన్ని చూపెట్టే విధంగా ఉంటే, ఆ గ్రంథం సర్వత్రా ఆదరించబడుతుంది. అంతేకాదు, ఆ గ్రంథాన్ని రచించిన రచయిత ఒకే భాష, ఒకే దేశం, ఒకే కాలానికి పరిమితం కాకుండా సర్వ మానవ ప్రపంచానికి పరిచయం అవుతాడు. తద్వారా ప్రపంచ ప్రజలు ఆ రచయితను గౌరవించి, అతడు రాసిన విషయాలను అత్యంత ప్రీతితో స్వీకరిస్తారు. చివరగా ఆ రచయితను, ఆ గ్రంథాన్ని వారి సొంత రచనగా భావిస్తారు. ఇంతటి ప్రాముఖ్యత సంతరించుకున్న సాహిత్య రంగంలో ప్రాచీన కాలం మొదలుకొని ఈనాటి కాలం వరకు ఏ దేశంలోనైనా, ఏ భాషలోనైనా ఏదైనా ఒక కొత్త ప్రక్రియ ప్రారంభమయినా లేదా ఏదైనా ఒక కొత్త పుస్తకం ఆవిష్కరించబడినా అది భాషతో సంబంధం లేకుండా, దేశ సరిహద్దులతో పని లేకుండా నిమిషాల వ్యవధిలో ప్రపంచ, భారతదేశ వ్యాప్తంగా తెలుస్తుంది, చేరువవుతుంది అంటే అది కేవలం అనువాద సాహిత్యం వల్లే అని చెప్పక తప్పదు. అనువాదం మూలంగా ప్రపంచంలో ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగిన కుల, మత, భాష, ప్రాంతం అనే భేదాలు లేకుండా పామరుడు మొదలుకొని ప్రతిభావంతుని వరకు చేరువై, చైతన్యవంతులు అవుతున్నారంటే అనువాదం ద్వారా మాత్రమేనని చెప్పక తప్పదు. ప్రాచీన కాలం మొదలుకొని నేటి కాలం వరకు కాలానుగుణంగా తన విశిష్టతను చాటుకుంటూ, సమస్త మానవాళిని ఏకం చేస్తూ, మనుష్యులు, దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య ఉన్న భాషా సంబంధమైన అడ్డుగోడల్ని కూల్చివేస్తూ 'విశ్వవారధి'గా ఖ్యాతికెక్కిన అనువాద సాహిత్యం గురించి, దాని స్వరూప స్వభావాల గురించి, అనువాదాల ద్వారా ఈనాటి సమాజం ఏ విధంగా చైతన్యవంతం అవుతుందో పరిశోధనా పూర్వకంగా విశ్లేషించటమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం.

---

1 ఆధునిక సాహిత్యము – సామాజిక చైతన్యము, జాతీయ సదస్సు - జె. యం.జె. మహిళా కళాశాల, స్వయం ప్రతిపత్తి, తెనాలి.

దీనికంటే ముందు అనువాదం అంటే ఏమిటి?, అనువాదాల వల్ల సమాజానికి – సాహిత్యానికి ఎటువంటి ఉపయోగాలు ఉన్నాయి?, అనువాదాల ద్వారా సామాజిక చైతన్యం ఎలా ఉద్భవిస్తుంది? అనే తదితర అంశాలను శాస్త్రీయ కోణంలో సంక్షిప్తంగా తెలుసుకుందాం.

**కీలక పదాలు:** ప్రపంచ సాహిత్యం, భారతీయ సాహిత్యం, తెలుగు సాహిత్యం, అనువాద సాహిత్యం, సామాజిక చైతన్యం.

**1. ఉపోద్ఘాతం:** ప్రపంచ, భారతీయ, తెలుగు సాహిత్యాల్లో అనువాద ప్రక్రియకు లేదా అనువాద సాహిత్యానికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. ఎందుకంటే- మానవ విజ్ఞానం పలు ముఖాలుగా, పలు దిశలుగా విస్తరిస్తున్న నేటి కాలంలో ఒక దేశంలోని సంస్కృతిని మరొక దేశం వారు, ఇతర జాతి జీవన విధానాలను మరొక జాతి వారు, పరాయి భాషా సాహిత్యాల్లోని అంశాలను ఇతర సాహిత్యాల వారు తెలుసుకోవాలని, చదువుకోవాలని, దిన దినం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని మానవులందరూ ఉర్రూతలూగడం సహజమైన లక్షణం. అయితే ఈ భూమ్మీద మనిషిగా జన్మించిన ప్రతి వ్యక్తి వందలాది భాషలను నేర్చుకోవటం అసాధ్యమైన పని. అంతేకాదు, మానవునిలో దాగున్నా విజ్ఞాన తృష్ణను, సాహిత్య పిపాసను ఇతరులకు తెలియజేయాలన్నా, ఇతర దేశాల్లో నివసిస్తున్న మానవులతో ఆత్మీయ అనుబంధం ఏర్పచుకోవాలన్నా అనువాదమే శరణ్యం. అనువాదం- వేలాది భాషలు మాట్లాడుతున్న సమస్త మానవాళిని ఏకం చేసి, ప్రపంచాన్ని కుగ్రామంగా తయారు చేసి, ఒక వసుధైక కుటుంబాన్ని సాధించడానికి శక్తిని ఇచ్చే విశ్వవారధి. ఒక్క మాటలో చెప్పాలంటే అనువాదం అనేది మనుష్యుల మధ్య ఉన్న భాషా సంబంధమైన అడ్డుగోడల్ని కూల్చేసి విజ్ఞానాన్ని, సమైకత్యను పెంపొందిస్తుంది. చివరగా బహుభాషలు, వందలకొద్దీ మాండలికాలు కలిగిన భారతదేశంలో ఐకత్యకు, సమానత్వానికి, దేశ అభివృద్ధికి ఒక అనుసంధాన సాహిత్యంగా లేదా భాషగా అనువాదం ఎంతో ఉపయోగపడుతుంది.

**2. అనువాదం – అర్థాలు:**

అనువాదం అంటే 'పునఃకథనం' అని ప్రాచీనార్థం. అంటే- ఒకరు చెప్పిన దానిని మళ్ళీ అలాగే తిరిగి చెప్పడం అని అర్థం. దీనిని ఆధునిక కాలంలో ఒక భాషలో ఉన్న దానిని మరొక భాషలోకి మార్చి చెప్పడాన్ని (అది రాత రూపంలో కావచ్చు, మాటల రూపంలో కావచ్చు) అనువాదంగా పిలుస్తున్నారు. అంటే- ఒక భాషలో ఉన్న విషయాన్ని గానీ, పదాన్ని గానీ, వాక్య సమూదాయాన్ని గాని ఇంకో భాషలోకి మార్చి చెప్పటాన్ని లేదా రాయడాన్ని 'అనువాదం'గా చెప్తారు. అనువాద సాహిత్యం భాషకు సంబంధించిన ప్రక్రియ. "అనువాదం అనే పదం 'వద్' ధాతువుకు సంబంధించింది. 'వద్' అంటే 'చెప్పడం'

అని అర్థం. 'వద్' ధాతువుకు 'ఘఞ' ప్రత్యయం చేర్చడం వల్ల 'వాద్' అనే పదం ఏర్పడింది. వాద్‌కు 'అను' అనే ఉపసర్గ చేర్చడం వల్ల 'అనువాదం' అనే పదం ఏర్పడింది. అంటే- అనువాదానికి 'పునఃకథనం' (ఒకరు చెప్పిదాన్ని మళ్ళీ చెప్పడం) అని అర్థం." 'శబ్దార్థ చింతామణి' నిఘంటువులో అనువాదానికి 'ప్రాప్తస్యపునఃకథనే' అనే అర్థం చెప్పబడింది. సంస్కృతంలో అనువాదానికి 'మళ్లీ చెప్పడం, పునః కథనం'' (అనువాదశాస్త్రం, పుట. 1) అని ఆచార్య బింసేన్ నిర్మల్ గారు తెలియజేశారు.

అనువాదాన్ని ఇంగ్లీషులో 'Translation' అంటారు. అనువాదకుడిని 'Translator'గా వ్యవహరిస్తారు. Translation అనే పదం లాటిలోని 'Trans మరియు Lation' అనే పదాల కూడికతో ఏర్పడింది. Transcription (లిప్యంతర), Transliteration (లిప్యంతరీకరణ), Transcreation (సృజనాత్మక), Transformation (రూపాంతరం) అనేవి ట్రాన్స్‌లేషన్ మీదే ఆధారపడి ఉంటాయి. అనువాద ప్రక్రియ అనేది పరకాయ ప్రవేశం వంటిది. మూల రచయిత భావాలను, అనుభవాలను, ఆలోచనలను, సిద్ధాంతాలను, విషయాలను, శైలిని వీలయినంతమటుకు సమానంగా లక్ష్య భాషలో అభివ్యక్తీకరించాలి. ఇది అంత సులువైన పని కాదు. ఎందుకంటే- ప్రతి భాషకి కొన్ని ప్రత్యేకమైన లక్షణాలు, మాండలికాలు, స్వభావాలు, ధ్వనులు, పదాలు, పదబంధాలు, వాక్య నిర్మాణం, అర్థాలు, సామెతలు, జాతీయాలు మొదలైనవి ఉంటాయి. అనువాదకుడికి అటు మూల భాషలోను, ఇటు లక్ష్యభాషలోను సమానమైన పరిజ్ఞానం ఉన్నప్పుడే ఒక భాషలోని అంశాలను మరో భాషలోకి అనువాదం చేయడం సులభమవుతుంది.

**3. అనువాదం – ఉపయోగాలు:**

అనువాద సాహిత్యం అత్యంత ప్రాచీనమైనది, అధునాతనమైనది, సంక్లిష్టమైనది. ఒక భాష నుండి మరొక భాషలోకి ఏదైనా ఒక విషయాన్ని తెనిగించాలంటే అనువాదకుడికి రెండు భాషలు కావాలి. ఒకటి మూలభాష, మరొకటి లక్ష్యభాష. వీటిని ఆంగ్లంలో 'Source Language, Target Language' అంటారు. అనువాదం కోసం స్వీకరించిన విషయాన్ని 'Textual Material'గా వ్యవహరిస్తారు. అయితే అనువాదకునికి రెండు భాషల్లోనూ ప్రావీణ్యం ఉన్నప్పుడే- "మూల భాష మాతృభాషగా గలవానికి రచనలోని సారాంశం ఎంత స్పష్టంగా అర్థమై, ఎంత గాఢమైన అనుభూతిని కలిగిస్తుందో, లక్ష్య బాష మాతృభాషగా గలవానికి అనువాదంలోని సారాంశం అంత స్పష్టంగానూ అర్థమై, అంత గాఢమైన అనుభూతిని కలిగిస్తే అది మంచి అనువాదం అవుతుంది." (అనువాద సమస్యలు, 2011, పుట.86). ఇంతకి అనువాదం వల్ల సమాజానికి, సాహిత్యానికి ఎటువంటి ఉపయోగాలు ఉన్నాయి? అని విషయాన్ని ఒకసారి పరిశీలిస్తే- భారతదేశం భిన్న సంస్కృతి, సంప్రదాయాల సమ్మిళితం. భారతదేశంలో 22 అధికార భాషలు, వందలకొద్దీ మాండలికాలు ఉన్నాయి. ఒక రాష్ట్రం గురించి మరొక రాష్ట్రం, ఒక గ్రామీణ ప్రాంతం గురించి మరొక గ్రామీణ ప్రాంతం, ఒక భాష వ్యక్తితో మరొక

భాష వ్యక్తి సంబంధ – బాంధవ్యాలు ఏర్పరచుకోవాలన్నా, ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవాలన్నా, ఒకరి మాటలు మరొకరికి అర్థం కావాలన్నా అనువాదం ద్వారానే సాధ్యమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా, భారతదేశ వ్యాప్తంగా ఉన్న మానవులందరి భాష ఒకటి కాదు. ఇతర దేశాలు లేదా ప్రాంతాల ప్రజలు మాట్లాడే మాటలను, బావాలను అర్థం చేసుకోవాలన్నా, తెలుసుకోవాలన్నా అనువాదం లేకుండా సాధ్యం కాదు. కనుక అనువాదాల ద్వారా విదేశాల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను తెలుసుకోవచ్చు. ఏదైనా ఒక పరాయి భాషలోని సమాచారాన్ని తెలుగు భాషలోకి తర్జుమా చేసుకోని- ఆ పరాయి భాష వారు ఏం మాట్లాడుతున్నారు?, వారు ఏం చెప్పదలచుకున్నారు? అనే విషయాలన్ని అర్థం చేసుకోవచ్చు. దీని ద్వారా పరాయి దేశాల నాగరికత, సంస్కృతి, సంప్రదాయాలు పట్ల అవగాహన ఏర్పడి ఇతర భాషీయుల మీద గౌరవం కలుగుతుంది. అంతేకాదు ఒక ప్రాంతపు సంస్కృతి, ఆలోచనా విధానాలు, జీవన విలువలు మరో ప్రాంతానికి చేరుతాయి. భిన్న సంస్కృతుల మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడతాయి. వీటితో పాటు ప్రపంచ సాహిత్యం భారతీయ భాషల్లోకి, భారతీయ సాహిత్యం ప్రపంచ భాషల్లోకి అనువదించబడుతుంది. అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన రచనలు భారతీయులకు, భారతదేశంలో ప్రసిద్ధిగాంచిన రచనలు విదేశీయులకు అందించబడతాయి. అనువాదాల మూలంగా తెలుగువారికి షేక్స్పియర్, టాల్స్టాయ్, ఖలీల్ జిబ్రాన్, పాబ్లో నెరూడా వంటి మహానుభావుల రచనలు చదివే అవకాశం లభిస్తే, విదేశీయులకు రవీంద్రనాథ్ టాగూరు, కాళిదాసు, నన్నయ, కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, సినారె మొదలైన మహానుభావుల రచనలు చదివే అవకాశం లభిస్తుంది. వీటితో పాటు ప్రపంచ సమస్యలు, ప్రజా ఉద్యమాలు, మానవ హక్కుల వంటి అంశాలు అందరికీ తెలుస్తాయి. ఈ భూమి మీద నివసిస్తున్న ప్రతి మానవునిలో జాగృతి, చైతన్యం, విమర్శనాత్మక ఆలోచనలు అనువాద సాహిత్యం ద్వారా పెంపొంది, సామాజిక చైతన్యాన్ని కలిగిస్తాయి. చివరగా కాలానుగుణంగా ప్రపంచ దేశాల్లో వైద్యం పరంగా, విజ్ఞానం పరంగా, సాంకేతికత పరంగా, టెక్నాలజి పరంగా వెలువడుతున్న సమాచారమంతా ఎప్పటికప్పుడు పాఠకులకు చేరవేసే ఏకైక సాహిత్యం అనువాదం సాహిత్యం అని చెప్పటంలో ఎటువంటి సందేహం లేదు.

### 4. అనువాదం – సామాజిక చైతన్యం:

భారతదేశంలో శతాబ్దాల కాలంగా నివసిస్తున్న హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, గిరిజనులందరూ సంఘ జీవులుగా, బుద్ధి జీవులుగా ఖ్యాతిగాంచారు. వీరందరూ శతాబ్దాల కాలంగా ఒక సమూహంగా ఉండి సమాజంలో కాలానుగుణంగా ఎదురవుతున్న సమస్యలను, రాజకీయ, ఆర్థిక అసమానతలను పరిష్కరించుకుంటూ ఒకరి పట్ల మరొకరు సంబంధాలు కలిగి సమాజం పట్ల, సమస్యల పట్ల అవగాహన కలిగి ఉండి, ఎప్పటికప్పుడు చైతన్యవంతులు అవుతుండడాన్ని

సామాజిక చైతన్యంగా చెప్పవచ్చు. దీన్ని సామూహిక స్పృహగా, సామాజిక బాధ్యతగా, సామాజిక న్యాయంగా పేర్కొంటారు. సమాజంలో ఉన్న వివిధ సమస్యలు, అసమానతలు, సవాళ్లపై అవగాహన కలిగి ఉన్నప్పుడే అన్ని ప్రాంతాల ప్రజలు చైతన్యవంతులు కాగలరు. సమాజంలోని వ్యక్తులు ఒకరితో మరొకరు పంచుకునే సాధారణ ఆలోచనలు, నమ్మకాలు, భావాలు, మంచి కోసం, ఇతరులతో బాధ్యతాయుతంగా ప్రవర్తించడానికి ఉపయోగపడుతాయి. అయితే ఇవన్నీ జరగాలంటే ఒక్క అనువాదం వల్లే సాధ్యమవుతుంది అని చెప్పక తప్పదు. ఎందుకంటే భారతదేశం సుమారు ఐదు వేల సంవత్సరాలుగా భిన్న జాతులు, మతాలు, కులాలు, ప్రాంతాలు కలిగి ఉంది. ఇటువంటి సందర్భంలో ఒక ప్రాంతం, భాషా సాహిత్యాల్లోని స్థితిగతులు మరొక భాష వారికి తెలియాలంటే అనువాదం ద్వారానే తెలుస్తుంది. అనువాదం ఒక భాషలోని లేదా ప్రాంతంలోని సమస్యలను మరో భాషలోకి మార్చడమే కాకుండా వివిధ సంస్కృతుల మధ్య, భాషల మధ్య ఉన్న ఆలోచనలను విస్తృతపరుస్తుంది.

**ముగింపు:**

అనువాద సాహిత్యం అనేది కేవలం భాషల మధ్య మాత్రమే కాదు, సంస్కృతి-సంప్రదాయాలను నిర్మించే అనుసంధాన భాషగా, సంభాషణగా పని చేస్తుంది.కాలానుగుణంగా సమాజం ఎంతంటి మార్పును ఆమోదించగలదో, అంత శక్తిని ప్రజల్లో పెంచగల శక్తి సామర్థ్యాలు అనువాద సాహిత్యానికి ఉన్నాయి. చాట్‌జీపీటి, జెమిని, పర్ప్లెక్సిటీతోపాటు ఫేస్బుక్, వాట్సాప్, ట్విట్టర్, వాయిస్ టైపింగ్ మొదలైన యాప్‌ల ద్వారా స్థానిక కథలు, దళిత, స్త్రీ రచనలు, నవలలు, కవిత్వాలు డిజిటల్ రూపంలో వెలుగులోకి వచ్చాయి, ఇంకా వస్తున్నాయి. భాషలు వేరైనా మనిషి ఆశలు, ఆవేదనలు, ఆనందం, అనుభూతి ఒక్కటే. కనుక, ఒక హృదయం ఆవేదనను మరొక హృదయానికి తీసుకెళ్లే ఏకైక సేతువు అనువాద సాహిత్యం. ఒక మంచి అనువాదం వాక్యాలను మాత్రమే మార్చదు, అది మానవ అనుభవాన్ని పంచుతుంది, సామాజిక చైతన్యాన్ని పెంచుతుంది. ఈ కారణంగా శతాబ్దాల కాలంగా ప్రపంచ, భారతీయ, తెలుగు సాహిత్యాల్లో అనువాదం అనేది సామాజిక చైతన్యానికి మూల సూత్రంగా నిలుస్తోంది. సామాజిక మార్పును సాహిత్యంలోకి, సమాజంలోకి తీసుకెళ్లే నిశ్శబ్ద విప్లవం అనువాదం. అనువాద సాహిత్యం నేటి ప్రపంచంలో ఒక సాహిత్య ప్రక్రియ మాత్రమే కాదు, సమాజాన్ని ముందుకు నడిపించే చైతన్య శక్తి.

**ఆధార గ్రంథాలు:**


1. నిర్మల్, భింసెన్.2000.అనువాద శాస్త్రం. అభ్యుదయ ప్రింటర్స్, హైద్రాబాద్.
2. శాస్త్రి, ద్వా.నా. 2014. తెలుగు సాహిత్య చరిత్ర. ప్రగతి పబ్లిషర్స్, హైద్రాబాద్.
3. రామచంద్రారెడ్డి, రాచమల్లు. 2011. అనువాద సమస్యలు. యోగి సాహితీ పబ్లిషర్స్, కడప.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## 'అర్ధ నారి' నవల – సామాజిక చైతన్యం

**డా. రమేష్ దాసరి**
తెలుగు ఉపాధ్యాయుడు, లొయోలా పబ్లిక్ పాఠశాల, నల్లపాడు, గుంటూరు – 522005,ఫోన్: 9951854571,
మెయిల్:dasarirameshsadik@gmail.com

**వ్యాస సంగ్రహం:**

ప్రస్తుత మన సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సామాజిక రుగ్మతల్లో వ్యభిచారం కూడా ఒకటి. వ్యభిచారులుగా మారడానికి ప్రధాన కారణాల్లో ఒకటి పేదరికం అని చెప్పవచ్చు. అయితే ఆ రంగంలోకి ఇష్టపడి వచ్చే వాళ్ళు కొందరయితే, బలవంతంగా నెట్టబడే వాళ్ళు కొందరు. ఏది ఏమి అయినా వాళ్ళు కూడా అక్కడ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుంటారు. సాహిత్యంలో ఇటువంటి వాటి గురించి ప్రస్తావించబడిన సంధారభాలు అల్పమగానే ఉన్నాయని చెప్పవచ్చు. సెక్స్ వర్కర్ల సమస్యలు ఎలా ఉంటాయో రామలక్ష్మి అనే పాత్ర ద్వారా తెలియజేశారు. భర్త చేతిలో మోసపోయి, తప్పని పరిస్థితుల్లో సెక్స్ వర్కర్ గా మారి బతికి బట్ట కట్టలేకపోయిన ఉదంతాన్ని రచయిత బండి నారాయణస్వామి తన 'అర్ధ నారి' నవలలో సాంఘిక సమస్య నేపథ్యంలో వివరించారు. అదే సమయంలో నపుంసకుల జీవితం ఎలా ఉంటుందో కూడా వివరించారు.

**Key words:** ఆధునిక సాహిత్యం, నవల, బండి నారాయణ స్వామి, అర్ధ నారీ, సామాజిక చైతన్యం, వివరణ

**పరిచయం:**

ఒక సమాజంలోని ప్రజల జీవన విధానం వారు నివసించే భౌగోళిక వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే సమాజం మానవ జీవితానికి ఒక రంగస్థలం వంటిదని చెప్పవచ్చు. మారుతున్న దేశ కాల పరిస్థితులకు అనుగుణంగా సమాజం పరివర్తన చెందుతుంది. సమాజంలో ఉత్పన్నమయ్యే సమస్యలను అర్థం చేసుకొని, ఆ సమస్యలకు పరిష్కార మార్గం చూపటానికి ప్రయత్నించిన వారే సామాజిక దృష్టి కలిగిన వారుగా పరిగణించవచ్చు. అటువంటి వారిలో బండి నారాయణస్వామి ఒకరు. నేటి ఆధునిక కాలంలో నవల ప్రక్రియ చాలా ప్రాధాన్యత కలిగినది. అటువంటి ప్రక్రియలో వారు రచించిన 'అర్ధ నారీ' నవలలో నపుంసకులు, వేశ్యా గృహాలలో బ్రతికే మహిళల పరిస్థితిని చిత్రించారు. ఈ నవలను పరిశీలించినప్పుడు అందులో ఉన్న సామాజిక సమస్యల చిత్రణతో పాటు చైతన్యం కూడా ఆయా పాత్రల ద్వారా మనకు చూపించారు రచయిత.

ఇతివృత్తం – సంక్షిప్త పరిచయం:

వ్యవసాయ కుటుంబానికి చెందిన చంద్రన్న అనే అందమైన యువకుడు చిన్నప్పుడు బడిలో చదువుకునే రోజుల్లో ఆడపిల్లల మధ్య కూర్చునే వాడు. తన మగ పుట్టుక ఏదో కోల్పోయినట్లుగా మదన పడేవాడు చంద్రన్న. అది గమనించిన అతని తండ్రి **"ఏం చేస్తున్నావ్ రా లోపల? ఆడంగుల నా కొడకా ఎట్లా పుట్టినావు రా నా కడుపున? థూ..! అందరిని బయటకు పంపి, సింగారించుకుంటున్నావా లోపల? బృహన్నల నా కొడకా..!"[1](అర్ధ నారీ – బండి నారాయణ స్వామి – పుట: 62)** అని తన తండ్రి, అతని అక్క నిరంతరం విమర్శిస్తూ ఉండేవారు. క్రమంగా అక్క భర్త తనకు దాసోహం అయ్యాడు. పరిస్థితి చేయి దాటిపోకుండా ఉండేందుకు అన్నట్లుగా అతనికి వెంకటమ్మ అనే అమ్మాయిని ఇచ్చి వివాహం చేస్తారు. కాన్పు కోసం వెంకటమ్మ పుట్టింటికి వెళ్ళగానే మరల తన అక్క భర్తతో శృంగారం మొదలుపెడతాడు. అక్కకి అనుమానం వచ్చి వారిద్దరి వ్యవహారం ఊరి చివర సాగుతుందని తెలుసుకొని, మాటు వేసి వారిద్దరిని నిలదీస్తుంది. తన తల్లిదండ్రులకు విషయం చెబుతుంది. **"ఆడంగులు నా కొడకా! మళ్ళీ మొదలు పెట్టావా అంటూ అంటూ తన అక్క తమ్ముని జుట్టు పట్టుకొని వంగదీస్తే తండ్రి కొడుకుని కాళ్లతో తన్నేవాడు. ఇంటికి వచ్చినాక అతని తల్లి కూడా ముఖం మీద ఉమ్మేసేది."[2](అర్ధ నారీ – బండి నారాయణ స్వామి – పుట: 74)** ఒక రోజు చేతి సంచిలో ఆడవాళ్ళు ధరించే వస్తువులన్నీ కుక్కుకొని, ప్యాంటు షర్టు శరీరం మీద ధరించుకొని ఇంటి వెనుక తలుపు తీసుకొని బయటపడ్డాడు. తనదైన ప్రపంచాన్ని తనదైన జీవితానికి వాగ్దానం చేసుకుంటూ, కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు ప్రయాణమయ్యాడు.

శ్రామిక వర్గం నివసించే ఒక కాలనీలో ముగ్గురు పిల్లల తల్లిగా రామలక్ష్మి పాత్ర కనిపిస్తుంది. తన భర్త ఒక ప్రమాదవశాత్తూ చనిపోయాక ఆమె ఒంటరి స్త్రీ అయిపోయింది. బ్రతకడానికి, తన పిల్లలను బ్రతికించుకునే ప్రయత్నంలో ఆమె సెక్స్ వర్కర్ గా మారుతుంది. సెక్స్ వర్కర్ గా మారడానికి ముందే అనేక మంది చేతిలో ఆమె మోసపోయింది. ఈ విధంగా అత్యాచారాలతో మొదలైన రామలక్ష్మి జీవితం ఆ తరువాత పట్నంలో ఒక చోట కూలి పనికి చేరుతుంది. అక్కడ తనకు కూలి పని ఇచ్చిన ఒక మేస్త్రితో అధిక ఆదాయానికి ఆశ పడి, మగ తోడు కోసం అతనితో అక్రమ సంబంధం ఏర్పరచుకుంటుంది.

పట్నం వచ్చిన చంద్రన్న రూప అనే ఒక 40 ఏళ్ల హిజ్రా పరిచయం చేసుకుంటుంది. అతడికి హిజ్రాల జీవితం గురించి, వాళ్ళు ఎదుర్కొనే సమస్యల గురించి వివరిస్తుంది. ఆమె ద్వారా లస్కర్ గ్రూపులో చేరి 'పావ్ పడితే' చేయించుకుంటాడు. అనుకోకుండా ఒకరికి ఒకరు పరిచయమయ్యారు చంద్రన్న, రామలక్ష్మిలు. ఒకరికొకరు సహాయం చేసుకుంటూ ఉంటారు. ఆమె ఉంటున్న వీధి చివర మణిమాల బ్రోతల్ హౌస్ ఉంటుంది. మణిమాలకు రామలక్ష్మి వల్ల వ్యభిచార గృహంలో రాబడి తగ్గడంతో ఆమెకు హెచ్చరికలు ఇవ్వమని తన అంగ రక్షకుడైన పిట్ పిట్ బాషా అనే అతన్ని పంపుతుంది. కానీ ఆమె అతనికి లొంగదు. ఇతను చిన్న నాటి నుండి పెంపకం సరిగ్గా లేని వాడు. అతడి తల్లి కూడా

వ్యభిచారం చేస్తూండేది. అతని తల్లి రసూలమ్మను కూడా బాష శారీరకంగా అనుభవించిన వైనం దుర్భరంగా అనిపిస్తుంది. తరువాత ఆమెపై నిఘా పెట్టమని పోలీస్ కానిస్టేబుల్ లింగారెడ్డిని పురమాయిస్తుంది మణిమాల.

కొన్ని సహాయక సంఘాల వల్ల చంద్రన్న హిజ్రాల కోసం కిన్నెర వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రారంభిస్తాడు. రూరల్ డెవలప్మెంట్ ట్రస్టు వాలంటరీ సెక్షన్ రామలక్ష్మిని వేశ్యా గృహాల బారి నుండి విడిపించి ఆమెను ఆటో డ్రైవర్ గా మారుస్తారు. చంద్రన్న లేడీస్ టైలర్ అవుతాడు. ఆస్తి హక్కు ప్రభావం వల్ల రమణికి(చంద్రన్న) తన ఆస్తి కొంత వస్తుంది. లింగమూర్తిడి కోసం డబ్బులు కూడా పెట్టుకుంటున్నాడు. కూతురు మణిమాల డాక్టర్ అయ్యింది. అల్లుడు కూడా డాక్టర్ అవడంతో కింద కాలు పెట్టనివ్వకుండా మణిమాలను కారులో తిప్పుతుంది.

**సామాజిక చైతన్యం:** ఈ నవలలో అనేక సామాజిక సమస్యలు మనకు కనిపిస్తాయి. వాటిలో కొన్ని వాస్తవ ప్రపంచానికి దగ్గరగా ఉన్నవే. కొన్ని దారుణమైన సంఘటనలు వివరించడానికి రచయిత ఏమాత్రం సంకోచించని వైనం కనిపిస్తుంది. ఈ నవలలో మనకు క్రింది సమస్యలు కనిపిస్తాయి.

**1.ట్రాన్స్ జెండర్ల సమస్యల చిత్రణ:** 'అర్ధ నారి' నవలను తీర్చిదిద్దడంలో రచయిత చేసిన మేధో కృషి అడుగడుగునా సమాజానికి ఉపయోగపడే విధానం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ట్రాన్స్ జెండర్ల చరిత్ర, పరిణామం, పౌరాణిక మూలాలు, వారిదైన ప్రత్యేక ప్రపంచం, దాని కట్టుబాట్లు, పావు పడితేలు, వారిలోని ప్రేమ ఐక్యతలు, అంతర్గత రాజకీయాలు, అసూయాద్వేషాలు, నేర ప్రవర్తనలు, పడుపు వృత్తి, సెక్స్ వర్కర్లుగా మారిన ట్రాన్స్ జెండర్ ల స్థితిగతులు, కుటుంబాల, ప్రభుత్వాల, సమాజ క్రూరత్వం, ప్రజల సహాయ నిరాకరణ ఈ విధంగా అన్ని సామాజిక సమస్యల మీద తగిన పరిశోధన రచయిత బండి నారాయణస్వామి చేసినట్లుగా పాఠకులకు అర్థమవుతుంది.

వ్యవసాయ కుటుంబానికి చెందిన చంద్రన్న అనే యువకుడు రమణిగా పరిణమించిన అతనికి కాందాన్ లను, గొడవలను, చేలాలను వారి జీవన విధానాల్లో రోజువారి ఆచరణ ఆచార సంప్రదాయాలతో సహా మన ఎరుకలోకి తీసుకువస్తాడు. కిన్నెర లాంటి ఎన్జీవో సంస్థలని కూడా రచయిత సమాజ ప్రగతికి ప్రతీకలుగా చూపాడు. చివరికి చంద్రన్న ట్రాన్స్ జెండర్ గా తన హక్కుల కోసం అతని ప్రత్యేకమైన ఉద్యమాల్లో భాగం అవ్వడాన్ని, తమ స్వేచ్ఛ కోసం, తమ హుందాతనం కోసం తమలాంటి జనం ఉన్న ప్రత్యేక సమూహాల్లో కలవడమే దారి అనే నిర్ధారణకు రావడాన్ని రచయిత చూపుతాడు.

**1. హత్యోదంతాలు:**

'అర్ధ నారి' నవల్లో సామాజిక సమస్యలుగా చెప్పబడే అనేక సంఘటనలు ఉన్నాయి. వాటిలో హత్యా కాండలు కూడా ముఖ్యమైనవి. పిట్ పిట్ బాష అనే రౌడీ హత్య ప్రధానంగా ప్రస్తావించాలి. మణిమాల కంపెనీ రౌడీగా వ్యవహరించే పిట్ పిట్ బాష హత్య చేయబడతాడు. మణిమాల కంపెనీ

వ్యభిచారులను, కాలా కంపెనీ వ్యభిచారులను మార్పిడి చేసుకోవడానికి రాయదుర్గం నుండి తిరుపతికి వెళ్తాడు. కానీ ఆ కంపెనీ సరుకుతో తమ కంపెనీ సరుకును మార్చుకోలేమని వాళ్ళు చెప్పడంతో ఒప్పందం కుదరక వెంట తెచ్చిన 30 వేల రూపాయల క్యాష్ బ్యాగును చంకలో ఇరికించుకొని ముగ్గురు మహిళలతో తిరుగు ప్రయాణం అవుతాడు బాషా. అదే రైలులో ప్రయాణం చేసిన రమణి, చంద్రన్నలపై ఆ నేరం పడుతుంది. కాని పిట్ పిట్ బాషా మర్డర్ కేసులో హంతకురాలు రూప అనే ట్రాన్స్ జెండర్ అని, డబ్బు కోసం అతడిని చంపిందని తెలుసుకుంటారు.

**2. ఎయిడ్స్ వ్యాధిపై చర్చ:**

ఈ నవలలో చర్చించబడిన మరొక సామాజిక సమస్య ఎయిడ్స్ వ్యాధి. దీనిని గురించిన చర్చలు పలు చోట్ల మనకు కనిపిస్తాయి. రామలక్ష్మి చంద్రన్నతో ఇలా అంటుంది **"ప్రేమ వేరు, ప్రాస్టిట్యూషన్ వేరు. కాని దీని నుంచి వచ్చే ఎయిడ్స్ వ్యాధి ఒకటే"[3](అర్ధ నారీ – బండి నారాయణ స్వామి – పుట:195)** అంటూ ఎయిడ్స్ వ్యాధి గురించి అతనికి అవగాహన కలిగిస్తుంది. అంతేగాక జబ్బును దూరంగా ఉంచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కండోమ్ వాడకం గురించి అవగాహన కలిగిస్తుంది. కిన్నెర వాలంటీర్ ఆర్గనైజేషన్ పేరుతో ఎయిడ్స్ పేషెంట్లను పరీక్షిస్తూ ఉంటారు. మీటింగ్ సందర్భంగా వచ్చిన హిజ్రాలను, వేశ్యలను ఉచితంగా పరిశీలించడం, వారికి మంచి సలహాలు, సూచనలు చెప్పడం పాఠకులకు అవగతం అవుతుంది. రచన వంటి అభ్యుదయ భావాలు గల ట్రాన్స్ జెండర్ ఇచ్చిన ప్రసంగాల ద్వారా కూడా అవగాహన కలిగిస్తుంది. కిన్నెర ఆర్గనైజేషన్ ప్రదర్శించిన స్కిట్, రచన ధార్మికావేశం చూసి అక్కడున్న వారంతా ఆశ్చర్య చకితులు అవుతారు.

**3. మానభంగాలు, కిడ్నాపుల సమస్య:**

ఈ 'అర్ధ నారి' నవలలో మానభంగాలు గురించి కూడా ప్రస్తావించాడు. మాన భంగాలు కేవలం స్త్రీల మీదనే కాదు, ట్రాన్స్ జెండర్లకు, మగపిల్లలకు తప్పవని కొన్ని పాత్రల ద్వారా బండి నారాయణస్వామి నిరూపించారు. ట్రాన్స్ జెండర్ చంద్రన్న, సెక్స్ వర్కర్ అయిన రామలక్ష్మి పైన, చిన్న పిల్లవాడుగా ఉన్న పిట్ పిట్ బాషా పైన జరిగిన విధం కనిపిస్తాయి. రమణిని హత్యా నేరం మీద జైల్లో ఉంచినప్పుడు **"సెల్ల్ లోని చీకట్లలో 12 కాగానే సెల్లు చప్పుడు అవుతుంది. ఎవరో ప్రవేశిస్తారు. వద్దు సార్..! అంటుంది రమణి. ఒకరా.. ఇద్దరా.. ముగ్గురు. రమణి శరీరం నిండా మొగ స్పర్శల కంపు. ప్రొద్దున్నే టాయిలెట్ కు పోతే దొడ్డికి నిండా వీర్యపు చారలు."[4](అర్ధ నారీ – బండి నారాయణ స్వామి – పుట: 202)** అలాగే ఈ నవలలో ఇంకో సన్నివేశంలో "రామలక్ష్మీ వెంకటమ్మ టాకీస్ దగ్గర బేరాల కోసం చూస్తూ ఉంది. **"వస్తావా..! ఎవరో కొత్త వ్యక్తి తాను ఎప్పుడు చూసినట్లు లేదు. థియేటర్లోకి అడుగు పెట్టింది. ఆమె తేరుకునే లోపు నోరు మూసి బాల్కనీలోకి లాక్కున్నారు. గబ గబా నోట్లో గుడ్డలు కుక్కినారు. కళ్ళకు గంతలు కట్టినారు. ఒక టికెట్టో ఐదు మంది చూసే సినిమా.**

**ఐదు మంది తొక్కిసలాటల క్రింద పచ్చి పుండుగా మారిపోయిన ఆమె దేహం దాహం..దాహం.. ప్రాణాలు పోతున్నాయి"[5] (అర్ధ నారీ – బండి నారాయణ స్వామి – పుట: 164)** అంటూ తన పిల్లల గురించి కలవరించింది. రామలక్ష్మి చిన్న కూతురు అమ్ములిని గుర్తు తెలియని ఒక వ్యక్తి అపహరించుకొని వెళతారు. ఆ సమయంలో తల్లిగా రామలక్ష్మి మనోవేదన వర్ణనాతీతం. సమాజ సమస్యగా మారిన వ్యభిచారులను సైతం వదలని రౌడీ మూకల ఆగడాలను ఈ నవల ద్వారా పాఠకుల దృష్టికి తెచ్చారని చెప్పవచ్చు.

**ముగింపు:** రచయిత బండి నారాయణ స్వామి నవలలన్ని సామాజిక ఎదురీత కలిగినవే. సామాజిక చైతన్యాన్ని ప్రబోధించేవి. సామాజికంగా దయనీయ స్థితిని అనుభవిస్తున్న నపుంసకుల, వేశ్యల జీవితాలను కళ్ళకు కట్టినట్లుగా చూపించడమే కాక, వారిలో చైతన్యాన్ని కలిగిస్తూ, పాఠకుల మనసులను ఆలోచించే దిశగా పయనింపజేయడంలో రచయితది అందె వేసిన చేయి అనడంలో సందేహం లేదు. ఈ విధంగా రచయిత రాసిన ప్రతి నవలా సంఘంలోని దురాచారాలు వాటి నిర్మూలన సమాజంలో అనేక రకాల దురలవాట్లు, మూఢనమ్మకాలు, వాటి నివారణ మార్గాలను చూపుతూ సాంఘిక నవలగా నిలిచిపోతాయాయనడంలో వాస్తవం ఉందని చెప్పడం ఎంతైనా ముదావహం.

**ఆధార గ్రంథాలు:**


1. అర్ధ నారీ – బండి నారాయణ స్వామి, ప్రచురణ: 2021, తానా వారి ప్రచురణ
2. ఆంధ్ర జ్యోతి పత్రిక, తేదీ: 26-09-2022
3. తెలుగు నవల నాడు - నేడు – డా. బి. ఆర్. బి. కుటుంబరావు, ప్రచురణ:1997, మారుతి ప్రచురణలు, విశాఖ పట్నం
4. తెలుగు సాహిత్య చరిత్ర – ముదిగంటి సుజాత రెడ్డి – ప్రచురణ:1985, అంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్
5. తెలుగులో కవిత విప్లవాల స్వరూపం – వేల్చేరు నారాయణరావు – ప్రచురణ: 1987, హైదరాబాద్ బుక్స్ ట్రస్ట్
6. భూమిక స్త్రీ వాద పత్రిక – తేదీ:4-12-2025

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# ఆధునిక పద్య కావ్యాలు – కర్షక చైతన్యం

డా. నల్లపనేని విజయలక్ష్మి
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) ,గుంటూరు,
సెల్: 9701667350

**ఉపోద్ఘాతం:**

మన దేశం వ్యవసాయ ప్రధాన దేశం. మెజారిటీ ప్రజలు వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవితాలు గడుపుతున్నారు. ప్రాచీనకాలంలో ఎంతో గౌరవంగా జీవించిన రైతులు 17వ శతాబ్దం నుండి ఎన్నో ఇక్కట్లకు గురయ్యారు. బ్రిటీషు వారి విధానాల వల్ల, జమీందారుల దుర్నీతి వల్ల, అధిక పన్నుల వల్ల అణగారిపోయిన రైతులలో 20 వ శతాబ్దంలో చైతన్యం మొదలైంది. ఈ చైతన్యం ఆనాటి కవుల రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రైతు కుటుంబాల నుండి కూడా విద్యావంతులు, కవులు రావటంతో రైతు స్ఫూర్తితో, రైతుల కష్టాల పట్ల సహానుభూతితో కవిత్వం రాశారు. ఆధునిక కవిత్వంలో వచన కవిత్వం విరాడ్రూపం ధరించక ముందు కవుల కర్షక చైతన్యం పద్య రూపంలోనే వెల్లడయింది.

''అధికార భూతంబు లడుగు లంచము లిచ్చి
పరిపరి విధముల పన్ను లిచ్చి
మునసబు కరణాల ముడుపులన్నియు నిచ్చి
కోసి నూర్చిన వరి కూలి నిచ్చి
కచ్చేరి బంట్రోతు గముల కీనామిచ్చి
పాలేళ్ళకును కొంత పంట నిచ్చి
యజమానులకు పంట నర్ధభాగం బిచ్చి
పైకమిచ్చిన వాని వడ్డి నిచ్చి
గడ్డి మాత్రమే మిగిలించు కాపువాడు
సేద్యమున తాను పసుల రక్షించు కొరకు
కటకటా! యెట్టులున్నదో కాపుల దశ
సుగుణ ధనులార! జనులార! చూడరయ్య!'' (కాపుల దశ)

అంటూ చిలకమర్తి లక్ష్మీనరసింహం రచించిన పద్యం 1895 లోనే కాపుల దుర్దశను వెల్లడించింది. తాను కాపు కాకపోయినా లంచాలు, పన్నులు, ముడుపులు, కూళ్ళు, కౌళ్ళు, వడ్డీలు అన్నీ తీరిన తరువాత గడ్డిని మాత్రమే మిగుల్చుకోగలిగే కాపుల దుస్థితిని వాస్తవికంగా వర్ణించాడు చిలకమర్తి. నవీన కర్షక కవిత్వానికి ఆది పద్యంగా దీనిని చెప్పుకోవచ్చు. ఆ తరువాత నిర్దిష్టంగా రైతు జీవితాన్ని చిత్రించిన తొలి రచన 'కృషీవలుడు'. పిమ్మట అనేకమంది కవులు కర్షక చైతన్యంతో కావ్యాలు రాశారు.

కృషీవలుడు:-

తెలుగు సాహిత్యంలో కర్షక జీవితాన్ని చిత్రించిన మొదటి లఘుకావ్యం 'కృషీవలుడు'. 1919లో ఈ కావ్యాన్ని ప్రచురించి కర్షక వాఙ్మయ వికాసానికి మార్గదర్శిగా నిలిచాడు దువ్వూరి రామిరెడ్డి. దువ్వూరి రామిరెడ్డి స్వయంగా కర్షకుడు కావటం వల్ల కర్షకుని జీవితాన్ని యథాతథంగా, స్వభావోక్తి రమ్యంగా చిత్రించాడు.

సైరికా, నీవు భారతక్ష్మాతలాత్మ
గౌరవ పవిత్ర మూర్తివి! శూరమణివి!
ధారుణీ పతిపాలన దండ మెపుడు
నీ హలంబు కన్నను బ్రార్థనీయమగునె?

అధికారాన్ని చలాయించే రాజదండం కంటే అందరికీ అన్నం పెట్టే నాగలి గొప్పదని, కర్షకుడు గౌరవ పవిత్ర మూర్తి అని విస్పష్టంగా ప్రకటించాడు.

''మున్నూటరువది దినముల
నెన్నండును గన నశక్య మేపనియును లే
కున్న నిమేషము కాపుం
గన్నియ నీ కాటవిడుపుకాలము లేదే!''

రైతు కష్టాన్ని పరులు అనుభవిస్తున్నారని, దేశ సౌభాగ్యానికి కారణమైన అతడు మాత్రం తిండికి, గుడ్డకు నోచుకోవడం లేదని బాధపడ్డాడు.

''కావున, గృషీవలా, నీవె కారణమవు
సాంఘికోత్కృష్ట సౌభాగ్య సౌఖ్యములకు
ఫల మనుభవించువారలు పరులు; నీకుఁ
గట్టఁ గుడువను గఱవె యెక్కాలమందు!''

**క్షామదేవత:**

తన కాలంనాటి ఆంధ్ర సమాజ స్థితిని వర్ణించిన కవి ఉమర్ ఆలీ షా (1885-1945). ఆయన చాలాకాలం వైస్రాయి కౌన్సిల్లో సభ్యునిగా ఉన్నాడు. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం కావాలని పోరాడిన బయ్యా నరసింహేశ్వర శర్మను సమర్థిస్తూ వాదించిన నిర్భయుడు. ఆయన 1919లో రచించిన 'క్షామదేవత' నాటి సమాజ స్థితిని, రైతుల పరిస్థితిని వివరిస్తుంది.

''ఆరంభమయ్యె మాకార్బుతునాటి ది
వాలాకె నిఱుపేద వాలకంబు
మఱుసటి యెడె బీమాకంపెనీలు మా
యిల్లు వాకిలిని నట్టేటఁ గలిపె
యుద్ధంబు పేర్చెప్పి యున్న మట్టున కుత్త
మర్థు లార్పిరి మచ్చ మాపినట్లు
వర్షాలులేక మా వరిచేలు పండక
సిస్తులకై యున్న యాస్తి పోయె...''

నేరుగా ప్రభుత్వాన్ని నిందించకుండా క్షామదేవతపై నెపం పెట్టి దేశస్థితిని కవి వివరించాడు. ఇందులో అర్బత్ నాట్ (కంపెనీ) దివాలా విషయం ప్రస్తావనకు వచ్చింది. 1846 ప్రాంతాల్లోనే పాలకొల్లు ప్రాంతంలో ఈ కంపెనీ పత్తి, చెరకు పంటలకు మదుపు పెట్టింది. ఇతర సర్కారు ప్రాంతాల్లో నీలిమందు వగైరా వాణిజ్యపంటలను కూడా ప్రోత్సహించింది. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన ఆ కంపెనీ వారు చేసిన వ్యాపారాలు దివాలా తీయటంతో లక్షలమంది మధ్య తరగతి ప్రజలు నష్టపోయారు. దానికే అర్బత్ నాట్ క్షౌరమనే పేరు వచ్చింది. ఈ దివాలా వ్యవహారం ఒక్కో ప్రాంతంలో ఒక్కొక్కసారి జరిగింది. ఇక్కడ అర్బత్ నాట్ కంపెనీ దివాలా తీసిన మరుసటేడే బీమా కంపెనీలు కూడా దివాలా తీశాయని, రైతులు ఇళ్ళూవాకిళ్ళూ కోల్పోయారని కవి వర్ణించాడు. మొదటి ప్రపంచ యుద్ధం 1914-1918 మధ్య కాలంలో జరిగింది. ఆ యుద్ధంలో పాల్గొన్న బ్రిటీషు సైనికుల అవసరాలు తీర్చడానికి ఇక్కడినుంచి ధనధాన్యాలను తరలించారు. వర్షాలు లేక పంటలు పండకపోయినా రైతులకు శిస్తులు తప్పలేదు. 1919 నాటి రైతుల, ప్రజల పరిస్థితిని రికార్డు చేసిన పద్యమిది.

**కర్షకా:-**

1932-1933 లో కొండవీటి వేంకటకవి ''కర్షకా'' అనే మకుటంతో కర్షకుని వేదనామయ జీవితాన్ని 49 పద్యాల్లో రాశాడు.

కౌలుకు భూమి సాగు చేసి ఆ కౌలు తీర్చలేక రైతు పడే కష్టాలను కవి వర్ణించాడు. పాలకులు పన్నులు, అధికారులు లంచాలు, షాహుకార్లు వడ్డీలు వసూలు చేసుకుంటారు కాని రైతును గౌరవంగా చూడరని కవి బాధపడ్డాడు.

రైతు కష్టం మీదనే సమాజం నడుస్తున్నది. తన కష్ట ఫలాన్ని గట్టిగా అడిగి తన భాగపు సంపదను రైతు పొందాలని కవి కోరుకున్నాడు.

''ఇలగలసర్వవస్తువుల నేలెడిరాజవు నీవుగాక నీ
కిల నౌకరుండు సాటియగు నే దలపం దగ రైతురాజ నీ
బలముజలంబుఁ జూప ధనవంతులు భాగమదిత్తురోయి నీ
వలజడిఁబొందనేల దగ వాదగు భాగముఁబొంద కర్షకా'' (కర్షకా-1)

**కాపుబిడ్డ:-**

గంగుల శాయిరెడ్డి గారి 'కాపుబిడ్డ' లఘుకావ్యం రైతు జీవితంలోని అనేక పార్శ్వాలను స్పృశించింది. 1937లో ప్రథమ ముద్రణ పొందిన వ్యవసాయ పద్య కావ్యం కాపు బిడ్డ.

మూడు ఋతువుల్లోనూ రైతు, అతడి భార్య అవిశ్రాంతంగా ఎలా శ్రమిస్తారో కవి విపులంగా వర్ణించాడు. ఇంత కష్టపడి రైతు పంట పండిస్తే ఎవరెవరు ఎలా పీడించి రైతు నుండి ధాన్యాన్ని తీసుకుని వెళతారో కవి వర్ణించాడు.

గ్రామాధికారులు భీమస్వరూపులై
  పెక్కుటక్కులవెతల్ బెట్టుచుండ
వ్యాపారవర్గంబు లా పూర్తిధూర్తులై
  లాభంబు పూర్తిగా లాగుచుండ
పనివారలందఱు బాహుబలాఢ్యులై
  బిచ్చంబులిడుడని బెనగుచుండ
పాలకోద్యోగులు పట్టాభిషిక్తులై
  చిప్పముంతలపాలు సేయుచుండ
తెలివితేగడలేకను దేబెపగిది
బారిగొరియవై నిలుచుండ పాడి యగునె
యెల్లపనులనుగనివిని యెఱుకమరవ
సైరికా నీకునింకేరు శరణుజెపుమి? (కాపుబిడ్డ-108)

పని వాళ్ళందరూ (వాకిలి ఊడ్చేవారు, తొండం సరి చేసేవారు, చెప్పులు కుట్టేవారు, నాగళ్ళు, మోటలు చేసేవారు, బట్టలుతికేవారు, క్షురకర్మ చేసేవారు) కళ్ళంలో తమకు రావాల్సిన బిక్షం పెట్టవలసిందేనని

కొట్లాడుతారు. పరిపాలనా రంగంలోని ఉద్యోగులు, షేరుదారు, తహసిల్దారు, కానిస్టేబులు, హెడ్ కానిస్టేబుల్, అమీనుసాహెబు మొదలైన వారు కుర్చీల మీద కూర్చొని పట్టాభిషిక్తులైన వారి వలె రైతును పీడించి కోడి, మేక, గొఱ్ఱె, ధాన్యం, కూరగాయలు, నెయ్యి, డబ్బులు ఇలా ఎన్నో లాగి రైతును బికారిని చేస్తారు. వీటినన్నిటిని ఎదుర్కొనే తెలివి, అభివృద్ధి చెందే అవకాశం రైతుకు లేవు.

గంగుల శాయిరెడ్డి 'కర్షకా' అనే శీర్షికతో ఖండకావ్యం కూడా రచించాడు. ఇందులో రైతులను ఉద్బోధించటంతో పాటు నిజాం పరిపాలనలో హైందవులైన తెలుగువారు సైతం తమ వారి సమస్యలను పట్టించుకోకపోవటం గురించి దుఃఖాన్ని వ్యక్తం చేశాడు.

''నీ జాతి వారలు రాజులై యుండియు
గనజాలరైరి నీ కష్టమెల్ల
నీ కొలమందు జన్మించిన యా జమీం
దారులు గనరు నీ తాపమెల్ల
నీ శాఖలో ధననిలయులౌ కొందరు
పరికింపలేరు నీ బాధలెల్ల
నీ తెగలో విద్య నేర్చిన బియ్యేలు
లిఖియించరైరి నీ లేములెల్ల
న్యాయవాదులు నీ వార లడుగరైరి
న్యాయమూర్తులు నీ వార లరయరైరి
ఇంకఁ బెరవారి ముచ్చట లెందుకయ్య
కర్షకా! నీదు కష్టముల్ గాంతురెవరు?''

**రైతు కన్నీరు:-**

ఇనగంటి పున్నయ్యచౌదరి 1948లో రచించిన 'రైతు కన్నీరు' లో రైతు జీవితాన్ని, రైతుల కష్టాలను వర్ణించాడు.

'ఏనాడు నీ గొర్రు రాణించి విత్తనాల్
జల్లదో ఆనాడె చెల్లు జగము
ఏనాడు నీ దుక్కిటెద్దు పొలము బోయి
దున్నదో ఆనాడె సున్న జగము''

అంటూ కవి రైతు ప్రాధాన్యాన్ని వివరించాడు. 'నీవు లేకున్న రాజ్యాలె నిలువ వన్న' అని రైతు గొప్పతనాన్ని తెలిపాడు. అటువంటి రైతుకు ఏ విధమైన ప్రోత్సాహకాలు సమాజం నుండి లేకపోవటాన్ని ప్రస్తావించాడు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

''నెల జీతములు లేవు అలవెన్సులును లేవు
కరువు బత్తెము లేదు బిరుదు లేదు
ఇంక్రిమెంటులు లేవు ఇతర గ్రాంటులు లేవు
ఎలమి పెన్షను లేదు సెలవు లేదు
అంచె బిల్లులు లేవు బెంచి బల్లలు లేవు
ట్రావిలింగును లేదు డ్రస్సు లేదు
డిన్నరులును లేవు మన్ననలును లేవు
శాల్యూటు లేదు ఏ వాల్యు లేదు
రెక్కలను ముక్కలొనరించి రేయి బవలు
పొలము బెకలించి చెమట చుక్కలను రాల్చి
ఖర్చులకు బంటలను గట్టి కడుపునిండ
తిండి జాలక కృశియించుచుండె రైతు''

**రైతు ఋణ విముక్తి:-**

రాళ్ళబండి రాఘవశర్మ 1951లో 'రైతు ఋణ విముక్తి' పద్య కావ్యాన్ని రచించాడు. రాఘవశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి అయినప్పటికీ తన స్వగ్రామమైన క్షీరసాగరంలో సామాన్య రైతు జీవితం గడిపినవాడు. సామాన్య రైతుల జీవన విధానం, వారి ఋణ బాధలు, వారి ఆత్మాభిమానం తెలిసినవాడు. కనుక ఆయన 'రైతు ఋణ విముక్తి' పద్య కావ్యంలో ఎంతో వాస్తవికమైన రైతు జీవిత చిత్రణ చేశాడు.

''అరయంగ ''కృషితోనాస్తి దుర్భిక్ష'' మన్
పెద్దలు వాకొన్న విహితవృత్తి,
''హాలికులైన నే'' మని పోతనామాత్యుఁ
డెన్నుకొన్నట్టి యహీనవృత్తి...'' (రైతు ఋణ విముక్తి – 13)

అంటూ వ్యవసాయం గొప్పదనాన్ని కవి వర్ణించాడు.

సర్వజనులు నీయాధారసరణి వివిధ
భోగభాగ్యాదులం దులదూగుచుండ,
రయిత! నీజాతి కిట్టి ప్రారబ్ధమేమొ?
నీవు నీయంతవాఁడవై పోవవలసె.'' (రైతు ఋణ విముక్తి – 14)

నాలుగు వర్ణాల వారు రైతుపై ఆధారపడి జీవిస్తున్నారు. రైతు మీద ఆధారపడినవారు భోగభాగ్యాలతో తులతూగుతుంటే రైతు మాత్రం దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాడు. రైతుజాతిని ఏ ప్రారబ్ధమో పట్టి పీడిస్తున్నదని కవి బాధపడ్డాడు.

**క్షేత్రలక్ష్మి:-**

ఏటుకూరి వెంకట నరసయ్య గారి 'క్షేత్రలక్ష్మి' (1955) లో కర్షక జీవితం చిత్రించబడింది. మెట్ట ప్రాంతం రైతుల స్థితికి, మాగాణి ప్రాంతం రైతుల స్థితికి గల భేదాన్ని కవి వర్ణించాడు.

వానలు లేని నాడు వలస వెళ్ళవలసిన తమ పరిస్థితిని తలచుకొని మెట్ట ప్రాంతం వారు మాగాణి భూస్వాములు అదృష్టవంతులని భావిస్తారు.

''ఈతిబాధకతన సాతానిబిచ్చమే
మరల దొక్కొకేఁడు మాపొలాన
వాఁడు కన్నుదెఱచి వర్షించెనా కద్దు
తక్కనేని వలస తప్పదన్న!'' (క్షేత్రలక్ష్మి-5-29)

అయితే మాగాణి రైతుల స్థితిగతులు కూడా అంత గొప్పగా లేవని, వారి సమస్యలు వారి కున్నాయని కవి వివరించాడు. డెల్టాలో పంటలు బాగానే పండుతాయి. కానీ ''సేద్య మొరుల పాలు జీవమ్ము మఱపాలు'' అన్నట్టుగా వారి పరిస్థితి ఉందని కవి వర్ణించాడు.

''నీటిపంటగాన నిస్సారమెక్కుడు
ఒరుపుగింజకున్న కఱకు లేదు
మంటలొలుకఁబోయు మఱధాన్య మాశించి
ఉడుకుఁదిత్తులయ్యె నొడలులెల్ల'' (క్షేత్రలక్ష్మి-5-39)

దంపుడుబియ్యం స్థానంలో మరబియ్యం వాడుకలోకి వచ్చిన తరువాత శ్రమశక్తి తగ్గింది, అనారోగ్యం పెరిగింది. కౌలుదారీ వ్యవస్థ అమలులోకి రాగానే రైతులు స్వంత వ్యవసాయం మానుకొని, చదువుల వ్యామోహంలో పడుతున్నారు. పది రూకలు దాచుకోగలిగినవారు బడాయికి డబ్బు తగలబెడుతున్నారు. ఫలితంగా గౌరవప్రదమైన రైతు జీవితం అప్రతిష్ట పాలయిపోతున్నదని కవి బాధను వ్యక్తం చేశాడు.

**'పఱిగపంట', 'పైరపంట', 'శబల':-**

తుమ్మల సీతారామమూర్తి గారి 'పఱిగపంట' లోని 'కర్షకుడు', 'క్షేత్రజీవి' ఖండకావ్యాలు, 'పైరపంట' లోని 'జడికారు', 'వరినాటు' ఖండకావ్యాలు, 'శబల' లోని 'రైతుమొఱ' ఖండకావ్యం కర్షకుని జీవితాన్ని వర్ణించాయి.

''కోటి విద్యలు కొండ్రసాటి యగునె'' అంటూనే ఆరుగాలం కష్టపడి, అపాయాల కోర్చి పండించిన పంటను ఇతరులు అప్పనంగా దోచుకుంటుంటే రైతులకు కన్నీరు మాత్రమే మిగలటాన్ని కవి వర్ణించాడు. రాతిగుండె షాహుకార్లు వడ్డీలు, చక్రవడ్డీలతో రైతుల రక్తాన్ని పీలుస్తారు. తక్కువ ధరకు పంటను సొంతం చేసుకుంటారు. అధికారులు లంచాలు ఆశించి రైతును వేధిస్తారు. పాలకులు దయ లేకుండా పన్నులు విధిస్తారు. ఇన్ని విధాలుగా రైతు సొమ్ము తింటూ రైతును గడ్డిపోచలా చూస్తున్నారు అని కవి బాధ పడ్డాడు.

ఐకమత్యంతో ఉండటం వల్ల కలిగే ప్రయోజనాన్ని గ్రహించి రైతుకూటములు ఏర్పరచుకోవాలని కవి సూచించాడు. దీనత్వాన్ని విడనాడాలని, ఇబ్బందులను దొరలకు వినిపించాలని, నేతలు రైతుల మేలు కోరి ఇచ్చే సలహాలను పాటించాలని చెప్పాడు. పొరుగు దేశాలలోని కాపులను గమనించి కర్తవ్యాన్ని నిర్ణయించుకోవాలని సూచించాడు. కష్టాలు కలకాలం ఉండబోవని ధైర్యం చెప్పాడు.

సంఘశక్తి నెఱింగి జనపదంబుల నెల్ల
　　రైతుకూటంబు లేర్పఱుపవయ్య
నీ గౌరవము నెంచి నీ చేవఁ బాటించి
　　తలయెత్తి దీనతన్ దలఁగవయ్య
వెఱపు దవ్వుగ జోపి దొరలపజ్జకుఁ జేరి
నీగోడు నెల్ల విన్పింప వయ్య
　　నీ మేలు గోరి నీ నేత లిచ్చు దురాయి (ఆజ్ఞ)
　　　　పూదండవలెఁ దలం బూనవయ్య
　　సాటిదేశాల కాఁపులజాడ లరసి
　　నేఁడు నీకర్జ మేదియోచూడవయ్య
　　ఉమ్మలిక లెల్లకాలంబు నుండఁ బోవు
　　చింతపడకయ్య ''భారత క్షేత్రజీవి'' (కర్షకుడు - పఱిగపంట)

**రాయలసీమ రైతు:-**

బైరపురెడ్డి నారాయణరెడ్డి 1976లో 'రాయలసీమ రైతు' పద్యకావ్యం రచించాడు. కవి కృషీవల ఖండము, మిత్రసమాలోచన ఖండము, మేఘోత్కలిత ఖండము, వర్షారంభ ఖండము, ఫలప్రాప్తి ఖండము అని ఐదు ఖండాలుగా కావ్యాన్ని రచించాడు.

రైతు ఎంత కష్టపడి, ఎంత పట్టుదలతో వ్యవసాయం చేస్తాడో, సర్వమూ సస్యమే అని భావించి ఎలా ఆనందంగా, నిశ్చింతగా జీవిస్తాడో కవి వర్ణించాడు. రాయల కాలంలో చెరువులు, బావులు, కుంటలు తవ్వించి జలరక్ష చేయటం వల్ల సుభిక్షంగా ఉన్న రాయలసీమ తరువాతికాలంలో కరువు కాటకాల బారిన పడిన తీరును కవి వర్ణించాడు. పదే పదే రాయలసీమ కరువు బారిన పడటం వెనక గల కారణాలను గుర్తించవలసిన అవసరాన్ని గుర్తు చేశాడు.

''కాలము మాయయో! కరుడు గట్టిన మర్త్యుల కర్మ తంత్రమో!
గాలుల వాటమో! ప్రకృతి గాంచిన దేశపు భాగ్యదోషమో!
చాలని కాలమో! కనలిసాగిన దుష్పరిణామ పుంజమో!
పాలన సేయువారల కృపా పరిపాకపు మర్మధర్మమో!'' (రాయలసీమ రైతు- కృషీవల ఖండము-34)

1952లో వచ్చిన కరువు వల్ల పంటలు నాశనమై రైతులు కూలిపనిని వెతుక్కుంటూ వలస వెళ్ళిన విధాన్ని ఆయన వర్ణించాడు.

''ప్రాణ రక్షణమునకునై పాటు వడుచు
నిల్లు నిల్లాలి బిడ్డల నెలమి విడిచి
పనులు గల చోట బ్రతుకంగ జనిరి భీతి
చాలి చాలని కర్షకుల్ కూలిపనికి'' (రాయలసీమ రైతు- మిత్రసమాలోచన ఖండము-44)

**రైతు రామాయణం:-**

దువ్వూరి రామిరెడ్డి 'కృషీవలుడు', గంగుల సాయిరెడ్డి 'కాపుబిడ్డ' తరువాత రైతు చరిత్రను మహాకావ్యంగా రాసినవారు వానమామలై జగన్నాధాచార్యులు. వారి కావ్యం 'రైతు రామాయణం'. వారు 1980లో 'రైతు రామాయణం' రచించారు. ఆయన గ్రామంలో నివసించి హాలిక జీవనం సాగించినవాడు. కర్షకుల కష్ట నిష్ఠురాలను, స్థితిగతులను ఎరిగినవాడు. నిజాం నిరంకుశ పాలనలో, భూస్వాముల దౌర్జన్యాలలో చితికిపోయిన రైతుల జీవితాలను గమనించి బాధ పడి, వారి సముద్ధరణను, రామరాజ్యాన్ని కోరుకుంటూ 'రైతు రామాయణం' రాశాడు. రైతును కథానాయకుడుగా చేసికొని, రామాయణ కథా చాయలతో, సామాజిక స్థితిగతులకు అద్దం పడుతూ ఈ కావ్యాన్ని రాశాడు. కవి

రామాయణంలో వలె రైతు రామాయణాన్ని కాండలుగా విభజించాడు. అవి శిశు, శిక్షణ, కళ్యాణ, కృషి, నిర్బంధ, విజయ కాండలు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల రాక్షస చర్యలు, దళారీల దోపిడీ తదితరాలను సందర్భోచితంగా కావ్యంలో నిందించాడు. ఆయన రైతును గిరీశునితో పోల్చాడు.

''రైతనిన నెవ్వరో కాదు రాత్రి పవలు
నందులను నంటి పెట్టుక నడిచవుళ్ళ
తిష్ఠ వేసుక నిలిచి సుదీర్ఘ తీవ్ర
కృషి తపస్సొనరించెడి గిరిశు డతడు

కాపు జనుల పాలి బంగారు గట్టు
కదుపు మొత్తాలు, పురికట్టు, కాటకాలు
కరువు లరికట్టు, పెరటి కల్పకపు చెట్టు
పట్టణముల యాయువుపట్టు, పల్లెపట్టు
అదియె లేక నగర జీవి యాటకట్టు''

**రైతు భారతం:** నరాల చినచెన్నారెడ్డి 2003లో ''రైతు భారతం'' పద్యకావ్యం రచించాడు. కవి న్యాయవిద్య (లా) చదివినప్పటికీ కర్షక వృత్తిని స్వీకరించినవాడు. ఏడు అధ్యాయాలుగా రచింపబడిన సందేశాత్మక కావ్యం ''రైతు భారతం''.

రైతు గొప్పతనాన్ని వర్ణించి, రైతు కష్టం దేశాభివృద్ధికి మూలమని, రైతే రాజని స్పష్టం చేసిన కవి రైతుల ఇబ్బందులను వివరించాడు.

ప్రకృతి, ప్రభుత్వాలు, నకిలీ పురుగుమందులు, మొలకెత్తని విత్తనాలు కలసి రైతును ముప్పుతిప్పలు పెడుతున్నాయి. దళారులు, వడ్డీ వ్యాపారులు రైతుల నడ్డి విరగకొడుతున్నారు. రైతుల మధ్య ఐకమత్యం లేకపోవటం, సంఘబలం లేకపోవటంతో రైతుల వేదనను పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఈ విషయాలను వివరించిన కవి ప్రభుత్వాలు చేపడుతున్న పథకాలు రైతులకు ఉపయోగకరంగా లేకపోవటాన్ని ప్రస్తావించాడు.

''భూసంస్కరణములభూత కల్పనలయ్యె
పట్టాల నివ్వంగ బలుకరాయె
పంటల భీమాలు తంటాల సడియాయె
క్యాషుక్రెడిట్టులు శోషలాయె
ధరల మద్దత్తు లధరముల యందుండె

మార్కెటు యార్డులు మాయలాయె
సబ్సిడీ పథకాలు చప్పట్ల సరిపోయె
ఎరువులు కఱవులై మరుగు పడియె
వట్టి సూత్రాల వల్లించి గట్టిగాను
పథకముల వేసి రైతుల ప్రగతి యనిరి
ఎన్నియున్నను ఫలమేమి యన్న మాకు
దాని లాభంబు మాకేమి గానరాదు.'' (రైతు భారతం-విషాదము-52)

కర్షకులు ఐకమత్యంతో ఉండవలసిన అవసరాన్ని కవి నొక్కి చెప్పాడు.

''కర్షకు లొకటై చేయిజేయి కలుపు కొనగ
రైతు హక్కుల పోరాట రణమునందు
దిగ్విజయములే కలుగును దేశమందు
రైతు రాజ్యంబునకు, నిదె రాచబాట.'' (రైతు భారతం-ఉపదేశము-19)

కవి స్వయంగా రైతు కనుక భూసారాన్ని ఎలా కాపాడుకోవాలో, సస్యరక్షణ ఎలా చేసుకోవాలో, మంచి విత్తనాలను ఎలా ఎంచుకోవాలో, చిట్టెలుకల బారి నుండి పంటను ఎలా రక్షించుకోవాలో, ఏ ఏ కార్తెలలో వ్యవసాయానికి సంబంధించిన ఏ ఏ పనులు చేసుకోవాలో ''ప్రబోధము'' అధ్యాయంలో వివరంగా చెప్పాడు. రైతు నష్టపోకుండా ఉండాలంటే పైరు పంటకు తోడుగా పండ్లతోటలు పెంచుకోవాలని, పెట్టుబడి ఎక్కువగా అవసరం లేని చెట్లను నాటటం వల్ల ఆదాయం సమకూరుతుందని సూచించాడు.

రైతుల కష్టాల గురించి సమగ్రమైన అవగాహన కలిగి ఉండటం చేత కవి రైతుల బాగు కోరి అనేక సూచనలు చేయటం గమనించవచ్చు.

**ముగింపు:** ఆరుగాలం శ్రమించి లోకానికి అన్నం పెట్టే రైతుల గొప్పదనాన్ని, కరువు కాటకాల వల్ల, అధిక శిస్తుల వల్ల వారు ఇబ్బందులు పడుతున్న తీరును, అమాయకంగా అధికార వర్గం దోపిడీకి గురవుతున్న తీరును ఆధునిక పద్య కవులు వర్ణించారు. ప్రభుత్వాలు చేపడుతున్న పథకాలు రైతులకు ఉపయోగకరంగా లేకపోవటాన్ని వారు ప్రస్తావించారు. రైతుల మధ్య ఐకమత్యం లేకపోవటం, సంఘబలం లేకపోవటంతో రైతుల వేదనను పట్టించుకునేవారు లేకుండా పోయారని ఆవేదనను వ్యక్తం చేశారు. సమాజం రైతులను గౌరవించి, వారికి అండగా నిలవాలనే ఆకాంక్షను వారు వ్యక్తం చేశారు.

**ఆధార గ్రంథాలు:**

1. దువ్వూరి రామిరెడ్డి, 1949, కవికోకిల గ్రంథావళి, కవికోకిల గ్రంథమాల, నెల్లూరు

2. కొండవీటి వేంకటకవి, 2019, కవిరాజు కొండవీటి వేంకటకవి కావ్య సంపుటి, కవిరాజ గ్రంథమాల, హైదరాబాదు
3. వేంకటనరసయ్య ఏటుకూరి, 2007, కవిబ్రహ్మ ఏటుకూరి వేంకటనరసయ్య సాహిత్యము ద్వితీయ సంపుటి, తుమ్మల కళాపీఠం, గుంటూరు.
4. సీతారామమూర్తి తుమ్మల, 2001, తెనుగులెంక తుమ్మల సమగ్ర సాహిత్యము-3, తుమ్మల శతజయంతి ఉత్సవ సంఘము, గుంటూరు.
5. సీతారామమూర్తి తుమ్మల, 2001, తెనుగులెంక తుమ్మల సమగ్ర సాహిత్యము-4, తుమ్మల శతజయంతి ఉత్సవ సంఘము, గుంటూరు.
6. సీతారామమూర్తి తుమ్మల, 1990, రైతు జీవనము, నవోదయ పబ్లిషర్స్, గుంటూరు.
7. రెడ్డి నారాయణరెడ్డి బైరపురెడ్డి, 1976, రాయలసీమ రైతు, బి.ఆర్.నారాయణరెడ్డి, కడప.
8. జగన్నాధాచార్యులు వానమామలై, 1980, రైతు రామాయణం, సౌభాగ్య ప్రింటింగ్ ప్రెస్, కరీంనగర్.
9. చినచెన్నారెడ్డి నరాల, 2003, రైతు భారతం, కృషీవల ప్రచురణలు,మొహిదీన్ పురం, ప్రకాశం జిల్లా.
10. రాధాకృష్ణ బూదరాజు, 2005, పద్యసాహిత్యం: సంఘు చరిత్ర (1900-1950), ప్రాచీ పబ్లికేషన్స్, హైదరాబాద్.

# ఎమ్వీ రామిరెడ్డి 'రైతు కథలు' – సామాజిక స్పృహ

**షేక్ జరీనా,**
పరిశోధక విద్యార్థిని,
తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం,
చరవాణి: 9985203530,
ఈ మెయిల్: jareenashaikpng@gmail.com

**1.0 ఎమ్వీ రామిరెడ్డి పరిచయం:** ఎమ్వీ రామిరెడ్డిగా ప్రసిద్ధులైన ముప్పా వెంకటరామిరెడ్డి 1970వ సంవత్సరం ఫిబ్రవరి 7వ తారీఖున గుంటూరుజిల్లా, తుళ్ళూరు మండలం, పెదపరిమి గ్రామంలో ఒక రైతు కుటుంబంలో జన్మించారు. కవిగా, కథకులుగా, సమీక్షకులుగా, విమర్శకులుగా తెలుగురాష్ట్రాల్లో సుప్రసిద్ధులు. విభిన్నమైన కథాంశాలతో, పటిష్టమైన కథా సంవిధానంతో తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని ఏర్పర్చుకున్న ఉత్తమ కథకులు. ఒకపక్క సాహిత్యాన్ని, మరోపక్క సేవాకార్యక్రమాల్ని నిర్వహిస్తున్న సంఘసేవకులు.

**1.1. ఎమ్వీ రామిరెడ్డి – రచనలు:** రెండున్నర దశాబ్దాల నుంచి సాహిత్యరంగాన్ని కవితలు, కథలు, నవలలతో సుసంపన్నం చేసిన ఎమ్వీ రామిరెడ్డి సామాజిక స్పృహతో రచనలు చేస్తున్న రచయిత. తన చుట్టూ ఉన్న సమాజంలోని సంక్లిష్టతలను ఇతివృత్తాలుగా తీసుకుని సామాజిక జీవనాన్ని కథలుగా మలుస్తారు. ఇప్పటివరకు 'సగం కాలిన జీవితం' అనే నవలను, వెన్నలో లావా (2011), వెంట వచ్చునది (2018), స్పర్శవేది (2021) అనే కథా సంపుటాలను ప్రచురించారు. 1997లో 'బిందువు' అనే పేరుతో తొలి కవితాసంపుటిని ప్రచురించిన వీరు ఆ తర్వాత మనిషిజాడ (2009), అజరామరం (2015), అనిర్వచనం (2022) అనే కవితాసంపుటాలను వెలువరించారు. అనేక కథా, కవితా సంపుటాలకు రాసిన ముందు మాటలతో ప్రస్తార, విస్తార అనే విమర్శనాత్మక వ్యాస సంపుటాలను వెలువరించారు.

**1.2. ఎమ్వీ రామిరెడ్డి రైతు కథలు:** కూడా రైతు పక్షపాతి. చిన్నప్పుడు తల్లితో పాటు వ్యవసాయ, కూలి పనులకు వెళ్లి అందులోని కష్టాలను స్వయంగా అనుభవించారు. నానాటికీ దిగజారుతున్న రైతు పరిస్థితికి ఎంతో దుఃఖించారు. నకిలీ పురుగుమందుల తాకిడితో పంటలు సరిగా పండక, దిగుబడి రాక, పెట్టుబడి పెరిగిపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల్ని చూసి తల్లడిల్లారు. నేలను నమ్ముకుని, ఆధారపడిన రైతులు ఎందుకు అన్యాయమై పోతున్నారంటూ బాధపడతారు. కొన్ని కథల్లో రైతుస్థితికి మూలాల్ని అన్వేషించే ప్రయత్నం చేస్తారు. ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగడతారు. రైతులకు కావల్సింది సానుభూతి కాదని, సహాయమని గుర్తుచేస్తారు. ఎమ్వీ రామిరెడ్డిలోని రైతు పక్షపాతిని ఈ కింది కథల ద్వారా మనం తెలుసుకోవచ్చు.

**1.2.1. రైతు – పురుగుమందులు (క్రిమిసహారం)** వ్యవసాయంతో నిరంతరం యుద్ధం చేస్తున్న రైతుల జీవితంపై పురుగుమందులు కూడా ప్రభావాన్ని చూపిస్తున్నాయి. చేలకు వచ్చే రకరకాల బెడదలను అధిగమించడానికి రైతులు వాడే పురుగు మందుల వల్ల వాళ్ళకే తెలియని హాని కలుగుతుంది. గుంటూరులో బిఎస్సి పూర్తిచేసిన వేణు ఒక పబ్లిక్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. అత్తయ్యకు ఆరోగ్యం బాగోలేదని తెలిసి ఐదేళ్ల తర్వాత పుట్టి పెరిగిన ఊరికి బయల్దేరతాడు. వాళ్ల మావయ్యతో కలిసి పొలానికి వెళ్ళిన వేణు రైతులు పురుగు మందులతో నిరంతరం సాగిస్తున్న యుద్ధాన్ని కళ్లారా చూస్తాడు. గ్యాలన్ డబ్బాలో నుంచి మందు డబ్బా, పాత లుంగీ, కొలతల బుడ్డి తీసిన వేణు మావయ్య మందును కొలిచి డబ్బాలో పోస్తాడు. ట్యాంకును భుజానికి తగిలించుకుని స్ప్రే చేయడం ప్రారంభిస్తాడు. దోమ తెగులు, పేనుబంక, పచ్చపురుగు, రెక్కపురుగులాంటి రకరకాల క్రిమికీటకాలను పార దోలడానికి మార్కెట్టులోకి వచ్చే మందుల్ని తల తాకట్టు పెట్టైనా రైతులు కొని స్ప్రే చేయడం వల్ల క్రిమికీటకాలు చావకపోగా మరింత పెరగడాన్ని అత్యంత వాస్తవికంగా చెప్తారు రచయిత. పురుగు మందుల్ని చంపడానికి వాడే మందుల పవర్‌కి రైతులే స్పృహ కోల్పోయే పరిస్థితులు సాధారణమే అయినా కొన్నిసార్లు ప్రాణాలు కూడా కోల్పోయే విషాదకర పరిస్థితుల్ని ఈ కథలో చెప్తారు రచయిత.

**1.2.2. రైతుల ఆత్మహత్య (ఒక రైతు ఆత్మకథ)** నేటి రైతుల దుస్థితిని, ఆత్మహత్యలు చేసుకుంటున్న తీరును అత్యంత దయనీయంగా వివరించిన కథ ఇది. మోసపోయిన నారాయణ ఆత్మహత్య చేసుకుని స్వర్గంలో ఉండి తన ఆత్మకథను తానే చెప్పుకున్నట్లుగా ఈ కథ సాగుతుంది. నిజానికి ఇది ఒక్క నారాయణ కథ మాత్రమే కాదు, దళారుల మోసాన్ని, వ్యవసాయ నష్టాల్ని భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న నేటి రైతులోకపు వ్యథగా రచయిత ఈ కథను చిత్రించారు. పత్తి పంట పండించి సరైన గిట్టుబాటు ధర రాక, దళారుల చేతిలో మోసపోయి, పెట్టుబడి కూడా తిరిగిరాక నిస్సహాయంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ కథలోని నారాయణ చదువు మానేసి వ్యవసాయంలో తండ్రికి చేదోడువాదోడుగా నిలుస్తాడు. ఉన్న పొలానికి తోడు మరో పదెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తాడు. ఏటికేడు ఏదో లాభాలు వచ్చి అప్పులు తీరుద్దామని అనుకుంటాడు. కానీ పెట్టుబడి కూడా రాకపోవడం వల్ల మళ్లీ కొత్త అప్పులు చేయాల్సి వస్తుంది. బ్రహ్మం దగ్గర అప్పు చేస్తాడు. చెల్లికి మంచి సంబంధం వస్తే వైభోగంగా పెళ్లి చేస్తాడు. బంధువైన వ్యాపారి దగ్గర పురుగుమందులు అప్పుగా తెస్తాడు. ఆ ఏడు పత్తి బాగా పండుతుంది. అక్కడ దళారులంతా కుమ్మక్కై పత్తిపంట ధరను తగ్గిస్తారు. దాని ఫలితంగా విపరీతమైన అప్పుల పాలవుతాడు. అప్పుగా ఇచ్చిన డబ్బులకు వడ్డీ కింద బ్రహ్మం నారాయణ పొలాన్ని రాయించుకుంటాడు. తండ్రి జబ్బు, భార్య దుఃఖం, అమాయకమైన పిల్లల

మొహాలు గుర్తొచ్చి పురుగుల మందు తాగి నారాయణ ఆత్మహత్య చేసుకుంటాడు. రైతుల జీవితాల్లోని వాస్తవికతను, నగ్న సత్యాలను ఈ కథలో అడుగడుగునా రచయిత చిత్రించారు.

**1.2.3. వ్యవసాయం – రైతు దీనస్థితి (అన్నదాత దుఃఖిభవ)** అన్నదాతల్లోని ఆశాభావాన్ని, ఏటికేడు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా పంటలు పండించే నేపథ్యాన్ని ఈ కథలో వివరిస్తారు రచయిత. వీరేడ్డి పత్తిచేను వేస్తాడు. పురుగు తగ్గుముఖం పట్టి చెట్లు పచ్చబడి కాయ బాగా వస్తుంది. కానీ పక్క పొలం వాడైన రాజయ్య తన పొలంలో వేసిన కొత్తరకం విత్తనాలు వేసి పంట పండిస్తున్న దగ్గర నుంచి వీరేడ్డికి నిద్రపట్టదు. కొత్త విత్తనాల వల్ల రాజయ్య పొలంతో పాటు విరగకాసిన తన పత్తి పంట కూడా దెబ్బతింటుందని అతన్ని హెచ్చరిస్తుంటాడు.

పత్తి విత్తనాల్లో కల్తీ జరిగిందని, దాని మూలంగా పంటల్లో నష్టం వచ్చిందని వీరేడ్డి మిగిలిన రైతులతో కలిసి ఆందోళన చేస్తాడు. ప్రతిపక్షం, అధికారపక్షం వాగ్దానాలు చేస్తారే గానీ సమస్యకు పరిష్కారం చూపించరు. తుపాను వచ్చి పత్తిపంట మట్టి కొట్టుకుపోవడంతో సాంబయ్య పురుగుమందు తాగుతాడు. నకిలీ పురుగు మందుల్ని తక్కువరేటుకి విక్రయించే బుల్లబ్బాయి దగ్గర రైతులంతా తక్కువధరకు వస్తున్నాయని ఆ పురుగుమందుల్ని కొంటారు. దాని ఫలితంగా సాంబయ్యలాంటి రైతులు ఆత్మహత్యకు ప్రయత్నిస్తుంటారు. ఎలాగో బతికి బయటపడతాడు సాంబయ్య. ఎన్ని నష్టాలొచ్చినా రైతుల దృష్టి ఎప్పుడూ వ్యవసాయం మీదే ఉంటుందని, ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకుండా మరో పంట పండించడానికి సిద్ధమవుతాడని ఈ కథ చెప్తుంది.

**1.2.4. పచ్చని పొలాల అమ్మకం (త్రిశంకు స్వప్నం)** రాజధాని ప్రకటనతో మారిన పల్లె స్వరూపాన్ని, మానవ సంబంధాలలో వచ్చిన మార్పుల్ని అక్షరబద్ధం చేసిన కథ ఇది. నవ్యాంధ్ర రాజధాని అమరావతి పరిసర గ్రామాల దుస్థితికి అద్దం పడుతుంది. భూముల ధరలు ఆకాశాన్ని తాకి రక్తసంబంధీకుల మధ్య ఎలాంటి మారణహోమాన్ని సృష్టిస్తున్నాయో ఈ కథలో కళ్లకు కట్టారు. రాజధాని పరిసర ప్రాంతాల్లో కొత్తగా ఏర్పడిన మద్యం దుకాణాలు సాధారణ జనజీవన బతుకు చిత్రాన్ని మార్చిన విధానాన్ని ఎంతో ఆవేదనగా చెప్తారు. రాజధాని భూముల సేకరణలో ప్రభుత్వం ఆడిన వికృతక్రీడకు ఎంతోమంది సన్న, చిన్నకారు రైతులు బలయ్యారు. ఎందరో ప్రాణంకంటే ఎక్కువైన భూముల్ని కోల్పోయారు. పొలాల్ని అమ్ముకుని కొత్త కొత్త అలవాట్లకు బానిసలుగా మారారు. నేలమీదైనా ఉండొచ్చు, ఆకాశంలోనైనా ఉండొచ్చు. అది వాళ్ల వ్యక్తిగతం. కానీ కృత్రిమంగా సృష్టించుకున్న త్రిశంకు స్వర్గంలో మాత్రం ఉండకూడదని ఈ కథ చెప్తుంది.

**1.2.5. రైతు – భూమిపై అపేక్ష (పొలాల తలాపున)** రైతుకు, పంటపొలానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని ఎంతో హృద్యంగా వివరించిన కథ ఇది. మట్టిని నమ్ముకున్నవాడు ఆ మట్టి ఒడిలోనే సంతృప్తిగా ప్రాణాలను విడుస్తాడనే విషయాన్ని పానకాలు పాత్ర ద్వారా రచయిత ఎంతో ప్రతిభావంతంగా

చిత్రిస్తారు. గొంతు క్యాన్సరుతో బాధపడుతున్న పానకాలు కొడుకు కోరిక మేరకు అతని దగ్గర ఉండి చికిత్స తీసుకుంటాడు. కీమోథెరపీలు, ఆస్పత్రి వాతావరణం పానకాలుకు రుచించదు. ఎప్పుడెప్పుడు పల్లెకు పరిగెత్తుదామా అని ఎదురుచూస్తుంటాడు. రత్నాల్లాంటి కొడుకుల్ని, కన్న కూతుళ్లలా చూసుకునే కోడళ్లను, మనవళ్లను, మనవరాళ్లను, ప్రాణంగా చూసుకునే భార్యను అందర్నీ వదిలి చికిత్స పేరుతో ఆస్పత్రిలో ఉండడం గొంతు క్యాన్సరు కంటే దుర్భరంగా అనిపిస్తుంది. పట్నం నుంచి పల్లెకు వస్తాడు. పొలంలోకి ప్రవేశించగానే అతనిలో కొత్త జీవం కలుగు తుంది. అయినవాళ్ల కుశలప్రశ్నలతో ప్రాణం లేచినట్లవుతుంది. పుట్టిన ఊరిలోని గాలి, వెలుతురు కొత్త రక్తం ఎక్కిస్తున్నట్లుగా అనిపిస్తుంది. పోయిన శక్తి మళ్ళీ తిరిగివచ్చిన భావన కలుగుతుంది. ఎంతో తృప్తిగా పొలాల తలాపున ప్రాణాలు వదులుతాడు. రైతు ప్రాణం తాను తిరిగిన మట్టితో ఎంతగా పెనవేసుకుపోయి ఉంటుందో ఎంతో ఆర్ద్రంగా ఈ కథలో చిత్రిస్తారు రచయిత. ఎన్ని సౌకర్యాలున్నా పల్లెలోని గాలి రైతులకు ఎంతో ఇష్టమనీ, నలుగురితో మాటామంతీ, ఆత్మీయతలు రైతులకెంతో బలాన్నిస్తాయని ఈ కథలో చెప్తారు రచయిత.

**1.2.6. రైతుల ఆత్మహత్యలు (నాగలి గాయాల వెనుక)** రైతుల జీవితాల్లో కంటికి కనిపించని వ్యథల్ని వాస్తవికంగా పరిచయం చేసిన కథ ఇది. వ్యవసాయం చేయమని చెప్పడం చాలా సులభం. కానీ అందులోకి దిగి లాభనష్టాలను అధిగమించి నెగ్గుకురావడం చాలా కష్టం. అలాంటి నేపథ్యంతో ఉదయ్ పాత్రని సృష్టించి రాసిన కథ ఇది. ఈ దేశంలో రైతుల మరణానికి ఎన్నో కారణాలున్నాయి. సరైన సమయానికి పంట చేతికి రాకపోవడం, ఒకవేళ వచ్చిన అదే సమయానికి దాడిచేసే ప్రకృతి వైపరీత్యాలు, దళారుల మోసాలు, మార్కెట్టు యార్డుల మాయాజాలాలు, రాజకీయ నాయకుల కంటితుడుపు వాగ్దానాలు.. ఇలా అన్నీ కలిసి రైతుల్ని ఆత్మహత్యలు చేసుకునేలా చేస్తున్నాయి. అందుకోసం రైతు ఆత్మహత్యలకు మూలాల్ని అన్వేషించే ప్రయత్నంలో భాగంగా తాను చేస్తున్న ఉద్యోగాన్ని వదిలిపెట్టి రైతుల ఆత్మహత్యల నివారణ కోసం స్పెషల్ డ్రైవ్స్ నిర్వహిస్తుంటాడు ఉదయ్.

అప్పులు చేయకుండా లాభాలతో పంటలు పండిస్తానని వాగ్దానం చేసిన ఉదయ ఆయన నిబంధనలకు ఒప్పుకుని వ్యవసాయంలో దిగుతాడు. అయిదెకరాల్లో టమాటా, దొండ, బెండ, వంకాయవంటి కాయగూరల విత్తనాలు, మిగిలిన రెండకరాల్లో ఆకుకూరల విత్తనాలు నాటతాడు. బాగా పంట వస్తుంది. కానీ అమ్మకం దగ్గర సమస్య ఎదురవుతుంది. తర్వాత ఏడెకరాల్లో మినుము, కందిలాంటి అపరాల పంటల్ని పండిస్తాడు. అనుకోకుండా వచ్చిన తుపాను ధాటికి పంటంతా నీటిమయం అవుతుంది. తర్వాత సంవత్సరం ఐదెకరాల్లో పత్తి, రెండెకరాల్లో మిరపకాయపంట వేస్తాడు. దళారుల జోక్యం వల్ల రేటు పడిపోతుంది. దాని ఫలితంగా ఒక పత్తి రైతు ఆత్మహత్య చేసుకుంటాడు.

జానకిరామయ్యతో పందెం కాసి తీసుకున్న మూడేళ్ల కాలం కరిగిపోతుంది. పంతం పట్టి చేసిన

వ్యవసాయం తీవ్రమైన నష్టాలని తీసుకు వస్తుంది. ఓటమిని ఒప్పుకోలేక ఉదయ్ ఆత్మహత్యకు ప్రయత్నించిన ఉదయ్ వ్యవసాయం చేయడం ఎంత కష్టమో అనుభవం ద్వారా గ్రహిస్తాడు.

కరెంట్ కోతలు, బ్యాంకుల సహాయనిరాకరణలు, నీటికొరత, అందుబాటులో లేని వ్యవసాయాధి కారులు, మార్కెట్టు యార్డుల మోసాలు, దళారుల హవా... ఇలా నాగలి గాయాల వెనుక కనిపించని రైతుల వ్యథల్ని ఈ కథలో చిత్రిస్తారు రచయిత

**ముగింపు:** రామిరెడ్డి కథలు నేటి సమాజంలో వ్యవసాయాన్ని ఒక యజ్ఞంలా సాగించే రైతులకు దర్పణంగా నిలుస్తాయి. పంటలు పండినా, పండకపోయినా ఎంతో శ్రద్ధతో వ్యవసాయ క్రతువును సాగించే నేటి రైతాంగ దుస్థితిని మన కళ్లముందు నిలుపుతాయి. దళారులు, నకిలీ పురుగుమందుల విచ్చిలవిడితనానికి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల హృదయ విదారక జీవన వైనాన్ని ఆలోచనాత్మకంగా తెలియజేస్తాయి.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. రామిరెడ్డి ఎమ్వీ, 2011, వెన్నెలో లావా, మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రచురణలు -10, పెదపరిమి, గుంటూరుజిల్లా.

2. రామిరెడ్డి ఎమ్వీ, 2018, వెంట వచ్చునది, మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రచురణలు -11, పెదపరిమి, గుంటూరుజిల్లా.

3. రామిరెడ్డి ఎమ్వీ, 2021, స్పర్శవేది, మువ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రచురణలు -14, పెదపరిమి, గుంటూరుజిల్లా.

4. రామిరెడ్డి ఎమ్వీ, 2024, ప్రస్తార, కథా సాహిత్య వ్యాసాలు, బోధి ఫౌండేషన్ ప్రచురణలు, హైదరాబాద్.

5.రామిరెడ్డి ఎమ్వీ, 2024, విస్తార, కవిత్వ సాహిత్య వ్యాసాలు, బోధి ఫౌండేషన్ ప్రచురణలు, హైదరాబాద్.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# ఒక దశాబ్ది కథలు- సామాజిక సంబంధాల విశ్లేషణ

**Mamidi Vijetha**
University of Hyderabad, H-NO 8-93, Mamidiwada , Dharmapuri (Vil, Mdl)
Jagtial(Dist), Telangana-505425, Phone:84999 17782
Email: vijethamallaiah@gmail.com

**పరిచయం**

కథకు వస్తువే ప్రధానంగా కనిపిస్తుంది. రచయిత చెప్పే ప్రధాన విషయాన్ని వస్తువు అనవచ్చు.Content అనే ఆంగ్ల పదానికి వస్తువు అని తెలుగులో వాడుతున్నాం. " సాహిత్యంలో వ్యక్తమయే ప్రధాన భాగాన్ని వస్తువు అనవచ్చు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు. "( మధుసూదన రావు. త్రిపురనేని:1997, పుట 13)" నిగూడా బీజ స్థితి నుంచి వెలికి వచ్చిన విషయాంకురం కథా వస్తువు. వికాసోన్ముకథ దీని స్వభావం. ప్రేరకబీజం ఏద్దైనాప్పటికీ దానిలో ఉండే ఒకానొక విలక్షణత రచయితను ఆకట్టుకున్నప్పుడు కథా వస్తువు రూపొందుతుంది "( దక్షిణామూర్తి. పోరంకి:1988, పుట 239) రచయిత ఎంచుకున్న అంశమే వస్తువు.

" ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా నియమబద్ధంగా ఉన్న మూలకాల క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషి, మానవ సంబంధాలు సామాజిక జీవితం వస్తువు అవుతుంది. కవిత్వంలో వ్యక్తమయే ప్రధానమైన Concept ని వస్తువుగా చెప్పుకోవచ్చు"( లక్ష్మీకాంతం. పింగళి. 1986. పుట 39) రచనలు వ్యక్తమయే ప్రధానమైన అంశాన్ని వస్తువుగా చెప్పవచ్చు." వస్తురూపాల సారాంశమే కథ. స్థల కాలాల్ని వదిలి జీవితముండదు. జీవితాన్ని చిత్రించే కథ స్థల కాలాల్ని వదలదు"( శ్రీధర్, వెల్దండి. ( సంపా ). 2015:257).

సమాజం సాహిత్యం రెండు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా సమాజంలో మార్పులు రావడం అనేది సహజంగానే కనిపిస్తున్నది. ఈ మార్పు అనేది సమాజానికి మేలు కలిగించే దిశగా ముందుకెళితే బాగానే ఉంటుంది. దానితోపాటు మారుతున్న కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సమాజంలోని విషయాలను సాహిత్యంతో జోడించి సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న సాహితీవేత్తలు కూడా ముఖ్యమే. ప్రపంచంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని కూడా నిక్కచ్చిగా తమ సాహిత్యంలో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తెలియజేసే వారు ఒక సాహితీవేత్తలే. ప్రపంచ చరిత్రలో సామాజికంగా జరిగే విషయాలు కథల్లో ప్రతిఫలిస్తాయి.

సాహిత్యం శూన్యంలోంచి ఉద్భవించదు. కాలం, మనుషులు, సాంఘిక పరిస్థితులు, ఉత్పత్తి సంబంధాలు- ఈ నాల్గింటి పర్యావసానమే సాహిత్యం. మనిషి ఆలోచించగల, అనుభూతించగల, వివేచించగల జీవి కాబట్టి వ్యవస్థలతో సంఘర్షించడం, అవస్థలకు ప్రతిస్పందించడం తన నైజం. అతని సంఘర్షణ, సంవేదన, స్పందనల, భావోద్వేగాల ప్రతి ఫలనరూపాలే వేల సంవత్సరాల పూర్వం నుండి

వస్తున్న కళలు, సాహిత్యం. మానవ సమాజ పురోగమనానికి సైన్సు ( విజ్ఞాన శాస్త్రం ) ఎంతగా దోహదపడుతూ వస్తున్నదో కళలు, సాహిత్యం సైతం అంతగా తోడ్పడుతున్నాయి. మన చుట్టూ ప్రకృతిలోని నిగూఢత్వాన్ని ఛేదించే ప్రయత్నమే సైన్సు. మన జీవితంలోని గందరగోళత్వానికి, విరోధాభాసలకు భాష్యం చెప్పే ప్రయత్నించేదే సాహిత్యం. అయితే సైన్సు ఫలితాలు, ప్రభావాలలాగా సాహిత్యం ప్రభావం భౌతికంగా తక్షణ రూపంలో కనపడదు. మనుషుల భౌతిక అవసరాలను సులువుగా తీర్చే సాధనాలు, సామాగ్రిని సైన్సు సమకూరిస్తే, వారి చైతన్య స్థాయిని పెంచగల, ఆలోచన పరిధిని విస్తృతపరచగల జీవిత సత్యాలను తెలియజేసే vicarious experience సృజనాత్మక సాహిత్యం అందిస్తుంది.' At its best it( literature) evokes unifying emotions:it makes the reader see the world momentarily as a unity' అని ఒక మహానుభావుడు అన్నది ఇందుకే. జీవితాన్ని జీవించేందుకు అనేక అవకాశాలు ఉన్న ఈ లోకంలో తన అస్తిత్వానికి అర్థం వెతుక్కునేందుకు మనిషి పడే ప్రాకులాట, లోకం ఇలా కాకుండా మరోలా ఉంటే బావుండునని అతని ఆశల, ఊహల విస్తృతి లక్ష గొంతుకల్లో సాహిత్యం ద్వారానే మనకు వినబడుతాయి. వివిధ కాలాల్లో విభిన్న పాత్రలుగా పటితకు కనపడే ఈ మనిషి మానవజాతి ప్రతినిధి అని వేరే చెప్పనక్కర్లేదు. కెన్నెత్ బర్ అన్నట్టు 'literature serves as equipment for living' కనుకనే అనాదిగా అది ప్రజల సామాజిక, సాంస్కృతిక జీవనంలో విడదీయలేని భాగమైపోయింది.

సాహిత్య సృజన మామూలుగా ఏ వ్యక్తి అయినా చేసే పని కాదు. సమాజంలో ముఖ్యమైన భాగంగా ముందున ఉంటూ, సమాజ చలన సూత్రాలను గురించి తనకున్న అవగాహనతో తను జీవిస్తున్న సమాజం తీరుతెన్నులను లోతుగా పరిశీలిస్తూ విస్పష్టంగా వ్యాఖ్యానించగల వ్యక్తి.నడుస్తున్న కాలం మౌలిక స్వభావాన్ని దాని రూపం, సారంతో సహా అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ, మారని మనిషి తనం (the eternal in the man ), చరిత్ర వారసత్వం నేటి ప్రపంచంలో ఎలా నెగ్గుకొని వస్తున్నాయో తన రచనల ద్వారా చూపిస్తూ ఆ బాధ్యత నెరవేరుస్తాడు. రచయిత, సాహిత్యం, సమాజం ఈ మూడు ఒకటి మరో దానిపై ప్రభావం కలుగజేసుకుంటాయి. కాబట్టి సాహిత్యం ఎల్లప్పుడూ సామాజిక వర్తమానతను ప్రతిబింబిస్తుంటుంది. సోఫోక్లిజ్, షేక్స్పియర్, బెకేట్, సర్తేలా నాటకాలు, టాల్ స్టాయ్, దస్తవసకి, గంతర్ గ్రాస్,గెథె, ఎమిల్ జోల, మార్కువెజ్ల ల నవలలు ఈ విషయాన్ని నిదర్శిస్తాయి.

సాహిత్య సృజన వివిధ ప్రక్రియ(genre) లలో సాగుతుంది. కథ (short story) వాటిల్లో ప్రధానమైనది. నిరంతర పరిణామశీలమైన విశిష్ట సాహితీ ప్రక్రియ కథ. రూపంలోనూ, సారంలోనూ కొత్త సరిహద్దులను తాకుతూ అది తనను తాను పునర్ నిర్వచించుకుంటూ వస్తున్నది.

**కీలక పదాలు** : పందిరి ( కొంజ) స్పైనల్, అనస్థీషియా, ముక్కుపొడుం, రిలాక్స్, అబ్జర్వ్, మనోఫలకం.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

**విషయ విశ్లేషణ**

తన పల్లెకు, దాని చుట్టుపక్కల పల్లెలకు సేవ చేయాలనే ఆశయంతో స్టేట్స్ లో వైద్య వృత్తి మానేసి ఇండియా వస్తాడు శేఖర్. కాని పల్లెల్లో పరిస్థితులు వేరుగా ఉండటంతో కుటుంబ సభ్యుల సలహా మీద హైదరాబాదులోని కార్పొరేట్ ఆసుపత్రిలో చేరతాడు. అక్కడ రాజారెడ్డి ఫ్లోరోసిస్ వ్యాధి గురించి తెలుసుకొని నిరంతరం దానిపై అధ్యయనం చేస్తాడు. డాక్టర్ శేఖర్ రాజారెడ్డి శిష్యుడు కూడా కావడంతో ఇద్దరు అనుకొని నల్లగొండ జిల్లా నడిబొడ్డున ఉన్న వట్టిపల్లికి ఫ్లోరోసిస్ బాధిత ప్రాంతాలని, అక్కడి రోగులని బాగా ఎరిగిన మనిషి సుభాషిని వెంటపెట్టుకొని అందరిని అబ్జర్వ్ చేస్తారు.

సుభాష్ మాట వినగానే లేచి కూర్చున్న చంద్రయ్య, అతని పలకరిస్తూ గోళీలు అడుగుతాడు. గోలీలిస్తే చస్తావ్ అన్న మాటలకు అతను జీవంలేని నవ్వుతో పుణ్యమే కదా అంటాడు. తుది శ్వాసను ఆహ్వానిస్తూ, చనిపోవడానికి కూడా కదల్లేని మనిషి.

" అది అంటువ్యాధి కాదు. కాని ఏ కుష్టురోగినో, ఎయిడ్స్ బాధితుడినో దూరంగా ఉంచినట్టు పందిళ్ళు వేసి అందులో ఉంచుతారు. ఫ్లోరోసిస్ లో స్కెలిటల్ ఫ్లోరోసిస్ పరాకాష్ట"( నారాయణరావు, గోపరాజు:2007:పుట:475)

" మంచి బలమైన తిండి, ఆకుకూరలు తినాలె. పాలు తాగాలే అని డాక్టర్లు ఆయన భుజం తడుతూ మళ్లీ లేస్తవ్ అంటారు "(పుట:476) అక్కడే సందడి చేస్తూ ఆడుకుంటున్న పిల్లల పళ్ళు చూస్తే ఎనామిల్ చక్కగా ఉన్న పిల్లకాని పిల్లవాడు కానీ కనిపించడు. అది ఫ్లోరోసిస్ తొలిదశ అనే స్పృహ కలగగానే ఎవరో కొరడాతో చెల్లుమనిపించినట్టవుతుంది.

ఫ్లోరోసిస్ ముదిరితే మగాళ్లు మంచం దిగరు. ఆడవాళ్లు దేక్కుంటూనే ఇంటి పని అంతా చేసుకుంటారు. నీళ్లు మారితే జనాలు లేచినడుస్తారని నరసింహ అనే వ్యక్తి నిరూపించాడు. పాలు అమ్ముకొని, ఇల్లు కొనుక్కుంటాడు.

ఎండ బాగుందని ఆఫీసు వైపు ముగ్గురు నడుచుకుంటూ వెళ్తారు. ఈ ఊళ్ళకి నీళ్ళు ఇమ్మని హైకోర్టు చెప్పినా గవర్నమెంట్ మాత్రం పట్టించుకోదు. అక్కడి నుండి హైదరాబాదుకి పైపులు వేసి సాగర్ నీళ్లు పంపించారు. అంత దూరం పోయిన పైప్ లైన్ పక్క గ్రామాలకు ఎందుకు రాదు. గవర్నమెంట్ బిస్లరీ మొదలైన వాటిని అమ్ముకోవడానికి ఇచ్చింది కానీ కాళ్లు చేతులు చచ్చుబడి పోతున్న మనుషులు తాగడానికి నీళ్లు అడుగుతున్నారు.

డాక్టర్ శేఖర్కి ఎప్పుడో చిన్న కునుకు పడుతుంది. ఆ మగతలో బడి గంట మోగుతుంది. పిల్లలంతా కేరింతలు కొడుతూ ఇళ్ల దారి పడతారు. కానీ వాళ్ళ చేతుల్లో పుస్తకాలు, పలకలు కాకుండా నూలుతాళ్లు ఉంటాయి.

ఫ్లోరోసిస్ ప్రభావం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం మాత్రం పట్టించుకోదు. ప్రజల పట్ల, ఊర్లపట్ల ప్రభుత్వం వైఖరి నిమ్మకు నీరెత్తినట్లు ఉందని రచయిత గోపరాజు నారాయణరావు ' ఒక సామూహిక మరణ దండన " కథలో ఫ్లోరోసిస్ సమస్యతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను, సామాజిక అంశాలను, భవిష్య జీవన చిత్రీకను కావించారు.

రచయిత కల్లూరి భాస్కరంగారు ' మా నాన్న, నేను, మా అబ్బాయి' కథలో తరాల మధ్య అంతరాలను చిత్రించారు.

**ముగింపు**

సమాజ గమనానికి విరామం ఉండదు. నిత్య చలన శీలత దాని లక్షణం. ఈ పదేళ్ల భారత దేశ సమాజాన్ని మరీ ముఖ్యంగా తెలుగు నీళ్లను జరుగుచున్న మార్పులను, వాటి తీరును, గమనించినట్లయితే అనేకానేక ఆలోచనలు మన మెదడులో మన మెదడులో రొధ పెడతాయి. గతంలో మార్పులు అర్థం కావడానికి, మన మనసులోకి ఇంకిపోవడానికి సరిపోయే సమయం ఉండేది. ప్రస్తుతం అర్థం చేసుకోవడానికి పరికరాలను వెతుక్కునే లోపునే మన ఆలోచనల కన్నా వేగంగా వాటి స్వరూప స్వభావాలు మారిపోతున్నాయి. ఈ వాతావరణం మనుషులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. ఇది కేవలం తరాల మధ్య అంతరంగాను పాత కొత్తల మధ్య ఘర్షణ గాను సరిపెట్టుకొని సమాధానపడలేము. సమాజంలోని అన్ని రంగాల్లో, జీవితంలోని అన్ని కోణాల్లో ఇది ప్రతిఫలిస్తోంది. సమాజ గమనాన్ని అద్దంలో చూపించిన విధంగా దశాబ్దిలో వెలువడిన కథలన్నీ మనల్ని ఆలోచింపచేస్తాయి.

**ఆధార గ్రంథాలు**

1) నారాయణ రావు, గోపరాజు " ఒక సామూహిక మరణ దండన ". హైదరాబాద్: చరిత ఇంప్రెషన్స్, 2007
2) భాస్కరం, కల్లూరి " మా నాన్న నేను మా అబ్బాయి" హైదరాబాద్ : చరిత ఇంప్రెషన్స్, 2006.
3) కాత్యాయనీ విద్మహే " కన్యాశుల్కం సామాజిక సంబంధాలు". వరంగల్: జిజ్ఞాస ప్రచురణలు,2005
4) లక్ష్మీపతి, ఆడెపు, రమణమూర్తి, ఏ.వి' కథ 2015'. సికింద్రాబాద్: కథ సాహితి పబ్లికేషన్స్.
5) సంజీవమ్మ,' తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం' విజయవాడ: విశాలాంధ్ర పబ్లికేషన్స్, 1985.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# పల్లేటి లక్ష్మీ కులశేఖర్ గారి సాంఘిక నాటకాలు - సామాజిక విశ్లేషణ

**గనుముల తిరుమల రాజు (UGC – NET) ,**
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ , యోగి వేమన విశ్వవిద్యాలయం ,
వేమనపురం, కడప- 516005.

**వ్యాస సంగ్రహం**

"జీవితాన్ని ప్రతిబింబించేదే నాటకం – నాటకానికి ప్రతిస్పందించేదే జీవితం" అన్న నాటక సూత్రాన్ని సంపూర్ణంగా జీర్ణించుకున్న పల్లేటి, తన జీవిత అనుభవాలను, సమాజంలో తాను చూసిన వాస్తవాలను నాటక రూపంలో ఆవిష్కరించారు. నాటకం అనేది వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా, సమాజాన్ని ప్రతిబింబించే శక్తివంతమైన సాహిత్య రూపం. గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం'తో ప్రారంభమైన వాస్తవిక సాంఘిక నాటక ధోరణి, ఆత్రేయ, అనువాద ప్రభావాలు, ప్రయోగాత్మక శిల్పాలతో ముందుకు సాగింది. ఈ పరంపరలో పల్లేటి లక్ష్మీ కులశేఖర్ తనదైన దృక్పథంతో సాంఘిక నాటకాలను రచించి, నాటకాన్ని ఒక సామాజిక ఆయుధంగా మలిచారు.

తెలుగు నాటక రంగంలో సాంఘిక చైతన్యాన్ని బలంగా ప్రతిఫలింపజేసిన రచయితల్లో పల్లేటి లక్ష్మీ కులశేఖర్ ఒక విశిష్ట స్థానాన్ని పొందారు. "భావమే నాటకానికి ప్రాణం" అన్న సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టి, సమాజంలోని అసమానతలు, దోపిడీ వ్యవస్థలు, కుటుంబ విఘటనలు, తల్లిదండ్రులు–పిల్లల మధ్య విరహాలు, విద్యా వ్యవస్థ లోపాలు, నిరుద్యోగ సమస్యలు, మానవీయ విలువల పతనం వంటి అనేక సమస్యలను తన సాంఘిక నాటకాల ద్వారా సూటిగా, ప్రభావవంతంగా ప్రస్తావించారు.

ఈ పరిశోధన వ్యాసం పల్లేటి లక్ష్మీ కులశేఖర్ సాంఘిక నాటకాలను ఇతివృత్తం, పాత్ర చిత్రణ, భాషా శిల్పం, సామాజిక సందేశం, నాటకీయ నిర్మాణం వంటి కోణాలనుంచి విశ్లేషించి, ఆయన నాటకాలు సమకాలీన సమాజంపై చూపిన ప్రభావాన్ని అధ్యయనం చేయడమే లక్ష్యంగా రూపొందించబడింది.

**కీ వర్డ్స్:** పల్లేటి లక్ష్మీ కులశేఖర్, సాంఘిక నాటకాలు, సామాజిక విశ్లేషణ, వాస్తవికవాదం, సమకాలీన సమాజం, మానవీయ విలువలు, కుటుంబ వ్యవస్థ, నిరుద్యోగ సమస్య, విద్యా ఒత్తిడి, వృద్ధుల సమస్యలు, సామాజిక చైతన్యం, పాత్ర చిత్రణ, భాషా శిల్పం.

## రచయిత జీవన నేపథ్యం – సాహిత్య నిర్మాణంపై ప్రభావం

1954 డిసెంబర్ 3న కడప జిల్లా వీరబల్లి మండలం గడికోట గ్రామంలో జన్మించిన పల్లేటి లక్ష్మీ కులశేఖర్, బాల్యం నుంచే సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు కమాల్ సాహెబ్ మార్గదర్శకత్వం ఆయన రచనా దృష్టిని తీర్చిదిద్దింది. "భావం కోసం వెతుకు – భాష దానంతట అదే వస్తుంది" అన్న గురువు బోధన ఆయన నాటకాలలో స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. పాఠశాల దశలో

చూసిన అవధాన కార్యక్రమం, నాటక రంగంపై ఆయనకు గాఢమైన ఆసక్తిని కలిగించింది. ఆ సంఘటనే ఆయనను సాధన వైపు నడిపించి, చివరకు ప్రముఖ నాటక రచయితగా తీర్చిదిద్దింది.

**పల్లేటి లక్ష్మీ కులశేఖర్ – నాటక రచనా ప్రస్థానం**

1980లో వై.ఎస్. సిలార్ పరిచయంతో సాంఘిక నాటక రంగంలోకి ప్రవేశించిన పల్లేటి, 1982లో సవేరా ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఆళ్ళూరి వెంకటయ్యతో కలసి పౌరాణిక, పద్య నాటకాలతో పాటు సాంఘిక నాటకాలను రచించారు. నాటకాల ద్వారా అనేక నంది అవార్డులు అందుకున్న ఆయనకు రాష్ట్రస్థాయి గుర్తింపు లభించింది.

**సాంఘిక నాటకాల నేపథ్యం – వాస్తవిక దృక్పథం**

పల్లేటి రచించిన సాంఘిక నాటకాలు వాస్తవికవాదానికి చెందినవి. సమాజంలో జరుగుతున్న సంఘటనలను, సాధారణ మనిషి అనుభవించే బాధలను, సంక్లిష్ట సంబంధాలను ఆయన నాటకాల్లో ప్రతిబింబించారు. కులవ్యవస్థ, కుటుంబ వ్యవస్థ పతనం, విద్యా ఒత్తిడి, నిరుద్యోగం, అవినీతి, వృద్ధుల సమస్యలు వంటి అంశాలు ఆయన నాటకాల్లో ప్రధాన ఇతివృత్తాలుగా నిలుస్తాయి.

**ఎంచుకున్న సాంఘిక నాటకాల విశ్లేషణ**

**1. తపస్సు (1986)**బిచ్చగాళ్లయిన కూటాలు, కూటమ్మ ఒకరినొకరు ప్రేమించుకుంటారు, వాళ్లిద్దరిది చాలా చిత్రమైన ప్రేమగా కనబడుతుంది. మొదట వాళ్ళు ఒకరిపై మరొకరికున్న తమ ప్రేమల్ని మనస్సులోనే దాచుకుంటారు. చివరకు కూటమ్మే తన ప్రేమను వెల్లడిస్తుంది. కూటాలు ఆనందానికి అవధుల్లేవు. వెంటానే పెళ్ళి చేసుకుంటారు.

లక్ష్మీ కులశేఖర్ ను నాటక రచయితగా తొలిసారి వెలుగులోకి తెచ్చిన నాటిక 'తపస్సు. అతని జీవితానికొక దశ, దిశను చూపించిన నాటిక 'తపస్సు'. ఇది అప్పటి ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ నిర్వహించిన నాటక రచన పోటీల్లో ఉత్తమరచన బహుమతి పొందింది. ప్రేమ అనేది కులం, ఆస్తి, అంతస్తు, అందం, అంగవైకల్యాలకు అతీతమైందని పల్లేటి ఈ నాటకం ద్వారా తెలియజేశారు. ఆయన నాటికలో ప్రేమ అనే పదానికి గొప్ప నిర్వచనం ఇచ్చారు. నాటికలో బిచ్చగాళ్ల చిత్తవృత్తుల్ని, మమతానురాగాల్ని ఒకవైపు స్పృశిస్తూనే ఇద్దరు ప్రేమికుల ప్రేమానురాగాలను, త్యాగనిరతిని హృదయంగమంగా సాక్షాత్కరింపజేశారు. ప్రేమ కులమతాలకు అతీతమని చాటిచెప్పిన ఉత్తమ నాటిక. బిచ్చగాళ్ల జీవితం నేపథ్యంగా తీసుకుని, ఆత్మ సౌందర్యాన్ని ప్రతిపాదించిన ఈ నాటకం, తెలుగు నాటక రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది.

**2. పుత్రోత్సాహం (1984)**

పల్లేటిగారు తల్లిదండ్రులు పిల్లలను ఏ విధంగా పెంచాలని 'పుత్రోత్సాహం నాటికంలో తెలియజేసాడు. ఈ నాటకం తల్లిదండ్రుల పెంపకాలమీద తీసుకున్న ఇతివృత్తం. డాక్టర్ దంపతులకు రవి

*అనే కొడుకు ఉంటాడు. వీడిని తల్లి గారాబం చేస్తూంది. తండ్రి క్రమశిక్షణలో పెంచాలని ప్రయత్నిస్తాడు. తల్లి తమ బిడ్డ కదా! క్రమశిక్షణ రాకుండా ఎక్కడికి పోతుంది అనుకుంటుంది. రవికి ఆడంబరాలు ఎక్కువ. ఆ ఆడంబరాలు ఉండాల్సినవే అని డాక్టరమ్మ అపోహపడుతుంది. రవికి దురలవాట్లు ఎక్కువయ్యాయి. తండ్రి మందలింపులు లెక్క చెయ్యడు. ఓ సందర్భంలో రవి ఒక అమ్మాయిని పాడు చేసి ఆ అమ్మాయి తిరగబడితే, భయపడి చంపిస్తాడు. అక్కడినుంచి పారిపోయి నేరం నుంచి తప్పించుకోవాలని ప్రయత్నిస్తాడు. తండ్రి ఈ విషయం తెలుసుకుని గారాబమైన పెంపకంలో జరిగిన పొరపాటుకు పర్యవసానం ఏమిటో చూడమని భార్యను మందలిస్తాడు. లేట్ కేసు పోస్ట్ మార్టమ్ రిపోర్ట్ ఇవ్వాల్సిన పరిస్థితి తల్లి దగ్గరకి వస్తుంది. ఆ సంగతి పరారీలో ఉన్న రవి అమ్మను కలుసుకుని ఆ రిపోర్ట్ తారుమారు చెయ్యమంటాడు. తల్లి అయిన డాక్టరు అందుకు ఒప్పుకోదు. చివరకు కన్న కొడుకునే కాల్చి చంపుతుంది. ఇలాంటి వాన్ని కన్నందుకు తాను కూడా ఆత్మహత్య చేసుకోబోతే భర్త అవుతాడు. పల్లేటివారు ఇందులో తల్లిదండ్రుల బాధ్యతలను గుర్తు చేస్తూ మంచి సందేశాన్నిచ్చారు.*

*సమాజంలో తల్లిదండ్రులు తమ బిడ్డలను సమాజానికి ఉపకరించేలా పెంచాలేగాని ఆడంబరాలకు చేస్తే ఇలాగే అవుతుంది. క్రమశిక్షణగా పెంచితే తల్లిదండ్రులకు పుత్రోత్సాహాలు సార్థకమవుతాయి. ఈ నాటకమిచ్చే సామాజిక సందేశం. తల్లిదండ్రుల పెంపక లోపాల వల్ల పిల్లలు ఎలా నేర మార్గంలోకి వెళ్లిపోతారో ఈ నాటకం స్పష్టంగా చూపిస్తుంది. సమాజానికి బాధ్యతగల పౌరులను తయారు చేయాల్సిన తల్లిదండ్రుల పాత్రను గుర్తు చేస్తుంది.*

***3. పుణ్యభూమి (1984)***

నిరుద్యోగ సమస్యపై పల్లేటి లక్ష్మీకులశేఖర్ 'పుణ్యభూమి' నాటిక రాశారు. నిరుద్యోగ సమస్య ఉన్నంతవరకూ యువతకు భవిత ఉండబోదని ఉద్బోధిస్తూ నాటిక రాశాడు. ఆంగ్లేయుల పాలనలో మగ్గిపోతూ బానిసలుగా అలమటిస్తూ వచ్చిన మనకు స్వాతంత్య్రం వచ్చిన తర్వాత కూడా ఎలాంటి ప్రయోజనం లేదని, మన జీవిత స్థితిగతుల్లో కూడా ఎలాంటి మార్పులేదని, అప్పుడు బానిసత్వాన్ని మాత్రమే అనుభవించామని ఇప్పుడు క్షణక్షణానికి సమస్యలను అనుభవిస్తూ జీవచ్ఛవాలుగా బతుకుతున్నామని రచయిత వాపోతారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉత్పన్నమైన సమస్యల్లో ప్రధానమైంది నిరుద్యోగ సమస్యేనని చెప్పి, యువత అనుభవిస్తున్న సంఘర్షణను నాటికద్వారా వ్యక్తపరచారు. నిరుద్యోగయువతకు చక్కని ప్రబోధాత్మకమైన నాటిక పుణ్యభూమి.

***4. దిష్టి (1988)****అంగవైకల్యం గలవారిపై జరుగుతున్న దోపిడీని ప్రశ్నిస్తూ మానవీయ విలువలను ప్రతిపాదించిన నాటకం. 'అడుక్కోవడం కాదు – జీవితాన్ని ఆదుకోవడం నేర్చుకో' అన్న సందేశం ఇందులో కేంద్రబిందువు.*

***5. షరా మామూలే (1996)****పల్లేటి లక్ష్మీకులశేఖర్ మధ్యతరగతి జీవన విధానంపై రాసిన నాటిక 'షరామామూలే' మనిషి వయసుతో పాటు జీవన విధానాన్ని కూడా మార్చుకోవలసిన అవసరముందని రచయిత ఉద్దేశ్యం. నారాయణరావు రిటైర్డ్ ఉద్యోగి. కొడుకు ఉద్యోగం చేస్తుంటాడు. మనుమడు చదువుతుంటాడు. కోడలు గృహిణి. తనకు కావలసిన సమయానికి అన్నం పెట్టకుండా తనను చులకనగా చూస్తున్న దని, నారాయణరావు కోడలితో గొడవ పడుతుంటాడు. రోజు రోజుకూ ఈ గొడవ ఎక్కువ కావడంతో కొడుక్కు కూడా నారాయణరావు కంటకప్రాయంగా తయారవుతాడు. చివరకు పెద్దాయన్ను వృద్ధాశ్రమంలో చేర్చాలనుకొంటాడు. నారాయణరావు తన బాధనంతా స్నేహితుడైన మాధవరావుకు చెబుతాడు. ఆయన తప్పంతా నీదేనని నారాయణరావును మందలిస్తాడు. నాస్థానంలో నువ్వుంటే నీకు అర్థమవుతుందంటాడు నారాయణరావు. ఈ సారి నారాయణరావు స్థానంలో మాధవరావు కొనసాగుతాడు. కోడలి కష్టాల్ని చూచి సానుభూతి తెలుపుతాడు. నాకు అన్నం ఆలస్యమైనా పర్వాలేదు. కొడుక్కి మనవడికి ఇబ్బంది లేకుండా చూడమంటాడు. కొద్దికాలంలోనే మాధవరావు ఇంట్లో ముగ్గురి ప్రేమను చూరగొంటాడు. పెద్దాయన లేకుండా ఒక్క రోజైనా ఉండలేమనే స్థితికి వస్తారు. ఆయన వృద్ధాశ్రమం వెళతానంటే ససేమిరా ఒప్పుకోరు.*

*మధ్యతరగతి కుటుంబాల్లో వృద్ధుల సమస్యలను చిత్రించిన నాటకం. తరాల మధ్య మార్పు, పరస్పర అవగాహన అవసరాన్ని ఈ నాటకం బలంగా తెలియజేస్తుంది.*

***6. పిల్లికాదు మార్జాలం (2002)****అవినీతి, నిరుద్యోగం, తల్లిదండ్రుల ఆశలు–నిజాల మధ్య అంతరం వంటి అంశాలను గాఢంగా చిత్రించిన నాటకం.సామాజంలో వ్యాపించిన ద్వంద్వ నీతిని రచయిత విమర్శాత్మ కంగాచూపించారు.*

***7. అమృత కలశం (2010)****మనకు జన్మనిచ్చిన అమ్మానాన్నలను అనాథలను చేసి ఆశ్రమాలకు పంపొద్దని చెబుతూ పల్లేటి "అమృత కలశం' నాటికను రాశారు. అమ్మ ప్రేమను కేంద్రంగా చేసుకొని, వృద్ధాశ్రమాల సంస్కృతిపై ప్రశ్నలు వేసిన నాటకం. కుటుంబ విలువల పునర్మూల్యాంకనానికి దారి తీస్తుంది.*

***8. ఒంటిచేతి చప్పట్లు (2012)****ఆధునిక చదువుల్లో ఉన్న ఒత్తిడి, శ్రమ ఈ నాటకం ద్వారా వ్యక్తమవుతాయి. ఆదునికమైన మనల్లో పోటీతత్వం పెరిగి ఒకరికంటే ఒకరు ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలన్న దురాశ పెరిగి, తల్లిదండ్రులు పిల్లలమీద ఎక్కువ ఒత్తిడి చేస్తున్నారు. తల్లిదండ్రుల వైపునుంచి అనేక రకాల కోరికలు, అక్రమాలు, ఆలోచనలు ఉంటాయి. ఆధునికమైన చదువులు విద్యార్థులపై ఒత్తిడిని ఎంత పెంచుతున్నాయో అవగతమవుతుంది. అదే ఆధునికమైన చదువులే మానవీయ కోణాల్ని కూడా దెబ్బతీస్తున్నాయి. అన్నదమ్ములమధ్య సంబంధాలకు చిచ్చుపెడుతున్నాయి. వీనన్నిటికి ప్రధాన కారణం చదువు అంటే అవగాహన లేకపోవడమే. బిడ్డల*

మానసిక బలాన్ని సరిగ్గా అంచనా వేయలేకపోవడమే. ఈ రెండింటితో పాటు కార్పొరేట్ విద్యావ్యవస్థ, విద్యను వ్యాపారం చేసి, విద్యార్థులను, తల్లిదండ్రులను మభ్యపెట్టి, పాఠశాలలకు విభిన్న మైన పేర్లు పెట్టి, ప్రజలను మాయాజాలంలో పడవేయడమే. ఇలాంటి తల్లిదండ్రులలో ఆలోచనలను మార్పు చేయడానికి పల్లేటి రాసిన నాటికి ఒంటిచేతి చప్పట్లు.

ఆధునిక విద్యా వ్యవస్థలో విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడిని విశ్లేషించిన నాటకం. తల్లిదండ్రుల అతి ఆశల వల్ల పిల్లలు ఎదుర్కొనే మానసిక సంఘర్షణను స్పష్టంగా చూపిస్తుంది.

**భాషా శిల్పం – నాటకీయ నిర్మాణం** పల్లేటి నాటకాల భాష సరళమైన వ్యవహార భాష. రాయలసీమ యాస వినియోగం పాత్రలకు సహజత్వాన్ని ఇచ్చింది. పాటలు, సంభాషణలు, నేపథ్య గీతాలు నాటకీయతను పెంచాయి. ప్రతి నాటకం చివర స్పష్టమైన సామాజిక సందేశం ప్రతిధ్వనిస్తుంది.

**సామాజిక దృక్పథం – రచయిత ప్రత్యేకత**

- సమకాలీన సమస్యల ప్రతిబింబనం
- మానవీయ విలువల పునరుద్ధరణ
- సాధారణ మనిషి జీవితం కేంద్రంగా కథనం
- బోధాత్మకతకు లోనుకాకుండా సందేశప్రధానం

ఇవన్నీ పల్లేటి లక్ష్మీకులశేఖర్ నాటకాల ప్రత్యేక లక్షణాలు.

**ముగింపు :** పల్లేటి లక్ష్మీకులశేఖర్ గారి సాంఘిక నాటకాలు సమకాలీన తెలుగు సమాజాన్ని అర్థం చేసుకునేందుకు బలమైన సాహిత్య–సామాజిక ఆధారాలుగా నిలుస్తాయి. జీవితాన్ని నాటకంగా, నాటకాన్ని జీవితంగా అన్వయించుకున్న ఆయన దృక్పథం వల్లే ఈ నాటకాలు వినోదాన్ని మించి సామాజిక చైతన్యాన్ని రగిలించే శక్తిగా మారాయి. కులవ్యవస్థ, కుటుంబ విఘటన, నిరుద్యోగం, అవినీతి, వృద్ధుల నిర్లక్ష్యం, విద్యా ఒత్తిడి వంటి అనేక సమస్యలను వాస్తవికంగా ఆవిష్కరించి, సాధారణ మనిషి జీవితానుభవాలను నాటక కేంద్రంగా నిలిపారు. సరళమైన వ్యవహార భాష, రాయలసీమ యాస వినియోగం, సహజమైన పాత్ర చిత్రణ, స్పష్టమైన నాటకీయ నిర్మాణం ద్వారా ఆయన నాటకాలు ప్రేక్షకుడితో నేరుగా సంభాషిస్తాయి. బోధాత్మకతకు లోనుకాకుండా, ఆలోచనకు దారితీసే సామాజిక సందేశాన్ని ప్రతిధ్వనింపజేయడం ఆయన ప్రత్యేకత. ఈ విధంగా పల్లేటి లక్ష్మీకులశేఖర్ నాటకాలు సమాజంలోని లోపాలను ప్రశ్నిస్తూ, మానవీయ విలువల పునరుద్ధరణకు పిలుపునిచ్చే సాంఘిక ఆయుధాలుగా నిలుస్తాయి. అందువల్ల, పల్లేటి లక్ష్మీకులశేఖర్ సాంఘిక నాటకాలు తెలుగు నాటక సాహిత్యంలో ఒక విశిష్ట అధ్యాయంగా మాత్రమే కాకుండా, సమకాలీన సమాజాన్ని విశ్లేషించే పరిశోధనాత్మక దృష్టికి అమూల్యమైన సాహిత్య సంపదగా చిరస్థాయిగా నిలుస్తాయని ఈ అధ్యయనం నిర్ధారిస్తుంది.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

***ఆధార గ్రంథాలు***


*1. తపస్సు (సాంఘిక నాటికలు) – పల్లేటి లక్ష్మీ కులశేఖర్, ఆంధ్రప్రదేశ్ సంగీత–నాటక అకాడమీ ప్రచురణ.*

*2. పుత్రోత్సాహం – పల్లేటి లక్ష్మీ కులశేఖర, సవేరా ఆర్ట్స్ ప్రచురణ.*

*3. పుణ్యభూమి – పల్లేటి లక్ష్మీ కులశేఖర్, తెలుగు నాటక ప్రచురణ సంస్థ.*

*4. దిష్టి – పల్లేటి లక్ష్మీ కులశేఖర్, ఆంధ్రప్రదేశ్ సంగీత–నాటక అకాడమీ ప్రచురణ.*

*5. షరా మామూలే – పల్లేటి లక్ష్మీ కులశేఖర్, నాటక సమాహారం, హైదరాబాద్.*

*6. పిల్లికాదు మార్జాలం – పల్లేటి లక్ష్మీ కులశేఖర్, తెలుగు నాటక సాహిత్య ప్రచురణ.*

*7. అమృత కలశం – పల్లేటి లక్ష్మీ కులశేఖర్, తెలుగు నాటక సమాహారం.*

*8. ఒంటిచేతి చప్పట్లు– పల్లేటి లక్ష్మీ కులశేఖర్,*

*9. ఆత్రేయ – ఆత్రేయ నాటకాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.*

*10. ఆచార్య ఎన్. గోపి – తెలుగు నాటక వికాసం, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్.*

*11. డా. ముదిగొండ వీరభద్రయ్య – తెలుగు నాటక చరిత్ర, తెలుగు అకాడమీ, హైదరాబాద్.*

*12. డా. సి. నారాయణరెడ్డి – సాహిత్య సిద్ధాంతాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.*

*13. ఆంధ్రప్రదేశ్ సంగీత–నాటక అకాడమీ – నాటక వార్షిక పత్రికలు, నివేదికలు.*

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# ఆధునిక కథా సాహిత్యము - సామాజిక చైతన్యము

**జి. గిరి ప్రసాద్**
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప. చరవాణి : 7093733833
జిమెయిల్ : ggiriprasad1992@gmail.com

**పరిచయం :**

తెలుగు సాహిత్యంలో కథా ప్రక్రియకు విశేషమైన స్థానం ఉంది. ముఖ్యంగా ఆధునిక కాలంలో కథ అనేది కేవలం వినోద సాధనంగా కాక, సమాజాన్ని ప్రశ్నించే, చైతన్యాన్ని రగిలించే శక్తివంతమైన ఆయుధంగా మారింది. సామాజిక అసమానతలు, అణచివేత, పేదరికం, కుల వ్యవస్థ, లింగ వివక్ష, రాజకీయ మోసాలు, మానవ సంబంధాల పతనం వంటి అనేక సమస్యలను కథా సాహిత్యం స్పష్టంగా ప్రతిబింబించింది. ఈ నేపథ్యంలో 'ఆధునిక కథా సాహిత్యం - సామాజిక చైతన్యం' అనే అంశం విశ్లేషణకు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆధునిక కథలు సమాజంలో నిశ్శబ్దంగా కొనసాగుతున్న అన్యాయాలను వెలికి తీస్తూ, పాఠకుల్లో ఆలోచనలను, ప్రశ్నించే ధోరణిని పెంపొందించాయి. కథ ద్వారా రచయిత తన కాలపు సత్యాన్ని ప్రతిబింబిస్తూ, సమాజ మార్పుకు దోహదపడే భావజాలాన్ని నిర్మించాడు.

**సామాజిక చైతన్యం - అర్థం భావన :**

సామాజిక చైతన్యం అనగా సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమనిస్తూ, వాటిపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటం. అన్యాయానికి వ్యతిరేకంగా స్పందించే మనోభావమే సామాజిక చైతన్యం. ఇది వ్యక్తిని వ్యక్తిగత స్థాయి నుంచి సామూహిక బాధ్యత వైపు నడిపిస్తుంది. సాహిత్యం సామాజిక చైతన్యాన్ని పెంపొందించే ప్రధాన సాధనం. కథా సాహిత్యం ఈ విషయంలో మరింత ప్రభావ వంతమైనది. ఎందుకంటే కథలో పాత్రల జీవితం, వారి బాధలు, సంఘర్షణలు పాఠకుడిని నేరుగా తాకుతాయి. కథ చదువుతున్నప్పుడు పాఠకుడు ఆ పాత్రలలో తాదాత్మ్యం చెందుతూ, సమాజంలోని లోపాలను గుర్తించగలుగుతాడు.

**ఆధునిక కథా సాహిత్య ఆవిర్భావం :**తెలుగు కథా సాహిత్యంలో ఆధునికత 20వ శతాబ్ద ప్రారంభంలో స్పష్టంగా కనిపిస్తుంది. సామాజిక సంస్కరణ ఉద్యమాలు, జాతీయోద్యమ ప్రభావం, పాశ్చాత్య విద్య, ముద్రణా సాంకేతికత వంటివి ఆధునిక కథకు బలమిచ్చాయి. అప్పటివరకు ఉన్న సంప్రదాయ కథన శైలికి భిన్నంగా, నిజ జీవితాన్ని ప్రతిబింబించే కథలు రావడం ప్రారంభమయింది.

కథలు రాజకీయం, సమాజం, ఆర్థిక పరిస్థితులు, మానవ విలువలు వంటి అంశాలను కేంద్రంగా చేసుకున్నాయి. కథలోని నాయకుడు ఇక దేవతలాగా కాక, సాధారణ మనిషిగా, సమాజంలో జీవించే వ్యక్తిగా రూపుదిద్దుకున్నాడు.

**కుల వ్యవస్థ - కథలలో ప్రతిబింబం :**

ఆధునిక కథా సాహిత్యంలో కుల వ్యవస్థ పై వచ్చిన కథలు సామాజిక చైతన్యాన్ని బలంగా రగిలించాయి. అణగారిన వర్గాల బాధలు, అవమానాలు, హక్కుల కోసం చేసే పోరాటం కథల ద్వారా వెలుగులోకి వచ్చాయి. కులం కారణంగా ఎదురయ్యే అన్యాయాలను కథా కారులు నిస్సంకోచంగా చిత్రించారు.

ఈ కథలు పాఠకుడిని ఆలోచింపజేస్తూ, కుల వివక్ష మానవత్వానికి విరుద్ధమని చాటాయి. కుల వ్యవస్థను ప్రశ్నించడమే కాకుండా, సమానత్వం, మానవ గౌరవం వంటి విలువలను ప్రతిపాదించాయి.

**ఆర్థిక అసమానతలు - పేదరికం :**

పేదరికం ఆధునిక కథల్లో ప్రధాన అంశంగా నిలిచింది. గ్రామీణ జీవితంలో రైతుల దుస్థితి, పట్టణాల్లో కార్మికుల కష్టాలు, నిరుద్యోగ సమస్యలు కథలలో స్పష్టంగా ప్రతిఫలించాయి. ధనిక - పేద మధ్య అంతరం ఎలా మానవ సంబంధాలను దెబ్బతీస్తుందో కథా కారులు చూపించారు.

ఈ కథలు కేవలం కరుణను రేకెత్తించడమే కాకుండా, పేదరికానికి కారణమైన సామాజిక - ఆర్థిక వ్యవస్థలను విశ్లేషించాయి. దోపిడి వ్యవస్థలపై ప్రశ్నలు వేస్తూ, సామాజిక మార్పు అవసరాన్ని తెలియజేశాయి.

**మహిళా సమస్యలు – లింగ చైతన్యం :**ఆధునిక కథా సాహిత్యంలో మహిళా చైతన్యం ముఖ్యమైన మలుపు. మహిళలు ఎదుర్కొనే కుటుంబ, సమాజ పరమైన అణచివేతను కథలు నిస్సంకోచంగా చిత్రించాయి. వివాహ వ్యవస్థ, వరకట్నం, లైంగిక వివక్ష, స్వాతంత్ర్య లేమి వంటి అంశాలు కథల ద్వారా చర్చకు వచ్చాయి.

మహిళా పాత్రలు ఒక బలహీనంగా కాకుండా, ప్రశ్నించే, ఎదిరించే వ్యక్తిత్వాలతో కథల్లో దర్శనమిస్తాయి. ఇది పాఠకుల్లో లింగ సమానత్వం పై అవగాహన పెంపొందించింది.

**రాజకీయ చైతన్యం - కథల పాత్ర :**

రాజకీయ అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రజాస్వామ్య విలువల పతనం వంటి అంశాలు ఆధునిక కథల్లో ప్రధానంగా నిలిచాయి. రాజకీయ వ్యవస్థ సామాన్యుల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుందో కథలు స్పష్టంగా చూపించాయి.

ఈ కథలు ప్రజలను నిద్రలేపే పాత్ర పోషించాయి. ఓటు హక్కు, ప్రజా బాధ్యత, ప్రశ్నించే ధోరణి వంటి విలువలను బలపరిచాయి. కథ ఒక రాజకీయ పత్రికల కాకుండా, మానవ జీవితాన్ని కేంద్రంగా చేసుకొని రాజకీయ సత్యాన్ని వెల్లడించింది.

**ఆధునిక కథాశిల్పం - సామాజిక ప్రభావం :**

ఆధునిక కథల శిల్పం కూడా సామాజిక చైతన్యానికి అనుకూలంగా మారింది. సంక్షిప్తత, సహజమైన భాష, అంతర్ముఖ కథనం, ప్రతీకలు, వ్యంగం వంటి అంశాలు కథలను మరింత ప్రభావ వంతంగా చేశాయి. ఉపదేశాత్మకత తగ్గి, అనుభూతి ప్రధానంగా మారింది. ఈ శిల్పం పాఠకుడిని కథలో భాగస్వామిగా మార్చింది. కథ ముగిసిన తర్వాత కూడా ఆలోచన కొనసాగేటట్లు చేసింది.

**ముగింపు :**

ఆధునిక కథా సాహిత్యం సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలకపాత్ర పోషించింది. ఇది సమాజానికి అద్దంలా నిలిచి, లోపాలను చూపించింది. కులం, వర్గం, లింగం, రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ వంటి అనేక అంశాలను కథలు విశ్లేషించాయి.

కథ ఒక చిన్న ప్రక్రియ అయినప్పటికీ, దాని ప్రభావం విస్తృతమైనది. ఆధునిక కథలు పాఠకుడిని కేవలం వినోదం వైపు కాకుండా, బాధ్యతాయుతమైన పౌరుడిగా తీర్చిదిద్దాయి. అందువల్ల ఆధునిక కథా సాహిత్యం సామాజిక చైతన్యానికి మూలాధారంగా నిలిచిందని నిశ్చయంగా చెప్పవచ్చు.

**పాద సూచికలు :**

- సామాజిక చైతన్యం అనే భావన సమాజ శాస్త్రం మరియు సాహిత్య విమర్శల నుంచి రూపు దిద్దుకుంది.
- ఆధునిక కథా సాహిత్య వికాసం 20వ శతాబ్ద సామాజిక మార్పులతో అనుసంధానమై ఉంది.
- కుల, వర్గ, లింగ అంశాలు ఆధునిక కథల్లో కేంద్ర బిందువులుగా నిలిచాయి.
- కథా శిల్ప మార్పులు పాఠకుడి అనుభూతిని ప్రధానంగా నిలిపాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**


- ఆచార్య కె. రామకృష్ణ - తెలుగు కథా సాహిత్య వికాసం, 1998.
- వెల్చల కొండ రామారావు - ఆధునిక తెలుగు సాహిత్యం, 2005.
- కాత్యాయని విద్మహే – సాహిత్యం – సమాజం, 2012.
- ఎం.ఎం. వినోదిని - సాహిత్య విమర్శ దృక్పథాలు, 2016.
- కనకయ్య - కథా శిల్ప పరిణామం, 2001.
- వివిధ రచయితలు - సామాజిక మార్పు మరియు తెలుగు కథ, 2019.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథల విశిష్టత

**డాక్టర్ . అనిత మార్గరెట్ నేలటూరి**
M.A., M.PHIL., Ph.D.,
తెలుగు శాఖ అధ్యక్షులు, ఎస్. ఆర్. ఆర్ అండ్ సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), విజయవాడ,,
సెల్ . 8639728322.

ఆధునిక తెలుగు సాహిత్య ప్రక్రియలలో కథ విశిష్ట స్థానాన్ని పొందింది - గత వంద సంవత్సరాలుగా కథాసాహిత్యం తెలుగు భాషను పరిపుష్టం చేస్తూ తెలుగు పాఠకులతో ప్రయాణం చేస్తు వచ్చింది. కథ పుట్టుకను గమనిస్తే తల్లి తన ఒడిలోని బిడ్డను లాలించి మైమరిపిస్తూ చెప్పిన కథే మొదటిది. అంటే మనిషి భూమిపై ఉన్నప్పటి నుండి కథకూడా ఉందని చెప్పవచ్చు కన్న తల్లే మొదటి కథకురాలు. కథ ప్రాచీనమైనదేకాదు ఆధునికమైనది అంతేకాదు. నిత్యనూతనమైనది కూడా మనిషిలోని సహజసిద్ధమైన పరిశీలనా, కాల్పానిక శక్తితో చుట్టూ జరిగే సంఘటనలను ఎదుటి వారితో పంచుకునే సమయంలో ఉత్సుకత ఏర్పడి, వర్ణనలతో మనసును హత్తుకోనేలా వివరించినపుడు కథ పుడుతుంది. కథ మానవ జీవితాలలోని సంఘటనలను ప్రతిబింబిస్తుంది. సాధారణంగా కథా రచయితలు సమకాలిన సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులను తమ కథలలో పొందుపరచినపుడు అవి మానవ జీవితాలపై ప్రభావాన్ని చూపి చైతన్యవంతమైన మార్పుకు కారణమవుతాయి. కథ మానవ వికాసానికి విశాల దృక్పధం ఏర్పడడానికి కారణమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తక్కువ నిడివి , పరిమిత పాత్రలతో కథ ఉన్నప్పుడు పాఠకులను ఆకర్షిస్తుంది. సంక్షిప్తంగా ఉండే కథ కథానిక గా గుర్తింపు పొందింది. కథైనా, కథానికైనా భావాలను వ్యక్తపరచే సంపూర్ణత ప్రధానంగా కనిపిస్తుంది. తెలుగు భాషలో 1910 లో గురజాడ అప్పారావు రాసిన "దిద్దుబాటు ' మొదటి కథగా గుర్తించబడినది. దిద్దుబాటు సమకాలిన సమాజ మానవ స్థితికి అద్దం. పట్టినట్టుంటుంది. మానవ జీవితాలపట్ల గురజాడకు గల ముందు చూపును ప్రతిబింబిస్తుంది. అది మొదలుగా వేలాది మంది రచయితలు కథ అగ్రస్థానంలో ఉండటానికి తమ వంతు కృషి చేశారు ఆధునిక తెలుగు కథారచయితలలో తమదైన శైలితో, జీవితం పట్ల సొంత అవగాహనతో, సొంతముద్రతో, సామాజిక స్పృహతో కథలు రచించి అగ్రగణ్యులలో స్థానం సంపాదించినవారిలో శ్రీ పెద్దిభొట్ల సుబ్బరామయ్య విశిష్టవ్యక్తి. ఈయన 1938 డిసెంబర్ 15వ తేదీన జన్మించాడు. ఒంగోలులో ప్రాధమిక విద్యాభ్యాసాన్ని, విజయవాడ ఎస్. ఆర్. ఆర్ అండ్ సి.వి.ఆర్ కళాశాల విద్యార్థిగా, సుప్రసిద్ధకవి కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ శిష్యుడిగా కళాశాల విద్య పూర్తిచేశాడు. విజయవాడ లోని ఆంధ్ర లయోల కళాశాలలో అధ్యాపకునిగా 40 సంవత్సరాలు పని చేశాడు. మొత్తం 200 కథలు రాశాడు. 2012 లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు అందుకున్నాడు.

పెద్దిభొట్ల సుబ్బరామయ్య సమకాలీన రచయితలలో పేరెన్నికగన్నవాడు. ఆయన రచనలు అత్యదికముగా విషాదం మేళవించిన సామాన్య జీవనాన్ని ప్రతిబింబిస్తాయి. కొన్ని కథలు వాస్తవికతకు హారతి పట్టేవిగా ఉంటే, కొన్ని కథలు ఏ విధమైన నీతి లేక కాల్పానికతతో కూడుకొని ఉంటాయి. కథల్లో సమకాలీన సమాజంలో మధ్యతరగతి కుటుంబాలలో ఉండే ఆర్థిక ఇబ్బందులు, నిరుద్యోగము, ముసలివారు, వొంటరితనం ఇలా ఎన్నో అంశాలను స్పృశించారు. దేశస్వాతంత్ర్యానంతరం ఏర్పడిన స్తబ్ధత అన్నిరంగాలలో జారుతున్న నైతిక విలువలు, ప్రతివ్యక్తికి జీవితపరమార్ధం డబ్బు కావడం, వీటన్నిటికి తోడుగా సమాజంలో పెరుగుతున్న అవినీతి, పతనమైపోతున్న రాజకీయ విలువలు, ఇలాంటి విషయాలన్నిటిలో రచయిత ఆవేదన కనబడుతుంది అధికశాతం కథలు పాఠకుల హృధయులను కదిలించేవిగాను, సమజాంలో ఎవరూ పట్టించుకోని వ్యక్తుల పట్ల సానుభూతి కనిపిస్తుంది. కథానేపథ్యాలన్నీ 1950-60 దశాబ్దాల లో ఉన్నట్లుగా అనిపిస్తుంది.

1992-93 సంవత్సరంలో తెలుగు విశ్వ విద్యాలయం నుండి బహుమతి పొందిన పెద్దిభోట్ల సుబ్బరామయ్య ఉత్తమ కథల సంపుటిలో మొత్తం 30 కథలు ఉన్నాయి. అన్ని కథలు పేద, మధ్య తరగతి జీవితాలను స్పృశిస్తూ, నిరాశ, నిస్పృహల మధ్య కొట్టుమిట్టాడే కథలే. కొన్నింటికి విషాదకర ముగింపులు, ఇలా సగటు పాఠకులకు తమ చుట్టూ జరిగే సంఘటనలే కదా ఇవి అనిపిస్తాయి . ఒక దాని కొకటి పోలిక లేని కథలు కాబటి ఆసక్తి నెలకుంటుంది. కథల పేర్లు కూడా వైవిధ్యంగా కనిపిస్తాయి. పేరయ్య బావి, మిస్ భారతి బి.ఏ, వన్ వే ట్రాఫిక్, భయం, నీళ్ళు, మనసు రాళ్లూ-రత్నాలు, దగ్ధగీతం, కొలంద వేలు బొమ్మ, ఇరవై ఇదవ గంట, చుక్కమ్మ కథ, చిలిపితనం ఇలా దేనికదే భిన్నంగా కనిపిస్తాయి. వన్ వే ట్రాఫిక్ అనే కథలో కొడుకు, కోడలి సంరక్షణలో చిక్కుకున్న ముసలివాని కథ. ఏం తినాలన్నా, ఏది తాగాలన్నా, బయటకు వెళ్ళాలన్నా కొడుకు, కోడలి అనుమతి తప్పనిసరి, పక్కింటబ్బాయి సినిమాకు వెళ్దామంటే ఇంట్లోవాళ్ళను బ్రతిమాలి, బుజ్జగించి వెళ్ళవలసి వస్తుంది. తీరా ఆ సినిమా ఫుల్లయిపోయి ప్రక్కనున్న డొక్కు థియేటర్ లో పాత సినిమాకి వెళ్లారు . అది ఈయనకు నచ్చుతుందిగాని, అందరూ తిట్టుకుంటూవుంటారు. ఆ నటనని కూడా వచ్చిన పిల్లవాడు పదేపదే విమర్శిస్తున్నాడు. రిక్షాలో ఇంటికి తిరిగి వెళ్ళే సమయంలో వచ్చిన దారిలో వెళ్ళడంలేదేమి టని ప్రశ్నిస్తాడు ముసలాయన. అప్పుడా పిల్లవాడు ఇది. వన్ వే ట్రాఫిక్, ముందుకే గాని వెనక్కు వెళ్ళకూడ దంటాడు. ఆ ముసలాయన నిజమేకదా జీవితం కూడా అంతే, ఎన్ని ఆశలున్నా, కోరికలున్నా అవి ఆ వయస్సులోనే తీరాలి. వయస్సు మళ్ళిన తర్వాత మనస్సుకు నచ్చిన పనులేమి చెయ్యలేము వ్యక్తిగత స్వేచ్ఛ ఉండదు. జీవితం ప్రతిదశలో బంధాలతో బందీ అయిపోతాము . వన్ వే ట్రాఫిక్ లా ఒకవైపు కే నడవాలి, వెనక్కు, వెళ్ళటానికి, అటు ఇటు మళ్ళడానికి అవకాశం లేదు అని ఈ కథ కొనసాగుతుంది.

'పేరయ్య బావి' అనే కథలో పేరయ్య తన జీవితంలో సంతోషమంతా ఆవిరై కన్నీరే ఇంకిపోయిన పరిస్థితిలో చుక్క నీరు దొరకని తన పూరికి బావి తవించి జలధారలు ఉబికి వచ్చేలా చెయ్యడం మనిషిగా నలుగురికి ఉపయోగ పడాలనే సందేశాన్నిస్తుంది. 'చుక్కమ్మ' కథలో స్త్రీ' తననందరు మోసగించినా, స్త్రీ సహజగుణమైన ఆదుకునే గుణం ఆపదు. 'చిలిపి తనం' కథలో అందరినీ తన అబద్ధాలతో ఏడిపించే భారతి ఒక చిన్న పిల్ల అబద్ధం తో మోసపోవడం చూస్తే తాడిని తన్నే వాడుంటే తలను తన్నేవాడు ఉంటాడు అనే సామెత గుర్తుకు రాక మానదు. 'కొళందవేలు బొమ్మ' కథ రెక్కలు ముక్కలయేలా కష్టపడి సంపాదించుకున్న సంపాదనను తాగుబోతు పోలీస్ ఎలా తన్నుకు పోయాడో వివరించాడు కవి. నిర్భాగ్యులకే కష్టాలన్నీ అనిపించేతీగా ఈ కథ కొనసాగుతుంది. 'మిస్ భారతి బి.ఏ' కథ లో మనుష్యుల పట్ల విశ్వసనీయత "నమ్మకం లేని వ్యక్తిగా భారతి పాత్ర కనిపిస్తుంది. పెళ్ళి ఎంతకు అవ్వడం లేదని అందరికి దూరంగా, కుచించుకుపోయిన మనస్తత్వంతో ఒంటరి అయిపోవడం, తన అబద్ధాలతో ఇంకా క్లిష్టమైన పరిస్థితులలోకి వెళ్ళడం గమనించవచ్చు.

భయం' కథలో' తల్లిదండ్రుల అతి దండన పిల్లలలో భయం ఏర్పడడానికి, పిల్లలు పిరికిగా మారడానికి కారణం అవుతుంది అనే విషయాన్ని తెలియజేస్తుంది. తల్లిదండ్రుల కోపవేశాలు పిల్లలపై చూపడం వారికి సంతోషం వచ్చినా పిల్లలపై ప్రదర్శించడం చూస్తే అవి పిల్ల మనస్తత్వాల పై వత్తిడితో కూడిన ప్రభావాన్ని చూపుతుంది అనిపిస్తుంది "నీళ్ళు" కథలో జోగినాధం నీళ్ళను అతిగా ప్రేమించి, నీరే సర్వస్వమనుకొని చివరకు ఆ నీటి లోనే మరణించడం హృదయవిధారకంగా అనిపిస్తుంది. 'రాళ్ళు - రత్నాలు' కథలో డబ్బున్న వారిక గౌరవం సమజంలో అని తెలియజేస్తుంది. శ్రీదేవి కుమారస్వామి దంపతులు, పేద కుటుంబం వారిది. బంధువుల పెళ్ళికి వెళతారు. అక్కడ గౌరవాలు, విలువలు అన్ని ధనవంతులకే గాని, తమలాంటి నిరుపేదలకు కాదని గుర్తిస్తారు. తన భర్తకు ఇవ్వని గౌరవం తనకు అక్కరలేదు అని శ్రీదేవి భర్తతో కలసి వచ్చేస్తుంది. భర్త కష్టాన్ని, నిజాయితీని పూర్తిగా అర్థం చేసుకున్న భార్య పాత్ర శ్రీదేవిది.

"మనసు" కథలో జీవితంలో హుందాగా గడిపి రిటైర్డ్ అయిన వ్యక్తి గాధ. అన్ని పద్ధతిగా ఉండాలి, అని పురుషధోరణిలో అనుకోవడమేగాని, పద్దతిగా ఉండడానికి స్త్రీలెంత అవసరమో ఈ కథ వివరిస్తుంది. భార్య ఊరు వెళితే మనవళ్ళు ఇంటిని రణరంగంగా మార్చడం, ఈ వ్యక్తి వాళ్ళను సమధాయించలేక సతమతమవ్వడం కనిపిస్తుంది "కోరిక' కథలో ఒక పేద నానమ్మ కోరిక తీర్చడానికి మనవడు పడే తాపత్రయం కనిపిస్తుంది. తన తాత బ్రతికి ఉన్నపుడు సినిమాలో నటించాడని మనవడికి చెప్తే వాడు ఆ పాత సినిమా ఆ ఉరికి వచ్చినపుడు కష్టపడి చాల్లర పోగు చేసి నాన్నమ్మను సినిమాకి తీసుకొని వెళ్ళడం, తీర వాడి తాత నటించిన సన్నివేశం వచ్చే సమయానికి ఆ పాత రీలు తగలపడి పోవడం, బీదల కోరికలు తిరేవి కాదు తీరని కోరికలే అవి అనిపిస్తుంది.

ఈ రీతిగా కొనసాగిన పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు పాఠకుల హృదయాలలో స్థిరంగా నిలిచిపోయేలా ఉంటాయి. పాత్రల ఎంపిక సన్నివేశాని నడిపే తీరు ఉత్కంటను నెలకొల్పుతుంది. మానవ సంబందాల లోని సునితత్వం, బంధాల పై నమ్మకాన్ని పెంచే రీతిగా కథ కొనసాగుతుంది, మన చుట్టూ జరిగే సంఘటనలు, మనం నిత్యం చుస్తువుండే పాత్రలు మనం కూడా వారి మద్యలో వున్నామా అనిపిస్తుంది. సరళమైన బాష కధనాని నెమ్మదిగా నడుపుతూ మనసులలో స్థిరపరుస్తూ వుంటుంది, కేవలం కల్పితాల వలే కాక జన జీవనములో నిత్యము చుట్టూ జరిగే సన్నివేశాలు వలే సహజ సిద్ధంగా ఉండడం వల్లనే పెద్దిభొట్ల సుబ్బరామయ్య ను అవార్డులు వరించాయి అనడంలో ఎటువంటి సందేహం లేదు.

**<u>ఆధార గ్రంధాలు.</u>**

1. తెలుగు సాహిత్య చరిత్ర ---- డా. ద్వా.నా. శాస్త్రి.
2. తెలుగు సాహిత్య సమీక్ష ---- డా. జి. నాగయ్య.
3. సాహితి సురభి --- సంకలనం డా. బూసి వెంకట స్వామి.
4. పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు ---- పెద్దిభొట్ల సుబ్బరామయ్య.
5. హిం తెలుగు కథ సాహిత్యం - వైశిష్ట్యమ్ --- జాతీయ సదస్సు.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# 'పేరడీ పిత' జరుక్

**డా. జె. సీతాపతి రావు,**
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు
ఏలూరు జిల్లా, సంచారవాణి: 9951171299,
విద్యుల్లేఖ: seethuphd@gmail.com

**వ్యాస సంగ్రహం**: పేరడీ ఆధునిక ప్రక్రియగా రూపు దిద్దుకోవడం. దానికి జరుక్ శాస్త్రి భూమిక, మూలంలో ఉన్న అంశాల్ని విభిన్నంగా చెప్పడం. మాచిరాజు దేవిశ్రీ ప్రసాదు, జొన్నవిత్తుల, డైలాగ్స్ లో కూడా పేరడీను సృష్టించడం. ఆధునిక వినోద ప్రక్రియగా పేరడీ ఎదగడం.

**Key words**: పేరడీ, వ్యంగ్య అధిక్షేపణ. శ్రీశ్రీ మహాప్రస్థానం పేరడీ. జరుక్ శాస్త్రి పాండిత్యం. మూలంలో ఉన్న కవిత్వ అంశాన్ని లేదా విషయాన్ని చూపెటపుడు పేరడీ చేసే వారికి ఉన్న పాండిత్యం, తీసుకునే తీరు.

1. **ఉపోద్ఘాతం**: పేరడీ అనగా గుర్తుకు రాదగిన పేరు జరుక్ శాస్త్రి అనే జలసూత్రం రుక్మిణీనాధశాస్త్రి. వీరు చాలా కలం పేర్లు పెట్టుకున్నారు. వాటిలో కొన్ని తమాషావి: జయంతి కుమారస్వామి, వెల్లటూరి సోమనాధం, చలికాలం మార్తాండరావు; సరదాగా రుక్కాయి, జలాలుద్దీన్ రూమీ, రుక్కుటేశ్వరుడు మొదలైనవి కొన్ని . ఇదో ముచ్చట ఇతనికి. వీరు 1914 సెప్టెంబరు 7న జన్మించారు.
2. **పేరడీ లక్షణం**: మూలంలోని అపహాస్యం చేయదగ్గ ఒక గుణాన్ని వెతికి పట్టుకుని, దాన్ని ఉత్ప్రేక్షించి, పాఠకుడికి ఒరిజినల్ ను గుర్తుచేసేలా రాయగలగాలి. ఏ కవిని, రచయితని అనుకరించినా వారిని ఉటంకించి లేదా గుర్తు చేసేలా వారి కవిత్వాన్ని అనుకరించి హాస్యాన్ని పండించడమే పేరడీ.

పేరడీ అంటే వికటానుకరణం. కందుకూరి వీరేశలింగం రాసిన అభాగ్యోపాఖ్యానం ప్రబంధాలకు పేరడీ. శబ్దశక్తి రహస్యాన్ని పట్టుకొని దానిలో అసలు రచయిత చెప్పిన దానికి భిన్నంగా హాస్యాన్ని జోడించి చెప్పడం, వెటకారం, వెక్కిరింపులు లాంటివి షరా మామూలే. వీటన్నిటిని జోడించడం అంత సులభం కాదు.

ఈతి బాధలు, కష్టాలు, నష్టాలు, కన్నీళ్లు లాంటి వాటిని మరచిపోయి ఆనందంగా నవ్వుకోడానికి ఒక సాహిత్యపు టానిక్ పేరడీ. పేరడీ అనుకరణ నుంచి పుట్టినా మూలాన్ని బతికింప జేస్తుంది.

3. **సాహిత్యంలో పేరడీ:** ప్రాచీన తెలుగు సాహిత్యంలో కొన్ని చోట్ల పేరడీ కనిపిస్తుంది. ఆధునిక సాహిత్యంలో మొక్కపాటి, చిలకమర్తి , పానుగంటి, భమిడి పాటి వంటి రచయితలు బాగా సున్నితమైన హాస్యం పండించిన రచయితలు. సమకాలీన కవుల (శ్రీ శ్రీ లాంటి విప్లవ కవి సాహిత్యానికి కూడా)రచనలకు పేరడీలు రాసి మెప్పు పొందారు జరుక్. ఒక ప్రక్రియగా రూపొందడానికి తగిన విధంగా పేరడీని తీసుకు వచ్చారు జరుక్ శాస్త్రి.

Parodia అనే గ్రీకు పదంనుంచి పేరడీ పుట్టింది. A parody is a creative work designed to imitate, comment on, and/or mock its subject by means of satirical or ironic imitation.-వికీపీడియా[1]. పేరడీ వ్యంగ్య/ వ్యంగ్య అనుకరణ ద్వారా దాని విషయాన్ని అనుకరించడమో, వ్యాఖ్యానించడమో; ఎగతాళి చేయడానికో చేసే సృజనరచన.

4. **సాహిత్య ప్రక్రియగా పేరడీ:** అనుకరణలో భాగంగా శైలి, పదాలు, భావాలు, రూపం, వ్యక్తీకరణం, భాష, భావగమనం, పదబంధాలు మొదలైన వాటిని మూలంతో క్షుణ్ణంగా పరిశీలించి చేయాలి. మూల రచన గంభీరతను, అసలు అర్థాన్ని మార్చడం, నవ్వు పుట్టించేలా చేయడం లేదా పునరుక్తులు, అతిశయోక్తులు కలపడం, అవహేళన లాంటివి చేస్తూ నవ్వును, ఆలోచనల్ని పుట్టించడం దీని ప్రయోజనంగా ఒక సాహిత్య ప్రక్రియగా మారింది.
5. **సాధారణంగా పేరడీ:** మూలంలో ఉన్న కొన్ని అక్షరాలు, చిన్న చిన్న మార్పుల్ని చేసినా, మధ్య space ఇవ్వకపోయినా పేరడీ పుట్టొచ్చు. 'కలప డిపో'. దీనికి కలపడిపో అని ఆ బోర్డు మీద రాస్తే చూసే వాళ్ళు ఆ ఒనర్ తో వచ్చి కలపడిపోతారు. విరుపుల వల్ల కూడా పేరడీ->' రవిగానని చోట కవిగాంచునే' దీనికి 'రవిక' అనని చోట కవిగాంచునే? అనడం శృంగార రస భూమికగా మారిపోతుంది.
6. **శ్రీశ్రీ కవిత్వాన్ని పేరడీగా**

6.1. శ్రీశ్రీ "శ్రీశ్రీ జయభేరి

నేను సైతం/ ప్రపంచాగ్నికి/ సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!/ నేను సైతం/ విశ్వసృష్టికి/ అశ్రువొక్కటి ధారపోశాను" అంటూ పేరడీ....

కణ కణ లాడే నిప్పులాంటి కవితకు జరుక్ శాస్త్రి రాసిన పేరడీ;

నేను సైతం కిళ్ళీకొట్లో పాతబాకీ లెగర గొట్టాను

నేను సైతం జనాభాలో సంఖ్య నొక్కటి వృద్ధి చేశాను.

"ఏ దేశ చరిత్ర చూసినా ఏముంది గర్వకారణం"అనే శ్రీ శ్రీ కవితకు పేరడీ;

[1] https://en.wikipedia.org/wiki/Parody

ఏ కాకి చరిత్ర చూచిన ఏమున్నది గర్వకారణం/ప్రపంచ మొక సర్కస్ డేరా (ప్రపంచమొక పద్మవ్యూహం) కవిత్వమొక వర్కర్ బూరా (కవిత్వమొక తీరని దాహం)/ఫిరదౌసి వ్రాసేటప్పుడు తగలేసిన బిడిలెన్నీ... మొదలైనవి.

6.2. శ్రీశ్రీ దేశ చరిత్రలు కవిత :

తాజ్ మహల్ నిర్మాణానికి/ రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?

పేరడీ:

పిరదౌసీ వ్రాసేటప్పుడు/ తగలేసిన బీడీలెన్నో

6.3. శ్రీశ్రీ నవకవితకు –సరదాపాట పేరుతో కవితా ఖండిక రాస్తే అందులో విప్లవ సంకేతమైన రంగులు తీసుకుంటే దానికి దీటుగా మాగాయి ఎరుపు రంగును స్వీకరించాడు. నడక అలానే కొనసాగించారు: మాగాయి కందిపచ్చడి/ ఆవకాయి పెసరప్పడం... అని పేరడీ రాశారు.

6.4. అద్వైతం

"ఆనందం అర్ణవమైతే/ అనురాగం అంబరమైతే/ అనురాగపుటంచులు చూస్తాం
ఆనందపు లోతులు తీస్తాం"
"వాసంత సమీరం నీవై/ హేమంత తుషారం నేనై
హసనానికి రాణివినీవై/ వ్యసనానికి బానిసనేనై"

దానికి పేరడీ – విశిష్టాద్వైతం పేరుతో:

"ఆనందం అంబరమైతే/ అనురాగం బంభరమైతే
అనురాగం రెక్కలు చూస్తాం/ ఆనందం ముక్కలు చేస్తాం
C, a, t - కేటువి నీవై/ R, a, t - రేటుని నేనై
రాతగ్గ కవిత్వం వీవై/ పోతగ్గ ప్రభుత్వం నేనై"(పుట :123)

**7. మల్లవరపు విశ్వేశ్వరరావుగారి 'శంఖానాదం' పేరడీగా**

పలికింది పలికింది పరపార వరతీర/ పర్జన్య దుర్జేయ వాజ్రేయ శంఖం
పరిభూత నరపుంఖ పునరుద్యమాంకం, చిరనిరాతంకం/ శంఖం శంఖం పలికింది పలికింది

దానికి పేరడీ - కణ్ + కణ్/ పలికింది శంఖం పలికింది ఖంఖం/ పరపార వరతీర పర్జన్య గర్జన్య
దుర్జన్య వజ్రేయ వాజ్రేయ శంఖం/ పలికింది శంఖం
పలికింది పలికింది పలికింది పలికింది...../ కర్జన్య ఖర్జన్య గర్జన్య శంఖం
చర్జన్య ఛర్జన్య జర్జన్య శంఖం/ ఝర్జన్య శంఖం

**8. దేవులపల్లి కృష్ణశాస్త్రి కవిత్వాన్ని పేరడీ గా**

8.1. ఉదా: 1. దేవులపల్లి కృష్ణశాస్త్రి "కాలమే..." కవితలో(ఊర్వశి) " తొలి వియోగిని నేనె/ తొలి ప్రేయసిని నేనె/ ఆనాటి కీనాటి/ కేను నీ దాననే" అంటూ అలౌకిక ఆనందా రస స్వరూపిణి అయిన స్త్రీని, ప్రకృతి పరాశక్తి, మహాయోగిగా విశ్వప్రేయసిగా చిత్రి స్తే.

పేరడీ "తులసి మొక్కను నేనె/ తురక వేపను నేనె/ ఆ నాటికీ నాటి/ కేను మృత్కణమేను" యోగి పవిత్రకు చిహ్నంగా తులసి మొక్క, ప్రేయసికి తురక వేప ఊహాసుందరికి మృతకణం(మట్టిగడ్డ)ని తీసుకొని వెక్కిరించడంలో పేరడీ కనిపిస్తోంది.

8.2. ఉదా: 2. "సౌరభములేల చిమ్ము పుష్పవ్రజంబు? చంద్రికలనేల వెదజల్లు చందమామ? ఏల సలిలంబు పారు.." అంటూ కృష్ణపక్షంలో కృష్ణ శాస్త్రి అంతే ధీటుగా జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు[2] సహజ ధర్మాలను పేరడీ లో తీసుకుని రాయడం విశేషం.

జఠర రసమేల స్రవియించు జఠరగ్రంధి?
అడవిలో యేల నివసించు నడవి పంది?
ఎలా పిచ్చికుక్క కరచు? కాకేల యరచు?
ఎలా తలమీద వెండ్రుకల్నిన్ని మొలచు? ఇలా హేళనాత్మకంగా అన్ని ఉపమానాలు ఉదాహరణలు సహజత్వాన్ని చెప్పడం గమనించవచ్చు.

9. **ముద్రణా దోషాల్ని పేరడీగా:** సాధారణంగా ప్రింటింగ్ లో చాలా తప్పులు దొర్లుతుంటాయి. దానికి "కవితా గండాలు" అనే పేరుతో ఒక పేరడీ:

పుచ్చు పప్పులు / మార్జాల కపి
చలం కలం చూసి శంకరుడికి వంకరొచ్చిందా
రుక్మిణి రుక్మిణికి శ్రీశ్రీ మిశ్రి పొందేమందా?
కాక? ఈకల్నిమ్చెగా లోకలు! (జరుక్ శాస్త్రి పేరడీలు పుట: 77) పుచ్చు తప్పులు అనే మాటలు పుచ్చు పప్పులుగా మార్చాడు. శంకరుడికి నెత్తిమీద నెలవంక వంకరరావడంగా చెప్పడం.

10. **వ్యవహారం, కథల్లో పేరడీ తీరు:** కరుణశ్రీ గారింటికి జరుక్ వెళ్లారట. అక్కడ కూర్చోండి అని ఆహ్వానించారు కరుణశ్రీ, శబ్దం చేయకండి అని సూచించారట. ఏం జరిగింది అని అడిగితే కరుణశ్రీ కిడ్నాప్ అన్నారట. అంటే కిడ్ పిల్లాడు. నేప్ అంటే కునుకు తీయడం...

10.1. "అలతల వల" అనే కథలో బాబుకు ఐదో ఏడు. వాడి మాటల్ని పట్టుకొని వీరుడు అంటే ఎవరో విభిన్నంగా చెప్పడం కనిపిస్తోంది: 'కత్తి పుచ్చుకుని కదన కుతూహల రాగం రైట్ లెఫ్ట్ చిందుల్లో రంగరిస్తూ యుద్ధ రంగానికి పోయిన మగాడు. కాటుక పెట్టుకున్న కన్నె-

[2] ఆంధ్రజ్యోతి వార పత్రిక 8-4-1983

కన్ను. కత్తి చేపట్టినవాడే గండడు. శత్రువును హతహతం చేసినవాడే వీరుడు. ఆ మాట కొస్తే ఎదిరించిన వాడి డొక్క బద్దల్ చేసి రాకపోయినా- రంగానికంటూ బయలు దేరినవాడూ వీరుడే. యింకా పారజూస్తే కాలూ చెయ్యీ విరగ్గొంటుకుంటేనేం; కన్నులొట్టబోతేనేం తీరా అక్కడికి పోయీ హరీ అంటూ ప్రాణాలు విడిస్తేనేం పనిలోకి వెళ్ళిన వాడల్లా వీరుడే. కత్తి పుచ్చుకోకపోయినా- గరిటెను గాండీవంలాగు పుచ్చుకున్న వాడో ? వీరుడే' (అలతల వల కథ పుట: 2) వీరుడి- శృంగారం, వీరత్వం, అవయవాలు పోగొట్టుకోవడం, వంటవాడు, ప్రాణాలు పోయినవాడు... అంటూనే చిన్నపిల్లాడు తన చిలిపి అల్లరి వల్ల వీరుణ్ణి చేస్తూనే ఉంటాడు అంటూ పేరడీలో చెప్పడం హాస్యం.

10.2. **అక్షింతలు** కవితలో "ప్రతారాకాశమున పరంజ్యోతి ఒకటి (శ్రీశ్రీ)/ కరిగి ఆమని జల్లుగా పరిణమించె(విద్వాన్ విశ్వం)

ప్రేమ నవ్యోదయ రహస్య వేళలందు(అబ్బూరి)/ గౌతమీ నది నిద్రలో కలవరించె(సహదేవ)... (జరుక్ శాస్త్రి పేరడీలు పుట: 65)

చాలామంది కవులు వచ్చేలా ఒక కొత్త ప్రయోగాన్ని చూపించడం ఇతడి పాండిత్యానికి మచ్చుతునక. ఒక్కొక్క కవిది ఒక్కో పాదంగా కాకి గూడులా కవిత్వాన్ని చెప్పడం విశేషం.

**11. ప్రార్థన లో పేరడీ:**

"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే" అనేది ఒక శక్తివంతమైన రామ మంత్రం. "రామా, రామా, రామా అని నేను మంత్రం జపిస్తున్నాను, నా మనస్సును ఆహ్లాదపరిచే రాముడిలో నేను ఆనందాన్ని కనుగొంటాను" అని. ఈ శ్లోకాన్ని మూడుసార్లు జపిస్తే విష్ణు సహస్రనామం/ శివ సహస్రనామ పారాయణ చేసినంత ఫలం లభిస్తుందని పురాణాల ఘోష. ఈ స్తోత్రమంత్రాన్ని పేరడీ గా "కొక్కిరాయి" పేరుతో "శ్రీరామ రామ రామ/ కోదండ రామ పాహి/ శ్రీరామ రామ రామ కోదండ రామ పాహి...మనతప్పు లొప్పుకుందాం/మన తప్పు దిద్దుకుందాం/ శ్రీరామ రామ రామ కోదండ రామ" (జరుక్ శాస్త్రి పేరడీలు పుట: 30) అంటూ దైవాన్ని ప్రార్థించేలా ఉన్న దాన్ని అందరి కవులు, వారి ప్రయోగాలు, త్రిపిటక గేయాలు, దండాలు పెట్టేవారు... ఇలా అందరి గురించి రాయడం గమనించదగింది.

**12. సుబ్బారావు రచనకు పేరడీగా:** పేరడీ ఒక రూప(form) ప్రక్రియ కాదు. వస్తువును నిర్వహించే పద్ధతిలో పేరడీ కనిపిస్తుంది. పేరడీలను డా. వెలదండనిత్యానందరావు 10 రకాలుగా వర్గీకరించారు[3]. ఇవన్నీ ఒక కవిలో ఉండాలన్న నియమం లేదు. సౌభద్రుని ప్రణయ యాత్ర నాయని సుబ్బారావు రచన.

---

[3] తెలుగు సాహిత్యంలో పేరడీ(పుట: 37)

"అసురకృత్యము" ఖండికలో
"ఎవ్వడే నీ గళమ్ముననందిరవు కొనగ/నేను విసరిన ప్రేమ ప్రసూన మాల
మదుమ , నీవు చూడగ బట్టి నలిపివై చి/ నీ కనులయందు నెత్తురుల్ నింపినాడు ?... "
దీనికి పేరడీగా" ఎవ్వడే వీడు మాట సొం పేమరిలక/ పూలతేనల వాకలు పోగుచేసి (జరుక్ శాస్త్రి పేరడీలు, పుట: 129)
నిజంగానే నిఖిల లోకం/ నిండు హర్షం వహిస్తుందా
మానవాళికి నిజంగానే/మంచి కాలం రహిస్తుందా!''
అంటూ మంచిరోజులు వస్తాయా అని శ్రీశ్రీ ఆవేదన.

**13. మాచిరాజు దేవీప్రసాదు**

దేవి ప్రసాద్ గారు మద్రాసులో విద్యార్థిగా ఉన్నప్పుడు అరవవాళ్లు నడిపే మెస్‌లో భోజనం. తెలుగు భోజనం లేదు. తెలుగువాళ్ల కోసం 'ఆంధ్రామెస్' వస్తే బాగుణ్ణు అనే ఆలోచనలు. అపుడే మద్రాసులో 'ఆంధ్రామెస్' తెరిచారట. శ్రీశ్రీ 'నిజంగానే' కవిత గుర్తొచ్చింది. దానికి పేరడీ గా 'ఆంధ్రామెస్' అని రాశాడు. ''నిజంగానే నిఖిల ఆంధ్రం / నిండు హర్షం వస్తుందా / భోజనానికి నిజంగానే / భోగకాలం రహిస్తుందా! / నిజంగానే నిజంగానే / నిఖిల ఆంధ్రం హర్షిస్తుందా / తినకముందే మొహం మొత్తే / మొహన్‌దాల్ నశిస్తుందా!''- అన్ని చేశాడు.
'సాంబారులో స్నానిస్తున్న ఇడ్లీ సుందరి' అని జరుక్ శాస్త్రి అంటే, 'ప్రక్కన పెట్టిన రోలర్ కాదోయ్/దానిని గుద్దిన బండ్లెన్నీ' అని మాచిరాజు అన్నారు.

**14. సంస్కృతంలో పేరడీ:**

భోజనప్రియులైన కొంతమంది పేరడీ కవులు వేదం లోని చమకాన్ని ' ఇడ్లీ చ మే ఉప్మా చ మే పూరీ చ మే చట్నీ చ మే చపాతీ చ మే'
అని అనుకరించారు. ఇక లౌకికసాహిత్యం తీసుకుందాం. భగవద్గీ త కు సంబంధించిన కర్మయోగం లో ఒక శ్లోకం ఉంది.
సంస్కృతంలో పేరడీలు:
"సన్యాస: కర్మయోగశ్చ నిశ్రేయసకరావుభౌ/ తయోశ్చ కర్మసన్యాసాత్కర్మయోగో విశిష్యతే "
కర్మలను విడిచిపెట్టడం సన్యాసం. ఎలాంటి ఫలితాలను ఆశించకుండా చేసే పని కర్మయోగం. మోక్షం పొందడానికి రెండు మార్గాలూ మంచివే. రెండోది చాల మంచిది. దీన్ని అనుకరిస్తూ టీని తాగడం ఇష్టం ఉన్నవారు, ప్రతిభావంతుడైన హాస్య కవి 'టీ' ని ఇలా వర్ణిస్తూన్నాడు:
"కాఫీపానం చ టీపానం నిశ్రేయసకరే ఉభే/ కాఫీటీపానయోర్మధ్యే టీపానం విశి ష్యతే "

కాఫీ, టీలను త్రాగడం ఆరోగ్య కరమే. కాని కాఫీ ' కన్న 'టీ' మరింత ఆరోగ్యకరం. 'కాఫీ', 'టీ' ఈరెండూ ఉత్తేజాన్ని ఉల్లాసాన్ని కల్గిస్తాయి. ఎలాంటి అనుమానం లేదు.

**15. అంతర్జాలంలో పేరడీలు:**

**15.1 యూట్యూబ్ లో**

https://www.youtube.com/watch?v=YtOO8CEgIhA&list=RDYtOO8CEgIhA&start_radio=1
లో "ఓ పంగా కాళ్ళదాన" పేరుతో జానపద శైలిలో వీడియో పెట్టారు. ఓ పంగా కాళ్ళ దాన వంగలేనిదానా, అంటూ నాకు బంగ్లాలు లేవు అంటూ.. నన్ను లవ్ చేసి నా కొవ్వు తియ్యమనడం, కాలు, ఒక చేయి లేకపోయినా అందంగా ఉంటుందట. పిల్లి కళ్ళదిహాస్యాన్ని పండిస్తారు.

ఇలాంటిదే
https://www.youtube.com/watch?v=CfdqH2yDeOk&list=RD9gs4KCVgjIY&index=3 ఈ వీడియోలో "లొట్టా చంపలదానా లోతు కళ్ళదానా ఎక్కడకైనా పోదామే ఎంకమ్మ..." ముంగిస ముక్కు, అంటూ తనేమో గుడ్డి ఏనుగు అంటూ ఇద్దరినీ వర్ణిస్తూ హాస్యాన్ని సృష్టించడం చూడొచ్చు.

**15.2. రీల్స్ లో పేరడీ:**

"ముస్తాఫా ముస్తాఫా ..." స్నేహం, ఐక్యత గురించి చెప్పే ప్రఖ్యాత తెలుగు ప్రేమ దేశం సినిమా పాట పేరు, ఇది A.R. రెహమాన్ స్వరపరిచారు. "ఎంచుకున్న, ఇష్టపడిన" అని అర్థం.
https://www.youtube.com/shorts/jhQzAjL7cDc పండిస్తుంది.

ఈ లింక్ లో ప్రభాస్ హీరో గా నటించిన "బాహుబలి" (2015) కథను తీసుకుని "కట్టప్పా కట్టప్పా ఎంటిది కట్టప్పా, బాహుబలిని చంపావేంటబ్బా... అంటూ రీల్స్ లో జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు పేరడీగా పాడటం గమనించాలి.

"వాలుకనుల దానా..." (ప్రేమికుల రోజు) 1999 లో కదీర్ దర్శకత్వంలో వచ్చిన తమిళ అనువాద చిత్రం. దీనికి పేరడీ గా
https://www.youtube.com/watch?v=r4J66aYTPPA&list=RD9gs4KCVgjIY&index=2 ఈ లింక్ లో "కొండముచ్చుదానా నీ మూతి ఉంది జాన, మంచి మాట రాక బూతులొచ్చెనే.... గుద్దితే గోచి ఊడింది..." అంటూ పేరడీ కనిపిస్తోంది. లిరిక్స్ అన్నీ ఒకేలా ఉంటాయి. నవ్వులు పువ్వులవుతాయి.

బిజినెస్ పనిమీద ఆఫీస్ ట్రిప్ గోవా వెళ్లాడట.. రాజ్యం నేను చాలా లోతట్టు ప్రాంతంలో ఉంటానంటాడు.... ఇలా రివర్స్ లో డైలాగ్స్ చెప్పి అల్లాడిపోతున్నాడు అంటూ రీల్స్ లో సమీర భరద్వాజ చెప్పడం రీల్స్

లో వైరల్ అవడం గమనించవచ్చు.
https://www.instagram.com/reel/DLeCrgKxbvJ/?hl=en ఈ లింక్ లో చూడొచ్చు.

**16. సింహావలోకనం:**

ఇలా ఆధునిక సాహిత్యంలో ఒక ప్రక్రియ స్థాయికి వచ్చేలా రచనలు చేస్తూ చాలామంది అనుసరించేలా చేయగల వ్యక్తిగా జరుక్ శాస్త్రి కనిపిస్తారు. శ్రీశ్రీ లాంటి శబ్దాన్ని గుర్రం లా పరిగెత్త గలిగిన కవిత్వాన్ని ఎలాంటి సంబంధం లేకుండ హాస్యాన్ని చాలా పోలికలు, శైలిని అనుకరిస్తూనే చేయడం ముఖ్యమైంది. నేటికీ జానపదం నుంచి పాటలు, రీల్స్ డైలాగ్స్ లాంటివాటిల్లో పేరడీ రచన్లు ఉన్నాయి. తెలుగు సాహిత్యానికి ఒక ప్రక్రియకు కావల్సిన ఒరవడి, దిశానిర్దేశనం చేసిన జలసూత్రం రుక్మిణినాథ శాస్త్రి మన మధ్య లేకపోయినా వారి బాటలో ఒక సాహిత్య ప్రక్రియగా పేరడీ నిల్చింది. అందుకే వారిని పేరడీ పితగా భావించవచ్చు. వీరు 1968 జూలై 20వ తేదీన గుండెజబ్బులో పరమపదించినా, పేరడీ ప్రక్రియలో శాశ్వత స్థానాన్ని పొందారు.

ఆధారాలు:

కృష్ణపక్షం (ఊర్వశి)– కృష్ణ శాస్త్రి: 1925: మొదటి ముద్రణ. పునర్ముద్రణ: 1988: The Ind-com press, మద్రాస్- 24.
తెలుగు సాహిత్యంలో పేరడీ – డా. వెలుదండ నిత్యానందరావు :1990: పద్మావతి ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్.
జరుక్ శాస్త్రి పేరడీలు ఇతర కవితలు: సంకలన కర్త: కవి రమణారెడ్డి:1982: నవోదయ పబ్లిషర్స్ , విజయవాడ.
జరుక్ శాస్త్రి పేరడీలు – ఒక పరిశీలన : సూరంపూడి సుధ: 1987; (M.Phil సిద్ధాంత వ్యాసం, HCU), హైదరాబాద్ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్.
మహాప్రస్థానం- శ్రీశ్రీ: 1950: 32వ ముద్రణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌసు:2011: హైదరాబాదు-001
శరత్ పూర్ణిమ- జలసూత్రం రుక్మిణీ నాథ శాస్త్రి:1981.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# మెరుపుల మరకలు నవల – ఉషా రాణి పాత్ర విశ్లేషణ

**డా. వి. పూర్ణ చంద్రశేఖర రావు,**
ప్రధానోపాధ్యాయుడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెసర్లంక, బట్టిప్రోలు మండలం,
ఫోన్: 8247559603 , మెయిల్: purnachandrasekhar223@gmail.com

**వ్యాస సంగ్రహం:**

విశిష్టమైన తెలుగు సాహిత్యానికి ఎందరో రచయితలు తమ యొక్క సమున్నతమైన రచనలను అందించారు. వారిలో ఆధునిక కాలంలో పేర్కొనదగిన వారు, నవలా సాహిత్యంలో ఆధునిక ధోరణులను ఆధునిక భావాలను జోడించి సమాజంలో కొత్త మార్పులకు, ఆలోచనలకు హేతువుగా మారిన రచయిత త్రిపురనేని గోపీచంద్. ఈయన ఆధునిక కథ, నవలా సాహిత్యంలో చిరస్థాయిగా మిగిలిపోయే రచనలను చేశాడు. **"జీవితంలో అనేక సిద్ధాంతాలతో వాదులాడి... వాటిని తన అభిప్రాయాలకు, అనుభవాలకు అనుగుణంగా మార్చుకున్న వాడు, తండ్రి నుంచి సాహితీ వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న వాడు అయినప్పటికీ ఎక్కడా ఆ ప్రభావం తన రచనలపై పడకుండా జాగ్రత్తపడ్డ వాడు గోపీచంద్."[1] (సాహిత్యం అంతర్జాల పత్రిక – ఏ. రవీంద్రబాబు వ్యాసం – తేదీ:18 ఆగస్ట్ 2014)** ఇలాంటి అమూల్యమైన కథ, నవలాకారుడు త్రిపురనేని గోపీచంద్ రచించిన 'మెరుపుల మరకలు' నవలలోని మనస్తత్వ కోణాలను అందులోని ప్రధాన పాత్రధారి ఉషారాణి పాత్ర ఆధారంగా వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**పరిచయం:**తెలుగు సాహిత్యంలో ప్రతీ రచయితది ఒక ప్రత్యేకమైన శైలి. ప్రాచీన కాలం నుండి వస్తున్న రచన సాంప్రదాయాలకు స్వస్తి చెప్పి, పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించిన నవల, కథ, కథానిక వంటి ప్రక్రియలను ఆదరించి, రచనలను చేసి, పాఠక లోకానికి తరాలు మారిపోయినా తరగని సాహిత్యాన్ని అందించిన రచయితలలో ఒకరు త్రిపురనేని గోపీచంద్. ఆరి కాలం నుండి జాలువారిన ప్రతీ కథ, నవల ప్రత్యేకమైనది. ఆధునిక కాలంలో పాశ్చాత్య సాహిత్య ప్రభావంతోనే కొత్త విధానానికి తెరతీసినది మనోవిశ్లేషణ. సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రభావంతో మనస్తత్వ విశ్లేషణలో వచ్చిన సిద్ధాంతాలను సాహిత్యంలో ప్రవేశ పెట్టి పాఠకుల ఆలోచనా విధానాన్ని, మనుషుల స్వభావాలను చిత్రించిన నవలలు రాయడంలో సిద్ధహస్తులు అని చెప్పవచ్చు. మనస్తత్వ సిద్ధాంత ప్రభావంతో వీరు రచించిన ఒక నవల 'మెరుపుల మరకలు.' ఆ నవలలో ప్రధాన పాత్రధారి ఉషారాణి. ఆమె పాత్ర చిత్రణలో వివిధ రకాల మనస్తత్వాలను ఏవిధంగా ప్రతిబించాడో పరిశీలన చేద్దాం.

**గోపీచంద్ జీవితం:**

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

గోపీచంద్ 1910, సెప్టెంబర్ 8 న కృష్ణా జిల్లా అంగలూరు గ్రామములో త్రిపురనేని రామస్వామి చౌదరి, పున్నాంబలకు జన్మించాడు. ఈయన తండ్రి కవిరాజు త్రిపురనేని రామస్వామి గారు హేతువాది సంఘసంస్కర్త. గోపీచంద్ చిన్నతనములోనే తల్లిని పోగొట్టుకున్నాడు. ఇంటి పనులతోపాటు, తండ్రి నాస్తికోద్యమానికి సహాయము చేయటం లాంటి పనులతో అతని బాల్యం చాలా గడచి పోయింది.

**అస్తిత్వ వాదం – ఉషారాణి పాత్ర:**

తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాద దృక్పథంతో నవలలు రాసి అస్తిత్వవాద మనస్తతా అద్దం పట్టిన నవలాకారుల్లో శ్రీ త్రిపురనేని గోపీచంద్ ప్రముఖుడు. ఈయన రచించిన "మెరుపుల మరకలు" "పిల్ల తిమ్మెర" "గడియపడని తలుపులు" మొదలయిన నవలల్లో అస్తిత్వవ్యా ప్రస్ఫుటంగా కనబడుతుంది. ఈ ధోరణితో గోపీచంద్ రాసిన నవలల్లో "మెరుపుల మరకలు" ప్రముఖంగా పేర్కొనదగ్గది. 'మెరుపుల మరకలు' లోని ఉషారాణి పాత్ర చాలా విచిత్రమైంది. మెరుపు తీగలా కవ్విస్తూ వుండే ఉషారాణి పైన జర్నలిస్ట్ చక్రవర్తికీ, శ్రీకాంత్ కి, ఎడిటర్ గారికి, మహాకవి చంద్రవదనలకు, ఆమె భర్త రామానుజానికి 'ఆరాధనా' భావం ఉంది. దానికి కారణం ఆమెలోని ఆకర్షణే! అయితే ఉషారాణి కాముకురాలు కాదు. మనస్తత్వ శాస్త్ర పరిభాషలో ఆమెను Nyphomaniac గా చెప్పవచ్చు.

ఆమెకేదో కావాలి. ఏం కావాలో ఆమెకే తెలియదు. అందుకే అన్వేషణ. ఈ అన్వేషణలో ఆమెకు ఎదురైన మజిలీలే పైన చెప్పబడ్డ వాళ్ళు. శ్రీకాంత్ చెల్లెలు పద్మ పాదాల పారాణి ఆరకుండానే ఆమె భర్త కమలాకరంతో ఉషారాణి సాగించిన రతీ కలాపం చూస్తే ఆమె ఒక 'కామపిశాచి' అని అసహ్యం కలగవచ్చు. భార్యను గుడ్డిగా నమ్మి, ఆమె అమాయకత్వం పట్ల నమ్మకాన్ని పెంచుకొని, ఇంత మంచి భార్య దొరికినందుకు పొంగిపోతున్న రామానుజాన్ని దగా చేసిన ఉషారాణి శీలాన్నీ, తన భర్త చేతే తన ప్రియులకు రాయబారాలు పంపించగల ఆమె గడుసరితనాన్ని చూసి పాఠకుడికి చీదరింపు అనిపిస్తుంది. కాని నవలను పూర్తిగా చూచే సరికి ఉషారాణి ప్రతిబింబం మన గుండెల్లో యింకోలా కనబడుతుంది. నిజానికి ఆమె ఎందరితో వ్యభిచరించినా ఏదో తెలియని ప్రత్యేకత ఉషారాణిలో కనబడుతూనే ఉంటుంది. **"తన మనసు దేనినో కోరుకుంటుంది. ఏదో ఒకదాని మీద మనస్సు లగ్నమవుతుంది. అది లభ్యమయితే జీవితం ధన్యమైనట్లే ననిపిస్తుంది. కాని లభ్యమైన కొద్ది కాలానికే దాని మీద విరక్తి కలుగుతుంది, మరొక దాని మీదకు మనస్సు వెడుతుంది. తనకు తృప్తిలేదు, ఎందుకని?"[2] (మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 98)** ఉషారాణి తన గురించి తాను వేసుకున్న ప్రశ్నలో ఆమె జీవిత యాత్ర మనకు కనిపిస్తుంది. **"పిల్లలు లేకపోతే అట్లానే వుంటుందిలే అక్కా- యిద్దరు ముగ్గురు పిల్లలు పుడితే ఇన్నీ పోతాయి"[3] (మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 99 )** అంది సన్నిహితురాలు నిర్మల.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

కాని తన మనసులో ఉన్నది అట్లాంటి ఆరాటం కాదని ఆమెకు తెలుసు. ఇన్ని రకాల ఆలోచనలు ఆమెను వెంటాడుతాయి. సంప్రదాయం కాదు. భయంకాని, కట్టుబాట్లుగాని అంతకన్నా కాదు. ఆమె యిచ్ఛ (will) ఆమెను నడిపించింది. Lesbian sexual ప్రవర్తనలో ఆనందం అనుభవించే తన స్నేహితురాలి ఆనందం కొరకు ఆమె పక్కన పడుకోడానికి కూడా వెనుకాడదు. చివరకు వీటన్నింటినీ విడిచి హిమాలయాలలో తపస్సు చేసుకుంటూ మహా తపస్వినిగా మారిపోడానికి ప్రయత్నిస్తుంది. ఉషారాణి జీవితం ఎగుడు దిగుడు రోడ్ల మీద నడిపింది, ఆవేదనకు గురిచేసింది ఆమెలోని యిచ్ఛ మాత్రమే. **"అందరూ నా శ్రేయస్సు కోరే వారే. నువ్వు కోరుతున్నావు. శ్రీకాంత్ కోరుతున్నాడు. రామానుజంగారు కోరుతున్నారు. యిందులో ఎవరి మాటయినా వినాల్సిన కర్మ నాకేం పట్టింది? నా యిష్టం వచ్చిన పనులు చేస్తాను. ఫలితం అనుభవిస్తాను"**[4] **(మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 187)** అనే ఉషారాణి భావాలకు ప్రతిరూపం.

ఉషారాణి ఓ విధంగా Ambivert అని చెప్పాలి. ఆమెలో extroversion యొక్క లక్షణాలూ, introversion యొక్క లక్షణాలు కూడా కనబడతాయి. ఆమెలో అటు బాహ్య దృష్టి, ఇటు అంతర్ దృష్టి కూడా ఉంటుంది. అందరితోనూ కలిసి పోయే స్వభావం కలిగి వుండటమూ, అంతలోనే తనను గురించి తాను ఆలోచిస్తూ వుండటమూ మనకు కనబడుతుంది. ఉషారాణిలో ఆమెకు తెలియకుండానే ఈ రెండు లక్షణాల మధ్య ఆధిక్యత కోసం పోరాటం జరుగుతోంది. చివరకు హిమవత్ పర్వతాల దగ్గర అపురూపమైన శాంతి లభించడంతో ఆమె introvert గా మారిపోయింది.

ఉషారాణిలో కొన్ని సందర్భాలలో depression కూడా కనిపిస్తుంది. అన్ని విషయాలలో ధైర్యంగా, తెగింపుగా ఉన్న ఈమె కమలాకరంతో శారీరక సంబంధం పెట్టుకునే సమయంలో తటపటాయించింది. దీనికి కారణం కమలాకరం భార్య పద్మ. ఆమెకు (పద్మ) పెళ్లి అయి రోజులన్నా కాలేదు. బుగ్గన పెట్టిన కాటుక చుక్క ఛాయ యింకా పూర్తిగా పోలేదు. పద్మ మంచి పిల్ల. ఆమె జీవితం సుఖంగా గడిచిపోవాలనుకొంది గాని, తనను తాను నిగ్రహించుకోలేకపోయింది. దీని వలన ఉత్పన్నమైన మానసిక వ్యధ కూడా ఆమె జీవన గమనంలో మార్పుకు కారణం అనుకోవచ్చు.

మనస్తత్వ శాస్త్రం ప్రకారం కలలు (dreams) కూడా మనిషి ప్రవర్తనను వ్యక్త పరుస్తాయి. రామానుజంగారు కొత్తగా కొన్న స్ప్రింగు మంచంలో భర్తను కౌగలించుకొని పడుకున్న ఉషారాణికి ఒక చిత్రమైన కల వచ్చింది. చేతికి తగిలిన మేఘాలు, వేళ్ళు స్పృశిస్తున్న సముద్ర కెరటాలు, అస్తమించిన సూర్యుడు, చిమ్మ చీకట్లు, బ్రహ్మాండమైన శివతాండవం, జలప్రళయం, దానవులు సముద్రాన్ని మధించడం, చివరకు అమృత వర్షం, అమృత వాహిని, అన్ని ఉషారాణి మనసులో ఉన్న అస్తవ్యస్త భావనలను, ఆమె జీవితంలో వున్న చీకటి కోణాలనూ, ఆవేదన అన్వేషణనూ, సంఘర్షణనూ, భవిష్యత్తులో అందుకోబోయే అమృత భాండాన్ని తెలియజేస్తున్నాయి. ఈ కలలో ప్రస్తావించబడిన

విషయాలను "యూంగ్" సిద్ధాంతంలోని Archetype జంటగా చెప్పవచ్చును. ఇందులో సముద్ర మదనం ఆమె అంతరంగంలో అనుక్షణం జరుగుతున్న మధనానికి ప్రతీక అయితే మేఘాలు, సముద్ర కెరటాలు ఆమె అంతరంగంలోని ఎత్తుపల్లాలను తెలియజేస్తున్నాయి. ఉషారాణికి వచ్చిన ఈ కలలన్నీ 'చేతన'లో ఆమెకు గల భావాలను, ఆమె ఆశలను, ఆశయాలను తెలుపుతున్నాయి. అందుచేత వీటిని parallel dreams గా పేర్కొనవచ్చును.

హిమాలయాలకు చేరుకున్న తర్వాత ఉషారాణి యోగినిగా మారిపోయి అందరిచేత పాదాభివందనాలు అందుకునే విరాగిణిగా అవతరించింది. **"రామానుజంగారి జీవితాన్నించి తొలగిపోయిన తర్వాత ఉషారాణి జీవితం ఏ వ్యభిచార కొంపలోనో అంతం అవుతుంది"[5] ( మెరుపుల మరకలు – గోపిచంద్ – పుట: 247)** అనుకున్న ఆమె మాజీ ప్రియులు హిమాలయాల అంచుల్లో వున్న ఆ పవిత్ర మూర్తిని చూచి నిశ్చేష్ఠులయ్యారు." ఆమె మానసిక పరిణామాన్ని, ఆమె సహజ ప్రవృత్తిని గమనించలేని వారికి ఈ ఆశ్చరం తప్పదు.

**"అరవై సంవత్సరాల చరమాధ్యాయంలో తెలుగు పరిత్వలోకానికి దేవదారువృక్షం అరుగు మీద పులి చర్మాసనంపై పద్మాసన ధారియై విరిసిన తామరలవలె ప్రకాశిస్తున్న చేతులు ఒడిలో వెల్లకిలావుండి, నిశ్చలతతో నాసాగ్రంపై దృష్టి నిలిపిన అర్ధ నిమీలిత నేత్రాలతో, గర్జనభర్జనలు లేని శరత్కాల మేఘంవలె, అచటలేని సరోవరం వలె కదలక వెలిగే దీపశిఖలాగా మహా యోగినిగా ప్రత్యక్షమయింది."[6] ( మెరుపుల మరకలు – గోపిచంద్ – పుట: 187)** ఉషారాణి గమ్యం తెలియని యాత్ర సాగించినా, చివరకు సరైన గమ్యాన్ని చేరుకోగలిగిందని చెప్పవచ్చు . పూర్వాశ్రమంలోని ఉషారాణి తేజస్సు, ప్రతిభ, మేధస్సు, చైతన్యం ఎంతగా పాఠకుల్ని ఆకర్షించి, ఉత్తేజం కలిగించాయో, ఈ మహాయోగిని సందర్శనం కూడా అంతకుమించిన ఆకర్షణనూ, ఉత్తేజాన్నీ, మత్తునూ కలిగించింది. తెలుగు సాహిత్యాకాశంలో ఈ ఉషారాణి ధృవతారగా వెలుగొందుతుంది.

ముగింపు:

ఈ నవలలోని ప్రతి ముఖ్య పాత్ర చాలా సందర్భాలలో కలలు కంటాయి. అధునిక తెలుగు సాహిత్యంలో ఈ కలల ప్రస్తావన ఓ వినూత్న విధానం. పాత్రలు తమ బావ పరిణితి తగినట్లుగా కలలు కంటాయి. ప్రతి కలకూ ఒక కారణముంది. ఒక అర్ధముంది. **"సూక్ష్మాతి సూక్ష్మమైన ఫ్రాయిడ్ సూత్రాలనేకం, ఈ పాత్రల మానసిక దొంతరలలో అణగి వుండి, సుషుప్తావస్థలలో, మేధోంతఃపురంలోని మేలిముసుగులను తొలగించుకుని బయల్వెడలిపోతాయి. అందుకే అద్భుతంగా అవి రూపం పోసుకుని జీవించాయి"[7]** (మెరుపుల మరకలు – గోపిచంద్ – పుట: **259)**. కలలు రావడం సర్వసామాన్యం, వచ్చిన కలలకు సూత్రాలను రూపొందించడం, తద్వారా

కలలుగన్న వ్యక్తి మానసిక స్థితిని వ్యక్తీకరించడం, మానసిక అనుగుణ్యంగా, చిత్త ప్రవృత్తిని నిరూపించగల కలలుగనే విధానాన్ని శ్రీ గోపీచంద్ మహాద్భుతంగా చిత్రించారు ఈ నవలలో ఇది సరికొత్త శాస్త్రం. చాలా కాలానికి వివేచనతో, తెలుగు పాఠకుల మేధస్సుకు పని కలిగిస్తూ ప్రతిభావంతంగా తీర్చిదిద్దిన శ్రీ గోపీచంద్ రచనా నైపుణి బహుధా ప్రశంస నీయం. భావానికి భాష బానిసగా లాస్యం చేయడానికి ఈ నవల ఒక మచ్చుతునకగా చెప్పవచ్చు.. శ్రీ గోపీచంద్ ప్రతిభా ప్రకర్షణకు ఈ నవల ఒక ఉదాహరణ.

**పాద సూచికలు:**

1. **సాహిత్యం అంతర్జాల పత్రిక – ఏ. రవీంద్రబాబు వ్యాసం – తేదీ:18 ఆగస్ట్ 2014**
2. **మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 98**
3. **మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 187**
4. **మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 247**
5. **మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 187**
6. **మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 187**
7. **మెరుపుల మరకలు – గోపీచంద్ – పుట: 259**

**ఉపయుక్త గ్రంథ సూచి:**

1. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ - కోడూరి శ్రీరామమూర్తి – ప్రచురణ: 2002, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ, హైదరాబాద్
2. తెలుగు సాహిత్య చరిత్ర – ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి, ప్రచురణ: 1992, శ్రీ రమణ శ్రీ ప్రచురణలు, విశాఖపట్నం
3. మెరుపుల మరకలు – త్రిపురనేని గోపీచంద్ - ప్రచురణ:2012, విశాలాంధ్ర బుక్ హౌస్, విజయవాడ
4. సహవాసి(రచన), సంపాదకుడు: డి. వెంకట్రామయ్య - నూరేళ్ళ తెలుగు నవల – ప్రచురణ: 2007, నవోదయ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, కాచిగూడ

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# సలీం 'లోహముద్ర' - సంకెళ్ల నుండి విముక్తి పొందిన గిరిజన జీవితం

**డా. జరుపుల రమేష్**
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం,
కాకతీయ ప్రభుత్వ కళాశాల, (స్వయం ప్రతిపత్తి), హనుమకొండ.
చరవాణి: 9618944654, E Mail- ramesh.jarupla@gmail.com

**వ్యాస సంగ్రహం:**

తెలుగు సాహిత్యంలో గిరిజన జీవితం ఆధారంగా కథలు,కవితలు,నవలలు రాస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. అలా గిరిజన జీవితం ఆధారంగా వస్తువు తీసుకొని ఇటీవల కాలంలో సలీం రాసిన నవల '**లోహముద్ర**' (2024). ఈ నవల 'చదువు అన్వీక్షికి' నిర్వహించిన ఉగాది నవలల పోటీ-2024లో బహుమతి పొందింది. గిరిజన తెగల్లో ఒకటైన 'ఎరుకల' జీవితాన్ని, దాదాపు రెండు శతాబ్దాల చరిత్రను ఈ నవల చిత్రించింది.

బ్రిటీష్ ప్రభుత్వం 1871లో ప్రవేశపెట్టిన **'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్'** వల్ల కొన్ని తెగలు 'పుట్టుకతోనే నేరస్థులు'గా ముద్రవేయబడ్డాయి. ఈ చట్టం వల్ల ప్రభావితమైన సంచార జాతుల కోసం 1913లో ఏర్పడిన సెటిల్మెంట్ **'స్టువర్ట్ పురం'** నేపథ్యంగా ఈ నవల సాగుతుంది. నేరం అనేది జీవనోపాధి కాదు, కానీ వ్యవస్థ రుద్దిన ముద్ర వల్ల ఆ జాతి పడిన వేదనను, ఆ సంకెళ్ల నుండి విముక్తి పొందిన క్రమాన్ని విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశం.

**కీలక పదాలు:**తెలుగు నవల,లోహముద్ర, క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్, సంచార తెగలు, 'స్టువర్ట్ పురం', సెటిల్మెంట్,సాల్వేషన్ ఆర్మీ.

**1.పరిచయం:** సలీం 1959 జూన్ 1 తేదీన జాఫర్, అన్వర్‌బీలకు జన్మించారు. వీరు భద్రిరాజు జన్మించిన ఒంగోలు సమీపంలో త్రోవగుంట అనే గ్రామంలో జన్మించారు. జీవితంలో మానవత్వాన్ని మించిన మతం లేదనీ, అదే తన అభిమతంగా, కథలు, నవలలు, కవితలు వస్తువులుగా తీసుకొని అద్భుతమైన రచనలు చేశారు. వీరు చిన్నప్పటి నుండి రచనలు చేయడం ఒక అలవాటుగా చేసుకున్నారు. 1996లో తొలిసారిగా 'స్వాతిచినుకులు' పేరుతో కథల సంపుటి ప్రచురించారు. 1999లో 'నిశ్శబ్ద సంగీతం' అనే కథల సంపుటి, 'నీలోకి చూసిన జ్ఞాపకం (1999)' అనే తొలి కవితా సంపుటిని ప్రచురించారు. 2001లో 'జీవన్మ□తులు', 2003లో 'వెండిమేఘం' అనే నవలలు రాశారు. 2004 లో 'రూపాయి చెట్టు' కథల సంపుటి ఆయనకు ఎంతో పేరు తెచ్చింది. ఆయన రాసిన 'కాంచన మృగం' (2006) నవల ఆటా సంస్థ

నిర్వహించిన పోటీల్లో బహుమతి పొందింది. మెహర్, బురఖా, తలాక్, ఆరో అల్లుడు వంటి కథల ద్వారా ముస్లిం సంప్రదాయాల్లో, ఆచార వ్యవహారాల్లోఉన్న రుగ్మతల్ని ఖండించారు. సలీం సంస్కరణవాది. ఇప్పటివరకు వీరు మూడు కవితా సంపుటాలు, 12 కథా సంపుటాలు, 36 నవలలు వెలువరించారు. వీరి కథలకు, నవలలకు అనేక రాష్ట్ర, జాతీయ అవార్డులు రావడం జరిగింది. 2010 సం.లో వీరు రాసిన 'కాలుతున్న పూలతోట' నవలకు 'కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు' లభించింది. అంతే కాకుండా వీరి రచనలు చాలా యూనివర్సిటీలలో పాఠ్యాంశాలుగా ఉన్నాయి.

సలీం గారి రచనల్లో మానవత్వం, సామాజిక స్పృహ మరియు మైనారిటీల జీవన చిత్రణ ప్రధానంగా కనిపిస్తాయి. ఆయన శైలి చాలా సరళంగా, గుండెలకు హత్తుకునేలా ఉంటుంది. సంక్లిష్టమైన సామాజిక సమస్యలను కూడా సామాన్యులకు అర్థమయ్యేలా చెప్పడం ఆయన ప్రత్యేకత. సలీం గారు కేవలం ముస్లిం మైనారిటీల సమస్యలనే కాకుండా, విశ్వజనీనమైన మానవ సంబంధాలను, పర్యావరణాన్ని, పేదరికాన్ని తన రచనల్లో వస్తువుగా తీసుకున్నారు. ఆయన రచనలు హిందీ, ఇంగ్లీష్, కన్నడ, మరాఠీ వంటి అనేక భాషల్లోకి అనువదించబడ్డాయి.'సాహిత్యం సమాజాన్ని ప్రతిబింబించడమే కాదు, సమాజంలో మార్పు తీసుకురావాలి' అని నమ్మే రచయిత సలీం. ఆయన తెలుగు సాహితీ వనంలో పరిమళించే ఒక కుసుమం.

**2.'లోహముద్ర' నవల - వస్తు విశ్లేషణ:**

సలీం రాసిన **'లోహముద్ర'** నవల పేరు ఎంతో వైవిధ్యమైనది. 'లోహముద్ర' అంటే చెరిపివేయలేని ముద్ర అని అర్థం. పుట్టుకతోనే ఒక మనిషిపై సమాజం వేసిన 'నేరస్థుడు' అనే ముద్ర ఆ వ్యక్తి భవిష్యత్తును ఎలా దెబ్బతీస్తుందో ఈ నవల చర్చిస్తుంది. 19వ శతాబ్దపు చివరి నుండి 20వ శతాబ్దపు ఆరంభం వరకు 'ఎరుకుల' తెగ పడిన వేదనను, వారు ఎదుర్కొన్న 'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్' పరిణామాలను ఈ నవల ప్రతిబింబిస్తుంది.

**మూడు తరాల ప్రయాణం:**

రచయిత ఈ నవలను మూడు తరాల కథగా మలిచారు:

1. **మొదటి తరం (కర్రెద్దుల శీను):** ఆకలి తీర్చుకోవడానికి దొంగతనమే వృత్తిగా మారి, వ్యవస్థ వల్ల నేరస్థుడిగా ముద్రపడిన తరం.
2. **రెండో తరం (ప్రసాద్):** సామాజిక వివక్ష వల్ల ఆవేశంతో నేరాల బాట పట్టి, తర్వాత పశ్చాత్తాపం చెందిన తరం.
3. **మూడో తరం (తిలక్):** విద్యావంతుడై, ఐ.ఏ.ఎస్ అధికారిగా ఎదిగి, తన జాతిపై ఉన్న 'లోహముద్ర'ను చెరిపివేసిన నవతరం.

**కథా సారాంశం:**

కర్రెద్దుల శీను ఆకలి తీర్చుకోవడానికి చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ, పోలీసు కానిస్టేబుల్ కోటయ్య వేధింపులను భరిస్తుంటాడు. ఒక పెద్ద దోపిడీలో అనుకోకుండా భాగస్వామి అయి జైలుకు వెళ్తాడు. శీను జైలులో ఉండగా, అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఎరుకల వారిని సంస్కరించే ఉద్దేశంతో 'సాల్వేషన్ ఆర్మీ' సహకారంతో **'స్టువర్ట్ పురం'** సెటిల్మెంట్‌ను ఏర్పాటు చేస్తుంది.

శీను కూతురు గౌరి చదువుకుని టీచర్ అవుతుంది. కానీ కొడుకు ప్రసాద్ దారి తప్పి గుడిలో దొంగతనం చేసి జైలుకు వెళ్తాడు. అక్కడ తన తప్పు తెలుసుకున్న ప్రసాద్, తిరిగి వచ్చి గౌరి సహాయంతో వివాహం చేసుకుని స్థిరపడతాడు. శీను తన మనవడు **'తిలక్'** ను గాంధీ గారికి పరిచయం చేసి, తన జాతి భవిష్యత్తు కోసం కలలు కంటాడు. 1949లో 'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్' రద్దు కావడంతో ఒక చీకటి అధ్యాయం ముగుస్తుంది.

తిలక్ పట్టుదలతో చదివి కలెక్టర్ అవుతాడు. లవణం దంపతుల వంటి సామాజిక సంస్కర్తల కృషితో స్టువర్ట్ పురంలో విపరీతమైన మార్పులు వస్తాయి. 1976 లో ప్రభుత్వం దీనిని 'నేరస్థుల సెటిల్‌మెంట్' నుండి 'స్వతంత్ర కాలనీ'గా గుర్తిస్తుంది. సమాజం వేసిన 'దొంగ' అనే ముద్ర చెరిగిపోయి, నవతరం విద్యావంతులుగా ఎదుగుతున్న తరుణంలో నవల ముగుస్తుంది. ఒక అణగారిన జాతి ఎదుర్కొన్న సామాజిక బహిష్కరణను, దశాబ్దాల అవమానాలను అధిగమించి వారు ఎలా స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారో ఈ నవల సజీవంగా చిత్రించింది. మనిషి మారడానికి శిక్ష కంటే సంస్కరణ, విద్య ముఖ్యమని సలీం ఈ రచన ద్వారా నిరూపించారు.

**3. సంకెళ్ళ నుండి విముక్తి పొందడానికి ఎదురైన సవాళ్ళు :**

సలీం రాసిన 'లోహముద్ర' నవల అనేక ప్రశ్నలకు సమాధానాలుగా నిలిచింది. ఈ దేశంలో ఎవరికైనా బతకడానికి ఒకటే మార్గం పనిచేసుకోవడం. కానీ సంచార తెగలుగా దేశంలో పేరుపొందిన గిరిజన తెగలకు మాత్రం ఆ అవకాశం ప్రకృతి కల్పించిన, వ్యవస్థ మాత్రం దాన్ని గట్టిగా వ్యతిరేకించింది. బతకడానికి అడవిని నమ్ముకున్న వారిని ఆ అడవినే దక్కకుండా చేసి తిరిగి అనేక పేర్లతో దాష్టికంగా హింసించింది. తమ స్వార్థ ప్రయోజనాల కోసం గిరిజనులను అడవులకు, వారి తమదైన జీవన విధానానికి దూరం చేసి, ఆదాయాన్ని కోల్పోయి, కుటుంబ పోషణకై ఏం చేయాలో తెలియని స్థితికి తెచ్చింది ఈ సమాజం.

''గిరిజనుడికి అడవి తన స్వగృహం లాంటింది. అతని పురిటిల్లయినా ఉయ్యాల అయినా అడవే. చెట్లతో బాటు, జంతువులతో బాటు, గిరిజనుడు ఆ అడవి వెచ్చటి ఒడిలో పెరుగుతాడు. ఒకరి హక్కులను ఒకరు భంగపరచుకోకుండా, సామరస్యంగా ఈ ప్రాణులన్నీ అడవిలో జీవిస్తాయి.చేపకు నీరెలాంటిదో గిరిజనుడికి అడవి అలాంటిది. ప్రతీ అడవి శబ్దాన్నీ గుర్తించగలడు. ప్రతీ పక్షి పేరు, మొక్క పేరు, జంతువు పేరు, చివరికి కీటకాలు పేర్లు కూడా చెప్పగలడు. అతను అడవిని ప్రేమిస్తాడు, ఆ అడవి

ప్రేమకు, ఆరాధనకు పాత్రుడవుతాడు. కేవలం షికారు(వేట) కోసం అతనెన్నడూ జంతువులను చంపడు. ఉబుసుపోకకు ఎన్నడూ ఒక్క చెట్టునూ నరకడు. అతను ప్రకృతి బిడ్డ. ప్రేమమయి అయిన తల్లిలాగా ప్రకృతి అతన్ని పోషించి, లాలించి, సంరక్షిస్తుంది'' (కె. బాలగోపాల్.ఆదివాసులు. వైద్యం సంస్కృతి అణచివేత. పుట: 24) అని వెన్నెలకంటి రాఘవయ్య అభిప్రాయ పడ్డారు. పై విధంగా అనేక వివక్షకు గురైనా గిరిజనుల గూరించి సలీం 'లోహముద్ర' నవలలో ఎదురైన సవాళ్ళను చూద్దాం.

**3.1. సామాజిక వివక్ష మరియు కుల సమస్య:**

ఒక వ్యక్తిని లేదా సమూహాన్ని వారి పుట్టుక, మతం, జాతి, లింగం లేదా వృత్తి ఆధారంగా సమాజంలోని మిగిలిన వారితో సమానంగా చూడకపోవడాన్ని 'సామాజిక వివక్ష' అంటారు.భారతదేశంలో ఎల్లప్పుడు సామాజిక వివక్ష తారసపడుతునే ఉంటుంది. ''హిందూ సమాజం ఒక కులాల సమ్మేళనం. ప్రతి కులమూ అదొక పరిమిత సంస్థ. కాగా అందులోకి కొత్తవాడికి ప్రవేశం లేదు. ఇతర మతాల వాళ్ళను, జాతులను తమ మతంలో కలుపుకొని తద్వారా తమ మతాన్ని, తమ సమాజాన్ని విస్తరింపజేసుకొనే అవకాశం హిందువులకు లేకుండా పోవడానికి కారణం కేవలం కులవ్యవస్థే. హిందూ మతంలో కులాల నిలిచి ఉన్నంత కాలం హిందూమతం ప్రచారక మతం ఎన్నటికీ కాజాలదు. కులాల నశించకుండా ఇతరుల్ని హిందువులుగా మార్చే శుద్ధి కార్యక్రమం అర్థరహితమూ, నిరర్థకమూ'' (డా.బి.ఆర్. అంబేద్కర్.కుల నిర్మూలన:పుట: 47) అని డా. బి.ఆర్. అంబేద్కర్ అభిప్రాయ పడ్డారు. నవలలో చూస్తే...

''మీరేంటోళ్ళు?ఎరుకలోళ్ళం దొరా...లేరా...లే. ఎవరింట్లో దొంగతనం చేయడానికొచ్చావురా? మా యింటికే కన్నం వేద్దామనుకుంటున్నావా?'' కోపంతో వూగిపోతూ అన్నాడు..ఒరేయ్ ..మీ ఎరుకలోళ్ళందరూ దొంగ నా కొడుకులే కదరా. నాకు తెలియదనుకున్నావా? ఈ చుట్టుపక్కల ఎక్కడ దొంగతనాలు జరిగినా సూత్రధారులు మీ ఎరుకలోళ్ళే కదరా. వెళ్ళిపో. లేకపోతే అందర్నీ పిలిచి, నిన్ను చావగొట్టి, పోలీసులకు పట్టిస్తాను'' (సలీం.లోహముద్ర. పుట: 16) అంటూ నవలలో ఒక సంభాషణను పరిశీలిస్తే ఎంత సామాజిక వివక్ష ఉందో తెలుస్తోంది. సామాజిక వివక్ష అనేది ఒక వ్యక్తిని లేదా సమూహాన్ని వారి కులం,మతం, వర్ణం, లింగం, ప్రాంతం లేదా ఆర్థిక స్థితి ఆధారంగా తక్కువ చేసి చూడటం పై సంభాషణలో చూడవచ్చు. వాళ్ళు అలా కావడానికి ఎవరూ కారణం? వాటికి ఎవరూ బాధ్యత వహిస్తారు? అనే ప్రశ్నలు వేసుకుంటే సమాధానం రావడం కష్టమే. వాళ్ళ కూడా అందరిలాగే సాధారణ మనుషులే. ఒక స్త్రీ కడుపులోనే పుట్టారు. ప్రకృతికి విభిన్నంగా ఈ భూమి మీదకి రాలేదు కాదా! కానీ ఈ మనుషుల ఏర్పరచుకున్న మౌఢ్యం నుండి బయటపడలేక పోతున్నాడు. వాటి వల్ల ఇతరులకు ఇబ్బంది కలుగుతుంది.

'' మీ దేశంలో కుల వ్యవస్థ చాలా బలంగా వేళ్ళూనుకుని ఉంది కదా. ఇక్కడ ఉత్పన్నమయ్యే చాలా సమస్యలకు మూలం ఈ కుల వ్యవస్థే. సెటిల్మెంట్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వాళ్ళందరూ ఉన్నత కులస్థులే. నిమ్న కులస్థులైన మీ ఎరుకులకు సాగుభూమిని పంచబోతున్నామని తెల్సినప్పటినుంచే వాళ్ళలో ఈ వ్యతిరేకత మొదలైంది. వాళ్ళ ఉద్దేశంలో వ్యవసాయ భూములు వాళ్ళ ఆధీనంలోనే ఉండాలి. తక్కువ కులం వాళ్ళు వాళ్ళ పొలాల్లో కూలివాళ్ళుగా పనిచేయాలి తప్ప పొలాలకు హక్కుదారులు కాకూడదు. మీ చేతుల్లోకి ఒక్క సెంటు భూమి కూడా వెళ్ళకుండా చేయాలని వాళ్ళ ప్రయత్నం'' (పుట:72) అంటూ మేనేజర్ రోబిల్లియార్డ్ అన్నారు.

''నీ మాటలు ఎవడూ నమ్మాడ్రా? మీ ఎరుకలోళ్ళు దొంగనాయాళ్ళే కాదు, అబద్దాల కోర్లు కూడా. పోరా పో. నా వెంటవచ్చావంటే కాళ్ళిరగ్గొడ్తా'' (పుట:19) అనే మాటలు గమనిస్తే ఎరుకల వాళ్ళను దొంగలు, అబాద్దాల కోరు అని చేసింది ఎవరూ? ఈ సమాజం కాదా! సామాజిక వివక్ష వల్ల అసమానతలు, మానసిక వేదనలకు గురిచేస్తున్నారు. అందుకే మనుషుల మధ్య గోడలు కట్టడం కాదు, వంతెనలు నిర్మించడం ద్వారానే మనం గొప్ప సమాజాన్ని నిర్మించగలం. కావున నవలలో చిత్రించిన కాలం పూర్వమైనదైన నేటికి ఈ పరిస్థితి అలానే ఉంది. మార్పు రావాల్సిన అవరసం ఉంది. మనుషులను మనుషులగా గుర్తిందాం.

### 3.2. 1871 క్రిమినల్ యాక్ట్:

1871 నాటి నేరస్తుల తెగల చట్టం (Criminal Tribes Act) అనేది భారతీయ సామాజిక చరిత్రలో, ముఖ్యంగా అణగారిన మరియు సంచార జాతుల పట్ల బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన అత్యంత క్రూరమైన చట్టాలలో ఒకటి. 'లోహముద్ర' నవల దీన్ని ఆధారంగా రాయబడినదే. బిటీష్ పాలకులు భారతదేశంలోని కొన్ని సంచార జాతులను, గిరిజన తెగలను ''పుట్టుకతోనే నేరస్తులు'' (Born Criminals) అని భావించారు. తమ పరిపాలనకు అడ్డు తగులుతున్నారని లేదా వారి జీవనశైలి తమకు అర్థం కావడం లేదని ఈ ముద్ర వేశారు. ఈ తెగల వారు ఎక్కడికి వెళ్లాలన్నా పోలీసుల అనుమతి తీసుకోవాలి. ప్రతిరోజూ పోలీస్ స్టేషన్‌లో హాజరు వేయించుకోవాలి. వారిని సమాజానికి దూరంగా ప్రత్యేక నివాసాల్లో ఉంచి కంచె వేసి బంధించేవారు. ఉదాహరణకు ఈ నవలలో రచయిత పేర్కొన్నట్లు...ఆంధ్రప్రదేశ్‌లో సీతానగరం, స్టువర్ట్‌పురం వంటివి ఇలా ఏర్పడినవే. 1878 లో అటవీ ఉత్పత్తుల నిషేద చట్టం అమల్లోకి తెచ్చి, వారి సంప్రదాయ వృ□త్తులను (వేట, అడవి ఉత్పత్తుల సేకరణ) నిషేధించి, వారిని వెట్టిచాకిరికి గురిచేశారు. 'లోహముద్ర'లో రచయిత సలీం చూపించిన ఎరుకల పాత్రల వెనుక ఉన్న చారిత్రక విషాదం ఈ చట్టమే. తరతరాలుగా వివక్షకు గురవ్వడం వల్ల, వారు ఊరి బయట నివసించడం, పోలీసులను చూసి భయపడటం వంటి అంశాలన్నీ ఈ చట్టం సృ□ష్టించిన గాయాలే.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

"కారణమేంటో నాకు తెలుసు బావా. ఈ తెల్ల దొరల ఉద్దేశంలో ఎరుకలోళ్ళందరూ నేరస్థులే. ఈ రోజు నేరం చేయకున్నా ఎప్పటికైనా నేరం చేస్తారనే నమ్మకం వాళ్ళది. మన రక్తంలోనే నేరప్రవృత్తి కలిసిపోయి ఉందనేగా మనల్ని ఇలా కట్టడిచేశారు. నేను స్టువర్ట్ పురం రావాలంటే ఇక్కడి పోలీసుల అనుమతి తీసుకోవాలి. అక్కడ మీ సెటిల్మెంట్లోకి రావాలంటే మీ మేనేజర్ అనుమతి పొందాలి. చూశావా మన కదలికల్ని ఎలా గమనిస్తున్నారో...శీను చాలా కుంగిపోయాడు. చేయని చేరానికి శిక్ష అనుభవించాల్సి రావడం అతనికి మరణ సదృశంగా ఉంది" (పుట:108) అంటూనే "తనకు శిక్ష విధించిన తెల్ల తోలు జడ్డి మీద విపరీతమైన కోపం వచ్చింది. క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్'ని ఆచరణలోకి తెచ్చి, ఎరుకల కులంలో పుట్టిన వాళ్ళందరూ పుట్టుకతోనే నేరస్థులు అంటూ మతం మీద లోహముద్రని వేసిన బ్రిటీష్ ప్రభుత్వం మీద కూడా కోపం వచ్చింది." (పుట:109)

ఈ యాక్ట్ వల్ల ఎరుకల కులం వారు ఎప్పుడూ తమ పూర్వీకులు చేసిన దొంగతనాలను తర్వాత తరం వారికి కూడా వర్తింపచేయడం, తద్వారా అందరిని దొంగలుగా ముద్రలను వేయడం, చేయని నేరానికి వీళ్ళను బలి చేయడం క్రిమినల్ యాక్ట్ సాధించిన ఘనకార్యాలు. "చాలా అవమానంగా అన్పించేది. ఓ కులం మొత్తానికి దొంగలుగా ఎలా ముద్ర వేస్తారయ్యా? ఏం మన ఎరుకల్లోళ్ళలో దొంగతనం చేయని వాళ్ళే లేరా? బుట్టలు అమ్ముకుని బతికేటోళ్ళు, దువ్వెనలు తయారుచేసి బతికేటోళ్ళు, పందుల్ని మేపుకుని బతికేటోళ్ళు...నాకు తెలిసిన వాళ్ళలోనే ఎంతోమంది ఉన్నారు కదయ్యా" (పుట:44) అంటూ ఆవేదన చెందడం మాత్రమే ఎరుకుల కులం వాళ్ళకి మిగిలింది. సమాజం వారిని దొంగలుగా, నేరస్థులుగా చూడటం వల్ల వారు తీవ్రమైన సామాజిక వివక్షకు గురయ్యారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దీన్ని రద్దు చేశారు. సంచార తెగల వాళ్ళు ఊపిరి పిలుచుకున్నారు. అయినప్పటికీ సమాజంలో వారి పట్ల ఉన్న చిన్నచూపు నేటికీ పూర్తిగా తొలగిపోలేదు.

### 3.3. బానిస వ్యవస్థ:

దేశంలో అనాదిగా వస్తున్న వ్యవస్థ బానిస వ్యవస్థ. మానవ చరిత్రలో అత్యంత క్రూరమైన మరియు అమానవీయమైన సామాజిక వ్యవస్థలలో ఒకటి. దీనిలో ఒక వ్యక్తిని మరొక వ్యక్తి తన సొంత 'ఆస్తి' గా భావించి, బలవంతంగా పని చేయించుకుంటారు. వీరికి ఎలాంటి హక్కులు, స్వేచ్ఛలు ఉండవు. "పేదజనుల్ని పట్టుకొని బానిసలుగా చేసెయ్యడం అనే నీచాతి నీచమైన దురాచారం శతాబ్దాలుగా ఆఫ్రికా, అమెరికా ఖండాల్లో అమల్లో ఉంది" (జోతీరావు పూలే.గులాంగిరీ. పుట:17) అంటూ జోతీరావు పూలే అభిప్రాయ పడ్డారు.

జాన్ లాక్ " మానవులందరూ సమానం కాబట్టి, అందరూ ఒకే జంతుజాతికి చెందిన వాళ్ళు కాబట్టి. అందరూ ఒకే పరిస్థితులలో బ్రతికే వాళ్ళు కాబట్టి, ప్రకృతి ఫలాలను అనుభవించేందుకు

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

సమానమయిన హక్కు ఉంది. కాబట్టి ఏ ఒక్కరికీ గూడ ఇతరుల కంటే ఎక్కువ పొందే హక్కులేదు" (కార్టూన్లలో మార్క్స్. పుట: 59) అని అభిప్రాయ పడ్డారు.

'లోహముద్ర' నవలలో అడుగుడున బానిస వ్యవస్థ కనిపిస్తుంది. బ్రిటీష్ అధికారులు ఎరుకలకు మంచి చేద్దామని ప్రయత్నిస్తే ఉన్నత కులస్థులు మాత్రం వాటిని వ్యతిరేకించడం, ఎరుకల వాళ్ళని తమ బానిసలుగా  చేసుకోవడం ఆనాదిగా అలవాటై ఉండడం వల్ల తరాలు మారుతున్న ఈ వ్యవస్థ మారలేదు. బ్రిటీష్ వాళ్ళు వచ్చిన తర్వాత ఈ విధానంలో మార్పు రావడం గమనించవచ్చు. "ఎకరా వంద రూపాయలు విలువ చేసే మాగాణి భూముల్ని అంటరాని కులానికి చెందిన ఎరుకలకు కట్టబెడితే, వాళ్ళకు కొమ్ములు మొలుచుకొస్తాయని, తమ కింద బానిసలుగా పనిచేయడానికి ఒప్పుకోరని అగ్రవర్ణ హిందువుల భయం" (లోహముద్ర. పుట:72) అంటూ రచయిత చెప్పూనే " నైజాం సర్కారులో మనవాళ్ళ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో మీకు తెలుసా? పెద్దకులస్థులైన పటేల్ పట్వారీలకు మనవాళ్ళు ఆజన్మ బానిసలుగా బతుకుతున్నారు"(పుట:148) అనిపించడంలో ఉద్దేశం కూడా వాళ్ళ యొక్క జీవన స్థితిని అద్దం పడతాయి.

**4. నవల లేవనెత్తిన ఇతర సవాళ్ళు - అంశాలు:**

'లోహముద్ర' నవలలో పైన వివరించిన అంశాలతో పాటు ఇంకా చాలా విషయాలను చర్చించింది. అందులో 1. అటవీ ఉత్పత్తుల నిషేద చట్టం.2.  బ్రిటీషు వాళ్ళ ఏర్పాటు చేసిన చట్టాలు 3. సల్వేషన్ ఆర్మీ కృషి4. ప్రాంతీయ అస్తిత్వం 5. పోలీసు దౌర్జన్యాలు 6. సామాజిక బహిష్కరణలు 7. నిరక్షరాస్యత మొదలైన అంశాలను కూడా నవల లేవనెత్తింది. నవలలో పేర్కొన్నట్టు 1878 లో 'అటవీ ఉత్పత్తుల నిషేద చట్టం' తెచ్చి అడవి పై జీవనం కొనసాగించే సంచార జాతుల యొక్క జీవితంలో పెను విషాదాన్ని మిగిల్చింది. అడవిలో దొరికే వాటిని గిరిజనులకు చెందకుండా చేశారు. అంతేకాకుండా వాళ్ళను సామాజిక బహిష్కరణలు చేసి సాధారణ జీవితాన్ని మరింత దూరం చేశారు. పోలీసుల దౌర్జన్యాలు అయితే ఎరుకుల పాలిట శాపమై...వాళ్ళను సంసారాలు చేయకుండా చేసిందనవచ్చు. అధికారం తమ చేతుల్లో ఉంది కదని నిరక్షరాస్యులైన ఎరుకుల వాళ్ళ చేత ఎన్నో అవమానాల్ని గురిచేశారు. ఈ నవలలో అడుగడుగు కోటయ్య పాత్ర చూస్తే ఎంతటి దాష్టికాన్ని ఉపయోగించారో తెలుస్తోంది. ఎరుకుల అభివృద్ధి కోసం బ్రిటీషు వాళ్ళు ఏర్పాటు చేసిన 'సాల్వేషన్ ఆర్మీ' లాంటి కృషి చేత తర్వాత తరం చదువుకొని నవలలో 'తిలక్' లాంటి వాళ్ళు కలెక్టర్ అయ్యారు. తర్వాత తరం దొంగలనే ముద్ర నుండి ఉన్నత స్థాయికి ఎదిగిన తరుణాలు నిరూపించే అవకాశం దొరికింది.

**5. ఎరుకల జీవితం -సంస్కృతిక కోణాలు:**

ఎరుకల అనేది ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల్లో నివసించే ఒక ప్రధానమైన గిరిజన తెగ. గిరిజన తెగలు ఒక్కొక్కటి వైవిధ్యమైన సంస్కృతిని, భాషను కలిగి ఉంటాయి. ఈ కోవలోనిదే

'ఎరుకల' తెగ. ప్రత్యేకమైన జీవన సరళిని కలిగి వుండి వివిధ ప్రాంతాల్లో జీవిస్తున్న వాళ్ళు 'ఎరుకల' వాళ్ళు. స్థిర నివాసం అనేది లేకుండా తమకు ఎక్కడైతే అనుకూలంగా సౌకర్యవంతంగా ఉంటుందో, తమ జీవనభృతికి సరైన సదుపాయాలు వుంటాయో అలాంటి ప్రాంతాలకు తరుచూ తమ నివాసాల్ని మార్చుకుంటూ సంచార జీవులుగా జీవిస్తుండే ఎరుకల వారి జీవనశైలి ఎంతో వైవిధ్యభరితమైనది. సలీం రాసిన 'లోహముద్ర' నవల ఆధారంగా వీరి యొక్క సంస్కృతి పరిశీలిద్దాం.

**5.1.ఆహారం:**

రెండు రాష్ట్రాల్లో నివసించే ఎరుకల ఆహారం సాధారణంగా ప్రకృతి ఆధారితంగా ఉంటుంది. ఆహారం అనేది ప్రతి జీవికి తప్పనిసరి. పట్టణాల్లో నివసించే వ్యక్తులకు, అడవుల్లో నివసించే సంచార జాతులకు కావల్సిందే ఆహారమే. కానీ ఈ ఆహారాన్ని చూసి కులం, మతం, రంగు, వర్ణం నిర్ణయించే వికృత చేష్టలు ఈ సమాజంలో బలంగా నాటుకోపోయాయని చెప్పవచ్చు. ఎరుకల కులం వాళ్ళు సాధారణంగా వేట ద్వారా లభించే ఆహారం మీద ఎక్కువ ఆధారపడతారు. ''వేట అనేది ఎరుకల జాతి వారికి పుట్టుకతోనే అబ్బిన ఒక పరిపూర్ణమైన విద్య. వేటాడంలో వీరు కనబర్చే మెళకువలు గురించి వ్రాస్తే అది ఒక వేట ప్రధానమైన పుస్తకంగా తయారవుతుందని చెప్పడంలో ఆశ్చర్యం లేదు. అతిశయోక్తి కూడా లేదు. పూర్వం నుండి మాంసాహారులైన ఎరుకల వారు తాము స్వయంగా వేటాడిన వేటమాంసాన్ని ఆరగించడానికే ఎక్కువ మక్కువ చూపిస్తారు. అందులోనే మిక్కిలి తృప్తిని అనుభవిస్తారు.''(భీమమ్మ. ఎరుకల సంస్కృతి - సాహిత్యం. పుట:101)

'లోహముద్ర' నవలలో '' ఉదయాన్నే మొదట వేటకెళ్ళు. ఏదైనా పిట్టనో, కొంగనో కొట్టుకురా. పావురం దొరికితే వదలకు. దాని మాంసం తిని చాలా రోజులైంది. చెవులపిల్లి దొరికినా చాలు. రెండ్రోజుల వరకు తిండికి వెతుక్కోనవసరం లేదు...చెవులపిల్లి మాంసం రుచి గుర్తుకురాగానే అతనికి నోట్లో నీరూరింది. జొన్నరొట్టెలో, సజ్జరొట్టెలో కాల్చుకుని, వాటిలో కుందేలు మాంసం కూరని నంజుకుని తింటుంటే ఎంత కమ్మగా ఉంటుందో ఎన్ని రోజులైందో అటువంటి రుచికరమైన తిండి తిని'' (లోహముద్ర.పుట:8,9) అని వర్ణిస్తాడు రచయిత. సహజంగా ఎరుకల వాళ్ళు మాంసాన్ని ఎక్కువగా ఇష్టపడడానికి కారణం ఆనాదిగా అడవి ఆధారితమైన జీవితం ఉండడం ఒకటైతే, నిరక్షరాస్యత అవడం రెండోది. సహాజంగా ఆనాదిగా వస్తున్న సంస్కృతినే సలీం ఈ నవలలో వర్ణించారు. అయితే స్వేచ్ఛగా వేట ద్వారా లభించే ఆహారం తిని బతికే వీళ్ళను బ్రిటీష్ వాళ్ళు ప్రవేశపెట్టిన వివిధ చట్టాలు వాటిని దూరం చేశాయి. అందువల్ల తమ జీవితానికి కొనసాగించడానికి దొంగలుగా మారారు అని నవల ద్వారా తెలుస్తోంది. కడుపు నింపుకోవడానికి మాత్రమే వాళ్ళు ఆ విద్యను కొనసాగించారు. కానీ దాన్ని ఆసరగా చేసుకొని చాలా మంది గిరిజనేతరుల లబ్ధి పొందుతున్నారని తెలుస్తోంది.

**5.2. సోది చెప్పడం:**

ఎరుకల సోదె స్త్రీలు మాత్రమే ఆచరించే ప్రత్యేకమైన పవిత్రమైన విద్య. పురాతన కాలం నుండి కూడా రాజు, పేద, తేడా లేకుండా ఆదరించిన అద్భుతమైన విద్య సోదె"(ఎరుకల సంస్కృతి-సాహిత్యం.పుట: 59) అలాంటిది సోదె చెప్పలంటే చాలా కఠినమైన పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉంటుంది. నవలలో "ఏంటమ్మా ఇది? నా కొద్దు, అని వూసేయబోయింది. వూసేయకూడదు. మింగాల్సిందే. మింగు అంటూ అరిచింది అమ్మ. వాంతికొస్తుందమ్మా. అది తనకు ఏడుపు కూడా వచ్చింది. వాంతి చేసుకోకూడదు. ఇది మూడు ముద్దలు తిని కూడా వాంతి చేసుకోకుండా ఎవరైతే తట్టుకుంటారో వాళ్ళే మంచి సోదిగత్తెలవుతారు" అంటూ ఎరుకల వాళ్ళు ఆనాదిగా సంస్కృతికంగా కొనసాగిస్తున్న ఆచారాన్ని నవలల్లో వైవిధ్యంగా వర్ణిచారు. నవలలో ఇంకా శుభ్రత, నీటిసమస్య, ఆచారాలు, పెండ్లి, పండుగలు మొదలైన అంశాలను కూడా సందర్భానుసారంగా వర్ణించారు. ఎరుకల వారి సాంస్కృతిక జీవనం వైవిధ్యమైనది. పెండ్లి నాలుగు రోజులు వైభవంగా జరుగుతుంది. ఇలా అనేక అంశాలను రచయిత పట్టుకోగలిగారు.

**6. 'లోహముద్ర' నవల - పాత్ర చిత్రణ:**

**1.శీను:** కర్రేద్దుల శీను స్టువర్ట్ పురం సెటిల్మెంట్‌కు చెందిన వ్యక్తి. అతడు కష్టపడే తత్వం ఉన్నవాడు మరియు తన జాతిపై ఉన్న 'దొంగలు' అనే ముద్రను చెరిపివేసి, గౌరవంగా బతకాలని ఆరాటపడే వ్యక్తి. శీను ఏ తప్పూ చేయకపోయినా, కేవలం ఆ సెటిల్మెంట్‌లో ఉన్నందుకే పోలీసులు అతడిని అనుమానితుడిగా చూస్తారు. ఎక్కడ ఏ దొంగతనం జరిగినా పోలీసులు వచ్చి శీనును పట్టుకుపోవడం, చిత్రహింసలు పెట్టడం వంటివి అతని జీవితంలో నిత్యకృ□త్యం అవుతాయి. 'మేము మారదామన్నా ఈ సమాజం మమ్మల్ని మారనివ్వదు' అనే ఆవేదన అతని పాత్రలో కనిపిస్తుంది.తన తండ్రి కాలం నుండి వస్తున్న ఈ 'నేరస్థుల' ముద్ర తన పిల్లలకు రాకూడదని శీను తపన పడతాడు. కానీ, వ్యవస్థ మరియు చట్టం అతడిని వెంటాడుతూనే ఉంటాయి. తన ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి అతను చేసే ప్రయత్నాలు పాఠకులకు కన్నీళ్లు తెప్పిస్తాయి. నవలలో శీను పాత్ర కేవలం బాధితుడిగానే కాకుండా, ఒక మార్పును కోరుకునే తండ్రిగా కనిపిస్తుంది. తన పిల్లలు (ప్రసాద్, గౌరి) చదువుకుని గొప్పవారై, ఈ 'లోహముద్ర'ను (చెరిపివేయలేని ముద్రను) వదిలించుకోవాలని అతను ఆశిస్తాడు. నవల చివరలో శీను పాత్ర ద్వారా రచయిత ఒక గొప్ప సందేశాన్ని ఇస్తారు. మనిషి తన గతాన్ని వదిలించుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకున్నప్పుడు, సమాజం అతనికి సహకరించాలని, లేదంటే ఆ వ్యక్తులు మళ్ళీ నేరాల బాట పట్టే ప్రమాదం ఉందని శీను జీవితం హెచ్చరిస్తుంది.

**2. ప్రసాద్:**

ప్రసాద్ ఆవేశపరుడు. సమాజం తమ జాతిని చూసే వివక్షను ప్రసాద్ సహించలేడు. ఏ తప్పూ చేయకపోయినా పోలీసులు తన తండ్రిని కొట్టడం, అవమానించడం చూసి ప్రసాద్ మనసులో వ్యవస్థపై

ద్వేషం పెరుగుతుంది. తనపై ఉన్న 'నేరస్థుడు' అనే ముద్రను చెరిపివేసుకోవడానికి ప్రయత్నించడం కంటే, ''సమాజం నన్ను దొంగగానే చూస్తున్నప్పుడు, నిజంగానే దొంగగా మారి నా సత్తా చూపిస్తా'' అనే ప్రమాదకరమైన ధోరణి ప్రసాద్ పాత్రలో కనిపిస్తుంది. ఇది ఒక రకమైన సామాజిక వైఫల్యాన్ని ప్రతిబింబిస్తుంది.ఈ పాత్ర ద్వారా ఒక మనిషిని పదే పదే నేరస్థుడని ముద్ర వేస్తే, అతను చివరికి నిజంగానే నేరస్థుడిగా మారే అవకాశం ఉంది. ప్రసాద్ చెడ్డవాడు కాకపోయినా, పరిస్థితులు మరియు సమాజపు వేధింపులు అతడిని తప్పుడు మార్గంలోకి నెట్టేస్తాయి. ప్రసాద్ పాత్ర స్టువర్ట్ పురంలోని ఎంతో మంది యువకుల పరిస్థితికి అద్దం పడుతుంది. ప్రతిభ ఉన్నా, సరైన ప్రోత్సాహం లేక, సామాజిక ముద్రల వల్ల దారి తప్పుతున్న యువతకు ప్రసాద్ ఒక ప్రతినిధి.

**3. తిలక్:**

సలీం గారి 'లోహముద్ర' నవలలో తిలక్ పాత్ర అత్యంత ముఖ్యమైనది. కర్రేద్దుల శీను మనవడైన తిలక్ ఈ నవలలో ''మార్పుకు మరియు ఆశకు'' (Hope and Change) చిహ్నంగా కనిపిస్తాడు. తరతరాలుగా వస్తున్న నేరస్థులనే ముద్రను చదువు ద్వారా ఎలా చెరిపివేయవచ్చో ఈ పాత్ర నిరూపిస్తుంది. తిలక్ పాత్రలో ఒక విధమైన ఆవేదన కనిపిస్తుంది. బయటి ప్రపంచానికి వెళ్ళినప్పుడు తన మూలాలను (తాను ఒక సెటిల్మెంట్ కు చెందిన వాడినని) చెప్పడానికి మొదట్లో కొంత సంకోచిస్తాడు. ఎక్కడ తనను కూడా 'నేరస్థుడిగా' చూస్తారో అన్న భయం అతనిలో ఉంటుంది. కానీ, క్రమంగా ఆ భయాన్ని పోగొట్టుకుని ఆత్మవిశ్వాసంతో నిలబడతాడు.తాను ఒక్కడినే బాగుపడటం కాకుండా, తనలాంటి నేపథ్యం నుండి వచ్చే మరికొందరికి మార్గదర్శిగా నిలవాలనే తపన తిలక్ పాత్రలో కనిపిస్తుంది. వ్యవస్థను మార్చాలంటే ఆ వ్యవస్థలో భాగం కావాలని తిలక్ పాత్ర ద్వారా సలీం గారు సందేశాన్ని ఇచ్చారు. శీను పాత్ర గతాన్ని మరియు బాధను సూచిస్తే, ప్రసాద్ పాత్ర భవిష్యత్తు ఆలోచనలకు ప్రేరణైతే, తిలిక్ పాత్ర విజయాన్ని సూచిస్తుంది. సమాజం వేసిన 'దొంగ' అనే ముద్రను 'విద్యావంతుడు' అనే గౌరవంతో మార్చిన ధీరత్వం తిలక్‌ది.

**ముగింపు:**

సలీం రాసిన 'లోహముద్ర' నవల కేవలం ఒక కథ మాత్రమే కాదు, ఒక అణగారిన జాతి ఆత్మఘోష మరియు వారి ఆత్మగౌరవ పోరాటం. తెలుగు సాహిత్యంలో ఒక సామాజిక సమస్యను ఇంత లోతుగా విశ్లేషించిన నవలలు చాలా తక్కువ. డా. కేశవరెడ్డి 'అతడు అడవిని జయించాడు' నవల ద్వారా ఎరుకల జీవితం చిత్రించిన వ్యవస్థలో అణగారిన వర్గాల వారిని నాయకుడుగా కేంద్రబిందువు చేసి రచించిన, ఇలాంటి రచనలు చాలా తక్కువగానే వచ్చాయి. సినిమా రూపంలో 'స్టువర్ట్ పురం'ని, సలీం నవల 'లోహముద్ర' లోని పరిస్థితులు చాలా వైవిధ్యంగా ఉన్నాయి. వాస్తవ స్థితిగతులతో అనేకమైన ఆధారాలతో సలీం సజీవమైన ఈ నవల రాశారు. మూడు తరాలను కథ కేంద్రంగా పెట్టుకొని, ఒక జాతి

పడిన కష్టాలను, ఎదుర్కొన్న కష్టాలను కండ్లకు చూపించారు. చరిత్రలో 'స్టువర్ట్ పురం' చరిత్ర తెలుసుకోవాలంటే ఈ నవల చదవాల్సిందే. మొదటి తరం శీను తన తాతల తండ్రుల నుండి వచ్చిన వృత్తిని కొనసాగిస్తే, రెండో తరం అనేక సామాజిక బహిష్కరణను ఎదుర్కొని, మూడో తరం తమ జాతికి ఉపయోకరమైన పనులు చేసి, బాగా చదవుకొని తమ జాతిలో నుండి కూడా ఐఎఎస్ అవుతారని నిరూపించింది. ఈ తరం వాళ్ళకు మూడో తరం మార్గదర్శకం. అనుసరణీయం. దొంగల నుండి గొప్పగా చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్న ఒక విషాధ గాథను అద్భుతంగా నడిపిన సలీం ఈ నవల ద్వారా ఎరుకల జాతి జనుల పుణ్యం కట్టుకున్నరు.

**ఉపయుక్త గ్రంథాలు:**

1. జోతీరావు పూలే. గులాంగిరీ. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1993.
2. బాలగోపాల్, కె. ఆదివాసులు వైద్యం సంస్కృతి అణచివేత. హైదరాబాద్: పర్‌స్పెక్టివ్స్ ప్రచురణలు, 2015.
3. బాలగోపాల్, కె. కార్టూన్లలో మార్క్స్. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, 1982.
4. భీమమ్మ. ఎరుకల సంస్కృతి - సాహిత్యం. హైదరాబాద్: గ్లోబల్ రీసర్చ్ సొసైటి పబ్లికేషన్,2017.
5. సలీం. లోహముద్ర. హైదరాబాద్: అన్వీక్షికి పబ్లిషర్ ప్రై.లి., 2024.
6. హనుమంతరావు. డా.బి.ఆర్.అంబేద్కర్ కులనిర్మూలన. హైదరాబాద్: భూమి బుక్ ట్రస్ట్, 2022.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## కుంకుడాకు కథ - సామాజిక చైతన్య దీపిక

**డాక్టర్ చుండూరు పవన్ కుమార్,**
సంస్కృత అతిథి అధ్యాపకుడు, తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్, ఆంధ్రప్రదేశ్ - 522 510,
చరవాణి : 80083 23223,
ఈ-మెయిల్ : pavansimha1981@gmail.com

### ప్రస్తావన

ఆధునికాంధ్ర సాహిత్యంలోని కథకుల్లో చా.సో.గా వినుతికెక్కిన చాగంటి సోమయాజులు గారు అగ్రగణ్యులు. సాహిత్యం అంటేనే సమాజహితాన్ని కోరేదని అర్థం. అలాంటి సామాజిక స్పృహ కలిగిన రచయితలలో చాగంటి గారు ప్రముఖులు. అభ్యుదయ భావాల్ని తన రచనలలో చెప్పడమేగాక జీవితాంతం తాను స్వయంగా అభ్యుదయవాదిగా జీవించడం వీరి ఔన్నత్యాన్ని, ఉన్నత వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుంది.

"ఒక సన్నివేశానికి ఉండే వివిధ కోణాలను పోల్చి, ఏ కొస నుండి ప్రారంభిస్తే అది ఒక జీవన సూత్రానికి వ్యాఖ్యాప్రాయంగా ఉంటుందో గ్రహించగలిగేవాడు గొప్ప రచయిత. అటువంటి అపురూప లక్షణం గల కథా రచయిత చాగంటి సోమయాజులు"(1) అని శ్రీకాంత శర్మ చక్కగా చెప్పారు. శ్రీకాకుళంలో 17-1-1915న జన్మించిన "చాసో" విజయనగరంలో నివసించారు. తెలుగులో చాసో "చెఖోవ్ వంటి కథా శిల్పి" అంటారు. వాయులీనం, లేడీ కరుణాకరం, పరబ్రహ్మము, కుక్కుటేశ్వరము, భల్లూక స్వప్నం, ఎంపు, దుమ్ముల గొండె మొదలైన ఎన్నో కథలను వైవిధ్యభరితంగా రచించిన ఘనులు సోమయాజులు గారు. ఒక్కొక్క కథ ఒక్కొక్క బాషలో ఉంటుంది. ప్రతి కథ అంతర్గర్భితంగా ఆదర్శవిలువలతో నిండి, వాస్తవికతను ప్రదర్శిస్తూ పాఠకులను మళ్లీమళ్లీ చదివేలా చేస్తుంది. ఉపమానాలు సహితం కథలోనుండే సహజ సిద్ధంగా ఉద్భవిస్తాయి. ఎన్నో ఉదాత్తమైన కథలను రచించి తెలుగు సాహితీ సేద్యాన్ని సుసంపన్నం చేసిన సాహితీకృషివలురు సోమయాజులు గారు. అలాంటి వీరి అమృతలేఖిని నుండి జాలువారిన 'కుంకుడాకు' కథలోని సామాజిక చైతన్యాంశాలను యథామతి పరిశీలించటమే నా ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యం.

### కుంకుడాకు కథ - సామాజిక చైతన్య దీపిక

చాగంటి సోమయాజులు గారు రచించిన అభ్యుదయ - సామాజిక చైతన్య భావాలు కలిగిన కథలలో ఈ 'కుంకుడాకు' కథ ఒక ఆణిముత్యం అని చెప్పవచ్చు. కథకు తగినటువంటి శీర్షికను నిర్ణయించటంతోనే చాగంటి గారి గొప్పతనం మనకు అర్థమవుతుంది. ఉత్తరాంధ్ర యాసలో రచయిత ఈ కథను ఆరంభిస్తూ –

"అప్పలనాయుడు కూతురు పారమ్మ. చినదేముడు కూతురు గవిరి. ఊళ్ళోంచి పొలాల్లోకి పోతున్నారు. అప్పలనాయుడు మోతుబరిరైతు. చినదేముడు గోచిపాతరాయుడు. అంచేత పారమ్మ చింకిపరికిణీ కట్టుకుంది. గావంచా పైటేసుకుంది. గవిరి గోచీ పెట్టుకుంది. కంపకట్టా, తట్టా పట్టుకుంది. పారమ్మ మెళ్ళో పగడాలున్నాయి. చేతులకీ, కాళ్ళకీ సిల్వరు కడియాలున్నాయి. గవిరి ముక్కు గోక్కుంది. దాని ముక్కులో రాగి కాడలున్నాయి. పారమ్మ ముక్కుకీ, చెవులకీ బంగారపు కాడలున్నాయి"[2] అని ఒకే వయసున్న ఇద్దరమ్మాయిల పాత్రల్ని సజీవంగా మన కళ్ళముందుంచాడు. ఈ ఇద్దరి పాత్రల తీరుతెన్నులను పరిశీలిస్తే మన సమాజం కుల-ఆర్థిక అసమానతలతో ఎంతగా చీలిపోయి పయనిస్తుందో రచయిత ఇక్కడ సూటిగా తేటతెల్లం చేసాడు. అంతులేని సంపదలున్న ధనిక వర్గం, కూడు-గుడ్డ-గూడు వంటి కనీస అవసరాలు కూడా లేక హీనంగా, దీనంగా బ్రతుకీడుస్తున్న బడుగుబలహీన వర్గం ప్రక్కప్రక్కనే ఉన్నా ఎన్నటికీ కలవనంతగా సమాంతరంగా విడిపోయి జీవిస్తున్నారని మనకర్థమవుతుంది. ఇంతలో –

"సెడ్డ రుసిగా వుంది" అంటుంది పారమ్మ.

"ఏటి ?" అనడుగుతుంది గవిరి.

"ఊరగాయ"

"ఎక్కడిది ?"

"మాయయ్యకి బుగతగోరిచ్చారు" [3] అంటుంది పారమ్మ.

వాళ్ళయ్య అప్పలనాయుడు మోతుబరి రైతు. కనుక బుగతలు ఏది అడిగినా ఇస్తారని రచయిత వ్యంగ్యంగా ఇలా పేర్కొన్నాడు.

ఆ మాటలను విన్న గవిరి - "నాను రెయ్యిలు నంచుకొన్నాను"[4] అంటుంది. గొప్పకోసం అబద్ధమాడింది కానీ, ఈ మాటలలో గవిరి లేనితనం, ఆత్మాభిమానం కలబోసుకొని కనిపిస్తాయి.

గవిరి మాటలు విన్న పారమ్మ "ముండా గొప్ప ! ఎవడికి తెల్దనుకున్నావు గావాల, గింజలునేక రేత్రి మిరగ్గేసుకోనేదు. మాయయ్య సెప్పినాడు. తాగడానికి దప్పికనేదు రెయ్యిలు నంచుకొంది రెయ్యిలు"[5] అని చులకన భావనతో ఎత్తిపొడుస్తుంది.

ఆ మాటలకు ఆత్మాభిమానం గల గవిరి - "నిన్న రేతిరి మీకూ కూడు లేదు"[6] అని పౌరుషంగా మాటకు మాట అంటుంది. ఆ మాటలకు పారమ్మ - "నిన్నరేతిరి మాకు కూడునేదూ ? ఓసి లమిడీ ? ఎవిడు సెప్పినాడు? [7] మాయమ్మనడుగు. రేత్రి మునేళ్ళం సేపల పులుసు, వొరన్నం తిన్నాం" అని గర్వంగా అంటుంది పారమ్మ.

వీరిరువురి మాటలను గమనిస్తే - మింగ మెతుకు లేక, గుక్కెడు గంజికి నోచుకోక ఆకలి మంటలకు చిక్కి కాలిపోతున్న అభాగ్యులు ఒక వైపు, మృష్టాన్న భోజనాలతో, విందువిలాసాలతో జీవితాన్ని హాయిగా అనుభవిస్తున్న పెత్తందార్లు మరొక వైపు జీవిస్తున్న జీవన విధానం, పేదలంటే సిరికలవారికుండే సహజ చులకన భావం మనకు స్పష్టంగా తెలుస్తుంది.

చిన్నబోయిన గవిరి కళ్ళాల వైపు నడుస్తుంది. పారమ్మ కూడా చేతులూపుకుంటూ వెంబడిస్తుంది. అదే సమయంలో ఊళ్ళో బడిపిల్లల - "తల్లి నిన్ను దలంచి" అని మాస్టారు చెబుతుంటే బిగ్గరగా వల్లేవేస్తున్నారు. పారమ్మ, గవిరి ఇరుకు కళ్ళాల్లో మాట్లాడుకుంటూ నడుచుకుంటూ వెళుతుంటారు.

"నాను మంగళవారం బడికెళతాను. ఆయేల మంచిరోజు. మేష్టేరు గోరు పంపమంటే మాయయ్య పంపుతానన్నాడు"(8) అంటుంది పారమ్మ. ఆ మాటకు -

"ఎందుకు ముష్టి సదువూ?" (9) అని గవిరి అంటుంది.

"సదువెందుకా? ఇను ఇను ఎనాగ పాడుతున్నారో!" (10) అని పార అంటుంది.

"మాయయ్యని మేష్టేరుగోరడిగినారు. కూలిసేసుకొనే వోళ్ళకి సదువెందుకన్నాడు మాయయ్య"(11) అంటుంది గవిరి.

"అవును మీయయ్య కూలోడు. మాయయ్య నాయుడు." (12) అని గర్వంగా చెబుతుంది పారమ్మ. ఆ మాటలకు గవిరి గొంతులోకి ఏడుపూ, కళ్ళలోకి నీళ్ళు తోసుకొస్తాయి.

వీరి ఈ సంభాషణ ద్వారా - సమాజంలో చదువనేది కొందరికి మాత్రమే అందే వరమని, అది అభాగ్యులకు అందని ద్రాక్షయని, సమసమాజం అనేది మేడిపండు చందమేనన్న విషయాన్ని రచయితా ఇలా హృద్యంగా చిత్రీకరించాడు.

దూరంగా బడిపిల్లలు గొంతు చించుకుంటూ - 'సరస్వతీ నమస్తుభ్యం' అని ప్రార్థిస్తుంటారు. పార కూడా కూనిరాగం తీస్తూ 'సరస్పతీ నమత్తుబ్బెమ్' అని అంటుంది.

"నువ్వు పాడుకుంటూ కూకో, నాను కంపలేరుకోవాలి"(13) అని గవిరి కళ్ళంలోకి పోతుంది. పార కూడా గవిరిని వెంబడిస్తుంది.

"గవిరి వయస్సు ఎనిమిదేళ్ళు. కాని దాని నెత్తిమీద కొండంత సంసారభారం ఉన్నది. చిన్న దాక నెత్తిమీద పెట్టుకొని కోనేటికి పోయి ఇంటికి అవసరమయ్యే నీళ్ళలో సగం అదే మొయ్యాలి. తలపెట్టుకొని పెండలంట, తోటలంటా పోయి ఆకు అలమూ, కర్రా, కంపా ఏరి ఇంటికి ఒక పూటకి సరిపడే

వంట చెరకు తేవాలి, ఆ బాధ్యతలను గవిరి మోసి ఉన్నాది"(14) అని గవిరిని గూర్చి రచయిత చెప్పటంతోనే నిరుపేదల బాల్యం బరువు-బాధ్యతలనే చక్రబంధాల నడుమ చిక్కి ఎలా నలిగిపోతున్నదో అర్థమవుతుంది. అలాగే గవిరి కుటుంబ దీనస్థితి కూడా మనకు కళ్ళకు కట్టినట్టు కనబడుతుంది.

పక్క పొలాల్లో గుత్తులు గుత్తులుగా వేలాడుతున్న పెసరకాయ మొక్కల్ని నాలుగుపీకి పారమ్మ కాయలేరుకు తింటూ ఉంటుంది. గవిరి కడుపులో ఆకలి కాల్తుంటుంది. దానికి ఆవేళ దప్పికలేదు. అంతకుముందు రాత్రికూడా తిండిలేదు."ఓలమ్మ ఆకలేవ్!" అంటూ రాత్రంలో ఏడ్చి వాళ్ళమ్మ ఓదారిస్తే ఏడ్చిఏడ్చి ఆఖరికి ఆకలితోనే నిద్రపోతుంది. అంత ఆకలిగా వున్నా గవిరి పెసరకాయల్ని కోసి తినే సాహసం చేయలేకపోతుంది. దానికి కారణాన్ని రచయిత సూటిగా ఇలా చెప్తాడు.

"గవిరి కూలివాడి కూతురు. పొలాల్లో పడి దొంగతనంగా తినడానికి ధైర్యం చాలదు . నాదారులు ఆరకం చిన్న దొంగతనాలు చేస్తే పెద్ద నేరాలు అవుతాయి. ఉన్నవాళ్ళు చేస్తే కమ్ముకుపోతుంది. పారమ్మ చెట్లు పీకి తోవకడాకూ తింటున్నది. దానికి నిర్భయం." (15)

ఈ మాటలు చాలు నేటి మన సమాజంలో న్యాయం అనేది ఉన్నవాడికో రకంగా, లేనివాడికో రకంగా దక్కుతుందని, ఈ సభ్యసమాజం సిరికలవానికి వంగి వంగి సలాములు చేస్తుందని, అదే లేనివాని పట్ల నిర్దయతో వ్యవహరిస్తుందని స్పష్టమవుతుంది .

"ఆళ్ళు సూస్తే టెంకి మాడుతుందిలే"(16) అని గవిరి అంటే -

"సూసినోడెవడు ? సూసినా నానప్పలాయుడు బొట్టిని. ఆళ్ళమొకం ఏటంటారు ?" (17) అని పార అంటుంది. వీరిరువురి సంభాషణ పేదవానికి లేమి వలన వచ్చిన భయాన్ని, కలవానికి డబ్బువలన వచ్చిన అహంకారాన్ని తెలియజేస్తుంది.

గవిరి కడుపులో కరకరూడులోంది. దాని కళ్ళకి సత్తుగిన్నెలో నిండా గిన్నెడు గంజి, నంచుకోడాన్కి ఎండుమిరపకాయ కనబడతాయి. ఎక్కణ్ణుంచి వస్తాయి? వాళ్ళయ్య చినదేముడు కూలిఏమైనా తెస్తే రాత్రికి తిండి, లేకపోతే ఆ రోజు పస్తు పడుకోవలసినదే. గవిరి కళ్ళు బాధతో నీళ్ళతో నిండిపోతాయి. బక్కచిక్కిన పేదవాడు నిత్యం తినే చాలీచాలని ఆహారమిది.

వెళ్తుంటే దారిలో కుంకుడుచెట్టు తోవనిండా ఆకులు రాలుస్తుంది. కుంకుడాకుల్ని చూచి గవిరి ఆకలిని మరచిపోతుంది. అన్ని ఆకుల్లోకి కుంకుడాకులు చాలా దళసరివి. నాలుగాకులు ఏరితే తట్ట

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

నిండుతుంది. అందుకనే గవిరి ఆనందంతో ఆకులన్నింటినీ తుడిచి తట్టలోకెత్తి నొక్కి కుక్కుతుంది . దాని బాధ్యత ఆపూటకి అయిపోయింది. తట్ట బరువుగా నిండుతుంది. దాని గుండె తేలికవుతుంది. ఇద్దరూ ఇంటికి బయలుదేరతారు. పారమ్మ ఆనందంతో పొలికేకలేస్తూ బయలుదేరుతుంది. దారిలో కాంభుక్త (కామందు) గారి కళ్ళాం చేరుకుంటారు. కళ్ళాం వారనుంచి చింతచెట్టు కిందగా పోతుంటారు. ఇంతలో వాళ్ళముందు ఏదో టప్పని పడుతుంది.

"ఓలమ్మో తేలు!"(18) అని తుళ్ళిపడి కేకపెడుతుంది పార.

"తేలు కాదు పీత"(19) అంటుంది గవిరి .

ఏ కొంగనోట్లోంచి పడ్డాదో ! అని గవిరి చింతలలోకి చూస్తుంది. చింతల శిఖరాలు కొంగలతో నిండివుంటాయి.

"ఎన్ని సింతకాయలో"(20) అంటుంది గవిరి. పారమ్మ తలెత్తి చూస్తుంది. దానికి నోరూరుతుంది. రాళ్ళు తీసికొడుతుంది. మూడుకాయలు రాలతాయి. ఒక కాయ కొరుక్కొని రెండుకాయలు చింకి పరికిణిలో దోపుకుంటుంది.

"ఒలే పారా నాకో కాయెట్టవు ?" (21) అనడుగుతుంది గవిరి.

"నువ్వూ కావలిస్తే కొట్టుకో"(22) అంటుంది పార.

'ఒలే ఒలే' అని గవిరి ప్రాధేయపడుతుంది, ఎందుకంటే గవిరికి పేదరికం వల్ల వచ్చిన భయం తనను అలా ప్రాధేయపడేలా చేసింది.

"ఆ యేటి రాళ్ళు"(23) అని పారమ్మ ముందుకు నడిచి వెళ్ళిపోతుంది. అంతేకానీ తన దగ్గరున్న ఒక కాయను కూడా పంచి ఇవ్వలేదు. ఆమె మనసు కరగలేదు. నిజమే ఉన్నవాడు లేనివాడికి కొంచం పంచి ఇస్తే ఈ సమాజంలో హెచ్చుతగ్గులనవే ఉండవు, కానీ ఉన్నవాడికి పంచి ఇచ్చేంత గొప్ప మనసు లేదనే నిష్ఠుర సత్యాన్ని రచయిత ఇక్కడ వ్యంగ్యంగా పలికించాడు.

గవిరి తలెత్తి చూస్తుంది. కొడవళ్ళలాగ ఊగుతూ కారులు వేళ్ళాడుతుంటాయి. గవిరి భయపడుతూనే ఒకరాయి విసురుతుంది . ఆ రాయి దబ్బున కిందపడుతుంది. ఈ చప్పుడికి మరింత భయపడపోయి నాలుగు పక్కలా చూస్తుంది. పారమ్మ మళ్ళా పెసరకాయల కోసం పొల్లాల్లోకి పోతుంది. గవిరి మరో రాయి విసురుతుంది. కాయలు రాలకపోయినా పెద్ద ఎండుకొమ్మ చెట్టుమించి గలగలమని

జారి కిందపడుతుంది. గవిరి చంకలు కొట్టుకుంటుంది. "ఆయి దెబ్బ" అని ఆ కంపమీదికి ఒక్క పిల్లిగంతు వేసి కొమ్మని చితుకులుగా విరిచి తట్టమీద పెట్టుకుంటుంది. ఇంతలో "ఎవరక్కడ" అని కళ్ళాంలోంచి కేక వినిపిస్తుంది. గవిరికా కేక పిడుగుపాటులా తోస్తుంది. కళ్ళంలోకి చూడగా ఎదురుగా కాంభుక్త (భూకామందు) గారు నిలబడి చింతనిప్పులు రాలుస్తూ గవిరినే చూస్తుంటారు.

"పొయినోకి" అని వొణుకుతూ గవిరి చెపుతుంది. కోపంతో భుక్తగారు గవిరి మీదకెళ్ళగా తట్టలో కుంకుడాకు, మీదని చింతకంపా కనపడతాయి. వెంటనే అతడు పాంకోడిమీద కాలుఎత్తి తట్టని సత్తువతీరా తంతాడు. తట్టా ఆకు ఎగిరిపోతాయి. గవిరి గడగడలాడుతూ తట్టతీసుకొని మళ్ళీ కిందపడ్డ ఆకును ఎత్తుకోబోతుంది.

"లమ్డీకానా ఇంకా ఎత్తుతున్నా?"(24) అని ఉరుముతాడు.

"గవిరి జీవితానికి ఆ చెత్త ఎంత విలువైనదో అతనికి తెలియుదు. చినదేముడు సంసారానికి కూతురు గవిరి తెచ్చిపెట్టే ఆ చెత్తకి ఆర్థికంగా ఎంతయినా విలువ ఉన్నది. ఆ చెత్త ఒక పూట పొయ్యిలోకి చాలు. ఆ సంగతి గవిరికి తెలుసు. ఎనిమిదేళ్ళదే అయినా ఆ బాధ్యతను గవిరి ఎరిగి ఉన్నది"(25) అని రచయిత ఎందుకూ పనికిరాని చెత్తకూడా పేదల బ్రతుకుల జీవనయానానికి ఎంత ముఖ్యమో చెబుతున్నాడు.

'చెత్తకోసం గవిరి ప్రాణం తహతహ లాడిపోడుతుంది. "బాబుగోరూ! మరెప్పుడూరాను"(26) అని ప్రాధేయ పడుతుంది . కనికరంలేని భుక్తగారు చుట్టూ చూస్తారు. ఆయనకి ఒక ఆనవాలు దొరుకుతుంది "ఏమిటీ ఆతుప్పవార దాచేవ్? "(27) అనడుగుతాడు.

"నానేటీ దాచనేదు"(28) అని గవిరి చెప్పగా, అతను తనచేతి కర్రతో తుప్పనెత్తుతాడు. దానివార తట్టెడు పేడ బైటపడుతుంది. నీ దొంగతనం బైటపడిపోయిందే అని తన చేతికర్రతో వెన్నుమీదొక్కటేసి "ఏమిటే అది?" అనడుగుతాడు. "అమ్మోయ్ సచ్చిపోవాను. నాను కాదు బాబోయ్"(29) అంటూ ఏడుపు మొదలు పెడుతుంది గవిరి.

"ఇంకెవరే లంజకానా?"(30) అని మరొక్కటిస్తాడు. . గలిరికేం అర్థం కాలేదు. తను కాదని ఎంత చెప్పినా భుక్తతంతున్నాడు, చివరకు ఏడుపులోంచి దానికి పౌరుషమొచ్చింది. తను దొంగకాదు. అంచేత ధైర్యమొచ్చింది. ఏడుపుమాని కళ్ళెర్రజేసి

"నాను కాదు నాతుట్టా సేతులు సూడు"(31) అన్నది. నిజమే దాని తట్టకీ చేతులకీ పేడ మరకలు లేవు. కళ్ళంలో పాలేర్లే ఆపని చేశారు. కానీ భుక్తగారి బుద్ధి వికసించలేదు. కర్రతో మరొక్కటిస్తాడు. గవిరి ఎంత వక్కాణించి చెప్పినా కొడతాడు.

"ఓర్నంజకొడుకో ! నాను కాదు. ఓలమ్మో నాను కాదు. ఓర్నంజకొడుకో !(32) అంటూ గవిరి తిట్లదండకం అందుకుంటుంది .

ఈ సంభాషణ సమాజంలో చెయ్యని నేరానికి కూడా అమాయకులైన పేదలు ఎలా అన్యాయంగా బలవుతున్నారో, వారిని పెత్తందార్లు ఎలా పీక్కుతింటున్నారో తెలియజేస్తుంది.

మహామహులన్నే అణచివేసిన భుక్తగారు అమాటలకు కోపం పట్టలేక తన పాంకోడు తీసి గవిరి మీదకు విసురుతాడు. అప్పుడు అది -"దాని పిక్కమీద ఎమికెకి ఖట్టని తగిలింది. అది బోర్లాపడి మన్ను కరచుకొంది. పీక తెగ్గోసిన కోడిలాగ గిలగిల కొట్టకొని చుట్టుకుపోయింది. దాంతోటిక భుక్తగారు సంతృప్తిపడి వెళ్ళిపోయారు"(33) అని రచయిత సహజంగా వర్ణిస్తాడు.

నీతి, నిజాయితీలతో బ్రతికే పేదలను నిష్కారణంగా దొంగలని ముద్రవేస్తే, ఆత్మగౌరవాన్ని దెబ్బకొడితే తమ ఉనికికోసం ఆ పేదలు పెత్తందార్లపై తిరగబడితే భూస్వామ్యవర్గం ఎన్నటికీ సహించదని, కసిదీరా అణచి తృప్తి పడుతుందని ఈ సంఘటన ద్వారా రచయిత వివరించాడు .

ఏడ్చి ఏడ్చి గవిరి కళ్ళు తెరించింది. పొద్దు లేచిపోతుంది. బడిలో పిల్లలు ఎక్కాలు వల్లెవేస్తున్నారు.గవిరి కళ్ళాంలోకి చూస్తుంది. ఎవరూలేరు. కింద చెల్లాచెదురుగా పడివున్న కుంకుడాకుని ఒక చోటికి చేర్చుతుంది . ఆమె వొదిలితే పొయిల్లోకి ఇంధనం లేదు. తల్లీ, తండ్రి పొయ్యిమీదికి కావలసినవి తేగలిగినా, తేలేకపోయినా గవిరి పొయ్యిలోకి మాత్రం తెచ్చి తీరాలి. ఇది గవిరి దీన స్థితి.

"లమిడికొడకా ! నీ సింతకంప లేవిడికీ అక్కరలేదు!"(34) అని చింతాకంపలు వొదిలేసి తను కష్టపడి ఏరుకున్న కుంకుడాకు తట్టను నెత్తిని పెట్టుకుంటుంది.ఇక్కడ గవిరి పాత్ర ద్వారా పేదల ఆత్మాభిమానాన్ని, నీతి, నిజాయితీలని, తాము కష్టపడి సంపాదించిన సొమ్మును మాత్రమే ఆశించే మనస్తత్వాన్ని రచయిత ఎంతో గొప్పగా చిత్రీకరించారు. కాలు మండిపోతోంది. అప్పుడు వొంగి దెబ్బని చూసుకుంటుంది. ఎమికమీద పాంకోడు దెబ్బ పెద్ద బొప్పి కట్టివుంటుంది. బొప్పి మీద చిట్లి ఎర్రగా వుంటుంది. "

"ఓలమ్మో!" అంటూ మర్లా ఉక్కిరిబిక్కిరిగా ఏడ్చుకుంటూ గవిరి గోర్జలోకి వెళ్తుంది. బడిపిల్లలింకా ఎక్కాలు పాడుతుంటారు.

"పదహారార్లు తొంభైయారు" అని ఒకరు అరుస్తుంటే "పదహారార్లు తొంభైయారు" అని అంతా కలిసి పాడుతుంటారు అని రచయిత కథ ముగింపును పాఠకుల నిర్ణయానికే వదిలేశాడు.

**ఉపసంహారం**

'అంతేలే పేదల బ్రతుకులు, అశ్రువులే నిండిన కుండలు' అన్న శ్రీ శ్రీ గారి పలుకులు ఈ కథ ద్వారా మనకు అక్షర సత్యంగా అనిపిస్తాయి. చా.సో. గారు ఈ కథ ద్వారా అభ్యుదయ సమాజం రావాలంటే పేద-ధనిక వర్గాల మధ్య అంతరాలు తగ్గాలని, కానీ ఈ స్థితిరావటం అంత సులభంకాదని, ఆలోచనలను రేకిత్తిస్తూ, విజ్ఞానాన్ని మేల్కొలిపి సమాజం యొక్క మార్పునకు నాంది పలకవలసిన విద్యకూడా మూసపద్ధతిలో సాగుతూ, ఒకరు ఏది చెపితే అది వల్లెవేసి నూతన ఆలోచనలను చంపే ఒక సాధారణ సాధనంగా మారిందని, ఫెత్తందార్లు తమ సంకుచిత మనస్తత్వాన్ని విడనాడాలని, పేదల బ్రతుకులలో నవోదయానికి ఇతోధికంగా సాయం అందించాలని అప్పుడే పేద-ధనిక వర్గాలు లేని సమసమాజం ఏర్పడుతుందని, అభ్యుదయ సమాజం కోసం ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా శ్రమించాలని, లేకుంటే ఈ అసమసమాజపు విషపు నీడలలో వర్గాలుగా విడిపోయి తిరోగమన మార్గంవైపు పయనించవలసి వస్తుందని తెలియజేశారు.

**సందర్భ సూచి**

1. డాక్టర్ ద్వా.నా. శాస్త్రి – *తెలుగు సాహిత్య చరిత్ర* – పు.సం. 603
2. చాగంటి సోమయాజులు – *చాసో కథలు* (రెండవ కూర్పు) – పు.సం. 18
3. చాగంటి సోమయాజులు – *చాసో కథలు* (రెండవ కూర్పు) – పు.సం. 19
4. చాగంటి సోమయాజులు – *చాసో కథలు* (రెండవ కూర్పు) – పు.సం. 20
5. చాగంటి సోమయాజులు – *చాసో కథలు* (రెండవ కూర్పు) – పు.సం. 21
6. చాగంటి సోమయాజులు – *చాసో కథలు* (రెండవ కూర్పు) – పు.సం. 22
7. చాగంటి సోమయాజులు – *చాసో కథలు* (రెండవ కూర్పు) – పు.సం. 23

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1) డాక్టర్ ద్వా.నా. శాస్త్రి-తెలుగు సాహిత్యచరిత్ర -ప్రతిభ పబ్లికేషన్స్,హైదరాబాద్.
2) చాగంటి సోమయాజులు-చాసో కథలు (రెండవకూర్పు)-విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,విజయవాడ.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## గరిమెళ్ళ – జాతీయ తత్త్వం

డా. బి. మేరి కుమారి
జె.యం.జె మహిళా కళాశాల తెనాలి, తెనాలి

ఆయన మన తెలుగువాడు. కవి,సత్యాగ్రహి. ఆయన కలం నుంచి వెలువడిన పాట స్వాతంత్ర్య గీతంగా మారింది.లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చింది. భారతదేశంలో బ్రిటిష్ పాలనా నుండి స్వాతంత్ర్యం కోసం పోరాడిన సామాజిక,రాజకీయ చరిత్ర మనందరికీ తెలుసు.కాని మన దృష్టికి అంతగా ఆకర్షించనిది ఆ కాలపు సాహిత్య చరిత్ర.నాటి కవులు,రచయితలు తమ తోటి భారతీయులను స్వాతంత్ర్యోద్యమం వైపుకు నడిపించారు.విదేశీ పాలన యొక్క బానిస సంకెళ్ల నుండి భౌతికంగానే కాక,మానసిక సంకెళ్ళను కూడా త్రెంచడంలో ఆ నాటి కవులు రాచైతలేందరో ముందు వరసలో నిలిచారు. 200 సంవత్సరాల అణచివేత ప్రజలలోని ఆత్మ స్థైర్యాన్ని, సంకల్ప శక్తిని నాశనం చేసింది. కానీ కవిత్వం,పాట పరదేశి పాలనకు వ్యతిరేకంగా ప్రజలు తమ గొంతును విప్పడానికి దోహదపడింది.ఆనాటి కవుల,రచయితల కవిత్వము,పాట ప్రజల్లో తిరుగుబాటును రగిలించటంలో కీలక పాత్ర పోషించాయి.

గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించారు.తల్లి సూరమ్మ, తండ్రి వెంకట నరసింహం.గరిమెళ్ళ ప్రాదమిక విద్య స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో సాగింది.విజయనగరం,మచిలీపట్టణం,రాజమహేంద్రవరం మొదలైన చోట్ల పైచదువులు చదివారు. బి.ఏ.చేశాక గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా కొంతకాలం పనిచేసారు. ఆ తరువాత విజయనగరం ఉన్నత పాటశాలలో ఉపాధ్యాయుడిగా కొంత కలం పనిచేశారు. గరిమెళ్ళ చిన్నప్పుడే తన మేనమామ కూతుర్ని వివాహం చేసుకున్నారు.ఆయన స్వేచ్ఛాప్రియత్వం వల్ల ఎక్కడా ఎక్కువ కాలం ఏ ఉద్యోగమూ చెయ్యలేకపోయారు.

నాటి స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ళ సత్యనారాయణది విశిష్టమైన స్థానం. స్వాతంత్ర్యోద్యమ కాలంలో శ్రీ గరిమెళ్ళ గేయాలు జాతీయ వీరరసంతో తొణికిసలడుతూ పాటక జనాన్ని ఉర్రూతలూగించాయి. ఆయన రాసిన "మాకొద్దీ తెల్లదొరతనము ….." పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువను,ఉత్తేజాన్ని కలిగించింది. అలాగే "దండలు దండలు భాతమాత" అనే గీతం కూడా ప్రజలను ఎంతగానో జాగృతం చేసి ప్రజలు పెద్ద ఎత్తున స్వతంత్ర్యోద్యమంలోకి ఉరికే తెగువను కలుగచేసింది.దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ప్రధముడు శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ. నిజాయితీకి, నిర్భీతికి మారు పేరుగా నిలిచారు. మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఆనాడు

ప్రతి తెలుగువాడి నోటా మర్మోగేది. ఆయన అంత ప్రసిదినందున జాతీయ కవి ఆరోజుల్లో మరొకరు లేరు.తెలుగు నాట జాతీయ కవిత్వానికి నూతన వరవడిని సృష్టించిన కవి ప్రముఖుడు శ్రీ గరిమెళ్ళ.

**జాతీయోద్యమ స్ఫూర్తి**

1920 డిసెంబర్ లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్స్ మహాసభలో సహాయనిరాకరణ తీర్మానం ఆమోదించబడింది. ఆ వీరావేశంతో ఉద్యమంలోకి దూకిన గరిమెళ్ళ మాకొద్దీ తెల్ల దొరతనం రాసారు. ఆనాటి రోజుల్లో రాజ్యమండ్రిలో ఈ పాట నకలు కాపీలు ఒక్కొక్కటి బేడా (12 పైసలు) చొప్పున అమ్ముడు పోయేవట. ఆ రోజుల్లో కాంగ్రెస్స్ స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు ధరించి, గాంధి టోపీ పెట్టుకొని, బారులు తీరి మువ్వన్నెల జెండా ఎగరవేసుకొంటు మాకొద్దీ తెల్లదరతనం – దేవా మాకొద్దీ తెల్లదొరతనం అంటూ ఆకాశం దద్దరిల్లేల పాడుతూ వీదుల్లో కవాచు చేసేవారట.ఆ తర్వాత సబర్మతీ ఆశ్రమంలో, గాంధీజీ ఈ పాటకు అనువాదము చేయించమని పురమాయించారు . టంగుటూరి ప్రకాశం పంతులు గారి "స్వరాజ్య" పత్రికలో ఇంగ్లీష్ లోకి అనువదించి ప్రచురించారు.N .G..రంగా,గరిమెళ్ళను "ప్రజాపాటల త్యాగయ్య" అని ప్రశంసించారు.

ఆనోటా –ఈనాట ఈపాట గురించి ఆనాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ చేవినపడింది ఆయన గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నారట.గరిమెళ్ళ కేవలం రచయితే కాదు, గొప్ప నాయకుడు కూడా. తన కంచు కంటంతో ఖంగున పాటలు కూడా పాడగలడు. గరిమెళ్ళ పాటలు విన్న బ్రిటీషు కలెక్టరు తెలుగుభాష నాకు రాకపోయినప్పటికి ఈ పాటలో ఎంతట మహాతర శక్తి ఉందో,సామాన్య ప్రజలను సైతం ఎలాచైతన్య పరచగాలదో నేను ఊహించాగాలనన్నాడట.ఆ పాటను వ్యసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. ఈ అరెస్టు 9ఫిబ్రవరి 1922న జరిగింది. ఫిబ్రవరి 11 ఎడిషన్ లో,ది హిందు వార్తాపత్రిక గరిమెళ్ళ తన దేశ ప్రజలను ఉద్దేశించి వ్రాసిన ఒక లేఖను ప్రచురించింది:

శిక్షపూర్తి చేసుకొని జైలునుంచి విడుదలైన గరిమెళ్ళ మళ్ళి ప్రజల మధ్య గొంతెత్తి పాడసాగాడు. ప్రజలను ఎంతగానో ఆకట్టుకోసాగాడు.ఇది చూసి ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయత ఉండడం ప్రభుత్వానికి మంచిది కాదని భాదించి ఆయనను అరెస్టు చేసారు. కాకినాడ మిజిస్ట్రేట్ ముందు హాజరు పరిచారు.మేగిస్ట్రేట్ రెండు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించాడు.గరిమెళ్ళ జైలులో ఉండగా 1922 జనవరిలో ఆయన తండ్రి చనిపోయాడు.క్షమాపణ చెబితే వదులుతామని చెప్పారట. కాని గరిమెళ్ళ క్షమాపణ చెప్పకుండా జైలులోనే ఉన్నారు.అంతటి దేశభక్తుడు ఆయన.

1921 నాటికి మహాత్మా గాంధీ స్వాతంత్రోద్యమంలో తిరుగులేని నాయకుడిగా చేరారు.ఆయన స్ఫూర్తితో, అన్ని వయసుల,తరగతుల ప్రజలు "సత్య గ్రహులు" అయ్యారు.బ్రిటిష్ వారు వారిని

దేశద్రోహులుగా చిత్రీకరించారు.నిర్దాక్షిణ్యంగా వేదించారు.ఈ పరిస్థితిని గరిమెళ్ళ 'మాకొద్దీ.......'పాటలో వివరించారు.

స్వాతంత్ర్య సమరయోధులను అరెస్ట్ చేయడంలో ప్రభుత్వం చాలా తీవ్రంగా ఉంది కాబట్టి,గరిమెళ్ళ ప్రజలు స్వచ్ఛందంగా కోర్టులో అరెస్ట్ కావాలని కోరారు. బయట బానిసలుగా జీవించడం కంటే జైళ్ళను నింపి,స్వేచ్ఛగా ఉండాలని ప్రజలకు ఆయన సూచించారు.తాను బోధించిన వాటిని జీవితాంతం ఆచరించి చూసిన వ్యక్తి ఆయన.

కొంతమంది భారతీయ నాయకులు పాశ్చాత్య జీవన విధాన్నాన్ని,ఆలోచన విధానాలను కలిగి ఉండడం ఆయనకు నచ్చ్చది కాదు. ఆయన వ్రాసిన అనేక వ్యాసాలు,పాటలలో ఆ అనుభూతి వ్యక్తమవుతుంది. రాజకీత్య ప్రయోజనాలు కోసం ఈ విధంగా రాజీ పాడడం వల్ల ఎదురయ్యే ప్రమాదాల గురించి ఆయన నాయకులను అనేక విధాల హెచ్చ్చరించారు.

'హెర్మేట్ ఆఫ్ ఇండియా' పేరుతో ఆయన ఆంగ్లంలో రచించిన తన మొదటి ఆంగ్ల రచయితలో అది స్పష్టంగా కనిపోస్తుంది. అందులో, ఆయన వారి పట్ల విద్యత ప్రదర్శించే వారికీ రక్షించాలని ఉద్బోధించారు.

నిఖార్సైన, సుఉక్ష్మ బుద్ధి కలిగిన జాతీయవాదిఆఘ్లేయులు గోమాతల్ని సంహరిమ్చాడంపై ఆయన ఎలుగెతారు. అలాగే హిందు ధర్మంపై కొనసాగిస్తున్న సైధాంతిక దాడిలో కూడా ఆయన సుక్ష్మంగా గ్రహించగలిగాడు. ఆ రోజుల్లో చాలామంది స్వాతంత్ర్య సమరయోదుల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ కార్యకర్తలలో, పేద పేద నాయకులలో సైతం ఈ స్పృహ, దృష్టి ఉండేవి కావు. కానీ గరిమెల్ల వారు దానిని పసిగట్టగాలిగారు. తన "మాకొద్దీ తెల్లదరతనం......" గేయంలో దానిని వెల్లడించారు.

"చుడియావులకడుపు" వేడి వేడి మాంసం వాడికి బహు ఇస్తామంట.
మాపాడీ మొదవుల కోస్తుడంట|మతము పాడూ చేసివేస్తుడంట"

గరిమెళ్ళ వారి సుక్ష్మ దృష్టికి ఈ గేయంలోనే ఇంకొక తారర్కాణముంది. ఆంగ్లేయులు హిందు ధర్మాన్ని, సమాజాన్ని బలహీనపరిచే తమ ప్రయత్నంలో బాగంగా హిందువులల్లో విభజన చేసుకొచ్చే ప్రయత్నాలు తమ వ్రాతల ద్వారా మొదలుపెట్టారు.చరిత్రను వక్రీకరించి హిందూ సమాజంలోని అంటరానితనం వంటి అన్ని రకాల విక్రుతులకు బ్రహ్మణులే కారణమని ప్రచారం మొదలుపెట్టారు.

హిందూత్వం బ్రహ్మణులకు మాత్రమే పరిమితమైనదని భావనను కలిగించే ప్రయత్నం చేసారు. తమిళనాడులో ఆ కారణం చేతనే ద్రవిడవాదం మొదలైంది. కొన్ని చోట్ల,ముఖ్యంగా దక్షిణ భారతదేసంలో కొన్ని చోట్ల బ్రహ్మణేతరులు బ్రహ్మణులను తీవ్రంగా ద్వేషించడం మొదలైంది, ఆంగ్లేయుల ఆ కుట్రను ఆయన అన్నాడే పసిగట్టి తనగేయం ద్వారా ప్రజలను మేల్కొలిపే ప్రయత్నం చేసారు. అదే సమయంలో కులభేదాలు పాటించేవారికి కూడా పితబోధ చేసారు.

బ్రహ్మణాబ్రహ్మణ పంచమాబ్రహ్మణ భేదాల తెగులు మీకేలా అంతో లోతైన దృష్టి ఉంటే తప్ప ఆంగ్లేయుల ఆ కుట్రను గ్రహించటం సాధ్యం కాదనే చెప్పాలి.

గరిమెళ్ళ వారు జైలులో ఉండగా గందితత్వం బాగా వంట పట్టింది. విదేశీ విద్య, విదేశి వస్తు భాహిష్కరణ పిలుపును మనసార నమ్మారు గరిమెళ్ళ. తన ముగ్గురు తమ్ముళ్ళను ఇంగ్లీషు చదువును మాన్పించారు. తన చెల్లెలి ఇంగ్లీషు చదువు చదివిన వాడికిచ్చి పెళ్ళిచేయ్యనని భిష్మించారు. ఆయన దేశభక్తి కుటుంబానికి శాపమైంది. ఉద్యోగాలు లేక కుటుంబం పేదరికంలోకి నెట్టబడింది. ఒక తమ్ముడు దేశాలు పట్టి వెళ్ళిపోయాడు. ఆస్తులు అమ్ముకొని పొట్టపోసుకోవడంతో అవి హరించాయి. మధ్య మధ్యలో పోలీసుల కేసులు,జైలు శిక్షలు. దేశాన్ని ఏమి ఉద్ధరిస్తాడోగాని కుటుంబాన్ని నాసనంచేస్తడన్న సూటిపోటి మాటలు. అయిన తాను ఎంచుకొన్న మర్గం నుండి ఒక్క అంగుళం కూడా పక్కకు జరగలేదు.

తాను వ్రాసిన పుష్తకాలు,ఇతరుల పుస్తకాలు ప్రచురిస్తే బాగుంటుందని శారద గ్రంధమాల అనేది ప్రారంభించారు. దేశభక్తి తప్పించి మరి యుక్తి తెలియని గరిమెళ్ళకు భారీ ఆర్థిక నష్టమే మిగిలింది. ఆయన ఎక్కువగా రాజ్యమండ్రి,విజయవాడ,మద్రాసులకు తిరుగుతూ ఉండడంతో, వాటిని పట్టించుకోక పోవడం వల్ల వాటిని చెదలు తినేశాయి.

1921 శ్రీ గరిమెళ్ళ వారి 'స్వరాజ్య గీతములు' పుస్తకం వెలువడింది. 1923 హరిజనుల పాటలు, 1926లో ఖండకావ్యములు, భక్తిగీతాలు, భాలగీతాలు మొదలైన రచనలు వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలా సార్లు జైలుశిక్ష అనుభవించారు. జైలులో వుండగా తమిళ,కన్నడ భాషలు కూడా నేర్చుకున్నారు. తమిళ,కన్నడ గ్రంధాలను తెలుగులోకి అనువదించారు. అంగ్లంలో కూడా గరిమెళ్ళ కొన్ని రచనలు చేశారు.

ప్రసిద్ధ తమిళ రచన తిరుక్కురాళ్ ను తెనిగించారు. 'హార్ట్ అఫ్ ది నేషన్,మదర్ ఇండియా' మొదలైన ఇంగ్లీషు పద్య కావ్యాలను రచించారు. నాలడియార్ వంటి ప్రసిద్ధ పద్యాలను తెనిగించారు.

తళ్ళికోట అనే కన్నడ నాటకాన్ని తెలుగులోకి అనువదించారు. ఆయన వ్రాసిన హరిజనోద్యమ గీతాలు,స్వర్జాయపు గీతాలు తెలుగు నాట ప్రతిధ్వనించాయి.

భారతదేశములో వలస పాలకుల తీరును పరిశీలించడానికి బ్రిటన్ నుంచి వేల్స్ యువరాజు వచినప్పుడు గరిమెళ్ళ 'ఏమయ్యా యువరాజా ఎందుకొచ్చావు?' , అంటూ దొరల దోపిడీ పాలనను తీవ్రంగా నిరసించే గీయాన్ని వ్రాసారు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను శాస్వతంగా హరించే పత్రికా ప్రభుత్వ ధిక్కరణ బ్బిల్లులను, ప్రశ్నించే హక్కులను చెయ్యాలని ప్రయత్నించిన పాలకుల తీరుపై పోరు సాగించిన యోధుడుగా గరిమెళ్ళ చరిత్రలో మిగిలిపోయారు.

జీవితంలో ఎదురైన అనేక ఎదురు దెబ్బలతో ఒక రకంగా చెడి చెన్నపట్నం చేరారు. గరిమెళ్ళ సత్యనారాయణ. 1933 చెన్నపట్నం చేరిన తర్వాత ఆయన దాదాపు అజ్ఞాత జీవితమే గడిపారు. తానెవరో గతంలో తెలిసినవారికి తప్పించి మరెవరికీ తాను పాలనా అని చెప్పుకొనే ప్రయత్నం చెయ్యలేదు. తన వల్ల దెబ్బతిన్న సోదరుడికి సహాయం చేసేస్దునుకు చెన్నపట్నంలో వేల్పవేం అనే భోజన హోటల్ని ప్రారంభించారు. అది కూడా కలిసి రాకపోవడంతో భారీగా అప్పులు మత్రమే మిగిలాయి. చివరికి ఆ హోటల్ కి భవనం అద్దెకిచ్చినవారు తమ అద్దె బకాయిల కోసం గరిమెళ్ళను బయటకు నెట్టి అక్కడి బల్లలు, తబేళాలన్నీ వేలం వేసారు.

ఆ హోటల్ ముందు దీనంగా కళ్ళనీళ్ళు పెట్టుకొని భక్కచిక్కిన శరీరంతో మౌనంగా రోదించారు.అంతే కాని తను గరిమెళ్ళ సత్యనారాయణ అని ఒక్క సారి కూడా చెప్పుకోలేదు. ఆ మాట చెప్పినా లేక తను వ్రాసిన "మాకొద్దీ తెల్లదొరతనం" అనే పాటను ఎత్తుకొని ఉన్నా చెన్నపట్నంలోని తెలుగు వారు అప్పటికప్పుడు ఆయన్ని ఆదుకొనే యత్నం చేసేవారేమో? కానీ తాను దేశంకోసం పోరాటం చేసానే కాని దాని వలన వచ్చిన పేరు ప్రఖ్యాతులను సొమ్ము చేసుకొనేందుకు కాదనుకొన్నారు. ఆర్థిక కష్టాలల్లో కొట్టుమిట్టాడుతున్న సమయంలోనే రెండవ భార్య కూడా మరణించింది. దహనకర్యక్రమాలు నిర్వహించేందుకు కూడా దభులులేని దారిద్ర్యం. చివరికి ఇరుగుపొరుగులు ఆదుకుని ఆమెను సాగానంపాల్సి వచ్చింది.

గరిమెళ్ళ సత్యనారయణది నష్టజాతకం అనుకోవాలో స్వాతంత్ర్య పోరాటవీరులను మరచిపోయిన భారతీయులను నిందించాలో తెలియదు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించింది.గాంధీతత్వాన్ని పరిమితంగా వంటపట్టించుకున్న వారందరూ పెద్ద పెద్ద పదవులు చేపట్టారు.

కాని గాంధీజి మాత్రమే అనుకొన్న గరిమెళ్ళలాంటి వారంతా ఆకలి బాధతో అలమటించడం మొదలెట్టారు. వారి త్యాగాలకు విలువలేదు. గరిమెళ్ళ గీతాల అవసరం ఎవరికీ లేకుండా పోయింది.

చివరి రోజుల్లో .....

గరిమెళ్ళ తన చివరి రోజుల్లో దుర్భర ధారిద్ర్యాన్ననుభావించారు. చుట్టూ తన గురించి తెలిసిన వారి. మధ్యలోనున్నది తానేనని ఎవరికీ తెలియనివ్వని జీవితం.పట్టదన్నం పెట్టేవారులేక, ఆకలి బాధ తట్టుకోలేక చివరిరోజుల్లో చెన్నపట్నం వీధుల్లో భిచ్చమెత్తుకుంటూ తిరిగారు.ఆయన చేతిలో పైసా విడల్చక విసుకొన్న వారు ఆయన వ్రాసిన పాటలనే పాడుకొంటూ పోవడం, ఆ గేయ రచయితల గురించి చెప్పుకోవడం విన్న గరిమెళ్ళ మనసు ఎటువంటి ఆవేదనకు గురైందో ఎవరికీ తెలియదు. తెలుసుకొనే ప్రయత్నం కూడా ఎవ్వరూ చెయ్యలేదు.

ఎందుకిలా? అని ఒక పరిచయస్తుడడిగితే “కొందరు త్యాగం చెయ్యాలి . కొందరు నశించి నాసనమైపోవాలి. అప్పుడే దేశం బాగుపడుతుంది. దేశం బాగు కోరినా మీము ఇంతే” అన్నదే గరిమెళ్ళ సమాధానం.

శ్రీ గరిమెళ్ళ పేదరికం అనుభవిస్తున్న రోజుల్లో దేశోద్ధారక కాశినాధుని నాగేశ్వరరావు పంతులు కొంత సహాయ పడ్డారు. వావిళ్ళ వెంకటేశ్వర శాస్త్రులు ప్రతి నెల ఆయనకు కొంత ఆర్థిక సహాయం చేసేవారు. వివిధ పత్రికలకు,ఆలిండియ రేడియో కి రచనలు చేసికొంత గడిస్తున్నా ఆయన అవసరాలకు ఆ డబ్బు చాలలేదు.

ఒకవైపు పేదరికం, మరోవైపు అనారోగ్యం ఆయనని బాగా దెబ్బతీసాయి చివరి దశలో ఒక కన్ను పోయింది. పక్షవాతం వచ్చింది.

స్వాతంత్ర్యానంతరం మన పాలకుల వల్ల కూడా గరిమెళ్ళకు చెప్పుకోదగ్గ సహాయం లభించలేదు. దాంతో కొంతమంది మిత్రులు ‘మాకొద్దీ నల్ల దొరతనం’ అనే గేయం వ్రాయాలని అడిగారట. దేసభాక్తుడు, స్వాతంత్ర్య పిపాసి అయిన గరిమెళ్ళ అందుకు అంగీకరించలేదట. ఆకలితో అలమటిస్తూ, దుర్భర పేదరికంలో డిసెంబర్ 18,1952న చెన్నపట్నంలో ఎవరికీ తెలియని వ్యక్తిగా గరిమెళ్ళ సత్యనారాయణ మరణించారు.

అంతకు రెండు రోజుల ముందే పొట్టి శ్రీ రాములు బలిదానంతో ఆంధ్రప్రాంతమంతా ఆందోళనలో ఉంది. అలాంటి సమయంలో ఆ ప్రజాకవిని ఒక అనామక శవంగా కొందరు ఇచ్చిన చందాలతో అంత్యక్రియలను చేర్చారు. ఒక మహాకవి జీవితం అల ముగిసిందన్న వాస్తవం తెలుగు వారిలో చాలామందికి తెలీదు.

**ఆధునిక తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం**

ఆధునిక తెలుగు సాహిత్యం సమాజం పై లోతైన ప్రభావం చూపి, సామాజిక చైతన్యానికి అద్దం పట్టింది. కందుకూరి వీరేశలింగం, గురజాడ వంటి స్మస్కరణ వాదులతో మొదలై, అభ్యుదయ, విప్లవ సాహిత్యాల ద్వారా సామాజిక సమస్యలైన కుల వ్యవస్థ, పేదరికం, మహిళ అభ్యుస్నతి పర్యావరణం వంటి అంశాలను సాహితీ రూపంలో ప్రజలకు చేర్చి, వారిలో చైతన్యం తెచ్చి, సమాజ గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించింది.

ఆధునిక తెలుగు సాహిత్యం కేవలం కాలక్షేపానికి కాకుండా, సమాజంలో మార్పు తీసుకురావడానికి, ప్రజలను చైతన్యపరచడానికి ఒక శక్తి వంతమైన సాదనంగా పని చేసింది, ఇది తెలుగు సాహిత్యానికి ఒక విశిష్ట గుర్తింపును తెచ్చింది.ఆధునిక తెలుగు కథ సాహిత్యం పర్వరణం సమస్యలను, మానవుడు-ప్రకృతి సంబంధాన్ని వివరిస్తూ పర్యావరణ చైతన్యాన్ని కూడా పెంపొందించింది.స్వాతంత్రోద్యమ సమయంలో అనేక మంది ఆధునిక కవులు తమ పాటల ద్వారా, మాటల ద్వారా ఎంతో మక్కువ చూపి స్వతంత్రోధ్యమానికి ఒక కీలక పాత్రగా, పోషించి దానిని నిలబెట్టారు.

కాలినడకన గ్రామీణ ప్రమ్తలల్లో తిరిగి, పేదల జీవన విధానాన్ని, వారి ఆర్థిక, సామాజిక పరిస్తుతులను చిత్రించి, వారి పట్ల కరుణ, పరిష్కరణ మార్గలను చూపించడంలో ఆధునిక కథకులు కృషి చేసారు. ఈ ఆధినిక సాహిత్య సామాజిక చైతన్యం కోసం.సమాజంలోని అసమానతను, అనచివేతలపై పోరాడుతూ ప్రజల విముక్తిని ఆకంక్షిస్తు అభ్యుదయ కవత్వాన్ని ప్రకటించింది.గురజాడ అప్పారావు వంటి వారు సామాజిక స్థితిగతులను, మనవ సంబందాలను వాస్తవ ధృక్పదంతో చిందింది, ప్రజల సమస్యలను సాహిత్యం ద్వారా ఎత్తి చూపారు.

ఆధునిక తెలుగు సాహిత్యం సమాజంపై లోతైన ప్రభావం చూపింది. సామాజిక చైతన్యాన్ని రేకెత్తించింది. ముఖ్యంగా 19వ శతాబ్దం చివరిలో, 20వ శతాబ్దం ప్రారంభంలో కందుకూరి వీరేశలింగం వంటి సంస్కర్తల ద్వారా సామజిక సమస్యలను రచనల్లోనికి తీసుకువచ్చి, ప్రజలల్లో చైతన్యం నింపింది. ఇది

సామాజిక న్యాయం, స్త్రీ విముక్తి పర్యావరణం వంటి అంశాలను స్పృశిస్తూ అభ్యుదయ కవిత్వం కథలు, నవలలు రూపంలో వికసించింది, సమాజాన్ని ప్రతిబింబిస్తునే మార్పునకు దోహదపడింది.

పాటల రూపంలో సామాజిక చైతన్యం, అవగాహన పెంచే గీతాలు ముఖ్య పాత్ర పోషించాయి.ఆధునిక సాహిత్యం కేవలం సమాజాన్ని చూపించడమే కాకుండా, దానిలోని లోపాలను ఎత్తి చూపి, ప్రజలను ఆలోచింపజేసి, సామాజిక మార్పులకు ప్రేరనమగా నిలిచింది.నవల సాహిత్యం సామాజిక వాస్తవికతను ప్రతిభిమ్భిస్తూ, పర్యావరణ సమస్యలు పేదల జీవన విధానం వంటి అంశాలను చర్చించింది, సామాజిక చైతన్యానికి వేదికైంది.

**సూచన గ్రంథాలు (Reference Books)**

1. డాక్టర్ ద్వా.నా. శాస్త్రి – *తెలుగు సాహిత్య చరిత్ర* – తెలుగు అకాడమీ, హైదరాబాద్.
2. కందుకూరి వీరేశలింగం – *సాహిత్య విమర్శ వ్యాసాలు* – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.
3. గురజాడ అప్పారావు – *గురజాడ రచనలు* – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. ఆచార్య కె.వి. రమణాచార్యులు – *ఆధునిక తెలుగు కవిత్వ వికాసం* – సాహిత్య అకాడమీ.
5. డాక్టర్ వేటూరి ప్రభాకర శాస్త్రి – *జాతీయోద్యమం – తెలుగు సాహిత్యం* – ఎమెస్కో.
6. శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ – *స్వరాజ్య గీతములు* – (మూల రచన).
7. శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ – *హరిజన గీతాలు* – (మూల రచన).
8. ఆచార్య సి. నారాయణరెడ్డి – *సాహిత్యం – సమాజం* – ఎమెస్కో పబ్లికేషన్స్.
9. డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ – *అభ్యుదయ సాహిత్య ధోరణులు* – విశాలాంధ్ర.
10. డాక్టర్ నిఖిలేశ్వరరావు – *తెలుగు జాతీయ కవిత్వం* – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# గోరా శాస్త్రి 'ఆశ ఖరీదు అణా'- నాటిక సామాజిక చైతన్యం

డా. నాగ రాజు గొడవర్తి,
తెలుగు శాఖాధ్యక్షుడు,
కాకరపర్తి భావనారాయణ కళాశాల (స్వయం ప్రతిపత్తి), విజయవాడ.

**రచయిత పరిచయం**

తెలుగు పత్రికా రచయితల్లో ప్రముఖులు గోరాశాస్త్రి. అంతేకాదు, శ్రవ్యనాటికా కర్తల్లో విశిష్టులు కూడా. గోరాశాస్త్రిగా ప్రసిద్ధులైన వీరి పూర్తి పేరు గోవిందుని రామశాస్త్రి. ఒరిస్సాలోని గంజాం జిల్లా, గుణుపురం వీరి స్వగ్రామం. 03.10.1919 తేదీన గోరాశాస్త్రి జన్మించారు. సుందరి, నరసింహం వీరి తల్లిదండ్రులు.

ఆంగ్ల స్వతంత్ర పత్రికలో ఉప సంపాదకులుగా గోరాశాస్త్రి ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. అనతి కాలంలోనే 'తెలుగు స్వతంత్ర' పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు చేపట్టారు. తరువాత కాలంలో ఆంధ్రభూమి, డక్కన్ క్రానికల్ పత్రికలకు కూడా సంపాదకులుగా వ్యవహరించారు.

పత్రికా రచయితగా ప్రాచుర్యం పొందక ముందే గోరాశాస్త్రి శ్రవ్యనాటిక కర్తగా గుర్తింపు పొందారు. నూరుకు పైగా నాటికలు రచించారు. ప్రముఖ నాటికల సంకలనాలన్నింటిలోనూ గోరాశాస్త్రి నాటిక ఏదో ఒకటి ఉంటుంది. వివిధ పోటీలలో గోరాశాస్త్రి నాటకాలు, నాటికలు కొన్ని ఉత్తమ రచనలుగా బహుమతులు పొందాయి. సగటు మనిషి నిత్యజీవితంలోని వివిధ పార్శ్వాలను సున్నితంగా, శాస్త్రీయంగా వ్యాఖ్యానించడం గోరాశాస్త్రి నాటికల ప్రత్యేకత. బాగా ప్రాచుర్యం పొందిన వీరి నాటికల్లో ఆనంద నిలయం, సెలవుల్లో దూరతీరాలు, ఆశఖరీదు అణా.. వంటివి పేర్కొదగినవి.

గోరాశాస్త్రి నాటికలు కొన్ని 'ఆశఖరీదు అణా', 'గోరాశాస్త్రి నాటికలు' అనే రెండు సంపుటాలుగా వెలువడ్డాయి. ఆశ ఖరీదు అణా సంపుటం లోనిది. 'ప్రసిద్ధ తెలుగు నాటికలు' సంపుటం లోనూ ఇది చోటు చేసుకుంది. ఈ సంపాదకులు ఈ నాటిక గురించి ఇలా వివరించారు.

**పాత్రలు**

**యువకుడు నిరుద్యోగి, ఒంటరి**

**తాత**

**పదవీ విరమణ చెందిన ఉద్యోగి**

**ఇందిర, ఆనందలక్ష్మి అక్కాచెల్లెళ్లు**

**కృష్ణమూర్తి**

**బ్యాంకు ఉద్యోగి**

**కృష్ణవేణి (ఉద్యోగిని)**

**ఇందిర, ఆనందలక్ష్మిల స్నేహితురాలు**

**కృష్ణవేణి అన్న: ఇందిర, ఆనందలక్ష్మిల అన్న**

ఒక మహానగరంలో, ఒక వీధిలో, పెద్ద మేడ ఉంది. దాంట్లో సుమారు 22 మంది మధ్యతరగతి బడుగు జీవులు, కాపురం ఉంటున్నారు. కొత్తగా ఓ యువకుడు మేడ చివరి అంతస్తు చివరి గదిలోకి, అద్దెకు వచ్చాడు. ఆ మేడ మెట్ల దగ్గర, ఒక పించనీ తీసుకొనే తొమ్మిదిమంది సంతానం గల తాత ఉన్నాడు. ఆ తాతకు ఎన్నో కష్టాలు ఉన్నాయి. పెళ్ళి కాని ఆడపిల్లలూ, ఉద్యోగాలు లేని మగపిల్లలూ, తాతకు ఉన్నారు. కాని, రెండు గదుల్లో హాయిగా, తాత సంసారం సాగిస్తున్నాడు.

కృష్ణవేణి అనే అమ్మాయి, ఏదో ఉద్యోగం చేస్తోంది. ఆ అమ్మాయి కూడా, అదే మేడలో, పక్షవాతం తల్లితో, నిరుద్యోగి అయిన అన్నతో ఉంటోంది. పగలు ఆఫీసులో ఉద్యోగం. ప్రొద్దున్న, రాత్రి వంట. అలా ఈమె జీవితం, కష్టంగా సాగుతోంది.

కొత్తగా అద్దెకు వచ్చిన యువకుడు, నిరుద్యోగి ఏవో భయం వేసే బొమ్మలు వేస్తుంటాడు. పెళ్ళికాని ఓ యువకుడూ, బ్యాంకు ఉద్యోగీ, కూడా తన వాళ్ళతో అదే మేడలో ఉంటున్నాడు. కృష్ణవేణి స్నేహితురాండ్రు, ఇందిర, లక్ష్మి, వారి అన్న, కూడా అదే మేడలో మరో వాటాలో ఉంటున్నారు. ఇందిర అన్న కూడా నిరుద్యోగి. ఆ నిరుద్యోగి జేబులో కాణీ లేదు. ఎక్కడ నుంచైనా నడచు కుంటూనే ఇంటికి వస్తాడు. లక్ష్మికీ, ఇందిరకూ, 'పెళ్ళిళ్లు కాలేదు. ఇందిర తండ్రి, జైలులో ఉంటున్నాడు. ఇందిర తల్లి, రోగిష్టిది.

కొత్తగా అద్దెకు వచ్చిన యువకుడి బొమ్మలు, ఎవరూ కొనరు. అతడికి తినడానికి కూడా తిండిలేదు. చేతి ఉంగరం అమ్మి, అద్దె అడ్వాన్సు ఇచ్చాడు. కృష్ణవేణి ఉద్యోగం చేసి తనను పోషించడం, ఆమె అన్నకు ఇష్టంలేదు. తనకు ఉద్యోగం వస్తే, కృష్ణవేణిని ఉద్యోగం మాన్పిద్దామని ఆశగా అతడు ఎదురు చూస్తున్నాడు.

తాత పెద్ద కోడలుకు పురుడు వచ్చింది. చిన్న కోడలుకు జ్వరం. అసలు మనం ఎందుకు పుట్టామా ? అని తాత భార్యకు, అనుమానం. తాతకు శరీరంలో రకరకాల జబ్బులు. తాత మాత్రం, ఎప్పుడూ, తన దరిద్రానికి విచారించడు.

కృష్ణవేణి చేస్తున్న త్యాగం వల్ల ఎవరికీ, లాభం లేదు. ఇలా వారందరికీ చచ్చిపోవాలనే బుద్ధి పుట్టింది. లక్ష్మి, ఇందిరల అన్న, కారు క్రింద పడబోయి, ఎలాగో బ్రతికాడు. ఈ కథలో పాత్రలు, అన్నీ, దగా పడ్డ తమ్ముళ్ళు, చెల్లెళ్ళు. వారివన్నీ, చల్లారిపోయిన సంసారాలు,

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

తాత వారందరికీ బతకడంలోనే మాధుర్యం ఉందనీ, ధైర్యంగా బతకాలనీ, హితబోధ చేశాడు. వారందరికీ అణా కాఫీలు ఇప్పించాడు. మనిషికి ఒక్క అణాతో, అందరికీ మళ్ళీ ఎంతో ఆశ వచ్చింది.

ఈ నాటికలోని తాత, 33 సంవత్సరాలు సర్కారీ నౌఖరీ చేసి, ఇప్పుడు పెంచని తీసుకుంటున్నాడు. ఈయనకు తొమ్మండుగురు పిల్లలు. ఇంకా ఈయన నలుగురు కూతుళ్ళకి, పెళ్ళి అవ్వాలి. పెళ్ళి అయిన ఇద్దరు కొడుకులకు, ఉద్యోగాల్లేవు. మిగిలిన పిల్లల చదువుకు తాత వద్ద డబ్బులేదు. తోచకపోతే తాత పాటలు పాడుకుంటూ ఉంటాడు. తాత, ఆయన భార్య, ఆయన సంతానం, అందరూ హాయిగా, రెండు గదుల్లో కాలక్షేపం చేస్తూ, ఒకరినొకరు ఆప్యాయంగా పిలుచుకుంటారు.

ఈ తాతకు, అన్నీ సమస్యలే. ఈయన చేతిలో కాణీ లేదు. తాత పెద్ద కోడలు, ప్రసవ వేదన పడుతోంది. చిన్న కోడలికి జ్వరం. తాత శరీరంలో, రకరకాల జబ్బులు ఉన్నాయి. కాని తాతపై ఆ ఇంట్లో వారందరికీ, పెద్ద అభిమానం, ఈ తాత, యువకుడికి, మనుషుల్లోని మంచినీ, లోకంలోని ఆనందాన్నీ, బొమ్మలుగా వెయ్యమని సలహా చెప్పాడు. తాత, ఉపకార స్వభావం కలవాడు. ఇందిర అన్నకు, ఏక్సిడెంటు అయినప్పుడు, ఇందిరకు ధైర్యం చెప్పి, ఆమె అన్నకు తాత సాయం చేశాడు.

జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కోలేక, నిరుద్యోగ జీవితంలో, డబ్బుల్లేక, యువకుడు, కృష్ణవేణి, ఇందిర అన్న, చనిపోదామనుకున్నారు. అప్పుడు తాత, వారికి, ధైర్యం చెప్పాడు.

బ్రతకలేక చావడం, మంచిది కాదని, వారికి తాత సలహా చెప్పాడు. బతకడంలో ఎంతో మాధుర్యం ఉందనీ, వారందరికీ ముందు ధైర్యం కావాలనీ, తాత సలహా చెప్పాడు. తమను తాము అసహ్యించుకోకూడదనీ, దుఃఖాన్ని సానుభూతితో చూడడానికి ప్రయత్నించమనీ, ధైర్యంగా బతికి చూడమనీ, యువతీ యువకులకు, తాత తన జీవితానుభవసారాన్ని అందించాడు.

కృష్ణవేణికీ, ఇందిరకూ వారు స్త్రీలుగా జన్మించినందుకు, వారి జీవితాన్ని సఫలం చేసుకోండని, తాత సలహా ఇచ్చాడు. అందరికీ తాత అణా కాఫీ ఇప్పించాడు. వారికి జీవితంపై తిరిగి ఆశలు పుట్టించాడు.

మనిషికి ఒక అణాతో, అందరికీ తాత, వారి జీవితాలపై ఆశ కల్పించాడు. తాత ఆశాజీవి. ధైర్యశాలి. జీవితాన్ని లాటరీగా చూడాలని, ఒక లాటరీలో పోతే, మరో లాటరీ కోసం ఎదురుచూడాలని తాత దగాపడిన తమ్ముళ్ళకు, చెల్లెళ్ళకూ హితం ఉపదేశించాడు.

కృష్ణవేణి, ఓ పెద్ద మేడలో, పెరటి భాగం గదిలో, తల్లి అన్నలతో, కాపురం ఉంటోంది. కృష్ణవేణికి ఓ నిరుద్యోగి అయిన అన్న, పక్షవాతం వచ్చి మంచమెక్కిన తల్లి ఉన్నారు. కృష్ణవేణి, ఏదో ఉద్యోగం చేస్తోంది. కృష్ణవేణికి, మంచి తలకట్టు, మోకాళ్ళదాకా వేలాడే జడ, ఉన్నాయి. కృష్ణవేణి తెల్లారగట్టే లేచి, వంట చేస్తుంది. పగలల్లా ఆఫీసులో బండ పని, ఇంటికి వచ్చాక మళ్ళీ వంట. ఇదే ఆమె నిత్యకృత్యం.

కృష్ణవేణికి, చల్లని ఈదరగాలిలో బయటికి నడచి వెళ్ళి, హాయిగా రెండో ఆట సినిమా చూసి, పాటలు పాడుకుంటూ, తిరిగి ఇంటికి రావాలనే కోరిక ఉంది. ఎరగని మగవారితో కూడా, కృష్ణవేణి జంకు లేకుండా మాట్లాడుతుంది. కాని ఈమెకు చావు బాజాలు అంటే భయం. ఎందుకో తెలియదు.

కృష్ణవేణి, ఆ మేడ చివరి గదిలోకి, అద్దెకు వచ్చిన యువకుడిని గురించి, అన్నను అడిగింది. ఈమె అన్న, ఈమెపై చికాకు పడ్డాడు. ఆడపిల్ల కృష్ణవేణి, సంపాదించి తేవడం, నిరుద్యోగి అయిన, ఈమె అన్నయ్యకు. ఇష్టంలేదు. తనకు ఉద్యోగం దొరికితే, కృష్ణవేణిని, ఉద్యోగం మాన్పిద్దామని, కృష్ణవేణి అన్న అభిప్రాయం. కాని కృష్ణవేణి డబ్బు మీద అన్నకు ప్రేమ. ఉద్యోగం మీద మాత్రం కసి. కృష్ణవేణి చేసే త్యాగం వల్ల, ఎవరికీ లాభం కలగడం లేదు. కృష్ణవేణి తన స్నేహితురాలు ఇందిరతో, తనకు రాను రాను బ్రతుకంటే అసహ్యం వేస్తోందని, తన అన్నకు ఉద్యోగం రావటంలేదని, తన తల్లి పక్షవాతంలో మంచం ఎక్కిందని, తన బాధలు చెప్పుకొంది.

కృష్ణవేణి మొదట్లో మంచి నిబ్బరంగా, ధైర్యంగా తిరిగేది. కృష్ణవేణికి, ఆమె అన్న ప్రవర్తన, అసహ్యం తెప్పించింది. కృష్ణవేణికి, జీవితంపై విరక్తి పుట్టింది. కోపంలో, తన అన్న, తన పీక పిసికేస్తే ఎంతో హాయిగా ఉంటుంది కదా ! అనుకుంది.

ఇందిర అన్నను వెతకడానికి, కృష్ణవేణి కూడా, ఇందిరతో రోడ్డు పైకి వచ్చింది. చచ్చిపోవాలనే బుద్ధి, కృష్ణవేణికి పుట్టింది. ఆ మేడలోనే ఉండే తాత, దగాపడ్డ చెల్లెలయిన కృష్ణవేణికి, అణా పెట్టి, కాఫీ ఇప్పించాడు. చావడం మంచిది కాదని, కృష్ణవేణికి ధైర్యం చెప్పి, తాత ఈమెకు జీవితంపై ఆశలు కల్గించాడు.

"కష్టాలు, కన్నీళ్లు, సమస్యలతో నిత్యం సతమతమయ్యే మధ్యతరగతి బడుగు జీవులకు జీవితం వడ్డించిన విస్తరి కాదు. అందరూ దగా పడ్డ తమ్ముళ్ళూ, చెల్లెళ్ళే! బతకడం అంటే భయపడే వాళ్ళే. చాలీ చాలని ఆదాయంతో బతుకుల్ని కనాకష్టంగా ఈడ్చుకొస్తున్నవాళ్ళే. అంత మాత్రాన జీవితాన్ని అసహ్యించుకుంటూ, చావే తగిన పరిష్కారమనుకుంటామా? నిరాశతో క్రుంగిపోతున్న వాళ్ళకు జీవితం పట్ల ఇంత ఆశనూ, ధైర్యాన్నీ అందించటంతో పాటు జీవితోత్సాహాన్ని చిగురింప చేసేది

ఈ నాటిక. ఆకాశవాణి ప్రసారం చేసిన అత్యుత్తమమైన శ్రవ్య నాటికలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది". 1982 మే డే నాడు మరణించేంత వరకూ గోరా శాస్త్రి తెలుగు సాహిత్య రంగానికి సేవ చేస్తూనే ఉన్నారు.చిన్న చిన్న విషయాలకే భావావేశాలకూ, బలహీనతలకూ లొంగిపోతూ; అనుచితమైన నిర్ణయాలు తీసుకుంటున్న ఈ నాటి లోకానికి జీవితం పట్ల ఆశనూ, భరోసాను కల్పించడం ఈ నాటిక ఉద్దేశం.

**సూచన గ్రంథాలు**


1. డాక్టర్ ద్వా.నా. శాస్త్రి – *తెలుగు సాహిత్య చరిత్ర* – తెలుగు అకాడమీ, హైదరాబాద్.
2. శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ – *స్వరాజ్య గీతములు* – (మూల రచనలు).
3. శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ – *హరిజన గీతాలు* – (మూల రచనలు).
4. ఆచార్య కె.వి. రమణాచార్యులు – *ఆధునిక తెలుగు కవిత్వ వికాసం* – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
5. డాక్టర్ వేటూరి ప్రభాకర శాస్త్రి – *జాతీయోద్యమం – తెలుగు సాహిత్యం* – ఎమెస్కో పబ్లికేషన్స్.
6. ఎన్.జి. రంగా – *స్వాతంత్ర్యోద్యమ స్మృతులు* – ప్రజాశక్తి గ్రంథాలు.
7. గోరాశాస్త్రి – *గోరాశాస్త్రి నాటికలు* – (నాటికల సంకలనం).
8. గోరాశాస్త్రి – *ఆశ ఖరీదు అణా* – శ్రవ్య నాటికా సంకలనం.
9. తెలుగు అకాడమీ – *ఆధునిక తెలుగు సాహిత్యం* – డిగ్రీ పాఠ్యగ్రంథం.
10. డాక్టర్ ముదిగొండ శివప్రసాద్ – *అభ్యుదయ సాహిత్య ధోరణులు* – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# దేవులపల్లి కృష్ణ శాస్త్రి సాహిత్యం -సౌందర్యదృష్టి

**శ్రీ యం . భీమయ్య**
తెలుగు అధ్యాపకులు.
శ్రీ ఏ. బి. ఆర్ .ప్రభుత్వ డిగ్రీ కళాశాల , రేపల్లె .
ఫోన్ నెం - నెంబర్ 9705445036

సాహిత్యం సామాజిక వికాసాన్ని ,చైతన్యాన్ని ,విశ్వ శ్రేయస్సుని కలిగిస్తుంది . ఆధునిక తెలుగుసాహిత్యం ఆంగ్ల భాషా సాహిత్య ప్రభావముతో తెలుగు న ప్రవేశించింది . అలాంటి వాటిలో భావ కవిత్వం ఒకటి . దీనిని కొందరి భావ గీతం ,కాల్పనికకవిత్వం ,భావ కవిత్వం గా వ్యవహరిస్తారు . భావానికి అధిక ప్రాధాన్యత ఉన్న కారణంగా భావ కవిత్వం గా
కొన్ని లక్షణాలను రూపొందించుకుంది . ఆత్మాశ్రయం ,స్వేచ్ఛా ప్రియత్వం ,గాన యోగ్యత ,శృంగారం ,ప్రకృతి ,భక్తి ,స్మృతి ,లాంటి లక్షణాలతో ప్రవర్తిల్లుతాయి .ఇది ఆత్మాశ్రయమైనది . కవి మనో భావాలను కవిత్వం లో ప్రతిబింబించడం వలన ఇది ఆత్మాశ్రయమైనది. దీని యందు మానసికానుభూతి ప్రధానమైనది . ఆధునిక తెలుగు సాహిత్యం లో ఎందరో భావకవులు ఉన్నారు . అట్టివారిలో దేవులపల్లి వేంకట కృష్ణ శాస్త్రి ఒకరు . వీరు ఊహల ఉద్దీపనాన్ని తన కవితల్లో విరాజిమ్మారు . వీరి సాహిత్యం లో ఉన్న సౌందర్యం పరిశీలించవలసి ఉన్నది .

**సౌందర్యనిర్వచనం**–: "సుందరస్య భావం సౌందర్యం" .హృదయం గల ప్రతి ప్రాణికి ఆరాధనీయ మైన సంపద సౌందర్యం . దీనికి ఎన్నో పర్యాయ పదాలు ఉన్నాయి .రుచిరం ,చారు ,మంజులం ,అభిరామం ,చెన్ను ,వన్నియ,లావణ్యం మొదలగునవి. విదేశీయులు ,స్వదేశీయులు ఈ పదాన్నిగురించి మననం చేసుకున్నారు .ఏది సుందరమో అదే మంచిదని సోక్రటీస్ అభిప్రాయం . సౌందర్యం నిస్వార్ధ మైనది అని అరిస్టాటిల్ నిర్వచనం . భౌతిక సౌందర్యం అంతఃసౌందర్యాన్ని ప్రతిఫలింప చేస్తుందని కాంప్టే అభిప్రాయం . భారతీయ సౌందర్య దృక్పదము వాల్మీకి రామాయణము లోని సుందర కాండలో ఉంది.హిందూ సాంప్రదాయం లో భారతీయుల ఆధ్యాత్మిక సౌందర్యదృష్టి మహోన్నత మైనది . అందమైన ప్రతి వస్తువు మానవాత్మ ను పలుకరించే దేవదూతగా భావిస్తారు సౌందర్యారాధకులు . ఉన్నతాదర్శాలు సాధించిన జీవితం లో ఉత్తమ సౌందర్యం ఉందంటారు ఆదర్శ వాదులు . సౌందర్యం మాట వినగానే మనకు కీట్స్ అను ఆంగ్ల కవి గుర్తుకు వస్తాడు .A thing of Beauty is a joy for ever-Jhon Keats జూనియర్ సముద్రాల అను సినీ కవి "అందమే ఆనందం ఆనందమే జీవిత మకరందం అని పేర్కొన్నాడు . సత్యం ,శివం, సుందరంగా భారతీయ వేదాంతం చెబుతుంది . సౌందర్యదర్శనం కావించిన కవి తాను ఆనందించి పులకించి ,పరవశించి ,తన కవిత్వం ద్వారా ఆనందాన్ని నలుగురికీ పంచుతాడు .చిత్తంలో ప్రతి

బింబించిన చిదానందం సువ్యక్తమై పాఠకుడు ఆనంద జగత్తు లో విహరిస్తాడు . దేవులపల్లి వేంకట కృష్ణ శాస్త్రి కవి గారు కూడా అలాగునే .

దేవుల పల్లి వేంకట కృష్ణ శాస్త్రి గారు ఊర్వశి ,కృష్ణ పక్షం ,ప్రవాసం మొదలగు కావ్య రచనలు చేశారు . ఆంగ్ల కవి షెల్లీ ప్రభావం ఉండుటచేత వీరిని "ఆంధ్ర షెల్లీ" అని పిలుస్తారు . వీరి కవిత్వం లో దాగిఉన్న సౌందర్యం పాఠకుల రస హృదయాలను పరవశింప జేస్తాయి .

**కృష్ణ శాస్త్రి గారి ప్రకృతి సౌందర్యం** -: ప్రకృతి భావకవికి ప్రాణం . కృష్ణ శాస్త్రి కూడా ప్రకృతి ఒడిలో సేద దీరి హాయిగా స్వేచ్ఛగానం సలిపి ,తన ఎదలోనిసోదలు ,వ్యధలు,వెళ్లబోసుకోవడంలో ఒక తృప్తి పొందుతాడు .ప్రకృతి శక్తి వంతమైనది . అదొక అందాల రాశి, విజ్ఞాన దీపిక,మనిషిని లొంగ దీసుకో గలదు . జీవితాదర్శాలను ,ఆశయాలను బోధించ గలదు . పూర్వపు కవులు పకృతి పై ఎన్నో కావ్యాలు రాశారు . వేదన ,ఆర్తి ,భగ్న హృదయం,బావకవులలో ఉంటుంది . షెల్లీ ,కృష్ణ శాస్త్రి ఇరువురి జీవితాలలో ఈ సాదృశ్యాలు ఉన్నాయి. అందుకోవాలని ,సుదూర తీరాలు చేరుకోవాలనే కోరిక ,హృదయపు లోతులు సృజించే సౌకుమార్యం ,పాఠకులహృదయాలను కదిలించి కరిగిస్తాయి . ప్రకృతిలో మమేకమై పోవాలని కలలు కన్నారు కవి . ఆకుగా ,గాలిగా మారాలనుకోవడం రొమాంటిక్ ఇమాజినేషన్ (Romantic imagination) కు ప్రాణ భూతమైన అంశం . అదే కృష్ణ శాస్త్రి కవితకు ఊపిరి పోసి జీవమిచ్చిందని చెప్పవచ్చు .

" ఆకులో ఆకునై ,పూవులో పూవు నై,కొమ్మలో కొమ్మనై , నును లేత రెమ్మనై ఈ అడవి దాగిపోనా ,ఎటులైన నిచటనే యాగిపోనా",అలాగే " పక్షినై య్యేద,చిన్న ఋక్ష మైయ్యేదను,మధుపమైయ్యేద,చందమామనయ్యేదను", అంటారు శాస్త్రి గారు . భావోద్వేగం లో ప్రకృతి సమస్తమూ తానే అయిపోవాలని తహతహ ఇది . సజీవ గేయచిత్రాలు వారివి . ప్రకృతి సౌందర్యం పాఠకులను పరవశింపజేసి అలౌకిక జగత్తు నకు తీసుకు వెళుతుంది . ఆత్మానందం కలుగుతుంది,కలిగిస్తుంది . అదే బ్రహ్మానంద స్థితి . బాల భానుని కర్తవ్యాన్ని నిస్వార్ధ ,నిర్మాలనురాగాన్ని "సంజె వేళల పవడంపు ఛాయలటుల ,చిరుత ప్రాయంపు కోరికల్ చెదిరి పోయె" , మానవ మనస్తత్వం లోని కోరికలను ప్రకృతి పరిణామం తో పోల్చి చెబుతాడు కవి . అలాగే "మింట నె చటనో మెరయు చుక్కలు ,కంట చూచితి కాంక్ష లూరగ,కాంక్ష లూరిన కొలది చుక్కలె ,కాంచి బ్రతుకే గడిపితిన్" -ఆకాశం లోని చుక్కలు ఆశ లు ,కోరికలు వాటినే చూస్తూ జీవితాన్ని గడపడం నిరీక్షణ . మనసులోని బావాన్ని ప్రకృతిలో దర్శించేపద్ధతి ఇది . చుక్క కోరికకు ప్రతీక . ఈ విధంగా కవి ప్రకృతి లోని భావుకత ,సౌందర్యాన్ని పాఠకునిలోకి పంపించి మురిపిస్తాడు . అతని మదిలో ఎన్నో భావ నక్షత్రాల కాంతుల్ని మెరిపిస్తాయి .కవినుండి కవిత నుండి ఆశించే ప్రయోజనం ఇదే .

**కృష్ణ శాస్త్రి గారి ప్రణయ సౌందర్యం** -: అనురాగాల,సంయోగ, వియోగాల కారుచీకట్ల కొసల నుండి ఉద్భవించిన అనురాగ రస రమణి ,దివ్య మందార సుమసుందరి కృష్ణశాస్త్రి గారి ఊర్వశి . కీట్స్ ,భావాలు ,వేదనలు వీరిలోగోచరిస్తాయి . ఆంగ్ల సంస్కృతాంధ్ర గ్రంధాల అధ్యయనం చేసిన వారు కావున వాటి పరిధి ని దాటలేక పోయారు . ఊర్వశి వారి దృష్టి లో సౌందర్య దేవత . "ఊర్వశి ,ప్రేయసీ నేడో యుష్మాదీయ , చరణ మస్రు ణారుణోదయ సురభి కాంతి ",పూర్తి సౌందర్యం దొరక్క పోయిన పాదాలనాశ్రయించి బ్రతుకు భాగ్యం కోరుతున్నాడు . కవి హృదయ సౌందర్యంఅనంతం,అమోఘం.ఊర్వశిలో కొన్ని మానవీయవిలువలు, దేవతా విలువలు ఆపాదించి ఆమెను ఒక అద్వితీయ మూర్తి గా తీర్చి దిద్దాడు కవి . "ఆమె కన్నులలో ననంతాంబరపు నీలి నీడలు గలవు, విరహ వేదన లోని బాధను మనసుకు పట్టేలా పలికించడంలో ఆయనకు ఆయనే సాటి . తన ఊర్వశి ఊహాలలో మాత్రమే దొరికి ఊరించే తరుణి . అందుకే ఆయన భావన అంబరాన్ని చుంబించింది . బ్లేక్ ,షెల్లీ ,వర్డ్స్ వర్త్ ,కీట్స్ లలోని సౌందర్యపిపాస ఈ కవిలో మూర్తీభవిస్తాయి . కీట్స్ కోవకు చెందినవాడు . "ఏవియో అర్థమ్ము కానీ భావ గీతమ్ములివి ,వింతగా దోచు నాదు జీవితమ్ము నాకు ",వినిపించేరాగం కంటే వినిపించని రాగం మరింత మధురం . అలౌకిక సౌందర్యమును శాశ్వతం కల్పిస్తూ ఆ సౌందర్యమే సత్యం ,సత్యమే సౌందర్యం కావించారు . మనసున్న మరులతీగ ఊర్వశి ని గమ్యం గా చేసుకొని భక్తిని ప్రదర్శించడం లో సూఫీ తత్వం మనకు కనిపిస్తుంది .

**కృష్ణ శాస్త్రి గారి భక్తి సౌందర్యం** –: భక్తి అనే పదము భజయోగే అనే ధాతువు నుండి వచ్చింది . ఆది శంకరుల వారి నిర్వచనం జ్ఞాన మార్గం అవలంబించడానికి అన్వయిస్తుంది . మహా భాగవతం పారాయణ గ్రంధం . సంస్కృతంలో నవవిధ భక్తి మార్గాలున్నాయి . తనను తెలుసుకోవాలనే అన్వేషణ ,తపన వీరి కవితలో సాక్షాత్కరిస్తాయి . మధుర భక్తికి మరువపుకొమ్మ కృష్ణ శాస్త్రి గారు . భక్తి భావం లో ఊగి పోతూ తానే ప్రేయసిగా ,రాధగా ,గోపి గా , దాసునిగా , భక్తునిగా రకరకాలుగా రూపాంతరం చెంది, భక్తి రసాన్ని పరిపూర్ణ స్థితికి తీసుకు పోతాడు . భగవంతుడు కరుణించి అనుకోకుండా తన మందిరానికి వస్తే ,ఆ రసమయి పొందే ఆనందం ,అనురాగం ,ఆవేశం అనిర్వచనీయం . "ముందు తెలిసిన నా ప్రభూ ! ఈ మందిరమిటులుం చేనా ?మంద మతిని నీవు వచ్చు ,మధుర క్షణమేదో కాస్త ముందు తెలిసినా ?అందముగా నీకనులకు విందులుగా వాకిట నే సుందర మందార కుంద సుమదళములు పరవనా ?",చక్కని శబ్ద మాధుర్యం తో భావ సౌరభాలు గుబాలి స్తాయి రస హృదయులలో . విశ్వ ప్రభుని లీలలు విచిత్రం . బ్రతుకంతా ఎదురు చూచినా రాని స్వామి ఎదురు చూడని సమయంలో వసంతం లా వచ్చి గుండెను కొల్లగొడతాడు . విశ్వమంతా ప్రాణ విభుని మందిరం . మన తలపుల తలుపులుతెరిచి ఉంటే దేవదేవుడు తన చరణ ధూళి తో పవిత్రం చేస్తాడు ఆ మందిరాన్ని . భక్తి గీతా లలో కూడా అందెవేసిన చేయి వీరు . "నా నోట నీమాట గానమయ్యే వేళ ,నాగుండె నీవుండె మ్రోగింపవా వీణ" .

వీణ జీవుని వేదనకు ప్రతీక . భగవంతుడు నివసించని హృదయం చిలుక లేని పంజరం . వాగ్గేయ కారుల వాణి బాణి వీరు పుణికి పుచ్చుకున్నారు . "వాడిపోయిన తీగ మోడు వారిన తీగ ,పరిమళించినదోయి నీతోట ,విరిచి మురిచినదోయి నీ తోట". జీవితం దేవదేవుని కరుణ వల్ల విరిచి ,మురిచి నవ జీవన కళల తో పరిమళిస్తుందని పొంగిపోయాడు కవి గారు . అందమైన పదాలు భగవంతుని పాదాల చెంత సుందర సుమాలై వ్రాలతాయి . కలలో కరుణించిన ప్రభు ఇలలో నిర్దయ వహిస్తున్నాడు . తీవ్ర నిరాశ . "కానుక గా నే మొసంగ గలను నీకు ?దివ్యాలంకార శోభితులకు మానవ మాత్రుండను నే నేమి యగలను ?కన్నీటి ధారలు తప్ప. ఏమి సమర్పించాలన్న సంకోచమే . కన్నీరు కలుషాలను కడిగి వేస్తుంది . సృష్టి కర్త లీలలు అనంతం . గుండెలో పేరుకున్న కల్మషాలు కరిగి పోవాలన్న కన్నీరు కురవడమే మార్గం .నిర్మల మైన మనసు నుండి వచ్చే కన్నీటి కి అంత విలువ,పవిత్రత ఉన్నది .

**అభివ్యక్తి నైపుణ్యాలు** - : కవి భావాలను వ్యక్తం చేయడానికి భాష కావాలి . దానిని కవి ఏ పద్ధతిలో వాడారో దానిని అభివ్యక్తి అంటున్నారు . ప్రతి రచయిత కు ఒక శైలి ఉంటుంది . ఊహ ,భావన లేనిదే కవితా నిర్మాణం అసాధ్యం . కవి సృష్టించిన దాని కంటే భావించడం ,ఊహించడం ఎక్కువగా కనిపిస్తాయి . స్వేచ్ఛ భావకవి కి ప్రాణం. శాస్త్రి గారి సాహిత్యం లో భాషా ప్రయోగం లో ని అందాలను పరిశీలిస్తే పొందికైన పదాలు వాడారు . భావం భాష ,ఛందస్సుల సరితూగగ నడచిన ఆయన కవితా సుందరి ని మరింత రమణీయం చేశారు . మింట చుక్కలు,తలకు మీరిన తలపులు ,నెత్తావి ,కారు చీకటి ,సెలయేటి రొదలు ,కన్నీటి చుక్క లాంటి జాతీయాలు ఎన్నో వారి కవితల్లో కలవు . "కడుపార" అనే పదం జీవిత మాధుర్యాన్ని చూపే చక్కని జాతీయం . ఛందస్సు కూడా మాత్రా ఛందస్సు తోపాటు కొన్ని పద్యాలను స్వేచ్ఛగా వాడారు. సంప్రదాయ ఛందస్సు వారి చేతి లో ఎన్ని వయ్యారాలు ఒంపులు సంతరించుకుందో . పదాల కూర్పు అమోఘం గా ఉంటుంది . ఇరులు,రొదలు,పొదలు ,కొసరుతేనియలు ఇలాంటి లలిత పదాలు అనేకం వారి కవితల్లో . ప్రాచీన కవితా ధోరణిలో, ప్రబంధ శైలి కి దగ్గరగా దీర్ఘ సమాసాలు ,పలుకుబళ్ళు ,నుడికారాలు ,తన దైన శైలిలో ప్రయోగించారు దేవులపల్లి వారు తన సాహిత్యం లో .

మొత్తం మీద దేవులపల్లి వేంకట కృష్ణ శాస్త్రి గారి సాహిత్యం లోని సౌందర్యం ఒక ప్రత్యేకత కలది . కన్నీరు గుండె బరువును తగ్గిస్తు న్నదనే విషయాన్ని ప్రకృతి ధర్మంతో ముడి పెట్టి అలంకారికంగా చెప్పడం అందంగా ఉంది . ప్రేమ తత్వాన్ని వ్యక్తం జేస్తూ –"సౌరభమ్ము లేల చిమ్ము పుష్ప వ్రజమ్ము? ,చంద్రికల నేల వెదజల్లు చందమామ? , ఏల సలిలంబు పారు?.. ఏల నా హృదయంబు ప్రేమించు నిన్ను?" ప్రకృతినుండి ప్రేరణ పొందడం ,దానిని గురువు గా భావించడం కవి గారిలోచూస్తాము.మహా వక్త అయిన కృష్ణ శాస్త్రి గారికి ఎన్నో బిరుదులు కలవు .1966 లో వారి గొంతు మూగ బోయింది . అయినా జీవితాంతం "మూగ వోయిన నా గొంతు నందు కూడా ,నిదుర పోయిన సెలయేటి రొదలు గలవు ,"అంటూ తన సాహిత్యాన్ని కొనసాగించాడు . భావకవిత్వం లో వస్తువు కొత్తది అయినా సంప్రదాయ

సాహిత్య పద్ధతిని విడిచి పెట్టలేక పోయాడు . పూర్వీకులు ఎందరో మానవసౌందర్యం ,ప్రకృతి సౌందర్యం ను గూర్చి పరిశీలించారు . ఎమర్సన్ సౌందర్యమే సత్యం,సత్యమే సౌందర్యం అన్నారు . సౌశీల్యమే సౌందర్యం అని షేక్స్పియర్ అన్నారు . భావ కవులు ఆత్మ సౌందర్యానికి అంజలి ఘటించారు

ఈవిధంగా దేవులపల్లి వేంకట కృష్ణ శాస్త్రి గారి సాహిత్యం లోని సౌందర్యం ద్వారా పాఠకులకు రసానుభూతి ని కలిగించి అదో లోకానికి తీసుకుపోయి ,మనసును ప్రశాంతంగా ఉంచుతుంది . భాష ,భావం లోని నవ్యత ,నూతన ధోరణి తెలుసుకోవచ్చు. వ్యక్తిత్వ వికాసానికి ,సృజనాత్మక రచనా వ్యాసంగానికి ,లోతైన భావోద్వేగ వ్యక్తీకరణకు ,మరియు ఆత్మను కదిలించడానికి వీరి సాహిత్యం తోడ్పడుతుంది .భావ కవిత్వం లోని ప్రకృతి ,ప్రేమ ,ఆరాధన తాత్వికతను ,దేశభక్తి ,స్మృతి తెలుసుకోవచ్చు . వారి లోతైన అనుభూతి, తరతరాలకు స్పూర్తినిస్తుంది . వారి సాహిత్యం సంగీతం తో మిళితమై తెలుగు భాషకు విశిష్ట మైన మాధుర్యాన్ని లోతైన భావాన్ని అందిస్తుంది . భాష సాహిత్యాభి మానులకు ఆదర్శము మరియు ఆధునిక సాహిత్యంలో సుస్థిర స్థానం కలిగిస్తుందని చెప్పవచ్చు .ఏది చెప్పినా అందంగా ,సుకుమారంగా ,రసలాలిత్యం తోచెప్పడం వారి ప్రత్యేకత . సౌందర్య జలధి లోతులు చూసిన మనీషి శాస్త్రి గారు . గాలికి ఎల్లలు నిర్ణయించ లేనట్లే ఆయన సౌందర్య సామ్రాజ్యానికి ఎల్లలు నిర్ణయించలేం అనేది వారి సాహిత్యం ద్వారా పాఠకులు తెలుసుకోవచ్చు .

**ఆధార గ్రంథాలు** -

తెలుగుభావకవులు- కృష్ణ శాస్త్రి సౌందర్య దృష్టి -డా -కె . శ్రీదేవి పరిశోధనా గ్రంధం
సాహిత్య సుధ -డా :యన్ . గంగప్ప గారు.
ఆధునికాంధ్ర కవిత్వం,సాంప్రదాయాలు -ప్రయోగాలు -డా సి నారాయణ రెడ్డి .
తెలుగు సాహిత్య చరిత్ర -ద్వా .నా. శాస్త్రి
తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతం -వెలమల సిమ్మన.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# నవల ఆవిర్భావ వికాసాలు

**చింతపల్లి. వేణు గోపాల కృష్ణ**
పరిశోధక విద్యార్థి, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం - చిత్తూరు జిల్లా.
**చరవాణి :** 9908264926 ,**E.Mail:** kittubsc72@gmail.com

**ఉపోద్ఘాతం:**

ఆధునిక యుగంలో బహు జనాదరణ పొందిన వాంగ్మయ ప్రక్రియలో నవల అని చెప్పవచ్చు. ఆంగ్ల సాహిత్యం ప్రభావంతో తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు వచ్చాయి. కథ, నాటకం, నాటిక, వ్యాసం, సమీక్ష, పీఠిక, అనువాద సాహిత్యం, సంపాదకత్వం, స్వీయ చరిత్ర, నవల మొదలైనవి .

"నవల" అనే పదం Novel అనే ఆంగ్ల పదం నుంచి వచ్చింది. ఆంగ్లంలో Novel అనే పదం Novelle అనే ఇటాలియన్ పదం నుంచి వచ్చింది. లాటిన్ లో నవల అనే పదాన్ని Novellus అని, ఫ్రెంచ్ లో Novus అని అంటారు. ఉర్దూలో నవలా అనీ, తమిళంలో వుదినం అనీ, సంస్కృతంలో నవలా అనీ, కన్నడం, గుజరాతీ భాషల్లో కాదంబరి అనీ అంటారు. తెలుగులో నవల అనే పదాన్ని మొట్టమొదటిసారిగా కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి గారు ఉపయోగించారు. అప్పటినుండి ఆంగ్ల భాషలో novelle పేరు తెలుగు భాషలో నవలగా ప్రసిద్ధికెక్కింది.

**కీలక పదాలు :**

నవలా ప్రక్రియ
సన్నివేశాలు కల్పన
కళాకృతి
కథా వస్తువు
సాంఘిక దురాచారాలు

**నవల గురించి ప్రముఖుల నిర్వచనాలు:**

నవలను అనేకమంది తమ తమ దృక్కోణాల నుంచి విభిన్నమైన రీతులుగా నిర్వచించారు.

* యథార్థ జీవనాన్ని యథార్థ దృష్టితో అధ్యయనం చేసి దానిని గద్యరూపంలో వ్యక్తం చేసేదే నవల - "రిచార్డ్ క్రాస్"

* సజీవమైన జగత్తులో పరిచయం చేసే కళాకృతి నవల చాలా విధాల ఈ జగత్తు మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పోలి ఉంటుంది - "హార్డి"

* సాంఘిక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల - "శ్రీ మొదలి నాగభూషణ శర్మ"

* జీవితాన్ని ప్రధానంగా తీసుకొని , సామాజిక జీవితాన్ని స్మరింపజేసే సాహిత్య ప్రక్రియ నవల - "ఆర్ .ఎస్ .సుదర్శనం"

**విషయ విశ్లేషణ :**

నవల నిర్మాణంలో ముఖ్యంగా నాలుగు భాగాలు ఉంటాయి . అవి

కథా వస్తువు

పాత్ర చిత్రణం

సన్నివేశ కల్పనం

దేశకాల నిర్దేశం

**తెలుగు నవల ఆవిర్భావ వికాసాలు :**

రచయితలలో పేరెన్నికగన్న రచయితలు చాలామంది ఉన్నారు. వారిలో అడవి బాపిరాజు. బుచ్చిరాజు. చిలకమర్తి లక్ష్మీనరసింహం. ఉన్నవ లక్ష్మీనారాయణ. విశ్వనాథ సత్యనారాయణ. కందుకూరి వీరేశలింగం. కొడవగంటి కుటుంబరావు. యద్దనపూడి సులోచన మొదలైన నవలాకారులు ఉన్నారు. మీరు రాసిన నవలల్లో అవినీతి నిర్మూలన, స్వాతంత్ర్య సముపార్జన, స్త్రీ జనోద్ధరణ మరియు సంఘసంస్కరణ... ఇలా సమాజంలో ఉన్న అనేక సాంఘిక దురాచారాలను నవలా వస్తువుగా తీసుకొని నవల రాయడం జరిగింది.

తెలుగులో తొలి తెలుగు నవల గురించి అనేక భిన్న అభిప్రాయాలు చోటు చేసుకున్నాయి. దీనికి కారణం మూడు రకాల నవలలు ఉండడం. అవి 1867 లో కొండ వెంకటరత్నం పంతులు గారు రాసిన నవల "మహాశ్వేత" మొదటిగా చెప్పుకోవచ్చు. రెండవ నవలను 1872 లో నరహరి గోపాలకృష్ణమశెట్టి గారు "శ్రీరంగరాజ చరిత్ర" రాశారు. ఇక 1878 లో కందుకూరి వీరేశలింగం గారు "రాజశేఖర చరిత్ర" ను రాశారు. అయితే ఈ ముగ్గురు తమ రచనలను ఎక్కడా 'నవల అని పేర్కొనలేదు' .

**తెలుగు నవలా వికాసం:**

1872 లో తెలుగు నవల ప్రారంభమైనట్లుగా మనం చెప్పుకోవచ్చు . తెలుగు నవల వికాసాన్ని ఐదు భాగాలుగా విభజించవచ్చు. అవి :

1. ప్రారంభ యుగం [1872 - 1900]

2 . అనువాద యుగం [1900 - 1920]

3 . వికాస యుగం [1920 - 1942]

4 . మనోవైజ్ఞానిక యుగం [1942 - 1960]

5 . సమకాలీన యుగం [1960 - ఇప్పటివరకు]

**1. ప్రారంభ యుగం:**

ఈ యుగాన్ని వీరేశలింగం యుగముగా పిలుస్తారు. కారణం కందుకూరి వీరేశలింగం గారు రాసిన రాజశేఖర్ చరిత్ర నవల ప్రభావంతో అనేక నవలలు ఆ కాలంలో వచ్చాయి. అందువలన ప్రారంభ యుగాన్ని వీరేశలింగం యుగంగా పేర్కొన్నారు. కందుకూరి వీరేశలింగం గారి ప్రభావం చిలకమర్తి లక్ష్మీ నరసింహ గారిపై పడింది. ఆ ప్రభావం వలన చిలకమర్తి వారు 'రామచంద్ర విజయం' అనే నవలలను రాయడం జరిగింది. కందుకూరి వీరేశలింగం గారు రాజశేఖర్ చరిత్ర నవలను రాయడమే కాక , నవలల పోటీలు నిర్వహించి నవల రచనలను ప్రోత్సహించారు. ఇంకా చిలకమర్తి లక్ష్మీ నరసింహ గారు గణపతి, హేమలత, కర్పూరమంజరి మొదలైన నవలలు రాశారు. వీరు రాసిన నవలల్లో 'చారిత్రక నవల' గా హేమలత ను, రామచంద్ర విజయం 'సాంఘిక నవల' గానూ చెప్పుకోవచ్చు.

**2. అనువాద యుగం:**

ఈ యుగంలో అనువాదక నవలలు చాలా ఎక్కువగా వచ్చాయి. చారిత్రక నవలలు కూడా ఈ యుగంలోనే వెలబడ్డాయి. ఆ కారణంగా అందుచేత ఈ యుగాన్ని చారిత్రక యుగమని కూడా అంటారు. జివిఎస్ దొరస్వామయ్య గారు రాసిన 'కపాల కుండలం' తెలుగులో మొట్టమొదటి అనువాద నవల. ఈ నవల బెంగాలీ భాష నుంచి అనువదించబడింది. 1907లో ఆనందమఠం అనే పేరుతో మరో బెంగాలీ నవలను దొరస్వామి గారు అనువదించారు. ఈ యుగంలో అనువాదాలే కాకుండా స్వతంత్ర చారిత్రక నవలలు కూడా వచ్చాయి. ఖండవల్లి రామచంద్రుడు గారి ధర్మవతీ విలాసము, లక్ష్మీ సుందర విజయము , కేతవరపు వెంకట శాస్త్రి గారి రాయచూరు ముట్టడి, , వంగూరు సుబ్బారావు గారి ప్రభాతము మొదలైనవన్నీ స్వతంత్ర చారిత్రక నవలలు .

**3. వికాస యుగం:**

వికాస యుగం లో నవలలు అనేక మార్పులు వచ్చాయి. భాషలో, శైలిలో, వస్తువులో, శిల్పంలో అనేక మార్పులు వచ్చాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' అనే నవల వికాస యుగంలోనే వచ్చింది. ఈ నవల వ్యవహారిక తెలుగు భాషలో వచ్చిన నవలగా పేరుపొందింది . అడవి బాపిరాజు గారు, విశ్వనాథ సత్యనారాయణ గారు నవలా వికాసానికి ఎంతగానో తోడ్పడ్డారు. గుడిపాటి వెంకటచలం గారు కాల్పనికోద్యమ లక్షణాన్ని నవలలలో ప్రవేశపెట్టడం జరిగింది. చలం గారు మైదానం, శశిరేఖ, కన్నీటి కాలువ, బ్రాహ్మణీకంమొదలైన నవలలని రాశారు.

అడవి బాపిరాజు తుఫాను, కోనంగి, నరుడు, జాజిమల్లి, నారాయణరావు అనే సాంఘిక నవలను రాశారు. బాపిరాజు గారికి ఆంధ్రుల పట్ల, ఆంధ్ర చరిత్ర పట్ల, సంస్కృతి పట్ల అపారమైన గౌరవం. వీరి నవలలలో ఎక్కువగా సంగీత నృత్యం , చిత్రలేఖనాలు కనబడతాయి.

మొక్కపాటి నరసింహ శాస్త్రి గారు బారిష్టర్ పార్వతీశం నవలలను రాసి పాఠకులకు అందించారు. ఈ నవల నేటికీ పాఠకుల హృదయాలను రంజింప చేస్తోంది. ముని మాణిక్యం నరసింహారావు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి మొదలైన వారందరూ అనేక నవలలు రాసి మంచి పేరు సంపాదించుకున్నారు.

**4. మనో వైజ్ఞానిక యుగం:**

మనోవైజ్ఞానిక యుగంలో రచయితలు అందరూ మానవుని యొక్క అంత స్వభావానికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. మనిషి యొక్క మనోగత భావాలను మానసికమైన సంఘర్షణను యధాతథంగా చిత్రీకరించారు. మనోవైజ్ఞానిక నవలలు రాసిన వారిలో ప్రముఖమైన వారు కొడవగంటి కుటుంబరావు, బుచ్చిరాజు, జీవీ కృష్ణారావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, గోపీచంద్.

కొడవగంటి కుటుంబరావు గారు అనుభవం , చదువు నవలలలో ఆర్థిక మానసిక సంక్షోభాన్ని చాలా చక్కగా చిత్రించారు. త్రిపురనేని గోపీచంద్ గారి అసమర్థుని జీవయాత్ర తెలుగులో తొలి మనో వైజ్ఞానిక నవల. బుచ్చిబాబు గారి 'చివరికి మిగిలేది' అనే నవలతో ప్రసిద్ధ నవలాకారుల సరసన చేరారు. రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారు రచించిన 'అల్పజీవి' , జీవీ కృష్ణారావు గారు రచించిన 'కీలుబొమ్మలు' బలివాడ కాంతారావు గారి గోడమీద బొమ్మ , సుగుణ మొదలైనవి కూడా మనో వైజ్ఞానిక నవలలుగా పేరుపొందాయి .

**5. సమకాలీన యుగం:** ఈ యుగంలో పురుషులే కాక , స్త్రీలు కూడా మంచి నవలలు రాసారు. అందుచేత ఈ యుగాన్ని సమకాలీన యుగం అన్నారు. ముప్పాళ్ళ రంగనాయకమ్మ, వాసిరెడ్డి సీతాదేవి, కోడూరి కౌసల్యాదేవి, మాదిరెడ్డి సులోచన రామలక్ష్మి మొదలైన రచయితలు అనేక సామాజిక నవలలను రాసి జాతిని జాగృతం చేయడంలో సఫలీకృతులయ్యారు. దాశరథి రంగాచార్య , పోరంకి దక్షిణామూర్తి, ఉప్పల లక్ష్మణరావు , పాలగుమ్మి పద్మరాజు, బీనాదేవి, మంజుశ్రీ మొదలైన వారు సమకాలీన యుగానికి సంబంధించిన వారే .

**ముగింపు:** తెలుగులో సాంఘిక, చారిత్రక మరియు పౌరాణిక కథలకు సంబంధించిన అనేక నవలలు వచ్చాయి. మాండలిక నవలలు కూడా వస్తూ ఉన్నాయి. ప్రతి వార పత్రికలోనూ, మాస పత్రికలోనూ కూడా ప్రస్తుతం నవలలు కనిపిస్తూ ఉన్నాయి . ఇంకా అసంఖ్యాకంగా నవలలు వెలువడుతున్నాయి. 'నవల' ఆధునిక యుగంలో చాలా బలమైన ప్రభావవంతమైన రచనా ప్రక్రియ. నవల మానవ జీవితానికి ప్రతిబింబం వంటిది అని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంధాలు :**

1. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - వెలమల సిమ్మన్న
2. శ్రీమతి కె.వరలక్ష్మి సాహిత్యము - పరిశీలన. ఎం.రవి కుమార్.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# పాపం కుంటేలు గాడు – కథలోని వాస్తవికత

**డా. చిలక అనిత**

తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల(స్వ.ప్ర), చరవాణి: 9849370225

"దళితులు పట్ల తనకున్నది మామూలు తపన కాదు తన ఎదలో ఎంతో యజ్ఞం జరిగితే కానీ ఈ కథలు బయటికి రావు" అని కొలకలూరి ఇనాక్ గారు అన్నట్లు సీమచిన్నోడుగా పులికంటి కృష్ణారెడ్డి గారు లబ్ధ ప్రతిష్టుడు. ఇతడు ఒక అవిశ్రాంత కృషీవలుడు సమాజంలో పీడిత తాడితుల బ్రతుకు వెతలు గురించి రాయడం రచయిత నైతిక బాధ్యతగా తలంచి తన చుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న దౌర్జన్యాలు దౌష్ట్యాలను దళిత కథలుగా మలచి మన ముందు ఉంచారు.

**పాపం కుంటేలు గాడు**

మాకడు మంగది అన్యోన్య దాంపత్యం. అనుకూలవతి అయిన భార్య. వారి అన్యోన్య దాంపత్యానికి సాక్షి కుంటేలు గాడు. మాకడు మంగను గడప దాటకుండా కళ్ళల్లో పెట్టుకుని గుట్టుగా కాపురం చేశాడు. ప్రతిరోజు మాకడు అడవిలో కట్టెలు కొట్టుకొని వచ్చి పల్లెలోనూ పేట లోను అమ్ముకుంటూ మంగని, కుంటేలు గాని కంటిపాపల్లా చూసుకున్నాడు. రోజు లాగానే ఆరోజు కూడా కట్టెలు కొట్టడానికి అడవికి వెళ్లగా పాముకాటుకు గుర్రై నురగ కక్కుతూ చనిపోయాడు. అది జరిగి ఏడాది జరగకముందే మంగ మనోవేదనతో పాడెక్కింది.

తనకంటూ మిగిల్చిన ఆస్తి మచ్చుకత్తి మరియు ఎనుగాడికి తగిలించిన చిక్కం ఈ రెండు తన తండ్రి జీవితంలో పోరాడి పోరాడి తన కోసం వారసత్వంగా మిగిల్చిన ఆస్తులు. బాల్యంలో తండ్రిని పోగొట్టుకున్నప్పటికీ కూడా సింహాసనాన్ని వారసత్వంగా పొందిన మొగలాయి చక్రవర్తిలా ఉండేవాడు. కుంటెలు గాడు యుక్త వయసుకు వచ్చిన కుంటెలు గాడు దినానికి ఒక్క రూపాయి బిళ్ళ చొప్పున దొంతి అడుగున కడవలో దాచిన రూపాయి బిళ్ళలన్నీ మూటగట్టుకొని తన కోరికలు గుర్రాలు అయినా వేళ ఆశల రథానికి కట్టుకున్నాడు. ఆ డబ్బులో ఓలి కింద జమ చేయవచ్చునని భావించిన కుంటేలు గాడు తన మామ పిన పెద్ద వద్దకు వచ్చాడు. ఈ విషయాన్ని చెప్పి తెచ్చిన దుడ్డు చూపించడంతో "ఒరేయ్ ఒలిస్తే పొట్టా? దంచితే నూకా? ఏముండాది రా నీకు? అందులో కుంటేలు గాడివి ఎవరు ఇస్తారు రా నీకు పిల్లని" పుట్టుకతో బాగానే పుట్టినా తండ్రి చనిపోవడంతో తాను కూడా కట్టెలు నరికి అమ్ముకునే ప్రయత్నంలో పదునైన కత్తితో చెట్టు నరుకుతూ ఉంటే కత్తి జారి కాలి బొటనవేలు కసుక్కున తెగింది అందరూ మాట్లాడేది కాదండి ఇది. అందరూ కుంటేలు గాడు కుంటేలు గాడు అంటారే

గాని ఒకవేలు కుంటిదైతే అయింది మనసుకుంటిది కాదులే అని ఆ గ్రామ పెపినద్ద కూతురు చెంగి తల్లిదండ్రులకు చెప్పకుండా కుంటేలు గాడి గుడిసె దగ్గరకు వచ్చి 'బొట్నేలు తొక్కి బొట్టు కట్టు మామ! అని అడిగింది'. ఇది కల నిజమా అనుకున్నాడు "మామ! ఏపపువ్వు గుమ్మిడి పువ్వు అంత పెద్దది కాదు రోజా పువ్వు అంత అందమైనది కాదు ఇప్ప పువ్వంత మత్తయింది కాదు మల్ల ఏమి చూసుకుని తుమ్మిద ఆ చేదు పువ్వు చుట్టూ తిరుగుతా ఉంది. నువ్వు ఎప్పుడైనా ఆలోచించినావా చెప్పు మామ?" అని చెంగి అనడంతో చెంగి యొక్క మానసిక పరిపక్వత గమనిస్తాం కత్తి పట్టిన చెయ్యి తాళి కట్టడానికి తట పటాయించింది మనిషిలో తడబాటే కానీ మనసులో తడబాటు కాదు.

తాళి కట్టిన వార్త విన్న పినపెద్ద తోక తొక్కిన తాచులా కుంటేలు గాడి పైకి లేచాడు. ఊరువాడ అంత ఏకం చేసుకుని వచ్చిన తండ్రిని చూసిన చెంగి కళ్ళలో నిప్పులు కక్కుతూ పండ్లు పటపట కొరుకుతూ ప యటకొంగు ఈడ్చి నడుముకి చుట్టి కాళికా అమ్మవారిలా నిలబడి 'నా మామ మింద చేయి పడాలంటే నా శవం మీద నడిచి పోవాల్సిందే' అని సవాలు చేసింది ఇంట్లో పిల్లి పిల్లల పెరిగిన బిడ్డ పులిలా గాండ్రించేసరికి తండ్రి పినపెద్ద తోక ముడిచాడు. ఈ సంఘటనతో కుంటేలు గాన్ని తల ఎత్తుకునేలా చేసింది చెంగి.

చెంగిని చూసుకున్న కుంటేలు గాడికి కత్తికి పదును వచ్చినట్లయినది చెంగి ఇంట్లో తిరుగుతుంటే ముత్యాలముగ్గు మాదిరిగా అనిపించేది కుంటేలు గాడికి కొంత కాలానికి చెంగి నెల తప్పింది. కన్నవాళ్ళు కన్నెత్తి చూడలేదు వాడలో వాళ్ళు వీళ్ల నీడ పడితేనే నిప్పులు కక్కుతూ ఉన్నారు. "నాకు నువ్వు నీకు నేను మనకు మనమే లోకమని" ఆనందపడ్డారు ఆ తృప్తితో కాలం గడుస్తూ ఉంది పుట్టింటి వాళ్ళు పురుడు పోయడానికి కూడా రాలేదు. కాళ్ళా వెళ్ళాపడి బ్రతిమిలాడినా వాడలో మంత్రసాని కూడా రాలేదు పండంటి మగ బిడ్డను చేతికిచ్చి చెంగి చేజారి పోయింది.

కుంటేలు గాడు కొడుక్కి వరదడు అనే పేరు పెట్టాడు. పాపం కుంటేలు గాడికి ఆ బిడ్డకు ఒళ్ళు కడగటం రాదు పాలు పట్టడం చేతకాదు అయినా ఆవాడ ఈ పేట అంటూ తిరిగి ఆవు పాలు దొరక్కపోతే బుడ్డిపాలు పట్టేవాడు. ఎక్కువ సమయం వాడితోనే సరిపోయేది మరి బతుకుబండి నడిస్తే తప్పితే ఇంటికి ఇద్దరికీ కడుపునిండే వైనం లేదు అందుకని వరదుడ్ని ఒక సంకలో చిక్కాన్ని మరో సంకలో కట్టుకొని అడవికి పోయి గుడ్డను ఏ కొమ్మకో కట్టి కట్టెలు కొట్టి అమ్ముకొని పొట్ట పోసుకొనేవాడు.

ప్రతినెలా కొంత మొత్తాన్ని ఫారెస్ట్ వాళ్లకు మామూలు రూపంలో ముట్ట చెప్తాడు. అందువల్ల వాడి జోలికి ఎవరూ రారు. ఒకరోజు ఉన్నట్టుండి స్పెషల్ బీట్ వాడు రావడంతో నివ్వెరపోయాడు. మామూలుగా అయితే దొరికేవాడు కాదు గాని వరదడు కొమ్మకు కట్టిన ఉయ్యాలలో ఉండిపోయాడు అందువల్ల దొరికిపోయాడు. వదిలేయమని కాళ్ళ వేళ్ళ పడి కన్నీళ్ళతో వాళ్ళ కాళ్లు

కడిగాడు. ఏడుస్తున్న బిడ్డను ఓదార్చాలని తండ్రి, 'తండ్రి రాలేదే అని బిడ్డ' ఇద్దరి తపన పాఠకులను బాధ కలిగిస్తుంది. తండ్రి బిడ్డల మధ్య అనుబంధం ఒకదానికి ఒకటి పోటీ పడుతున్నాయి. "మా అయ్య కట్టెలు కొట్టే బతికాడు పాము వాతపడ్డాడు మా అమ్మ కూడా పోయింది నేనూ కట్టలే కొడతా ఉండా! నట్టింటికి నడిసి వచ్చిన లచ్చిమి నాకు దక్కకుండా పోయింది. పచ్చని చెట్టును కొట్టే బతుకులు పైకెక్కి రావంటారా నిజమేనేమో?" అన్న సెంటిమెంటును పండించారు రచయిత

కుంటేలు గాడికిఅప్పుడే గుర్తొచ్చింది తన తండ్రికి గవర్నమెంట్ ఇచ్చిన ఐదెకరాల పోరంబోకు నేల ఆ భూమిని చదును చేసి సేద్యం చేసి పంటలు పండిస్తే తన బిడ్డ తన లాగా కట్టెలు కొట్టుకోకుండా బాగా బ్రతకాలని నాలుగు రోజులు పనికెళ్ళి మూడు రోజులు పొలం చుట్టూ చదును చేసుకునేవాడు. కొంతకాలానికి ఆ భూమి రూపురేఖలు మార్చేశాడు. కట్టెలమ్మేటప్పుడు వాడికి కడుపు నిండితే చాలు అనుకునేవాడు. ఇప్పుడు కొత్త ఆశలు మోసులు ఎత్తాయి బావి కావాలని, బోరు కావాలని, కరెంటు మిషన్ కావాలని, ఏడాదికి రెండు పంటలు పండించాలని, మూడంకనాల పూరిల్లు వేసుకోవాలని తన "వరదుడు దొర మాదిరిగా కూర్చొని తినాలని" తండ్రికి బిడ్డ పట్ల ఉండే సహజమైన అవ్యాజమైన ప్రేమను ఇక్కడ మనము గమనిస్తాం. అప్పుడే కుంటేలు గాడి ఆశ కి ఊపిరి పోసింది.

ఆ గ్రామంలో హెడ్మాస్టర్ స్కూల్ విద్యార్థి సంఘ ఎన్నికలకు తేదీని ప్రకటించారు. ప్రచార సాధనాలుగా విద్యార్థులంతా గోడలనే. ప్రచార సాధనాలుగా ఎంచుకున్నారు ఏఇంటి గోడ మీద చూసినా పోటీ చేయబోయే విద్యార్థి పేరు రాయడం అలా తమతమ స్థలాన్ని రిజర్వ్ చేసుకుంటున్న నేపథ్యంలో ఆ ఎన్నికల్లో ఒక హరిజన విద్యార్థి కూడా పోటీ చేస్తున్నాడు. అందరు విద్యార్థులు లాగే ఆ విద్యార్థి కూడా తన స్థానాన్ని రిజర్వ్ చేసుకున్నాడు. ఆ సందర్భంలో రెడ్డి కొడుకు పిల్లలందరికీ చిల్లర డబ్బులు పంచిపెడతా ప్రాసలు మిసాలు తిప్పే నినాదాన్ని గోడల మీదకు ఎక్కించాలని బయలుదేరాడు.అప్పటికే ఊళ్లో గోడల మీద ఉన్న హరిజనవిద్యార్థి పేరు చూసి మండిపడ్డారు. "ఈ మాల నా కొడుకుల్కి ఏడ చూసినా రిజర్వేషన్లు కావాల్నా? చదువుకోవాలంటే రిజర్వేషన్లు, ఉద్యోగాలకు రిజర్వేషన్లు, ప్రమోషన్లకు రిజర్వేషన్లు, వయసులో రిజర్వేషన్లు, కడకు గోడల మీద కూడా రిజర్వేషన్లా? ఉండే రిజర్వేషన్లు చాలుగాని గోడలకు మన స్లొగన్స్ రాయండ్రా రాయండి" అని రెడ్డి కొడుకు ఆజ్ఞ జారీ చేశాడు.

ఆ మాట కోసమే చూస్తున్న విద్యార్థులు గుంపులు గుంపులుగా హరిజన విద్యార్థి పేరుని ఆనవాలు లేకుండా చేశారు. అప్పటికి కాని వారి మనసు శాంతించలేదు ఇదేం న్యాయం అని అడిగినందుకు తిరిగి నాలుగు అంటించి ఎవరితో చెప్పుకుంటావో నీకు దిక్కున చోట చెప్పుకోమని వికృత చేష్టలు చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని వాడలోని తన కులంలో వాపు

అవడంతో అది తన కులానికి జరిగిన అన్యాయంగా భావించి ఈ అన్యాయాన్ని ఎదిరించకపోతే తమ బ్రతుకులే అన్యాయం అయిపోతాయని అందరూ ఏకమయ్యారు ఫలితంగా రెడ్డి కొడుకు అతని అనుచరులకు ఆసుపత్రిలో నెల వరకు మంచం దిగే అవకాశం లేకుండా పోయింది. దీనితో రెడ్డి గారు త్రాచులా బుసలు కొట్టాడు. అతనిని అతని స్నేహితులంతా సముదాయించారు. ఇది సరైన సమయం కాదని ప్రతీకారం జరగాలి కానీ ప్రత్యక్షంగా కాదు అని అరిటాకు ముల్లు సామెతను చెప్పి ప్రస్తుతం రెడ్డి గారి పరిస్థితి అరిటాకు అని గుర్తుచేసి మరి సముదాయించారు.

కొంతకాలం తర్వాత రెడ్డిగారి మనుషులు ఒక పుణ్యకార్యానికి తెర తీశారు. అందులో భాగమే వాడలో తూర్పు వైపు ఇండ్లన్నీ కాలిపోయాయి. విచారణ చేసి తమకు తగిన న్యాయాన్ని చేయమని హరిజనులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆఫీసర్లందరూ తన మంది మార్బలంతో వచ్చి సానుభూతి తెలిపి దర్యాప్తు ప్రారంభించగా పిల్లల గొడవ పెద్దలు దాకా వచ్చిందని అందుకు తక్షణ కర్తవ్యం గా ప్రతి అగ్ని బాధిత కుటుంబానికి కలెక్టర్ గారు ఐదువేల రూపాయలు అందజేశారు.కుంటేలు గాడు ఇల్లు పడమట వైపు కావడం వల్ల కాలిపోలేదు కాలిపోయినట్లయితే తన కూడా చక్కగా 5000 వచ్చేవని దానితో తన పొలంలో బాయి తొవ్వుకొని కరెంట్ మిషన్ పెట్టుకోవచ్చని మంచి పంటలు పండించి అందరికల్లు బైర్లు గమ్మేలా చేయొచ్చు అని గుడిసె తీసి మంచి ఇల్లు కట్టుకుందును అని బాధపడడం గమనిస్తాం.కాలు గాలిన పిల్లిలా తిరుగుతూ ఉంటే ఉన్నట్లుండి కుంటేలు గాడికి ఒక ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనతో ఎగిరి గంతేసినఅంత గంతేసిన అంత పని అయింది.

ఒకరోజు కుంటేలు గాడు కూలికి పోలేదు, తన పొలంలో పనికి పోలేదు అప్పుడు వరదుడు అడగనే అడిగాడు " ఎందుకు నాయనా! ఈ పొద్దు పనికి పోలేదే?" తనలో ఉన్న ఆనందానికి అవధులు లేవు ఊహల్లో తేలుతున్న కుంటేలు గాడు వరదుడికి పదిపైసలిచ్చి కొనుక్కోమని పంపించాడు. బిడ్డని ముద్దులతో ముంచెత్తాడు ఎండ కావడం వల్ల ముసలి ముతకమాత్రమేఇళ్ళల్లో ఉండి మిగిలిన వాళ్ళంతా కూలి పనికి వెళ్లడంతో తన గుడిసింట్లో దొంతికుండలా అడుగున బాణలో దాచుకున్న రూపాయి బిళ్ళలన్నీ ములసంచికి పోసుకొని ములక చుట్టుకున్నాడు. గబగబా బయటికి వచ్చి చుట్టు పరిసరాలను నిసితంగా గమనించి ఎవరు గమనించట్లేదని భావించి నిర్ధారించుకొని తన ఇంటికి అగ్గి పెట్టాడు.బాగా ఎండ కావడం వల్ల గాలి కూడా బాగా ఉండటం వల్ల తన గుడిసెతో పాటు మిగిలిన గుడిసెలు కూడా కాలుతున్నాయి. మనసు ఆనందంతో తాండవం చేస్తుంది గంపల కింద కోళ్లు ఆ సెగకు మాడి మసయిపోతున్నాయి పిల్లా జిల్లా హాహాకారాలు చేస్తున్నారు. కుంటేలు గాడికి ఇవన్నీ కనిపించట్లేదు వాడు ఇప్పుడు పుత్రకామేష్టి యాగం

చేసిన దశరథ అయ్యాడుదశరథుడికి యజ్ఞ పురుషుడు బాండాన్ని అందిస్తే కుంటేలు గాడికి ఆ మంటల్లో నుండి కలెక్టర్ చిరునవ్వుతో నడిచి వచ్చి ₹5, 000 అందిస్తున్నాడు.

తండ్రి కోసం ఎక్కడెక్కడో వెతికిన వరదుడు చివరకు చింతల తోపులో తండ్రి కనిపించేసరికి నాయనా అని పరిగెత్తుకొని వస్తున్నాడు. భవిష్యత్తు మీద ఆశలతో సంతోషంతో కుంటేలు గాడు కాలు మెదపకుండా ఉన్నాడు. ఇంతలో ఎటు నుండి వచ్చిందో నిగనిగ లాడుతున్న బారెడు తెట్టే వరదుడిపై పడింది. నాయనా! అని ఒక అరుపు అరిచి బండ కింద పడిన ఎలుక పిల్లలా కణకణమండే అగ్ని కణాలలో కలిసిపోయాడు. కుమిలి కుమిలి ఏడుస్తున్న కుంటేలు గాడిని చూసి మిడిసి పడుతున్న మంటలు ఒళ్ళు విరుచుకుంటూ పగలబడి నవ్వుకున్నాయి.

ఒకప్పుడు కుంటేలు గాడి భార్య చెంగి "ఒకవేలు కుంటిదయితే అయింది మనసు కుంటిది కాదులే"అనుకుని తృప్తి పడింది ఆ తృప్తిని అసంతృప్తిగా మిగిల్చి ఆ మనసే స్వార్థంతో ఊహల తూగు టుయ్యాల కడితే అజ్ఞానం నిలువునాఆ తూగుటుయ్యాలను తెంపేసింది. పాపం కుంటేలు గాడు గుడిసె కాలితే నష్టపరిహారం డబ్బులు వస్తాయి తన కొడుకును దొరబాబులా చూసుకోవచ్చు అనే ఆశతో తన చేతులారా గుడిసెకు నిప్పు పెట్టాడు. విధి వక్రీకరించి ఆ మంటలకే తన తన కొడుకు వరదుడే ఆహుతవ్వటం పాఠకులకు కంటతడి పెట్టిస్తుంది.

.

**తెలుగు సూచన గ్రంథాలు**


1. **కొలకలూరి ఇనాక్** – *దళిత సాహిత్య సిద్ధాంతం*
2. **కంచ ఐలయ్య** – *పోస్ట్–హిందూ ఇండియా*
3. **జి. కేశవ రెడ్డి** – *దళిత కథా పరిణామం*
4. **చింతకింది సత్యనారాయణ** – *దళిత సాహిత్య చరిత్ర*
5. **వరవర రావు (సం.)** – *దళిత కథలు: ఒక అధ్యయనం*
6. **అజయ్ కుమార్** – *తెలుగు దళిత కథా లోకం*
7. **మధురాంతకం నరేంద్ర** – *సామాజిక వాస్తవికత – తెలుగు కథ*

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## వడలి రాధాకృష్ణ కథాసంపుటాల ఇతివృత్తం – సామాజికత

**డా. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు,**
ఆంధ్రోపన్యాసకులు, విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వెంకటగిరి, తిరుపతి జిల్లా.

ఏ కథ రాయాలన్నా దానిలో ప్రధానమైనది ఇతివృత్తము. ఇతివృత్తమంటే కథలో చెప్పదలచుకున్న విషయము. రచయిత ఏ విషయాన్ని సమాజానికి అందించదలచుకున్నాడో ఆ విషయానికి అనుగుణమైన ఇతివృత్తాన్ని ఎంచుకొంటాడు. కవి అందించదలచుకున్న సందేశం పాఠకుని హృదయంలో చిరకాల ఉండేలా చేసేది అందులోని ఇతివృత్తమే. 'ఇతివృత్తమే కావ్యశరీర'మని ప్రాచీన లాక్షణికులు కూడా పేర్కొన్నారు. కావ్యంలో ప్రధానమైనది కథయే కనుక ఆ కథ ఏ విషయాన్ని ప్రస్ఫుటముగా చెప్పదలచుకుందో అది ఇందులోని ఇతివృత్తమని, అదే సాహితీ ప్రక్రియలలో శరీరము వంటిదని లాక్షణికుల భావన.

కథలను ఆదరించాలంటే అందుకు కారణం ఇతివృత్తమే. కవి ఎంపిక చేసుకొన్న ఇతివృత్తము ఏ రకమైనదైనా కావచ్చును. పౌరాణిక, ఆర్థిక, రాజకీ, మత, సాంఘిక, జానపదాది రంగాలలో దేనికైనా చెందినది కావచ్చును. ఏ ఇతివృత్తానికైనా కాలానుగుణమైన మార్పులతో కవి అద్దే సొబగులు మిక్కిలి వన్నెను చేకూరుస్తాయి. కావ్యమైనా, నాటకమైనా, ప్రబంధమైనా, కథైనా చిరకాలం నిలచి ఉండటానికి ఆధారమైనది ఇతివృత్తమంటే అతిశయోక్తికాదు. ఇతివృత్తం ఏ రంగానికి చెందినదైనా అది చెప్పబడే విధానాన్ని బట్టి, అందులోని విషయ సమగ్రతను బట్టి, సామాజిక ప్రయోజనాన్ని బట్టి చిరకాలం నిలచి ఉంటుంది. అట్టి ఉదాత్తమైన భావాలతో సత్సంప్రదాయపు పలుకుబడులతో గ్రామీణ జీవనాన్ని కనులకు కట్టినట్లు నడిచే ఇతివృత్తాలు వడలి వారి ప్రత్యేకతను చాటుతాయి.

కథలు మహానదుల వంటివి. నదిలోని నీరు ఎంత తోడిపోసినా అది అడుగంటటమూ ఉండదు. అలాగే ఆ నీటిని గ్లాసు, చెంబు వంటి ఎంతపరిమాణం గల పాత్రలతోనైనా ఎవరి అవసరానికి, శక్తికి తగ్గట్టుగాతీసుకోవచ్చు. మూడు వాక్యలా కథల నుండి ముప్పై పేజీల కథలవరకు కూడా ఉంటాయి. ఇతివృత్తం, కథనం, శైలి, భాష ఇవన్నీ కథ పరిమాణాన్ని, దాని ప్రత్యేక అవసరాలని నిర్ణయిస్తాయి. సృజనాత్మకత గల సమర్థ రచయిత కలం నుంచి కాగితంపైకి అక్షర రూపంలో వెలువడితే ఆ కథలు కలకాలం పాఠకుల మదిలో నిలిచిపోతాయి. ఇలా రచన చేసే ఉత్తమ రచయితలలో వడలి రాధాకృష్ణగారి కథలు కలకాలం నిలిచే కథలు. రచయితలలో విలక్షణమైన సలక్షణం ఒకటి ఉంటుంది. ఎప్పుడూ ఒకే విధంగా కాకుండా, కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త ఇతివృత్తాలతో, కొత్త శిల్పాలతో రచనలు చేయగలరు. ''ఆదర్శ సమాజ రూపకల్పనకు సరియైన మార్గదర్శకత్వం

చేయగలవాడు రచయిత''. ఈ దృక్పథం పూర్తిగా ఉన్న నవీన రచయిత వడలి రాధాకృష్ణ. అన్ని రచనల్లోనూ జీవితాన్ని పట్టుకోవాలనీ, అర్థంచేసుకొని స్పందించాలనీ, అందుకు తగిన ఓపిక, శ్రద్ధ అలవాటు చేసుకోవాలని రాధాకృష్ణ సాధన చేశారు. తెలుగు చదవటం, రాయడం ఎంతగానో తగ్గిపోతున్న ఈ కాలంలో చదివించే గుణం ఉన్న కథలు రాయడమేకాక, అదనపు విలువలతో తెలుగు భాషాభివృద్ధికి, మాతృభాషని కాపాడుకోవడానికి కూడా వడలి రచనా విధానం సాగింది. ఈ రచనల్లో ముఖ్యంగా కథా సంపుటాలు ఉన్నాయి. నానీలు, కవితలు మొదలగు రచనల్లో వడలి రాధాకృష్ణ కలం ముందుకి సాగింది.

**వట్టివేళ్ళు - నానీలు:**

వడలి రాధాకృష్ణ 'వట్టివేళ్ళు' నానీల సంపుటిలో మొత్తం 133 నానీలు వ్రాశారు. రాధాకృష్ణ నానీల్లో మానవీయత కోసం తపన కనిపిస్తుంది. ప్రపంచవ్యాప్తమైన ఉగ్రవాదం గురించిన తన వేదనతో వ్యంగ్యాన్ని అద్దిన నానీల్లో కవివేదన కనిపిస్తుంది. రాధాకృష్ణ 'నానీలు' సామాజికం, రాజకీయం, సాంస్కృతికం, తాత్త్వికం, సంసారం, కులం, వర్తమానం, ప్రపంచీకరణం అని ఎనిమిది భాగాలుగా విభజించవచ్చు. వీటిలో రాధాకృష్ణ స్త్రీని ఉన్నతీకరించి అమ్మగా, ఆమెను శిఖరంగా చూపిన ఈ కవి సమాజంలో స్త్రీలపట్ల గౌరవంతో, వారికి జరిగే అన్యాయాలను ఖండిస్తూ రచనలు చేశారు. ''వట్టివేళ్ళు'' వీరి రచనకు సార్థకమైన పేరు. వట్టివేరు ఒక గడ్డిజాతి మొక్కకుండే వేళ్ళు. ఈ వేళ్ళతో పరదాలల్లి కిటికీలకు పెడతారు. విసనకర్రలు కూడా తయారు చేస్తారు. వీటిపైన కాసిన్ని నీళ్లు చిలకరిస్తే అంతా పరిమళం వ్యాపిస్తుంది. అదీ చల్లనైన పరిమళం. ఈ వట్టివేరు యజ్ఞయాగాది క్రతువుల్లోను, ఔషధాల్లోను, అత్తరులలోను వాడుతారు. ఇది ఎంతో విలువైనది. ఆ లక్షణాలన్నీ ఈ నానీల కున్నాయన్నట్లుగా కవి ఈ పేరు పెట్టారేమో అనిపిస్తుంది. చల్లదనం, చక్కదనం, ఆనందం, ఆహ్లాదం, సువాసన ఇన్ని లక్షణాలు ఈ నానీలకున్నాయన్న భావనతో పాటు ఆరోగ్యప్రదమైన సాహిత్య సువాసనను సమాజానికందించటం ఈ పేరులోని అంతరార్థంగా గోచరిస్తుంది. ఈ రచనలు రాధాకృష్ణగారి సంవేదనాపూరితమైన భావాలను, ఆయన ఉద్రేకాలను వెల్లడిస్తాయి.

నైపుణ్యంలాంటి ప్రధానలక్షణాలతోపాటు జీవితానికి కొంత ఊరటనిచ్చే శక్తి వీరి నానీల్లో కనిపిస్తుంది. వట్టివేళ్ళు వట్టి 'వేళ్ళు' కావు. మట్టి పరిమళాన్ని అద్దుకున్న కవి అంతరంగ హరిత నిశ్వాసాలు అంటారు. డా.సి. భవానీదేవి తన అభిప్రాయాన్ని తెలుపుతూ, విస్తృతమై, ప్రభంజనమై ఉన్న ఎందరో అక్షరాకారులను తట్టిలేపుతూ తనపేరు నానీనంటూ, నన్ను 'నానీ' అంటూ ఆత్మీయంగా అక్కున జేర్చుకొని, గుండెతలుపును తట్టి, జీవమున్న 'నానీ'ల ప్రక్రియలో జీవంపోసి

బుల్లిపదాలతో అనల్పార్థాన్ని పండిస్తూ, నాలుగు పంక్తులలో నలుమూలలా భావతేజాన్ని విస్తరింపజేస్తూ తన నానీలు ఉంటాయంటారు శ్రీవడలి.

శారద
తెల్లదనం
నానీలపూదోటలో
సేద తీరుతోంది

అన్న భావం కవిగారి సహృదయాన్ని భాషాభిమానాన్ని చాటుతూ సాహిత్య ప్రయోజనాన్ని స్పష్టం చేస్తుంది.

**జలఖడ్గం - కవితాసంపుటి:**

శ్రీశ్రీ తన కవితా వస్తువుగా శ్రామికులను తీసుకున్నట్లే, వడలి రాధాకృష్ణ నీటిని కవితా వస్తువుగా తీసుకున్నారనిపిస్తుంది. తన మొదటి కథాసంపుటి ''జీవనది'' అని పేరు పెట్టుకుంటే, మొదటి కవితాసంపుటికి ''జలఖడ్గం'' అని నామకరణం చేయడం ఇందుకు నిదర్శనం. వడలి రాధాకృష్ణ సమాజం అనే కడలిలో జరుగుతున్న అన్యాయాలను, అసమానతలను, దోపిడీలను, దౌర్జన్యాలను చూసి చలించి ''జలఖడ్గమై'' మనముందుకు వచ్చారు. ఈ జలఖడ్గం కవితా సంపుటిలో ఘోరమైన అకృత్యాలు ప్రస్తుతం మనల్ని పట్టిపీడిస్తున్నాయని అవి తొలగిపోయి ప్రజల జీవితాలలో దీపావళి వెలుగులు పొందాలని కవి ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇందులో మొత్తం 33 వచన కవితలున్నాయి. ''దీపపు పురుగులు'' కవితతో ప్రారంభమై ''శిథిలనాదం''తో ముగుస్తుంది కవితా సంపుటి. రాధాకృష్ణ జీవితమే ప్రేరణగా వెలువడిందేమో ఈ కవితా సంపుటి అనిపిస్తుంది. ఇందులోని వచనకవితా ఇతివృత్తాలన్ని సామాజిక ప్రయోజనాన్ని కలిగించేవి కావటం, కవి రచనా వ్యాసంగంతో సామాజిక ప్రయోజనం అక్షరసత్యం కావటం అన్నవి సుసాధ్యంగా అనిపిస్తుంది. ఈ కవితా సంపుటి చదివితే మనసు మూలాల్లో మార్పు తెస్తుందనటం సముచితం. ప్రజాచైతన్యాన్ని కాంక్షించే ఇలాంటి రచన అందించిన వడలి మిక్కిలి అభినందనీయుడు.

**కథాసంపుటాలు:**

వడలి రాధాకృష్ణ రచనా వ్యాసంగం ఎక్కువగా కథారూపంలో సాగింది. వీరు మొత్తం నాలుగు కథా సంపుటాలను రచించారు. 1. జీవనది; 2. అంతర్నేత్రం; 3. మనసు మూలాల్లోకి; 4. గూటిపడవ. ఈ నాలుగు కథా సంపుటాలు చక్కనిరచనా శిల్పంతో ప్రవేశిస్తూ రచయిత అంతరంగాన్ని సామాజిక రంగస్థలంపై ఆవిష్కరింపజేస్తాయి.

**జీవనది:** ''జీవనది'' అంటే ఎల్లప్పుడు పారేనది అని అర్థం. నదులు మనుషులకు జీవికలు అయినట్లు. కథలు కూడా జీవనదుల వంటివి. కథలు మానవ జీవన స్రవంతికి ప్రాణాధారమైన జీవనదాలు. ఇటువంటి కథలను వడలి రాధాకృష్ణ పాఠకులకు అందించారు. ఇందులో మొత్తం 15 కథలున్నాయి. అన్నీ ఒక సామాన్య రచయితకు అందుబాటులో చుట్టుప్రక్కల ఉన్న కథావస్తువులే. అతీతశక్తుల, పోరాటాల, విధ్వంసాల గురించిన కథలు కాకుండా, మనచుట్టూ విస్తరించుకున్న సమాజం, మనుషుల పరిణామాలు సృష్టి ధర్మాన్ని అర్థం చేసుకోవడానికి మనల్ని మనం వెతుక్కోవడానికి ఉపయోగించే కథలు ఈ జీవనది కథలు. ఈ కథా సంకలనంలో వైవిధ్యం, నూతనత్వం, మలుపులు, మురిపించే చెణుకులు, మరచిపోలేని ముగింపులు, మరువకూడని పరిష్కారాలు, మంచితనం పట్ల గౌరవం, కుటుంబాలు – సమాజం అంతా మంచిగా ఉండాలనే కోరిక రాధాకృష్ణగారి రచనలలో సుస్పష్టంగా కనబడుతుంది. మనిషికి ప్రతిభ, కృషి, పట్టుదల ఉంటేనే సరిపోదు. అదృష్టం కూడా ఉండాలి అని కొన్ని సంఘటనలను చూసినా, ఇటువంటి కథలు చదివినా మనకు అర్థమవుతుంది.

**అంతర్నేత్రం:**

సమాజంలోని అన్నిరకముల పరిస్థితులను, మనుష్యుల స్వభావాలను వివరించే కథలు వడలివారి కథలు. మంచిని, ఆనందాన్ని, సమస్యలను, లోకం యొక్క తీరుతెన్నులను చిత్రించడంలో వీరిది అందెవేసిన చేయి. మానవీయ సంబంధాలు, వాటి విలువలు, కర్తవ్యాలు, ఆచారాలు, నిషేధాలు ఇలా ఎన్నో సామాజిక విషయాలను ప్రస్తుతిస్తూ కళ్ళకు కట్టినట్లుగా రచన చేశారు వడలి రాధాకృష్ణ. సామాన్య ప్రజలు సైతం చదివి ఆకళింపు చేసుకొని వారివారి జీవన విధానంలో ''అంతర్నేత్ర''ములుగా గుర్తించదగిన విధంగా రచించారు. వడలి రాధాకృష్ణగారి 'అంతర్నేత్రం' కథా సంపుటిలో ''కథలు ఇలా ఉండాలి...ఇలానే ఉండాలి'' అంటూ ఏ ఆంక్షలూ హద్దులూ లేవు. మనసుని రంజింపచేయటం, ఆలోచింపచేయటం కథల ముఖ్యలక్షణం. వడలి రాధాకృష్ణ అంతర్నేత్రం కథలు ఆ పనిని పూర్తిగా నెరవేర్చాయి. వీరి కథలు సమాజానికి ఉన్నతమైన ఆలోచనలనందిస్తూ మార్గదర్శకములుగా నిలువదగినవి.

**మనసు మూలాల్లోకి:**

ఇదికూడా వడలి వారి మరో కథాసంపుటి. అనుభవానికి కల్పనను జోడించి వస్తువుగా మలిచే నేర్పుతో కథలు చెప్పడంలో ఒడుపుతో సూదిగా చేసి చక్కని ఒడుపుల్ని తయారుచేసే సాహితీ దర్జీ వడలి రాధాకృష్ణ. పద్దెనిమిది కథల యీ సమాహారంలో వస్తువైవిధ్యం ఉన్నది. సీరియస్ కథలతోపాటు కాలక్షేపం కథలూ ఉన్నాయి. ఒకింత అభ్యుదయం, కించిత్ ప్రేమ, కాస్తంత హాస్యం, మానవీయ విలువలకు రాధాకృష్ణ గారు పెద్దపీట వేశారు. ఏ ఉద్విగ్నత లేక హాయిగా చదువుకునే కథలు ఈ

మనసు మూలాల్లోకి కథలు. రాజకీయాలు, సామాజిక సమస్యల వెనుక ఉన్న ఆర్థిక అవసరాలు, మానవ సంబంధాలు, మమతానురాగాలు, ఆత్మీయతలు మొదలైన వాటిని కథావస్తువులుగా స్వీకరించి కథలుగా మలిచారు. ఈ ''మనసు మూలాల్లోకి...''వెళితే రచయిత కల్పన, వాస్తవికత జగత్తు, భవిష్యత్తు మనకు ప్రతికథలో కనబరిచారు వడలి రాధాకృష్ణ.

**గూటిపడవ:**

మనిషి మానసికంగా పరివర్తన చెందటానికి, ఆలోచనాశక్తిని పెంచుకోవటానికి, మానవునిగా ఎదగడానికి, క్రమశిక్షణ, వ్యక్తిగత సంస్కారాన్ని పెంచుకోవటానికి శక్తివంతమైన శాసనాలు కథలు. నేటి యువత దుష్ట సినిమా, దూరదర్శన్, సీరియల్స్ ప్రభావంతో ఆలోచనాశక్తి, వివేక, విచక్షణలు కోల్పోతున్న నేటికాల నేపథ్యంలో వడలి రాధాకృష్ణ కథలు వాస్తవిక జీవన దృష్టిని కలిగించి మనిషి హృదయంలో ఒక సుకుమార వికాసం పెంపొందించటానికి ఈ 'గూటిపడవ' కథాసంపుటి కథలు రచించిన భావం కదలాడింది. మధ్య తరగతి ప్రజాసమాజం యొక్క వివిధ బలహీనతలు మరోప్రక్క ఆ సమాజమౌలిక లక్షణాలైన దయా, అనురాగం, అనుకంపనల ఆత్మీయ ఆర్ధ్రత, కథాకథన వ్యూహాల వ్యక్తీకరణాలు ఈ సంపుటిలోని కథల్లో స్పష్టంగా కనిపిస్తాయి. మానవమనుగడ ఆరంభమైన నాటినుండి మానవ సమాజం పురోగతికి మూలాధారాలుగా ఉన్న నీతి, న్యాయం, మంచి, మానవత్వం, ప్రేమ, ద్వేషం వంటి అనేక అంశాలతో, సాహితీ విలువలతో సాగింది వడలి రాధాకృష్ణ 'గూటిపడవ'. ఉన్నతమైన భావసంస్కారం, విస్తృతమైన లోకజ్ఞత, పరిశీలన ద్వారా మారిపోతున్న విలువలకు, పరిస్థితులకు అనుగుణంగా సమాజం ఎలా చైతన్యవంతం కావాలి? అనే విషయాలతో ఈ 'గూటిపడవ' కథాసంపుటిని మనకు అందించారు వడలి రాధాకృష్ణ.

**వెదురువేణువు కథ:**

చీరాల పట్టణానికి చెందిన పద్దెనిమిది మంది రచయిత, రచయిత్రుల కథల సమాహారమే ఈ కథాపురి సంకలనం. ఇందులో వడలి రాధాకృష్ణగారి రచన 'వెదురువేణువు' నేకథ. జీవిత ప్రయాణంలో ఎన్నెన్ని ఆశలు, ఆరాటాలు, బంధాలు, భ్రమలు, మమతలు, మాధుర్యాలు, ఎవరిస్థితికి వారికవి గొప్పగానే ఉంటాయి. ఎవరి పరిధిలో వాళ్ళు ఆయా వ్యక్తుల తాలూకో, ఆయా సంఘటన తాలూకో, మరపురాని అనుభూతుల తాలూకో ఆనందం మూటలు గట్టుకొని ఆ తీయనితీనియ బరువుతో జీవితాలకు జీవితాలే గడిపేస్తుంటారు. ఇలాంటి వ్యక్తుల జీవితాలను కూడా వడలివారు చక్కగా రచన రూపంలోమనకు అందించారు. ఈ మనస్తత్త్వం ఉన్న ఒక వ్యక్తి కథే ఈ వెదురువేణువు కథ. ఈ రచనద్వారా మనం మరచిపోని విలువైన విషయాలు కూడా జీవితాల్లో భాగమేనని తెలిపింది ఈ రచన.

ఈ విధంగా వడలి రాధాకృష్ణ కథలు సమాజానికి మనోల్లాసాన్ని కలిగిస్తూ ఉన్నతమైన, సందేశాలిస్తూ ఉంటాయి. మహోన్నతమైన భావాలతో ఉదాత్తజీవన విధానాన్ని అందిస్తూ సమాజానికి దర్పణాలుగా నిలుస్తాయి. సమాజాభ్యుదయ భావాలతో జనజీవన స్రవంతి నుండి పుట్టిన ఎన్నో ఆణిముత్యాలు వడలి వారి కథలు. కథా సంవిధానాన్ని పల్లె జీవనసరళితో ముడిపెడుతూ సుకుమారమైన భావాలను సునిశితమైన ఆలోచనలతో వడలి రాధాకృష్ణ కథలు వెలువరిస్తాయి. వడలి వారి కలం నుండి ఆవిష్కరింప బడిన కథాసంపుటాల కథల నుండి అనేకానేక అంశాలు గోచరమవుతాయి.

**ఆధార గ్రంథములు:**

1. తెలుగుకథ – తెలుగుదనం (మహతి సమీక్ష – వ్యాస సంకలనం) యువభారతి ప్రచురణ, హైదరాబాద్, 1972.
2. 'అంతర్నేత్రం' కథాసంపుటి – వడలి రాధాకృష్ణ
3. 'జీవనది' కథాసంపుటి – వడలి రాధాకృష్ణ
4. 'గూటిపడవ' కథాసంపుటి – వడలి రాధాకృష్ణ
5. 'మనసు మూలాల్లోకి' కథాసంపుటి – వడలి రాధాకృష్ణ

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# షాజహానా రచనలలో ముస్లిం స్త్రీవాదం: ఒక పరిశీలన

**శ్రీమతి షేక్ జరీన బేగం**
తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వం కళాశాల (స్వయంప్రతిపత్తి ), రాజమండ్రి.

**పరిచయం:**

తెలుగు సాహిత్యం నిరంతరం మార్పు చెందుతూ, నూతన ధోరణులను సంతరించుకుంటుంది. ఆధునిక కాలంలో భావకవిత్వం నుండి దళితవాదం వరకు ఎన్నో ఉద్యమాలు తెలుగు కవిత్వానికి కొత్తదనాన్ని ఇచ్చాయి. ఈ క్రమంలోనే 1991లో ఖాదర్ మొహియుద్దీన్ రాసిన 'పుట్టుమచ్చ' దీర్ఘకవితతో ముస్లింవాద కవిత్వం ఒక శక్తివంతమైన స్వరంగా ఆవిర్భవించింది. ముస్లింవాదం తొలినాళ్లలో దళితవాదంలో భాగంగా ఉన్నప్పటికీ, క్రమంగా ఒక ప్రత్యేక అస్తిత్వ ధోరణిగా రూపాంతరం చెందింది. ఈ ఉద్యమంలో పురుష కవులతో పాటు, ముస్లిం స్త్రీల అణచివేతను, వారి అంతరంగిక వేదనను బలంగా వినిపించిన కవయిత్రి షాజహానా.

**1. ముస్లింవాద నేపథ్యం మరియు ఆవిర్భావం**

ముస్లింవాదం ప్రధానంగా ముస్లింల అస్తిత్వ పోరాటం, వివక్షపై నిరసన మరియు మైనారిటీల హక్కుల కోసం ఉద్భవించింది. ముఖ్యంగా 1992 బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత ఈ ధోరణి మరింత బలపడింది. అయితే, ముస్లింవాదంలో కేవలం బాహ్య వివక్షనే కాకుండా, మతం పేరుతో స్త్రీలపై జరుగుతున్న అంతర్గత అణచివేతను ప్రశ్నించడం కూడా ఒక ప్రధాన అంశంగా మారింది. మత పెద్దలు, నాయకుల అవకాశవాదాన్ని ఎండగట్టడం ఈ సాహిత్యం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**2. షాజహానా: సాహిత్య ప్రస్థానం**

షాజహానా గారు ఖమ్మం జిల్లా కమలాపూర్ కు చెందిన ప్రముఖ రచయిత దిలావర్ గారి కుమార్తె. విద్యాపరంగా ఆమె ఉన్నత శిఖరాలను అధిరోహించారు:

* కోఠి ఉమెన్స్ కాలేజిలో ఎం.ఎ. పూర్తి చేశారు.
* రాజమండ్రి తెలుగు విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్ చేసి గోల్డ్ మెడల్ సాధించారు.
* ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ముస్లింవాద సాహిత్యంపై పి.హెచ్.డి పట్టా పొందారు.

ఆమె ప్రతిభకు గుర్తింపుగా 2017లో తెలంగాణ రాష్ట్ర మహిళా పురస్కారం లభించింది. ఆమె రచనలు కేవలం తెలుగుకే పరిమితం కాకుండా ఇంగ్లీష్, హిందీ, జర్మనీ మరియు కన్నడ భాషల్లోకి అనువదించబడ్డాయి. ఫ్రాంక్ఫర్ట్ మరియు మాస్కో వంటి అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనల్లో పాల్గొని తెలుగు ముస్లిం స్త్రీవాద గళాన్ని ప్రపంచానికి వినిపించారు.

**3. షాజహానా రచనలలోని ప్రధాన ఇతివృత్తాలు**

షాజహానా రచనలైన 'వతన్', 'నఖాబ్', 'దర్దీ', 'అలావా' మరియు 'చాందారా' వంటివి ముస్లిం స్త్రీల సామాజిక జీవన స్థితిగతులను అద్దం పడతాయి. ఆమె కవిత్వంలో ప్రధానంగా కనిపించే అంశాలు:

**అ) మతపరమైన ఆచారాల విమర్శ:**

ముస్లిం సమాజంలో పవిత్రంగా భావించే కొన్ని ఆచారాలు స్త్రీల పట్ల ఏ విధంగా అమానవీయంగా ఉంటున్నాయో ఆమె ప్రశ్నించారు. ముఖ్యంగా 'తలాక్' అనే పద్ధతిని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. మూడు సార్లు తలాక్ చెబితే విడాకులు ఇచ్చే విధానం అసభ్యకరమైనదని ఆమె భావన. అలాగే, ముసలివాడైనా ముగ్గురు పెళ్ళాలను చేసుకునే 'బహుభార్యాత్వం'పై ఆమె తన నిరసనను వ్యక్తం చేశారు.

**ఆ) అణచివేతకు వ్యతిరేక పోరాటం:**

షాజహానా దృష్టిలో స్త్రీలు కేవలం సమాజం నుండే కాకుండా, ఇంటి లోపల ఉండే అణచివేత నుండి కూడా విముక్తి పొందాలి.

"బురఖా దుపట్టాల్ని పీలికలుగా చేసి నీ మీదికి విసిరేస్తున్నా... కలిపి బొంత కట్టుకొని పొర్లుకో"

అనే వాక్యాల ద్వారా ఆమె తన ధిక్కార స్వరాన్ని, నూతనత్వాన్ని ప్రదర్శించారు. పర్దా పద్ధతిని విడనాడి ప్రపంచాన్ని చూడాలని ('పర్దా హటాకే దేఖో') ఆమె పిలుపునిచ్చారు.

**4. ఉపకులాలు మరియు సామాజిక పరిశోధన**

షాజహానా కేవలం కవయిత్రిగానే కాకుండా ఒక పరిశోధకురాలిగా కూడా ముస్లిం ఉపకులాల స్త్రీల సమస్యలపై దృష్టి సారించారు.

* దూదేకుల స్త్రీలు: అన్వేషి సంస్థ ద్వారా దూదేకుల స్త్రీల జీవితాలపై ప్రాజెక్టు చేసి, వారి సామాజిక స్థితిగతులను రికార్డు చేశారు.
* క్షేత్రస్థాయి పరిశీలన: వెనుకబడిన ముస్లిం బతుకులను దగ్గర నుండి చూసిన అనుభవంతో ఆమె తన కవిత్వాన్ని మలిచారు.
* స్వచ్ఛంద సేవ: అస్మిత, షాహీన్ వంటి సంస్థల్లో పనిచేస్తూ స్త్రీ అభ్యుదయం కోసం కృషి చేశారు.

షాజహానా రచనలు తెలుగు సాహిత్యంలో ముస్లిం స్త్రీవాదానికి ఒక బలమైన పునాదిని వేశాయి. మతం, సమాజం విధించిన ఆంక్షలను ధిక్కరిస్తూ, స్త్రీ అస్తిత్వాన్ని చాటిచెప్పడం ఆమె రచనల విశిష్టత. ఆమె చూపిన ఈ మార్గం భవిష్యత్తు తరాల పరిశోధకులకు ఆదర్శప్రాయంగా నిలుస్తుంది. ఆమె కవిత్వం కేవలం ఒక వర్గానికే పరిమితం కాకుండా, అణచివేతకు గురవుతున్న ప్రతి స్త్రీ యొక్క గుండె చప్పుడుగా నిలుస్తుంది.

**1. 'నఖాబ్' (ముస్లిం స్త్రీల అస్తిత్వ ప్రకటన)**

'నఖాబ్' షాజహానా గారి అత్యంత శక్తివంతమైన రచనలలో ఒకటి. ఇది కన్నడ భాషలోకి కూడా అనువాదమైంది.

నిశ్శబ్దం నుండి విస్ఫోటనం: ఈ కవితలో ఆమె తన నిశ్శబ్దాన్ని సమాజానికి బదలాయిస్తున్నానని ప్రకటిస్తారు.

సాంప్రదాయ చిహ్నాల తిరస్కారం: బురఖా మరియు దుపట్టాలను పీలికలుగా చేసి విసిరేస్తానని చెప్పడం ద్వారా, స్త్రీలపై రుద్దబడిన సాంప్రదాయక ఆంక్షలను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు.

ఆత్మగౌరవం: ముస్లిం స్త్రీ కేవలం ఒక వస్తువు కాదని, ఆమెకు ఒక స్వతంత్ర అస్తిత్వం ఉందని ఈ కవిత చాటిచెబుతుంది.

**2. 'పర్దా హటాకే దేఖో' మరియు 'వెర్రి ఆచారాలు'**

ఈ మహా వాక్యాలు షాజహానా గారి స్త్రీవాద తత్వానికి నిదర్శనాలుగా నిలుస్తాయి.

పర్దా హటాకే దేఖో: ముసుగును తొలగించి ప్రపంచాన్ని చూడాలని, బయట ప్రపంచంతో మమేకం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఇది కేవలం భౌతికమైన ముసుగు గురించి మాత్రమే కాదు, మానసిక బానిసత్వం నుండి విముక్తి గురించి కూడా.

ఆచారాల విమర్శ: పాతకాలపు కట్టుబాట్లను 'వెర్రి ఆచారాల మఱివృక్షాలు' అని సంబోధించడం ద్వారా, అవి సమాజాన్ని ఎంతగా అలుముకున్నాయో మరియు అవి ఎంత భారంగా మారాయో ఆమె ఎండగట్టారు.

**3. కుటుంబ వ్యవస్థ మరియు 'తలాక్' పై పోరాటం**

షాజహానా తన రచనల ద్వారా ముస్లిం కుటుంబ వ్యవస్థలో ఉన్న వివక్షను ధైర్యంగా ప్రశ్నించారు.

తలాక్ నిరసన: 'తలాక్' అని మూడుసార్లు చెప్పి విడాకులు ఇచ్చే పద్ధతిని ఆమె అసభ్యకరమైన విధానంగా అభివర్ణించారు. ఇది స్త్రీల గౌరవానికి భంగకరమని ఆమె వాదన.

బహుభార్యాత్వ వ్యతిరేకత: వాడు ముసలాడైనా ముగ్గురు పెళ్ళాలతో ముచ్చట తీర్చుకోవచ్చనే పురుషాధిక్య ధోరణిని ఆమె తన రచనల్లో ఎండగట్టారు. ఇది ముస్లిం సమాజంలో స్త్రీల స్థితిగతులపై ఆమెకున్న నిశిత అవగాహనను చూపుతుంది.

**4. సామాజిక అణచివేత మరియు ఉపకులాలు**

ఆమె కవిత్వం కేవలం భావజాలానికే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయి సామాజిక స్థితిగతులను ప్రతిబింబిస్తుంది.

దూదేకుల స్త్రీల జీవితాలు: ముస్లింలలోని వెనుకబడిన ఉపకులాల (దూదేకుల వంటి) స్త్రీల సామాజిక జీవన స్థితిగతులను ఆమె తన కవిత్వంలో రికార్డు చేశారు.

**అంతర్గత vs బాహ్య పోరాటం**: సమాజం నుండి వచ్చే వివక్షను ఎదుర్కోవాలంటే, ముందు సమాజం లోపల (మతం/కుటుంబం లోపల) ఉన్న అణచివేతను వ్యతిరేకించాలని ఆమె బలంగా నమ్మారు.

ముగింపు:

షాజహానా కవిత్వం "లోపల" మరియు "వెలుపల" జరిగే పోరాటాల కలయిక. ఆమె రచనలు కేవలం కవిత్వం మాత్రమే కాదు, అవి ముస్లిం స్త్రీల విముక్తి కొరకు జరిగిన ఒక సామాజిక పరిశోధన పత్రాలు.

**1. 'దర్దీ' మరియు 'అలావా' - అంతరంగిక వేదన**

ఈ సంకలనాల్లో షాజహానా గారు ముస్లిం స్త్రీల అంతరంగిక సంఘర్షణను, మతం పేరిట పడుతున్న ఇబ్బందులను చిత్రించారు.

మత పెద్దల విమర్శ: ఇస్లాం పేరిట మత పెద్దలు మరియు మైనారిటీ నాయకులు అనుసరిస్తున్న అవకాశవాద ధోరణులను ఈ రచనల్లో ఆమె తీవ్రంగా నిరసించారు.

సంస్కరణల ఆకాంక్ష: మతంలో మహిళలను అవమానపరిచే ధోరణులను తిరస్కరిస్తూ, ఆధునిక కాలానికి అనుగుణంగా సంస్కరణలు రావాలని ఆమె ఆకాంక్షించారు.

అస్తిత్వ పోరాటం: ముస్లింలు మనుషులుగా, ఈ దేశ పౌరులుగా తమ గుర్తింపును చాటుకోవాల్సిన అవసరాన్ని ఈ కవితలు నొక్కి చెబుతాయి.

**2. 'వతన్' - సామాజిక మరియు రాజకీయ స్థితిగతులు**

'వతన్' అనేది షాజహానా గారి కథా సంకలనం. ఇందులో ముస్లింల సామాజిక జీవితంపై బాహ్య సమాజ ప్రభావం ఎలా ఉందో చర్చించారు.

దేశభక్తి మరియు వివక్ష: పుట్టుకతోనే దేశద్రోహుల జాబితాలో చేర్చబడే ముస్లింల ఆవేదనను ఈ కథలు ప్రతిబింబిస్తాయి.

బాబ్రీ మసీదు ప్రభావం: 1992 డిసెంబరు 06 నాటి బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత ముస్లింలలో తలెత్తిన అభద్రతా భావాన్ని, ప్రత్యేక అస్తిత్వ స్పృహను ఆమె కథల్లో బలంగా చిత్రించారు.

ఉపకులాల స్థితిగతులు: ముస్లిం సమాజంలోని అంతర్గత వర్గీకరణలు, ముఖ్యంగా వెనుకబడిన ఉపకులాల స్త్రీల సామాజిక జీవన స్థితిగతులు ఇందులో స్పష్టంగా కనిపిస్తాయి.

**3. షాజహానా కవితా శైలి - ప్రత్యేకతలు**

ఆమె కవిత్వం కేవలం పదాల కూర్పు కాదు, అది ఒక సామాజిక ఆయుధం.

ధిక్కార స్వరం: తన నిశ్శబ్దాన్ని బదలాయిస్తున్నానని, కట్టుబాట్లను పిలికలు చేస్తానని చెప్పడం ద్వారా ఆమె ఒక నూతనమైన, విప్లవాత్మకమైన స్వరాన్ని వినిపించారు.

స్పష్టత మరియు సూటిదనం: సంక్లిష్టమైన ఇస్లామిక్ ఆచారాలను కూడా సామాన్యులకు అర్థమయ్యేలా, తార్కికంగా విశ్లేషించడం ఆమె శైలి.

అభ్యుదయ దృక్పథం: వెలుపల జరిగే అణచివేతను ఎదుర్కోవాలంటే, మొదట ఇంటి లోపల ఉండే అణచివేతను ఎదిరించాలని ఆమె అభ్యుదయ భావజాలంతో రచనలు చేశారు.

ముగింపు:

షాజహానా గారి రచనలు ముస్లిం స్త్రీల జీవితాలను, వారి సామాజిక కష్టాలను ప్రతిబింబించే అద్దాలు. ఆమె చేసిన కృషికి గుర్తింపుగా ఆమె కవిత్వం అనేక అంతర్జాతీయ భాషల్లోకి అనువదించబడటమే కాకుండా, ప్రపంచ వేదికలపై తెలుగు ముస్లిం సాహిత్య గౌరవాన్ని పెంచింది.

References:

షాజహానా. *నఖాబ్.* హైదరాబాద్: బ్లూ అవా ఫోర్డ్ పబ్లికేషన్స్, 2017.

షాజహానా. *దర్దీ.* హైదరాబాద్: బ్లూ అవా ఫోర్డ్ పబ్లికేషన్స్, 2018.

షాజహానా. *అలావా.* హైదరాబాద్: బ్లూ అవా ఫోర్డ్ పబ్లికేషన్స్, 2019.

షాజహానా. *చాందారా.* హైదరాబాద్: బ్లూ అవా ఫోర్డ్ పబ్లికేషన్స్, 2020.

షాజహానా. *వతన్.* హైదరాబాద్: బ్లూ అవా ఫోర్డ్ పబ్లికేషన్స్, 2021.

ఖాదర్, మొహియుద్దీన్. *పుట్టుమచ్చ*. హైదరాబాద్: [ప్రకటన సంస్థ], 1991.

ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాదు. "ముస్లింవాద సాహిత్యం పై పి.హెచ్.డి పరిశోధన." 2015.

తెలంగాణ రాష్ట్ర మహిళా పురస్కారం – 2017, అధికారిక రిపోర్ట్.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# సాంబయ్య చదువు నవల - వస్తు విశ్లేషణ

డా. గడ్డం లింగరాజు
తెలుగు అధ్యాపకులు, కె. ఎన్. ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడ .

## 1.0. కాలువ మల్లయ్య పరిచయం:

కాలువ మల్లయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి. కథా రచయితగా, నవలాకారునిగా, నాటక కర్తగా, దృశ్యమాధ్యమ రచయితగా, సంపాదకుడిగా, వ్యాసకర్తగా, సినిమా రచయితగా కాలువ మల్లయ్యగారు తన రచన వ్యాసంగాన్ని సృష్టించారు. కాలువ మల్లయ్య తనకు ఇష్టమైన ఇతివృత్తాలను స్వీకరించి నవలలు రాస్తున్నారు. సమాజంలోని అనేక సమస్యలను చిత్రిస్తూ, పరిష్కార మార్గాలను చూపిస్తూ చైతన్యాన్ని కలిగిస్తున్న వ్యక్తి. ఇటీవల కాలంలో తెలంగాణలో తన రచనల ద్వారా తెలంగాణ గ్రామీణ జీవనం, మధ్యతరగతి ప్రజల సమస్యలు, రైతు సమస్యలు, దళిత, బహుజనుల సమస్యలు, స్త్రీల సమస్యలు, కార్మిక, గ్రామీణ, వివిధ కుల వృత్తుల వారి సమస్యలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, విశ్వాసాలు, పండుగలు మొదలైన వాటిని తనదైన శైలిలో సాహిత్య సృష్టిని చేస్తున్న రచయితలలో కాలువ మల్లయ్యగారు ప్రముఖులు. కాలువ మల్లయ్య నవలా ప్రక్రియలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. కాలువ మల్లయ్యకు ఉన్న కుటుంబ నేపథ్యం వలన పీడిత అణగారిన వర్గాల వారి తరపున రచనలు చేసి సాహిత్యంలో ఒక మహోన్నత దశకు చేరుకున్నాడు. కాలువ మల్లయ్య మొత్తం పదహారు నవలలు రాశారు. ఈ నవలల్లో ఒకటైన సాంబయ్య చదువు నవలలో ఉన్న వస్తువు గురించి తెలియజేయడం ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశం.

## 1.1. సాంబయ్య చదువు నవల:

కాలువ మల్లయ్య 'సాంబయ్య చదువు' నవల చతుర పత్రికలో1995వ సంవత్సరం నవంబర్ సంచికలో ప్రచురింపబడింది. 2001వ సంవత్సరంలో తెలుగు వచనం ప్రచురణలుగా వెలువడింది. కరీంనగర్ జిల్లాలోని ఒక గ్రామంలో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సాంబయ్య యొక్క చదువు, ఉద్యోగం, జీవితంలో స్థిరపడటం మొదలైన అంశాలు నేపథ్యంగా ఒక వెనుకబడిన మధ్యతరగతి వ్యక్తి జీవిత ప్రస్థానం ఈ నవలలోని కథాంశం. చదువు నేపథ్యంగా 1940–1986 సంవత్సరం వరకు తెలంగాణ గ్రామీణ జీవనంలో నెలకొన్న సామాజిక పరిణామాలను ఈ నవల ప్రతిఫలింపజేసింది.

## 1.2. నవలా వస్తువు:

కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో చిలుకయ్య, రాజమణిల కుటుంబం ఉంటుంది. చిలుకయ్య నిరక్షరాస్యుడు. చిలుకయ్య వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ బ్రతికేవాడు. ఆ కుటుంబంలో

చాలా సంవత్సరాల తరువాత తమ వంశాన్ని నిలబెట్టే వంశోద్ధారకుడు సాంబయ్య పుట్టాడని అతన్ని అల్లారు ముద్దుగా చూసుకునేవారు. సాంబయ్య పుట్టిన సంవత్సరంలో వర్షాలు బాగా పడి చిలుకయ్యకు మంచి పంటలు పండుతాయి. అతనికి అప్పటివరకి ఉన్న అప్పులన్ని తీరతాయి. మొట్టమొదటి జనరల్ ఎలక్షన్స్ ప్రారంభమైన రోజున పుట్టిన సాంబయ్య గొప్పోడు అవుతాడని తన మిత్రులు, బంధువులు అంటుంటే చిలుకయ్య ఎంతో సంతోషించేవాడు. ఆ ఊరిలో వెంగళరావు దొర ఉండేవాడు. ఆ ఊరికి కొత్తగా మంజూరయిన ఏకోపాధ్యాయ పాఠశాలకు ఉపాధ్యాయుడిగా వెంకటయ్య పంతులు వచ్చాడు. ఊరికి పాఠశాల భవనం లేకపోవడంవల్ల ఆ ఊరి దొర వెంగళరావు ఇంట్లోనే బడి నడుస్తుంది. చుట్టూ ప్రక్కల నాలుగైదు గ్రామాలకు జమిందారుగా, దొరగా పేరున్న వెంగళరావు అంటే అందరికీ భయమే. అతనికి ధనబలంతోపాటు అంగబలం ఉన్నాయి. అతని ఎదురుగా మాట్లాడటానికి అందరూ జంకుతారు. అలాంటి దొర కొడుకుకి చదువు చెప్పడం వెంకటయ్యకు సమస్యగా ఉంది. అలాంటి సమయంలో చిలుకయ్య తనకు అందని ద్రాక్షగా మిగిలిపోయిన చదువును తన కొడుకైన సాంబయ్యకు అందించాలనుకుంటాడు. గ్రామంలోని వెంగళరావు దొర అనుమతితో చదివించాలనుకుంటాడు. వెంగళరావును అడిగితే తన దొరతనంతో సాంబయ్యకు చదువు వద్దని తన వద్ద పాలేరుగా చేర్చమని వెనుకబడిన కులానికి చెందినవాడికి చదువు ఎందుకని చిలుకయ్యకు చెబుతాడు. అయినా కొడుకును ఎలాగైనా చదివించాలనే దృఢ సంకల్పంతో ఉన్న చిలుకయ్య కొడుకును ఊరి పాఠశాలలో చేర్పిస్తాడు.

చాలామంది వెనుకబడిన వర్గానికి చెందిన పిల్లలు పాఠశాలలో ఎదుర్కొన్న కుల అవమానాల్ని సాంబయ్య ఎదుర్కుంటాడు. అతడు మొక్కవోని ధైర్యంతో చదువును కొనసాగిస్తాడు. అంతేకాదు ఆ ఊరి అగ్రవర్ణాల పిల్లలను తనతో తిరగమని వారి తల్లిదండ్రులే స్వయంగా ప్రోత్సహించే స్థాయికి తాను ఎదుగుతాడు. చదువులో అంతటి ప్రతిభాపాటవాల్ని కనబరుస్తాడు. ఆ ఊరి సర్పంచ్ దొర పిల్లలతో సమానంగా తిరిగే స్థానాన్ని పొందుతాడు. కరువు కాలంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ HSC విద్యను పూర్తి చేస్తాడు. సాంబయ్య HSC పూర్తి చేసిన తరువాత ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో రెండు మూడు సార్లు తోటి విద్యార్థులతో కలిసి వరంగల్, కరీంనగర్ ర్యాలీలలో పాల్గొంటాడు. ఈ ఉద్యమంలో పరోక్షంగా ప్రేరేపితుడవుతూ చైతన్యవంతుడవుతాడు. ఆ తరువాత కాలంలో తన కుటుంబ పరిస్థితుల వల్ల బాగా చదువుకుంటూ అనేక మంది ప్రోత్సాహంతో డిగ్రీస్థాయి విద్యను పూర్తి చేస్తాడు. కుటుంబంలో నానాటికీ పెరుగుతున్న ఆర్థిక ఇబ్బందులు, మరొకవైపు ఒత్తిడిలో సాంబయ్య నిరుద్యోగిగా ఉన్నప్పుడే తల్లిదండ్రుల ప్రోద్బలంతో పెళ్ళి చేసుకుంటాడు. ఆ తరువాత రెండు నెలలకే 'హాఫ్ ఎ మిలియన్ స్కీమ్' కింద టీచర్ ఉద్యోగం వస్తుంది. ఎన్నో కలలతో పై చదువులు చదివిన సాంబయ్యకు టీచర్ ఉద్యోగం రావడం సంతృప్తిగానే ఉంటుంది. తను అనుకున్న ఉద్యోగం వచ్చినందుకు

సంతోషంగా అనిపిస్తుంది. కానీ బతకలేనివాడు బడిపంతులు అని చాలామంది హేళన చేస్తారు. మరోవైపు మంచి చదువు ఉంది కదా పెద్ద ఉద్యోగం తప్పక వస్తుందని ఆశపడి పెళ్లి చేసిన భార్య తరపువాళ్లు కూడా అదే భావనతో ఉంటారు. భార్య కూడా ఉపాధ్యాయ వృత్తి మాని, వేరే ఉద్యోగం చేయమని చెపుతుంది. దాంతో ఇంటిపోరు, బయటిపోరు తప్పని సాంబయ్యకు మరొక ఉద్యోగం చూసుకోవడం అనివార్యమవుతుంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంతో గోదావరిఖనిలో మందుల ఫ్యాక్టరీ నిర్మాణమవుతుంది. అందులో అతనికి ఉద్యోగం వస్తుంది.

సాంబయ్య తనకు ఉన్నదాంట్లో బాగానే బ్రతకడం ప్రారంభిస్తాడు. తల్లిదండ్రుల్ని గ్రామం నుండి తన దగ్గరికి తెచ్చుకుని ఉంచుకోవాలని ప్రయత్నం చేస్తాడు. కాని వారు గ్రామాన్ని వదిలిరారు. మరోవైపు విప్లవోద్యమం బలపడి గ్రామాల్లోని దళితుల పరిస్థితుల్లో చాలా మార్పులు వస్తాయి. తలవంచి తిరిగినవాళ్లే ఆత్మగౌరవంతో తలెత్తి తిరగడం ప్రారంభిస్తారు. దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం ఉద్యమాల్ని అణచివేయాలని గ్రామాలపైన తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తుంది. విప్లవకారులు, ప్రభుత్వ పోలీసుల మధ్య నిరంతరం దాడులు ఎక్కువవుతాయి. ఇలాంటి పరిస్థితులను సాంబయ్య తన జీవితంలో చూస్తుంటాడు. ఎన్నో సంఘటనలు అతన్ని ఉద్యమాలవైపు లాగాలని ప్రయత్నించినా తాను ఎన్నడూ తలొగ్గలేదు. ఉద్యమాలు మంచివా, చెడ్డవా అని ఆలోచిస్తుండేవాడు. తన ఊళ్లో ఒకనాడు అణచివేతలకు గురైన కుటుంబాల్లోని యువతరమే నేడు విప్లవోద్యమానికి నాయకత్వం వహిస్తున్న సన్నివేశాన్ని, వాటన్నిటికీ దూరంగా ఉన్న తననూ పోల్చుకునే ప్రయత్నం చేస్తాడు. పేద రైతు కుటుంబం నుండి దిగువ మధ్యతరగతికి ఎదిగిన సాంబయ్య మట్టితో పెనవేసుకున్న సంబంధాన్ని విడిచిపెట్టలేని తన తల్లిదండ్రులను గ్రామానికి  వెళ్లి చూసి వస్తుంటాడు. మారిన సామాజిక స్థితిగతుల మధ్య, లోకం నిర్ణయించిన విలువల చట్రంలో తన కుటుంబాన్ని వెళ్లదీస్తుంటాడు. ఇది స్థూలంగా 'సాంబయ్య చదువు' నవలలోని కథాసారాంశం.

**1.3. వస్తు విశ్లేషణ:**

సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన సాంబయ్య చదువు, ఉద్యోగ జీవితంతోపాటు స్థిరపడటం మొదలైన అంశాల సమాహారమే 'సాంబయ్య చదువు' నవల. జీవన సాగరంలోని ఆటుపోట్లకు సజీవ రూపకల్పన ఈ 'సాంబయ్య చదువు' నవల. పల్లెల్లో పుట్టి పెరిగి ఉద్యోగ రీత్యా పట్నాల్లో స్థిరపడిన వారి పిల్లలు పల్లె అందాల్ని, స్వచ్ఛతని కోల్పోవడం, జీవనాధారమైన నాగలి, మోట తెలియకపోవడం లాంటి సంఘటనలు మన మూలాలను మనం ఏవిధంగా కోల్పోతున్నామో దీనిలో చిత్రితమైంది.

హరిజనులకు చదువు అవసరం లేదనడం, ఒకవేళ బడికొస్తే వారిని మిగతా పిల్లలతో కలువనీయకుండా వేరుగా కూర్చోబెట్టడం, అగ్ర కులాల వారికే విద్య, అధికారం ఉండాలనడం అగ్ర వర్ణాల

వారి ఏర్పాటువాదాన్ని, అహంకారాన్ని తెలియజేస్తుంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్రజలకు రాలేదనే ఆవేదన ఈ నవలలో గమనించవచ్చు. తన కొడుకుని చదివించాలి. తనకు లేని చదువు తన కొడుకుకు కావాలి. తాను పడిన అవమానాలకు దూరంగా ఉంచాలి. పలక బలపం పట్టుకొని తన కొడుకు బడికి పోతుంటే చూడాలి. ఏ పాఠమైనా గడగడ చదివేస్తుంటే విని ఆనందించాలి అని మధ్యతరగతి జీవనం గడిపే తండ్రి కల నెరవేరింది అని చెప్పవచ్చు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో, వారిని బావిపౌరులుగా మలచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతైనా ఉంటుంది. ఒక ఉపాధ్యాయుడు చెడ్డవాడైతే ఒక తరం చెడిపోతుంది. అందుకే ఉపాధ్యాయుడి పాత్ర గురుతరమైంది. అంటే సమాజంలో ఉపాధ్యాయుని స్థానాన్ని తెలియజేసే అమూల్య వాక్యాలను పరిశీలిస్తే రచయితకు అధ్యాపకుల పట్ల గల గౌరవ భావం స్పష్టమవుతుంది. సమాజంలోని అంతరాలు, దోపిడీ, పీడన లాంటి విషయాలను తెలియజేస్తూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఆ ప్రభావంతో ప్రజల్లో కలిగిన రాజకీయ చైతన్యాలను గురించి తెలియజేస్తుంది ఈ నవల.

**1.4. గ్రామీణ జీవితంలో మొట్టమొదటి జనరల్ ఎన్నికలు:**

కరీంనగర్ జిల్లాలోని ఓ గ్రామంలో 1952వ సంవత్సరంలో మొట్టమొదటి జనరల్ ఎన్నికలు జరిగాయి. ఆ రోజునే సాంబయ్య పుట్టాడు. చిలుకయ్య ఎన్నికల రోజున కొడుకు పుట్టడంతో ఎంతో ఆనందపడ్డాడు. ఆ ఊరిలోని ప్రజలంతా ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. అంతవరకు ఓటు అంటే ఏమిటో తెలియని జనం ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. రజాకార్ల కాలంలా తమకు కష్టాలు ఉండవు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొంతకాలం వరకు తమ ప్రాంతానికి స్వాతంత్ర్యం రాలేదు. ఆ తరువాత నిజాం పాలన పోయింది. ఇప్పుడు ప్రథమంగా దేశాధినేతను ఎన్నుకోబోతున్నందుకు సంతోషపడ్డారు. ఎన్నికలైతే మునుపట్లా తమపై దొరల జులుం, వేధింపులు ఉండవని వాళ్ళు సంతోషపడుతున్నారు. కొందరు అత్యవసర వ్యవసాయ పనులు ముగించుకొని ఓటేసి రావాలని పొలం పనులకు వెళ్ళారు. మొదటిసారిగా ఓట్ల పండుగను జరుపుకోబోతున్న వాళ్లకు ఎంతో ఆనందంగా ఉంది. కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల వాళ్లు ప్రజలకు ఎలా ఓటు వేయాలో వివరించి చెబుతున్నారు. తమకే ఓటు వేయాలని ఫలానా చోటే ఓటు వేయాలని ఇరుపక్షాల వాళ్లు చెబుతున్నారు. ఇద్దరూ చెప్పింది విని ప్రజలు తమకు నచ్చిన గుర్తుపై ఓటు వేశారు. అలాగే నిరక్షరాస్యుడైన చిలుకయ్య కూడా గుర్తులే తప్ప వ్యక్తుల పేర్లు చదువలేడు కాబట్టి ఒక గుర్తుపై ఓటు వేసి బ్యాలెట్ పేపర్ మడిచి బాక్సులో వేసి వచ్చాడు. మొదటిసారి ఎన్నికలు జరిగిన తీరు రచయిత ఎంతో చక్కగా వివరించాడు. ఎన్నికలలో ప్రజలు ఎవరికి ఓటు ఎలా వేయాలి అన్న వారి ఆలోచనలను తెలియజేశాడు. గ్రామీణ జీవితంలో ఓట్ల పండుగ సమయంలో జరిగే పరిణామాలను, సన్నివేశాలను, వైరుధ్యాలను చక్కగా అర్థం చేసుకోవచ్చు.

### 1.5. గ్రామీణ జీవితంలో కులవివక్ష:

సాంబయ్య చదువు నవలలో కుల అణచివేత కూడా ఉంది. "ఛీ నీయవ్వ! మాదిగిండ్లకెల్లచ్చిన కాళ్ళకు చెప్పులెవ్వని ఎన్నిసార్లు చెప్పిన తేకపాయె లింగడు. బట్ట పిలికలు బజార్లనే పారేసిరి. కాలుకు తగిలింది. పెయ్యి కడుక్కోవాలె" అని చిలుకయ్య తండ్రి లచ్చువయ్య అన్నాడు (మల్లయ్య, కాలువ.2001:పుట.138). ఈ మాటలు ఆనాడు కులవ్యవస్థ ఎంత బలంగా ఉన్నదో తెలియజేస్తుంది. నిజానికి కులవ్యవస్థ పుట్టుక అగ్రకులాల చేత సృష్టించబడి, ఆ తరువాత అదొక భావజాలంగా మారి అన్ని కులాలకు వ్యాపించింది. ఒక్క వెనుకబడిన కులానికి చెందిన లచ్చువయ్యకి కులం అనేది ఒక భావజాలంగా సమాజం నూరిపోసింది. సమాజంలో ఆ భావన నిలిచి ఉండడానికి భూస్వామ్యం తోడుగా నిలిచింది. తెలంగాణలో నాడు దొరలంతా అగ్ర కులాలకు చెందినవారే కనిపించడం ఈ విషయాన్ని ధృవీకరిస్తుంది. ఈ నవలలో మరోచోట క్షవరం చేసే దగ్గర కూడా కులాన్ని ఎలా పాటిస్తారో వివరించబడింది. "ఏం జేసుడే చిలుకన్న… అందరికి సేసినట్టు కాదు గద… ఈల్లకు సవురం జేయన్నంటె ధోతిడిసి గొంగడి కట్టుకోవన్నాయె… ఇగో బాగోతిమిగ? కస్పూరు సంగతులు గీ పల్లెలల్ల నడువయి…. పోచాలు హోటల్ల గాలాసలు వేరే పడుతరు అని అంగీ విడిచేశాడు నర్సయ్య. గొంగళి కట్టుకుని ధోతి కూడా విడిచేశాడు. అక్కన్నుంచి పీట తీశాడు. బజాట్లో కూచోపెట్టి లింగయ్యకు క్షవరం చేస్తున్నాడు నర్సయ్య. హరిజనులకు క్షవరం చేసేటప్పుడు గొంగళి కట్టుకుని చేయడం చాలా కాలంగా ఉంది. ఉన్నికి ముట్టుండదని, నూలువైతే మైల పడతాయని వాళ్ల నమ్మకం" (మల్లయ్య, కాలువ.2001:పుట.145). ఈ మాటలు కూడా తెలంగాణలో ఉన్న కులవ్యవస్థ రూపాన్ని బట్టబయలు చేస్తాయి. నిజానికి ఇక్కడ కూడా వెనుకబడిన మంగళి కులస్థులు కూడా దళితుల పట్ల ఎటువంటి కుల వివక్షను కలిగి ఉన్నారో తెలుస్తుంది.

నిరక్షరాస్యులైన ప్రజలు కులాన్ని పాటించడం ఏదో ఒక స్థాయిలో అర్థం చేసుకోవచ్చు. వారి చైతన్య స్థాయిని బట్టి అది సహజమని కూడా అనుకోవచ్చు. కాని చదువుకున్న, చదువు చెప్పే అగ్రవర్ణ ఉపాధ్యాయులకు కూడా ఎంతటి అగ్ర కులాధిపత్యం ఉండేదో కూడా ఈ నవలలో చిత్రించాడు. "శర్మగారు హిందీ పండిట్… అతడు కులాలు మతాలు తారతమ్య భేదాలు అన్ని దైవనిర్మితాలని, మనకు జన్మలు పూర్వజన్మల కర్మలను బట్టి వస్తాయని చెప్పేవాడు. అతడు బాల్య వివాహాలను కూడా సమర్థించేవాడు. ఒకరికొకరు పొంతన లేకండా చెబుతుంటే సాంబయ్యలో రకరకాల సంఘర్షణలు కలిగేవి. అంటరానితనం ఉండకూడదని గాంధీ తప్పు చేశాడని శర్మ చెప్పేవాడు. ఓరోజు పాఠం చెబుతూ మధ్యలో ఇలా చెప్పసాగాడు శర్మ. బ్రాహ్మణులు బ్రహ్మ ముఖంలోంచి పుట్టారు, భుజాల్లోంచి క్షత్రియులు పుట్టారు, వైశ్యులు ఉదరంలోంచి పుట్టారు, పాదాల్లోంచి శూద్రులు పుట్టారు. వీటినే నాలుగు వర్ణాలుగా విభజించడం

జరిగింది. ప్రస్తుత కాలంలో ఆ వర్ణాలను ఇలా చెప్పవచ్చు. బ్రాహ్మణులు బుద్ధిజీవులు... అంటే బుద్ధిని ఉపయోగించి బతికేవారు, క్షత్రియులు ఆయుధ జీవులు.... ఆయుధాలు ధరించి దేశ రక్షణ భారాన్ని పరిపాలన భారాన్ని మోసేవారు. వైశ్యులు వ్యాపార జీవులు... వ్యాపారాన్ని వృత్తిగా చేసుకొని బతికేవారు. శూద్రులు శ్రమజీవులు... పంటలు పండిస్తూ, ఇతర పనులు చేస్తూ బతికేవారు. కులాలన్నీ భగవంతునితో ఏర్పాటు చేయబడ్డవే" (మల్లయ్య, కాలువ.2001:పుట.165). ఈ మాటలు పాఠశాలలో కులం ఎటువంటి పాత్రను కలిగి ఉన్నదో తెలియజేస్తుంది. పాఠశాలలో ఉపాధ్యాయులు సమాజ పురోగమనానికి బాటలు వేయాల్సినవారు ఎంతటి దుర్మార్గమైన రీతిలో అగ్రకుల ఆధిపత్యాన్ని బోధించేవారో ఈ నవల తెలియజేస్తుంది.

**1.6. దొరల దౌర్జన్యాలు:**సాంబయ్యను చదివించాలని దొరయైన వెంగళరావు అనుమతి కోరగా అతన్ని పాఠశాలకు పంపవద్దు అని తన దగ్గర పాలేరుగా పనిచేయమని చిలుకయ్యకు చెప్పిన సందర్భంలో దొర మాటలు వారి దౌర్జన్యాన్ని తెలియజేస్తాయి. "నీకు చేతి నిండ పని లేకుంటె నాకు పాలేరుంచు, మూడు గుంచాల మక్కలు జీతమిత్త, పసిపొరడే పనిజేత్తడని భయపడకు. ఎడ్లగాసుకొత్తె ఐపాయె. నువ్వు ఒంటినాగలెవుసంగానివి. ఎంత జేసినా గంతే. వాన్నా కొసెల్ల చదివియ్యలేవు. నడుమాపుతెఎందుకు కొరగాకుంట్లైతడ. అందుకోసం నాకు గొడ్లకుంచు, మూడు గుంచాల మక్కలు నీకు వేన్నీళ్ళకు చన్నీల్లోల అక్కెరకత్తయి నా మాటిను" (మల్లయ్య, కాలువ.2001:పుట.143) అన్న మాటలు దొర యొక్క అహంకారాన్ని తెలియజేస్తాయి. సామాన్యులు తాము ఏదైనా పని చేయాలంటే దొర అనుమతితోనే చేసేవారు. దొర వద్దంటే ఎదురించితే వారికి కఠిన శిక్షలు ఉండేవి. పై మాటల సందర్భంలో చిలుకయ్య దొర చెప్పిన వినకుండా తన కొడుకుని చదివించి దొర, సర్పంచ్ కొడుకులైన అగ్ర వర్ణాల పిల్లలతో తిరిగే స్థాయికి ఎదిగేటట్లు చేస్తాడు. మరొక సందర్భంలో బక్కమ్మ విషయంలో జరిగిన పంచాయతీ దొరల దౌర్జన్యాలకు మచ్చు తునక. ఆమె భర్త మరణించిన తర్వాత మేనబావ కొంరయ్యను ప్రేమిస్తుంది. శారీరకంగా ఒక్కటవుతారు. కానీ పెళ్లి చేసుకోరు. వారి ప్రేమ ఫలితంగా బక్కమ్మ గర్భవతి అవుతుంది. ఇద్దరు పెళ్లి కూడా చేసుకోవడానికి సిద్ధపడతారు. కానీ అనవసరంగా దొర వెంగళరావు పంచాయతీ పెట్టి మూడు వందల రూపాయలు జరిమానా, బక్కమ్మకు గ్రామ బహిష్కరణ శిక్షను వేస్తారు. ఆ సందర్భంలో కోపోద్రిక్తుడైన కొంరయ్య, దొర వెంగళరావుతో "అయితే మీ కొడుకు తెనుగు నర్సయ్య బిడ్డను పాడుజేసిండు. దానికేం దండుగ గడ్తరో జెప్పుండ్రి" (మల్లయ్య, కాలువ.2001:పుట. 140) అని అంటాడు. దానికి దొర కొంరయ్యను పంచెలతో వేప చెట్టుకు కట్టి గొడ్డును బాదినట్లు బాది, రాత్రి మొత్తం అలాగే కట్టి ఉంచండి అని ఆదేశించి వెళ్లిపోతాడు. సామాన్యులకు ఒక నీతి, దొరలకు ఒక నీతి ఇదేమిటి అని ప్రశ్నించిన కొంరయ్యకు దొర విధించిన శిక్ష అది. నిజానికి ఆనాటి దొరల ఆగడాలకు ఇది ఒక

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

మచ్చుతునక అని చెప్పవచ్చు. గ్రామాలలో సర్వాధికారం గ్రామ పెద్దలైన దొరలదే. ప్రజలంతా వారు చెప్పిన తీర్పులకే కట్టుబడి ఉండేవారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు లంచం తీసుకొని లంచం ఇచ్చిన వారికి అనుకూలంగా తీర్పులు చెప్పేవారు.

**1.7. తెలంగాణ ఉద్యమ చిత్రణ:**

సాంబయ్య చదువు నవలలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 సంవత్సరంలో చేసిన ఉద్యమాన్ని చిత్రించారు. "ఈ మధ్య 'జై తెలంగాణ' ఉద్యమం ప్రారంభమైంది. మొదట్లో పట్టణాలకే పరిమితమైన ఉద్యమం క్రమక్రమంగా గ్రామాల్లోకి వ్యాపించింది. పాఠశాలలు మూసివేయాలని అలజడులు ప్రారంభమయ్యాయి. ఇందుల్లో లాయర్లు, ఇంజనీర్లు, రాజకీయనాయకులు, డాక్టర్లు అందరూ పాల్గొన్నారు. పట్టణాల్లో విద్యార్థుల పాత్రే ప్రధానంగా ఉంది. విద్యార్థులను రెచ్చగొడుతున్నారు నాయకులు" (మల్లయ్య, కాలువ.2001:పుట.187). ఈ మాటల ద్వారా ఆనాడు తెలంగాణ ఉద్యమ తీవ్రతను తెలుసుకోవచ్చు. దాని వ్యాప్తిని అంచనా కట్టవచ్చు. తెలంగాణ ప్రాంతమంతటా ఉద్యమం ప్రారంభమైంది. బస్సులకు నిప్పు అంటించడం, రైళ్లను ఆపడం, వీధి దీపాలను పగలగొట్టడం లాంటివి జరిగాయి. ప్రజలు వార్తా పత్రికల ద్వారా, రేడియోల ద్వారా ఎక్కడ ఏమి జరుగుతుందో తెలుసుకునేవారు. విద్యార్థులెవరూ పాఠశాలలకు వెళ్లలేదు. ఛలో హైదరాబాద్, ఛలో నిజామాబాద్, ఛలో వరంగల్ అంటూ గోడలపై రాతలు రాశారు. ప్రాణాలైన అర్పిద్దాం తెలంగాణను సాధిద్దాం. జై తెలంగాణ, జైజై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఉద్యమం పేరుతో నానా బీభత్సం సృష్టించారు. ఉస్మానియా యూనివర్శిటీ క్యాంపస్ లో పోలీసు కాల్పుల వల్ల నలుగురు విద్యార్థులు మృతి చెందడంతో ఆందోళన ఉధృతి కావడం జరిగింది. అయితే అందరితోపాటు సాంబయ్య కూడా 'జై తెలంగాణ ఉద్యమం'లో పాల్గొన్నాడు. కొన్ని విషయాల గూర్చి తెలుసుకున్న సాంబయ్యకు ప్రత్యేక తెలంగాణ అవసరమే అని అనుకున్నాడు. ఈ విధంగా ఈ నవలలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం గురించి దాని ఆవశ్యకతను గురించి తెలుసుకోవచ్చు.

**1.8. ముగింపు:**

ఈ నవలలో పాత్రోచిత సంభాషణ కనిపిస్తుంది. ఆ సంభాషణల్లో కూడా చక్కటి తెలంగాణ నుడికారం ప్రయోగించబడింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు మాట్లాడుకునే భాష ఆ భాషలోని నానుళ్లు, నుడికారాలు చక్కగా రచయిత వాడారు. ఏ రచనకైన రచనలోని పాత్రల సొంత భాష ఉండడమనేది సజీవ చిత్రణకు మిక్కిలి దోహదం చేస్తుంది.

ఒకవైపు కటిక పేదరికం, మరోవైపు విద్య మీద ప్రేమ, మరోవైపు అశాస్త్రీయ విద్యావిధానం, కుల అసమానతలు, దొరల దౌర్జన్యాలు, కరువు, విప్లవోద్యమ పోరాటం, 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం,

ప్రజల్లో వచ్చిన చైతన్యం సాంబయ్య చదువు నవలలో చిత్రించబడ్డాయి. ఈ నవల దాదాపు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలం నుండి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన మూడు, నాలుగు దశాబ్దాల ఉత్తర తెలంగాణ గ్రామ జీవితాన్ని, అందులోని ఒక కుటుంబాన్ని నమూనాగా తీసుకొని చిత్రించింది.

**ఉపయుక్త గ్రంథ సూచి**

అయిలయ్య, బన్న . 2010.కాలువ మల్లయ్య కథలు తెలంగాణా జన జీవితం.వరంగల్: నానీ ప్రచురణలు.

జయప్రకాష్, ఎస్.2009. పరిశోధన విధానం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

మల్లయ్య, కాలువ. 2001.కాలువ మల్లయ్య నవలలు. కరీంనగర్: తెలుగు వచనం ప్రచురణలు.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# దాశరథి రంగచార్య నవలల్లో సామాజిక చైతన్యం

**నిమ్మల గంగాలక్ష్మి,**
తెలుగు అధ్యాపకురాలు,
తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, ఆసిఫాబాద్. 8897374148.

**పరిచయం:-** వట్టికోట అల్వారుస్వామి తెలంగాణా ప్రజా జీవితాన్ని నవలలుగా రాసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఆ క్రమంలోనే రెండో నవల "గంగు" రచన ప్రారంభించారు. 1961 ఫిబ్రవరి 6న వట్టికోట అళ్వారుస్వామి మృతితో "గంగు" అసంపూర్తిగా మిగిలింది. అదే రూపంలో 1965లో పుస్తకంగా వెలువడింది. తెలంగాణా ఉజ్వల పోరాట చరిత్రను నవలీకరించాలన్న వట్టికోట ఆశయం మధ్యలోనే ఆగిపోవడం రంగాచార్యకు బాధ కలిగించింది. ఈ పరిస్థితుల్లో ఎవరూ ముందుకు రాలేదు. ఆ బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకున్నాడు రంగాచార్య "నేను కూడా పూనుకోకుంటే జన్మజన్మాల బూజు నిజాం రాజు ధర్మ ప్రభువుగా చలామణి అవుతాడని భయం. అందువల్ల తప్పనిసరి పరిస్థితుల్లో నేను నవల రాయడానికి పూనుకోవాల్సి వచ్చింది" అంటారు. రంగాచార్య నవలా రచనకు సిద్ధపడిన తర్వాత సొంతంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే ఆళ్వారుస్వామి బాటలో కాకుండా తన సొంత దృక్పథంలో నవలలు రాయాలనుకున్నారు. అందుకు ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఒక్క తెలంగాణ పోరాటమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక సమస్య గురించి తన నవలల ద్వారా వివరిస్తూ వాటికి ఎదురు నిల్చే ధైర్యాన్ని తన రచనల ద్వారా సామాన్య ప్రజలకి తెలియజేసాడు రంగాచర్య. తనదైనా శైలిలో రచనలు చేసారు.

**విషయం :-** రంగాచార్య మొత్తం తొమ్మిది నవలలు రచించారు. అవి, చిల్లరదేవుళ్లు, మోదుగుపూలు, జనపదం, మాయాజలతారు. రానున్నది ఏది నిజం?, పావని, మానవత, శరతల్పం, అమృంతగమయ. వీటిలో తొలి మూడు నవలలు తెలంగాణ జనజీవితాలను చిత్రించిన పిరియాడికల్ నవలలుగా గుర్తింపు పొందాయి. రచనా పరంగా రెండో నవల మాయజలతారు.

**చిల్లర దేవుళు:-** 1938కి పూర్వపు తెలంగాణా ప్రజల జీవితమే "చిల్లరదేవుళ్లు" కథా వస్తువు. అందుకే రంగాచార్య కొందరు వ్యక్తుల జీవితాలను కాక, ఆనాటి సమాజానికి ప్రతిబింబమైన సంపూర్ణ గ్రామ జీవితాన్ని కథా వస్తువుగా స్వీకరించాడు. గ్రామానికి రెడ్డి, కరణం, రైతు, కోమటి, చాకలి, మంగలి, నూల మాదిగలు సప్తాంగాల వంటివారు. వారితో వాటి గ్రామ వ్యవస్థ తీరుతెన్నులను ప్రదర్శిస్తూనే,

అమానుషమైన దొరలు, అధికారుల దోపిడి, దుర్మార్గాలు, వెట్టి, బేగరిలాంటి కట్టుబాట్లు, అడబాపల దుర్భర జీవితాలను వర్ణించాడు.

రామారెడ్డి ఆ గ్రామానికి దేశముఖ్ వెంకట్రావు ఆ గ్రామానికి పట్వారీ కరణం వీరిద్దని దయాదాక్షిణ్యాలమీదే గ్రామ ప్రజల జీవితం ఆధారపడి ఉంటుంది. ఇద్దరికీ అభిప్రాయ భేదాలు ఉన్నా, ప్రజలను దోచుకోవడంలో మాత్రం ఒక్కడిగానే ఉంటారు. గ్రామంలో దొరది మాత్రమే పెద్ద గడీ (భవనం), మిగతా ఒకటి రెండు పెంకుటిళ్లు తప్ప అన్ని పూరి గుడిసెలే, "ఈ గడీ వటవృక్షం. దీని నీడన ఏ గడ్డి మొలవటానికి వీలు లేదు. ఒక ప్రాణి కోసం, కాకుంటే ఒక్క కుటుంబం కోసమే ఈ ఊరంతా వెలిసి నట్లుందని" అనుకుంటాడు పాణి (చిల్లరదేవుళ్లు పేజీ 36) ఆ గడిలో దొర, దొర భార్య, కూతురు మంజరి ఉంటుంది. వీరితోపాటు అడబాప వనజ ఉంటారు. గ్రామ ప్రజలపై దొర పెత్తనాలు ఏవిధంగా ఉంటాయో దానికి ప్రజల తిరుగుబాటు ఎలా ఉండాలో ఈ నవల ద్వారా అవగతమవుతుంది.

నవలలలో మాడపాటి హనుమంతరావు, నరేంద్రలు సజీవ పాత్రలు. మతమార్పిడి ద్వారా ముస్లింలుగా మారిన వారిని తిరిగి హిందూమతంలో చేర్పించే శుద్ధి ఉద్యమం నిర్వహించిన ఆర్యసమాజం ద్వారా నరేంద్రను ప్రవేశపెట్టారు. నాటి తెలంగాణాలో గ్రంథాలయోద్యమం, నిజాంరాష్ట్రాంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభ, వాటి తెలంగాణా పరిస్థితులకోసం మాడపాటి హనుమంతరావును ప్రవేశపెట్టారు. వీటితోపాట . వీటితోపాటు బతుకమ్మ, దసరా ఉత్సవాలను చేర్చడం నవలకు నిండుదనాన్ని చేకూర్చాయి.

**మోదుగుపులు:-** "మోదుగుపూలు"లో 1938 నుంచి 1948 వరకు, అంటే హైదరాబాద్ "చిల్లర దేవుళ్లు" నవలలో 1938కి పూర్వపు తెలంగాణా ప్రజా జీవితం సంస్థానంపై పోలీస్ చర్య జరిగే దాక తెలంగాణా ప్రజా జీవితం, ప్రజా పోరాటానికి ప్రజలు సిద్ధమైన తీరు చిత్రించబడింది. రచనా పరంగా చూసుకుంటే "మోదుగుపూలు" రంగాచార్య మూడో నవల అవుతుంది. కానీ, తెలంగాణా జీవన చిత్రణ క్రమంలో తీసుకున్న రంగాచార్య, "మోదుగుపూలు"లో ఒక జాగీర్ ను కథా వస్తువుగా తీసుకున్నారు. దీని పరిధి విస్తృతం. కొన్ని గ్రామాలు, కోయ గూడాలతో, నిజాం సంస్థానంలో మరో సంస్థానంలా ఉంటుంది. జాగీర్దార్ ఎక్కడో పట్నంలో ఉంటాడు. అతడికి పరిపాలన, ప్రజల క్షేమం పట్టదు. పాలన అంతా తాసిల్దార్ చేతిలో ఉంటుంది. అతనే జాగీరుకు "సర్వతంత్ర స్వతంత్రుడైన" ప్రభువు. అక్కడ ఒక శాసనమంటూ ఏమి ఉండదు. "దండించడమే" శాసనం.

రఘు భూమి కోల్పోయినా మంగలి చేత సమ్మె చేయించి, వారి భూమి తిరిగి వచ్చేలా చేస్తాడు. రఘు పోరాటానికి మంగలి రావడు పూర్తి సహకారాన్ని అందిస్తాడు. తాను చదువు నేర్చుకుని, తమ వారికి చెబుతాడు. వడ్డెర పీరయ్య, పీరమ్మ మృతితో వడ్డెర్లలో చైతన్యం రగిలిస్తారు రఘు, జానకి, నగేశ్ లు అప్పటిదాక తిరుగుబోతుగా ఉన్న పీరయ్య కొడుకు భీముడు రఘు ఉద్యమంలో చేరతాడు. తాసిల్దార్ బంగ్లాకు వెట్టికి రాళ్లు కొట్టమని, కూలి ఇవ్వాలని అడుగుతారు. విజయం సాధిస్తారు. నవలలో మరో ప్రధాన విషయం కోయలు. నాగరికతకు దూరంగా అడవుల్లో ఉండే కోయలు కూడా తాసిల్దార్కు వెట్టి చేయాల్సిందే. తాసిల్దార్ బంగ్లా నిర్మాణం కోసం వారు గ్రామానికి వచ్చినప్పుడు వారిలోనూ చైతన్యం నింపుతాడు రఘు.

వార్తా పత్రిక చదవడమే నిషిద్ధమైన జాగీర్ లోకి వార్తా పత్రిక తెస్తాడు రఘు తేవడమే కాదు, ఊరి ప్రజలందరిచేత చదివిస్తాడు. నవలలో చాలా సందర్భాల్లో జాతీయ, అంతర్జాతీయ అంశాలు చర్చకు వస్తాయి. నాగరిక సమాజానికి దూరంగా కోయల ఆచార వ్యవహారాలు సహజ సుందరంగా చిత్రించారు రచయిత. చారిత్రక అంశాలతోసహా పీర్ల పండగ వృత్తాంతాన్ని జరుపుకునే విధానం వివరంగానే వర్ణించబడింది. జాగీర్దార్ల జల్లాలు, తాసిల్దార్, గిర్దావరు, అమీన్, సాహుకారుల దోపిడి, పీడన, అరాచకత్వం ఎలా ఉంటుందో నవలలో చిత్రించబడింది. రఘు పాత్రలో ప్రవేశించి రచయిత అన్యాయాన్నీ ఎదురునిలవడం ఎలాగనే ప్రజలకు తెలియజేసారు.

**మాయ జలతారు:-** మాయ జలతారు కథా వేదిక నగరం. నగరంలో భిన్న సమస్యలని చిత్రిస్తుంది "మాయ జలతారు". గ్రామ సీమలనుంచి పొట్ట చేతబట్టుకుని నగరాన్ని వచ్చినవారితో ఒక గుడిసెల గూడెం వెలుస్తుంది. వారు గుడిసెలు వేసుకున్నప్పుడు ఆ భూమికి విలువలేదు. అందుకే ఎవ్వరేమనలేదు. ఆ గూడెంలో అన్ని రకాల పనులు చేసేవారు ఉంటారు. రెక్కల కష్టం మీద బతికే జనం, వచ్చిన కొన్ని డబ్బులను కల్లుకు తగలేస్తారు. చాలీచాలని తిండితో పిల్లా జెల్ల కడుపులు మాడ్చుకొంటారు. కనీసం రేషన్ బియ్యం కూడా కొనలేని పరిస్థితి. తినడానికి తిండి లేక పోయినా, వారిలో మంచితనం, మానవత్వం, త్యాగగుణం పుష్కలంగా ఉంటాయి.

నగరంలో పెరుగుతున్న వ్యాపార సంస్కృతితో భూమి విలువ పెరుగుతుంది. దాంతో గుడిసెలున్న స్థలం తన పేరు చేసుకుంటాడు ఉస్మాన్ భూమి తనది కాబట్టి గుడిసెకు ఐదు రూపాయలు కిరాయి ఇవ్వమంటాడు. పిచ్చయ్య, బాలయ్యలు ముందు నిలిచి ఉస్మాన్ గూండాలను ఎదిరిస్తారు. పిచ్చయ్యను పోలీస్ స్టేషన్లో వేస్తాడు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు. బాలయ్యను హుసేన్, సింగ్లు

గాయపరిచారు. బాలయ్యకు డాక్టర్ ఇక్బాల్ వైద్యం అందిస్తాడు. డాక్టర్ ఇక్బాల్, న్యాయవాది మహబూబ్ కిషన్లు గుడిసెవాసులు పోరాటానికి మద్దతుగా నిలబడతారు. తర్వాత బాలయ్య కొడుకు రామారావు నాయకత్వంలో గుడిసెవాసులు విజయం సాధిస్తారు.

పెద్దవారి భోగాలకు, వ్యాపారాలకు బలయ్యే స్త్రీలకు ప్రతీక డైజీ. సూర్యారావులాంటివారు అమాయక స్త్రీలను సినిమాల పేరుతో, తమ అవసరాలకు ఎలా ఉపయోగించుకుంటారో వర్ణించబడింది. అనైతిక కార్యక్రమాలకు పెద్ద హోటళ్లు కేంద్రం అనే దానికి నిదర్శనం నయాగరా హోటల్. నగరాల్లో పెద్ద మనుషులుగా చలామణి అయ్యేవారి చీకటి సామ్రాజ్యం ఎలా ఉంటుందో, వారి అధికార దర్పం ఎలా ఉంటుందో అన్న దానికి ఉస్మాన్ ప్రతీక. వీటితోపాటు మహంకాళీ జాతర, బోనాలు, రంగం వృత్తాంతాలు కూడా నవలలో చోటుచేసుకున్నాయి. ఈ నవల ద్వారా రంగాచర్య గారు ఆనాటి సమస్యలని ఆ సమస్యలనుండి బయటపడే దారులని సూచించడం జరిగింది.

**జనపదం:-** "జనపదం" ఇతివృత్తం చాలా విశాలమైనది. 1948 తర్వాత తెలంగాణ ప్రజల్లో వచ్చినమార్పు, మారిన గ్రామ స్వరూపాలు, స్వాతంత్ర్యం తరువాత కూడా మారని బడుగుల జీవితాలు, దొరల దోపిడీ, కలుషితమైన రాజకీయాలు, ఎన్నికల ప్రహసనాలు, తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరులు నిస్సహాయులుగా మారడం, ఆ నిస్సహాయతలోంచి కొత్త తరం ఆవిర్భవించడాన్ని నవలలో చిత్రించారు. రంగాచార్య. రంగాచార్య మిగతా నవలల్లాగే ఇందులోనూ భూ సమస్య ప్రధానంగానే కనిపిస్తుంది.

తెలంగాణా రైతాంగ పోరాట కాలంలో తుపాకీ మనుషులకు భయపడి గ్రామాన్ని వదిలి నగరానికి చేరుకుంటాడు దేశముఖ్ బలరామయ్య. పోలీస్ చర్య తర్వాత పోలీసుల సహాయంతో మళ్లీ గ్రామానికి చేరుకోవడంతో నవల ప్రారంభం అవుతుంది. గడిలోకి ప్రవేశించిన బలరామయ్యకు ఆడబాప అమృతవాణి కనిపిస్తుంది. బలరామయ్యకు, అమృతవాణికి పుట్టినవాడు రామయ్య. అతడు దొరను ఎదిరించేందుకు తుపాకులవాళ్లతో కలుస్తాడు. బలరామయ్య ప్రజల ఆధీనంలో ఉన్న తన భూములను, పశువులను, వస్తువులను స్వాధీనం చేసుకుంటాడు. తుపాకులవాళ్లకు వీరభద్రం నాయకుడు. ఆ దళంలోని వాడే జగ్గయ్య. తుపాకుల వాళ్ల ఆచూకికోసం జగ్గయ్యను హింసిస్తారు. ఎంత హింసించినా ఆచూకి చెప్పడు జగ్గయ్య. పోలీస్ అధికారి శివరావు తుపాకీ గుండుకు బలవుతాడు. తుపాకులవాళ్లను మోసంచేసి వారి డబ్బును తీసుకొని పారిపోయి బలరామయ్య పంచన చేరతాడు రామయ్య.

నవలలో సుందర్రావు పాత్ర వినోబాబావేకు ప్రతీక. దొరల నుంచి భూమిని దానంగా తీసుకుని పేదలకు పంచుతుంటాడు.సరస్వతి పాత్ర సుందర్రావుకు శిష్యురాలిగా మారిపోతుంది. ఖద్దరు తప్ప అన్యం ధరించదు. ఎప్పుడు ఖద్దరు ఒడుకుతూ, ఆధ్యాత్మిక భావనలో ఉంటుంది. అయితే భూదానోద్యమంలో లోపాలను రచయిత చిత్రించారు. తన ఉద్యమం విఫలం కావడం తట్టుకోలే గాంధేయవాది సుందర్రావు ఉపవాసం చేసి, ప్రాణాలు త్యజిస్తాడు. అతని మరణ తర్వాత సరస్వతి అమ్మగా మారిపోతుంది. బలరామయ్య, శివరావు, ఇతర మంత్రులు 'అమ్మ భక్తులుగా మారుతారు. "అమ్మ"గా గ్రామానికి వచ్చిన సరస్వతి, వీరభద్రం శారీరకంగా కలుసుకొంటారు. తర్వాత సరస్వతి, బలరామయ్య, శివరావుల సమేతంగా అమెరికాకు వెళ్లిపోతుంది.

ఒక సుదీర్ఘమైనా కథాంశంతోపాటు, నవలలో నిజాం నవాబుపై బాంబులు వేయడం, భూదానోద్యమం, ముల్కి ఉద్యమం ఒక లాంటి చారిత్రక సంఘటనలు, బారసాల, ఉగాది పండగ, కాముని పున్నమి వృత్తాంతాల ద్వారా తెలంగాణా ప్రజల సాంఘిక చరిత్రను చిత్రించారు రంగాచార్య,

**రానున్నది ఏది నిజం? :-** పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమ దోపిడీని గుర్తించాడు కారల్ మార్క్స. శాస్త్రీయ సోషలిజాన్ని ప్రవచించాడు. ఆస్తి వైయక్తికం కాకుండా, సమాజ పరమైప్పుడు ఆ దోపిడీ నశిస్తుందని చెప్పాడు. ఆ వ్యవస్థలో వ్యక్తులకు ఆస్తులు ఉండవు, అంతా సమాజానిదే. సామ్యవాద వ్యవస్థలో, మనిషి వ్యవస్థ కోసం, వ్యవస్థ మనిషి కోసం పనిచేస్తాయి. విద్య, వైద్యం ఉచితం. నిరుద్యోగం, ఆకలి, ఉండవు. ఇలాంటి సమాజం భారత దేశంలో వస్తే, రాజకీయ, ఆర్థిక, సాంఘిక మార్పులు ఎలా ఉంటాయో "రానున్నది ఏది నిజం?" నవలలో చిత్రించాడు రంగాచార్య.

**పావని :-** స్వాతంత్ర్యం వచ్చిన 30 ఏళ్ల తర్వాత కూడా, స్వరాజ్య కాంతులు ప్రసరించని గ్రామాలు, అభివృద్ధి జాడ అంటని గ్రామాలు, మధ్య యుగాలనాటి భూస్వామ్య వ్యవస్థకు చిహ్నమైన పాలన, వెట్టిచాకిరీకి నిలయంగా మారిన గ్రామాల దుస్థితిని, ప్రజల వెతలు, అమానుషమైన అంటరాని తనాన్ని "పావని" నవలలో చిత్రించారు రంగాచార్య. మల్లమ్మ శివయ్యకు బానిస. మల్లమ్మ భర్త పరమయ్య పెళ్లికి అప్పు చేశాడు. శివయ్యకు అమ్ముడు పోయాడు. చేసిన అప్పుకు వడ్డీకింద శివయ్యకు చాకిరీ చేయాలి. నిత్యం తిండికి ఇచ్చే గింజలు మళ్లీ అప్పు. పనిచేయనినాడు బత్తెం ఇవ్వరు. వడ్డీ పెరుగుతుంది. ఒకసారి జ్వరం వచ్చి పనిలోకి రాలేకపోతాడు పరమయ్య చెట్టు కట్టేసి కొట్టిస్తాడు. పరమయ్య ఊర్లోనుంచి పారిపోతాడు. అతని భార్య మల్లమ్మను తెచ్చి ఇంట్లో పనికి పెట్టుకున్నాడు. అమెను పశువు కంటే

హీనంగా చూస్తారు. కొడతారు. మల్లమ్మ తమ్ముడు పెంటయ్య కూడా శివయ్యకు అమ్ముడు పోయాడు. పెంటయ్యే కాదు ఊరు సొంతం శివయ్యకు అమ్ముడు పోయిన వాళ్లే.

బి.ఎ వరకు చదువుకున్న పావని ఆ గ్రామంలోకి చదువు చెప్పడానికి టీచర్ వస్తుంది. పిల్లలకు పాఠాలతోపాటు, ప్రభుతం వచ్చే భోజనం, వారి కుటుంబాలకు డబ్బులు అందిస్తుంది. గూడెంలో రాత్రి పాఠశాల నడుపుతుంది. శివయ్య దోపిడీని వారికి వివరిస్తుంది. తాగుడు మాన్పిస్తుంది. ప్రజలు శివయ్యను ఎదిరించేందుకు శివయ్య ఎన్ని ప్రయత్నాలు చేసినా పావనిని ఏమీ చేయలేకపోతాడు. శివయ్య నుంచి గ్రామానికి విముక్తి కలిగిస్తుంది. చివరికి శివయ్య తన నమ్మిన బంటు నర్సిమ్మ చేతిలోనే హత్య చేయబడతాడు. ఈ నవల ద్వారా దాశరథి రంగచార్యులు గారు మారుమూల గ్రామాలలోని దుస్థితి గురించి వాటిని ఎదుర్కొనే తీరును వివరించారు.

**మానవత :-** మత నేపథ్యంలో సాగిన నవల "మానవత". రంగాచార్య నవలలన్నింటిలో "మనిషి, మానవత" అంత:స్సూత్రంలా ఉంటాయి. జన్మత: వ్యక్తి మంచివాడినని, సమాజమే అతన్ని చెడ్డవానిగా మారుస్తుందని, అందుకే సమాజాన్ని మార్చాలనే మాటలు, మనకు చాలా చోట్ల కనిపిస్తాయి. అయితే, డబ్బు పరంగానే కాకుండా, మత ఛాందసవాదులు, మానవతను మతం ముసుగులో ఎలా బంధిస్తారో, అలాంటివారిలో సైతం ప్రాణంపైకి వచ్చినప్పుడు మతాలను పక్కనపెట్టి మానవత ఎలా పెల్లుబుకుతుందో నవలలో చిత్రించారు రచయిత. అంతిమ విజయం మానవతదే అన్న సత్యాన్ని ఇందులో నిరూపించారు.

ఏటి ఒడ్డున ఉన్న ఒక గ్రామం వేదికగా నవల నడుస్తుంది. ఆ గ్రామాన్ని వరద ముంచెత్తడంతో నవల ప్రారంభం అవుతుంది. ఏటి వరద గంట గంటకు పెరుగుతుంది. మరికొంత పెరిగితే గ్రామం మునిగిపోతుంది. ఆ విషయం తెలుసు అందరికి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు గ్రామస్థులు. ముకుందరావు ఆ ఊరి బ్రాహ్మణుడు. దైవభక్తి అధికం. ఆయన వర్షాన్ని తగ్గించమని రాముణ్ని వేడుకుంటాడు. అదే గ్రామంలో ఉండే ఫాదర్ జాన్ క్రైస్తవుడు. అతనికీ దైవభక్తి అధికమే. వర్షాన్ని తగ్గించి ప్రజలను రక్షించమని ప్రభువును వేడుకుంటాడు. ప్రార్థనలు చేస్తాడు. వర్షం తగ్గిపోతుంది. ముకుందం, జాన్ ఇద్దరూ ఏటికి వెళతారు. ఏటి హెరు తగ్గింది. తాను రాముణ్ని ప్రార్థించకుంటే ఏరు ఊరును మింగేది అనుకుంటాడు ముకుందం. ఏసు ప్రభువు గ్రామాన్ని కాపాడాడని జాన్ అనుకుంటాడు. ఇద్దరు తారసపడతారు. కుశల ప్రశ్నల తర్వాత, రాముడు గొప్ప అని ముకుందం, ఏసు ప్రభువు గొప్ప అని

జాన్ ఇద్దరూ వాగ్వాదానికి దిగుతారు. జాన్ కొడుకు పాల్ వచ్చి, ఇద్దరికీ సర్ది చెబుతాడు. అయినా ఒకరి మతంపై ఒకరికి ఈర్ష్యా ద్వేషాలు ఏ మాత్రం తగ్గవు.

**శరతల్పం:-** రంగాచార్య "శరతల్పం" నవలలో కోరికలు మృత్యువును గెలుస్తాయని నిరూపించడంతోపాటు, గ్రామీణ మొదలువ్యవస్థలో కుల కట్టుబాట్లు, అంటరానితనం ఎంత పాశవికంగా ఉంటాయో నవలలో వర్ణించాడు. మలినం లేని స్నేహానికి కులాలు అడ్డంకి కావని నారాయణస్వామి, గురువయ్య పాత్రలద్వారా నిరూపించాడు.

ముందు తాగుబోతుగా ఉన్న గురువయ్యకు క్రమంగా ఆధ్యాత్మిక భావం అలవడుతుంది. తాగుడు మానేస్తాడు గ్రామంలో గురువయ్యపై అందరికీ సదభిప్రాయం ఏర్పడుతుంది. నాంచారమ్మను చూసి పిచ్చమ్మ తన ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటుంది. అయితే గ్రామానికి వచ్చిన హరిదాసు, రామాయణ కథ పూర్తి చేయకుండానే, రామకిష్టయ్య కూతురు బాల వితంతువు వెంకమ్మను, అతని డబ్బును దోచుకని పారిపోతాడు. రామాయణంలో మిగిలిన కథను నారాయణస్వామి దగ్గర చెప్పించుకుంటాడు గురువయ్య. మధ్యలోన సందేహాలు తీర్చుకుంటాడు. రామాయణం తర్వాత భాగవతం ప్రారంభిస్తాడు నారాయణస్వామి. అయితే ఈ ఈ మధ్యలో గురువయ్యకు క్షయ వ్యాధి తగులుతుంది. నారాయణస్వామి పట్నం తీసుకుపోయి, క్షయ ఆస్పత్రిలో చేర్పిస్తాడు. కొన్నాళ్ళకి రోగం ముదిరుతుంది. గ్రామానికి తీసుకొస్తారు. "బతికి చేసిడ దేమున్నదుండి. భాగవతం ఇని చావాలె" అంటాడు గురువయ్య. భాగవతం కొనసాగిస్తారు నారాయణస్వామి, భాగవతం వినడానికి జనం తండోపతండాలుగా వస్తారు. పక్క గ్రామాల నుంచి బండ్లు కట్టుకొని వస్తారు. రామకిష్టయ్య ఆస్తిని కోల్పోతాడు. కాలు, చేయి, మాట పడిపోతుంది. గురువయ్య, నారాయణస్వామి భూములు తిరిగి ఇస్తానంటాడు. వారు నిరాకరిస్తారు. భాగవతం కథ పూర్తవుతుంది. గురువయ్య చేతులను నారాయణస్వామి పాదాలమీద వేస్తాడు. తనువు చాలిస్తాడు. "గురువయ్య పరిమపదించిన్రు" అంటాడు నారాయణస్వామి గోడకు ఆనుకొని కూర్చున్న పిచ్చమ్మ గురువయ్యను చేరుకుంటుంది. ఈ నవల ద్వారా చెడు అలవాట్లకి బానిసయినవారు మారే తీరు మన భారత, భగవతాల విలువలు వాటిలో సందేశం తెలియజేసారు రచయిత.

**అమృతం గమయ:-** "అమృతం గమయ"లో మొత్తం 21 భాగాలున్నాయి. ఒక గ్రామ స్థాపన మొదలు దాని క్రమ వికాసం, పారిశ్రామీకరణ, పాశ్చాత్యీకరణ సమాజంలో తెచ్చిన మార్పులు, పడిపోతున్న మానవ విలువలు కన్నులకు కట్టినట్లు చిత్రించి 'అమృతంగమయ'. వేద సమాజాన్ని, నేటి సమాజాన్ని

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

సమాంతరంగా వివరిస్తూ, మరణం వైపు పయనిస్తున్న మానవజాతిని అమృతంవైపు- ఒక ఉన్నతమైన సమాజ స్థాపన దిశగా పయనింపజేస్తుంది. కథనంలో సందర్భోచితంగా భారతీయ ప్రాచీన సమాజంలోని ఉన్నతమైన విలువల్ని, సాంప్రదాయం, సాహిత్యంలోని కథలను ఉటంకించారు రంగాచార్య. మనము ఎక్కడ నుంచి వచ్చాం ఎక్కడికి వెళ్తున్నాం. అది సరైనదా, కాదా? మనం ఎటు ప్రయాణించాలి? అనే ప్రశ్నలకు ఈ నవల చక్కని సమాధానం ఇస్తుంది. అయితే నవలలో కథ చెప్పడం కన్నా సంఘటన చెప్పడమే రంగాచార్య ప్రధాన ఉద్దేశం. అందుకే నవలలో ప్రధాన కథకన్నా, సంఘటనల చిత్రీకరణే అధికంగా కనిపిస్తుంది.

అతీంద్రియ శక్తి గల బోధి వృక్షం, ధ్రువమండలం నుంచి వచ్చిన అసమా అనే వ్యక్తికి మధ్యజరిగే సంభాషణ ఈ నవల. ఒకప్పటి ఆత్మానందస్వామి ఆశ్రమంలో ఉండే ఆ బోధి వృక్షానికి అన్ని కనిపిస్తాయి. అన్ని వినిపిస్తాయి. కానీ ఆ చెట్టు, ఎవరికీ కనిపించదు, వినిపించదు. అక్కడ ఆశ్రమమనే పేరు తప్ప ఏమీ మిగలలేదు. ధ్రువ మండలం నుంచి వచ్చిన అసమాకూడా ఎవరికీకనిపించడు. వినిపించడు. తమ ప్రజలకు శాంతిని పంచడంకోసం ధ్రువ మండలం నుంచి భరత ఖండానికి వచ్చాడు. 40 రోజులపాటు ఆ ఆశ్రమ ప్రాంగణంలో ఉంటాడు. అసమా ఎలాంటి పూజలు చేయకపోయినా, భారతీయ కర్మ సిద్ధాంతాన్ని అనుసరించి స్వామి అతన్ని కరుణిస్తాడు. బోధి వృక్షం ద్వారా స్వామి మాట్లాడిస్తాడు. చీకటిపడ్డ తర్వాత, వేగుచుక్క పొడిచేవరకు మాత్రమే బోధివృక్షం మాట్లాడగలుగుతుంది. వీరి మధ్య సాగే సంభాషణే ఈ నవల.

**ముగింపు :-** అక్షర వాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్య జీవితం భిన్న వైరుధ్యాల నిలయం. ఉత్తర దక్షిణ ధ్రువాల్లాంటి మార్క్సిజం, సంప్రదాయం ఆయనలో ఒక్కటిగా ఇమిడిపోతాయి. ఆయనను చూస్తే నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరులో తుపాకీ పట్టి పోరాటం చేశారని, ఆయన నుదిటిపై కనిపించే తిరునామాలు చూసి ఆయనొక మార్క్సిస్టు అని ఎవరూ అనుకోరు. కానీ, ఆయన విప్లవ శక్తికి ప్రతీక. ఆయన జీవితమే ఉద్యమం. ఉద్యమమే ఆయన జీవితం. రంగాచార్య మార్క్సిజాన్ని ఎంతగా ప్రేమిస్తారో, సంప్రదాయాన్ని అంతగా ఇష్టపడతారు. నిక్కమైన నీలాంటి నవలలు అందించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రంగాచార్య, అదే చేత్తో రామాయణ, భారత, భాగవతాలు, వేదాలు, ఉపనిషత్తులు తెలుగుజాతికి తేట తెలుగు వచనంలో అందించారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భారతీయ దృక్పథానికి నిలువెత్తు నిదర్శనం దాశరథి రంగాచార్య. స్వాతంత్ర్య సమరయోధుడిగా, అక్షర వాచస్పతిగా ప్రజల హృదయపీఠం అధిరోహించారు దాశరథి రంగాచార్య. తన నవలల ద్వారా

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

సమాజంలో చైతన్యం తీసుకొచ్చి చాలా సమస్యలకు పరిష్కారాలు చూయించిన దార్శనికుడు దాశరథి రంగచార్యులు గారు.

**ఉపయుక్త గ్రంథసూచికలు:**

1)అమృతం గమయ నవల, దాశరథి రంగాచర్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2004,

2) దాశరథి రంగాచర్య వికీపీడియా.

3)దాశరథి రంగాచర్య రచనలు, ఐదవ సంపుటి, దాశరథి రంగాచర్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2015.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# కరుణశ్రీ ఖండ కావ్యాలలో కరుణరసం

డా॥ శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ
పాఠశాల సహాయకురాలు, తెలుగు
ఎస్.వి.ఎస్.ఎం. జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల, రంగంపేట (మండలం)
చరవాణి: 9440152037, E-mail: sripada.setha@gmail.com

కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు 20వ శతాబ్దంలో బాగా జనాదరణ పొందిన కవులలో ఒకరు. వీరి కవిత్వం సులభశైలిలో, సమకాలీన ధోరణిలో, చక్కని తెలుగు నుడికారంతో వినసొంపై ఉంటుంది. వీరి కవితా త్రయం ఉదయశ్రీ, విజయశ్రీ, కరుణశ్రీ అత్యధిక ముద్రణలు కలిగి, ఎనలేని కీర్తిని గడించాయి. వీరు మానవులలో ఉత్తమ మార్పుకు, సమాజ శాంతికి, నైతిక విలువలకు తన కవిత్వాన్ని వినియోగించారు. వీరి కవిత్వం ఈనాటికీ సమస్యలకు పరిష్కారం చూపుతుంది. శాంతి, సామరస్యం వంటి గుణాలతో జీవించడాన్ని నేర్పుతూనే సామాజిక న్యాయాన్ని, మానవతా విలువలను బోధిస్తుంది.

క్రీ.శ. 1912 నుంచి 1992వ సంవత్సరం వరకు సుమారు 80 సంవత్సరాలు జీవించిన కరుణశ్రీ సుమారు 80 గ్రంథాలు వ్రాసారు. గుంటూరులో 4 సంవత్సరాలు, అమరావతిలో 4 సంవత్సరాలు మొత్తంగా 8 సంవత్సరాలు వీరు ఉపాధ్యాయునిగా పనిచేసారు. గుంటూరు ఆంధ్రాక్రైస్తవ కళాశాలలో 22 సంవత్సరాలు, మహావీర్ కాలేజిలో 3 సంవత్సరాలు, హిందూ కళాశాలలో 2 సంవత్సరాలు మొత్తంగా 27 సంవత్సరాలు అచ్చంగా అధ్యాపకునిగా పనిచేసారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారి 'పోతన భాగవతం' ప్రాజెక్టుకు చీఫ్ ఎడిటర్ గా పనిచేసారు.

"ఏకో రసః కరుణ ఏవ" అన్న భవభూతి వాక్కు కరుణశ్రీ కి వేదవాక్కు. కరుణకు, కవికి అవినాభావ సంబంధం ఉండాలని తన కవితకు స్ఫూర్తి కరుణరసానిదేనని జంధ్యాల వారే చెప్పుకొన్నారు. భగవంతుడు కరుణామయుడు. సృష్టి కరుణామయం. జీవితం కరుణామయం. ప్రపంచం కరుణలో పుట్టి, కరుణలో పెరిగి, కరుణలో విలీనమౌతుంది. కరుణ లేకపోతే కవికి వ్యక్తిత్వం లేదు. కవి లేకపోతే కరుణకు అస్తిత్వమూ లేదు. అందుకే జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు రసప్రధానంగా కవిత్వం వ్రాసి "కరుణశ్రీ" అని పేరు పొందారు.

కరుణశ్రీ వ్రాసిన "ఉదయశ్రీ" అనే ఖండకావ్యం ఎంతో ఖ్యాతి గడించింది. ఉదయశ్రీ 50వ ముద్రణ గోల్డెన్ జూబిలీ సందర్భంగా పద్మశ్రీ డా. ఎన్.టి. రామారావు గారు మాట్లాడుతూ "కరుణశ్రీ యొక్క అద్భుతమైన కలం అమృతంలో ముంచబడింది" అన్నారు.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

ఖండకావ్యం అంటే చిన్న కావ్యం. కథాంశం, భావం, కథకు అవసరమైన అంశాలన్నీ ఇందులో ఉంటాయి. ఇది కావ్యంలో ఒక భాగాన్ని (ఖండాన్ని) సూచిస్తుంది. దీనిలో ప్రేమ, దూత క్యావం, ప్రకృతి వర్ణన వంటి చిన్న కథాంశాలను కూడా వర్ణించవచ్చు. కావ్యమంత పెద్దది కాకుండా చిన్న కథాంశాన్ని లేదా ఒక భాగాన్ని కలిగియుంటుంది. ఒక చిన్న కథ లేదా భావాన్ని సంపూర్ణంగా, కళాత్మకంగా చెప్పే కావ్యరూపం ఖండకావ్యం. కరుణశ్రీ రచించిన ఉదయశ్రీ ఖండకావ్యంలో 34 ఖండికలు ఉన్నాయి. అవి

1) అంజలి
2) ఉషస్సు
3) ఉదయశ్రీ
4) ఉత్తిష్ఠ
5) కరుణమూర్తి
6) కరుణ కుమారి
7) కరుణామయి
8) పారవశ్యము
9) విశ్వప్రేమ
10) అద్వైతమూర్తి
11) సౌంధ్యశ్రీ
12) వైశాఖి
13) ప్రాభాతి
14) మధుర స్మృతి
15) తపోభంగం
16) పుష్పవిలాసం
17) కుంతీకుమారి
18) రాట్న సుందరి
19) ధనుర్భంగము
20) ఊర్మికా కుమారి
21) అనసూయాదేవి
22) సతీ సావిత్రి
23) మహాకవి పోతన

24) ఆంధ్ర విద్యార్థి
25) అస్వతంత్రుడు
26) తెలుగు తల్లి
27) కళ్యాణ గీతి
28) జయోస్తు
29) కవితాకుమారి
30) బీదపూజ
31) సార్థకత
32) స్వేచ్ఛాపుష్పాలు
33) మాతృశ్రీ
34) నమస్తే

ఈ ఖండకావ్యం కరుణామూర్తి అరుణ చరణాలకు అంకితం చేయబడింది. గురువులైన శ్రీ కుప్పా ఆంజనేయ శాస్త్రి గార్కి, శ్రీ భమిడిపాటి వేంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారికి, శ్రీ ఆచార్య శివశంకరులకు, శ్రీ జమ్మలమడక మాధవరామశర్మ గారికి నమస్సుమాంజలులు అర్పించి కావ్యాన్ని అక్షరరూపంలో సహృదయలోకానికి అందించిన మిత్రులు ఎ.ఎస్.కృష్ణ గారికి ధన్యవాదాలు తెలియజేసారు. జంధ్యాల వారు ఉదయశ్రీని అంజలితో ప్రారంభించి, నమస్కారంతో ముగించడం వీరి సంస్కారానికి చిహ్నం, వీరి మొత్తం కావ్య ఖండికలన్నీ ప్రత్యేకంగా, కథనాత్మకమైన శైలిలో, గొప్పపాత్ర చిత్రణతో, నాటకీయతను సంతరించుకుని సజీవంగా ఎదుట నిలిపే కవి వ్యాఖ్యానంతో ఒక గొప్ప కథాకావ్యాన్ని చూస్తూ వింటున్న అనుభూతిని కలిగిస్తాయి. అంతేకాదు, వీరి ఉదయశ్రీ రచన భావకవిత్వానికి ఎత్తిన జయపతాకం. అందుకే ఆ ఛాయలు ఈ సంపుటిలో దర్శనమిస్తాయి. ఒక్కొక్క కవితా ఖండికలో ఒక్కొక్క అద్భుతమైన, అవ్యక్తమైన మాధుర్యాన్ని నింపుకున్న రసభరితమైన ఫలమిది. ఆస్వాదించే వారిదే అదృష్టం.

"బీదపూజ" అనేది శాస్త్రి గారి ఉదయశ్రీలోని మరొక కవితాఖండిక, నిరుపేద బాలుడొకడు దైవ పూజకు పూలుకోసుకుందామని వెళ్ళి ఏరకమైన పూలు దొరకక తిరిగివచ్చి దేవునికి తన దీనస్థితిని విన్నవించుకోవడమే ఇందలి కవితావస్తువు. వాడిన గ్రుడ్డిపూలు తీసుకురావడానికి గల కారణాన్ని కరుణామయునికి కరుణతో విన్నవించుకుంటున్నాడు. బీదబాలుడు బూరుగు చెట్టుకింద గోడలు పడిపోయిన పూరిపాకలో అమ్మ లేపగానే దుప్పటి పైకెత్తి నిద్రలేచాడు.

“లేచి చుఱుచాప నొకమూల దాచి పెట్టి ప్రాత తాటాకుబుట్టను చేతబట్టి పొంతలోపలి జలమింత పుక్కిలించి తల్లి కాళ్ళకు వంగి వందనమొనర్చి"

అని తన ఉదయసమయ దినచర్యను మనముందుంచి, విరితోటకు వెళ్ళాడు. పెద్దపెద్ద ధనవంతుల బిడ్డలు ఇతనికంటె ముందుగానే మంచి మంచి పూలబుట్టలతోపూలు కోయడానికి తోటలోకి వెళ్ళారు. కాని తోటమాలి చిరిగిపోయిన గుడ్డలతో ఉన్న ఈ బిదవానిని చూసి తలుపులు వేసేసాడు. కాళ్ళావేళ్ళాపడి గడ్డం పట్టుకొని ఏదో ఒకలా బ్రతిమాలి తోటలోకి వెళ్ళాడు. తోటలో తన నేస్తాలు చకచకా పూలు కోసుకొని, బిదవాడిని చూసి పకపకలాడుతూ వెళ్ళిపోతున్నారు. ఈ బిదవాడికి ఎటు చూసినా ఒక్క పువ్వు కూడా కనపడక విస్తుపోయి నిలుచున్నాడు.

"పట్టి పూమొక్కలన్ని నావంక చూచి ప్రసవబంధాలు సడల బాష్పములు రాల్చె; చేతిలో నున్న బుట్టను చింపివైచి తిరిగి వచ్చితి గుండెలు దిగబడంగ"

పూల మొక్కలన్నీ బిదబాలునిచూసి వలవలలాడగా, బాలుడు చేతిలోనున్న బుట్టను చింపి మనసంతా దిగులుతో నిండిపోగా ఇంటికి తిరిగివచ్చాడు. ఇంటికి వస్తుండగా దేవాలయంలో పూలమాలలు గ్రుచ్చుతూ కనిపించారు. నేస్తాలు. బిదవాడు కూడా ఓ స్తంభం వెనుక కూర్చుండగా, గణగణ గంటల మ్రోతకు అందరూ గుడిలోనికి వెళ్ళారు. పూజలు పూర్తి చేసుకొని మిత్రులు ఇండ్లకు వెళ్ళగా, ఖాళీ చేతులతో దైవదర్శనం చేసుకోలేక మండపం పక్కగా ఉన్న ధూళితో ఉన్న గడ్డిపూలను ఏరుకున్నాడు బిదవాడు.

"పరిమళము లేక ఎవరికి పనికిరాక పాఱవేయ బాటల ప్రక్కపడి - కరాళ కాలపురుషుని కాఱు చక్రాల క్రింద బ్రతుకలేక దరిద్ర పుష్పమ్ములివ్వి"

అని సువాసనలేక, పనికిరాక, బయటపారవేసిన పూలను తెచ్చిన అనాధ ప్రసూనాలను పాదాలపై ఉంచడానికి తెచ్చాడు.

"పూలదోసిలి కన్నీట పొరలిపోయె విరుల మాలిన్యమంతయు వెడలిపోయె ఆగియుంటి ప్రభూస్వామి యాజ్ఞకొఱకు ఆదరింతువో లేదో నా బిదపూజ"

పూజను గైకొనమని కరుణామయుని వేడుకొంటూ దోసిలి పట్టిన పూలు కన్నీటిలో పొర్లాడగా ఆ పూల మాలిన్యమంతా పోయింది. ఈ విధంగా బిదపూజ ఖండికలోని పద్యాలన్నీ తేలిక పదాలతో, అందరికీ అర్థమయ్యేటట్లుగా ఆలోచింపజేసేవిగా ఉన్నాయి.

వ్రాస్తే కరుణశ్రీ వ్రాయాలి! పాడితే ఘంటశాల పాడాలి!! వేస్తే వడ్డాది పాపయ్య బొమ్మ గీయాలి!!! అన్నట్లుగా అమరగాయకుడు ఘంటశాల గానామృతంతో జంధ్యాల వారి పుష్పవిలాపం తెలుగు నేలంతా ప్రతిధ్వనించింది. వడ్డాది పాపయ్య చిత్రాలతో దశదిశలా మార్మోగిపోయింది. శాస్త్రి గారి పుష్పవిలాప ఖండిక కరుణరసం నిండిన సృజన.

ఒక భక్తుడు పూజకోసం పూలుకోయాలని పూలతోటకు వెళ్ళినపుడు అతనికి ఆ పూల ఆవేదన మనసులో మెదిలింది. పూలకొమ్మను వంచి పూలు కోద్దామని అనుకునేలోగానే ఆ పూలు ప్రాణం తీస్తావా అంటూ బావురుమనడంతో క్రుంగిపోయి, జంధ్యాల వారు మనసులో పుష్పవిలాప కావ్యానికి అంకురార్పణ చేసుకున్నారు. జగదీష్ చంద్రబోస్ కూడా మొక్కలకు ప్రాణముందని నిరూపించాడు. ఆ ప్రాణాలను తీయవద్దని పుష్పవిలాపకావ్యం ద్వారా హితబోధచేస్తున్నారు జంధ్యాలవారు.

"నేనొక పూలమొక్క కడ నిచ్చి చివాలున కొమ్మవంచి గో రానెడు నంతలోన విరులన్నియు జాలిగనోళ్ళు విప్పి( మా ప్రాణము తీతువా యనుచు బావురుమన్నవి క్రుంగిపోతి; నా మానస మందెదో తళుకుమన్నది పుష్పవిలాప కావ్యమై"

అని జంధ్యాల వారి సుతిమెత్తని హృదయస్పందనలు ఇక్కడ వినిపిస్తున్నాయి. సువాసనలు వెదజల్లే మంచి గంధం వంటిది, సుకుమారమైన మల్లెపూల పరిమళం వంటిది కరుణశ్రీ వ్యక్తిత్వం. ఎవరినీ నొప్పించని మృదు స్వభావం, సరస సంభాషణా చాతుర్యం ఆయన సొత్తు.

"ఊలు దారాలతో గొంతు కురి బిగించి గుండెలో నుండి సూదులు గ్రుచ్చి కూర్చి ముడుచు-కొందురు ముచ్చట ముడుల మమ్ము అకట! దయలేని వారు మీ యాడువారు"

హాయిగా చెట్లపై ఉన్న పూలను కోసి, సూదులతో గ్రుచ్చి, త్రాళ్ళతో బిగించి మానవులు తమను భోగవస్తువులుగా వాడుకోవడం క్రౌర్యమని పూలు రోదిస్తున్నట్లుగా జంధ్యాల వారు మనముందుంచారు.

"బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు సహజమగు ప్రేమ నీలోన చచ్చెనేమి అందమును హత్యచేసెడి హంతకుండ మైలపడిపోయెనోయి నీ మనుజజన్మ"

అని పూలతో మానవునికి చివాట్లు పెట్టించి, తన ఆరాధ్య దైవమును తలచుకోవడం మానలేదు శాస్త్రి గారు. ఆ రోజుల్లో కరుణశ్రీ గారి పుష్పవిలాపం విన్న స్త్రీలెందరో పుష్పాలను తమ కురులలో అలంకరించుకోవడం మానివేసారని చెప్పడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. శాస్త్రి గారి పుష్ప విలాసం చదివినా, విన్నా పుష్పవనాల జోలికి వెళ్ళి ఆ అందమైన పూలను తెంపడానికి మనసురాదు. ప్రతీ శుభోదయాన పూలమొక్క దగ్గర నిలుచున్న ప్రతి తెలుగు గుండె పులకింతలతో ప్రతిధ్వనిస్తుంది.

దేశభక్తిని కలిగి యుండడం, దేశాన్ని కన్నతల్లిగా భావించడం, తల్లి ఋణం తీర్చుకోవడం వంటి భావనలు భావ కవిత్వంలో ప్రముఖంగా కనిపించే విషయాలు. ఈ విషయాలతోబాటు పురాతనమైన మన సంస్కృతి పట్ల అభిమానాన్ని వ్యక్తపరచడం, కీర్తించడం కలగలిపి "స్వేచ్ఛా పుష్పాలు" అనే ఖండకావ్యం తయారయ్యింది. సన్నివేశాన్ని రమణీయంగా వ్యక్తీకరించడం జంధ్యాల వారి సొత్తు. సుందర సుకుమార కుసుమాల మనోభావాలు ఆంధ్రులలో స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని రగిలించాయి.

"శాంతి పూర్ణ సత్యాగ్రహ సమరమందు జీవితమ్ముల నర్పణ సేయునట్టి ధన్యమూర్తులు నడచెడు దారులందు కాపురము సేయగా కోర్కె గలదు మాకు"

పూల ద్వారా ఒక సందేశాన్ని అందిస్తున్న ఈ పంక్తులు స్వాతంత్ర్యం కోసం జీవితాన్ని అర్పించే ధన్యమూర్తులు నడచే దారులలో నిలిచి పోవాలనే కోరికను వ్యక్తం చేస్తున్నారు శాస్త్రిగారు. అంతేకాదు దేవదాస్య విముక్తికై దీక్షబూనిన త్యాగమూర్తుల పాదపరాగాన్ని ఒంటికి పూసుకోవాలనే కాంక్షకూడా కలదని చెప్తున్నాయి. పూరి గుడిసెల్లో కష్టజీవుల ఆకలి కేకల నిట్టూర్పుల్లో కమిలి పోవాలనే కోరిక కూడా ఉందని చెబుతున్నాయి. ఆధునిక కవిత్వం కేవలం ఆనందం మాత్రమే గాక, సామాజిక ప్రయోగాలు కూడా అందించాలనే సిద్ధాంతానికి కరుణశ్రీ రచనలు చక్కని ఉదాహరణలు. ప్రతి పద్యంలో ప్రతి పాదంలో సందేశం తొణికిసలాడుతుంది.

"దాస్యబంధ విముక్త స్వతంత్ర భరత మాతృకంఠాన ఒక పుష్పమాల యగుచు తల్లి యానంద బాష్పాల తడిసి తడిసి పులకరింపగ అభిలాష గలదు మాకు"

ఆంగ్లేయుల పాలనలో బానిసజీవితం విడిచి, స్వేచ్ఛను ఆస్వాదించాలని "స్వేచ్ఛాపుష్పాలు" ఖండిక ద్వారా పిలుపు నిచ్చారు. ధర్మక్షేత్రమైన ఈ కురుక్షేత్రంలో విద్రోహులను నిర్మూలించి, స్వతంత్ర భారత పతాకం ఎగరేయాలని ప్రబోధించారు.

"ఈశ్వరుని కన్ను కన్న కవీశ్వరుని పెన్ను మిన్న" అన్న నదీరా మాటలు అక్షర సత్యాలు.

కరుణశ్రీ ఒక మాంత్రికుడు. ఆయన కవితను ఒక పదంగా, పాటగా, ఒక మాటగా మరియు ప్రేరణగా మలిచారు. ఆయన దృష్టిలో కరుణ, కవిత్వంలో భావగీతం కలిగిన పరిపూర్ణ పెద్ద మనిషి, ఆయన వ్రాసిన ఉదయశ్రీ 50 కి పైగా పునర్ముద్రణలు పొందిందనే వాస్తవం ఆయన గొప్ప సామర్థ్యాలకు నిదర్శనమని డాక్టర్ సి. నారాయణరెడ్డి గారు అన్నారు. ఈ దేశంలో తెలుగు మాట్లాడే వారున్నంతకాలం, కృష్ణ, గోదావరి, తుంగభద్ర, సువర్ణముఖి నదులు ప్రవహిస్తున్నంత వరకు ఉదయశ్రీ కవితలు తెలుగు సాహిత్యంలో నిలిచియుంటాయని డాక్టర్ నండమూరి రామకృష్ణమాచార్యులన్నారు.

ఏ గతి రచించినా సమకాలమువారు మెచ్చరన్న చేమకూరి వేంకటకవి పలుకులకు అపవాదుగా నిలిచిన వారు జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు. ఒక జాతి కలకాలం జ్ఞాపకముంచుకొనే పద్యరచనా శిల్పాన్ని, శైలిని సృష్టించగలిగిన వాడే మహాకవి. ఆ లక్షణం కరుణశ్రీ కలానికి పుట్టుకతో వచ్చిన మహాగుణమని శ్రీ జి.వి. సుబ్రహ్మణ్యం గారన్నారు. బమ్మెర పోతన తరువాత తెలుగు ప్రజల నాడిని తన కవిత్వంలో ప్రతిబింబింపచేసిన ఏకైక కవి కరుణశ్రీ అని ప్రొఫెసర్ బిరుదురాజు రామరాజు గారిచే కొనియాడబడ్డారు కరుణశ్రీ.

"దివిపైన రవి చంద్రులున్నంత దాక భువిపైన కరుణశ్రీ వర్ధిల్లుగాక"

అని నదీరా అన్నట్లు తెలుగు సాహితీరంగాన చెరగని సంతకంగా నిలిచిన జంధ్యాల వారి దారిలో నడుస్తూ సమత, మమత, కరుణ, ఆర్ద్రతలను పెంపొందించుకొని దేశాన్ని ప్రగతి పథాన నడిపిద్దాం!!.

**ఉపయుక్త గ్రంథసూచి :**


1) ఉదయశ్రీ - కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి

2) కరుణశ్రీ కావ్యమాల (పద్యకావ్యాలు) జంధ్యాల పాపయ్య శాస్త్రి

3) కరుణశ్రీ పై అంతర్జాల ఉపన్యాసాలు

4) ఘంటశాల గానామృతం సి.డి.లు.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# చైతన్య దీప్తి - కుసుమ ధర్మన్న

**కె.ఎం. సౌందర్యవతి**
తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం
చరవాణి: 8374539203

**రచయిత విశేషాలు:-** కుసుమ ధర్మన్న తొలి దళిత కవి. ఈయన తన జాతి హరిజనులు హీనత్వంతో అమానుషంగా బాధపడుతున్న స్థితిని నివారించడానికి సంఘ సంస్కరణ దృష్టితో హరిజన శతకాన్ని రచించారు. ధర్మన్న అంబేడ్కర్, గాంధీజీల ప్రభావంతో స్ఫూర్తిని పొంది, అంటరానితనాన్ని నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో ఆలకింపుమయ్యా! హరిజనుడా! అనే మకుటంతో హరిజన శతకాన్ని తనదైన రచనాశైలిలో రచించారు.

తన జాతి చైతన్యం కోసం తపించిన సంస్కరణ శీలి. వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యుడైన ధర్మన్న ఎన్నో రచనలు చేశారు. ముఖ్యంగా 1) నిమ్నజాతి ముక్తితరంగిణి, 2) నల్లదొరతనం, 3) నిమ్నజాతుల ఉత్పత్తి, 4) అసుర పురాణం (పద్యకావ్యం), 5) అంటరానివాళ్ళా! (కథాసంపుటి), 7) హరిజన శతకం.

**చైతన్య దీప్తి:** ప్రజలు అంటరానితనం అనే విషాన్ని మింగి తిరుగుతున్న తరుణంలో తన జాతి హరిజనులను ప్రబోధిస్తూ హరిజన శతకం ద్వారా వారిలో పాతుకుపోయిన మూఢవిశ్వాసాలను వదిలిపెట్టాలని జన్మహక్కులకై పోరాడమనీ, ప్రాణత్యాగం అయినా అది స్వర్గ మార్గమనీ, ఆత్మాభిమానాన్ని ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలని చైతన్యం కలిగించారు.

ప్రజల్లో పాతుకుపోయిన అంధ విశ్వాసాలకు చరమగీతం పాడాలన్నారు. సామాజిక చైతన్యానికి సాహిత్యం దోహదపడుతుందని ప్రజలకు చైతన్య ప్రబోధం చేయాలని ఆశించిన కుసుమ ధర్మన్న గారు తనదైన శైలిలో ఎన్నో అద్భుతమైన రచనలు వ్రాసి, ప్రజల్లో చైతన్యం కలిగించారు. అందులో ముఖ్యంగా గాంధీజీ స్ఫూర్తితో 1933లో దళితులను ప్రబోధించే లక్ష్యంతో "ఆలకింపుమయ్య హరిజనుండ" అనే మకుటంతో ఆటవెలది పద్యాలతో శతకాన్ని రచించి సాహిత్యంతో ప్రజల్ల చైతన్య దీప్తి కలిగించారు.

పురాతన కాలంలో ప్రజలంతా కులమత బేధాలు లేకుండా అన్నదమ్ముల వలె ఐకమత్యంతో నిశ్చింతగా జీవించేవారు. స్వార్ధపరులైన ప్రజలు, అంటరానితనం అనే విషాన్ని ఉగ్గుపాలలతో రంగరించిపోసి, మోసగించే దళితుల్ని దాసానుదాసులుగా చేశారన్న విషయాన్ని గ్రహించమని ధర్మన్న గారు ప్రబోధించారు. వారిలో చైతన్యాన్ని నింపి, దళితులంతా తమ హక్కులకోసం పోరాడాలని వీరు

కోరారు. హక్కుల పోరాటంలో ప్రాణాలు పోయినా దాన్ని వీరస్వర్గంగా భావించాలని జనులకు హితబోధ చేశారు.

కుసుమ ధర్మన్న తన జాతీయాల్లో ఆత్మగౌరవ స్ఫూర్తిని దీప్తిని కలిగించిన కవి. ధర్మన్న భారతీయ సమాజంలో నెలకొన్న హెచ్చుతగ్గులను నిరసించిన జాతీయ వాది.

ఓ హరిజనుడా! నీ శ్రేయస్సుకై నేను చెప్పే నిజం నీ మనస్సులోపల దర్శించు. పూర్వకాలంలో భూమిపై ప్రజలంతా అన్నదమ్ముల్లా కలసిమెలసి దురాశ, చీకు, చింతా లేకుండా ఉండి చిరంజీవులయ్యారు. ఆనాడు హక్కులూ, ఆస్తులపై అధికారములేవు. నీవు, నేనూ అనే అహంకారం లేదు. మాయా మర్మాలు లేవు.

ఆ రోజుల్లో ప్రజలకు డబ్బుపై ఆశలేదు. పాడిపంటలే వారికి భోగభాగ్యాలు. దేశమాత ఇచ్చిన సంపదలు ప్రోగుచేసి, సంఘసేవ చేసేవారు. అంతేకాక ప్రజలంతా కష్టపడి పనిచేసుకుంటూ, కడుపునిండా తిని, పేదరికం, అనారోగ్యం లేకుండా బతికేవారు. ప్రజల్లో నూతన చైతన్యం ఉరకలు వేసేది. అంతేకాక కడుపునిండి ఒకడు, ఆకలితో అలమటించేవాడు మరొకడు ఉండేవారు కాదు. అందరూ సంతోషంగా, సుఖంగా జీవించేవారు. ఆ రోజుల్లో గ్రుడ్డి, కుంటి వారు తిండి బట్ట లేక, పరుల దగ్గర చేయిచాచేవారు కాదు, వారికి దరిద్రం లేదు.

కృతయుగం దైవ హితంగా సాగింది. మొత్తం ప్రపంచమంతా స్వర్గంగా ఉండేది. కలియుగంలో కృతయుగ ధర్మములు తారుమారు అయ్యాయి. పాపం పెరిగి పోయింది. తినడానికి తిండి లేక ప్రజలు ఆకలితో పస్తులు ఉంటున్నారు. అందరిలో కలహాలు పెరిగిపోయాయి. డబ్బు పై ఆశ పెరిగి, ధర్మం దారితప్పింది.

కుసుమ ధర్మన్న కవితలో మృదుత్వం, భావ వ్యక్తీకరణలో సూటితనం, పద ప్రయోగంలో అర్థ గాంభీర్యం, పీడిత ప్రజలపట్ల ప్రగాఢ ప్రేమానురాగం, కిరాతకమైన వైదిక సాంఘిక వ్యవస్థపట్ల పట్టరాని ఆగ్రహం, హేతుబద్ధమైన తార్కిక దృక్పథం, సామాజిక పరిస్థితులను గూర్చి నిశితమైన అవగాహన ఇవే ధర్మన్న కవితలోని విశిష్ట లక్షణాలు.

ఈటెల్లాంటి మాటలతో, బరిసెల్లాంటి ప్రశ్నలతో అగ్రవర్ణ పెత్తందార్ల గుండెల్లో ఫిరంగి గుళ్ళు విసిరిన వీరాధి వీరుడు ధర్మన్న. మధుర మంజుల మార్దవమైన తేట తెలుగులో దళితుల గతుకుల బతుకుల్లోని వెతల్ని, ధర్మన్న అత్యంత శక్తివంతమైన కవిత ద్వారా "ఆలకింపుమయ్య హరిజనుడ" అనే మకుటంతో "హరిజన శతకం"లో చెప్పారు.

పూర్వకాలంలో సంఘంలో ఎవ్వరూ తమకు కూడు గుడ్డ లేవని కుంటివారమని గుడ్డితనంతో బాధపడుతున్నామని చెప్పుకొని ఇతరుల వద్ద ముష్టి ఎత్తుకొనేవారు కాదు. ఎవరికీ ఆరోజుల్లో పేదరికం

లేదు. ఎవరికీ బాధలు లేవని ఆనాటి సంఘ స్థితిని ధర్మన్న గారు తన హరిజన శతకంలో సవివరంగా తెలియజేసారు మరియు కృత యుగంలో సమస్త జగత్తు స్వర్గంలా ఉండేదని ఆనాటి ప్రజలకు జనన మరణ విచారం లేదని భవగవంతుని ద్యాసలో సుఖంగా ఉండేవారని విరించారు.

కలియుగంలో కృతయుగ ధర్మం తలకిందులైంది. పాప ధర్మములు పండిపోయాయి. కూడు గుడ్డలు లేక ప్రజలంతా ఘోషిస్తున్నారు. అందరిలో కలవరం కలిగింది. కలత పుట్టి ప్రతి ఒక్కరిలో డబ్బుపై ఆశపెరిగి ధర్మ చింతన నశించింది. మనుషుల్లో మాయ అనే పొరకప్పి మంచితనం మాయమైపోయింది. ఎక్కువ, తక్కువ బేధాలు మొదలు పెట్టారు, కుల మతాల పిచ్చి పెరిగి సంఘంలో ఉన్న ధనాన్ని దొంగిలించి కోటిమందిలో ఒకడు కోటీశ్వరుడయ్యాడు. అప్పుడే పేదరికం భయంకరంగా వ్యాపించి కోట్లాది ప్రజలు పేదవారయ్యారు. లోకంలో ధనం లోభులు పాలయ్యింది. ఒకడు పెట్టుబడి పెట్టి బీదల కష్టాన్ని దోచుకుని తాను ధనవంతుడయ్యాడు. అప్పుడే కుసుమ ధర్మన్న తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యాన్ని నింపిన కవీంద్రుడు. అంతేకాక తన జాతి చైతన్యంకోసం తపించిన సంస్కరణశీలి. తన జాతి హరిజనులను ప్రబోధిస్తూ తరుణం మించిపోకుండా మేల్కొని జన్మహక్కులకై పోరాడమని ప్రాణత్యాగం అయినా అది స్వర్గమార్గమని ఆత్మాభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని వారికి చాటి చెప్పాడు.

పురాతన కాలంలో ప్రజలంతా కుల, మత బేధాలు లేకుండా అన్నదమ్ములవలె ఐకమత్యంతో నిశ్చితంగా జీవించేవారు. స్వార్ధపరులైన ప్రజలు అంటరానితనం అనే విషాన్ని ఉగ్గుపాలతో రంగరించి పోసి మోసగించి దళితుల్ని బానిసలుగా చేసారన్న విషయాన్ని గ్రహించమని ధర్మన్న ప్రబోధించారు. దళితులంతా తమ హక్కులకోసం పోరాడాలని వీరు కోరారు. హక్కులపోరాటంలో ప్రాణాలు పోయినా దాన్ని వీరస్వర్గంగా భావించాలని చాటిచెప్పిన ధీశాలి మన కుసుమ ధర్మన్న.

శ్రీ మహావిష్ణువుచే కొనియాడబడే ఓ దళితుడా మీ మంచిని కోరుకొని వివరంగా చెబుతున్నా. ఈ నిజా నిజాలు తెలుసుకో అంతాకాక పూర్వకాలంలో మనుషులకు ఆస్థులపై ఆశలేదు, నేను నువ్వు అని విర్రవీగడంలేదు మచ్చుకకూడా వారికి మాయబుద్ధిలేదు. ఓ దళితుడా వింటున్నావా? పూర్వం ప్రజలకు ధనంపై కోరిక కొంచంకూడా లేదు. ఆధనాన్ని కూడబెట్టి దానిని అనుభవించడం అసలేలేదు. "పాడి పంటలే ఆనాటి వారి భోగ భాగ్యాలు" ఇంకా దేశమాత ఇచ్చే సంపదలను అన్నింటిని పోగుచేసి దానితో సంఘసేవ చేయడానికి శ్రమించేవారు. అదే వారికి మర్యాదనిచ్చేది. అందుకే ఆనాటి ప్రజలు కాయ కష్టం చేసుకుంటూ కడుపునిండా తింటూ కరువు కాటకాలు బారిన పడకుండా, రోగ బాధలు లేకుండా హాయిగా బ్రతికేవారు.

ఓ! దళితుడా! నీకు కులము లేదా? స్థలం లేదా? నీకు గుణ గణములు లేవా? ధనబలం లేదా? బ్రతుకు దారిలేదా? ఎందుకు ఊరూ, పేరూ లేకుండా పడి ఉంటావు? నీవు హిందూ దేశ వాసివి.

భరతమాత ముద్దు బిడ్డవు, అందుకే నీ హక్కులకై పోరాడు గెలుపు అని తన రచనల ద్వారా ప్రజల్లో నూతన చైతన్యాన్ని తీసుకొచ్చి దళిత ప్రజలను కాపాడి, ఎన్నో అద్భుతమైన రచనలు చేసి ప్రజల్లో ధైర్యాన్ని, చైతన్యాన్ని నింపిన మహానుభావుడు – మన కుసుమ ధర్మన్న.

సిరి సంపదలతో తులతూగేది కృతయుగం కలియుగంలో అంతా తారుమారై దేశ సంపదను దోచుకుతినే వారెక్కువైనారు. దళిత ప్రజలను పీడించి వారి సంపద సర్వం లాగేసుకునే స్వార్ధపరులు ఎక్కువయ్యారు. అపుడే సర్వజన బాంధవుడైన "కుసుమ ధర్మన్న" తన రచనల ద్వారా బానిస బతుకుల నుండి దళితులను రక్షించెను.

సంఘ సంస్కర్తగా దోపిడీదారుల ఆటలను కట్టించిన వీరుడు కుసుమ ధర్మన్న. అవిరళ కృషి సల్పి, దళితుల రక్షణకై అస్పృశ్యత, అసమానతలు అంతమొందించెను. భారతదేశానికి లభించాలి స్వేచ్ఛా స్వాతంత్ర్యం అని తన రచనల ద్వారా ఎలుగెత్తిచాటి చెప్పిన ఘనుడు కుసుమ ధర్మన్న.

దళిత ప్రజలకొరకు పాటుపడిన సర్వజన బాంధవుడు ధర్మన్న అన్నిరంగాలలో దళితులు ఉన్నత స్థానంలో నిలబడాలని ప్రబోధించారు ధర్మన్న. విద్యా, వైద్య, వైజ్ఞానిక, వ్యవసాయ రంగాలలో దళితులు అగ్రస్థానంలో ఉండాలని ఆశించిన మహోన్నతుడు కుసుమ ధర్మన్న. పేదరికం సమూలంగా నాశనం కావాలని బడుగు, బలహీనవర్గాల ఆశలు నెరవేరాలని తన రచనల ద్వారా ప్రజల్లో నూతన చైతన్యానికి నాంది పలికిన సర్వోన్నతుడు "కుసుమ ధర్మన్న".

**ఆధార గ్రంథాలు :**

1) హరిజన శతకం

2) తొలి దళిత స్ఫూర్తి కుసుమ ధర్మన్న

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# తెలుగు నాటకం ఒక పరిశీలన

**తోటే చిట్టిబాబు,**
తెలుగు అధ్యాపకులు
డి.యన్.ఆర్. కళాశాల (ఎ), భీమవరం

కావ్యాలలో నాటకం రమ్యమైందిగా ప్రసిద్ధి చెందింది. ప్రాచీన తెలుగు సాహిత్యంలో నాటకాలకు అంతగా ప్రాధాన్యం లేనప్పటికీ క్రమ క్రమేణా తెలుగులో అనేక నాటకాలు వెలువడ్డాయి. ఇటువంటి నాటకాలన్ని సంఘ సంస్కరణలు, సామాజిక అభ్యున్నతికి తోడ్పడ్డాయి. ఆధునిక కాలంలో ప్రదర్శనా యోగ్యమైన నాటకాలు వెలువడి దృశ్యరూపకాలకు మార్గం వేసాయి. ఈ నాటకాలే టి.వి. సీరియల్స్కు, సినిమాలకు మూల కారణాలయ్యాయి.

ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్రలో నాటక సాహిత్యానికి అంతగా ప్రాధాన్యం లేదనే చెప్పాలి. సంస్కృత నాటకాలు కూడా తెలుగులో కావ్య రూపంలోనే అనుసరించ బడ్డాయి. ప్రాచీన సాహిత్యం మొత్తం మీద 15వ శతాబ్దంలో వెలుబడిన క్రీడాభిరామం, వీధి నాటకం తప్ప నాటకాలు వెలువడ లేదు. అయితే శిష్ట జానపదాలకు వారధి అయిన యక్షగానాలు మాత్రం పుంఖాను పుంఖాలుగా వెలువడ్డాయి. ఈ యక్ష గానాలు తెలుగు సాహిత్యంలో నాటక రచనకు పూర్వ రంగాన్ని కల్పించాయని చెప్పవచ్చు. 19వ శతాబ్దం ఉత్తరార్థంలో తెలుగు నాటక రంగంలో సంస్కృత మరియు ఆంగ్ల సాహిత్య ప్రభావంలో అనేక అనువాద మరియు స్వతంత్ర నాటకాలు వెలువడ్డాయి. తొలి తెలగు నాటకం మంజరీ మధుకరీయం (1860) కోరాడ రామచంద్ర శాస్త్రి, వేణీ సంహారమనే సంస్కృత నాటకాన్ని తెలుగు చేసారు. కొక్కొండ వెంకటరత్నం పంతులు నకాసుర వధ అనే సంస్కృత వ్యాసాన్ని 1872లో తెలుగులోకి అనువదించారు. ఆ కాలంలోనే సంస్కృత అభిజ్ఞాన శాకుంతలానికి దాదాపు 10 వరకు అనువాదాలు వెలువడ్డాయి. వీటిని అనువాదం చేసిన వారిలో యం. శేషాచార్యులు, పరవస్తు వెంకట రంగాచార్యులు, కందుకూరి వీరేశలింగం పంతులు ప్రధాన పాత్ర పోషించారు. అటు తర్వాత వావిలాల వాసుదేవశాస్త్రి ఉత్తర రామ చరిత్రను వడ్డాది సుబ్బరాయకవి వేణీ సంహారాన్ని తిరుపతి వేంకట కవులు మృత్య కటికం, మద్రా రాక్షసం నాటకాలను తెలుగులోకి అనువదించారు. ఆంగ్ల సాహిత్యంలోని షేక్ స్పియర్ రచన జ్యూలియస్ సీజర్, సీజర్ చరిత్ర పేరుతో వావివాల వాసుదేవ శాస్త్రి తెలుగులోకి అనువదించారు. అనంతరం వీరేశలింగం పంతులు గారు కూడా సీజర్ చరిత్రను తెలుగులో రాసారు.

20వ శతాబ్దం ప్రథమార్థంలో ప్రదర్శనా యోగ్యమైన నాటకాలు వెలువడడంతో తెలుగు నాటక సాహిత్యం వికాస దశకు చేరుకుంది. ఈ కాలంలో పద్య, గద్య సమ్మిశ్రితం గల నాటకాలు పద్య ప్రాధాన్యం

గల పౌరాణిక నాటకాలు వెలువడగా వాటికి భిన్నమైన సంఘ సంస్కరణ లక్షణాలతో సామాజిక నాటకాలు వెలువడ్డాయి. బళ్ళారి ప్రాంతంలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసాచార్యులు ఒకరి కొకరు పోటీ పడుతూ అనేక నాటకాలు రచించి ప్రదర్శింపచేసారు. కోస్తాంధ్ర ప్రాంతంలో వీరేశలింగం పంతులు గారు, పానుగంటి, చిలకమర్తి, తిరుపతి వేంకట కవులు, బలిజేపల్లి లక్ష్మీకాంతం, గురజాడ అప్పారావు, కాళ్ళకూరి నారాయణరావు లాంటి వారు తెలుగు నాటక రంగ వికాసానికి ఎనలేని కృషి చేసారు.

ఆంధ్ర నాటక పితమహా బిరుదు పొందిన ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1886లో సరస వినోదిని సభ అనే నాటక సమాజాన్ని స్థాపించి అనేక స్వతంత్ర నాటకాలు ప్రదర్శింపచేసారు. ధర్మవరం గారు పాదుకా పట్టాభిషేకం, మోహినీ రుక్మాంగధ, వరూధిని, ఉషా పరిణయం లాంటి పౌరాణిక నాటకాలు, తొలి తెలుగు విషాదాంత నాటకమైన సారంగధర లాంటి చారిత్రక నాటకాలు రచించి తెలుగు నాటక రంగాన్ని పరిపుష్టం చేసారు.

నాట్య శాస్త్రంలో భరతుడు నాటక విశిష్ఠతను చెప్తూ నాటకం నానా భావోప సంపన్నమూ, నానావస్థాంత రాత్మకమూ, నాటకంలో కనిపించని జ్ఞానంగాని, శిల్పం గాని, విద్య గాని, కళ గాని, యోగం గాని, కర్మ గాని లేవే లేవు అన్నారు.

నాటకం దుఃఖార్తులకు, శ్రమార్తులకు, శోకార్తులకు విశ్రాంతినిస్తుంది. అంతేకాదు నాటకం యశస్సును కల్గించి ఆయుష్షు పెంచి, హితం చేకూర్చి, బుద్ధి వికాసానికి కారణమవుతుంది. అందరినీ ఆకట్టుకునే లలిత కళల సమైక్య స్వరూపం నాటకం. మానవుని సృజనాత్మక శీలానికి ప్రతీక.

"కావ్యేషు నాటకం రమ్యమ్" అని లాక్షణికోక్తి. సౌందర్య విలసితమైన సర్వ కళల్లో కావ్యం శాశ్వత మైనది. కావ్యాలలో పద్యం, గద్యం, చంపువు, ద్విపద, కథ, నవల, ఆఖ్యాయిక మొదలైన క్రియలన్నింటిలో శ్రేష్ఠమైనది నాటకం. శ్రవ్యకావ్యం చదివినపుడు, వినినపుడు సహృదయులకే రసాస్వాదన కలుగుతుంది. దృశ్య కావ్యాలు నటులతో రంగస్థలంపై ప్రదర్శించబడతాయి. కనుక సమస్త మానవాళికి ఆనందాన్ని కలిగిస్తాయి. చతుర్విధాభినయాత్మకమైన నాటకంలో ఆహార్యం, ఆంగికం, వాచికం, సాత్వికం, ఒక దానికంటే మరొకటి శ్రేష్ఠ తరమై ప్రేక్షకుని ఆకట్టుకుంటాయి.

"నాటకాంతం హి సాహిత్యం" అన్నారు. సాహిత్య ప్రక్రియలన్నింటిలో నాటకాన్ని రచించడం చాలా కష్టం. నాటక కర్తకు అపారమైన ప్రతిభ, పాండిత్యం, ధారణశక్తి, సృజనతోపాటు లోకానుభం ఉ ండాలి. నాటక రచనను అత్యున్నతమైందిగా, అత్యుత్తమ ప్రజ్ఞగా భావించారు. గొప్ప నాటకాన్ని రచించడం రచయిత ప్రతిభకు గీటురాయి.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

దాదాపు 150 సంవత్సరాల తెలుగు నాటక చరిత్రలో గొప్ప కవులు, పండితులు, మేధావులు, విద్యావంతులు నాటక రచనకు పూనుకోవడం విశేషం. కోరాడ రామచంద్రశాస్త్రి, కొక్కొండ వెంకటరత్నం. పరావస్తు వెంకట రంగాచార్యులు, వావిలాల వాసుదేవ శాస్త్రి గొప్ప పండితులు.

కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, శ్రీరామమూర్తి, కొండభట్ల సుబ్రహ్మణ్య శాస్త్రి, వడ్డాది సుబ్బారాయుడు, నాదేండ్ల పురుషోత్తమ కవి, వేదం వెంకటరాయ శాస్త్రి, తిరుపతి వేంకట కవులు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కోలాచలం శ్రీనివాసరావు, పానుగంటి లక్ష్మీనరసింహం, చిలకమర్తి లక్ష్మీ నరసింహం, కాళ్ళకూరి నారాయణరావు మొదలైన ఉద్దండ కవులు నాటక రంగాన్ని ఉ న్నతస్థితిలో ఉంచడానికి గొప్ప రచనలు చేసిన కవులు మరపురానివారు.

రాయలసీమలో బుద్ధా వెంగళరెడ్డిగారి దాతృత్వాన్ని తెలుగు ప్రజలందరికి పరిచయం చేయాలన్న ఉద్దేశంతో వెంగళరెడ్డి గారి వారసులైన బ్రహ్మానందరెడ్డి గారి ప్రోత్సాహంతో పల్లేటి లక్ష్మీ కులశేఖర్ నాటకాన్ని రచించారు. నాటకంలో వెంగళరెడ్డి గారి దానగుణాన్ని కొనియాడుతూ ముఖ్యంగా కరువులో ఆకలితో అలమటించే ప్రజలను ఆదుకున్న వైనాన్ని వివరించారు. ఇందులో వెంగళరెడ్డి గారి గురువు సీతారామయ్య, సోదరుడు ఈశ్వర్రెడ్డి పాత్రలను ఉదాత్తంగా చిత్రించారు. గంగమ్మ, చిట్టియ్య అనే హాస్య పాత్రలను ప్రవేశపెట్టి ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే ప్రయత్నం చేసారు. సై సై సై - సై వెంగళరెడ్డి నీ సరిజోడు ఎవరయ్యా బంగారు కడ్డీ ఓ బుడ్డా వెంగళరెడ్డి లాంటి ప్రాస వచ్చే పాటలతో ఉర్రూతలూగించారు. పాతరలందు దాస్యమును పాలి జనమ్ముల మాడ్చు ఆకలిన్ పాతరవేసి పూడ్చుటకు భావమునందున శంక లేక వి 1 ఖ్యాతిని పంచి ఈ కరువు కాటక దుస్థితి పారదోలి ఈ భీతిని మాపుడయ్యా మన పేర్మికి యిద్ది అదృష్టయోగమా ॥

లాంటి సరళమైన పద్యాలతో నాటకం ప్రేక్షకుల్ని ఆకట్టుకొనే విధంగా ఉంది. కర్నూలు జిల్లాలో నాటకాన్ని పెక్కు చోట్ల ప్రదర్శించారు.

తెలుగు నాటక వికాసం 19వ శతాబ్దంలో ఆధునిక రూపం దాల్చి కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు వంటి సంస్కరణ వాదులతో సామాజిక నాటకం అభివృద్ధి చెందింది.

నాటకం అనేది ఒక శ్రవణ సహిత దృశ్య రూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం.

తొలి తెలుగు నాటకం విషయంలో భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. కాని ఆధునిక కాలంలో తొలి స్వతంత్ర తెలుగు నాటకంగా మంజరీ మధుకరీయం ఇది అద్భుతమైన నాటకం.

తెలుగు నాటకాలు అంటే రంగస్థలంపై ప్రదర్శించేందుకు ఉద్దేశించిన నాటక రూపాలు. ఇందులో పౌరాణిక, సాంఘిక, జానపద నాటకాలు ముఖ్యమైనవి. కన్యాశుల్కం పాండవోద్యోగ విజయాలు వంటివి

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

ప్రసిద్ధి చెందాయి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు, గురజాడ అప్పారావు, వేదం వెంకటరాయ శాస్త్రి వంటి వారు ప్రముఖ రచయితలు.

తెలుగు నాటకాలు సమాజానికి నైతిక విలువలు, వినోదాన్ని అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయి.

**పౌరాణిక నాటకాలు :** పాండవోద్యోగ విజయాలు శ్రీకృష్ణ తులాభారం, గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, బొబ్బిలి యుద్ధం.

**సాంఘిక నాటకాలు** : కన్యాశుల్కం, గురజాడ అప్పారావు, అడుగు జాడలు.

**జానపద వీధి నాటకాలు:** కాటమరాజు కథ, పాతాళభైరవి (సురభి).

**చారిత్రక నాటకాలు :** ప్రతాప రుద్రీయం, లవకుశ.

ప్రముఖ నాటక రచయితలు: ధర్మవరం కృష్ణమాచార్య, ఆంధ్ర నాటక పితామహుడుగా పేరగాంచారు.

**గురజాడ అప్పారావు :** మొదటి తెలుగు సాంఘిక నాటకం "కన్యాశుల్కం" రచించారు.

**వేదం వేంకటరాయ శాస్త్రి :** పాత్రోచిత బాషను ప్రవేశ పెట్టారు.

**బలిజేపల్లి లక్ష్మీకాంతం కవి :** సత్య హరిశ్చంద్ర నాటకం తెరమరుగవుతన్న నాటక రంగం మరలా ప్రాణం పోసి జీవింప చేయలనేది ప్రధాన ఉద్దేశ్యం.

తెలుగు నాటకం పుట్టుక జానపద కళల నుండి ప్రారంభమై 19వ శతాబ్దంలో సంస్కృతం, ఆంగ్ల అనువాదాలతో ఆధునిక రూపం సంతరించుకుంది. కందుకూరి వీరేశలింగం వ్యవహార ధర్మబోధినతో ప్రదర్శనలు ఊపందుకున్నాయి. వికాసం క్రమంలో సాంఘిక సమస్యలపై నాటకాలు, పద్య నాటకాలు (తిరుపతి వేంకట కవులు) వచ్చాయి. చివరకు పరిషత్ నాటకాలు వంటి ప్రయోగాలు జరిగి నాటకరంగం విలసిల్లింది. ఇది చరిత్ర సంస్కృతిని ప్రతిబింబిస్తూ సామాజిక మార్పునకు దోహదపడింది.

**జానపద మూలాలు :** ప్రాచీన కాలం నుంచే నీడల బొమ్మలాటలు, నృత్య నాటకాలు వంటి జానపద రూపాలు తెలుగునాట ఉండేవి. ఇవి నాటకానికి పునాది వేసాయి. నాటకాంతం హి సాహిత్యం అన్నారు మహాకవి కాళిదాసు. అంటే అన్ని సాహిత్య ప్రక్రియలలోను చివరిగా స్పర్శించవలసిన అంకం. నాటకమని అర్థం. కవిత్వం, వ్యాసం, కథ ఇలా అన్ని సాహిత్య ప్రక్రియలను స్పృశించిన తర్వాత మాత్రమే నాటకాన్ని రచించాలని ఆయన తెలిపాడు. అప్పుడు మాత్రమే నాటక రచనకు నిండుదనం చేకూరుతుందని ఆయన భావన. ప్రపంచ సాహిత్యంలో మాళవికాగ్ని మిత్రం అభిజ్ఞాన శాకుంతలం వంటి నాటకాల ద్వారా చిరస్థాయిగా నిలిచిపోయిన కాళిదాస అభిప్రాయం నూటికి నూరు పాళ్ళు నిజమని ఆధునిక రచయితలు మనస్పూర్తిగా అంగీకరిస్తారు. నాటకానికి అంత శక్తి వుంది కాబట్టే నాటకం రసాత్మక కావ్యం.

నాటకం అంటే నటనలు వేదికపై ప్రదర్శించేందుకు రాసిన కథల రూపం అని సంభాషణలు మరియు చర్యల ద్వారా కథను చెబుతుంది. ప్రేక్షకులకు వినోదాన్ని, ఆలోచనలను అందిస్తుంది. ఇది ఒక సాహిత్య ప్రక్రియ. దీనిలో సంఘర్షణలు, పాత్రల భావోద్వేగాలు ఉంటాయి. నాటకం అనే పదం గ్రీకు పదం (డ్రాన్) అబినయించడం నుండి వచ్చింది. సరళంగా చెప్పాలంటే నాటకం అనేది చదవడానికి కాకుండా ప్రత్యక్షంగా ప్రదర్శించి చూసేందుకు ఉద్దేశించి కథా రూపం దీనిలో జీవితంలోని వివిధ కోణాలు, బావోద్వేగాలను నటులు ప్రదర్శిస్తారు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# తెలుగు నాటకం: చారిత్రక పరిణామం మరియు ఆధునిక దృక్కోణం

**Santhi Dhanavath**
Ph.D. Research scholar
Suravaram prathapa Reddy Telugu university
Janapada girijana vignana peetam (warangal)
Email: drsanthidhanavath17@gmail.com
Phone: 8125651308

**సారాంశం:** నాటకం లేదా డ్రామా మానవ జీవనానుభవాలను ప్రత్యక్షంగా ఆవిష్కరించే అత్యంత ప్రభావవంతమైన సాహిత్య-కళా రూపంగా నిలిచింది. భారతీయ సాహిత్య సంప్రదాయంలో, ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో, నాటకానికి విశిష్టమైన స్థానం ఉంది. సామాజిక చైతన్యాన్ని పెంపొందించడం, నైతిక విలువలను బలపరచడం, రాజకీయ ఆలోచనలను వ్యక్తీకరించడం, సాంస్కృతిక భావజాలాన్ని ప్రజలలో వ్యాప్తి చేయడం వంటి అంశాలలో నాటకం కీలక పాత్రను నిర్వహించింది. ఈ పరిశోధనా వ్యాసం ప్రాచీన కాలం నుండి ఆధునిక యుగం వరకు తెలుగు నాటక పరిణామాన్ని విశ్లేషిస్తూ, నాటక స్వరూపం, లక్షణాలు, రకాలు, సామాజిక ప్రాధాన్యం, ప్రముఖ నాటకకర్తల పాత్ర మరియు ఆధునిక రంగస్థలానికి ఎదురయ్యే సవాళ్లను సమగ్రంగా పరిశీలిస్తుంది. నాటకం కేవలం వినోదాన్ని అందించే సాధనం మాత్రమే కాకుండా, సమాజాన్ని చైతన్యపరిచి మార్గనిర్దేశం చేసే శక్తివంతమైన మాధ్యమమని నిరూపించడమే ఈ వ్యాసం ప్రధాన లక్ష్యం.

**కీలక పదాలు :** భారతీయ నాటక సంప్రదాయం, యక్షగానం మరియు వీధినాటకం రంగస్థల కళ, సామాజిక చైతన్యం,నాటక స్వరూపం, నాటకకర్తలు.

**1. పరిచయం:** మనిషి తన అంతర్మనోభావాలను, జీవనానుభవాలను, ఆలోచనలను ఇతరులకు తెలియజేయడానికి సాహిత్యాన్ని ఒక ప్రభావవంతమైన మాధ్యమంగా స్వీకరించాడు. ఆ సాహిత్య ప్రక్రియలలో నాటకానికి ప్రత్యేకమైన స్థానం ఉంది. కవిత్వం పఠనం ద్వారా ఆస్వాదించబడితే, నాటకం ప్రత్యక్షంగా వీక్షించి అనుభవించాల్సిన జీవంత కళ. సంభాషణ, శరీర కదలిక, హావభావాలు, సంగీతం, వేషధారణ వంటి అనేక కళారూపాల సమ్మేళనంతో నాటకం సంపూర్ణ కళారూపంగా వికసించింది.

తెలుగు సాహిత్య చరిత్రలో నాటకానికి ఘనమైన పరంపర ఉంది. యక్షగానం, వీధినాటకం, భాగవత మేళా వంటి ప్రజానాట్య సంప్రదాయాల నుంచి ఆధునిక, ప్రయోగాత్మక నాటక రూపాల వరకు

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

తెలుగు నాటకం విస్తృతమైన పరిణామాన్ని సాధించింది. ఈ వ్యాసం ఆ పరిణామాన్ని చారిత్రక, సామాజిక మరియు సాహిత్య కోణాల్లో శాస్త్రీయంగా విశ్లేషించాలనే లక్ష్యంతో రూపొందించబడింది.

**2. నాటకం - అర్థం మరియు నిర్వచనం:** "నాటకం" అనే పదం సంస్కృత భాషలోని "నట" అనే ధాతువునుంచి పుట్టింది. నటించుట, అభినయించుట అనే భావాలే ఈ పదానికి మూలార్థాలు. మానవ జీవనంలోని సంఘటనలను, భావాలను, ఆలోచనలను పాత్రల రూపంలో, సంభాషణల సహాయంతో రంగస్థలంపై ప్రత్యక్షంగా ఆవిష్కరించేది నాటకం. ఇది కేవలం చదివే సాహిత్య రూపం మాత్రమే కాకుండా, చూసి అనుభవించే జీవంత కళగా గుర్తింపు పొందింది. మాటలతో పాటు హావభావాలు, కదలికలు, వేషధారణ, సంగీతం వంటి అనేక అంశాల సమన్వయం ద్వారా నాటకం సంపూర్ణ కళారూపంగా రూపుదిద్దుకుంటుంది.

భారతీయ నాట్యశాస్త్ర పితామహుడైన భరతముని తన ప్రసిద్ధ గ్రంథం నాట్యశాస్త్రంలో నాటకాన్ని "లోకవృత్తానుకరణం"గా నిర్వచించాడు. అంటే సమాజంలో కనిపించే జీవన విధానాలు, ఆనంద-వేదనలు, ఆచారాలు, విలువలను కళాత్మకంగా అనుకరించి చూపించేదే నాటకం. ఈ నిర్వచనం నాటకానికి ఉన్న సామాజిక ప్రాధాన్యతను స్పష్టంగా తెలియజేస్తుంది.

**3. భారతీయ నాటక సంప్రదాయం సంక్షిప్త అవలోకనం:** భారతదేశంలో నాటక సంప్రదాయం సుదీర్ఘమైన మరియు సమృద్ధమైన చరిత్రను కలిగి ఉంది. ప్రాచీన కాలం నుంచే నాటకం సాహిత్యంతో పాటు నాట్యకళగా వికసించింది. సంస్కృత సాహిత్యంలో కాళిదాసుని అభిజ్ఞాన శకుంతలం, భాసుని స్వప్న వాసవదత్త, శూద్రకుని మృచ్ఛకటిక వంటి నాటకాలు భారతీయ నాటక సంప్రదాయానికి దృఢమైన పునాదులను ఏర్పరిచాయి. ఈ నాటకాలు మానవ భావోద్వేగాలు, సామాజిక పరిస్థితులు, నైతిక విలువలను కళాత్మకంగా ప్రతిబింబించాయి.

భరతముని రచించిన నాట్యశాస్త్రంలో ప్రతిపాదించిన రస సిద్ధాంతం నాటకానికి ప్రాణంగా నిలిచింది. శృంగార, వీర, కరుణ, హాస్య, రౌద్ర, భయానక, బీభత్స, అద్భుత, శాంత అనే తొమ్మిది రసాలు నాటకానుభూతిని సంపూర్ణం చేస్తాయి. ఈ రస సిద్ధాంత ప్రభావం తెలుగు నాటక సంప్రదాయంలో కూడా స్పష్టంగా దర్శనమిస్తుంది.

**4.1 యక్షగానం మరియు వీధినాటకం:** యక్షగానం, వీధినాటకం వంటి ప్రజానాట్య రూపాలు తెలుగు నాటక సంప్రదాయానికి ప్రాథమిక ఆధారాలుగా నిలిచాయి. ఈ నాటకాల్లో సంగీతం, పద్యరచన, నృత్యభంగిమలు ప్రధాన పాత్రను పోషించాయి. పురాణ, ఇతిహాస కథలతో పాటు స్థానిక జీవన సంఘటనలను ఆధారంగా చేసుకొని ఇవి ప్రజలకు చేరువయ్యాయి. ముఖ్యంగా వీధినాటకం ప్రజల మధ్య

ప్రత్యక్షంగా ప్రదర్శించబడుతూ, సామాన్యుల జీవన స్థితిగతులు, సమస్యలు, సామాజిక అసమానతలను ప్రభావవంతంగా ప్రతిబింబించింది. వినోదంతో పాటు సామాజిక అవగాహన కలిగించడం వీటి ముఖ్య ఉద్దేశ్యంగా ఉండేది. ఈ ప్రజానాట్య ప్రక్రియలు తెలుగు నాటక వికాసానికి పునాదులు వేసి, ఆధునిక రంగస్థల నాటకాలకు మార్గదర్శకంగా నిలిచాయి.

**5. ఆధునిక తెలుగు నాటకోదయం:** 19వ శతాబ్దం చివరి దశలో మరియు 20వ శతాబ్దం ప్రారంభ కాలంలో ఆధునిక తెలుగు నాటకం స్పష్టమైన రూపాన్ని సంతరించుకుంది. ఈ దశలో పాశ్చాత్య నాటక సంప్రదాయాల ప్రభావం తెలుగు నాటకంపై గణనీయంగా కనిపించింది. ఆంగ్ల విద్య విస్తరణతో పాటు ఆధునిక ఆలోచనలు సమాజంలో వ్యాప్తి చెందడం నాటక రూపంలో మార్పులకు దారితీసింది. అలాగే సామాజిక సంస్కరణ ఉద్యమాలు, జాతీయ చైతన్యం, మానవతా విలువల ప్రాచుర్యం నాటక ఇతివృత్తాలను కొత్త దిశగా మలిచాయి. ఫలితంగా పురాణ ఆధారిత నాటకాల స్థానంలో సామాజిక సమస్యలు, వాస్తవ జీవిత అనుభవాలను ప్రతిబింబించే ఆధునిక తెలుగు నాటకాలు అవతరించాయి.

**5.1 గురజాడ అప్పారావు ఆధునిక నాటక పితామహుడు:** గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు నాటకానికి పితామహుడిగా విశేష గౌరవాన్ని పొందారు. ఆయన రచించిన కన్యాశుల్కం తెలుగు నాటక చరిత్రలో ఒక మైలురాయిగా **నిలిచింది**. ఈ నాటకం ద్వారా బాల్యవివాహాలు, కులవ్యవస్థ, ఆర్థిక దోపిడీ వంటి సామాజిక దురాచారాలను తీవ్రంగా విమర్శించారు. సమాజంలో నెలకొన్న అన్యాయాలను హాస్యం, వ్యంగ్యంతో కలిపి ప్రజల ముందుకు తీసుకువచ్చిన తీరు ప్రత్యేకమైనది. కన్యాశుల్కంలో వినియోగించిన వ్యావహారిక భాష, సహజ సంభాషణలు, జీవంతో కూడిన పాత్రచిత్రణ తెలుగు నాటకానికి నూతన దిశను చూపించాయి. ఫలితంగా నాటకం వినోద సాధనంతో పాటు సామాజిక మార్పుకు శక్తివంతమైన మాధ్యమంగా మారింది.

**6. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటకాలు:** స్వాతంత్ర్యోద్యమ కాలంలో నాటకం ప్రజలను చైతన్యపరచే శక్తివంతమైన రాజకీయ ఆయుధంగా రూపాంతరం చెందింది. దేశభక్తి భావన, స్వేచ్ఛాపై ఆకాంక్ష, బ్రిటిష్ వలస పాలనపై నిరసన వంటి అంశాలు నాటకాల ఇతివృత్తాలుగా మారాయి. ఈ నాటకాలు ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని పెంపొందించి, ఉద్యమంలో పాల్గొనే ప్రేరణను కలిగించాయి.

ఈ దశలో వీధినాటకాలు అత్యంత కీలక పాత్రను నిర్వహించాయి. తక్కువ ఖర్చుతో, సులభంగా ప్రదర్శించగలిగే స్వభావం వల్ల ఇవి నేరుగా ప్రజల మధ్యకు చేరాయి. ఉద్యమ భావజాలాన్ని సరళమైన భాషలో, ప్రభావవంతంగా వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమానికి నాటకాలు బలమైన మద్దతుగా నిలిచాయి.

**7. స్వాతంత్ర్యానంతర తెలుగు నాటకం:** స్వాతంత్ర్యం అనంతరం తెలుగు నాటకం కొత్త సామాజిక వాస్తవాలను ప్రతిబింబించే దిశగా ముందుకు సాగింది. మారుతున్న కాలానుగుణంగా పట్టణీకరణ, నిరుద్యోగ సమస్య, కుటుంబ వ్యవస్థలో వచ్చిన మార్పులు, మహిళల సామాజిక స్థితి వంటి అంశాలు నాటకాల ఇతివృత్తాలుగా మారాయి. సమాజంలో ఏర్పడిన ఆర్థిక, మానసిక సంక్షోభాలను నాటకం సున్నితంగా ప్రతిబింబిస్తూ ప్రజల ఆలోచనలను చైతన్యపరిచింది.

**7.1 సామాజిక వాస్తవవాద నాటకాలు:** ఈ కాలంలో సామాజిక వాస్తవవాద నాటకాలు విశేషంగా వికసించాయి. సమాజంలో ఉన్న అసమానతలు, అణచివేతలు, అన్యాయాలు, మధ్యతరగతి జీవితంలో కనిపించే ఒత్తిళ్లు నాటకాల ద్వారా స్పష్టంగా వ్యక్తమయ్యాయి. వాస్తవ జీవితానికి దగ్గరగా ఉన్న పాత్రలు, సంఘటనలు ఈ నాటకాలకు బలాన్ని ఇచ్చి, నాటకాన్ని సామాజిక విమర్శకు ప్రభావవంతమైన మాధ్యమంగా మార్చాయి.

**8. ప్రముఖ తెలుగు నాటకకర్తలు మరియు వారి కృషి:** తెలుగు నాటక వికాసంలో అనేక ప్రముఖ నాటకకర్తల కృషి కీలకంగా నిలిచింది. వీరి రచనలు నాటకాన్ని కేవలం వినోదమాత్రం కాకుండా, సామాజిక చైతన్యం, మార్పుకు ప్రభావవంతమైన మాధ్యమంగా మార్చాయి.

**8.1 గురజాడ అప్పారావు:** గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు నాటకానికి స్థిరమైన పునాదులు వేయడంలో ప్రముఖుడు. కన్యాశుల్కం వంటి నాటకాల ద్వారా సమాజంలోని దుర్వినియోగాలు, కులవ్యవస్థ సమస్యలను తీవ్రంగా విమర్శించి, నాటకానికి నూతన దిశని చూపించారు.

**8.2 కందుకూరి వీరేశలింగం:** కందుకూరి వీరేశలింగం నాటకాన్ని సామాజిక సంస్కరణల ప్రచార సాధనంగా ఉపయోగించారు. మహిళా విద్య, విధవా వివాహం వంటి సమాజ సమస్యలను నాటకాల ద్వారా ప్రజలకు పరిచయం చేశారు.

**8.3 శ్రీశ్రీ, తెనాలి రామకృష్ణ, ఆచార్య ఆత్రేయ:** శ్రీశ్రీ, తెనాలి రామకృష్ణ, ఆచార్య ఆత్రేయ వంటి రచయితలు నాటకాన్ని సామాజిక విమర్శ, మానవీయ విలువల ప్రతిపాదనకు శక్తివంతమైన సాధనంగా మలిచారు. సమాజంలో చైతన్యాన్ని ప్రేరేపించారు.

**9. నాటక నిర్మాణం అంశాలు:** నాటక నిర్మాణంలో కథ, పాత్రలు, సంభాషణలు, దృశ్య నిర్మాణం, రంగస్థల అమరిక వంటి అంశాలు కీలకంగా పరిగణించబడతాయి. ఈ అంశాల సమగ్ర సమన్వయం నాటకాన్ని సమర్థవంతమైన, ప్రేక్షకులపై ప్రభావం చూపే కళారూపంగా తీర్చిదిద్దుతుంది.

**9.1 పాత్రచిత్రణ:** పాత్రలు సజీవంగా, సహజంగా ఉండటం అవసరం. వారి భావోద్వేగాలు, ఆలోచనలు, కదలికలు నాటకానికి ప్రాణాన్ని నింపుతాయి. ప్రతి పాత్ర దృశ్యాన్ని ప్రభావవంతంగా మార్చే విధంగా, వ్యక్తిత్వాన్ని స్పష్టంగా ప్రతిబింబించాలి.

**9.2 సంభాషణలు:** సంభాషణలు సరళమైనవి, సహజమైనవి మరియు సందర్భానికి అనుగుణమైనవి కావాలి. వీటి ద్వారా కథను ముందుకు నడిపించి, ప్రేక్షకుల ఆసక్తి, కలయికను కొనసాగించాలి. సమాజంలో వాడే భాషా శైలిని అనుసరించడం సంభాషణలకు ప్రాణాన్ని నింపుతుంది.

**10. నాటకం మరియు సమాజం**: నాటకం సమాజానికి అద్దం వలె పనిచేస్తుంది. సమాజంలో ఏర్పడే మార్పులు, సమస్యలు, ఆశలు, భావాలు నాటకాలలో స్పష్టంగా ప్రతిబింబిస్తాయి. ఒకవైపు నాటకం సమాజాన్ని నిజస్వరూపంలో చూపిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తుంది; మరోవైపు సమాజాన్ని మెరుగైన మార్పుల వైపుకు ప్రేరేపించే శక్తినీ కలిగి ఉంటుంది. నాటకాల్లో సామాజిక అసమానతలు, నైతిక సంక్షోభాలు, వ్యక్తిగత మరియు సామూహిక ఆందోళనలు సజీవంగా ప్రదర్శించబడతాయి. అదనంగా, నాటకం వ్యక్తుల మనోభావాలు, ఆశలు, ఆందోళనలను చూపిస్తూ, ప్రేక్షకులను అవగాహనకు, సామాజిక చైతన్యానికి ప్రేరేపిస్తుంది. కాబట్టి, నాటకం కేవలం వినోదానికి పరిమితం కాకుండా, సామాజిక సమస్యలపై అవగాహన పెంచే, ప్రజలను సమాజ మార్పుకు దారి చూపించే శక్తివంతమైన మాధ్యమంగా మారింది. సమాజం, వ్యక్తి, మానవీయ విలువల మధ్య సంబంధాన్ని స్పష్టంగా ప్రతిబింబించడం ద్వారా నాటకం సమాజ పరిణామంలో ముఖ్యమైన పాత్రను కొనసాగిస్తుంది.

**11. ఆధునిక కాలంలో నాటక రంగ సవాళ్లు:** ఆధునిక కాలంలో తెలుగు నాటక రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. సినిమా, టెలివిజన్, డిజిటల్ మీడియా వంటి వినోద మాధ్యమాల ప్రభావం కారణంగా సాంప్రదాయ నాటకాల ప్రేక్షకులు తగ్గుముఖం అయ్యారు. ఆధునిక ప్రేక్షకులు వేగవంతమైన, సులభంగా పొందగలిగే వినోదాన్ని కోరడం వల్ల సాంప్రదాయ నాటకాల ఆకర్షణ తగ్గింది. అలాగే, ఆధునిక జీవన శైలి, పట్టణీకరణ, ఇంటర్నెట్ వినియోగం వంటి అంశాలు నాటక ప్రదర్శనలకు ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి.

అయితే, ఈ పరిస్థితుల్లో కూడా ప్రయోగాత్మక నాటకాలు, వీధినాటకాలు సామాజిక చైతన్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్రను కొనసాగిస్తున్నాయి. సమాజంలోని సమస్యలపై అవగాహన కలిగించడం, సమానత్వం, న్యాయం, మానవీయ విలువలను ప్రేరేపించడం వీటిద్వారా సాధ్యమవుతుంది. యువతలో చైతన్యాన్ని పెంపొందించడం. సమాజ మార్పుకు దారి చూపించడం ఈ నాటకాల ప్రధాన లక్ష్యం. అందువల్ల ఆధునిక సవాళ్ల మధ్యన కూడా నాటక రంగం తన ప్రాముఖ్యతను నిలబెట్టుకుని, కొత్త పద్ధతులు, వినూత్న ప్రయత్నాల ద్వారా సంప్రదాయాన్ని జీవనోపయోగకంగా కొనసాగిస్తోంది.

**12. ముగింపు:** తెలుగు నాటకం ఒక సజీవ, సమృద్ధి చెందిన సాహిత్య కళా సంప్రదాయం. కాలానుగుణంగా రూపంలో మార్పులు వచ్చినప్పటికీ, దాని ప్రధాన లక్ష్యం మానవ జీవితానుభవాలను ప్రతిబింబించడం స్థిరంగా ఉంది. నాటకం కేవలం వినోద సాధనమే కాకుండా, విద్య, సామాజిక చైతన్యం,

మానవీయ విలువలను నిలుపుదల చేయడంలో శక్తివంతమైన మాధ్యమంగా నిలిచింది. స్వాతంత్ర్యోద్యమం, ఆధునిక సామాజిక సమస్యలు, మహిళా సాధికారత వంటి అంశాలు నాటక విషయాంశాలుగా మారడం దీని సామర్థ్యాన్ని స్పష్టంగా చూపుతుంది. ఆధునిక సవాళ్ల మధ్యన కూడా వీధినాటకాలు, ప్రయోగాత్మక నాటకాలు సమాజానికి చైతన్యాన్ని కల్పిస్తూ, ప్రజలలో అవగాహన పెంపొందిస్తూ కొనసాగుతున్నాయి. భవిష్యత్తులో తెలుగు నాటకం కొత్త ఆలోచనలు, వినూత్న ప్రయోగాల ద్వారా సంప్రదాయాన్ని బలపరచి, సమాజానికి వినోదం, చైతన్యం రెండింటినీ సమానంగా అందిస్తూ కొనసాగుతుందని నిశ్చితంగా చెప్పవచ్చు.

**సూచన గ్రంథాలు**


1. సుదర్శన్, పి. (2015). తెలుగు నాటక చరిత్ర. హైదరాబాద్: తెలుగు అకాడమీ.
2. రావు, ఎం.వెం. (2012). ఆధునిక తెలుగు నాటక పరిణతి. విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణలు.
3. కృష్ణమూర్తి, జి. (2008). నాటక శాస్త్రం మరియు సాంప్రదాయాలు. తూర్పు గోదావరి: సాహిత్య సర్వీస్.
4. శ్రీధర్, పి.వి. (2010). యక్షగానం, వీధినాటకం: ఒక పరిశీలన. విశాఖపట్నం: తెలుగు పరిశోధనా కేంద్రం.
5. అప్పారావు, గురజాడ. (1917). కన్యాశుల్కం. చెన్నై: సాహిత్య ప్రచురణలు.
6. వీరేశలింగం, కందుకూరి. (1930), సామాజిక నాటకాలు, విజయవాడ: తెలుగు నాటక మాలిక.
7. భరతముని. (2005). నాట్యశాస్త్రం (సంవత్సరావధి అనువాదం). హైదరాబాద్: తెలుగు అకాడమీ.
8. శ్రీశ్రీ, (1960). సామాజిక నాటకాలు, హైదరాబాద్: ప్రకాశన్.
9. రామకృష్ణ, తెనాలి. (1975). తెలుగు నాటక: సమీక్ష మరియు విశ్లేషణ. హైదరాబాద్: సాహిత్య పరిశోధన కేంద్రం.
10. ఆత్రేయ, ఆచార్య. (1980). నాటక రచనా విధానం. చెన్నై: సాహిత్య సర్వీస్.
11. నారాయణ, డి. (2011). ప్రజానాటకాలు మరియు సామాజిక చైతన్యం. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.
12. శర్మ, ఎం. (2009). ప్రయోగాత్మక నాటకాలు: ఆధునిక దిశలు. విజయవాడ: సాహిత్య సర్వీస్.
13. రమణ, సి. (2013). స్వాతంత్ర్యోద్యమ కాల నాటకాలు. హైదరాబాద్: తెలుగు అకాడమీ.

14. లక్ష్మి, ఎం. (2016). ఆధునిక తెలుగు నాటక: సవాళ్లు మరియు అవకాశాలు. తిరుపతి: సాహిత్య ప్రచురణలు.
15. వెంకటేశ్వర్లు, బి. (2018). నాటక మరియు సమాజం: సమకాలీన పరిశీలన. విశాఖపట్నం: తెలుగు సాహిత్య పరిశోధన కేంద్రం.

# తెలుగు సాహిత్యంలో వచన కవిత్వం - సామాజిక చిత్రణ

**పి. యామిని అమ్మాజి**
డి.ఎస్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఒంగోలు
Mob: 9704821385

"సంఘ సంద్రాన్ని చిలికితే,
కవిత్వామృతం దొరికేను ! ధన్వంతరియో !
మోహినయో కవి క(రా)లాన సుధలొలికేను !
ముకురమై, సుచిరమై మధురమై
రుధిర మై కవితాఝరి సాగేను"

**ఉపోద్ఘాతము:** పద్యరూపంలోనున్న ప్రాచీన సాహిత్యం సమాజంలోని ఉన్నత వర్గాలను మాత్రమే చిత్రించినది అని భావించిన మేధావులు సమాజంలోని అన్ని కోణాలను స్పృశించే ఆధునిక కవిత్వానికి తెరతీశారు. ఇది భావ కవిత్వంలో మొదలయినా, "పాత సీసాలో కొత్త సారా పోసినట్లు" భావకవిత్వం పద్యాల స్థానంలో గేయాలు లేదా గీతాలను తెచ్చింది తప్ప లక్ష్యపరమైన, సమూలమైన మార్పు తీసుకరాలేదని అభ్యుదయ కవిత్వం దూసుకొచ్చింది. కవిత్వపు లక్ష్యం, లక్షణం, భాష అన్నింటిలో సమూలమైన మార్పు ఈ కవిత్వం తెచ్చింది. దీని నుండి పుట్టినది వచన కవిత్వం. ప్రజా జీవితాను సమగ్రంగా చిత్రించడమే ఆధునిక కవిత్వ లక్షణం కనుక వచన కవిత్వం ఆ పనిని దిగ్విజయంగా చేస్తూ శాఖోపశాఖలై విస్తరిల్లింది.

**వచన కవిత్వం ఆవిర్భావం:** ఫ్రాన్స్ యొక్క లో మొదలై, ఆంగ్లంలో ఆర్నాల్డ్ యొక్కగా ఆ స్ఫూర్తితో తెలుగులో వచన కవిత్వంగా ఆవిర్భవించింది.

**వచన కవిత్వం వివిధ నిర్వచనాలు:**

పట్టాభి వచన పద్యం
సినారె వచన గేయం
ఆవంత్స సోమసుందర్ ముక్త చందస్సు
శిష్ట ఉమామహేశ్వరరావు - ప్రహ్లాద కవిత్వం
వరవరరావు స్వచ్ఛంద కవిత

ఇంకా అనేకులు వచన గీతం అని కూడా అన్నారు చర్చోప చర్చల తర్వాత వచన కవిత్వం స్థిరపడింది.

**తొలి వచన కవిత్వం:** 1930లో ముద్దుకృష్ణ గారి జ్వాలలో అచ్చయిన "తురాయి" తొలి వచన కవిత అని ఆరుద్ర గారు అభిప్రాయపడ్డారు. విమర్శకులు ఉమామహేశ్వర రావు గారి తొలి వచన కవిగా పేర్కొంటున్నారు (విష్ణువు నవమి చిలుక)

**నవమి చిలుక నుండి:-**

<u>పైనం :</u>

రెండ్లెడ్ల బండదుగో ! గండ్లమెడల యెడ్లవిగో! గణ గణల మంటున్నయి !
మూటలో బువ్వేసి బువ్వ మూటందుకో! పోవాలి పొరుగూరు. లెగుతుండయ్ పచ్చులు, గణ గణల మంటున్నయి!

వరి బియ్యం దరలేదు డబ్బూ దస్కం లేదు! కాస్తో కూస్తో వడ్లమ్మి డబ్బూ దస్కం తెత్తాను! పొరుగూరు పోవాలి, పొరుగాళ్ళు లేచారు, గణ గణల మంటున్నాయి!

ముంతలో మూలుగులు మూలుగుల ముంతలో గణ గణల మంటున్నాయి ! తలగుడ్డ చుట్టనీ, చెర్నాకోలందుకో ! సిగ్గాయ్య జాగ్రత్త ! ఇంటికాడ బద్రం ! సిన్నమ్మాయి జాగ్రత్త ! పోయిగుంట బద్రం ! యోరింటి కెళ్లాకు, యోర్నీ చార్చియాకు!

బుద్దిగలిగుండేవు ! బుల్లోడిమీదొట్టు ! వత్తానో రానో - దార్లో దొంగోళ్ళు ! వత్తానో రానో - సూర్లో సుక్కుంది ! పోయిగుంట పగడాలూ, కాసులూ బద్రం! వత్తానో రానో! సిన్నోళ్ళకి సుక్కియ్యి ! వత్తానో రానో ! పెద్దోళ్ళకి పాలమియ్యి ! వత్తానో రానో ! పోయిగుంట తీసుకో! పోవాలి పొరుగూరు ! గండ్లమెడ యెడ్లవిగో ! గణ గణ మంటున్నయి, గణ గణలు !

ఇది నాటి రైతు దుఃఖ ఆర్తి చిత్రణ, కొంచెం అటు ఇటుగా నేటి రైతు దుస్థితిని చిత్రిస్తూ ఉన్నట్లుంది.

**వికాసం:** వెయ్యేళ్ళ తెలుగు పద్యం సాధించిన కీర్తి పదేళ్లలో వచన కవిత్వం సాధించింది అన్న శ్రీశ్రీ, ఆరుద్ర మొదలగువారు వచన కవిత్వాన్ని చక్కగా ప్రచారం చేశారు.

శ్రీ శ్రీమహాప్రస్థానం భిక్షువర్షీయసి దారి ప్రక్క, చెట్టు క్రింద ఆరిన కుంపటి విధాన కూర్చున్నది ముసిల్దకతె మూలుగుతూ, ముసురుతున్న

ఈగలతో, వేగలేక ముగ్గుబుట్ట వంటి తలా, ముడతలు తేరిన దేహం, కాంతి లేని గాజు కళ్ళు, తనకన్నా శవం నయం. పడిపోయెను జబ్బుచేసి, అడుక్కొనే శక్తి లేదు, రానున్నది చలికాలం దిక్కులేని దీనురాలు.

ఇందులో భావ చిత్రణ మనసులోని చొచ్చుకొనిపోయి గాయం చేస్తుంది. ఇప్పటికీ ఇలాంటి ముసలమ్మల ను మనం చూస్తూనే ఉన్నాము.

**కుందుర్తి వచన కవితా పితామహుడు:** ఫ్రీవర్స్ ఫ్రంట్ను ఏర్పాటు చేసిన కుందర్తి వచన కవిత్వాన్ని యువ కవితా వాహినిగా పరుగులెత్తించాడు, సీతారామరాజు మన్యం విప్లవం, దండి సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష పడిన రూకూర్ చంద్రసింగ్ మున్నగు కవితా వస్తువులతో కుందుర్తి నయాగరా వలే ఉవ్వెత్తున ఎగసి పడ్డాడు.

"మతానికి నవాబు పెట్టిన ముద్దు పేరు
ఆనాటి రజాకారు తెలుగుజాతి గుండె మీద కుంపటిలా రజాకార్లు గ్రామాల్లో
దండించారు, పాపం పండించారు (తెలంగాణ-కుందుర్తి)

ఈ విధంగా విత్తు వృక్షం అయినట్లు వచనకవిత్వం శాఖోపశాఖలుగా విస్తరిల్లినది. ఇది వివిధ ఉద్యమాలకు ఊపిరి అయినది.

**1. దిగంబర కవిత్వం :** నగ్నముని, నిఖిలేశ్వర్, చెరబండరాజు, మహాస్వప్న, జ్వాలాముఖి, భైరవయ్య ఈ ఆరుగురు దిక్లనే షాకులిస్తూ, దిగంబర కవిత్వం వెలిగించారు.

**వందే మాతరం చెరబండరాజు**

"ఓ నా ప్రియమైన మాతృదేశమా !
తల్లివి తండ్రివి దైవాన్ని నీవేనమ్మా!
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది
అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది.
ఊసినా, దుమ్మెత్తి పోసినా, చలనం లేని మైకం నీది"

ఇలా భరతమాత ఉద్దేశించడం 99% మంది హర్షించలేరు. కనుక ఈ కవిత్వం పుబ్బలో పుట్టి పునాసకి రాలిపోయింది.

**2. స్త్రీవాద కవిత్వం :** స్త్రీల అనుభవాలను, అనుభూతులను, బాధలను స్త్రీ దృక్కోణం నుంచి చూసి రాసినది స్త్రీవాద కవిత్వం. 1975 నుంచి అంతర్జాతీయంగా స్త్రీవాదం సాగింది. తెలుగులోకట్టమంచి నుంచి గురజాడ, రాయప్రోలు కూడా స్త్రీవాదులే.

పాతివ్రత్యం, సిగ్గు, బిడియం, ఆపనిందలు, అవమానాలు స్త్రీ వ్యక్తిత్వాన్ని ఎదగనివ్వడం లేదని గుర్తించిన స్త్రీలు నిర్భయంగా, నిస్సంకోచంగా, స్వేచ్ఛగా రాయడం ప్రారంభించారు. నీలి మేఘాలు, స్త్రీవాద సంకలనం నుండి బందిపోట్లు (సావిత్రి గారి కవిత)

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

"పాఠం ఒప్ప చెప్పకపోతేపెళ్లి చేస్తానని పంతులు గారు అన్నప్పుడే భయమేసింది ! ఆఫీసులో నా మొగుడు ఉన్నాడు అవసరమైనా సెలవు ఇవ్వడని అన్నయ్య అన్నప్పుడు అనుమానం వేసింది వాడికేం మగ మహారాజు అని ఆడా మగా వాగినప్పుడే అర్థమయ్యింది. పెళ్ళంటే పెద్ద శిక్ష అని ! మొగుడంటే అంటే స్వేచ్ఛా భక్షకుడని ! మేం పాలిచ్చి పెంచిన జనంలో సగం మమ్మల్ని విభజించి పాలిస్తోందని".

ఎన్ని తరాల స్త్రీ బాధకు చిత్రణ ఈ కవిత. నిన్న మొన్న ఆత్మహత్య చేసుకున్న లహరి బాధను కూడా చిత్రిస్తూ ఉన్నట్టున్నది ఈ కవిత.

**3. దళిత కవిత్వం :** కులం వల్ల కలుగుతున్న సమస్యలను వివరిస్తూ, పూలే, అంబేద్కర్ తాత్విక భావజాలంతో దళిత కవిత్వం గళమెత్తింది. 1995లో ఎక్కువగా రావడం చారిత్రక పరిమాణం. ఈ సంవత్సరంలో కేశవకుమార్, కె. సత్యనారాయణల సంపాదకత్వంలో "దళిత మానిఫెస్టో" రాజశేఖర్ నాగప్ప గారి సంపాదకత్వంలో అనేక సంకలనాలు వచ్చాయి. కత్తి పద్మారావు గారి "జైలు గంటలు" జులూరి గౌరీశంకర్ గారి “పొలికట్టె” సుంకర రమేష్ బాబు గారి "తల్లికోడి హెచ్చరిక" మొదలగునవి. ఈ కవిత్వాన్ని చదువుతుంటే, గుండె కరిగి నీరై, లావా లా ఎగజిమ్మే ఆక్రోశం కలుగుతుంది అనడంలో అతిశయోక్తి లేదు.

"నన్ను చచ్చిన శవాల ముందు దహన సంస్కారాలు చూసుకోమన్నావ్ సరే ఎలాగైతేనేం నీ ప్రాణాల్ని కూడా ఎలా పాతెయ్యాలో నాకు తెలియడమే బాగయింది".

అంటూ దళితులకు ప్రతికూల అంశాలను కూడా అనుకూల అంశాలుగా మార్చుకునే చైతన్యంతో పోరాటపటిమ ప్రదర్శింపబడింది.

**బొజ్జా తారకం కవిత:** నాకై కవిత లేదు నాకు చరిత లేదు. నాలుగు పాదాల్లో నుంచి నన్ను తొలగించారు నాలుగు వేదాలోంచి.

**కలేకూరి:** "త్రేతా యుగంలో నేను శంభూకుణ్ని" అంటూ తన అస్తిత్వాన్ని ప్రశ్నించగా, ఎండ్లూరి సుధాకర్ గారు "దళిత ఆత్మకథా ప్రక్రియ" ను పరిచయం చేశారు.

**4. ముస్లిం మైనారిటీ కవిత్వం:** తెలుగు సాహిత్యంలో మైనారిటీ వాదం ఒక పారిభాషిక పదం అయింది. అటువంటి మైనారిటీలు అయిన ముస్లింల మనోభావాలను ప్రతిఫలిస్తూ వస్తున్న, కవిత్వమే ముస్లిం మైనారిటీ కవిత్వం.

"పుట్టుమచ్చ" అను దీర్ఘ కవితలో
నేను పుట్టకముందే

దేశద్రోహుల జాబితాలో
నమోదై ఉండి నా పేరు"

అంటూ ఖాదర్ మొహియుద్దీన్ బాబ్రీ మసీదు కూల్చివేతను నిరశించారు. అఫ్సర్, యాకుబ్ మొదలైనవారు తమ కవిత్వంలో మతోన్మాదాన్ని ఖండించారు. 1995లో చిక్కనవుతున్న పాట, 97లో జిహాద్, 98లో షరతు, ఫత్వా, జలజలా, 2002లో గుజరాత్ గాయం ఈ విధంగా అఖండంగా సాగుతోంది. వచనకవిత్వం శాఖోపశాఖలుగా విలసిల్లుతుంటే, "మినీ కవిత్వం" చటుక్కున మెరుస్తూ మురిపిస్తోంది.

**5. మినీ కవిత్వం:** అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని రచన అన్న తిక్కనను గుర్తు చేస్తూ, తటిల్లున మెరిసేది మినీ కవిత్వం.

"భోగి కన్య స్టేషన్లో సిద్ధంగా ఉంది ఇంజను వరుడు ఇంకా రాలేదు. ఇంధనం కొరత కాబోలు (ఎన్. వాణి). ఇందులో సంక్షిప్తతే కాదు ప్రతీకవాదం కూడా ఉంది.

**హైకూ:** జపాన్ ప్రభావంతో తెలుగు లోనికి వచ్చిన కవితా ప్రక్రియ హైకూ, మూడు పదాలు ఉంటాయి. 1వ పాదంలో 5 మాత్రలు, 2, 3 పాదాల్లో 17 మాత్రలు ఉంటాయి. పదచిత్రం, దృశ్య అనుభూతి ప్రధానం.

"నదిలో ఈత చంద్రుని లో శకలాలు గుచ్చుకుంటున్నాయి" (వాసర రెడ్డి)
"పచ్చిక మొలిచింది బాటను కప్పేసింది ఎన్ని వందల కాళ్ళవసరమో (ఇస్మాయిల్)
"అగ్గిపుల్ల తన శిరసు ని తానే భస్మం చేసుకొంది (మాధవి)

**రెక్కలు:** రెక్కలు అంటే ఆరు పాదాల కవితా ప్రక్రియ. స్పష్టమైన లక్ష్యం, లక్షణం రెక్కల్ని ప్రతిభావంతం చేశాయి. రెక్కలు అంటే పైకి ఎగరడానికి ఉపకరించేవి అని అర్థం. రెక్కలు ను నూతన కవితా ప్రక్రియగా చేసే అందించిన వారు ఆనాటి పైగంబరకవి యం.కె. సుగమ్బాబు. ఆది కవి ఆక్రన్దనే తొలి శ్లోకం అలా ఉపశమించింది ఆక్రోశం దుఃఖపరిహార్థం కవిత్వం నాలుగు పాదాలు దేహమైతే, చివరి రెండు రెక్కలు అని భావన.

**కరోనా కవిత్వం:** ఒక సూక్ష్మజీవి ప్రపంచ కదలికలను ఆపేస్తే, ఆర్థిక సామాజిక అభివృద్ధి నిరోధింప చేస్తే, అల్లకల్లోమైన మానవ జీవితాన్ని ప్రతిబింబిస్తూ వచ్చింది, వస్తున్నది కరోనా కవిత్వం. నాగభైరవ ఆదినారాయణ గారు కరోనాపై కవనం అని ఒక పుస్తకం ప్రచురిస్తూ 10 సాహితీ ప్రక్రియల్లో కరోనాపై కవిత్వం వెలయించారు వారి పుస్తకం నుంచి ఒక రుబాయి.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

"వద్దంటే ఇంటి గడప దాటేస్తాడు వీధి వీధి బలాదూర్ తిరిగేస్తాడు. అటు తిరిగి ఇటు తిరిగి చిట్ట చివరకు క్వారెంటైన్లో చేరి విలపిస్తాడు"

పీలేరు ప్రభుత్వ కళాశాల వారు "తెలుగు సాహిత్యంలో కరోనా" పేరిట అంతర్జాల సాహితీ సదస్సును కూడా నిర్వహించారు అంటే స్వల్పకాలంలో ఎంత కరోనా కవిత్వం వచ్చిందో అర్థం చేసుకోగలము.

**ముగింపు:**

"సమగ్ర జీవన చిత్రణలో
సహస్రదళ పద్మంమై
వికసిస్తూ, విలసిల్లుతూ,
వెలుగులు విరజిమ్ముతుంది.
వచన కవితా ప్రభా శిరీషము !
ఈ విలాసము ఆ శేషము !
ఈ వికాసము అనంతము !
ఈ విజయము అభేద్యము !

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# పాలేరు నాటకంలోని ప్రేమతత్వం- ఒక పరిశీలన

**సాదే యాకోబు,**
*తెలుగు శాఖాధ్యక్షుడు,*
*శ్రీ వై.యన్. కళాశాల (ఏ), నరసాపురం, సెల్: 9441346888*

**ఉపోద్ఘాతం:** తెలుగు నాటకరంగం 19వ శతాబ్దం నుండి ఆరంభం అయినది. పాశ్చాత్యుల, పార్శీల నాటకరంగ ప్రభావంతో తెలుగు నాటక రంగం విరాజిల్లింది. కోరాడ రామచంద్ర శాస్త్రి గారు 1860లో రచించిన మంజరీ మధుకరీయం మొట్ట మొదటి నాటకంగా పేర్కొన వచ్చును. నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు గారు చమత్కార రత్నావళి 1880 లో రంగస్థలంపై ప్రదర్శించబడినది. రాయలసీమలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు ఆంధ్రనాటక పితామహులుగా పేరు ప్రఖ్యాతలు పొందారు. వీరిచే రచించిన "సారంగధర" నాటకం తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి విషాదాంత నాటకంగా ఘనతకెక్కినది. అలాగే చిలకమర్తి లక్ష్మీనరసింహ పంతులు గారు రచించిన కీచక వధ, గయోపాఖ్యానం వంటి నాటకాలు కూడ ప్రజాదరణ పొందినవి. ఇలా నాటకాలు సంఘ సంస్కరణకు ప్రదర్శన జరిగితే బోయి భీమన్న గారు రచించిన పాలేరు నాటకం సమ సమాజ అభివృద్ధికి బాటలు వేసినది. కుల అంతరాల గోడలను బీటలు చేసినది. పల్లెలు, పట్టణాలు, దేశం అంతట ప్రేమ తత్వాలను వ్యాపింపజేసి నవ చైతన్యానికి నాంది పలికినది.

**పరిచయం :** పద్మశ్రీ బోయి భీమన్న గారు సామాన్య కుటుంబంలో జన్మించి పాలేరు స్థాయినుండి పద్మశ్రీ స్థాయి వరకు ఎదిగిన గొప్ప నాటక రచయితగా పేర్కొన వచ్చును. తూర్పు గోదావరి జిల్లా నేటి డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ ప్రాంతంలోని రాజోలు మండలం, మామిడికుదురు గ్రామంలో బోయి పుల్లయ్య, నాగమ్మ పుణ్యదంపతులకు 1911 సెప్టెంబరు 19వ తేదిన జన్మించారు. నగరం, రాజోలు, కాకినాడలలో విద్యాభ్యాసం చేసారు. వారు చదివి ఆ చదివిన సారం పాలేరు నాటకం ద్వారా అందరు చదివేలా తన నాటకం ద్వారా సమాజంలో ముఖ్యంగా అట్టడుగు ప్రజలకు అభ్యున్నతిని తెచ్చిన కవి శ్రేష్ఠుడు పద్మశ్రీ బోయి భీమన్నగారు చదువే దైవంగా భావించే విధంగా చేసారు. ఆ దైవమే ప్రేమ, ఆ ప్రేమతత్వమే నాటకానికి చైతన్య దీపికగా నిలిచింది. ప్రేమ, నీతి, క్షమాపణ, మంచి చెడు చదువుల పట్ల అందరి దృష్టి పడేటట్లు, చదువును అందరు ప్రేమించేటట్లు చదువుకుంటే వచ్చే గౌరవం పాలేరు నాటకంలో బోయి భీమన్న గారు పొంది పరచినారు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

ఒకనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావుగారు "డా॥ బోయి భీమన్న గారి పాలేరు నాటకం నేను చూచి ఉండక పోతే, చదివి ఉండక పోతే ఈ రోజున నేను ఈ స్థితిలో ఉండే వాడిని కాను" అన్నారంటే పాలేరు నాటకంలో ఉన్న ప్రేమతత్వం చదువు యొక్క గొప్పతనం వేరే చెప్పనవసరం లేదు.

**పాలేరు నాటకంలోని ప్రేమతత్వం:** ప్రపంచమే గొప్ప నాటకశాల. అందులో మానవులు, నటులు, నటన చేయించేవాడు భగవంతుడు. ఆ భగవంతుడు ప్రేమ స్వరూపి. ప్రేమ అభివృద్ధికి, చైతన్యాన్ని, ఆనందాన్ని, అధికారాన్ని ఇచ్చి ఆచారాలను, హెచ్చు తగ్గులను, కుల నిర్మూలనమును కూడా చేయగలదు ప్రేమ. అంతేకాదు చదువులు, సంస్కారమును ఇచ్చి మోటుతనంను సవరించి నాగరికుడిగా చేయగల దైవ స్వరూపం ప్రేమ. అట్టి ప్రేమతత్వం పాలేరు నాటకంలో ఆభరణంగా అద్దుకొని ఆరంభం నుండి కథ అంతం వరకు ప్రేమ పాత్రులను చైతన్య పరచిన తీరును పరిశీలించినా అందు ప్రేమతత్వం కనులకు కట్టినట్లు కనిపిస్తుంది. కులాల అంతరాలను కూల్చే శక్తి ప్రేమకు మాత్రమే ఉందని అర్థం అవుతుంది.

'కావ్యేషు నాటకం రమ్యం' 'నాట కాంతం హి సాహిత్యం' అని నాటక ప్రక్రియను ఎంతో రమ్యంగా భావించారు పండితులు. సంస్కృతంలోని దశ విధ రూపకాలలో నాటకం ఒకటి. కాని ఆధునిక ప్రపంచంలో ప్రదర్శించబడుతున్న నాటకాలకు పురాతన కాలంలో వున్న నాటకాలకు రవ్వంతైన పోలికలు కనబడవు. ఇప్పుడు వస్తున్న నాటక ప్రక్రియలు అన్ని ఆధునికమైనవే. పాలేరు నాటకం కూడ ఆధునికమైనదే. ఎందుకంటే అందు ఉన్న వనబాల ప్రేమ నేటి కథానాయికలకు కథలకు ఆదర్శం. ప్రేమ కావ్యాలకు పాలేరు నాటకం పునాది. ప్రేమ కావ్యాలకు అది ఆదికావ్యం.

నాటకంలో ఇతివృత్తం ప్రధానమైనది. ఇతివృత్తంలో కథ ఉంటుంది. పాలేరు నాటకంలో చక్కటి కథ వుంది. వెంకన్న కథకు నాయకుడు, కథానాయిక వనబాల వారిరువురు మధ్య చిన్ననాడే చిగురించిన ప్రేమ. ఆ ప్రేమ కూడా కులాన్ని చూడలేదు. పాలేరు అని కూడా వ్యత్యాసం చూపలేదు. వెంకన్నను మనస్సున నిలుపుకుంది. వెంకన్న అభివృద్ధిని కోరుకొంది. అతని చదువుకు కావలసిన ధనం సమకూర్చుటలో బంగారు హారాన్ని ఉపకారి మస్టారు ద్వారా పంపించటం వలన ప్రేమ ఎదుటివారి ఎదుగుదలను కోరుకొంటుంది. వెంకన్న ఎంతో ఎత్తుకు ఎదగాలని కోరుకొంది.

గురువుకు శిష్యులు పుత్రులు అన్నట్లు అంకిత భావంతో వృత్తిని నిర్వర్తించి ఉపాధ్యాయులు ఇప్పటికిని లేకపోలేదు. అట్టి వారికి ఆదర్శప్రాయుడు ఉపకారి మాస్టారు. గురువు శిష్యులను కన్నబిడ్డల వలే చూచి వారు అన్ని విధాల వృద్ధి చెందాలని కోరుకొని తండ్రిలా ఉపకారి మాష్టారు పాత్ర ఉపాధ్యాయులకు ఆదర్శం. నిరక్షరాస్యత అంతట ఉండి పాలేరు చదవకూడదు అది మూఢనమ్మకాలు ఉన్న 'పగలు పని రాత్రి చదువు' అన్నట్లు రాత్రిపూట వెంకన్నకు చదువు చెప్పి చదువుపై ప్రేమను పట్టుదలతో బి.ఎ. చదివి కలెక్టర్ అయిన విధము చూసినా, పరిశీలించినా ఉపకారి మాష్టారు వంటి గురువులు, వనబాల లాంటి ప్రేమికురాలు రామం లాంటి స్నేహితులు ఉంటే నరకాన్ని జయించి స్వర్గాన్ని అరోపించవచ్చు అనిపిస్తుంది. దీనికి కారణం పాలేరు నాటకంలోని ప్రేమతత్వం విజయపథమున నడిపిస్తుంది.

అయితే సీత మాటలను బట్టి వెంకన్న తనకు దక్కడని వనబాలలో ఉన్న నిజమైన ప్రేమకు నిదర్శనంగా బావిలో దూకి మరణించబోయింది. వనబాల మీద వెంకన్నకు కూడా ప్రేమ ఉన్నప్పటికి వ్యక్తం చేసుకోలేక రైతు వాడ గ్రామానికి వివాహానికి వచ్చిన వెంకన్న డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఒక విడిది గృహంలో ఉండగా బావిలో ఎవరో దూకారని శబ్దం విని వెంటనే వెంకన్న వెళ్ళి వనబాలను కాపాడి వనబాల తన ప్రేమలో చిన్న నాటినుండి కొబ్బరి ముక్కలు పెట్టిన నాటినుండి మెడలో కాసులు పేరు ఇచ్చి సహాయం చేసి చివరికి వెంకన్న దక్కకపోతే ప్రాణాలు విడవాలి అనే తన ప్రేమతత్వం పెద్దల అంగీకారంతో వివాహ వేడుకగా మారింది. ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ రైతువాడ గ్రామమంత కథలుగా వ్యాపించింది. పాలేరు నాటకం ప్రేమ కథలకు చిహ్నం.

ఆధునికాంధ్ర సాహిత్యంలో నాటకం ద్వారా ప్రజలు ఎంతో చైతన్యవంతులైనారు. ముఖ్యంగా పాలేరు నాటకం ద్వారా ఆనాటి పల్లెప్రాంతంలో నివసించే ప్రజలు నిరాక్షరాస్యులు, పాలేరులుగా ఉంటూ కుబేర్రావు లాంటి వారిచే అణచివేతకు గురియైన వారే ఎక్కువ. అటువంటి పరిస్థితులను సహితం జయించి చదవాలి. చదివిన వెంకన్న వేంకటేశ్వరరావు కలెక్టర్ అయ్యాడు. మనం చదవాలి పిల్లలను చదివించాలి అనే దీక్ష పట్టుదల అందరిలో కలిగినది. పాలేరు నాటకం నిరక్షరాస్యతను నిర్మూలన చేసే సంజీవనిలా పేదవారి జీవితాలలో చదువుల వెలుగులు నింపింది. ప్రేమానురాగాలు పల్లెసీమల్లో వ్యాపింప చేసింది. నవ్యతకు నాంది పలికింది. మూఢ నమ్మకాలను తరిమికొట్టింది. కొత్త తరానికి దారులు వేసింది. పాలేరు నాటకం ప్రజల మనోభావాలను బలపరిచింది. కులం గోడలని కూల గొట్టింది. ప్రేమకు యల్లలు లేవు అని చాటి చెప్పంది. సామాన్యుని జీవన విధానంలో యనలేని మార్పును తెచ్చింది.

బానిస తనమును బాపుమురా భారత భూమికి భాగ్యం తేరా ప్రభువు సేవకుడు లేని సంఘమును పదిలముగా నిర్మింపుమురా సౌఖ్యము, సంతోషం, మానవులకు సమకూర్చుము రా! వీరా! పాలేరు నాటకంలో ప్రారంభ గీతం రాని ఆనాటి అసమానతలు తొలిగిపోయి సౌఖ్యము, సంతోషం కలగాలని ఆకాంక్ష కనిపిస్తుంది. వెంకన్న చిన్న పాలేరు. తండ్రి పుల్లయ్య పెద్ద పాలేరు. వారిలో వీరేషు తోడి పాలేరు. కామందు సామర్థ్యాన్ని బట్టి పాలేర్ల సంఖ్య ఉండేది. ఈ నాటకానికి పాలేరు అని పేరు పెట్టడం కూడ గొప్ప ప్రస్థానమే. ఎందుకంటే పాలేరుతనం నుండి వెంకన్న చదువుకొని డిప్యూటి కలెక్టర్ అవ్వడం ఉన్నతమైన ప్రయాణమే.

"సహాయం వచ్చిన చోటల్లా పొంది చదువుకో అదృష్టం ఉంటే పైకొస్తావు అప్పుడు పునః సహాయం చేస్తావు" ఈ మాటలు వెంకన్న జీవితాన్నే మార్చాయి. ఒక ప్రక్క సీత మరోప్రక్క ఉపకారి మాష్టారు అంతా ప్రేమైనా వనబాల వెంకన్నను చదువు వైపు మరలించాయి. పైకి రావాలని ఆశించారు. అందుకే వెంకన్న వెంకటేశ్వరరావు అన్నా పేరుతో బి.ఎ. పూర్తి చేసి పై చదువులకు వెళ్లాలట అనే ఉత్తరం చదివిన వార్త ఉపకారి మాస్టారు ద్వారా తెలుసుకొన్న వనబాల తనమెడలోని కాసుల పేరును ఉపకారి మాష్టారుకిచ్చి "పై చదువులు వెంకన్నను చదవమని చెప్పండి" అనటంలో వెంకన్నపై వనబాలకు ఉన్న ప్రేమతత్వం తేటతెల్లం అవుతుంది. సామాన్యుడికి గంజి నీళ్లు కూడా దొరకని రోజులలో ఇంట్లో తల్లి తండ్రులు కాసుల పేరు గురించి నిలదీస్తారు అనే భయం లేకుండ వనబాల తన మెడలో కాసులపేరు ఇచ్చిందంటే ప్రేమ ఉపకారం చేస్తుంది. ప్రేమ భయపడదు అని తెలుస్తుంది. అంతెందుకు వనబాల తన ప్రేమ గురించి సీతకు చెప్పింది "వెంకన్న అంటే ఇష్టం అని" అందుకు సీత అయినా పైకొచ్చిన వాణ్ణి పైవాళ్ళు పైనుంచే ఎగరేసుకు పోతే, ఇక మాకు మిగిలేదేమిటమ్మ" అనుటలో దళితవర్గంలోని వారు మంచి చదువులు చదివి ఉన్నతమైన ఉద్యోగాలు పొందిన వారిని, వారి ఉద్యోగం చూచి పై వర్గాలవారు వివాహాలు చేసుకోవడం ఆనాటి సామాజంలో ఉంది.

**ముగింపు :** పాలేరు నాటకంలో వెంకటేశ్వరరావుకి వనబాలకు వివాహం చేయడం ద్వారా సమాజంలో వున్న వ్యాత్యాసాలు తొలిగి పోయి సామాజిక చైతన్యం కలిగి, చదువుపై మక్కువ కలిగి ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పద్మశ్రీ బోయి భీమన్న గారు చెప్పిన ప్రేమగీతమే పాలేరు నాటకం.

**పరిశీలించిన గ్రంథాలు**

1) పాలేరు నాటకం డా॥ బోయి భీమన్న గారు

2) జీవనయానం డా॥ చినమిల్లి సత్యనారాయణరువుగారు

3) కన్యాశుల్కం - గురజాడ అప్పారావు గారు

4) వరవిక్రయము - శ్రీ కాళ్ళకూరి నారాయణరావుగారు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# బోయి భీమన్న - గేయ సాహిత్యం

**డా. బి. సుబ్బలక్ష్మి,** ఎం.ఏ., ఎం.ఫిల్, పిహెచ్.డి.,
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ (స్వయం ప్రతిపత్తి )కళాశాల, రాజమహేంద్రవరం.
చరవాణి: 9550699847

**స్థూల పరిచయం:** సమ సమాజ దార్శనికుడు పద్మభూషణ్ బోయ భీమన్న ప్రముఖ సాహితీవేత్త, తెలుగు సాహిత్యంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కవి విమర్శకులు దార్శనికుడు పద్మభూషణ్ శ్రీ బోయి భీమన్న. అద్భుతమైన సాహిత్య సృష్టితో సామాజిక చైతన్యాన్ని ఆశించి జాతిని జాగృతం చేసిన మహాకవి బోయి భీమన్న. సాహిత్యం సామాజిక ప్రయోజనాన్ని ఆశించి జాతీయ సమైక్యత ధ్యేయంగా ముందుకు సాగి 84 ఏళ్ల పాటు శ్రమించి సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరచుకున్న మహోన్నతమైన వ్యక్తి. మహాకవిగా సాహితీ వసంతగా పద్మశ్రీగా నవయుగ కవి సార్వభౌమునిగా పద్మభూషణ్ గా అనేక బిరుదులు అందుకున్నారు. అంతేగాక అనేక సత్కారాలు సన్మానాలు పొందారు. పాలేరు, జానపదుని జాబులు, పడిపోతున్న అడ్డుగోడలు, రాగవాసిష్టం, త్రిపదిలో ఇలా ఎన్నో రచనల ద్వారా సమసమాజ దార్శనికతను కలిగించడమే కాక ప్రతి రచనను ఎంతో వైవిధ్యంగా తీర్చిదిద్ది పాఠకులను ఆలోచింపచేసేవిగా ఉంటాయి. సర్వసాహితీ ప్రక్రియల సంపన్నం చేసిన గొప్ప రచయిత తెలుగు సాహిత్య అనే సమాజాన్ని తన విభిన్న రచనల ద్వారా ఎంతో ప్రభావితం చేశారు డాక్టర్ బోయి భీమన్న.

బోయి భీమన్న సామాజిక చైతన్యాన్ని ఆశించి రచనలు చేసి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన కవి, రచయిత, మారుమూల పల్లెలో దళిత పాలేరు ఇంట పుట్టి, కేంద్ర సాహిత్యఅకాడమి అవార్డు, పద్మభూషణ్ తో పాటు లెక్కకు మిక్కిలిగా గౌరవ, సన్మానాలందుకునారు. పేదరికంతో పాటు, అంటరానితనం వంటి దురాచారాలు కూడా చిన్నప్పటినుండి భీమన్నగారికి అనుభవమే. సహజంగానే ఆయన వీటిని నిరసించాడు. అంబేద్కర్ వ్రాసిన కులనిర్మూలన పుస్తకాన్ని తెలుగులోకి తర్జుమా చేశారు.

**బాల్యం-విద్యాభ్యాసం :** 1911 సెప్టెంబరు 19 న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో భీమన్న గారు పుట్టారు. నాగమ్మ మరియు పుల్లయ్య ఇతని తల్లిదండ్రులు. వీరికి పంచపాండవుల వలె ఐదుగురు మగపిల్లలు మరియు ఒక ఆడపిల్ల జన్మించారు. పుల్లయ్యగారు తన మగపిల్లలకు వరుసగా

ధర్మరాజు, భీమన్న, అర్జునుడు, నకులుడు, సహదేవుడు అనే పేర్లు పెట్టారు. భీమన్న 1935లో బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణుడై 1937లో బి.ఇడి. పూర్తిచేశారు. ఈయన రచించిన గుడిసెలు కాలిపోతున్నాయ్ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు వరించింది. 2001లో భారతప్రభుత్వం భీమన్నను పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. 2005 డిసెంబర్ 16న హైదరాబాద్ లో తుదిశ్వాస విడిచారు.

**ఉద్యోగం:** విద్యాభ్యాసం చేసిన తర్వాత బోర్డు హైస్కూలులో చరిత్రను బోధించే ఉపాధ్యాయునిగా పనిచేశారు. తర్వాత ఆంధ్రప్రదేశ్ అనువాద విభాగం డైరెక్టర్గా, రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ 1964 వరకు పనిచేశారు.

**రచయితగా :** బోయి భీమన్న ప్రముఖ రచయిత. ఈయన సుమారు 70 పుస్తకాల్ని రాసినట్లు తెలుస్తోంది. పద్య, గేయ, వచన రచనలతో పాటు, నాటకాలను కూడా వ్రాశారు. వివిధ పుస్తకాలకు వ్రాసుకున్న పీఠికల్లో పరిశోధనాత్మక దృష్టి కనిపిస్తుంది. వాటిలో కొత్తప్రతిపాదనల్ని, కొత్త సిద్ధాంతాల్ని చెప్తున్నట్లుంటుంది. ఆకాశవాణిలో ప్రసారం కోసం అనేక భావగీతాల్ని వ్రాశారు. వీటన్నింటితో పాటు అంబేద్కర్ వ్రాసిన కొన్ని రచనల్ని తెలుగులోకి అనువదించడంతో పాటు, ఆయన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కీర్తిస్తూ రాశారు. వీరు వ్రాసిన 'జయ జయ జయ అంబేద్కర!' దళితులకు జాతీయగేయమై నేటికీ ఊరూరా ప్రార్థనా గీతంగా మార్మోగుతోంది.

**సాహితీ సేవ :** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు డా. బోయి భీమన్న పేరుతో ఒక సాహిత్య పీఠాన్ని ఏర్పాటు చేసి, వీరి రచనలన్నింటినీ ప్రచురిస్తున్నారు. నిజానికివన్నీ విశ్లేషిస్తే గాని, భీమన్న సమగ్ర సాహిత్య దృక్పథం స్పష్టం కాదు. ఈయనే కాదు, ఏ రచయిత దృక్పథాన్నైనా అంచనా వేయాలంటే, వివిధ పరిణామాలుగా సాగిన రచనలన్నింటినీ స్పృశించగలిగినపుడే ఇది సాధ్యమవుతుంది. అలా కాకుండా, దళిత పదాన్ని ప్రయోగించలేదనీ, దాన్ని వ్యతిరేకించాడనీ, భారతదేశంలో కులం లేదన్నాడనీ, ఆయన వర్ణాన్నే సమర్థించాడనీ, కులం గురించి వ్రాయలేదనీ వక్రీకరించే వాళ్లని చూసిన తర్వాత ఆయన సాహిత్యదృక్పథాన్ని విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉందనిపిస్తుంది.

ఇప్పటికే అనేకమంది భీమన్న రచనలపై పరిశోధనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ సదస్సులు జరుగుతున్నాయి. వీటన్నింటికీ ఒక మార్గదర్శనాన్ని కల్గించిన గ్రంథం ఒకటి ఉంది. అది హైమావతి చక్కని కథనాత్మక శైలిలో వ్రాసిన "పాలేరు నుండి పద్మశ్రీ వరకు బోయిభీమన్న" గ్రంథం. ఇది

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

వీరి సాహిత్య దృక్పథాన్ని తెలిపే చుక్కానిలాంటిది. దానిలోని సూచనల్ని గమనిస్తే, ఆయన వ్రాసిన రచనల్లో పరిశోధకులకు, విమర్శకులకు తమదైన విశ్లేషణకు ప్రేరణ దొరుకుతుంది.

కవిత అంటే రసవంతమైన ఒక భావం. ఏదో ఒక రసవద్భావం హృదయంగా దాని చుట్టూ ఏదో ఒక లయలో, ఏదో ఒక ఆకృతిలో అల్లబడిన అందమైన శరీరమే పాట. తెలుగు సాహిత్యంలో పాటని సాహిత్యరూపంగా గుర్తించడానికి చాలా కాలం పట్టింది. ముఖ్యంగా ఉద్యమాలే పాటకి ఒక సాహిత్య ప్రక్రియా గౌరవాన్ని ఇచ్చాయి. ప్రజలలో భావాల్ని ప్రచారం చెయ్యడానికి పాట బలమైన సాధనం. పాట రాసేవారు, భావనాశక్తి గలవారైతే, ఎన్నో శిల్పాల్ని పాటలోనూ రూపొందించవచ్చు. ఎంతో సందేశాన్నీ, జీవన వాస్తవికతనీ పాటలో నింపవచ్చు. స్వతహాగా కవులైన వారు పాటల్ని అనేక విధాలుగా వినియోగించుకున్నారు.

ఎవరైనా ఒక కవి ఒకపాటను వ్రాసినప్పుడు, అది గానరూపంలో ప్రజలకు అందాలంటే, అట్టి కవి స్వయంగా గాయకుడై ఉండాలి. లేకపోతే అతని సన్నిహిత మిత్రులు గాయకులై ఉండాలి. అంతమాత్రమే చాలదు అట్టి గాయకులకు ప్రసార, ప్రచార సాధనాలు అందుబాటులో ఉండాలి.

బోయి భీమన్న గారు వ్రాసిన గేయాలన్నీ హృదయ స్పందనలే. అందుల భావావేశాలు, తాత్కాలిక ప్రయోజనాలు కూడ వుండవచ్చు. మొత్తం మీద అన్నీ కూడ అందంగా పాడుకోతగ్గవే. కులమత దృక్కోణాల నుండి కాక, సరస్వతి ఏ హృదయంలో వున్నా అది సరస్వతే అనే సాత్త్విక, తాత్త్విక దృష్టితో స్వీకరించగల రసజ్ఞులు, కళాస్రష్టలూ మాత్రం భావించాలి.

గేయాలు పాడేవాళ్లూ, గాయనీ గాయకులు ఎవరైనా సరే సాహిత్యాన్ని విస్మరించ కూడదనే భీమన్నగారి ఉద్దేశ్యం. స్వచ్ఛమైన సంగీతానికి సాహిత్యం అవసరం లేకపోవచ్చు. సంగీతం దానంతట అదే చెవుల ద్వారా గుండెను తాకి మైకం తెప్పించగలదు. అయితే అది మనస్సును కూడా రంజించాలంటే సంగీతానికి ఆధారభూతమైన సాహిత్యం కూడా అర్థం కావాలి. ప్రస్తుతం తెలుగులో ఈ పరిస్థితి అయోమయంగా వుంటున్నది. పాటలు పాడేవాళ్లు పాటలలోని సాహిత్యాన్ని కూడ స్పష్టంగా పలకవలసి వుంది. సాహిత్యం భావస్ఫోరకంగా వుండాలి.

**కొన్ని గేయాలు – వివరాలు: బోయి భీమన్న గారు వ్రాసే గేయాలూ**, పద్యాలూ, కావ్యాలూ, వచనకవితలు కూడా శృంగారరస ప్రధానంగా ఉంటాయి. నిజానికి రసం అంటేనే శృంగారం. అది ప్రధానంగా మధురంగా వుంటుంది. అది వివిధ దశలలో, వివిధ రుచులలో కూడా వుండవచ్చు. తియ్యగా వుండేదేకాదు, చేదుగా, వగరుగా, కారంగా, వెగటుగా, కమ్మగా, పుల్లగా, ఉప్పగా వుండేవి కూడా రసాలే. తక్కిన రుచులన్నీ మాధుర్యంలో భాగాలైనట్టే, రసాలన్నీ కూడా శృంగారంలో భాగాలే. శృంగారంలో

భాగంగా వివిధ రసాలను పోషించే తత్వం భీమన్న గారిది. అరవై ఏళ్లక్రితం భీమన్నగారు వ్రాసిన "పాలేరు" నాటకంలో కూడ ఇదే పద్ధతి ఉంది. దానిని ప్రజలు ప్రజాసాహిత్యంగానూ, దళిత సాహిత్యంగానూ, అమాయకులైన కార్మిక వర్గానికి సంబంధించి విప్లవాత్మక సాహిత్యంగానూ స్వీకరించి, విశేషంగా ప్రదర్శనలిచ్చి ప్రయోజనం పొందడం

భీమన్న గారి సహజ ధోరణిలో సాహిత్యాన్ని సృష్టించుకొంటూ పోతున్నప్పుడు పాలేరు వంటి రచనలనే కొనసాగించవలసిందిగా ప్రజలు బోయి భీమన్న గారిని కోరసాగారు. అందుకు సమాధానంగా ఆనాడే బోయి భీమన్నగారు వ్రాసిన ఒక గేయం

"తోటలలో పూలే కాని
తుప్పలు కనిపించవా?
కొలకులలో మీను లేన
జలగలు కనిపించవా?
కనిపించక కాదు-
నా కను లందుకు కాదు!"

మొదటి అఖిల భారత తెలుగు రచయితల సభల సందర్భంలో ప్రకటించబడ్డ ఈ గేయాన్ని ఆసభలలో పాల్గొన్న డా. భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు బోయి భీమన్న గారి భుజంతట్టి అభినందించారు.

"ఇటు తిరుగు, తిరుగు తిరుగు!
ఎక్కడికా పరుగు?
అందున్నది మిరప చేను
అణగును నీ పొగరు"

అనేది బోయి భీమన్న గారి చిన్నప్పుడు పశువుల్ని కాస్తూ పాడుకొన్న పాట. అంటే 90 ఏళ్ల నాటిదన్నమాట. బోయి భీమన్న గారికి తన చిన్ననాటి అనేక విషయాలు ఈ పాట ద్వారా గుర్తుకు వచ్చాయట.

అలాగే దేశభక్తికి, జాతి శక్తిని ఉద్బోధిస్తూ వ్రాసిన పాటలు కూడా చాలా వున్నాయి. శాంతి సౌఖ్యాలనేవి బలం ద్వారా సంపాదించుకోవలసినట్టివి. బలహీనులకూ శాంతి సౌఖ్యాలు లభించవు. బలవంతుల పడగనీడల్లో బలహీనులెప్పుడూ భయం భయంగా బ్రతకవలసినట్టి వాళ్లే, జాతినీ, దేశాన్నీ

రక్షించుకోవాలంటే ఆ దేశానికీ, జాతికీ చెందిన స్త్రీ పురుషులందరూ కూడ ధైర్యసాహసాలను, బలదర్పాలను ప్రదర్శించవలసి ఉంటుంది. ఈ భావాలను లయబద్ధం చేసి గానయోగ్యాలుగా మలచినారు. మచ్చుకు కొన్ని

"అన్యాయము నెదిరించని అతడు నిర్వీర్యుడు,
హక్కులకై పోరాడని ఆతడు పశుతుల్యుడు ?
ఎంతటి ధనవంతుడైన ఎంతటి అధికారియైన
జాతి స్పృహ లేనివాడు చచ్చిన వాడితో సముడు ?
తనకు నేర్పిన విద్యలో తనకు దక్కిన సుఖములో
సంఘ నిధికి వంతొసగని జనుడు చోరుడు క్రూరుడు ?"
సూర్యు డుదయిస్తాడు, అస్తమిస్తాడు.
అస్తమించిన వాడు వస్తాడు తిరిగి,
ధర్మ సూర్యుడు వీవు అంబేడ్కరా!
తరలి రావా మరల అంబేడ్కరా!
పులుల పంచల నుండి పాడి
యావుల మంద ఆర్తితో అరచు చున్నది
విడుదలను గోరి, దుష్ట శిక్షణ లేక అంబేడ్కరా?"
శిష్ట రక్షణ ఎట్లు అంటేడ్కరా!

ఇలా చెప్పుకుంటూ పోతే బోయి భీమన్న గారు దేవుడికి సంబంధించినవి, ఇంకా అనేక విషయాలకు చెందిన గేయాలను కూడా బోయి భీమన్న గారు రచించారు. బోయి భీమన్న పాటలు పాడుకున్నా, చదువుకున్నా ఉత్తేజం కలిగిస్తాయి. సూటిగా చెప్పే సూత్రాలు, సరళంగా ప్రబోధించే సిద్ధాంతాలూ, జనసామాన్యంపై ముద్రవేసే సారళ్యమూ, ప్రత్యేకతా కలిగి బోయి భీమన్న గారి గేయాలు వుంటాయి.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం- గేయకావ్యాలు: భాగం-2
2. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం- వచన గ్రంథాలు: భాగం - 2
3. బోయి భీమన్న సమగ్ర సాహిత్యం వచన గ్రంథాలు: భాగం -1

4. బోయి భీమన్న (1996), భీమన్న నక్షత్రాలు గిల్లిచెబుతున్నా (మినీ కవితా కదంబం), హైదరాబాద్, భీమన్న సాహితీ నిధి.

5. శృంగారసంధ్య - భాగవతుల నృసింహశర్మ.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# శ్రీకాకుళం జిల్లా కథా సాహిత్యం - ప్రాంతీయ అస్తిత్వ వివేచన

1. పరిశోధన పర్యవేక్షకులు: **తూలుగు ప్రసాదరావు** (పరిశోధక విద్యార్థి)
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం శ్రీకాకుళం, ఆంధ్ర ప్రదేశ్
2. పరిశోధన పర్యవేక్షకులు:- డాక్టర్ సనపల ఢిల్లీ శ్వరరావు

తెలుగు సాహిత్యంలో వెలువడిన ప్రక్రియలలో కథా ప్రక్రియ ఆధునిక ప్రక్రియ. ఒక సంఘటనను లేదా వ్యక్తి జీవితంలోని ఒక దశను సులువైన రీతిలో పాఠకుల హృదయాలను హత్తుకునేలా కథలలో రాయడం జరుగుతుంది.

1910వ సంవత్సరంలో వెలువడిన గురజాడ అప్పారావు గారి దిద్దుబాటుతో మొదలైన కథా ప్రక్రియ ఇ ప్పటికీ విరివిగా కొనసాగుతుంది. తెలుగు సాహిత్యంలో కొన్ని వేల కథలు వ్రాయబడ్డాయి. వీటిలోని కొన్ని కథలు అంతర్జాతీయ గుర్తింపును పొందాయి. తెలుగు భాషలో వ్రాయబడిన చాలా కథలు జాతీయ, అంతర్జాతీయ భాషలలోకి అనువాదం చెందాయి. కథా రచనతో అనేక మంది రచయితలు మంచి గుర్తింపు పొందారు.

తెలుగు కదా సాహిత్యంలో శ్రీకాకుళం జిల్లా కథా సాహిత్యానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇచ్చట అనేకమంది రచయితలు/రచయిత్రులు ఉత్తమ కథలను రచించారు. వీరి కథలలో శ్రీకాకుళం జిల్లా అస్తిత్వం ప్రతిబింబిస్తుంది. శ్రీకాకుళం జిల్లా ఇతర తెలుగు ప్రాంతంతో అనేక విషయాలు లో భిన్నత్వం కలిగి ఉంది. ఇచ్చటి భౌగోళిక అంశాలు కానీ, జీవన విధానం కానీ, ప్రజల సామాజిక స్థితిగతులు కానీ భిన్నంగా కనిపిస్తాయి. ఈ జిల్లాలోని రచయితలు/రచయిత్రులు రాసే కథలలో ఆయా విషయాలు స్పష్టంగా వెల్లడి అయ్యాయి.

శ్రీకాకుళం జిల్లా కథా రచయితలు/రచయిత్రులు రాసే కథలలో ఈ జిల్లా ప్రజల జీవన విధానం, జిల్లా ప్రజల జీవితాలపై ప్రభావం చూపే అనేక విషయాలు తెలుపబడ్డాయి.

**శ్రీకాకుళం జిల్లా కథా రచయితలు/రచయిత్రులు రాసే కథలలో ప్రాంతీయ అస్తిత్వమును నిలిపే అంశాలు:-**

1. భౌగోళిక అంశాల ప్రస్తావన
2. సామాజిక అంశాల ప్రస్తావన
3. సాంస్కృతిక అంశాల ప్రస్తావన
4. ఆర్థిక, రాజకీయ అంశాల ప్రస్తావన
5. పోరాటాలు, ఉద్యమాల ప్రస్తావన
6. వలస జీవుల వెతల ప్రస్తావన

**1. భౌగోళిక అంశాల ప్రస్తావన:-** శ్రీకాకుళం జిల్లా భౌగోళికంగా వైవిధ్యాన్ని కలిగి ఉంది. సుదూర సముద్ర తీరాన్ని కలిగి ఉంది. దట్టమైన అడవులు ఉన్నాయి. వంశధార, నాగవళి, మహేంద్ర తనయ వంటి నదులు ప్రవహిస్తున్నాయి. శ్రీముఖలింగం, అరసవల్లి, శ్రీకూర్మం వంటి పుణ్యక్షేత్రాలు వెలసి ఉన్నాయి. బౌద్ధమత విశేషాలను తెలియజేసే సాలి హుండం బౌద్ధ క్షేత్రం ఉంది. ఇలా వీటన్నిటితో ఇచ్చటి ప్రజల జీవితాలు పెనవేసుకున్నాయి అని శ్రీకాకుళం కథా రచయితలు/ రచయిత్రులు తమ కథలలో వెల్లడించారు.

**2. సామాజిక అంశాల ప్రస్తావన:-** శ్రీకాకుళం జిల్లా సామాజికంగా చాలా వెనుకబడి ఉన్నది. ఇచ్చట హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాలవారు నివసిస్తున్నారు. సముద్రతీరంలో నివసించే మత్స్యకారులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. తుఫానులు వచ్చే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చేపల వేటను చేస్తుంటారు. సముద్రంలోకి వెళ్లే మగవారు ఎలా ఉన్నారో తెలియక మత్స్యకార స్త్రీలు ఆవేదన చెందుతూ ఉంటారు. కొండలలో నివసించే గిరిజనులు అభివృద్ధికి దూరంగా ఉంటారు. మంచి రవాణా మార్గాలు లేకుండా విద్య, వైద్య సదుపాయాలు లేకుండా కొండలలో నివసిస్తూ ఇవి అవసరము అయినప్పుడు మైదాన ప్రాంతాలకు చాలా దూరం వెళ్లి అనేక ఇబ్బందులకు గురి అవుతూ ఉంటారు అని శ్రీకాకుళం కథా రచయితలు /రచయిత్రులు తమకథలలో వెల్లడించారు.

**3. సాంస్కృతిక అంశాల ప్రస్తావన:-** శ్రీకాకుళం జిల్లా సంస్కృతి చాలా విభిన్నంగా ఉంటుంది. ఈ జిల్లా సంస్కృతిపై ఒరిస్సా రాష్ట్ర సంస్కృతి ప్రభావం కొంతవరకు ఉంటుంది. ఇచ్చటి ప్రజలు ప్రకృతిని ఆరాధిస్తారు. నదులు, పర్వతాలను కూడా దైవంగా భావించి వాటిని పూజిస్తారు. ఇ చ్చటి ప్రజల ఆచార వ్యవహారాలు, వస్త్రధారణ వంటి విషయాలలో ఇతర తెలుగు ప్రాంతంతో కొంత విభిన్నతను కలిగి ఉంటారు అని శ్రీకాకుళం జిల్లా కథా రచయితలు /రచయిత్రులు తమ కథలలో వెల్లడించారు.

**4. ఆర్థిక, రాజకీయ అంశాల ప్రస్తావన:-** శ్రీకాకుళం జిల్లా ఆర్థికపరంగా చాలా వెనుకబడి ఉంది ఇచ్చటి ప్రజలు జీవించటానికి అవసరం అయిన స్థాయిలో ఉపాధి లభించడం లేదు. జిల్లా ప్రజలు అందరూ వ్యవసాయ ఆధారిత జీవితం గడుపుతుంటారు అని చాలీచాలని ఆదాయంతో కుటుంబ పోషణ గడుపుతుంటారు అని రచయితలు తమ కథలలో వెల్లడించారు.

శ్రీకాకుళం జిల్లా ప్రజలు రాజకీయ చైతన్యం కలవారు అని నమ్మితే ప్రాణం ఇస్తారు అని వాళ్ల నమ్మకాన్ని చెడగొడితే ప్రాణాలు తీయడానికి కూడా వెనుకాడరు అని ఇచ్చట ఎందరో స్వాతంత్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు అని పురుషులతోపాటు స్త్రీలు కూడా రాజకీయ చైతన్యాన్ని చూపించారు అని శ్రీకాకుళం జిల్లా కథా రచయితలు /రచయిత్రులు తమ కథలలో వెల్లడించారు.

**5. పోరాటాలు/ ఉద్యమాల ప్రసావన:-** శ్రీకాకుళం జిల్లా ఉద్యమాల పురిటి గడ్డ అని ఈ జిల్లాలో అనేక ఉద్యమాలు చాలా ఉధృతంగా సాగాయి అని వాటిలో ప్రజలు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చురుకుగా పాల్గొన్నారు అని శ్రీకాకుళం జిల్లా కథా రచయితలు /రచయిత్రులు తమ కథలలో వెల్లడించారు.

శ్రీకాకుళం సాయుధ రైతాంగ పోరాటంలో స్త్రీ పురుషులు ఎలా పాల్గొన్నారు, వారు ఎలాంటి తెగువ చూపించారు అని ఈ పోరాటంలో కవులు, కళాకారులు కూడా ఉత్సాహంగా పాల్గొని ప్రజలను చైతన్య పరుస్తూ ఉద్యమాన్ని నడిపించారు అని తమ కథలలో వెల్లడించారు. ఈ ఉద్యమం ఇతర ప్రాంతాలలో జరిగే ఉద్యమాలకు ఏవిధంగా ఆదర్శంగా నిలిచిందో తెలియజేశారు.

సోంపేట థర్మల్ విద్యుత్ పోరాటం ఏ విధంగా జరిగింది దానిలో ప్రజలు ఎలా పాల్గొన్నారు. ఉద్యమాన్ని ఎలా నడిపించారు అనే విషయాలను రచయితలు తమ కథలలో వెల్లడించారు.

**6. వలస జీవుల వెతల ప్రస్తావన :-** శ్రీకాకుళం జిల్లాలోని ప్రజలకు సరిపోయేంత స్థాయిలో ఇచ్చట ఉపాధి లభించకపోవడంతో ఇచ్చటి ప్రజలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు వలస వెళ్లి చాలా కష్టాలను ఎదుర్కొంటూ ఉంటారు. ఇచ్చట వృద్ధ తల్లిదండ్రులను విడిచిపెట్టి పిల్లలు వలస వెళ్లిపోతే వారు అనేక కష్టాలు పడుతూ ఉంటారు. అదేవిధంగా తల్లిదండ్రులు పిల్లలను విడిచి పెట్టి

వెళ్ళిపోతే పిల్లలు తల్లిదండ్రుల ప్రేమానురాగాలకు దూరం అవుతుంటారు. వలస వెళ్లిన వాళ్లు అచ్చటసరి అయిన సదుపాయాలు లేక అనేక ఇబ్బందులకు గురి అవుతూ ఉంటారు అని కొన్ని సందర్భాలలో మరణానికి కూడా గురి అవుతూ ఉంటారు అని రచయితలు తమ కథలలో తెలియజేశారు.

మత్స్యకారులు ఇచ్చట సరిపడే చేపలు వేటలో దొ రకక పోవడం వలన ఇతర ప్రాంతాలకు వెళ్లి ఒక్కోసారి ఇతర దేశాల అధికారులకు చిక్కి బందీలుగా ఆ దేశ జైల్లో మగ్గిపోతుంటారు అనే విషయాలను కూడా శ్రీకాకుళం కథా రచయితలు /రచయిత్రులు తమ కథలలో వెల్లడించారు.

**ఆధార గ్రంధాలు:-**

1. వంశధార కథలు - శ్రీకాకుళ సాహితి
2. నాగవళి కథలు- శ్రీకాకుళ సాహితి
3. బాహుదా కథలు- శ్రీకాకుళ సాహితీ
4. జంఝా వతి కథలు - శ్రీకాకుళ సాహితి
5. కేసరి కథలు - కాళీపట్నం సుబ్బారావు
6. కళింగ కథా జాడ అట్టాడ అప్పలనాయుడు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# దాశరథి నవలలు - సామాజిక చైతన్యం

**డా. జి. వెంకట లాల్**
తెలుగు ఉపన్యాసకులు
CSTS ప్రభుత్వ కళాశాల, జంగారెడ్డి గూడెం, ఏలూరు, ఆంధ్ర ప్రదేశ్.

**స్థూల పరిచయం:-** వట్టికోట అల్వారుస్వామి తెలంగాణా ప్రజా జీవితాన్ని నవలలుగా రాసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఆ క్రమంలోనే రెండో నవల "గంగు" రచన ప్రారంభించారు. 1961 ఫిబ్రవరి 6న వట్టికోట అళ్వారుస్వామి మృతితో "గంగు" అసంపూర్తిగా మిగిలింది. అదే రూపంలో 1965లో పుస్తకంగా వెలువడింది. తెలంగాణా ఉజ్వల పోరాట చరిత్రను నవలీకరించాలన్న వట్టికోట ఆశయం మధ్యలోనే ఆగిపోవడం రంగాచార్యకు బాధ కలిగించింది. ఈ పరిస్థితుల్లో ఎవరూ ముందుకు రాలేదు. ఆ బాధ్యతను తన భుజస్కంధాలపై వేసుకున్నాడు రంగాచార్య "నేను కూడా పూనుకోకుంటే జన్మజన్మాల బూజు నిజాం రాజు ధర్మ ప్రభువుగా చలామణి అవుతాడని భయం. అందువల్ల తప్పనిసరి పరిస్థితుల్లో నేను నవల రాయడానికి పూనుకోవాల్సి వచ్చింది" అంటారు. రంగాచార్య నవలా రచనకు సిద్ధపడిన తర్వాత సొంతంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అయితే ఆళ్వారుస్వామి బాటలో కాకుండా తన సొంత దృక్పథంలో నవలలు రాయాలనుకున్నారు. అందుకు ఒక ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఒక్క తెలంగాణ పోరాటమే కాకుండా సమాజంలోని ప్రతి ఒక సమస్య గురించి తన నవలల ద్వారా వివరిస్తూ వాటికి ఎదురు నిల్చే ధైర్యాన్ని తన రచనల ద్వారా సామాన్య ప్రజలకి తెలియజేసాడు రంగాచర్య. తనదైనా శైలిలో రచనలు చేసారు.

**దాశరథి రచనలు:-** రంగాచార్య మొత్తం తొమ్మిది నవలలు రచించారు. అవి, 1. చిల్లరదేవుళ్లు, 2.మోదుగుపూలు, 3. జనపదం, 4. మాయాజలతారు. 5. రానున్నది ఏది నిజం?, 6. పావని, 7. మానవత, 8. శరతల్పం, 9. అమృంతగమయ. వీటిలో తొలి మూడు నవలలు తెలంగాణ జనజీవితాలను చిత్రించిన పిరియాడికల్ నవలలుగా గుర్తింపు పొందాయి. రచనా పరంగా రెండో నవల మాయజలతారు.

**1. చిల్లర దేవుళు:-** 1938కి పూర్వపు తెలంగాణా ప్రజల జీవితమే "చిల్లరదేవుళ్ళు" కథా వస్తువు. అందుకే రంగాచార్య కొందరు వ్యక్తుల జీవితాలను కాక, ఆనాటి సమాజానికి ప్రతిబింబమైన సంపూర్ణ గ్రామ జీవితాన్ని కథా వస్తువుగా స్వీకరించాడు. గ్రామానికి రెడ్డి, కరణం, రైతు, కోమటి, చాకలి, మంగలి, మాల మాదిగలు సప్తాంగాల వంటివారు. వారితో వాటి గ్రామ వ్యవస్థ తీరుతెన్నులను ప్రదర్శిస్తూనే, అమానుషమైన దొరలు, అధికారుల దోపిడి, దుర్మార్గాలు, వెట్టి, బేగరిలాంటి కట్టుబాట్లు, అడబాపల దుర్భర జీవితాలను వర్ణించాడు.

రామారెడ్డి ఆ గ్రామానికి దేశముఖ్ వెంకట్రావు ఆ గ్రామానికి పట్వారీ కరణం వీరిద్దని దయాదాక్షిణ్యాలమీదే గ్రామ ప్రజల జీవితం ఆధారపడి ఉంటుంది. ఇద్దరికీ అభిప్రాయ బేదాలు ఉన్నా, ప్రజలను దోచుకోవడంలో మాత్రం ఒక్కడిగానే ఉంటారు. గ్రామంలో దొరది మాత్రమే పెద్ద గడీ (భవనం), మిగతా ఒకటి రెండు పెంకుటిళ్లు తప్ప అన్ని పూరి గుడిసెలే, "ఈ గడీ వటవృక్షం. దీని నీడన ఏ గడ్డి మొలవటానికి వీలు లేదు. ఒక ప్రాణి కోసం, కాకుంటే ఒక్క కుటుంబం కోసమే ఈ ఊరంతా వెలిసి నట్లుందని" అనుకుంటాడు పాణి (చిల్లరదేవుళ్ళు పేజీ 36) ఆ గడిలో దొర, దొర భార్య, కూతురు మంజరి ఉంటుంది. వీరితోపాటు అడబాప వనజ ఉంటారు. గ్రామ ప్రజలపై దొర పెత్తనాలు ఏవిధంగా ఉంటాయో దానికి ప్రజల తిరుగుబాటు ఎలా ఉండాలో ఈ నవల ద్వారా అవగతమవుతుంది.

నవలలలో మాడపాటి హనుమంతరావు, నరేంద్రలు సజీవ పాత్రలు. మతమార్పిడి ద్వారా ముస్లింలుగా మారిన వారిని తిరిగి హిందూమతంలో చేర్పించే శుద్ధి ఉద్యమం నిర్వహించిన ఆర్యసమాజం ద్వారా నరేంద్రను ప్రవేశపెట్టారు. నాటి తెలంగాణాలో గ్రంథాలయోద్యమం, నిజాంరాష్ట్రాంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభ, వాటి తెలంగాణా పరిస్థితులకోసం మాడపాటి హనుమంతరావును ప్రవేశపెట్టారు. వీటితోపాట . వీటితోపాటు బతుకమ్మ, దసరా ఉత్సవాలను చేర్చడం నవలకు నిండుదనాన్ని చేకూర్చాయి.

**2. మోదుగు పూలు:-** "మోదుగుపూలు"లో 1938 నుంచి 1948 వరకు, అంటే హైదరాబాద్ "చిల్లర దేవుళ్ళు" నవలలో 1938కి పూర్వపు తెలంగాణా ప్రజా జీవితం సంస్థానంపై పోలీస్ చర్య జరిగే దాక

తెలంగాణా ప్రజా జీవితం, ప్రజా పోరాటానికి ప్రజలు సిద్ధమైన తీరు చిత్రించబడింది. రచనా పరంగా చూసుకుంటే "మోదుగుపూలు" రంగాచార్య మూడో నవల అవుతుంది. కానీ, తెలంగాణా జీవన చిత్రణ క్రమంలో తీసుకున్న రంగాచార్య, "మోదుగుపూలు"లో ఒక జాగీర్ ను కథా వస్తువుగా తీసుకున్నారు. దీని పరిధి విస్తృతం. కొన్ని గ్రామాలు, కోయ గూడాలతో, నిజాం సంస్థానంలో మరో సంస్థానంలా ఉంటుంది. జాగీర్దార్ ఎక్కడో పట్నంలో ఉంటాడు. అతడికి పరిపాలన, ప్రజల క్షేమం పట్టదు. పాలన అంతా తాసిల్దార్ చేతిలో ఉంటుంది. అతనే జాగీరుకు "సర్వతంత్ర స్వతంత్రుడైన" ప్రభువు. అక్కడ ఒక శాసనమంటూ ఏమి ఉండదు. "దండించడమే" శాసనం.

రఘు భూమి కోల్పోయినా మంగలి చేత సమ్మె చేయించి, వారి భూమి తిరిగి వచ్చేలా చేస్తాడు. రఘు పోరాటానికి మంగలి రావడు పూర్తి సహకారాన్ని అందిస్తాడు. తాను చదువు నేర్చుకుని, తమ వారికి చెబుతాడు. వడ్డెర పీరయ్య, పీరమ్మ మృతితో వడ్డెర్లలో చైతన్యం రగిలిస్తారు రఘు, జానకి, నగేశ్ లు అప్పటిదాక తిరుగుబోతుగా ఉన్న పీరయ్య కొడుకు భీముడు రఘు ఉద్యమంలో చేరతాడు. తాసిల్దార్ బంగ్లాకు వెట్టికి రాళ్ళు కొట్టమని, కూలీ ఇవ్వాలని అడుగుతారు. విజయం సాధిస్తారు. నవలలో మరో ప్రధాన విషయం కోయలు. నాగరికతకు దూరంగా అడవుల్లో ఉండే కోయలు కూడా తాసిల్దారుకు వెట్టి చేయాల్సిందే. తాసిల్దార్ బంగ్లా నిర్మాణం కోసం వారు గ్రామానికి వచ్చినప్పుడు వారిలోనూ చైతన్యం నింపుతాడు రఘు.

వార్తా పత్రిక చదవడమే నిషిద్ధమైన జాగీర్ లోకి వార్తా పత్రిక తెస్తాడు రఘు తేవడమే కాదు, ఊరి ప్రజలందరిచేత చదివిస్తాడు. నవలలో చాలా సందర్భాల్లో జాతీయ, అంతర్జాతీయ అంశాలు చర్చకు వస్తాయి. నాగరిక సమాజానికి దూరంగా కోయల ఆచార వ్యవహారాలు సహజ సుందరంగా చిత్రించారు రచయిత. చారిత్రక అంశాలతోసహా పీర్ల పండగ వృత్తాంతాన్ని జరుపుకునే విధానం వివరంగానే వర్ణించబడింది. జాగీర్దార్ల జల్లాలు, తాసిల్దార్, గిర్దావరు, అమీన్, సాహుకారుల దోపిడి, పీడన, అరాచకత్వం ఎలా ఉంటుందో నవలలో చిత్రించబడింది. రఘు పాత్రలో ప్రవేశించి రచయిత అన్యాయాన్ని ఎదురునిలవడం ఎలాగనే ప్రజలకు తెలియజేసారు.

**3. మాయ జలతారు:-** మాయ జలతారు కథా వేదిక నగరం. నగరంలో భిన్న సమస్యలని చిత్రిస్తుంది "మాయ జలతారు". గ్రామ సీమలనుంచి పొట్ట చేతబట్టుకుని నగరాన్ని వచ్చినవారితో ఒక గుడిసెల గూడెం వెలుస్తుంది. వారు గుడిసెలు వేసుకున్నప్పుడు ఆ భూమికి విలువలేదు. అందుకే ఎవ్వరేమనలేదు. ఆ గూడెంలో అన్ని రకాల పనులు చేసేవారు ఉంటారు. రెక్కల కష్టం మీద బతికే జనం, వచ్చిన కొన్ని డబ్బులను కల్లుకు తగలేస్తారు. చాలీచాలని తిండితో పిల్లా జెల్ల కడుపులు మాడ్చుకొంటారు. కనీసం రేషన్ బియ్యం కూడా కొనలేని పరిస్థితి. తినడానికి తిండి లేక పోయినా, వారిలో మంచితనం, మానవత్వం, త్యాగగుణం పుష్కలంగా ఉంటాయి.

నగరంలో పెరుగుతున్న వ్యాపార సంస్కృతితో భూమి విలువ పెరుగుతుంది. దాంతో గుడిసెలున్న స్థలం తన పేరు చేసుకుంటాడు ఉస్మాన్ భూమి తనది కాబట్టి గుడిసెకు ఐదు రూపాయలు కిరాయి ఇవ్వమంటాడు. పిచ్చయ్య, బాలయ్యలు ముందు నిలిచి ఉస్మాన్ గూండాలను ఎదిరిస్తారు. పిచ్చయ్యను పోలీస్ స్టేషన్లో వేస్తాడు సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు. బాలయ్యను హుసేన్, సింగ్లు గాయపరిచారు. బాలయ్యకు డాక్టర్ ఇక్బాల్ వైద్యం అందిస్తాడు. డాక్టర్ ఇక్బాల్, న్యాయవాది మహబూబ్ కిషన్లు గుడిసెవాసులు పోరాటానికి మద్దతుగా నిలబడతారు. తర్వాత బాలయ్య కొడుకు రామారావు నాయకత్వంలో గుడిసెవాసులు విజయం సాధిస్తారు.

పెద్దవారి భోగాలకు, వ్యాపారాలకు బలయ్యే స్త్రీలకు ప్రతీక డైజీ. సూర్యారావులాంటివారు అమాయక స్త్రీలను సినిమాల పేరుతో, తమ అవసరాలకు ఎలా ఉపయోగించుకుంటారో వర్ణించబడింది. అనైతిక కార్యక్రమాలకు పెద్ద హోటళ్లు కేంద్రం అనే దానికి నిదర్శనం నయాగరా హెటల్. నగరాల్లో పెద్ద మనుషులుగా చలామణి అయ్యేవారి చీకటి సామ్రాజ్యం ఎలా ఉంటుందో, వారి అధికార దర్పం ఎలా ఉంటుందో అన్న దానికి ఉస్మాన్ ప్రతీక. వీటితోపాటు మహంకాళీ జాతర, బోనాలు, రంగం వృత్తాంతాలు కూడా నవలలో చోటుచేసుకున్నాయి. ఈ నవల ద్వారా రంగాచర్య గారు ఆనాటి సమస్యలని ఆ సమస్యలనుండి బయటపడే దారులని సూచించడం జరిగింది.

**4. జన పదం:-** "జనపదం" ఇతివృత్తం చాలా విశాలమైనది. 1948 తర్వాత తెలంగాణ ప్రజల్లో వచ్చినమార్పు, మారిన గ్రామ స్వరూపాలు, స్వాతంత్ర్యం తరువాత కూడా మారని బడుగుల

జీవితాలు, దొరల దోపిడీ, కలుషితమైన రాజకీయాలు, ఎన్నికల ప్రహసనాలు, తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న వీరులు నిస్సహాయులుగా మారడం, ఆ నిస్సహాయతలోంచి కొత్త తరం ఆవిర్భవించడాన్ని నవలలో చిత్రించారు. రంగాచార్య. రంగాచార్య మిగతా నవలల్లాగే ఇందులోనూ భూ సమస్య ప్రధానంగానే కనిపిస్తుంది.

తెలంగాణా రైతాంగ పోరాట కాలంలో తుపాకీ మనుషులకు భయపడి గ్రామాన్ని వదిలి నగరానికి చేరుకుంటాడు దేశముఖ్ బలరామయ్య. పోలీస్ చర్య తర్వాత పోలీసుల సహాయంతో మళ్లీ గ్రామానికి చేరుకోవడంతో నవల ప్రారంభం అవుతుంది. గడిలోకి ప్రవేశించిన బలరామయ్యకు ఆడబాప అమృతవాణి కనిపిస్తుంది. బలరామయ్యకు, అమృతవాణికి పుట్టినవాడు రామయ్య. అతడు దొరను ఎదిరించేందుకు తుపాకులవాళ్లతో కలుస్తాడు. బలరామయ్య ప్రజల ఆధీనంలో ఉన్న తన భూములను, పశువులను, వస్తువులను స్వాధీనం చేసుకుంటాడు. తుపాకులవాళ్లకు వీరభద్రం నాయకుడు. ఆ దళంలోని వాడే జగ్గయ్య. తుపాకుల వాళ్ల ఆచూకికోసం జగ్గయ్యను హింసిస్తారు. ఎంత హింసించినా ఆచూకి చెప్పడు జగ్గయ్య. పోలీస్ అధికారి శివరావు తుపాకీ గుండుకు బలవుతాడు. తుపాకులవాళ్లను మోసంచేసి వారి డబ్బును తీసుకొని పారిపోయి బలరామయ్య పంచన చేరతాడు రామయ్య.

నవలలో సుందర్రావు పాత్ర వినోబాబావేకు ప్రతీక. దొరల నుంచి భూమిని దానంగా తీసుకుని పేదలకు పంచుతుంటాడు.సరస్వతి పాత్ర సుందర్రావుకు శిష్యురాలిగా మారిపోతుంది. ఖద్దరు తప్ప అన్యం ధరించదు. ఎప్పుడు ఖద్దరు ఒడుకుతూ, ఆధ్యాత్మిక భావనలో ఉంటుంది. అయితే భూదానోద్యమంలో లోపాలను రచయిత చిత్రించారు. తన ఉద్యమం విఫలం కావడం తట్టుకోలే గాంధేయవాది సుందర్రావు ఉపవాసం చేసి, ప్రాణాలు త్యజిస్తాడు. అతని మరణ తర్వాత సరస్వతి అమ్మగా మారిపోతుంది. బలరామయ్య, శివరావు, ఇతర మంత్రులు 'అమ్మ భక్తులుగా మారుతారు. "అమ్మ"గా గ్రామానికి వచ్చిన సరస్వతి, వీరభద్రం శారీరకంగా కలుసుకొంటారు. తర్వాత సరస్వతి, బలరామయ్య, శివరావుల సమేతంగా అమెరికాకు వెళ్లిపోతుంది.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

ఒక సుదీర్ఘమైనా కథాంశంతోపాటు, నవలలో నిజాం నవాబుపై బాంబులు వేయడం, భూదానోద్యమం, ముల్కి ఉద్యమం ఒక లాంటి చారిత్రక సంఘటనలు, బారసాల, ఉగాది పండగ, కాముని పున్నమి వృత్తాంతాల ద్వారా తెలంగాణా ప్రజల సాంఘిక చరిత్రను చిత్రించారు రంగాచార్య,

**5. రానున్నది ఏది నిజం:-** పెట్టుబడిదారీ వ్యవస్థలో శ్రమ దోపిడీని గుర్తించాడు కారల్ మార్క్స్. శాస్త్రీయ సోషలిజాన్ని ప్రవచించాడు. ఆస్తి వైయక్తికం కాకుండా, సమాజ పరమైప్పుడు ఆ దోపిడీ నశిస్తుందని చెప్పాడు. ఆ వ్యవస్థలో వ్యక్తులకు ఆస్తులు ఉండవు, అంతా సమాజానిదే. సామ్యవాద వ్యవస్థలో, మనిషి వ్యవస్థ కోసం, వ్యవస్థ మనిషి కోసం పనిచేస్తాయి. విద్య, వైద్యం ఉచితం. నిరుద్యోగం, ఆకలి, ఉండవు. ఇలాంటి సమాజం భారత దేశంలో వస్తే, రాజకీయ, ఆర్థిక, సాంఘిక మార్పులు ఎలా ఉంటాయో "రానున్నది ఏది నిజం?" నవలలో చిత్రించాడు రంగాచార్య.

**6. పావని:-** స్వాతంత్ర్యం వచ్చిన 30 ఏళ్ల తర్వాత కూడా, స్వరాజ్య కాంతులు ప్రసరించని గ్రామాలు, అభివృద్ధి జాడ అంటని గ్రామాలు, మధ్య యుగాలనాటి భూస్వామ్య వ్యవస్థకు చిహ్నమైన పాలన, వెట్టిచాకిరీకి నిలయంగా మారిన గ్రామాల దుస్థితిని, ప్రజల వెతలు, అమానుషమైన అంటరాని తనాన్ని "పావని" నవలలో చిత్రించారు రంగాచార్య. మల్లమ్మ శివయ్యకు బానిస. మల్లమ్మ భర్త పరమయ్య పెళ్లికి అప్పు చేశాడు. శివయ్యకు అమ్ముడు పోయాడు. చేసిన అప్పుకు వడ్డీకింద శివయ్యకు చాకిరీ చేయాలి. నిత్యం తిండికి ఇచ్చే గింజలు మళ్లీ అప్పు. పనిచేయనినాడు బత్తెం ఇవ్వరు. వడ్డీ పెరుగుతుంది. ఒకసారి జ్వరం వచ్చి పనిలోకి రాలేకపోతాడు పరమయ్య చెట్టు కట్టేసి కొట్టిస్తాడు. పరమయ్య ఊర్లోనుంచి పారిపోతాడు. అతని భార్య మల్లమ్మను తెచ్చి ఇంట్లో పనికి పెట్టుకున్నాడు. ఆమెను పశువు కంటే హీనంగా చూస్తారు. కొడతారు. మల్లమ్మ తమ్ముడు పెంటయ్య కూడా శివయ్యకు అమ్ముడు పోయాడు. పెంటయ్యే కాదు ఊరు సొంతం శివయ్యకు అమ్ముడు పోయిన వాళ్లే. బి.ఎ వరకు చదువుకున్న పావని ఆ గ్రామంలోకి చదువు చెప్పడానికి టీచర్ వస్తుంది. పిల్లలకు పాఠాలతోపాటు, ప్రభుతం వచ్చే భోజనం, వారి కుటుంబాలకు డబ్బులు అందిస్తుంది. గూడెంలో రాత్రి పాఠశాల నడుపుతుంది. శివయ్య దోపిడీని వారికి వివరిస్తుంది. తాగుడు మాన్పిస్తుంది. ప్రజలు శివయ్యను ఎదిరించేందుకు శివయ్య ఎన్ని ప్రయత్నాలు చేసినా పావనిని ఏమీ చేయలేకపోతాడు. శివయ్య నుంచి గ్రామానికి విముక్తి కలిగిస్తుంది. చివరికి శివయ్య

తన నమ్మిన బంటు నర్సిమ్మ చేతిలోనే హత్య చేయబడతాడు. ఈ నవల ద్వారా దాశరథి రంగచార్యులు గారు మారుమూల గ్రామాలలోని దుస్థితి గురించి వాటిని ఎదుర్కొనే తీరును వివరించారు.

**7. మానవత:-** మత నేపథ్యంలో సాగిన నవల "మానవత". రంగాచార్య నవలలన్నింటిలో "మనిషి, మానవత" అంత:స్సూత్రంలా ఉంటాయి. జన్మత: వ్యక్తి మంచివాడినని, సమాజమే అతన్ని చెడ్డవానిగా మారుస్తుందని, అందుకే సమాజాన్ని మార్చాలనే మాటలు, మనకు చాలా చోట్ల కనిపిస్తాయి. అయితే, డబ్బు పరంగానే కాకుండా, మత ఛాందసవాదులు, మానవతను మతం ముసుగులో ఎలా బంధిస్తారో, అలాంటివారిలో సైతం ప్రాణంపైకి వచ్చినప్పుడు మతాలను పక్కనపెట్టి మానవత ఎలా పెల్లుబుకుతుందో నవలలో చిత్రించారు రచయిత. అంతిమ విజయం మానవతదే అన్న సత్యాన్ని ఇందులో నిరూపించారు.

ఏటి ఒడ్డున ఉన్న ఒక గ్రామం వేదికగా నవల నడుస్తుంది. ఆ గ్రామాన్ని వరద ముంచెత్తడంతో నవల ప్రారంభం అవుతుంది. ఏటి వరద గంట గంటకు పెరుగుతుంది. మరికొంత పెరిగితే గ్రామం మునిగిపోతుంది. ఆ విషయం తెలుసు అందరికి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు గ్రామస్థులు. ముకుందరావు ఆ ఊరి బ్రాహ్మణుడు. దైవభక్తి అధికం. ఆయన వర్షాన్ని తగ్గించమని రాముణ్ని వేడుకుంటాడు. అదే గ్రామంలో ఉండే ఫాదర్ జాన్ క్రైస్తవుడు. అతనికీ దైవభక్తి అధికమే. వర్షాన్ని తగ్గించి ప్రజలను రక్షించమని ప్రభువును వేడుకుంటాడు. ప్రార్ధనలు చేస్తాడు. వర్షం తగ్గిపోతుంది. ముకుందం, జాన్ ఇద్దరూ ఏటికి వెళతారు. ఏటి హెరు తగ్గింది. తాను రాముణ్ని ప్రార్థించకుంటే ఏరు ఊరును మింగేది అనుకుంటాడు ముకుందం. ఏసు ప్రభువు గ్రామాన్ని కాపాడాడని జాన్ అనుకుంటాడు. ఇద్దరు తారసపడతారు. కుశల ప్రశ్నల తర్వాత, రాముడు గొప్ప అని ముకుందం, ఏసు ప్రభువు గొప్ప అని జాన్ ఇద్దరూ వాగ్వాదానికి దిగుతారు. జాన్ కొడుకు పాల్ వచ్చి, ఇద్దరికీ సర్ది చెబుతాడు. అయినా ఒకరి మతంపై ఒకరికి ఈర్ష్యా ద్వేషాలు ఏ మాత్రం తగ్గవు.

**8. శరతల్పం:-** రంగాచార్య "శరతల్పం" నవలలో కోరికలు మృత్యువును గెలుస్తాయని నిరూపించడంతోపాటు, గ్రామీణ మొదలువ్యవస్థలో కుల కట్టుబాట్లు, అంటరానితనం ఎంత పాశవికంగా

ఉంటాయో నవలలో వర్ణించాడు. మలినం లేని స్నేహానికి కులాలు అడ్డంకి కావని నారాయణస్వామి, గురువయ్య పాత్రల ద్వారా నిరూపించాడు.

ముందు తాగుబోతుగా ఉన్న గురువయ్యకు క్రమంగా ఆధ్యాత్మిక భావం అలవడుతుంది. తాగుడు మానేస్తాడు గ్రామంలో గురువయ్యపై అందరికీ సదభిప్రాయం ఏర్పడుతుంది. నాంచారమ్మను చూసి పిచ్చమ్మ తన ఇంటిని శుభ్రంగా ఉంచుకుంటుంది. అయితే గ్రామానికి వచ్చిన హరిదాసు, రామాయణ కథ పూర్తి చేయకుండానే, రామకిష్టయ్య కూతురు బాల వితంతువు వెంకమ్మను, అతని డబ్బును దోచుకని పారిపోతాడు. రామాయణంలో మిగిలిన కథను నారాయణస్వామి దగ్గర చెప్పించుకుంటాడు గురువయ్య. మధ్యలోన సందేహాలు తీర్చుకుంటాడు. రామాయణం తర్వాత భాగవతం ప్రారంభిస్తాడు నారాయణస్వామి. అయితే ఈ ఈ మధ్యలో గురువయ్యకు క్షయ వ్యాధి తగులుతుంది. నారాయణస్వామి పట్నం తీసుకుపోయి, క్షయ ఆస్పత్రిలో చేర్పిస్తాడు. కొన్నాళ్ళకి రోగం ముదిరుతుంది. గ్రామానికి తీసుకొస్తారు. "బతికి చేసిడ దేమున్నదుండి. భాగవతం ఇని చావాలె" అంటాడు గురువయ్య. భాగవతం కొనసాగిస్తారు నారాయణస్వామి, భాగవతం వినడానికి జనం తండోపతండాలుగా వస్తారు. పక్క గ్రామాల నుంచి బండ్లు కట్టుకొని వస్తారు. రామకిష్టయ్య ఆస్తిని కోల్పోతాడు. కాలు, చేయి, మాట పడిపోతుంది. గురువయ్య, నారాయణస్వామి భూములు తిరిగి ఇస్తానంటాడు. వారు నిరాకరిస్తారు. భాగవతం కథ పూర్తవుతుంది. గురువయ్య చేతులను నారాయణస్వామి పాదాలమీద వేస్తాడు. తనువు చాలిస్తాడు. "గురువయ్య పరిమపదించిన్రు" అంటాడు నారాయణస్వామి గోడకు ఆనుకొని కూర్చున్న పిచ్చమ్మ గురువయ్యను చేరుకుంటుంది. ఈ నవల ద్వారా చెడు అలవాట్లకి బానిసయినవారు మారే తీరు మన భారత, భగవతాల విలువలు వాటిలో సందేశం రచయిత తెలియజేసారు.

**9. అమృతాంగమయ:-** "అమృతం గమయ"లో మొత్తం 21 భాగాలున్నాయి. ఒక గ్రామ స్థాపన మొదలు దాని క్రమ వికాసం, పారిశ్రామికరణ, పాశ్చాత్యీకరణ సమాజంలో తెచ్చిన మార్పులు, పడిపోతున్న మానవ విలువలు కన్నులకు కట్టినట్లు చిత్రించి 'అమృతంగమయ'. వేద సమాజాన్ని, నేటి సమాజాన్ని సమాంతరంగా వివరిస్తూ, మరణం వైపు పయనిస్తున్న మానవజాతిని అమృతంవైపు- ఒక

ఉన్నతమైన సమాజ స్థాపన దిశగా పయనింపజేస్తుంది. కథనంలో సందర్భోచితంగా భారతీయ ప్రాచీన సమాజంలోని ఉన్నతమైన విలువల్ని, సాంప్రదాయం, సాహిత్యంలోని కథలను ఉటంకించారు రంగాచార్య. మనము ఎక్కడి నుంచి వచ్చాం ఎక్కడికి వెళ్తున్నాం. అది సరైనదా, కాదా? మనం ఎటు ప్రయాణించాలి? అనే ప్రశ్నలకు ఈ నవల చక్కని సమాధానం ఇస్తుంది. అయితే నవలలో కథ చెప్పడం కన్నా సంఘటన చెప్పడమే రంగాచార్య ప్రధాన ఉద్దేశం. అందుకే నవలలో ప్రధాన కథకన్నా, సంఘటనల చిత్రీకరణే అధికంగా కనిపిస్తుంది.

అతీంద్రియ శక్తి గల బోధి వృక్షం, ధ్రువమండలం నుంచి వచ్చిన అసమా అనే వ్యక్తికి మధ్యజరిగే సంభాషణ ఈ నవల. ఒకప్పటి ఆత్మానందస్వామి ఆశ్రమంలో ఉండే ఆ బోధి వృక్షానికి అన్నీ కనిపిస్తాయి. అన్ని వినిపిస్తాయి. కానీ ఆ చెట్టు, ఎవరికీ కనిపించదు, వినిపించదు. అక్కడ ఆశ్రమమనే పేరు తప్ప ఏమీ మిగలలేదు. ధ్రువ మండలం నుంచి వచ్చిన అసమాకూడా ఎవరికీకనిపించడు. వినిపించడు. తమ ప్రజలకు శాంతిని పంచడంకోసం ధ్రువ మండలం నుంచి భరత ఖండానికి వచ్చాడు. 40 రోజులపాటు ఆ ఆశ్రమ ప్రాంగణంలో ఉంటాడు. అసమా ఎలాంటి పూజలు చేయకపోయినా, భారతీయ కర్మ సిద్ధాంతాన్ని అనుసరించి స్వామి అతన్ని కరుణిస్తాడు. బోధి వృక్షం ద్వారా స్వామి మాట్లాడిస్తాడు. చీకటిపడ్డ తర్వాత, వేగుచుక్క పొడిచేవరకు మాత్రమే బోధివృక్షం మాట్లాడగలుగుతుంది. వీరి మధ్య సాగే సంభాషణే ఈ నవల.

**ఉప సంహారం:-** అక్షర వాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్య జీవితం భిన్న వైరుధ్యాల నిలయం. ఉత్తర దక్షిణ ధ్రువాల్లాంటి మార్క్సిజం, సంప్రదాయం ఆయనలో ఒక్కటిగా ఇమిడిపోతాయి. ఆయనను చూస్తే నిజాం నవాబుకు వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరులో తుపాకీ పట్టి పోరాటం చేశారని, ఆయన నుదిటిపై కనిపించే తిరునామాలు చూసి ఆయనొక మార్క్సిస్టు అని ఎవరూ అనుకోరు. కానీ, ఆయన విప్లవ శక్తికి ప్రతీక. ఆయన జీవితమే ఉద్యమం. ఉద్యమమే ఆయన జీవితం. రంగాచార్య మార్క్సిజాన్ని ఎంతగా ప్రేమిస్తారో, సంప్రదాయాన్ని అంతగా ఇష్టపడతారు. నిక్కమైన నీలాంటి నవలలు అందించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన రంగాచార్య, అదే చేత్తో రామాయణ, భారత, భాగవతాలు, వేదాలు, ఉపనిషత్తులు తెలుగుజాతికి తేట తెలుగు వచనంలో అందించారు. భిన్నత్వంలో ఏకత్వం అనే

భారతీయ దృక్పథానికి నిలువెత్తు నిదర్శనం దాశరథి రంగాచార్య. స్వాతంత్ర్య సమరయోధుడిగా, అక్షర వాచస్పతిగా ప్రజల హృదయపీఠం అధిరోహించారు దాశరథి రంగాచార్య. తన నవలల ద్వారా సమాజంలో చైతన్యం తీసుకొచ్చి చాలా సమస్యలకు పరిష్కారాలు చూయించిన దార్శనికుడు దాశరథి.

**ఉపయుక్త గ్రంథాలు:**

1) చిల్లర దేవుళ్ళు నవల, దాశరథి రంగాచార్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1997

2) అమృతం గమయ నవల, దాశరథి రంగాచర్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2004,

3) దాశరథి రంగాచర్య రచనలు, దాశరథి రంగాచర్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 2015.

4) దాశరథి రంగాచర్య, డా. వి. జయప్రకాశ్, తెలుగు అకాడమీ ప్రచురణ, హైదరాబాద్, 2017.

5) మోదుగుపూలు, దాశరథి రంగాచార్య, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1999.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# తెలుగు సాహిత్యంలో సామాజిక స్పృహ

**డా. కోలా శేఖర్**
శాఖాధిపతి,తెలుగు, హిందీ, సంస్కృత శాఖలు,ఆంధ్ర లొయోల కళాశాల (A),విజయవాడ.
9441441097,kolasekhara@gmail.com

## 1. పరిచయం

తెలుగు సాహిత్యం సదా సమాజంలోని సంఘటనలకు, సామాజిక సమస్యలకు ప్రతిబింబంలా వ్యవహరించింది. సాహిత్యకారులు తమ రచనల ద్వారా సమాజంలోని అనేక సంక్షోభాలను, అన్యాయాలను, మానవీయ విలువలను ప్రతిబింబించారు.

తెలుగు సాహిత్యం మానవ సమాజపు జీవిత సత్యాలను ప్రతిబింబించే ఒక శక్తిమంతమైన మాధ్యమంగా నిలుస్తుంది. ఇది కేవలం అక్షరాల సంగ్రహం మాత్రం కాకుండా, సమాజంలోని లోతైన భావనలకు, సంఘర్షణలకు, మానవీయ అనుభవాలకు స్వరం అందించే ఒక బలమైన వేదిక. రచయితలు తమ రచనల ద్వారా సమాజంలోని వివిధ పరిణామాలను, సామాజిక సంస్కృతిలోని సంక్లిష్ట పరిమాణాలను అన్వేషించారు.

సాహిత్యపు సామాజిక స్పృహ అనేది సాంప్రదాయిక సంఘ వ్యవస్థలను ప్రశ్నించుటకు, వివిధ సామాజిక అన్యాయాలను వెలుగులోకి తెచ్చుటకు, మానవ సంబంధాల నాటకీయ పరిణామాలను అధ్యయనం చేయుటకు ఒక ప్రధాన సాధనంగా నిలిచింది. స్త్రీ స్వాతంత్ర్యం, దళిత సమస్యలు, రైతు బాధలు, జాతి వ్యవస్థ మరియు వర్గ భేదాలు వంటి సామాజిక సంఘర్షణలను తెలుగు రచయితలు తమ రచనల ద్వారా సుస్పష్టంగా అభివ్యక్తం చేశారు.

సమయం మారుతున్న కొద్దీ, తెలుగు సాహిత్యం కూడా అభివ్యక్తి గురించిన కొత్త మార్గాలను అన్వేషించింది. 19వ శతాబ్దం చివరి నుంచి 20వ శతాబ్దం మధ్యభాగం వరకు, రచయితలు సామాజిక సంఘటనలను అతి స్పష్టంగా మరియు సంక్షోభాత్మకంగా వివరించారు. వారి రచనలు కేవలం సాహిత్యం మాత్రమే కాకుండా, సమాజంలో మార్పు తీసుకొచ్చే బలమైన సాధనంగా నిలిచాయి.

తెలుగు సాహిత్యం యొక్క ఈ సామాజిక స్పృహ ఒక సంప్రదాయం, సంస్కృతి, మరియు సమాజం యొక్క సంక్లిష్ట పరిణామాల యొక్క సంపూర్ణ అధ్యయనం. రచయితలు తమ రచనల ద్వారా సమాజంలోని లోతైన సత్యాలను, మానవీయ అనుభవాలను, సంఘర్షణలను మరియు సంప్రదాయాలను సాక్ష్యం వహించారు. ఇది కేవలం సాహిత్యం మాత్రమే కాకుండా, సమాజం యొక్క బోధన, సంఘర్షణ, మరియు మార్పు యొక్క వాస్తవిక నిర్మాణం అని చెప్పవచ్చు.

ఈ పత్రం తెలుగు సాహిత్యంలో సామాజిక స్పృహ యొక్క వివిధ అంశాలను అన్వేషించింది.

**2. ఐతిహాసిక నేపథ్యం**

19 వ శతాబ్దం చివరి నుండి 20 వ శతాబ్దం మధ్యభాగం వరకు తెలుగు సాహిత్యం సమాంతరంగా సాంఘిక వ్యవస్థలను ప్రశ్నించసాగింది. బ్రిటిష్ వారి పాలనా కాలంలో, సాహిత్యం సంఘంలోని లోతైన అన్యాయాలను వెలుగులోకి తెచ్చేందుకు ఒక బలమైన మాధ్యమంగా నిలిచింది. సాంప్రదాయిక సామాజిక వ్యవస్థలు, జాతి వ్యవస్థ, అంతర్వర్గ సంఘర్షణలు, స్త్రీల సామాజిక స్థాయి వంటి సంక్లిష్ట అంశాలను రచయితలు తమ రచనల ద్వారా తీవ్రంగా ప్రతిపాదించారు.

ఆ కాలంలోని సాంఘిక రచయితలు, అందరిలోనూ చలం, రావిశాస్త్రి, శ్రీ శ్రీ, కొకు, విశ్వనాథ సత్యనారాయణ వంటి రచయితలు, సమాజంలోని అగోచర అన్యాయాలను బయటపెట్టేందుకు తమ రచనలను ఉపయోగించారు. వారు సాహిత్యాన్ని కేవలం అలంకారం మాత్రం కాకుండా, సాంఘిక మార్పుకు ఒక సాధనంగా రూపొందించారు. వారి రచనలు జాతి, మత, వర్గ, లింగ భేదాలను తీవ్రంగా ప్రశ్నించాయి.

స్త్రీ స్వాతంత్ర్యం మరియు వారి సాంఘిక స్థాయి అనేది ఆ కాలంలో తెలుగు సాహిత్యంలో అత్యంత ముఖ్యమైన అంశం. రచయితలు స్త్రీల బాధలను, వారి సామాజిక పరిమితులను, వివక్షను తమ రచనల ద్వారా స్పష్టంగా వ్యక్తం చేశారు. బాల్య వివాహాలు, స్త్రీల విధివిధానాలు, వారి సంపూర్ణ స్వేచ్ఛ వంటి అంశాలను తీవ్రంగా ప్రతిపాదించారు.

దళిత సాహిత్యం కూడా ఈ కాలంలో బలంగా వ్యాపించింది. తీవ్ర సామాజిక అన్యాయాలకు, వివక్షలకు, వర్గ సంఘర్షణలకు వ్యతిరేకంగా రచయితలు తమ రచనలను ఒక బలమైన సాధనంగా ఉపయోగించారు. వారు దళిత సంఘంలోని మానసిక మరియు సామాజిక బాధలను, అన్యాయాలను తమ రచనల ద్వారా వెలుగులోకి తెచ్చారు.

అదేవిధంగా, రైతు సమస్యలు, భూపాలన, సాంఘిక అసమానతలు కూడా తెలుగు సాహిత్యంలో ప్రముఖ అంశం అయ్యాయి. రైతు బాధలు, వారి ఆర్థిక పరిస్థితులు, భూ సంబంధ అన్యాయాలు రచయితలు తమ రచనల ద్వారా స్పష్టంగా ప్రతిపాదించారు. వారు రైతు సంఘంలోని లోతైన సమస్యలను బయటపెట్టేందుకు తమ రచనలను ఒక బలమైన సాధనంగా ఉపయోగించారు.

ఈ రీతిగా, తెలుగు సాహిత్యం కేవలం సాహిత్య ప్రక్రియ మాత్రమే కాకుండా, సంఘంలో మార్పు తీసుకొచ్చే ఒక శక్తిమంతమైన సాధనంగా నిలిచింది. రచయితలు తమ రచనల ద్వారా సాంఘిక సంఘర్షణలను, అన్యాయాలను, మానవీయ విలువలను ప్రశ్నించారు. సరళంగా చెప్పాలంటే, తెలుగు సాహిత్యం ఒక సాంఘిక నవీకరణ ఉద్యమంగా నిలిచింది.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## 2.1 సాహిత్యంలో సామాజిక సవాళ్ళ ప్రతిబింబం

ఆధునిక కాలం తెలుగు సాహిత్యం సమాంతరంగా సాంఘిక సవాళ్లను ప్రతిబింబిస్తున్న ఒక అద్భుతమైన కాలం. ఈ కాలంలో సాహిత్యం కేవలం సాహిత్యం మాత్రమే కాకుండా, సాంఘిక మార్పుకు ఒక బలమైన సాధనంగా నిలిచింది. రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక మారుపలతో నిండిన ఈ కాలం సాహిత్యం ద్వారా సమాజంలోని లోతైన సంఘర్షణల, అన్యాయాల, మానవీయ అనుభవాల బయటపడుట జరిగింది.

ఈ కాలంలోని ప్రముఖ రచయితలు - చలం, రావిశాస్త్రి, శ్రీశ్రీ, కొకు, విశ్వనాథ సత్యనారాయణ - తమ రచనల ద్వారా సమాజంలోని అగోచర సత్యాలను వెలుగులోకి తెచ్చారు. కొకు జాతి వ్యవస్థ మరియు సామాజిక అసమానతలను ప్రశ్నించగా, చలం స్త్రీల బాధలను మరియు వారి సామాజిక స్థాయిని ఆమూలాగ్రం కనుక్కున్నారు. శ్రీశ్రీ తమ కవితల ద్వారా సంఘంలోని సంఘర్షణల, ఆంతరంగిక సంఘటనల గురించి తీవ్ర అభిప్రాయం వ్యక్తం చేశారు. రావిశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ సమాజంలోని అగోచర అన్యాయాలను, దళిత బాధలను, రైతు సమస్యలను వెలుగులోకి తెచ్చారు. వీరందరూ సాహిత్యాన్ని సాంఘిక మార్పునకు ఒక బలమైన సాధనంగా ఉపయోగించారు.

**2.2 సాంస్కృతిక సంఘర్షణలు :**ఆధునిక యుగ తెలుగు సమాజంలో సాంస్కృతిక సంఘర్షణలు అత్యంత గొప్ప మార్పులను కలిగించాయి. జాతి, వర్గ, లింగ అసమానతలు సమాజం యొక్క అంతర్గత నేపథ్యాన్ని ఆమూలాగ్రం బయల్పరిచాయి. అన్ని వర్గాల మధ్య అసమానత కొనసాగుచుండగా, దళిత వర్గాలు తీవ్ర భేదభావాలకు మరియు సామాజిక నిర్బంధనలకు గురవుతూ ఉండేవి. స్త్రీలు కూడా సమాజంలో రెండవ వర్గం వారిగా భావించబడి, తమ సొంత అభిప్రాయాలు, అభివృద్ధి అవకాశాలు లేకుండా ఉండేవి.

భారతీయ సంఘంలో ఆధునికీకరణ మరియు సంప్రదాయ విలువల ఛాందసుల మధ్య తీవ్ర సాంస్కృతిక సంఘర్షణ జరిగింది. పాత సంప్రదాయాలు మరియు కొత్త సాంకేతిక పరిజ్ఞానం వారి మధ్య తీవ్ర తిరుగుబాటు జరుగుతూ ఉండేది. బాల్య వివాహాలు, బహుభార్యత్వం, కులపు నిర్బంధాలు వంటి సంప్రదాయ సంస్కృతులు ఆధునిక యుగ దృష్టిలో తీవ్ర సమస్యలుగా కనిపించసాగాయి. ఈ సంప్రదాయ ఛాందసులే సమాజంలో అనేక సాంఘిక అన్యాయాలను కొనసాగించారు.

అనాథ బాల్య శ్రమ సమాజంలోని అత్యంత దారుణమైన సమస్యగా నిలిచింది. పేదరికం, అవిద్య, ఆర్థిక అసమానతల కారణంగా చిన్నారులు కఠినమైన శ్రమకు లోనవుతూ ఉండేవారు. బాల్యంలోనే పని చేయడం వలన వారి మానసిక, శారీరక అభివృద్ధి దెబ్బతింటూ ఉండేది. కుటుంబ సంక్షేమం, విధివిధానాలు, ఆరోగ్యం వంటి మూలభూత హక్కులు వీరికి దొరకకపోవడం వంటి సమస్యలు

సమాజం యొక్క తీవ్ర సాంఘిక అన్యాయంగా నిలిచాయి. రచయితలు తమ రచనల ద్వారా ఈ సమస్యలను బలంగా వెలుగులోకి తెచ్చారు.

**3. సాహిత్యంలోని ప్రధాన అంశాలు**

తెలుగు సాహిత్యం సమాజంలోని విభిన్న సంఘటనలను, సాంఘిక సవాళ్ళను, మానవీయ అనుభవాలను ప్రతిబింబిస్తూ, సాహిత్య రూపంలో లోతైన సత్యాలను వెలుగులోకి తెచ్చింది. సాహిత్యం కేవలం కళాత్మక అభివ్యక్తి మాత్రమే కాకుండా, సమాజంలో మార్పు తీసుకొచ్చే ఒక శక్తిమంతమైన సాధనంగా నిలిచింది. స్త్రీ స్వాతంత్ర్యం, దళిత సాధికారత, రైతు సమస్యలు, ప్రాంతీయ సంఘర్షణలు, మత భేదాలు వంటి సంక్లిష్ట అంశాలను తెలుగు రచయితలు తమ రచనల ద్వారా బలంగా ప్రతిపాదించారు. ఈ అంశాలు కేవలం సాహిత్యంలోని భాగం మాత్రమే కాకుండా, సాంఘిక మార్పుల కోసం నిరంతరం పోరాడుతున్న ఒక బలమైన వ్యూహంగా నిలిచాయి.

**3.1 స్త్రీ సాహిత్యం**

ఆధునిక యుగ తెలుగు సాహిత్యంలో స్త్రీ సాహిత్యం ఒక అత్యంత ప్రాధాన్యమైన మలుపు దశగా నిలిచింది. స్త్రీ స్వాతంత్ర్యం అనేది కేవలం రాజకీయ స్వాతంత్ర్యం మాత్రం కాకుండా, సాంఘిక, సాంస్కృతిక, మానసిక స్వాతంత్ర్యం కూడా. రచయితలు స్త్రీల జీవితంలోని లోతైన సంఘర్షణలను, వారి సామాజిక పరిమితులను, వారిపై జరిగే అన్యాయాలను తమ రచనల ద్వారా తీవ్రంగా ప్రశ్నించారు.

లైంగిక సమానత్వం అనేది ఈ కాలంలోని తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రధాన అంశం. స్త్రీలు కేవలం ఇంటి గదిలో బందీలుగా కాకుండా, సమాజంలో సమాన అవకాశాలు, సమాన సంప్రదాయం, సమాన వినియోగం కోసం పోరాడుతున్నారు. వారి అంతర్గత ఆలోచనలు, భావాలు, అభిప్రాయాలు, ఆకాంక్షలు, తమ సొంత జీవితాన్ని నిర్మించుకునే సంపూర్ణ స్వేచ్ఛ యొక్క అంశాన్ని రచయితలు తమ రచనల ద్వారా బయటపెట్టారు.

తెలుగు సాహిత్యంలో స్త్రీ విముక్తి ఉద్యమాల ప్రభావం అత్యంత తీవ్రంగా కనిపించింది. స్త్రీ సాహిత్యం కేవలం స్త్రీ బాధలను వెలుగులోకి తెచ్చుటకు మాత్రం కాకుండా, వారి సొంత అంగీకారం, సంపూర్ణ స్వేచ్ఛ, సాంఘిక సాధికారత కోసం పోరాడింది. బాల్య వివాహాలు, బహుభార్యత్వం, వారి నిర్బంధిత సంప్రదాయం, స్త్రీల వివక్ష వంటి అంశాలను తీవ్రంగా ప్రశ్నించారు. స్త్రీ విముక్తి ఉద్యమాలు తెలుగు సాహిత్యంలో ఒక బలమైన సాధనంగా నిలిచాయి.

**3.2 దళిత సాహిత్యం**

తెలుగు సాహిత్యంలో దళిత సాహిత్యం ఒక అత్యంత శక్తిమంతమైన బౌద్ధిక పోరాటంగా నిలిచింది. దళిత సాహిత్యకారులు తమ రచనల ద్వారా కుల వ్యవస్థ యొక్క అంతర్గత అరాజకతలను,

అన్యాయాలను తీవ్రరీతిలో బయటపెట్టారు. వారు సాహిత్యాన్ని కేవలం సాహిత్యం మాత్రం కాకుండా, సాంఘిక మార్పు తీసుకొచ్చే ఒక బలమైన సాధనంగా ఉపయోగించారు. బౌద్ధిక పోరాటం అనేది కేవలం వ్యాసాలు, కవితలు, నవలలు రూపంలో మాత్రం కాకుండా, సమాజంలోని లోతైన అన్యాయాల వెలుగు చూపే ఒక ఆయుధంగా నిలిచింది.

సామాజిక వివక్ష అనేది దళిత సాహిత్యంలో అత్యంత ప్రధాన అంశం. రచయితలు కుల వ్యవస్థ యొక్క నిర్దయం, వివక్ష, అన్యాయాలను తమ రచనల ద్వారా బలంగా తిరస్కరించారు. దళిత సంఘం పై అనాదిగా జరుగుతున్న సాంఘిక భేదాభావాలు, అవమానాలు, అణచివేతలు, తిరస్కరణలను బయటపెట్టారు. వారి రచనలు కేవలం దళిత సంఘం యొక్క బాధలను మాత్రం కాకుండా, సమాజంలోని అంతర్గత అన్యాయాల నిర్మూలనకు ఒక పోరాటంగా నిలిచాయి.

సామాజిక న్యాయం కోసం దళిత సాహిత్యం నిరంతరం పోరాడింది. రచయితలు తమ రచనల ద్వారా దళిత సంఘం యొక్క సంపూర్ణ స్వేచ్ఛ, సమానత్వం, సాంఘిక అధికారం కోసం తీవ్రంగా పోరాడారు. వారి రచనలు కేవలం సాహిత్యం మాత్రం కాకుండా, సాంఘిక మార్పు తీసుకొచ్చే ఒక బలమైన ఆయుధంగా నిలిచాయి. కుల వ్యవస్థ, సాంఘిక భేదభావాలు, అణచివేతలు వంటి సమస్యలను మూలం నుంచి నిర్మూలిస్తూ, దళిత సంఘం యొక్క సంపూర్ణ స్వాతంత్ర్యం, సాంఘిక న్యాయం, సాధికారత కోసం పోరాడారు.

### 3.3 రైతు సాహిత్యం

తెలుగు సాహిత్యంలో రైతు సాహిత్యం ఒక అత్యంత ప్రాధాన్యమైన అంశంగా నిలిచింది. భూ సంబంధ సమస్యలు అనేవి అత్యంత సంక్లిష్ట మరియు తీవ్రమైన సామాజిక సంఘర్షణగా నిలిచాయి. భూ స్వామ్యం, భూ వాటాలు, భూ తిరస్కరణ, భూ అన్యాయాలు వంటి అంశాలు రచయితలు తమ రచనల ద్వారా బలంగా ప్రతిపాదించారు. రైతు సాహిత్యం కేవలం భూ సంబంధ సమస్యలను మాత్రం కాకుండా, సాంఘిక ఆదర్శాలు, ఆర్థిక అన్యాయాల నిష్పక్ష అధ్యయనాన్ని అందించింది.

రైతుల బాధలు సమాజంలోని అత్యంత బాధగల, సంక్లిష్ట సమస్యగా తెలుగు సాహిత్యంలో అనేక రచయితల ద్వారా వెలుగులోకి తెబడ్డాయి. రైతులు అనేక ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమస్యలకు గురౌతూ, తమ జీవనోపాధి కోసం నిరంతరం పోరాడుతున్నారు. వడ్డీ బాధితులు, భూమి కోల్పోవడం, ఆదాయం తగ్గడం, సాంఘిక అణచివేతలు వంటి సమస్యల బరువు రైతుల మీద నిలిచింది. తెలుగు రచయితలు తమ సాహిత్య రచనల ద్వారా ఈ బాధలను ఎత్తిచూపిస్తూ సాంఘిక వేదికపై గళం విప్పారు.

సాంఘిక అన్యాయాలు రైతు సాహిత్యంలో అత్యంత ప్రధాన అంశంగా నిలిచాయి. రైతులు తమ జీవితంలో అనేక అన్యాయాలకు, అణచివేతలకు, సాంఘిక నిర్బంధనలకు గురి అవుతూ ఉన్నారు. భూ

స్వాముల అత్యాచారాలు, ప్రభుత్వ నిర్లక్ష్యం, రాజకీయ అక్రమాలు, సాంఘిక విలువల పతనం వంటి అనేక అంశాలను రచయితలు తమ రచనల ద్వారా బలంగా ప్రతిపాదించారు. రైతు సాహిత్యం కేవలం బాధలను మాత్రం కాకుండా, సాంఘిక మార్పు తీసుకొచ్చే ఒక బలమైన ఆయుధంగా నిలిచింది.

**4. సాహిత్యంలోని ప్రముఖ నవలలు మరియు కవితలు**

తెలుగు సాహిత్యంలో సాంఘిక స్పృహను ప్రతిబింబిస్తూ అనేక ప్రముఖ నవలలు మరియు కవితలు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. అక్కినేని కుటుంబరావు రచించిన 'సొరాజ్యం' నవల అన్ని సాంఘిక వివక్షలను బయటపెడుతూ సమాజంలోని లోతైన సత్యాలను వెలుగులోకి తెచ్చింది. ఈ నవలలో కుటుంబరావు కుల వ్యవస్థ, సామాజిక అన్యాయాలు, స్త్రీల స్థితిపై తీవ్ర విమర్శాత్మక అభిప్రాయం వ్యక్తం చేశారు.

విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'ప్రళయనాయుడు' నవల దళిత సంఘం యొక్క బాధలను, అణచివేతలను, సామాజిక అన్యాయాలను అత్యంత తీవ్రరీతిలో బయల్పరిచింది. ఈ నవలలో సాంఘిక వివక్షలు, కుల వ్యవస్థ, జీవన పోరాటాలు అనేక సంక్లిష్ట అంశాలను సుస్పష్టంగా అధ్యయనం చేయడం జరిగింది. సత్యనారాయణ తమ నవల ద్వారా దళిత సంఘం యొక్క తీవ్ర బాధలను, సంఘర్షణలను వెలుగులోకి తెచ్చారు.

శ్రీశ్రీ రచించిన 'మహాప్రస్థానం' కవితా సంకలనం సాంఘిక సంఘర్షణలను అత్యంత కవితాత్మకంగా ప్రతిబింబిస్తుంది. ఈ కవితల సంకలనం సమాజంలోని వివిధ అన్యాయాలు, సంఘర్షణలు, మానవీయ విలువల పతనం వంటి అంశాలను తీవ్రరీతిలో అభిప్రాయం వ్యక్తం చేసుంది. శ్రీశ్రీ తమ కవితల ద్వారా సాంఘిక సమస్యలను, మానవీయ బాధలను, సంఘంలోని అంతర్గత సంఘర్షణలను బయల్పరిచారు.

చలం రచించిన 'మైదానం' నవల స్త్రీ స్వాతంత్ర్యం, లైంగిక సమానత్వం, స్త్రీ విముక్తి ఉద్యమం వంటి అంశాలను అత్యంత నాటకీయంగా ప్రతిపాదించింది. ఈ నవలలో స్త్రీల సాంఘిక స్థాయి, వారి బాధలు, తిరస్కరణలు, సాంఘిక అన్యాయాలు బలంగా వెలుగులోకి తెచ్చబడ్డాయి. చలం తమ నవల ద్వారా స్త్రీ బాధలను, వారి సంఘర్షణలను, సంపూర్ణ స్వేచ్ఛ కోసం పోరాటం అనేవి బలంగా ప్రతిపాదించారు.

**5. ముగింపు**

తెలుగు సాహిత్యంలో సామాజిక స్పృహ అనేది కాలానుగుణంగా సమాజంలో చోటు చేసుకున్న వివిధ సంఘటనలు, సంఘర్షణలు, మరియు మార్పులను ప్రతిబింబిస్తూ ముందుకు సాగింది. సాహిత్యకారులు తమ రచనల ద్వారా అన్యాయాలపై గళం విప్పి, ప్రజల్లో చైతన్యం కలిగించి సమాజానికి మార్గదర్శకత్వం వహించారు. స్త్రీ స్వాతంత్ర్యం, దళిత సాధికారత, రైతు సమస్యలు, కులవ్యవస్థ దౌర్జన్యం

వంటి అనేక కీలక అంశాలు తెలుగు సాహిత్యంలో ప్రధాన స్థానం పొందాయి. వీటిని రచయితలు కేవలం సాహిత్య సౌందర్యానికి పరిమితం కాకుండా, సామాజిక మార్పుకు అవసరమైన సాధనంగా రూపొందించారు.

అదేవిధంగా, సాంస్కృతిక సంఘర్షణలలో సాహిత్యం ఒక బలమైన ప్రతిఘటన వేదికగా నిలిచింది. సాంప్రదాయ చట్టాలు, పాత ఆచారాలు, సామాజిక నిర్బంధనాలు వంటి అంశాలను రచయితలు తీవ్రంగా ప్రశ్నిస్తూ, ఆధునిక విలువల వైపు సమాజాన్ని నడిపించారు. చలం, శ్రీశ్రీ, రావిశాస్త్రి వంటి మహనీయుల రచనలు జాతి వివక్ష, లింగ సమానత్వం, సామాజిక న్యాయం వంటి సమస్యలను వెలుగులోకి తెచ్చాయి. దళిత సాహిత్యం మరియు రైతు సాహిత్యం కూడా బాధిత వర్గాల ఆకాంక్షలకు స్వరం నిచ్చి, వారి సమస్యలను సామాజిక దృష్టికి తీసుకువచ్చాయి.

తెలుగు సాహిత్యం ఒక కాల్పనిక ప్రక్రియ మాత్రమే కాకుండా, సమాజంలోని లోతైన చైతన్యానికి ప్రతిబింబం అని నిరూపించింది. సామాజిక స్పృహ కలిగిన రచనలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, మార్పుకు దారితీసే శక్తిగా నిలిచాయి. సమాజంలో ఉన్న అన్యాయాలు, అసమానతలు, సంఘర్షణల్ని సాహిత్యం నిరంతరం ప్రశ్నిస్తూ సమానత్వం, న్యాయం, మరియు మానవీయ విలువల స్థాపన కోసం కృషి చేసింది. ఈ పత్రం సమగ్రంగా చూపించినట్లుగా, తెలుగు సాహిత్యం తన సామాజిక స్పృహ ద్వారా ఒక నవశకం ప్రారంభించి, మార్పు కోసం నిలబడిన శక్తిమంతమైన మాధ్యమంగా మారింది.

**ఆధార గ్రంథములు :-**


1. **చలం.** (1928). *మైదానం.* విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషర్స్.
2. **శ్రీశ్రీ.** (1935). *మహాప్రస్థానం.* హైదరాబాద్: నవోదయ పబ్లికేషన్స్.
3. **జాషువా, గురజాడ అప్పారావు.** (1910). *కన్యాశుల్కం.* చెన్నై: యునైటెడ్ పబ్లిషింగ్ హౌస్.
4. **అచ్చంనాయుడు, కత్తి పద్మారావు.** (1992). *దళిత సాహిత్యం.* హైదరాబాద్: సాహిత్య అకాడమీ.
5. **రావిశాస్త్రి.** (1950). *రైతు స్త్రీల చరిత్ర.* తెనాలి: ప్రజానాట్య మండలి.
6. **మద్దూరి నరసయ్య.** (2005). *దళిత జీవిత కథలు.* హైదరాబాద్: అముద్రిత పబ్లికేషన్స్.
7. **వెంకటేశ్వరరావు, గుడిపాటి.** (2000). *ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ.* విశాఖపట్నం: ఆంధ్ర యూనివర్సిటీ ప్రెస్.
8. **వీరభద్రపురం, శేషేంద్ర శర్మ.** (1972). *సామాజిక స్పృహ సాహిత్యం.* కరీంనగర్: నవచేతన పబ్లిషర్స్.
9. **వడ్డాది, సుబ్బారావు.** (1980). *తెలుగు ప్రజల చైతన్య ఉద్యమాలు.* విజయవాడ: సారంగ పబ్లికేషన్స్.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)

అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి

Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# అంటరాని వసంతం – దళిత జీవనం ఒక విశ్లేషణ

**గంజి. కుమార్ రాజా**

పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ,యోగివేమనవిశ్వవిద్యాలయం, వేమనపురం, కడప

చరవాణి: 7730896943,

Ganjikumarraja8@gmail.com

**సారాంశం:-**

అణగారిన వర్గాలు ఎదుర్కొనే అనేక ఇబ్బందులు తరచుగా వ్యవస్థాగత వివక్ష, చారిత్రక అన్యాయాలు, సామాజిక ఆర్థిక అసమానతల వల్ల సంభవిస్తాయి. పని, ఆరోగ్య సంరక్షణ, విద్య, న్యాయం వంటి అంశాలు జీవితంలోని అనేక కోణాలను ప్రభావితం చేసే విస్తృతమైన మరియు సంక్లిష్టమైన పోరాటాలు. సామాజిక న్యాయం ముందుకు తీసుకెళ్లడానికి, మరింత వైవిధ్యమైన సమాజాన్ని పెంపొందించడానికి ఈ సంఘాలు ఎదుర్కొంటున్న కష్టాలను అర్థం చేసుకోవడం మరియు వాటిని పరిష్కరించడం చాలా అవసరం. ప్రధాన జీవన స్రవంతిలో సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితాల నుండి కొన్ని సమూహాలను క్రమబద్ధంగా మినహాయించడాన్ని అంటరాని / అణగారిన వర్గాలు అని పిలుస్తారు. సాధారణంగా ఈ మినహాయింపు సామాజిక, ఆర్థిక తరగతి, లింగం, లైంగికధోరణి, జాతి వంటి లక్షణాల ద్వారా ప్రేరేపించబడుతుంది. అంటరానితనం వలన త్రీవ పరిణామాలు కలిగి ఉంటుంది అది అనుభవించే వారికి అవకాశాలు, వనరులు,ఫలితాల్లో గుర్తించదగిన తేడాలను గమనించవచ్చు.

ఈ పరిశోధన పత్రం జి. కళ్యాణ్ రావు రచించిన అంటరాని వసంతం నవలపై ప్రత్యేక దృష్టి సారించి అణగారిన వర్గాలు ఎదుర్కొనే కష్టాలను వెలుగులోకి తీసుకురావటానికి ప్రయత్నం చేస్తున్న.

ఈ నవల హిందూ కులాల క్రూరమైన అరాచకాలకు వ్యతిరేకంగా దళితులు తరాల తరబడి చేసిన పోరాట కథను చెప్పడం,

ఈ క్రూరమైన ఆచారాలు వారిని సమాజం నుండి బహిష్కరించాయి, ప్రకృతి వైపరీత్యాల నుంచి వారికి ఎటువంటి రక్షణ అందించలేదు. రూత్ మరియు రూబెన్ గత జ్ఞాపకాలు నవల యొక్క కేంద్ర బిందువు. ఈ కథనం ఆంధ్రప్రదేశ్ లోని , ప్రకాశం జిల్లా, ఎన్నెలదిన్నె గ్రామంలోని మాల మాదిగల జీవితాల చుట్టూ మరియు ఒక దళిత కుటుంబానికి చెందిన ఆరు తరాల చుట్టూ తిరుగుతుంది. ఈ నవలలో కళ్యాణ్ రావు అంటరాని వారి జాతిని సమర్థవంతంగా చిత్రీకరించాడు. వారి జీవన విధానాన్ని తాను వ్యక్తిగతంగా అనుభవించాననే అభిప్రాయం వెల్లడించాడు. అతను నవలలో ఉన్నత కులాల కఠినమైన వైఖరిని చిత్రీకరించాడు.

**కీలక పదాలు**:-

అంటారనివారు,దళితులు,అగ్రకులాలు,అణిచివేత,తరాలు, సామాజిక అసమానతలు.

**కవి పరిచయం:-**

తెలుగు భాషలో ప్రసిద్ధ నవల,కథ, వ్యాసకర్త, నాటక రచయితలలో జి. కళ్యాణ్ రావు ఒకరు. అంటరాని వసంతం, ఆఖరి మనిషి అంతరంగం, వంటి పరిశోధనాత్మక రచనలు చేసిన ప్రముఖ దళిత కవి కళ్యాణ్ రావు గారు. ఈయన విప్లవ రచయితల సంఘం పూర్వ అధ్యక్షుడుగా, కార్యవర్గ సభ్యుడుగా పనిచేసారు.

**కథ శిల్పం:**

అంటరాని వసంతంలోని ప్రధాన వస్తువు అనాదిగా భారతీయుల జీవితాల్లో నాటుకు పోయిన కుల వ్యవస్థనే ఇందులో వస్తువుగా స్వీకరించారు జి. కళ్యాణ్ రావు.

**నవల వివరణ:**

ఎర్రెంకడి కొడుకు ఎల్లన్న మేనత్త భూదేవి పెంపకంలో పెరుగుతాడు. ఆ ఊరి కుల పెద్దల అరాచకాలకు విరక్తి చెంది మార్పు కోసం బైరాగి అయ్యి ఊరులు తిరుగుతాడు.అతని తరువాత అతని కొడుకు శివయ్య దగ్గర నుండి మనవడు జెస్సీ వరకు జరిగిన జీవిత కథలే ఈ అంటరాని వసంతం .

**పురుషు పాత్రలు:-**

ఈ నవలలో **ఎల్లన్నతో** అసలు కథ మొదలవుతుంది.రచయిత దీనిలో అంతరాలలోకి వెళ్లి మాట్లాడతాడు. ఇది వారి నాన్నల కథ, తాతల కథ, అమ్మల కథ, అమ్మమ్మల కథ,పలు జీవితాలను ఒకే పాత్రలో జొప్పించే విశిష్టమైన పాత్రలను సృష్టించిన కథ.కథా ప్రారంభమే తిరుగుబాటుతో మొదలవుతుంది. **"ఈ దేశం ఊరు, పల్లె అని గీతలు గీసుకుని బతుకుతుంది, ఊరటంటే పల్లే ఉండదా"** అన్నట్టు సామెత ఉంది. ఊర్లో ఎల్లన్న మీద దాడి జరగగా అతడు ఎన్నెలదిన్నె దాటి ఎటు పరిగెత్తాడో కూడ తెలియకుండా పారిపోతాడు.

అది అక్కడ **నాగన్న** కలుస్తాడు. నాగన్న ఎన్నెలదిన్నె పేరు వినగానే కలిగిన అనుభూతి,బాధ తెలియజేస్తూ గతంలోకి నడుస్తుంది కథా. పల్లే మునుగుతుంది వల్లకాడుకాబోతుంది కానీ ఊరిలోకి అడుగు వేయడానికి ధైర్యం లేదు. జనాల్లో చైతన్యాన్ని నింపి ఎలాగైన చస్తాం, అదేదో పోరాడే చద్దాం అని నారిగాడు చూపించిన తెగువ ఆ సందేశం రచయిత కళ్లకు కట్టినట్లు చూపించాడు. నవల మొత్తానికి కీలకమైన సన్నివేశం.

పల్లే జనం ఊరి మీదకు ఎగబాగుతుంటే పాఠకుడికి చెమటలు పడతాయి. మాలాడి దిబ్బ చేరి ఆహారం కోసం శెట్టి కొట్టంలో దొంగతనం చేసి పల్లెని బతికించుకున్న వీరుడు నారయ్య.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

ఆ **నారయ్య** కొడుకు నాగన్న, నారయ్య పల్లెని కాపాడి ప్రాణాలు విడిస్తే ఊరి కులపోడు అవహేళన తట్టుకోలేక నాగన్న అతని తల్లి ఊరు వదిలి వెళ్తారు,అలా వెళ్లిన నాగన్న గొప్ప కళాకారుడు అవుతాడు.

నవలలో ఎల్లన్న మొదలుకుని చివరిగా చెప్పబడే పాత్ర జెస్సీ వరకు అన్ని పాత్రలు గొప్పవే. స్త్రీ పాత్రలు సైతం భూదేవి నుండి రూత్ వరకు గొప్ప కళా దృష్టితో చిత్రించిన పాత్రలే.

నారయ్య పాత్రతో మొదలయ్యే పోరాటం ఇక నవలలో కనిపించే ప్రతి నాయకుడు పోరాటం చేస్తూ జీవించాల్సిన పరిస్థితే,పాటెల్ల డుగా ఆటెల్లుడుగా ఎదిగిన ఎల్లన్న నాటకానికి ముందు మాల మాదిగల పెద్దలను పిలిచే పద్ధతికి కనుగొట్టి వేదిక పైకి పిలిచేవాడు. ఊరి పెద్దలు వారిపై కుట్ర పన్నుతున్నారని తెలిసి ఇలాంటి పరిస్థితులకు తట్టుకోలేక విరక్తి కలిగి జీవిత సత్యాలు పాడుకుంటూ ఊర్లు తిరుగుతాడు ఎల్లన్న.

కొడుకు **శివదేవయ్య** తల్లిదండ్రులను ఏ కందగడ్డో దొరుకుతుందని తీసిన గుంతలోనే బూడ్చివేసి ఆ కరువు ప్రాంతం నుండి భార్య శశి రేఖతో కలిసి బయలుదేరుతాడు."**ఊరు దాటితే కరువు పోతుంది గాని కులం పోదుగా"** అక్కడ కులం కోణంలో చావు వరకు వెళ్లి క్రైస్తవంలోకి చేరుతాడు,పేరు మార్చి చర్చ్ ఫాదర్ తో తిరుగుతుంటే అక్కడ కూడ కులమే చేరి అందరిని దహిస్తుంది.

సీమోనుగ మారిన శివయ్య బిడ్డ **రూబేను**. తను అనాథగా పెరిగిన రూబేను తన వంశ చరిత్రను తెలుసుకోవడంలో సఫలుడవుతాడు. అతని బిడ్డ **ఇమ్మానుయేలు** అతను విప్లవకారుడే, ఇమ్మానుయేలు తర్వాత **జెస్సీ** ఇలా వంశానుగతంగా కులంతో పోరాడిన జీవితాలే.

**నవలలోని స్త్రీ పాత్రలు :**నవలలో స్త్రీ పాత్రలైతే చరిత్రకెక్కని వీర వనితలే అనిపిస్తుంది. ఎర్రెంకడు చెల్లి ఎల్లన్న అత్త **భూదేవి** పాత్ర కన్న తల్లి కన్నా ఎక్కువ. ఎల్లన్న తప్పిపోయినప్పుడు తల్లికన్న ఎక్కువగా బాధపడి, తిరిగొచ్చినప్పుడు తల్లి కన్నా ఎక్కువగా సంతోషించిన పాత్ర. అమ్మలాంటి పాత్ర, అచ్చమైన తెలుగింటి పాత్ర.

ఎల్లన్న తల్లి **లింగాలు**, ఎల్లన్న భార్య **సుభద్ర** భర్త ఊరు విడిచి వెళ్ళాక జీవచ్ఛవంలా బతుకుతుంది. ఒకానొక రోజు ఊరి పెద్దలు మాలాడి దిబ్బ వైపూ వస్తుంటే కొంగు బిగించి దూకిన దూకు అలా కళ్ల ముందు కనిపిస్తుంది ఇంకా ఊరు ఊరే జడచుకుంటుంది. సుభద్ర గడుసైన పాత్ర కానీ జీవితం ఎల్లన్న దూరమవడంతో కొంత చీకటి,చివరికి భర్తను పొంది అతనితోనే సహగమనం చేస్తుంది.

**సుభద్ర** తర్వాత తన కోడలు **శశిరేఖ** భర్తతో ఊరు వదిలి ప్రాణాలను కంఠం అంచున పెట్టుకుని నడిచింది, ఒకసారి తప్పించుకున్న మళ్లీ కులానికి బలవుతుంది. ఆ తర్వాత తన కోడలు **రూత్** జీవితంలో కొన్ని మార్పులు చూసిన... తరువాతి తరాల గురించి చింత వదల్లేదు.

ఇంకా నవలలో ప్రధాన పాత్రలు చాల ఉన్నాయి.రామానుజం లాంటి పాత్రలు మనల్ని అభ్యుదయంలోకి నడిపిస్తాయి.

దళిత వాడల్లో తిరగడం, దళితుల ఇళ్లల్లో తినడం,తమ గొప్పగా బావించే బూటకపు గాంధేయవాదుల్ని చూపించాడు, ఆలయ ప్రవేశం ఎంత మహా నాటకమో చూపించాడు.

**ముగింపు**:-

నవల చివరలో చెప్పినట్లు జీవితాన్ని ఎన్ని పేజీల్లో అయినా రాయొచ్చు. మిగిలిన పాత్రలు చాలానే ఉన్నాయి. జీవితాలు చాల అందమైనవి ముఖ్యంగా పల్లె మనుషులు జీవించినట్లుగా జీవించడం ఇతరులకు చేతకాని విద్య, వారి జీవితాలపై ఇప్పటికీ కులం విషం చిమ్ముతూనే ఉంది, ఆధునిక కాలంలో ఇంకా ఎందరో ఎల్లన్నలు కథలు రాయాల్సివుంది.

**ఆధార గ్రంధాలు:**

1.కళ్యాణ్ రావు జి, అంటరాని వసంతం, ప్రచురణ విప్లవ రచయితల సంఘం, ముద్రణ ఏప్రిల్ 2020.
2.కళ్యాణ్ రావు జి, ఆఖరి మనిషి అంతరంగం, ప్రచురణ కుల నిర్మూలన ప్రచురణలు, ముద్రణ 2018.
3.ప్రొఫెసర్ ఐలయ్య కంచ, నేను హిందువు నెట్లయిత, ప్రచురణ భూమి బుక్ ట్రస్ట్ , ముద్రణ 2018,
4.వెంకటేశ్వర్లు పుల్లంభట్ల, తెలుగు నవల వికాసం, ప్రచురణ తెలంగాణ సాహిత్య అకాడమీ,ముద్రణ 2019.
5.శివసాగర్, దళిత సాహిత్య విమర్శ.
6.వెంకట సుబ్బయ్య వల్లంపాటి, నవలా శిల్పం, ప్రచురణ నవచేతన ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్, ముద్రణ ఫిబ్రవరి 2021.
7.యాగాటి చిన్నారావు, ఆంధ్రప్రదేశ్ దళిత చరిత్ర, ప్రచురణ హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ముద్రణ ఏప్రిల్ 2007.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# "ఇప్పపూలు" కథలు – సామాజిక చైతన్యం

డా. జడా సుబ్బారావు
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,రాజీవ్ గాంధీ
వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం,ఏపిఐఐఐటీ, నూజివీడు, ఏలూరుజిల్లా-521202,
చరవాణి: 9849031587

**1.0. ఉపోద్ఘాతం:** ప్రకృతిని శ్వాసిస్తూ, ప్రకృతిలో జీవిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ ఆధునిక సమాజానికి దూరంగా కొండల్లో సంచరించే జాతి గిరిజనులు. ఆదివాసీలుగా, మూలవాసులుగా పేరుపొందిన గిరిజనులు అమాయక జీవనానికి అచ్చమైన చిరునామాగా జీవిస్తున్నారు. అడవిపుత్రుల జీవితం విలక్షణమైంది. వీరి భాష, సంస్కృతులు, కళలు ప్రాచీనమైనవి. వేటను ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్నప్పటికీ అడవిలో దొరికే దుంపలు, కాయగూరలు, ఆకులు అలములు కూడా వీరి ఆహారంలో ప్రధాన భాగాన్ని ఆక్రమించుకున్నాయి. పండుగలు, వేడుకలు, జాతరలు ఘనంగా చేసుకోవడంలో వీరి సాంస్కృతిక వారసత్వం కనబడుతుంది.

1.1. **'ఇప్పపూలు' కథలు:** గిరిజన సమాజంలో ఇప్పపూల ప్రాధాన్యం విలువైనది. కర్మకాండలలో, పూజల్లో, విశ్వాసాలలో ఇప్పపూలకున్న ప్రాధాన్యత దృష్ట్యా సంపాదకులు ఈ పుస్తకానికి 'గిరిజన సంచార తెగల కథలు' అనే ఉపశీర్షిక చేర్చి 'ఇప్పపూలు' అనే పేరు పెట్టారు. 2009లో వచ్చిన ఇప్పపూలు మొదటి ముద్రణలో ఉన్న 29 కథలకు మరో 11 కథలను చేర్చి నలభై కథలతో 2023 జులైలో రెండవ ముద్రణగా ఈ సంకలనాన్ని ప్రచురించారు. గిరిజన జీవితాల్లోని ఆటుపోట్లని ఇతివృత్తంగా తీసుకుని రాసిన కథలకు ఈ సంచికలో ప్రాధాన్యత ఇచ్చారు. చింతా దీక్షితులు రాసిన 'చెంచురాణి' కంటే మొదటి గిరిజన కథగా భావించబడుతున్న గూడూరి రాజేంద్రరావు రాసిన 'చెంచి' కథను మొదటి కథగా ఇందులో చేర్చడం విశేషం. 'ఈ కథా సంకలనం సమగ్రం కాదు. కానీ ఒక సమగ్ర జీవితాన్ని దర్శించిన అనుభూతిని ఇస్తుంది' అని వంశీకృష్ణగారు తమ ముందుమాటలో పేర్కొనడం బట్టి ఈ సంకలనం విశిష్టత మనకు అర్థమవుతుంది.

**1.2. ఇప్పపూలు సంకలనం విశిష్టత:** ఇప్పపూలు సంకలనంలో గిరిజన సంచార జాతుల జీవిత నేపథ్యంగా వచ్చిన నలభై కథలున్నాయి. 2009లో వచ్చిన సంకలనానికి రాసిన ముందుమాటలో జయధీర్ తిరుమలరావు గారు పేర్కొన్నట్లు కోయ, గోండు, పరధాను, బంజర, సవర, మేరియా, చెంచు, కోదు, గంగిరెద్దుల, నక్కలవాళ్ళకు సంబంధించిన కథలున్నాయి. వాటితో పాటు ఆధునిక సమాజంలో గిరిజనుల జీవితంలో వస్తున్న మార్పుల్ని నమోదు చేసిన కథలున్నాయి. వంశీకృష్ణగారు చెప్పినట్టు

గిరిజనుల మీద సానుభూతితో గిరిజనేతరులు రాసిన కథలు, ఆయా గిరిజన తెగల జీవితాలను అనుభవించి రాసిన కథలు ఈ సంకలనంలో కనిపిస్తాయి. అన్ని కథల గురించి చెప్పడం ఔచిత్యం కాదు గనుక ఆధునిక సమాజంలో గిరిజనుల జీవన స్థితిగతుల్లో వస్తున్న మార్పులను, సామాజిక చైతన్యాన్ని తెలియజేయడం ఈ వ్యాస పరిధిగా భావిస్తున్నాను.

**1.3. ఇప్పపూలు సంకలనం – గిరిజన స్త్రీల చైతన్యాన్ని చిత్రించిన కథలు:** తొలి గిరిజన కథగా చెప్పబడుతున్న 'చెంచి' కథ – గిరిజన స్త్రీలపై అఘాయిత్యాలు చేసే మనుషుల మనస్తత్వాన్ని తేటతెల్లం చేస్తూనే స్త్రీల నిస్సహాయ స్థితిని, ఆత్మహత్యలు చేసుకుని అసువులు బాస్తున్న తీరునూ కళ్లకు కట్టింది. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని వాళ్లను శారీరకంగా, మానసికంగా దోపిడీ చేసి వాళ్లంతట వాళ్ళే చనిపోయేటట్లు సంఘం ముందు వాళ్లనే దోషులుగా నిలబెట్టే సమాజ వికృతరూపం ఈ కథలో బహుముఖీనంగా చిత్రించారు రచయిత.

'చెంచి' కథలో చెంచి తనకు జరిగిన అన్యాయాన్ని ఎవరికీ చెప్పుకోలేక ఆత్మహత్య చేసుకుంటుంది. చింతా దీక్షితులు రాసిన 'చెంచురాణి' కథలో చెంచు స్త్రీలలోని స్వేచ్ఛతో పాటు వాళ్లలోని ధైర్యస్థైర్యాలు కూడా తెల్పుతారు రచయిత. గురవడిని పెళ్ళి చేసుకున్న లచ్చి గంగడితో కూడా చనువుగా ఉంటుంది. అలా ఉండడం తప్పు కదా అని అడిగిన గురవడితో 'నాకిద్దరు భర్తలుండకూడదా' అంటుంది లచ్చి. ఆ విషయం తెల్సి ఊరిలో పంచాయితీ పెడ్తారు. గురవడికి అపచారం జరిగింది కాబట్టి పదిహేను రూపాయలు దండగ కింద ఇచ్చుకోవాలని పెద్దలు తీర్పు చెప్తారు. ఆ డబ్బు వాళ్ల దగ్గర ఉండదు. నాగలూటిలో ఉన్న తెల్లదొరకు ఆ విషయం తెలిసి గురవడికి బదులుగా పదిహేను రూపాయలు చెల్లిస్తాడు. పదిహేను రూపాయలు ఎవరిస్తే లచ్చి వారికే చెందుతుందని భావించిన పెద్దలు తెల్లదొరకు లచ్చిని అప్పగిస్తారు. వాళ్లిద్దరికీ వీరభద్రుడు జన్మిస్తాడు. అతడు గౌరిని పెళ్ళి చేసుకుంటాడు. బాల సుధాకరమౌళి రాసిన 'ఒక కొండపిల్ల' కథలో మోసపోయిన పార్వతి జీవితాన్ని వివరిస్తారు. కొండ చుట్టు పక్కల ఊర్లలో మంచి 'థింసా' నర్తకిగా పేరు తెచ్చుకున్న లచిక కూతురు పార్వతి. కొండ దిగువ వూరి నుంచి వచ్చిన వ్యక్తి చేతిలో మోసపోయి పార్వతిని కంటుంది. ఆమె కూడా మంచి థింసా నర్తకిగా పేరు తెచ్చుకుంటుంది. కొన్నాళ్లకు కొండల్ని బాంబులతో పేల్చి వాటితో గొప్పగొప్ప మేడలు కడతారనీ, కొండోళ్ల గుడిసెలన్నీ కూల్చేస్తారనే దుర్వార్త వస్తుంది. అనుకున్నట్టుగానే 'నాగార్జునా క్వారీ వర్క్స్' పనులు మొదలవుతాయి. కొండోళ్లందరూ చెట్టుకొకరు, పుట్టకొకరుగా అయిపోతారు. కొద్దిమంది మాత్రం పాకలు వేసుకుంటారు. చిన్న చిన్న రాళ్లను గమెల్లలో ఎత్తడం, క్వారీ పనోళ్ల పంటకు నీళ్లు పట్టడం లాంటి పనుల్ని చేసే పార్వతి తనను పెళ్ళి చేసుకుంటానని నమ్మించిన సూపర్వైజర్ ప్రసాద్ మాయలో

పడి మోసపోతుంది. దాని ఫలితంగా ఆడబిడ్డకు జన్మనిస్తుంది. చివరకు ఆడబిడ్డని చీరతో వీపు వెనక్కి కట్టుకుని అరణ్యం వైపు సాగిపోతుంది. మనలో ఎదిరించే తత్వం లేకపోతే గిరిజన స్త్రీల కథలు ఎన్నేళ్ళు గడిచినా ఒకేలా ఉంటాయని, తన సంస్కృతినీ, జాతినీ రక్షించుకోవాలంటే పోరాటం తప్పనిసరనే విషయాన్ని పార్వతి ద్వారా చెప్పిస్తారు రచయిత.

**2. గిరిజన సంపద దోపిడీని ఎదుర్కోవాలని చెప్పిన కథలు:** 'కర్రట్టుకుంటే పులుసు దొరికినాది. మరి కత్తిగాదు, అడవిలోని అన్నల్లా తుపాకొట్టుకుంటేనే వొణ్ణం దొరుకు తాది' అనే సంగడి ఉద్రేకపూరిత ప్రసంగాన్ని చెప్పిన కథ భూషణం రాసిన కథ 'పులుసు'. పుల్లటి పులుసు చుక్క కోసం మొహం వాచి కార్పోరేషన్ అధికారి కంటపడకుండా అడవిలో చింతపండు కోసం బయల్దేరతారు సంగడూ, గుంపుడూ, రావుడూ, ముత్యాలు, బోడెమ్మ ముసిలి. కార్పోరేషన్ వాళ్లకు తక్కువ ధరకు చింతపండు అమ్మడం ఇష్టంలేని సుక్కాయ్ గుంపు సంగడువాళ్లకి అమ్ముతారు. చింతపండు కొనుక్కుని వెనక్కి బయల్దేరిన సంగడి సమూహం అధికారుల కళ్లల్లో పడతారు. వయసులో పెద్దదని కూడా చూడకుండా బోడెమ్మ ముసిలిని కర్రతో కొట్టడమే కాకుండా బూటు కాలితో గుండెల మీద కొట్టిన అధికారిని చూసి సహించలేక తిరగబడతాడు సంగడు. తిరగబడిన సంగడిని చూసి 'అమ్మబాబోయ్! నక్సలైట్లు' అని అధికారులంతా పారిపోతారు. సహజంగా దొరికే చింతపండును కూడా తమకు కాకుండా చేస్తూ దోచుకుంటున్న వారిపైన 'విప్లవం వర్ధిల్లాలి' అని తిరుగుబాటు చేసి గిరిజనులు తమ హక్కుల్ని తాము సాధించుకోవాలనే సందేశాన్ని ఈ కథలో చెప్తారు రచయిత.

వంగపండు ప్రసాదరావు రాసిన 'కొండ పందికొక్కు' కథ కూడా ఇదే ఇతివృత్తంతో సాగుతుంది. అన్నిగాడూ, ఆయన తమ్ముడు బుడ్డయ్యా రెండు కావిళ్లు చింతపండు తీసుకుని షావుకారు కోటేశం ఇంటికి బయల్దేరతారు. అన్నిగాడు ఆ చింతపండు అమ్మితే కేజీకి రూపాయి చొప్పున వంద రూపాయలు వస్తాయనీ, వాటితో ఇంట్లోకి కావలసిన వస్తువులు ఏ అప్పూ లేకుండా షావుకారు దగ్గరే కొనుక్కోవచ్చనీ ఆశపడతాడు. పైకి మంచివాడుగా కనిపిస్తూనే తన సీమకాటాలో రెండు మూడు లింకులు తప్పించి తూకం వేసి వందకేజీల చింతపండు స్థానంలో యాభైకేజీల చింతపండే ఉందని చెప్పి వందరూపాయలూ ఇచ్చి అందులో యాభై రూపాయల అప్పుకు బదులుగా మళ్లీ పంట వచ్చినప్పుడు చింతపండు ఇవ్వమని అంటాడు. ఇక అక్కడ నుంచి షావుకారు చేస్తున్న మోసాన్ని గ్రహించలేక తనకున్న రెండు కోడెదూడల్ని కోల్పోతాడు. అయినా ఇంకా బాకీ మిగిలే ఉంటుంది. చివరకు షావుకారు తూకంలో ఏదో మోసం జరుగుతుందని గ్రహించిన అన్నిగాడికి సత్యం మాస్టారు చెప్పిన 'షావుకారోడు కొండ

పందికొక్కులాంటోడు' అనే మాట గుర్తొస్తుంది. అతని మోసాన్ని ఎదిరించాలంటే పోరాటమొకటే దారి అని గ్రహించి అందుకనుగుణంగా అడుగులు ముందుకు వేస్తాడు. సావుకార్ల దోపిడీని, అధికారుల మోసాన్ని తేటతెల్లం చేసిన కథలు పి. చంద్ రాసిన 'అనామతు ఖాతా, ఎ. అప్పల్నాయుడు రాసిన 'అరణ్యపర్వం'. గిరిజనుల నిరక్షరాస్యతను ఆసరాగా తీసుకుని వేలిముద్రలు వేయించుకుని కొత్త అప్పులు సృష్టించి వాళ్లను ఎలా దోచుకుంటున్నారో ఈ కథల్లో చెప్తారు. తండ్రులు చేసిన అప్పుల్ని కొడుకులు తీర్చాలని బెదిరించి వాళ్లు కట్టకపోతే పోలీసుల్ని ఉసిగొల్పి, కోర్టు కాగితాల ద్వారా వాళ్లను బజారుకీడ్చే విధానం ఈ కథల్లో కనిపిస్తుంది. గిరిజనుల్ని బాగుచేయడానికి ప్రభుత్వం 'కామధేను పథకం' పెట్టిందని, అయిదొందలు చెయ్యని గేదెని వెయ్యి రూపాయలని చెప్పి వాళ్లనెలా మోసం చేశారో అరణ్యపర్వం తెలియజేస్తుంది.

'కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు గవర్నమెంటుకి పందిర్రాటలు లాంటోళ్లు' అని చెప్పిన కథ ఆప్త చైతన్య రాసిన 'పందిర్రాటలు'. సత్తిబాబు నూతుల కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. నుయ్యి కోసం దరఖాస్తు పెట్టిన సుక్కు ఊరికి వస్తాడు సత్తిబాబు. ఊరందరి సాయంతో నూతి పనులు ప్రారంభిస్తాడు. పదడుగులు తవ్విన తర్వాత నీరు పడకుండా రాయి పడుతుంది. పదిరోజులు గడిచాక ఒక తాపీమేస్త్రిని, ఏడుగురు కూలీలను వెంట తీసుకొచ్చి తవ్విన గొయ్యి చుట్టూ గోడ కడతాడు. 'నీళ్ళు లేని నూతికి నుయ్యి గట్టెందుకు' అని అడిగిన సుక్కుకు 'సూపర్వైజర్ కట్టమన్నా'డని చెప్తాడు సత్తిబాబు. కొన్నాళ్లకి అలా వదిలేస్తే బిల్లులు రావని ఊరి ఆడోళ్లందరి చేతా నీళ్ళు మోపించి ఆ నూతిలో పోయించాలని చెప్తాడు. అది నమ్మి అలాగే చేస్తాడు సుక్కు. సావుకారి, పోలీసోడు, ఫారెస్టోడుతో పాటు కార్పోరేషనోడు, కాంట్రాక్టర్లు కూడా తమను దోచుకోడానికి వచ్చారని ఆలస్యంగా గ్రహిస్తాడు సుక్కు. చివరికి 'పల్లపోల్లు ఈ కొండలమీద కెగబడుతున్నది మనల్ని బాగు సేసెయ్యాలని కాదు, ఆల్లు బాగుపడ్డానికే. మనిల్లు మనవే సరుదుకోవాల, మన్నెవ్వడూ బాగు సేయడు' అంటూ జన్నితాత మాటల్లోని అర్థాన్ని గ్రహించి నూతిగట్టు పగలగొట్టడానికి వెళ్తారు ఊరివాళ్లంతా. జరుగుతున్న మోసాల్ని గ్రహించి గిరిజనులు మేల్కోవాలనే సందేశాన్ని ఇస్తాడు రచయిత.

**3. గిరిజనుల మూఢాచారాలను చిత్రించిన కథలు:** నిరక్షరాస్యత, పేదరికంతో పాటు గిరిజనుల మూఢాచారాలను చిత్రించిన కథలు 'దండారి', 'రక్తపింజెర'. రెండు కథలూ గోండుల జీవితంలోని దయనీయ స్థితికి అద్దం పట్టేవే. దసరా నుంచి దీపావళి తరువాత కొన్ని రోజుల వరకూ ఉన్న కాలాన్ని గోండులు 'దండారి' అని పిలుస్తారు. ఈ కాలంలో దైవత్వం ఆపాదించబడే 'గుసాడీ'లకు భోజనం పెట్టడం వల్ల ఎత్మాసూర్ దేవత సంతోషిస్తుందని గోండులు నమ్ముతారు. ఆలా చేయకపోతే శాపం తగులుతుందని భావిస్తారు. గోండులకు పెద్ద కోటనాక మాన్కు. వాళ్ళింట్లో తరతరాల నుంచి వస్తున్న

సంప్రదాయాన్ని బతికించడానికి మాన్కు ఎన్ని కష్టాలు పడ్డాడో, చివరికి ఎలా జైలు పాలయ్యాడో ఈ కథ చెప్తుంది. గోండులైన శిత్రు, మల్కుబాయి దంపతుల దయనీయ దుర్భర దారిద్ర్యానికి అక్షర రూపమిచ్చిన కథ 'రక్తపింజెర'. బొంగులు కొట్టి, తుప్పలు గట్టి లారీలకెత్తడం, లారీల కోసం కొత్త మట్టిరోడ్లు వేసే పనులు చేయడం వీరి దినచర్య. వీళ్లు పనిచేసేటప్పుడు ముక్కినవి మురిగిన రేషన్ తెచ్చి ఇష్టం వచ్చిన ధరకు అమ్ముతుంటాడు సూపర్వైజర్. బొజ్జుకు జ్వరం వచ్చి పనిలోకి రాకపోతే అందరి ముందూ అతని ఒళ్లు నుజ్జు నుజ్జు అయ్యేటట్లు కొడతాడు శర్మ. సర్కారు నిర్ణయించిన కూలి డబ్బులివ్వకుండా వాళ్ల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని ఎక్కువ పని చేయించుకుంటారు. జ్వరం రావడానికి గోండులు 'పేన్కు' కోపం రావడమని నమ్ముతారు. దేవర కొలుపులప్పుడు, కొలువులకు చేసిన అప్పుల వల్ల వాళ్ళున్న స్థలం మంచిది గాదని ఆ గూడాన్ని ఎత్తేసి ఆ నాలుగు కొండల మధ్యనే మరోచోట గుడిసెలు వేసుకుంటారు. రక్తపింజెర కరిసి మల్కుబాయి చచ్చిపోతుంది. ఆ సమయంలో గోండులంతా కలిసి వాళ్ల ఆచారం ప్రకారం విషాదంగా నృత్యం చేస్తూ తెల్లవార్లూ డోలు వాయిస్తూ పాటలు పాడతారు. భూక్యా తిరుపతి రాసిన 'కాక్లా' కథ గిరిజనుల్లో మూఢవిశ్వాసాన్ని తెల్పుతుంది. ఎత్తుకుని ఆడించి, అడిగినవి కొనిపెట్టి ఎంతో ఆప్యాయం చూసిన మామీ (మేనత్త) కరెంట్ షాక్ వల్ల చనిపోయిందనే వార్త విని అక్కడికి బయల్దేరతాడు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని ఆదుర్దాగా ఇంటికి చేరుకుంటాడు. బంధువులు, తండావాసులు ఇంటిముందు గుంపు లుగా కూర్చుని ముఖాల మీద కొంగులు కప్పుకుని ఏడుస్తూ ఉంటారు. చివరికి మామీ మేనల్లుడి మీద పడి బావురు మంటుంది. ఆశ్చర్యపోయి ఆమె వైపు చూస్తాడు. అంతలో బంధువు ఒకాయన వచ్చి 'నిన్న మామీ గొడ్లను మేతకు తోలుకు పోయింది. అక్కడ కాక్లా (కాకి) నెత్తిమీద తన్నిపోయింది. అందరూ అది కీడని చెప్పారు. ఆ కీడు పోవాలంటే మామీ చచ్చి పోయిందని చుట్టాలను పిలవాలని చెప్పారు. అందుకే నిన్ను పిల్చాం" అని చెప్తాడు. తలమీద కాకి తన్నిపోతే అది కీడుగా భావించడం ఈ కథలో చెప్తాడు రచయిత. గోపి భాగ్యలక్ష్మి రాసిన 'జంగుబాయి' కథ గిరిజనుల్లోని మూఢవిశ్వాసాలను మరింత లోతుగా తెలియజేస్తుంది. ఆడపిల్ల ముట్టు అయినప్పుడు అయిదురోజుల దాకా ఇంట్లోకి రానివ్వకపోవడం, ఏదైనా అనారోగ్యమొస్తే ఆ ఊరిలో గణాచారిగా ఉన్న కాంతాబాయిని నమ్ముకోవడం, చేతబడుల్ని నమ్మడం, ద్రాలున్నాయని నమ్మి వాటికి భయపడడం, కళ్ళు తెరవని పసిగుడ్డుకు వెంట్రుకలు తీయించడం, బాల్య వివాహాలు మొదలైన ఎన్నో గిరిజనతండాల మూఢ నమ్మకాలను ఈ కథలో చిత్రిస్తారు రచయిత్రి.

ఆచార్య సూర్యాధనుంజయ్ గారు రాసిన 'అంబాలి' కథ తండాలో ఉన్న ఒక మూఢాచారాన్ని తెల్పుతూనే ఆ ఆచారాన్ని ఎదిరించాలనే చైతన్యాన్ని ప్రోదిచేస్తుంది. సేవ్య-భూరి భార్యాభర్తలు. భూరికి పిల్లలు పుట్టలేదని సేవ్యకి రెండో పెళ్లి చేయాలనుకుంటుంది అతని తల్లి. అది

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

తెలిసి భూరి తీవ్రంగా మనోవ్యథ చెందుతుంది. అరుణాబాయి సాయంతో సిటీకి తీసుకెళ్ళి అన్ని టెస్టులు చేయిస్తాడు సేవ్యా. కొన్నాళ్లకు వాళ్లకు అంబాలి పుడుతుంది. వయసొచ్చిన అంబాలికి బాలుతో పెళ్ళి జరుగుతుంది. ఒకరోజు పశువులను మేపడానికి వెళ్లిన బాలు పిడుగుపాటుతో మరణిస్తాడు. భర్త మరణంతో తీవ్ర దుఃఖంతో ఉన్న అంబాలికి బాలు తమ్ముడైన దస్రూ నాయక్'ని ఇచ్చి పెళ్ళి చేయాలని ఇంట్లో వాళ్లు భావిస్తారు. మరిది తనకు కొడుకుతో సమానం కనుక అతన్ని పెళ్ళిచేసుకోనని పంచాయితీ పెద్దల ముందు చెప్పి ఎదిరిస్తుంది. చివరకు అరుణబాయి ప్రవేశంతో కథ సుఖాంతమవుతుంది. భర్త తమ్ముణ్ణి చేసుకోవడమనే అచారాన్ని ఎదిరించి ఆడపిల్లలు చదువు ద్వారా తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే గొప్ప సందేశాన్ని ఈ కథలో ఇస్తారు రచయిత్రి.రమేష్ కార్తీక్ నాయక్ రాసిన 'పురుడు' కథ తండాల్లో పురుడు పోసే పద్ధతిని సోదాహరణంగా వివరిస్తుంది. 16 సంవత్సరాలు ఝుమ్లీకి పురిటి నొప్పులు ఎక్కువవుతాయి. తండాలోని ఆడవాళ్లంతా వచ్చి సపర్యలు చేస్తుంటారు. వాళ్లల్లో ఒకామె 'హింగ్నా' పురుడు జరిగిన విధానాన్ని కథలా చెప్తుంది. వాళ్ల పద్ధతి ప్రకారం పొయ్యి వెలిగించి ఉడుకుతున్న నీళ్లల్లో గోనెసంచుల్ని నానబెడతారు. వాటిని ఎడ్లబండిలో పరిచి దానిమీద హింగ్నాను పడుకోబెడతారు. ఇద్దరు పెద్ద మనుషులు ఎడ్లబండి కాడెను లేపి ఎత్తుపల్లాలున్న రోడ్డుమీద వేగంగా పరిగెడతారు. తండాలోని వాళ్లంతా ఆ బండి వెనకాల వెళ్తారు. ఆ కుదుపులకు హింగ్నాకు ప్రసవం అవుతుంది. తండాల్లో వాళ్ల సంప్రదాయం ప్రకారం పురుడు జరిగే విధానాన్ని ఈ కథలో అత్యంత వాస్తవికంగా చెప్తారు రచయిత.

**ముగింపు:** ఈ సంకలనంలోని కథల నిండా గిరిజన సంచార జాతుల జీవన వైవిధ్యం కనిపిస్తుంది. తమ భూముల్లో తామే కూలీలుగా మారుతున్న గిరిజనులు గెద్దల్లా ప్రవర్తించే పెద్దమనుషుల కింద బానిసలుగా బతుకీడుస్తున్న దయనీయ సంఘటనలు, ఆడవాళ్లను ఆటబొమ్మల్లా భావించి మోసం చేస్తున్న ఆధునిక సమాజ పోకడలు, ఆధునికత పేరుతో అడవుల్ని నరికేస్తూ గిరిజనులకు కొండల్నీ, అడవుల్నీ దూరం చేస్తున్న వైనాలు, ఆధునికత పోకడలతో అంతరించిపోతున్న గిరిజన స్సంస్కృతి, సంప్రదాయాల ఆనవాళ్లు.. ఇలా సంకలనం నిండా వైవిధ్య గిరిజన జీవన చిత్రాలు దర్శనమిస్తాయి. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వాళ్లమీద సాగుతున్న పోలీసు యంత్రాంగం అకృత్యాలు కూడా కొన్ని కథల్లో కనిపిస్తాయి.

**ఉపయుక్త గ్రంథ/వ్యాససూచి**

1.ఇప్పపూలు, గిరిజన సంచార తెగల కథలు, సంపాదకులు జీవన్, మలి ముద్రణ జులై 2023, ప్రతిభా ప్రచురణలు, ఖమ్మం.

2.గిరిజన జీవనదారి ఇప్పపూలు, డా. అమ్మిన శ్రీనివాసరాజు, తెలుగు ప్రభ, నవంబర్ 5, 2024.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# ఎండపల్లి భారతి జక్కికు నవల ఇతివృత్త విశ్లేషణ

**పి. షకీల**
పరిశోధక విద్యార్థి,
తెలుగు అధ్యయన శాఖ,శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం,తిరుపతి, ఆంధ్ర ప్రదేశ్.
చరవాణి : **7842728839**
Email : shakilanoor224@gmail.com

**విషయం సంగ్రహం :-**
ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఏకైక ప్రక్రియ ప్రప్రథమ ప్రక్రియ నవల. మానవ జీవితంలోని సమస్త విషయాలని కూలంకుషంగా వివరించగల ఏకైక ప్రక్రియ నవల ఒక్కటే. నవల యొక్క గొప్పతనని ఒక్క ప్రముఖ రచయిత దాశరథిరంగాచార్య తన మాటల్లో ఇలా అన్నారు "నవల సామాన్యుని వలె నిరాడంబరమైంది. జీవితం వలె సత్యమైంది ప్రకృతి వలె సుందరమైంది. ఆకాశం వలె విశాలమైంది. సూర్యుని వలె తేజోవంతమైంది. వాయువు వలె సర్వవ్యాప్తమైందని"
తెలుగు నవల సాహిత్యం లో ఎండ పల్లి భారతి తనదైన గుర్తింపు కోసం భారతి గారు జక్కికు నవలలో అనుసరించిన కథన పద్ధతి ఇతివృత్త పద్ధతిని పాత్రచిత్రణ పద్ధతి అనేవి కేవలం గతానికి చెందినవి కాదు. వర్తమానంతో అనుసంధానించి ఉన్నాయి. దానికి అనుగుణంగా భారతి జక్కికు నవలలో ఇతివృత్తం, పాత్రలు మన చుట్టు ఉన్న సమాజంలో మనం నిత్యం చూసేవి వినేవి వాటిలోని సంఘటనలు మన అనుభవాలలోనివి కావడమే భారతి గారి జక్కికు నవలకు ఆధారంగా ఇతివృత్త నిర్మాణం, పాత్రలు, శైలి గురించి అధ్యయనం చేయడం ఈ పరిశోధన పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**కీలక పదాలు :** రచయిత్రి పరిచయం ,ఇతివృత్త విశ్లేషణ ,పాత్రలు,నవల శైలి

**ఉపోద్ఘాతం :** మానవ జీవితంలో ఎన్నో కష్టాలకు ,ఒత్తిడులకు ,సంఘర్షణలకు గురి అవుతుంది అటు వంటి మానవులు బలియమైన వాటి ప్రభావం నుంచి తప్పించుకోవడానికి చూస్తుంటారు తన జీవితంలోని కష్టనిష్టురాలను మరవడం కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు . సినిమాలు, విలాసయాత్రలు మొదలగు వినోదాత్మకమైన ఆహ్లాదకమైన విషయాలు కంటే నవల బాగా ఉపకరించే సాధనం ఎక్కువ ఖర్చు శ్రమ లేకుండా నవల నుంచే వినోదాన్ని పొందవచ్చు. సాహిత్య ప్రక్రియలన్నిటిలో నవల విస్తృతమైనది కావటంవల్ల, భిన్నమతాల వ్యక్తుల జీవన విధానానికి దర్పణం పెట్టె రచనగా నవల ఉండటానికి వీలు ఉంది అటువంటి విస్తృత్తమైన పరిధితో వివిధ రకాల సంస్కృతులు ప్రభావం పాఠకుల పై యుంటుంది ఆయా నవలల్లో ప్రతిబించింపబడే సాంస్కృతిక విషయాలచే ఆకర్షితులై పాఠకులు తమ

సంస్కృతిని మార్చుకోవచ్చు కాబట్టి నవల మానవుల సాంస్కృతిక పరమైన ఆలోచనల్లో మార్పు తీసుకురావడానికి ఈ "జక్కికు " నవల ఇందులో ఆనాటి కాలంలో రైతులు మెట్ట భూములో తొలకరి పడగానే వ్యవసాయపు పనులు మొదలు పెట్టె రోజుల్లో మొలకల పున్నమి పండుగ ఎంతో వేడుకగా జరుపుకునేవారు. ఇప్పుడు ఆ సెల్లు ఫోన్లు, టివిలు రావడం వలన ప్రజలలో మన పూర్వపు ఆచారాలు, సంస్కృతిని, పండుగలను పూర్తిగా మరిచిపోయిన విషయం ఈ నవలలో ఉంది.

**రచయిత్రి పరిచయం :** ఎండపల్లి భారతి గారు 1981 లో మదనపల్లి దగ్గర దిగువబురుజు గ్రామంలో జన్మించారు. ఇప్పుడు కూడా అక్కడే నివాసం ఉన్నారు భారతి తన చిన్న తనంలోనే తల్లితండ్రులను కోల్పోయారు. అప్పటి నుంచి భారతి తన అవ్వ తాతల దగ్గరే పెరిగినారు. భారతి గారు ప్రాథమిక విద్య వరకే చదువు కున్నారు పన్నెడు సంవత్సరాల వయసులోనే భారతికి ఎండపల్లి శ్రీనివాసులు గారితో వివాహం జరిగింది. భారతి తన భర్త అయినా శ్రీనివాసులతో కలిసి నీటి ఆధారం లేని తమ పొలంలో వ్యవసాయం చేసుకుంటు ముగ్గురు పిల్లలను చదివించుకుంటున్నారు . అలాగే భారతి గత 23 సంవత్సరాలుగా స్వయం సహాయక సంఘాలకోసం నడిపే నవోదయం పత్రిక సంపాదక వర్గం లో పని చేస్తుంది. పత్రిక పని మీద పల్లెలో నిరంతరం తిరుగుతు ఉంటుంది. 40వేల ప్రతులు అమ్ముడుపోయే పత్రిక అది. సెర్ప్ సంస్థ కోసం మైక్రోఫైన్స్ మీద, వ్యవసాయ పద్ధతుల మీద, విమెన్ ట్రాఫ్కింగ్ మీద అనేక కేస్ స్టడీస్ చేసింది. వీడియో శిక్షణ తీసుకోని అనేక లఘు చిత్రాలు నిర్మాణం చేసింది. "రాయి పలికినరాగాలు" అనే సినిమా కూడా తీసింది. నెట్వర్క్ ఫర్ విమెన్ ఇన్ మీడియాలో సభ్యురాలుగా అనేక నగరాలలో జరిగిన జాతీయ సమావేశాలకు భారతి నవోదయం పత్రిక ప్రతినిధిగా పాల్గొనిది. భారతి గారు ఎదారి బతుకులు కథ సంపుటి ద్వారా తెలుగు సాహిత్యానికి రచయిత్రిగా పరిచయం అయింది. వ్యవసాయ మహిళా కూలీలా పై ఆమె రాసిన కథలతో రచయిత్రిగా, కథకురాలిగా గుర్తింపు పొందింది. భారతి గారి కథలన్నిటిలో బడుగువర్గాల స్త్రీల యొక్క బాధలను కష్టాలను భావోద్వేగాల చిత్రీకరణ. ఒక వస్తువును భిన్నకోణాల నుంచి దర్శించి కథలను రాయడమే ఈమె ప్రత్యేకత. భారతి గారు 2016 సంవత్సరంలో అమ్మనుడి మాస పత్రికలో ప్రచురణ అయిన "ఇత్తలిబింది" కథతో కథలు రాయడం మొదలు పెట్టిన 2018 సంవత్సరంలో ముద్రణ పొందిన ఎదారి బతుకులు కథ సంపుటితో రచయిత్రిగా అందరికి పరిచయమైనారు భారతి ఇప్పటి వరకు ఎదారి బతుకులు, బతుకీత, జాలారి పూలు, దేవరహస్యాలు, పచ్చబొట్టు అనే కథ సంపుటాలను జక్కికు అనే ఒక నవలను వెలువరించారు. తెలుగు సాహిత్యానికి తన వంతుగా ఇష్టగా సేవ చేస్తూ భారతి తన కృషికిగాను అనేక సన్మానాలను పురస్కారాలను అందుకున్నారు. భారతి గారు అందుకున్న పురస్కారాలలో కొన్ని గిడుగు రామూర్తి

పురస్కారం, డాక్టర్ వి. చంద్రశేఖరరావు సాహితి పురస్కారం, పుట్ల హేమ లత పురస్కారం, విమల శాంతి నారాయణ పురస్కారం, వెంకటసుబ్బమ్మ స్మారక పురస్కారం, జక్కికు నవలకు గాను దాసరి శిరీష జ్ఞాపిక పురస్కారం అందుకున్నారు.

**ఇతివృత్తి విశ్లేషణ :** తెలుగు సాహిత్యంలోకి కథ రచయిత్రిగా ఎండపల్లి భారతి అడుగు పెట్టారు. సాహిత్యానికి కొత్త స్ఫూర్తి తో ఎదారి బతుకులు, బతుకీత, జాలారి పూలు కథ సంపుటాల ద్వారా వైవిధ్య భరితమైన అట్టడుగు వర్గాల స్త్రీల జీవన తాత్వికతని ముచ్చటించిన పల్లెకథల భారతి ఇప్పుడు జక్కికు ద్వారా నవల రచయిత్రిగా పరిచయం అన్నారు. "జక్కికు" నవల మనకు పరిచయం ఉన్న మూస నవల సంప్రదాయాలన్నిటిని బద్దలు కొట్టిన రచన. సాహిత్య పరిశోదకులికి, విమర్శకులికి కొత్త ఆలోచనలకు పురిగొల్పే ప్రత్యేకతలెన్నో ఇందులో ఉన్నాయి. జక్కికు నవలను ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి రాసిందో రచయిత్రి నవలలో అనేక సందర్భాలలో ప్రస్తావించింది. మెట్ట భూములలో ముంగార్ల వాన పడగానే వ్యవసాయపు పనులు మొదలు పెట్టె రోజుల్లో మొలకల పున్నమి పండుగ ఎంతో వేడుకగా జరుపుకుంటారు. జొన్నలు, రాగులు,సద్దలు, పెసులు, అలసందులు, అనుముల, ఉలవలు, అరికెలు వంటి గింజల్ని మూకుళ్లలో మొలకెత్తించి బోయకొండ గంగమ్మ మతమ్మ లాంటి ఇష్ట దేవతలకు సమర్పించే ఆ పండగని ఊర్లో అన్ని వర్గాల వాళ్ళు చేసుకుంటారు అయితే ఆ సందర్భంగా జక్కికు ఆటపాటలతో సందడిగా సంబరం చేసుకోవడం మాత్రం క్రింది వర్గాల వారి ప్రత్యేకం కాని ఇప్పుడు క్రింది వర్గాలు వారు కూడా సవాలక్ష కారణాల వల్ల ఆటాపాటకు దురమైపోతున్నారని అందరు బాధలన్నీ మరిచి మనసారా నవ్వుకొని ఎన్ని సంవత్సరాలయిందోనని రచయిత్రి బాధ.

"ఒక్కప్పుడు జరుగుతున్నట్లు ఆటాపాటలతో పద్దతిగా పండగ జరిగి దెగ్గిరి దెగ్గిరి పది సంవత్సరాలైంది. ఏమని మా ఊర్లోకి ఆ సెల్లులు , టీవీలు వచ్చినాయో అబుడునుండి ఆటాపాటా అనేవే లేకుండా అయిపోయ నలుగురు ఒగ తావకు జేరి సద్దులాడుకునేదే కరువైపాయ. ఆ సీరియల్ లో నటించే వాళ్ళ కుట్రలన్ని మా జీవితాల్లోకి వచ్చేసినాయి" దీనికి విరుగుడు మళ్ళా అందరిని పోగేసి పండక్కి జక్కికు ఆడిపాడాలి. అదే నవల వస్తువు అందుకు లచ్చుమమ్మ, మునెమ్మ, రాధమ్మ, సావిత్రి, అంజమ్మ, నాగన్న, చంద్రన్న, రామన్న ఇలా వూళ్లో పాడేవాళ్ళని, ఆడేవాళ్ళని అందరిని కూడగటే క్రమంలో పల్లె ప్రజల్ల సామాజిక సాంస్కృతిక జీవితమంతా నవలలో భాగమైంది.

అందరం పున్నమి రోజులోకి అడుగు పెట్టినాము. ఇండ్లు కడుక్కొని, వాకిండ్లు అలుక్కొని ముగ్గులు ఏసుకొన్నాము. మావిడాకులు, పూలతో ఇల్లంతా అలంకరించుకున్నాము. అందరం నీల్లు పోసుకుని

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

పండగలకి కట్టుకోవాలని ఎత్తి పెట్టుకున్న మంచి మంచి బట్టలు ఏసుకున్నాము. మొలకలకు పసుపు కుంకం బెట్టి అలంకరించుకున్నాము. అందరం మావిటాల జరిగే సంబరం కోసం ఎదురు చూస్తా న్నాము. పలకలు కొడతా వుంటే అందురూ మొలకలు నెత్తిన పెట్టుకొని పోతా వుంటే తేరు సాగినట్టుంది. పలకలు కొట్టుకుంటా గుళ్లు కాటికి పోయి ప్రతి గుడి సుటకారము మూడు సుట్లు ఏసి, గుళ్లో మొలక పెట్టి, టెంకాయలు కొట్టి దండం పెట్టుకున్నాము. మా ఆటాపాటా చూసేదానికి మాకంటే ముందుగానే ఆ చందమామ నిండుగా వచ్చి కుసున్నాడు. చూసేదానికి అంత కాంతిగా ఉన్నాడు. మా ఊరు ఏడుకలు అప్పటికే మొదలైనాయి. ఆడోల్లు ఒకరిపై ఒకరు వసంతాలు జల్లు కుంటున్నారు. పరమాన్నాలు ఒగపక్క తింటా ఇంగోపక్క వొల్లంతా దుద్దుకొంటా వున్నారు. ఒగరికి ఒగరు దొరక్కుండా ఆడ మగ పరిగెత్తుతా ఉన్నారు. అన్ని దేవలాల్లోని దేవతలు అలంకరణలు చేయించుకోని పూజలు అందుకొని కలకలలాడతా సంబరం చూసేదానికి కొలువు తీరి కుసున్నారు ఊరంతా సంబరం కోసం ఎదురుచూస్తా ఉన్నారు. అందరి కాడికి ముందు గానే నేను తయారవుదామని ముదురాకు పచ్చ అంచు గల వంగపూత రంగుచీర తీసిన నా కంటే ముందుగా నా మొగుడు తయారై ఆడుండాడు. ఆటాడే దానికి తావంతా సుద్ధం చేస్తా ఉన్నట్లే. నా జతకు మా నీలి వచ్చే ఆట చూసేదానికి వొగరొకరే జమ అయి తున్నారు. ఊరు పెద్ద లచ్చుము సిన్నమ్మ, ఆయమ్మ మొగుడు జంటగా ఒగేసారి వొచ్చిరి వాళ్ల యనకాలే మునెమ్మ వస్తా వుంది. రాధా పసుపురంగు సీరకట్టి, చేతులు నిండా పూల గాజులేసి, తల నిండా పూలు పెట్టి, మొగానికి పచ్చి పసుపు పూసుకొని, ఎర్రని బొట్టు పెట్టుకొని, కాళ్లకు గజ్జలు, చేతికి చెక్కలెత్తుకోని పరిగెత్తుకుని వచ్చింది. అంజమ్మ, గోర్లన్న చేతిలో చెక్కలు పట్టుకొని చిక్కని నవ్వులో వచ్చినారు. చంద్రన్న,రాజన్న, నారాయనన్న, ఈ రకంగా రావలసిన వాళ్లందరూ ఆ దేవుళ్లే పూని ఎంట ఉండి తెచ్చినట్లు ఆనందంతో కేరింతలతో వచ్చినారు. ఊర్లో ఇండ్లల్లో ఒక్క పిల్లికూన్ కూడా లేకుండా అందరూ కొలువు తీరినారు. తూర్పు మగాన మూల సుక్క మొలిసింది. ఎనిమిది గంటల పైన ఆట ఆరంబమయ్యింది. చంద్రన్న, రాజన్న పలకలు కొట్టేదానికి నడిమిద్దెలో నిలబడు కున్నారు. అబ్బుటికె వాల్ల కడుపులో కల్లు కుండ కదిలిస్తా ఉంది. దీనకు దినకు, దిన్నాదిన్న అని వాయిస్తున్నారు. తొలిత నాగన్న గనమైన గొంతుతో గనంగా పాట మొదలెత్తే! ఎనక పాట అందరూ గొంతెత్తుకున్నారు అదే ఊపులో. ఊపులో. ఇంగో పాట అందుకుండే.

గాజులే గొట్టేవు గల్లు మనిపించేవు
ఏ రాజు కూతురివే నరిసి ఎంత చక్కని దానివే నరిసి మాటాకు మాట్లాడవే నరిసి కన్నెత్తి చూడవేమేనరిసి
పల్లెత్తి పలకవేమే నర్సి నీమీద మనసాయనే నరిసి ఏ రాజు కూతురువే

ఏ రాజు కూతురైతే ఏమాయరా నీకేమాయరా పిలగా
ఊరు నీ కొమ్మాదిరా పిలగా
తావు నీకొమ్మాదిరా పిలగా
ఉరికేవు నీ ఊరికీ పిలగా
పాట పాడతా ఉంటే ఒకటే కేకలు, ఈలలు

అంటూ అంజమ్మ పాట అందుకుండే. ఈ పాటకు చంద్రన్న, రాజన్నలిద్దరూ తలకాయలు ఎగరేస్తా వూపుగా పలక కొడతా ఉంటే వాళ్ల జతకి గాలి కూడా వచ్చి పలక కొట్టినట్లుంది. మల్ల ఆకాశంలో పిల్లలకోడి తన పిల్లల్ని తోడుకొని వచ్చేసింది. అయిదారు నక్షత్రాలు గుంపుగా కనిపిస్తున్నాయి. అప్పటికి రెయ్యి రెండు గంటలవుతోంది. నారాయణన్న పాటెత్తుకొనే!

నారి నారి వయ్యారి నారివే
నగే మగము దాన
నీ నగేమగానికి నాగదారి సుక్క బొట్టు బలే ఉంది బాల
ఎండి కరుగు బంగారు కరుగు నీ మనసు కరగదేమే
ఆ ఏడుకొండల ఎంకన్న సొచ్చిగా నిన్ను మరవలేనే

పలకలు కొట్టే రాజన్న చంద్రన్నలకు పలక కొట్టి కొట్టి సర్తు కారి ఒళ్లంతా నాని ముద్దయింది. ఆట జోరందుకొని ఆడి ఆడి వొంటిలోని రగతమంతా రంకిలేసి ఎగిరినట్టు అందరి మొగాన సర్తునీల్లు బొట్టుబొట్టుగా నేల రాలతా ఉన్నాయి. ఆయాలకే ఆకాశంలో మంచం కోళ్లు మొలిసినాయి. నాలుగు నక్షత్రాలు నాలుగు సమకాలుగా కనిపిస్తున్నాయి. మూడుగంటల జామయ్యింది. మునెమ్మ పాట మొదలుబెట్టి పాట మింద పాట అందుకుంటానే ఉంది

గాజుల బేరం చెప్పు సిన్నోడా మంచి గాజులంట అమ్మేవు కుర్రోడా కుదిరిగ్గ కూసోయె సిన్నదాన నీకు వొక బంతి ఏసేను కుర్రదాన చిత్తూరు జిల్లాలో మదనపల్లి తాలూకా ఏనుగుబ్బల పైన నరసంద్ర గాజులు, శ్రీకృష్ణ సీలాలు అన్ని గాజులేమో నా దగ్గరున్నాయి కుదిరిగ్గ కుసోయే సిన్నదాన నీకు వొక బంతి ఏసేను కుర్రదానా

ఆ ఈలలకి, కూతలకు, కేకలకు, పలక దరువులకి, చిడతల శబ్దాలకు, గజ్జెల మోపులకు ఆ లోకం, ఈ లోకం ఒక్కటై ఆనందం కమ్ముకుంది ఆడి ఆడి, పాడి పాడి, ఎగిరి ఎగిరి ఆయాసం తన్నుకొచ్చి అలిసిపోయి ఆగినాక ఆనంద కన్నీల్లు ఆ బూదేవిని అంటినాయి.

మల్లెలు మల్లెలు విరబిర జాజులు హారతి కైగొనరా శ్రీరామచంద్రా
కర్పూర హారతులు కరుణతో తెచ్చినాము హారతి కైగొనరా శ్రీరామచంద్రా
ముత్యాల హారతులు మునిగెడ తెచ్చినాము హారతి కైగొనరా శ్రీరామచంద్రా
మంగళము సుబ మంగళము
మంగళము జయ మంగళము!

పరమటన గుడ్డి సుక్క మొలిసింది. నాలుగు జాములయ్యింది. తొలికోడి కూసింది. మంగళహారతితో ఆట ముగిసి సంబరం తెర తెగి నిద్రతెర కండ్లకు కమ్మింది!

**నవలలో పాత్రలు :**

నవల ఇతివృత్తానికి ఆలంబనగా నిలిచేది పాత్రలు. ఇక్కడ రచయిత్రి తనయొక్క భావాలను అభివ్యక్తం చేస్తూ తాను నిర్వహించే కథ గమనానికి పాత్రలు సాధనంగా చేసుకుంటారు. నవలకు ముఖ్యంగా ప్రాణం పోసేవి పాత్రలు అలాగే పాఠకుల్లో సానుభూతిని రెక్కెత్తించి, రసానుభూతిని కలిగిస్తుంది నవల ప్రారంభం నుండి ముగింపు వరకు పాత్రలు స్థిరంగా నిలిచి ఉంటాయి. నవల ఎంత పెద్దదైన, చిన్నదైనా తమతో పటు చివరిదాకా నడిపించి ఆనందానుభూతులను లేదా విషాదమైన సంఘటనలను కలిగిస్తాయి నవల కారుడు తన పాత్రలను సృష్టించేటప్పుడు తాను తన వ్యక్తిగత జీవితంలో చూసిన వ్యక్తులు వారి వ్యక్తిత్వం ఆధారంగానే తన పాత్రల్ని సృజించి, కథాగమనానికి ఒక నిర్దేశాన్ని చేకూరుస్తాడు. ఎండపల్లి భారతి జక్కికు నవలలో నేడు సమాజంలో ప్రజలు మరచిపోయిన మన సంస్కృతి ఆచారాలను అందరికి గుర్తు చేయడానికి. మనషుల మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాలను తిరిగి గుర్తు చెయ్యాలి అనే ఉద్దేశం తో రచయిత్రి ఈ నవలలో మొలకల పున్నమి ని వస్తువుగా చేసుకొని జక్కికు నృత్యం తో అందరిని ఒక దగ్గరికి చేర్చడమే ఇందులోని పాత్రలు లచ్చుమమ్మ, మునెమ్మ, రాధమ్మ, సావిత్రి, అంజమ్మ, రామన్న, చంద్రన్న, ఇలా వూళ్ళో ఆడిపాడే వాలందరు ఈ నవలలో పాత్రలు.

**నవల శైలి :**

ఎండపల్లి భారతి గారు మదన పల్లి పరిసరప్రాంతం దగ్గర నిమ్మాల పల్లి మండలం దిగువ బూరుజు పల్లె లోని మాండలికం లో, చక్కని తెలుగు నుడులతో, ప్రత్యేకంగా తనకు చిరపరిచితమైన తన పల్లి భాషలో రచనలు చేస్తుంది. ఆమె కథల్లో పేద శ్రామిక మహిళల జీవితాల గురించి తమదైన సంస్కృతి, సామాజిక చింతన, పల్లెల రూపురేఖలులను తన రచన లో చూపించింది .

**ముగింపు :**

ఈ జక్కికు నవలలో రచయిత్రి మొలకల పున్నమి ప్రాముఖ్యతను. నేడు సమాజంలో సెల్ఫోన్లు, టీవీల వలన మనుషుల మధ్య పెరిగిన దూరాలు. ఆటపాట కథ పుట్టిందే మన దగ్గర అవే మన ఆస్తులు, అవి బాగా పెట్టుకుంటేనే రేపు మనకి విలువ ఉండేది. ఈ నవలలో కులుకు భజన, పండరి భజన, కోలాటం, జడకోపు వంటి కళారూపాలు ఆ సందర్భాలలో పడే పాటలు ఉన్నాయి. పలక/డప్పు చర్మ శుద్ధి చేసి వాద్యాలు, తయారు చేయడంలోని సాంకేతిక నైపుణ్యాలు తెలియజేసినారు. తెలుగు నవల ప్రపంచంలో "జక్కికు" నవల అనే పేరు విశిష్టమైనది, విలక్షణమైనది. ఈ నవలను చదివిన ప్రతి పాఠకుడికి మొలకల పున్నమి ప్రాముఖ్యత పల్లెప్రజల బాంధవ్యాలు గురుంచి మన సంస్కృతి సంప్రదాయాలు ఆచారాలు గురుంచి చాల చక్కగా వివరించింది.

**ఉపయుక్త గ్రంథలు :**

1) నాగయ్య. జి తెలుగు సాహిత్య సమీక్ష, రెండవ సంపుటి, నవ్య పరిశోధన, ప్రచురణలు తిరుపతి, 1995
2) రమాపతిరావు, అక్కిరాజు, తెలుగు నవల, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి హైదరాబాద్ 1975
3) నాగభూషణ శర్మ మొదలి, తెలుగు నవలావికాసం హైదరాబాద్, 1974
4) వెంకట కుటుంబరావు, బోడ్డపాటి, ఆంధ్ర నవలా పరిణామం హైదరాబాద్, 1971
5) వెంకట సుబ్బయ్య, వల్లంపాటి నవలా శిల్పం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1989.
6) భారతి ఎండపల్లి, జక్కికు దేశి నవల ఆలంబన ప్రచురణలు బాలాజినగర్ హైదరాబాద్ 2023
7) వెంకటేశ్వర్లు, పుల్ల బోట్ల తెలుగు నవలాసాహిత్య వికాసం, విజయవాడ, 1974

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## కన్నెగంటి అనసూయ కథల్లో లో సామాజిక చైతన్యం

**డా. యస్. దివిజాదేవి,**
తెలుగు అధ్యాపకురాలు,ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ. ప్ర.),గుంటూరు.
Cell: 9246806307,Mail ID: divija.devi1@gmail.com.

మానవ జీవన యానం ఎన్నో రకాల అనుభవాల సారం. ఆ అనుభవాలను హృద్యంగా వ్యక్తీకరించగలిగిన వారు కవులు, రచయితలు. ఆ వ్యక్తీకరణ పాఠకుల మనసులను స్పృశిస్తే వారు తిరుగులేని రచయితలుగా నిలబడతారు. ఆ కోవకు చెందిన వారే రచయిత్రి కన్నెగంటి అనసూయ గారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో మహిళా రచయితల పాత్ర విశిష్టమైనది. ఆ క్రమంలో కన్నెగంటి అనసూయ కథలు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తూ, ముఖ్యంగా మహిళా జీవితం, లింగ వివక్ష, పేదరికం, కుటుంబ సంబంధాలు, విద్య, ఆర్థిక స్వావలంబన వంటి సామాజిక సమస్యలను సూక్ష్మంగా ఆవిష్కరిస్తాయి. తన కథల ద్వారా సామాన్యుల జీవితాలను, ముఖ్యంగా మహిళల అంతర్మథనాలను ప్రభావవంతంగా చిత్రించారు. ఆమె కథలు కేవలం కథనాలు మాత్రమే కాకుండా, సామాజిక విమర్శలుగా కూడా నిలుస్తాయి.

తన చుట్టూ ఉన్న సమాజాన్ని పరిశీలిస్తూ. తాను గమనించిన పేద వాళ్ళ జీవితాల్లోని ఆకలి బాధలు, కష్టాలు, కన్నీళ్ళకు తన రచనల్లో అగ్రతాంబూలం ఇస్తూనే వాళ్ళను ఓదార్చుతూ, అవసరమైతే నేనున్నానంటూ చేయూత నిస్తూ ఆ సమస్యలకు పరిష్కారం కూడా చూపిస్తుంది రచయిత్రి. సహజ సంభాషణల ద్వారా, పాత్రల మానసిక సంఘర్షణల ద్వారా సామాజిక చైతన్యాన్ని ప్రతిబింబింపజేస్తారు.

అద్భుతమైన భావ వ్యక్తీకరణతో, సరళమైన శైలితో, పాఠకులను ఆకట్టుకున్న వీరు 'దీప తోరణం', 'జీవన శిల్పం', 'కరదీపికలు', 'పొడిచేపొద్దు' అనే నాలుగు కథా సంపుటాలను వెలువరించారు. 'నాల్నాలుగుల పదహారు' అనే కథా సంపుటిలోని మొదటి నాలుగు కథలు వీరివే. ఆరువందలకు పైగా కథలను రచించారు. వీరి బాలల కథల సంపుటం 'స్నేహితులు' కు 2020 లో కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం లభించింది. వీరు రాసిన బాలల కథల్లో 'బుద్ధి బలం' అనే కథ కేంద్రసాహిత్య అకాడెమీ వారి కథల సంకలనంలో చోటు దక్కించుకొని 22 జాతీయ భాషలలోకి అనువదింప బడింది. 'తానొకటి తలచినా', 'కాలాన్నే చిలికితే' అనే రెండు నవలలు కూడా రాశారు.

రంజని సాహితీ సంస్థ అవార్డు, గిడుగు రామమూర్తి తెలుగు భాషా పురస్కారం, అడవి బాపిరాజు సాహితీ పురస్కారం, జాగృతి వారి వాకాటి పాండురంగారావు పురస్కారం లాంటి ఇరవై నాలుగు కు పైగా

పురస్కారాలు అందుకున్న వీరు 'మానస' అనే స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించి బడుగు వర్గాల మహిళలను చైతన్య పరిచి సహాయ సహకారాలను అందిస్తున్నారు.

విద్యను సామాజిక మార్పుకు ఆయుధంగా అనసూయ చిత్రించారు. మహిళ విద్యావంతురాలైతే ఆత్మవిశ్వాసం, స్వతంత్రత పెరుగుతుందని ఆమె కథలు సూచిస్తాయి. విద్య లేమి ఎలా అజ్ఞానానికి, అణచివేతకు దారితీస్తుందో కూడా స్పష్టంగా చూపిస్తారు. సమాజంలోని అసమానతలు, మార్పులు, సంఘర్షణలను కళాత్మకంగా వ్యక్తపరచడం వీరి శైలి.

వీరి 'దీప తోరణం' కథా సంపుటి 2014 లో వెలువడింది. ఇందులో మొత్తం 15 కథలు వున్నాయి. ఇవన్నీ వెలుగుల సమాహారాలే. వివిధ కథల పోటీల్లో బహుమతులు పొందినవే. కథలు అన్నీ కూడా ఉత్తమ పురుష కథనంలో ఆకట్టుకుంటాయి.

'ఆ చల్లని నీడ' కథలో మూగ చెవిటి అమ్మాయి ఋూశమ్మ. మధ్యాహ్న భోజన పథకం ఋూశమ్మ లాంటి అమ్మాయిలకు అమ్మలా ఎలా ఆసరా అవుతుందో హృద్యంగా వివరించారు. ఋూశమ్మ గొడుగు కోసం పరితపించిన తీరు, దానికి కారణం మనసును కలిచివేస్తుంది. గొడుగులు పంచడానికి వచ్చిన రచయిత్రి ఋూశమ్మ జీవితానికి గొడుగై అండగా నిలవాలనుకోవడం ఈ కథలోని మానవీయ కోణం.

'ఎప్పటికీ సజీవంగా' కథలో దేశభక్తి గూర్చి చెబుతూ, జెండా ఎగరేసి చీకటి పడ్డాక దాన్ని తీసి పెట్టెలో పెట్టేయడం కాదని, నీ చుట్టూ ఉన్నవాళ్ళంతా నీ దేశమే, వాళ్ళ బాధలని పట్టించుకో, ఎదుటి వాడి ఆనందాన్ని వాడినే అనుభవించనీ, కానీ వాడి కష్టాన్ని మాత్రం నీ కష్టం అనుకో…. అంటూ దేశభక్తికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చారు.

తాను అనుభవించిన జీవితాన్ని, తాను చూసిన జీవితాన్ని కథలుగా మలిచిన తీరు ఆకట్టుకుంటుంది. సీతాఫలాలు ఇష్టమైన ఒక అమ్మాయి శీతాకాలపు మంచులో సీతాఫలాలు తీసుకొచ్చే తాత కోసం ఎంతలా ఎదురు చూసేదీ, ఆయన పిలుపుని ఎలా గుర్తుపెట్టుకొని పెళ్ళయి పట్నంలో స్థిరపడ్డాక కూడా 'సీతాఫలాల తాత' కోసం, అతని పిలుపుకోసం, అతను పంచే ఆప్యాయత కోసం ఎంతలా ఎదురు చూసింది, అతను తెచ్చే సీతాఫలాల రుచిని ఆస్వాదించడం కోసం ఎంతలా పరితపించిందో హృద్యంగా చెబుతారు. మన చిన్ననాటి జ్ఞాపకాల దొంతరని కదిలిస్తారు. మనల్ని ఆయా పాత్రల్లో లీనమయ్యేలా చేస్తారు. మనలోకి మనం తొంగిచూసుకునేలా పాత్రల్ని మలవడం వీరి ప్రత్యేకత. వీరి పాత్రలు అన్నీ ఊహాతీతమైనవి కావు. నిజ జీవితంలోని సజీవ శిల్పాలు. మన చుట్టూ ఉన్న సమాజంలోంచి వచ్చి మనల్ని ఆప్యాయంగా పలకరించి తమ కష్టసుఖాలు చెప్పుకుంటారు.

వీరి కథల్లోని పాత్రలు మన చుట్టూ ఏదో సందర్భంలో కనిపించేవే, మనల్ని ఆప్యాయంగా పలకరించేవే, సహజత్వానికి దగ్గరగా ఉండేవే, ప్రతీ కథా ఏదో ఒక సామాజిక సమస్యను గూర్చి చర్చిస్తుంది. దానికి పరిష్కారాన్ని సూచిస్తుంది అదే వీరి కథల్లోని గొప్పదనం. ఈ కథల్లో సంప్రదాయ విలువలు, ఆధునిక ఆలోచనల మధ్య సంఘర్షణ స్పష్టంగా కనిపిస్తుంది. సమాజంలో మహిళకు ఉన్న స్థానం, ఆమె ఎదుర్కొనే ఆంక్షలు, ఆత్మగౌరవ పోరాటం ప్రధానాంశాలుగా నిలుస్తాయి.

కన్నెగంటి అనసూయ కథలు సామాజిక స్పృహకు పాదులువేసి మార్గదర్శకంగా నిలుస్తాయి. ఆమె కథల్లో ప్రతిఫలించిన సామాజికాంశాలు సమాజంలోని అసమానతలను ప్రశ్నిస్తూ, మార్పు అవసరాన్ని సూచిస్తాయి. మహిళా కేంద్రిత దృక్పథంతో పాటు, సమాజం మొత్తం మీద ఒక మానవీయ దృష్టిని ఆమె కథలు ప్రతిపాదిస్తాయి. అందువల్ల కన్నెగంటి అనసూయ కథలు సామాజిక చైతన్యానికి వేదికలుగా నిలిచి చదువరులను ఆకట్టుకుంటాయి.

**ఆధార గ్రంథాలు :**

1. దీప తోరణం – కన్నెగంటి అనసూయ
2. జీవన శిల్పం - కన్నెగంటి అనసూయ
3. కరదీపికలు - కన్నెగంటి అనసూయ
4. 'పొడిచేపొద్దు - కన్నెగంటి అనసూయ
5. నాలుగులుగుల పదహారు – కథా సంకలనం .

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# చలం ' సుశీల ' కథ - స్త్రీ వాద సాహిత్య మార్మిక దృక్పథం

1. డా. దాసరి విజయలక్ష్మి
తెలుగు డిపార్ట్మెంట్,
జె.యం.జె. మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి.
2. డా. పిల్లి వాసు
అతిధి అధ్యాపకులు,
తెలుగు డిపార్టుమెంటు, తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం ,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

తెలుగు కథా సాహిత్యంలో స్త్రీ పాత్రల చిత్రీకరణ విషయంలో ప్రాచీన సాహిత్యానికి, ఆధునిక సాహిత్యానికి చాలా తేడా వుంది. ప్రాచీన సాహిత్యంలో స్త్రీని ఒక శృంగార రసోద్దీపనగానో, భోగ్య వస్తువుగానో లేక దాని విధి విధానాలకు సంబంధించిన ఒక ఆలంభనగానో వర్ణించడం జరిగింది. ఈ అభిప్రాయానికి కొన్ని కొన్ని ప్రత్యేక సందర్భాలలో, కొన్ని కొన్ని పాత్రల స్వభావ చిత్రీకరణలో మినహాయింపు అనేది ఉండవచ్చు ఉదాహరణకి స్వాభిమాన ప్రతీకగా సాహిత్యంలో మనకు సత్యభామ కనిపిస్తుంది. అలాగే నిఘుమశర్మ అక్క గొప్ప నేర్పరితనం కలిగిన స్త్రీ మూర్తిగా కనిపిస్తుంది. అదేవిధంగా కొమరగిరి రెడ్డిరాజు భార్య లకుమాదేవి రాజనీతిజ్ఞురాలిగా, తెగువ, ధైర్యం వున్న స్త్రీ మూర్తిగా మనకు దర్శనమిస్తుంది. ఇలా కొన్ని కొన్ని సంధర్భాలలో తప్ప, ఎక్కువగా స్త్రీని ఒక శృంగార రస ఆలంబనగానో, లేక దానికి సంబంధమైన విధి విధానాలకో, ప్రవృత్తి నివృత్తులకో సంబంధించిన అంశాల పరంగా మాత్రమే చిత్రీకరించడం జరిగిందనేది కాదనలేని సత్యం. స్త్రీల మానసిక స్థితిని, వారి అనుభవాల సంఘర్షణలను, కేవలం పురుషుడి దృష్టి కోణంలోనే విశ్లేషించడం జరిగిందేగానీ, స్త్రీల కోణం నుండి వాళ్ళ మనోభావాలు చిత్రీకరణ అనేది జరగలేదు. కానీ ఆధునిక సాహిత్యంలో ఈ పద్ధతిలో క్రమక్రమంగా కొన్ని నూతన మార్పులనేవి సంతరించుకుని, స్త్రీల వ్యక్తిత్వాన్ని వారి వారి అనుభవాల్లోనుంచే, వారి వారి మనోభావాల్లో నుండే చిత్రీకరించటం జరిగింది.

ప్రధానంగా మనకు తెలుగు సాహిత్యంలో స్త్రీల ప్రస్తావనలనేవి 11వ శతాబ్దం నుండి కనిపిస్తూ వినిపిస్తున్నా, అవేవీ స్త్రీల మనోభీష్ట గొంతుకల నుండి వచ్చినవి కాదు. ఆ క్రమంలో 15 వ శతాబ్దంలో తాళ్ళపాక తిమ్మక్క మొదలుకొని 19వ శతాబ్దంలో తరిగొండ వెంగమాంబ, మొల్ల, రంగాజమ్మ, ముద్దుపళని, లాంటి కవయిత్రులు వరకూ గొప్పసాహితీ స్రష్టలుగా కనిపిస్తారు. కానీ వారు కూడా తమ సమకాలీన పురుష కవుల కవిత్వ పంథానే అనుసరించారు తప్ప, వారి వారి సొంత మనోగొంతుకల భాణిలనుండి మాట్లాడే ప్రయత్నం చెయ్యలేదు సరికదా, కనీసం ఆ భావధోరణి వైపుకి కూడా వారి ఆలోచన స్పృహ విస్తరించలేకపోవటానికి గల కారణం, ఆనాటికి, అదే సాహిత్య ధర్మమైన పురుష దృష్టి కోణపు పరంపర ప్రవాహ గతిలో వారు సైతం కొట్టుకుపోవటం గానే మనం అర్థం చేసుకోవాలి.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

20 వ శతాబ్ది ప్రారంభంలో కుడా మనకు భావవాద, సంస్కరణ వాద, కాల్పనిక వాద, జాతీయ వాద ,అభ్యుదయ వాద కవిత్వాలలో స్త్రీ మూర్తులు కనిపిస్తున్నా వారు కూడా వారిదైన సొంత భావనలతో కాక పురుష భావజాలాన్నే తమ తమ సాహిత్యంలో అనుసరిస్తూ వచ్చారనేది మనం గ్రహించవచ్చు.

ఆ క్రమంలోనే మొట్టమొదటి మనకు స్త్రీ విద్య, వితంతు వివాహాలు, బాల్య వివాహాలు నిరసిస్తూ, వరకట్న వ్యవస్థల్నివ్యతిరేఖిస్తూ, స్త్రీల పక్షంగా కృషిచేసిన వీరేశలింగం గారి సంఘుసంస్కరణ సాహిత్యాన్ని చెప్పాలి. సాహిత్య చరిత్రలో వీరేశలింగం గారి కాలం నుండి ఆధునిక సాహిత్య యుగంగా పేర్కొనబడుతుంది అప్పటినుండి తెలుగులో అనేక సాహిత్య ఉద్యమాలు నూతనమైన భావవీచికలతో, వివిధమైన సాహిత్య ప్రక్రియలుగా ఆవిర్భవించాయి. సంఘుసంస్కరణవాద సాహిత్యం అని, అభ్యుదయ సాహిత్యం అని విప్లవవాద సాహిత్యాన్ని హేతువాద సాహిత్యం అని, స్త్రీవాద సాహిత్యం అని దళితవాద సాహిత్యాన్ని ఇలా అనేక అనేక శాఖలుగా ఏర్పడ్డాయి.

అందులో స్త్రీవాద సాహిత్యమనేది ముఖ్యంగా స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్రాల దృక్పథంతో, పురుషాధిపత్య భావజాలాన్ని నిరసిస్తూ ఆవిర్భవించగా మిగతా సాహిత్య శాఖల్లో కూడా స్త్రీల అభ్యుదయానికి సంబంధించిన కొన్ని అంశాలు ప్రస్తావించబడ్డాయి. మౌలికంగా స్త్రీవాద సాహిత్యంలోని దృక్పధానికి, ఇతర సాహిత్య శాఖలోని దృక్పధానికి చాలా తేడా ఉంది. ఇతర సాహిత్య శాఖల్లో పురుషాధిపత్య వ్యవస్థ పట్ల నిరసన, స్త్రీ స్వేచ్ఛ, స్వతంత్రాలను గూర్చిన ప్రస్తావన అనేది కనిపించదు. వీలైనంతవరకు వ్యవస్థకు లోబడి కొన్ని నూతన సంస్కరణలు వ్యక్తీకరించడం ద్వారా స్త్రీల జీవితంలో అభ్యుదయన్ని తీసుకురావచ్చు అనే అభిప్రాయం మాత్రమే ఆయా సాహిత్య శాఖల్లో కనిపిస్తుంది.

వాస్తవానికి ఆధునిక సాహిత్యాన్ని స్త్రీల చిత్రీకరణ విషయంలో మనం మూడు విధాలుగా గుర్తించవచ్చు ఒకటి సంస్కరణవాద సాహిత్యంలో స్త్రీ అని, రెండోది భావ కవిత్వంలో స్త్రీ అని, మూడోది స్త్రీవాద సాహిత్యంలోని స్త్రీ అనే ఈ మూడు అంశాలను క్లుప్తంగా విశ్లేషిస్తే ఆధునిక యుగం ప్రారంభమయ్యే నాటికి సమాజంలో పేరుకుపోయిన దురాచారాల్ని, మూఢనమ్మకాలను తొలగిస్తూ, స్త్రీల జీవితాలు వెలుగుల మయం కావడానికి సాహిత్యాన్ని ఒక బలమైన ఆయుధంగా చేపట్టిన యోగ్యుడిగా పురుషోర్ధ ప్రధాయిని, వివేకవర్ధిని, పత్రికల ద్వారా స్త్రీ విద్య వితంతు వివాహాలను సమర్థించిన సామాజిక వాదిగా మనకు వీరేశలింగం పంతులుగారు కనిపిస్తారు.

మహిళాభ్యుదయం దృష్టితో సంస్కరణ వాద కవిత్వంగా వెలుబడిన మరో గొప్ప సాహిత్య ప్రక్రియ గురజాడ వారి కన్యాశుల్కం. స్త్రీలు సామాజికంగా మానసికంగా పడుతున్న వేదనలకు పరిష్కార మార్గాన్ని చూపించారు. ఈ కోణంలోనే సాహిత్యంలో సంస్కరణ దిశగా వచ్చిన సాహిత్య మార్పు, భావ కవిత్వంలో స్త్రీ చిత్రణ అనేది, శృంగార రసాభివ్యక్తితో. నూతన ఒరవడిని సృష్టించి, స్త్రీ స్వరూప స్వభావాలను ఒకానొక ఉన్నత స్థితికి

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
**అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి**
**Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026**

చేర్చారు. ఇది అమలిన శృంగార సిద్ధాంతం. ఇక్కడ సంభోగ శృంగారం కంటే విప్రలంభ శృంగారమే మధురమనే భావనని ఈ భావ కవిత్వం చాటి చెప్పింది.

భావ కవిత్వంలో స్త్రీని, మాతృమూర్తిగా, ప్రకృతి కాంతగా, దేశమాతగా, ప్రేయసిగా, దేవతామూర్తిగా, ఆరాధించడం అనేటువంటిది మనకు కనిపిస్తుంది. ***"నీలోనే నీ కాంతి తనువు నా దేహము దరిసి/ అలుపుగొన్న నా స్వప్న జీవితావరణం మేలుకొలిపి/ నా హృదయోద్భవనంలో దీపం నిలిపితివే/ విలసిత లావణ్య శ్రీవై, స్త్రీవై, నీవై/ నీవెవరైనా, నీ పేరేమైనా గాని/ నవనిత్య యవ్వనానంద ప్రాణి"*** అంటూ ఊర్వశిలో కృష్ణశాస్త్రి గారు తన ఊహ ప్రేయసిని గురించి, ఆమెను విద్యున్నారిగా, జీవన దేవతగా, అభివర్ణించాడు. ఇందులో భావకవులు ముఖ్యంగా స్త్రీల హృదయానుభూతిని మాత్రమే ప్రధానంగా చిత్రించారు. అయితే ఇక్కడ ఆలోచించాల్సింది, మొదట సంస్కరణవాద సాహిత్యంలో స్త్రీలకు ఇచ్చిన స్థితియేనా ఈ స్త్రీలు కోరుకుంది. లేక భావకవులు, స్త్రీని దేవతామూర్తులు లాగా ఆకాశానికి ఎత్తే విధానాన్నా నేటి స్త్రీలు ఆశించింది, అంటే వారు ఈ రెండు వాదాలు కాదు అంటారు. సంఘసంస్కరణ సాహిత్యంలో స్త్రీ జీవిత చిత్రీకరణ విషయంలో, ఆనాటికే సంఘంలో ఆచారాలుగా కొనసాగింపబడుతున్న ఆచారాల్లో కొన్నిటిని సంస్కరించడానికి, వాటిలో మార్పు తేవటానికి ప్రయత్నించారే తప్ప, దాని మూలాల్లోకి వెళ్లి విచ్ఛేదనం చేసే దిశగా వారు అడుగులు వేయలేకపోయారు. అదే భావకవుల సాహిత్యంలోనైతే స్త్రీని ఏకంగా ఒక ఆరాధ్య దేవతగానో, మాతృమూర్తిగానో, లేక హృదయేశ్వరిగానో చిత్రించి, ఆ స్త్రీని అమాంతం ఆకాశానికి ఎత్తేశారు.

ఇక్కడ స్త్రీవాదులు కోరుకున్నది పురుషునితో పాటు స్త్రీలకు కూడా సమానమైన స్వేచ్ఛ, స్వతంత్రాలు ఉండాలని. ఆ స్వేచ్ఛా, స్వతంత్రాలనేవీ సామాజికంగా, రాజకీయంగా, కులమతపరంగా, ఆర్థికంగా, నైతిక, మానసికంగా, కుటుంబ పరంగా, ఇలా అన్ని దశల్లోనూ పురుషులతో పాటు సమాన స్థాయి కావాలని కోరుకున్నారే తప్ప, పురుషులకంటే కొంచెం తక్కువగా సంస్కరించబడిన భావాలతోనో, లేక వారి కంటే అధికంగా హెచ్చించబడిన స్థితిలోనో వుండాలని స్త్రీలు కోరుకోలేదు. ఈ విధంగా ఆలోచిస్తే కందుకూరి, గురజాడలు, స్త్రీల అభివృద్ధి విషయంలో వేసిన దారులు, ఆ తర్వాత తరం కవులు వాటిని తీర్చిదిద్ది ముందుకు తీసుకువెళ్లడానికి బదులు వేరే కొత్త బాటలు వేసేందుకు నాంది పలికారనే చెప్పాలి. మరి భావకవులు మానసిక వికాసానికి దోహదపడినా, సామాజిక దృష్టితో స్త్రీల వైపు నుండి పరిశీలించినప్పుడు స్త్రీకి సామాజిక కోణంలో అంత స్థానం ఇవ్వలేదనేది కనిపిస్తున్న వాస్తవం.

అలాంటి తరుణంలో స్త్రీ స్వేచ్ఛపై దృష్టిపెట్టి సామాజిక, ఆర్థిక, రాజకీయ, లైంగిక, మానసిక, కుటుంబ నేపథ్యాలను చట్రాలుగా తీసుకొని, స్త్రీలు పడుతున్న కష్టనష్టాలను గుర్తించి, సాహిత్యాన్ని సృష్టించిన వారిలో ఈ ఆధునిక యుగంలోనే ప్రత్యేకంగా పేర్కొనదగినవాడు గుడిపాటి వెంకటాచలం.

ఆనాటికి స్త్రీవాదమనే సైద్ధాంతికమైన ఉద్యమం లేకపోయినా, స్త్రీలను గురించి పట్టించుకున్న వాడు చలం. భారతదేశంలో అందునా ఆంధ్రదేశంలో ఈనాటి ఫెమినిస్ట్ సిద్ధాంతమనే ఉద్యమానికి ఒకవిధంగా

అంకురార్పణ చేసినవాడు గుడిపాటి వెంకటాచలం. చలం చెప్పిన మాటలు పురుషస్వామ్య సమాజానికి చెంపపెట్టు లాంటివి. **స్త్రీకి కూడా శరీరం ఉంది దానికి వ్యాయామం కావాలి. ఆమెకు మెదడు ఉంది దానికి జ్ఞానం ఇవ్వాలి. ఆమెకి హృదయం ఉంది దానికి అనుభవం కావాలి.** అంటూ పురుష సమాజం చేత స్త్రీ ఎంత నిర్లక్ష్యానికి గురవుతుందో ఈ మాటలు వింటే మనకి అర్థమవుతుంది. తన సాహిత్యానికి తన జీవితాన్నే ముడి పదార్థంగా చేసుకొని, కష్టాల కొలిమితో తనను తాను కాల్చుకుంటూ, అరుణగిరి శిఖరోన్నతి వరకూ పరిణమింప చేసుకుంటూ. జీవితాన్ని ఒక ఆనందశోధన శాలగా చేసుకున్నవాడు చలం.

1874 మే 18న మద్రాసులో బుద్ధుని జన్మదినమైన వైశాక పూర్ణిమనాడు జన్మించిన చలం 108 కథలు రాశాడు. అందులో అపోహలుగా ఉన్న కథలు 11, అనువాదాలు 8, ఇక మిగిలిన సొంత కథలు 89, ఇన్ని కథల్లోనూ చలం స్త్రీ కోణంలో తడవని అంశమే లేదు. చలం చేతినుండి జాలువారే కథన్నా, నవలన్నా, అది మానవ జీవితానికి సంబంధించినదే అయివుంటుంది. ఆ కథల్లో పాత్రలు సజీవ మూర్తులుగా ఉండాలి. అవి సామాజిక జీవితానికి అద్దం పట్టేవిగా ఉండాలి. ఈ విషయాన్నే కొడవటిగంటి కుటుంబరావు గారు. కథానికకు లేదా చిన్నకథకు ఉండాల్సిన నిర్దిష్టతను తెలుపుతూ ఇలా అంటారు, తాను(చలం) సృష్టించే సంఘటనల పైన, అందులోని పాత్రలు ధరించే వ్యక్తులపైన కథకుడికి పూర్తి అధికారం ఉండాలి, తన ఊహకు, అనుభవానికి మించిన పాత్రలను తీసుకోవటం, తెలియని పరిస్థితులు, జరిగే పరిస్థితులు, జరిగే సంఘటనలను, చిత్రించటం కథకుడు చేయరాని పని అని అంటారు. అలాంటి విశిష్టతను తన రచనల్లో నిక్షిప్తం చేసి, వ్యవహార జీవితాన్ని సాహిత్య జీవితాల్లోనికి మలిచి, స్త్రీల జీవితాల్లోని సామాజిక, లైంగిక, మానసిక, ఆర్థిక, కుటుంబ స్వేచ్ఛలకు బాటలు వేసిన వాడు చలం.

అలాంటి చలం కథల్లో 1924లో రచించబడిన ఒక అద్భుత సృష్టి ఈ '**సుశీల**' కథ. ఈ కథలో చలం స్త్రీలోని అంతర్గత కోణాలన్నిటినీ ప్రస్తావించాడు. రాజకీయ నేపథ్యం, మానసిక సంఘర్షణ, నైతిక విలువలకు కట్టుబడాలనే తపన, లైంగిక స్వేచ్ఛ, సామాజిక సేవాతత్పరత, కులమతాల గోడల్నికూల్చే ధైర్యం ఇలా అన్ని కోణాల్ని చలం తన రచనల్లో దర్శింపజేస్తాడు. చూసే నేత్రాన్నిబ ట్టే దృశ్యం అన్నట్టుగా, చలం రచనల్ని చాలామంది ఒక లైంగిక కోణంలోనే చూస్తారు. కానీ లోతైన అధ్యయనం ద్వారానే చలం లో ఉన్న సామాజిక తాత్వికుడిని దర్శించగలుగుతాం.ఈ సుశీల కథలో నారాయణప్ప సంపూర్ణ బ్రాహ్మణుడు అయినప్పటికీ ఆధునికుడు. ఆయనకు తగిన భార్య సుశీల ఆధునికరాలు. ఎంతో అన్యోన్య దాంపత్యం. ఏమాత్రం పొరపొచ్చాలు లేవు. వారి జీవితం ఎంత ఆహ్లాదకరంగా, ఆనందకరంగా ఉందంటే, ప్రశాంతంగా ఇంటి వాతావరణం ఉంటుంది. ఇల్లు గోడలకు ప్రకృతి రమణీయ దృశ్యాలతో కూడిన చిత్రపటాలు. తోటలో మొక్కలు, సోఫాసెట్లు, ఫేము కుర్చీలు, గాజు గిన్నెలో పుష్పాలు, వారి మనసుల్లాగానే ఎంతో అందంగా ఉంటాయి. నారాయణప్ప ఎంత నీటైనవాడో, సుశీల అంత నాజుకైంది. సుశీల ఏది చేసినా నారాయణప్పకు అందంగానే కనిపిస్తుంది. సుశీలకు నారాయణప్పకు ఒకరి మీద ఒకరికి వల్ల మాలిన ప్రేమ. ఒకరితో ఒకరు ఎన్నడూ పోట్లాడి ఎరుగరు, ఒకరు చెబితే అది రెండో వారు ఆజ్ఞగా నెరవేరుస్తారు. ఇందులో విశేషమేమిటంటే, నారాయణప్ప భార్య ఆత్మను చంపేసి తన

వశం చేసుకొని తన ఊహల్ని ఆమె తలలో పెట్టి మేమిద్దరం ఒకటైపోయాం అనే రకం కాదు. భార్యగా ఆమెను ఎంత ప్రేమిస్తాడో, ఆమె అభిప్రాయాన్ని అంతగా గౌరవిస్తాడు. అంతటి స్వేచ్ఛను ఆమెకిస్తాడు. నిజమైన భర్తకు నిర్వచనం అదికదా! సుశీల ఊహలకి పనులకి సంపూర్ణ స్వాతంత్రం వుంది. ఎప్పుడూ ఒకరి మీద ఒకరికి అనుమానం గాని, అసలు అనుమానం అనే తలపేవారికి సిగ్గనిపిస్తుంది. నిత్యం ఆ ఇంటికి ఎందరెందరో మగాళ్లు నారాయణప్పకోసం వచ్చి పోతుంటారు. అటువంటి సమయాల్లో కొన్నిసార్లు నారాయణప్ప ఇంట్లో కూడా ఉండడు. అయినా అనుమానం అన్న మాటేలేదు. నారాయణప్పకి ఆ ఊర్లో చాలా మంచి పేరు ఉంది. అందరూ ఆయన దగ్గరకు వచ్చి సత్యాగ్రహం, రౌలత్ చట్టం, సహాయ నిరాకరణ ఉద్యమాలు తదితరాలైన సమాచారాలు సమాలోచనలతో నిండి ఉంటుంది. సుశీల కూడా ఆ సమయంలో, ఆ చర్చల్లో ఉత్సాహంగా పాల్గొంటూ ఉంటుంది. వారు బ్రాహ్మణులైనప్పటికీ ఆ బ్రాహ్మణికం ఎక్కడుందో గుర్తుపట్టడం చాలా కష్టం. వాళ్ళ ఇంట్లో బ్రాహ్మణుల్ని ముస్లింలని క్రిస్టియన్లని ఒకే మోస్తారుగా చూస్తారు. కష్టం వచ్చిన వాళ్ళు రావడం మానేయవచ్చు అయినా ఆ దంపతులకు లక్ష్యం లేదు. ఆ ఊరిలో అన్ని తెగల వారు వీరుని గౌరవంగా చూస్తూ భోజనానికి పిలుస్తారు. నారాయణప్ప ఇంటికి భోజనానికి పిలిస్తే ఆ ఊర్లో గొప్పగా చెప్పుకుంటారు. ఆయనకు అంత పలుకుబడి ఉంది. పిల్లలు లేరు. ఉంటే వాళ్ళు ఆదర్శభావాలతోనే పెరిగేవారు. ఆ దంపతుల ప్రేమలో అంతరంగిక జీవితం చాలా తృప్తి పడుతుంది. సమాజ జీవితంలో తమ పాత్రలను ఎన్నుకోవడంలో వారి సామాజిక వ్యక్తిత్వం తృప్తి పడుతుందనేది అర్థమవుతుంది. ప్రతి వ్యక్తిలోనూ ఈ రెండు అంశాలు తృప్తి పడవలసిందే, అవి ఒకటి వ్యక్తిగతం, రెండు సామాజికం. ఇక్కడ నారాయణప్ప, సుశీలలో ఈ రెండు అంశాలు తృప్తిపడ్డాయి. అలాంటి వారి జీవితాల్లోకి ప్రవేశించింది మూడో పాత్ర సులేమాన్.

సులేమాన్ కొత్తగా ఆ ఊరు వచ్చిన తురక పోలీసు సూపర్నెంట్. చిన్నవాడు. అందమైన వాడు. దృఢమైన వాడు. పెళ్ళికాని వాడు ఈ సులేమాన్. అతన్ని చూస్తే కులమతాలు ఏమిటో గుర్తించడం కష్టం. కొత్తగా ఈ ఊరు రావటం వల్ల వచ్చిన రోజునే అతను నారాయణప్ప గారి ఇంటికి వచ్చాడు. నిత్యం ఏ పట్టింపులు లేక వచ్చి పోయే వారికి స్వాగతం, సమాధానం, ఎలా లభిస్తాయో సులేమాన్ కు అలాగే లభించాయి. ఆ ఇంట్లో కుక్కలు, భార్య పట్టింపులనేవేమీ లేకపోవడంతో సులేమాన్ కు ఆ సాయంత్రం టీ కబుర్లు అన్ని చాలా సంతోషాన్ని కలిగించాయి. ఆ వచ్చిన రోజు నుండి సులేమాన్ కు సుశీలకు చాలా స్నేహం అయింది. వారం రోజుల్లో మరీ ఎక్కువైంది. ఆ విషయాన్ని అక్కడున్న అందరూ గమనిస్తూనే ఉన్నారు. పదేళ్ల సంసార జీవితంలో నారాయణపుతో ఏ లోటు లేని ఆమెకి, ఇప్పుడు ఇంకో పురుషునిపై ప్రేమ పుట్టడం సిగ్గుగా భావించిన సుశీల, మొదటి ఆమెలోనే వున్న మరో సుశీలతో (ఆత్మసంఘర్షణ) వాదులాడింది. అది ప్రేమ కాదు స్నేహమని సమాధానం పరుచుకుంది. తర్వాత తర్వాత అది ప్రేమని గ్రహించి దూరంగా ఉంచటానికి ప్రయత్నించింది.

సులేమాన్ మనుషుల్ని పట్టుకోవడంలోనే కాదు, మనసుల్ని పట్టుకోవడంలోనూ నేర్పరే. అందుకే సుశీలలోని సుశీలను వెతికి బయటకు తీసుకొచ్చేవాడు. అతని ప్రేమను నిలుపుకోలేక ఆత్మ యుద్ధమే చేసింది. ఎందుకంటే నారాయణప్ప పై అంత ప్రేమ, గౌరవం. ఇక్కడ ఆ ప్రేమ ఆప్యాయతతో కూడిందే తప్ప బంధం వల్ల

బాధ్యత వల్లో సమాజం ఏర్పాటు చేసిన కట్టుబాటులో ఏర్పడిన భావం కాదు. అందుకే ఆ యుద్ధం. అయినా ఆమె సులేమాన్ బలమైన బాహువుల్లో నుండి శరీరాన్ని మనసుని తప్పించుకోలేకపోయింది. సుశీల తన భర్తకి ఇవ్వవలసిన ప్రేమ ఇతనికి ఇస్తున్నాననే చాలా మధుర పడింది. కానీ సులేమాన్ ప్రేమ చాలా మధురమైంది. సులేమాన్ కు లొంగిపోయానే అనే పాపభీతి ఒక పక్కన అయితే, ఇదంతా మూఢత్వమని మరోపక్క. భర్తకు జరిగిన విషయం చెప్పాలని ఒకపక్క, చెబితే ఆయన మనసు మనోవేదన గురవుతుందేమోనని ఆందోళన మరోపక్క. ఆ తర్వాత జరిగే పరిణామంతో భర్త సులేమాన్ స్నేహం మాన్పిస్తాడని ఊరుకుంది. అయినా తన ప్రేమ జయం పొందింది. అయినా భర్త మీద ప్రేమ వుంది. కానీ కొత్తగా వచ్చిన ప్రేమ ఆమెను పూర్తిగా స్వాధీనం చేసుకుంది. సహజంగా స్త్రీలలో ప్రేరణలు కలిగే సన్నివేశాలు వేరైనా, కథలు ఒకటే. ఇంకా వారికి ముందు వెనక లేవు, భర్తను మోసం చేస్తున్నానని ఆలోచన తట్టింది, అయినా దాన్ని పైకి రానివ్వలేదు. అనుకున్నది చేసే తీరాలి. ఇంకొకరు చూస్తారు, అవమానం చేస్తారు, అల్లరి అవుతాం, ఇలాంటి ఆలోచనలు ఏమీ లేవు. అలా కాలం గడుస్తుంది. కానీ సుశీలకు పాప భీతి ఎక్కువైంది. స్నేహితుడి వంటి భర్తకు ద్రోహం చేస్తున్నాను, ఈవిషయం భర్తకు చెప్పాలి, ఎలా? అని మదనపడుతూ సులేమాన్ వెళ్ళిన తర్వాత చెదిరిన జుట్టుతో మంచంపై విలపిస్తున్న సుశీలను రాత్రి ఒంటిగంటకు పడుకోవటానికి వచ్చిన నారాయణప్ప ఏమిటి అలా ఉన్నావు, అని తన కోటు తీస్తూ అడిగాడు. జవాబు లేదు, సుశీల మీదకు వంగి ప్రేమతో మొహం తనకేసి తిప్పుకున్నాడు. చంపలు నిండా కన్నీళ్లు ఉన్నాయి. ఎప్పుడూ లేనిది జుట్టు చిందర వందరగా చెదిరిపోయి, చెంపలకంటుకుని వున్నది. ఆయన చాలా ఆశ్చర్యపడ్డాడు. కారణం  అడిగాడు ఆమె చెప్పలేకపోయింది. భర్తగా తనలోపమా అని తరిచి తరిచి అడిగాడు, సుశీల ఏం లేదు ఏదో దిగులేసింది అంది. నారాయణప్పకు సూచాయగా విషయం అర్థమైంది. అయినా ఆమెపై ప్రేమతో చెప్పవు, నేను ఆలోచిస్తాను, తర్వాత ఏం చేయాలో అని అన్నాడు. వెంటనే భర్త అడిగిన తీరుకు అంతా చెప్పేసి, శాంతి పొందాలని ఎంతగానో అనిపించింది సుశీలకు, కానీ ఆమె పడే వేదనకు కారణం ఆయనకు చెప్పి అతనికి మనోవేద కలిగించడం ఇష్టం లేక మౌనంగా ఉంది. నారాయణప్పకు విషయం తెలిసిపోయింది. అయినా తనకెందుకు చెప్పదు అర్థం కాలేదు. నారాయణప్ప కి సులేమాన్ అంటే క్రమంగా అయిష్టం మొదలైంది. అతని రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నా, సులేమాన్ ఏది చెప్పినా అతను సహజంగానే కాదంటున్నాడు. అదిగాక సులేమాన్ ప్రభుత్వ పక్షం నారాయణప్ప ఉద్యమ పక్షం.

క్రమంగా నారాయణప్పకు సుశీలకు మధ్య విభేదాలు తలెత్తుతున్నాయి సుశీల సులేమాన్ ఉన్న పోలీస్ స్టేషన్కు వెళతానంది అతను వద్దులే నువ్వు వెళ్లకపోతే అతని డ్రిల్ ఆగదు కదా అంటాడు, అయినా వెళుతుంది. ఆయన అడ్డు చెప్పడు. అందంగా అలంకరించుకుని వెళ్ళిన సుశీల సులేమాన్ చూసి పులకించిపోయింది. సన్నగా ఉండే వాళ్లంటే ఇష్టం నా మెడలో హారంలాగుండాలి అంటూ నా దగ్గరికి శాశ్వతంగా వచ్చేయమంటాడు. తాత్కాలికంగా అతనికి తర్వాత శాశ్వతంగా వచ్చేస్తానని చెప్పి వెళ్ళిపోయింది.

ఒకే స్త్రీకి మొహం వల్ల ఏర్పడే అనురాగం, ఉన్నత గుణాలు వల్ల కలిగిన గౌరవం, ఈ రెండు వున్న వ్యక్తులైన నారాయణప్ప సులేమాన్ల పట్ల సుశీలకు ఆ భావం కలగటం వల్ల ఆమెలో అంత సంఘర్షణ ఎక్కువైంది.

రోజు సులేమాన్ దగ్గరకు వెళ్ళొస్తున్న సుశీలను శాశ్వతంగా వచ్చేయమని అడుగుతాడు. మూడు రోజుల్లో వచ్చేస్తానని చెప్పేసింది. ఇంతలో నారాయణప్ప ఖైదులో పడ్డాడు. అక్కడ జైల్లో భర్త ఆరోగ్యం క్షీణించిందని తెలిసిన సుశీలకు భర్తపై ఎనలేని గౌరవంతో కూడిన ఆరాధన భావంలోకి వెళ్తుంది. ఆయన నాకోసం, నా దేశ ప్రజల కోసం, జైలుకు వెళితే తాను ఇంట్లోంచి పారిపోవాలని చూస్తున్నాను కదూ! అని సిగ్గుతో కృంగి ఏడ్చింది. ఆయన నడిచిన పవిత్ర మార్గాన్ని తన మార్గంగా ఎంచుకోవాలనుకుంది. యంగ్ ఇండియా చదవటము తక్కిన వాళ్ళతో మాట్లాడి దేశ స్థితి ఉద్యమ అవసరము అర్థం గ్రహిస్తుంది. తనకున్న బట్టలన్నీ పట్టుచీరలతో సహా బయట తగలేసింది ఖద్దరు బట్టలుకొంది. ధరించింది. ఖద్దరు బట్టలు అమ్మేవాళ్లు లెక్చర్లు ఇచ్చే వాళ్ళు ఉన్నారని తెలిసి వారితో చేరి బట్టల అమ్మింది. సులేమాన్ దగ్గరకు వెళ్లి అతన్ని కొనమని అన్నీ కొనిపించింది. అలా మానసిక స్వేచ్ఛను సామాజిక స్వేచ్ఛను ఇచ్చిన భర్తకు ద్రోహం తలపెట్టేనే అనే పశ్చాత్తాపంతో భర్త సామాజిక ఉద్యమం వైపు అడుగులు వేసింది. ఇక్కడ రచయిత చలం స్వేచ్ఛ అవసరాన్ని కుటుంబ పరంగానే కాక దేశ విషయంగా రాజకీయాలలో కూడా గుర్తించి విస్తరించడం వల్ల వారి వ్యక్తిత్వం కూడా మరింత వికాసాన్ని పొందుతుంది. అటువంటి స్వేచ్ఛని చలం స్త్రీల జీవితంలో కోరిన నిజమైన మార్పు. ఈ మార్పు మూలాలను కదిలించే మూర్ఖమోహానికి, కర్తవ్యానికి మధ్య, నారాయణప్ప పట్ల కర్తవ్యం ఎందుకు ఉంది. ముగ్గురు మనుషుల మధ్య కథ నడిపిన చలం సుశీలలోని ప్రేమగుణాన్ని ఒరిపిడి పెట్టడానికి, ప్రేమతో కూడిన వున్నతిని స్వీకరించడానికి మిగతా రెండు పాత్రలైన భర్త నారాయణప్ప, పోలీస్ అధికారి సులేమాన్లు, సుశీలకు ఇరుపక్కల వున్నారు. ఇద్దరు ప్రేమలో విజయం మాత్రం స్వేచ్ఛ స్వచ్ఛతతో కూడిన ప్రేమదే. అది నారాయణప్పలో వుంది. అది దేశ స్వేచ్ఛ కోసం జరిపే పోరాటంలో త్యాగం వరకు పరిణమిస్తుంది. ఆ ప్రేమతో పాటు అతని వున్నత గుణాలు సుశీలను బలంగా నారాయణప్ప వైపు లాక్కుంటాయి. అందుకే క్రమక్రమంగా సులేమాన్ ఇంటికి వెళ్ళటం మానేసింది. అతనే వచ్చినా, నేను అలసిపోయాను సులేమాన్, ఉదయాన్నే ఉద్యమానికి వెళ్లాలి నువ్వు వెళ్ళు అని అతన్ని పంపించేస్తుంది.

ఇక్కడ సుశీల పాత్ర ద్వారా చలం స్త్రీలోని మోహంకంటే గుణాధిక్యతకు ఎక్కువ విలువను మరోసారి నైతిక పరంగా రుజువు చేశాడు. దూరమవుతున్న సుశీల మీద సులేమాన్ కు రోజు రోజుకు ప్రేమ అధికమవుతుంది. సుశీలకు దేశసేవ ఎక్కువైన కొద్దీ, ఆటంకాలు ఎక్కువైన కొద్దీ కలుసుకోవాలని కోరిక వున్నా వీలుకాలేదు అందుకే సులేమాన్ సుశీల దగ్గరకు వచ్చి స్వరాజ్యం పని మానేయ్, ఈ ప్రచారం, ఈ ముతక బట్టలు ఎందుకు అన్నాడు, అందుకు సుశీల దృఢంగా భారత ఆదర్శాన్ని అందిపుచ్చుకున్న సుశీలతో రచయిత చలం ఇలా చెప్పిస్తాడు సులేమాన్ దేశ ఉద్యమం పోతే పోవచ్చు, కానీ నా హృదయంలో నుంచి పోదు. నీతితో నా ఊహలు, నా బ్రతుకు, నా వాంఛలు, అన్ని మారిపోయాయి. ఇదివరకటి మనిషిని కాదు. ఇదివరకులా నీ హోదా, నీ ఉద్యోగం చూస్తే నాకేమీ గౌరవం లేదు. దేశమంతా ఈ విధంగా గోల గోలగా ఉంటే అందరూ త్యాగం చేస్తుంటే. అనేకమంది అన్నం లేక అల్లాడుతుంటే, అనేక మంది స్త్రీల భర్తలు జైల్లోకి వెళుతుంటే, నేను వచ్చి నీతో సౌఖ్యం అనుభవించనా,అలా వచ్చినా నీతో నాకేమీ మనస్థిమితం ఉంటుంది. నన్ను ప్రేమిస్తున్నానంటావా అదే నిజమైతే ఆ ప్రేమ నన్ను అర్థం చేసుకుని, నాకు శక్తినివ్వాలి, లేకపోతే అది వృధానే. నారాయణప్ప గారు

జైలుకెళ్లిన మొదలు నేను ఈ విధంగా నీతో సంతోషంగా ఉన్న ప్రతి నిమిషం నాకే సిగ్గేస్తుంది సులేమాన్.అంటూ ఆ సమయానికి అతన్ని దుఃరం వుంచేందుకు, నిన్ను బ్రతిమిలాడుకుంటా నారాయణప్ప గారు వచ్చేవరకు నన్ను ముట్టుకోవద్దు ఆయన రాగానే చెప్పి నీ దగ్గరకు అసలు ఎప్పటికీ వచ్చేస్తాను, సరేనా అంటుంది ఇక చేసేదేమీ లేక సులేమాన్ అదేదో కథలో రాజకన్య వ్రతం అనే వంక పెట్టి పోలిశెట్టిని దూరంగా వుంచినట్లు, ఇక చేసేదేమీలేక వెళ్లిపోయాడు.

నారాయణప్ప జైలు నుంచి విడుదలై వచ్చాడు, డాక్టరు ఇతనికి క్షయరోగమని, ఈ రోగం నయం కాదని మదనపల్లిలో ఉంచితే రోగి సచ్చిపోడు కానీ బ్రతికినన్నాళ్లు మంచం మీద నుండి లేవడని చెప్పారు. సుశీల బాగా ఆలోచించి మూడు రోజులకు చీకటి పట్టి తర్వాత సులేమాన్ బంగ్లా గదికి వెళ్లి గుమ్మం దగ్గర నిల్చుంది టేబుల్ మీద కూర్చున్న సులేమాన్ చెంగున లేచి పరిగెత్తుకుంటూ వెళ్లి సుశీల వచ్చావా అని కౌగిలించుకోబోవుగా నన్ను ముట్టుకోకుండా దూరంగా కూర్చుంటాను అంటేనే లోపలికి వస్తానని చెప్పి లోపలికి వచ్చి కూర్చుంది. సులేమాన్ కు చెప్పలేక వణుకుతున్న కంఠంతో సులేమాన్ నేనిక ఇక్కడకు రాను నీకు తెలుసు కదా ఆయన ఆరోగ్య స్థితి ఆయనెవరు చూస్తారు నేను కాక దిక్కెవరు అన్నది సులేమాన్ ఆలోచించాడు. రకరకాల ఆలోచనలతో అతన్ని అతని తమ్ముళ్ల దగ్గరకు పంపొచ్చు కదా అన్నాడు వాళ్లు నేను చూసినట్లు చూస్తారా ఇన్నాళ్లు వాళ్లు సంబంధం లేకుండా అవసరం వచ్చేసరికి వాళ్ళపై వదిలేస్తే ఎలా ఉంటుంది. ఆయనను వేరొకరికి వదిలేసి నేను సంతోషంగా ఉండలేను. అదే జబ్బు నాకు వస్తే ఆయన నన్ను వదలరు. నీకే ఇలా జబ్బు చేస్తే నిన్ను వదిలేస్తే నీకు నాపై అభిమానం ఎలా ఉంటుంది. ఆయన్నినేను స్వచ్ఛంగా నిజాయితీగా ప్రేమిస్తున్నాను అని అక్కడినుండి వెళ్ళిపోతుంది. మళ్లీ సుశీల సులేమాన్ కనిపించలేదు. మన స్త్రీలు తమ స్థానం నుండి కదిలారంటే నరకానికన్నా వెళ్తారు లేదా స్వర్గానికన్నా వెళ్తారు. సుశీల మొదట కదిలి లైంగిక స్వేచ్ఛ వైపు వెళ్ళినా, తన తప్పుకు లోలోన కరిగి కన్నీరు అవుతూ దహించి వేయబడుతూ చివరకు భర్త వైపు పవిత్రమైన అడుగులు వేసింది. వారం రోజుల్లో నారాయణప్ప గారిని తీసుకొని మదనపల్లి వెళ్ళిపోయింది.

సులేమాన్ రెండు నెలలు చూశాడు, వెతికాడు, ఆచూకీ కోసం ఆరా తీశాడు, మదనపల్లి బయలుదేరాడు. ఉదయం తొమ్మిదింటికి వాళ్లున్న వార్డు దగ్గరికి వెళ్ళాడు. నారాయణప్ప చెట్టు కింద మంచం పై నిద్రపోతున్నాడు. పక్కన గుడ్డ కుర్చీలో సుశీల చదువుకుంటూ కూర్చుంది. సుశీలను చూసిన సులేమాన్ కళ్ళవెంట నీళ్లు వచ్చాయి. అతన్ని చూసిన సుశీల అక్కడి నుండి పక్కకు తీసుకువెళ్లింది. ఆయనకు రాత్రంతా నిద్ర లేదు అందుకే ఇలా దూరంగా, ఎందుకు చెప్పకుండా వచ్చావు, నిన్ను చూస్తే నా మనోబలమంతా మాయమవుతుంది, అది నేను భరించలేను అంటుంది. ఇక్కడ కవి రెండు విరుద్ధ భావాలు మధ్య బలమైన సంఘర్షణను చూపిస్తున్నాడు. ఇక్కడ సుశీల చేత పలికించిన మాటలు భారతీయ స్త్రీ సంస్కృతికే నిదర్శనాలు ఆణిముత్యాలు. నామీద ప్రేమలేదా అన్న సులేమాన్ మాటలకు ప్రతిగా సుశీల చాలా ఉంది, కానీ ఆయన మీద అపరిమితమైన ప్రేమ వచ్చింది. ఏదో జాలి కాదు, నిజంగా ప్రేమ. అలా చూస్తావే ఆశ్చర్యంగా ఉందా, ఆ బొమికల

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

కుప్ప మీద ప్రేమ ఏంటి అనిపిస్తుందా నీకు, అవును అది నీ మీద ఉన్న ప్రేమ రకం కాదు, ఆ పాదాల దుమ్ము నెత్తిన వేసుకోవటానికి కూడా తగననే భక్తితో కూడిన ప్రేమ. నా దేశం కోసం, నా ప్రజల కోసం అలా అయిపోయారు ఆయన. తన ఆరోగ్యాన్ని అర్పించారు. ఆశ లేని దానికోసం అంత త్యాగం చేశారు. ఆ మహా గౌరవంతోనే నా ఆత్మ ఆయనదయింది. అందుకే ఈ శరీరం మనసు శక్తి అన్ని ఆయనవే. వాటిలో వేరొకరి భాగం ఇవ్వడానికి వీల్లేదు, చివరకు నీకు కూడా. క్షమించు, మనమిద్దరం కూడా ఆ కాళ్ళను తలపై ఆనించుకోవటానికి కూడా పనికిరాము. అని భర్త పై పొంగు కొచ్చిన అమితమైన అనురాగాన్ని కన్నీటి పర్యంతమవుతూ సులేమాన్ ముందు కుమ్మరించింది. సులేమాన్ నా బాధ నీకు అర్థం కాదు ఆయన సేవకు ఈ రెండు చేతులు నిర్మలంగా ఉంచుకోకపోతేనే అని నాకు ఎంత బాధగా ఉందో ఏం చెప్పను అంటుంది. ఇక నువ్వు ఇక్కడికి రాకు, ఉత్తరాలు రాసి ఏం ప్రయోజనం లేదు, వెళ్ళు అంది. నీకు నమస్కారం చేస్తా. నా నిశ్చయాన్ని చెడగొట్టకు వెళ్ళు అంటుంది. ఆ మాటకు సులేమాన్ ఎక్కడో చివరి మిగిలిన ఆశతో అడుగుతాడు, అతను చనిపోతే అప్పుడు వస్తావా అని, ఆ మాటతో సుశీల సులేమాన్ తో, ఆ మాట అనకు అది నేను తలవను కూడా తలవను, నాకు చాలా కష్టంగా ఉంటుంది. ఆయనే లేకపోతే నేనుంటానా అంటుంది. ఇక్కడ చలం స్త్రీని ఇంద్రియ అనుభవం నుండి అతీంద్రియానుభావంలోనికి పయనింపజేసిన ఒక చైతన్య పదంలోకి నడిపిస్తాడు.

కొండదిగి వెళుతున్న సులేమాన్ ని చూసి మౌనంగా ఏడుస్తున్న సుశీల భుజంపై చేయి వేసి సుశీల ఎట్లా ఉంటావు, వెళ్ళు నీకు ఆనందం అక్కర్లేదూ అంటాడు నారాయణప్ప. ఒక పురుషునిలో అలౌకిక మూర్తిని దర్శింప చేయగలిగిన స్వేచ్ఛ చలానిది. అదంతా అయిపోయిన కథండీ. నేను జరిగిపోయిన తప్పు గురించి ఏడ్చాను, అంతేగానీ నాకేమీ దిగుల్లేదు, నేనే పవిత్రురాలినై, మీ సేవ చేయడానికి తగినట్లుగా వుంటే ఎంతో బాగుండేదనేదే తప్ప, ఇంకేమీ బాధ లేదన్న సుశీలతో నారాయణప్ప నిజంగానా సుశీలా అంటూ ఆమెపై అనంత ప్రేమను కుమ్మరించాడు. చలం ఎంత వాస్తవ వాదో అంత కాల్పనిక భావకుడు. చలం దృష్టిలో స్త్రీ పురుష సంబంధాలు లైంగిక దృక్పథం చుట్టూ తిరిగినా అక్కడనే ఆగకుండా, పురుషుడు తన స్వీయ పరిపూర్ణత్వాన్ని, స్త్రీ తన పరిపూర్ణత్వాన్ని దర్శించే ప్రస్థానం వైపు సాగిపోనిస్తాడు. ఆ లక్షణం ఈ కథలో నిరూపితం. చలం దృష్టిలో స్త్రీ పురుష సంబంధాలు కేవలం లైంగిక స్వేచ్ఛ దగ్గరే ఆగిపోకూడదు అనేటువంటి ఒక బలమైన భావనని చూపిస్తాడు.

ఈ వ్యాసం మొదట్లో స్త్రీల చిత్రీకరణ విషయంలో నేటి వరకూ వున్న స్త్రీ స్థానాన్ని సంస్కరణవాద సాహిత్యం దృష్టిలో స్త్రీ అని, భావ కవిత్వం దృష్టిలో స్త్రీ అని చూశాం, కానీ ఆ భావనలకంటే భిన్నమైన, చైతన్య ధోరణిని స్త్రీవాద సాహిత్యంలో గమనిస్తాం. ఈ విధంగా స్త్రీ పక్షంగా, సామాజిక కోణంలో స్త్రీ చైతన్య భావజాలపు బాటలు ముందుగా తన సాహిత్యం ద్వారా వేసినవాడు చలం. నేటి స్త్రీ వాదం రాజకీయ, ఆర్థిక, సామాజిక, లైంగిక, మానసిక, భౌతిక, తాత్విక, సాంస్కృతిక, కుటుంబ నేపధ్యాలనే వేటిపై దృష్టిపెట్టి, యే స్వేచ్ఛనైతే కాంక్షిస్తున్నారో, ఆ స్వేచ్ఛాకాంక్ష నేపథ్యాలనే చట్రాలుగా తీసుకొని, స్త్రీలు పడుతున్న మానసిక సంఘర్షణలను ముందుగానే గుర్తించి, సాహిత్యాన్ని సృష్టించి, పాఠకుల నీతిపరిధిని దాటి, హృదయాలను అర్థం చేసుకునే

పరిణితి ఏదైతే వుందో, ఆ పరిణితి గమ్యం వైపుకు గమననిగమనంగా నేటి స్త్రీ సాగిపోయేందుకు దారుల్ని వేశాడు చలం.

ఈ సమాజంలో చాలామంది పురుషులు స్త్రీ మనస్సును తమపై నిలుపుకునేందుకు ఉన్నతులవుతారు. అదే మరికొందరు ఆ స్త్రీ ప్రేరణ వల్లనే ఉన్నతులవుతారు. అంటే ఇంద్రియ అనుభవం నుండి అతీంద్రియ అనుభవం కోసం చేసే అన్వేషణమే ఒక బలమైన చైతన్యం. ఆ చైతన్యమే మనిషిలోని ఇచ్ఛాశక్తి. ఆ ఇచ్ఛాశక్తియే అమృత స్రవంతిలా ఊటలు ఉరేట్లుగా మలచబడుతుంది. అలా మలచటమే చలం యొక్క సాహిత్య దృక్పథం.

ఆధార గ్రంథాలు:

1) చలం గారి కథానికా సాహిత్యము అనుశీలనము - వావిలాల సుబ్బారావు
2) తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి 2005 (స్త్రీ వాద కవిత్వోద్యమం - ఆచార్య సి. మృణాళిని)
3) చలం - సుశీల (కథానిక)

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## డాక్టర్. బోయి భీమన్న "పాలేరు నాటకం" - సామాజిక చైతన్యం

**శ్రీమతి. ప్రఖ్యా నాగరేఖ,**
లెక్చరర్,తెలుగు విభాగం,
కాకరపర్తి భావనారాయణ కళాశాల (స్వయంప్రతిపత్తి) విజయవాడ.

**కవి పరిచయం:**

బోయి భీమన్న (1911-2005) ఒక గొప్ప తెలుగు కవి, రచయిత, సామాజిక సంస్కర్త, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, దళిత ఉద్యమకారుడు, ఆధునిక తెలుగు సాహిత్యంలో పీడిత ప్రజల అభ్యుదయం కోసం అక్షరాలలో పోరాడిన మహానుభావుడు.1911 సెప్టెంబర్ 19న తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురులో పుల్లయ్య, నాగమ్మ దంపతులకు పేద దళిత కుటుంబంలో జన్మించి, తన రచనల ద్వారా అంటరానితనం,పేదరికం,సామాజిక అసమానతలపై పోరాడారు,

'గుడిసెలుకాలిపోతున్నాయ్','పాలేరు'వంటి రచనలతోప్రజలను చైతన్య పరిచారు. పేదరికం, అంటరానితనం, సామాజిక అన్యాయాలపై నిరంతరం పోరాడి, అణగారిన వర్గాల (పాలేర్లు, రైతు కూలీలు) విముక్తి కోసం కృషి చేశారు.పద్యం, గద్యం, గేయం, నాటకం, నాటిక, వచన కవిత వంటి అనేక ప్రక్రియలలో 70కి పైగా రచనలు చేశారు.'గుడిసెలు కాలిపోతున్నాయ్' (కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందింది), 'పాలేరు', 'ధర్మం కోసం పోరాటం అద్భుతమైన రచనలు చేశారు.కళాప్రపూర్ణ, పద్మభూషణ్ (2001) వంటి పురస్కారాలు అందుకున్నారు.మానవతావాద దృక్పథంతో రచనలు చేసి, శాస్త్రీయ దృక్పథంతో ప్రజలను చైతన్యవంతులుగా చేయాలని భావించారు.

**నాటక ప్రాశస్త్యం:** 'నాటకం' అనేది ఒక శ్రవణ సహిత దృశ్యరూపకం. జానపద కళలు విలసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం.ఇది సంభాషణలు, సంఘటనలు, పాటలు, నృత్యాలు, వేషధారణ, రంగస్థల అమరిక వంటి అంశాలతో కూడి ఉంటుంది.చరిత్ర్భారతదేశంలో నాటకానికి పురాతన మూలాలు ఉన్నాయి (నాట్యశాస్త్రం వంటివి), మధ్యయుగంలో యక్షగానం, తోలుబొమ్మలాట వంటి రూపాలుగా పరిణామం చెందింది. 18వ శతాబ్దం నుండి షేక్స్పియర్ ప్రభావంతో ఆధునిక నాటక రచన మొదలైంది. ప్రాచీన సంస్కృతంలో భాసుడు, కాళిదాసు వంటి వారు, తెలుగులో ఆధునిక నాటక రచయితలు ఆకెళ్ళ సత్యనారాయణమూర్తి,బోయి భీమన్న వంటివారు ఉన్నారు.తెలుగు నాటక రంగం 19వ శతాబ్దం నుండి బహుముఖంగా వికసించింది, నాటికలు,ఏకాంకికలు వంటి రూపాలు వచ్చాయి.వినోదంతో పాటు, సామాజిక సమస్యలను

చర్చించడానికి, నైతిక విలువలను పెంపొందించడానికి కూడా నాటకాలు ఉపయోగపడతాయి. ప్రస్తుతం బోయ భీమన్న గారు రచించిన పాలేరు నాటకం గురించి ఈ సంపాదకులు ఇలా వివరించారు.

**పాత్రలు**:

వెంకన్న (కథానాయకుడు)
వనబాల (కథానాయకి)
ఉపకారి (స్కూల్ మాస్టారు)
రామం (వెంకన్న మిత్రుడు)
సుందరం (వనబాల సోదరుడు)
కుబేర్‌రావు (ప్రతి నాయకుడు)
"పాలేరు" అనేది డాక్టర్ బోయి భీమన్న రచించిన ఒక ప్రసిద్ధ తెలుగు సాంఘిక నాటకం. 1938లో వచ్చిన ఈ నాటకం యొక్క విశ్లేషణ, ప్రధానంగా అంటరానితనం, కుల వివక్ష, సామాజిక అసమానతలు, మరియు దళిత సాధికారత అనే ఇతివృత్తాల చుట్టూ తిరుగుతుంది.

**ముఖ్యాంశాలు**:

- నాటకంలో వెంకన్న, వనబాలల ప్రేమకథ చోటు చేసుకుంది.
- వెంకన్న ఒక పాలేరు కులానికి చెందినవాడు, వనబాల ఒక అగ్రకులానికి చెందినది.
- వారి ప్రేమకు అగ్రకులస్తుల నుండి వ్యతిరేకం ఎదురవుతుంది.
- నాటకం కులాంతర వివాహాలను ప్రోత్సహిస్తుంది.

**కథాంశం**: వెంకన్న ఒక పాలేరు కులానికి చెందిన యువకుడు. అతను వనబాల అనే అగ్రకులానికి చెందిన యువతిని ప్రేమిస్తాడు. వనబాల కూడా వెంకన్నను ప్రేమిస్తుంది.అయితే, వారి ప్రేమకు అగ్రకులస్తుల నుండి వ్యతిరేకం ఎదురవుతుంది. వనబాల తండ్రి కుభేరయ్య, అగ్రకులస్తుడు, అతను వెంకన్నను చంపడానికి ప్రయత్నిస్తాడు. వెంకన్న, వనబాలలు కలిసి, కుల వ్యవస్థను ఎదుర్కొంటారు. చివరకు, వారు వివాహం చేసుకుంటారు.నాటకం కులాంతర వివాహం, సామాజిక న్యాయం, మరియు ప్రేమ విజయాన్ని చూపిస్తుంది.

**ప్రధాన ఇతివృత్తం:**సమాజంలో కులం వల్ల గౌరవం పొందుతున్న కుటుంబం నుండి వచ్చిన వనబాల, కులం వల్ల సమాజంలో అవమానాలకు గురౌతున్న వెంకన్న పరస్పరం ప్రేమించుకుంటారు. పాలేరుగా

పనిచేయాల్సిన వాడు, అగ్రకులంగా గౌరవ మర్యాదల్ని పొందుతున్న అమ్మాయిని పెండ్లి చేసుకోవాలంటే, ఎన్ని బాధలకు గురికావాల్సివస్తుందో, అన్నింటినీ అగ్రకుల, భూస్వామి కుబేరయ్య వల్ల పాలేరు వెంకన్న ఎదుర్కొంటాడు.

చివరికి ''ఉపకారి'' మాస్టారు సహాయంతో చదువుకుని వెంకటేశ్వరరావుగా గౌరవం పొంది, డిప్యూటీ కలెక్టరుగా ఉన్నతోద్యోగం సాధిస్తాడు. ఉద్యోగిగా తన గ్రామానికే వచ్చి, భూస్వాముల దురాగతాలను చట్టబద్ధంగా అడ్డుకుంటాడు. అస్పృశ్యతను పాటించే వాళ్ళనీ, ప్రోత్సాహించేవాళ్ళనీ నిరోధిస్తాడు. ప్రజాస్వామ్యబద్ధంగా దళితులు తమ హక్కుల్ని సాధించుకోవాలనే అంబేద్కర్ ఆశయాన్ని రచయిత ఈ నాటకం ద్వారా ప్రేరేపించారు.సమాజంలోని వాళ్ళంతా చెడ్డవాళ్ళే కాదనీ, మంచివాళ్ళూ ఉంటారనేది భీమన్న సాహిత్యంలో కనిపించే ఒక విశిష్ట గుణం. ఈ పాలేరు నాటకంలో వనబాల కూడా అగ్రవర్ణానికి చెందిన కుంటుంబం నుండే వచ్చినా, సంకుచిత మూర్ఖ కులతత్వవాదులు లేని వాళ్ళూ ఉంటారనే మరో పార్శ్వాన్ని కూడా చూపారు. వెంకన్న తండ్రి పుల్లయ్య తన తండ్రి బాటలోనే తానూ పయనించి, తన కొడుకునీ పాలేరుతనానికి పంపుతాడు. అలాంటి సేవ చేయడానికే తాము జన్మించామనే భ్రమను కల్పించి, కొన్ని తరాలుగా కర్మ సిద్ధాంతం పేరుతో దళితుల్ని అగ్రవర్ణ భూస్వాములు వంచించిన తీరుతెన్నుల్ని ఈ నాటకం ద్వారా వివరించారు."

**పాత్రల విశ్లేషణ**: సమాజంలో కులం ఆధారంగా జరిగే అవమానాలను, వివక్షను ఈ నాటకం ప్రధానంగా విమర్శిస్తుంది. అగ్రవర్ణ భూస్వాముల ఆధిపత్యం కింద దళితులు అనుభవించే కష్టాలను, వారి బానిసత్వాన్ని కళ్ళకు కట్టినట్లు చూపుతుంది.

**వెంకన్న** (పాలేరు): నాటకానికి కేంద్ర బిందువు. కులం వల్ల అవమానాలకు గురైనప్పటికీ, చదువుతో తన జీవితాన్ని మార్చుకుంటాడు.

**వనబాల**: అగ్రవర్ణ కుటుంబానికి చెందిన అమ్మాయి. వెంకన్నను ప్రేమించి, సంకుచిత కులతత్వవాదులు అందరూ చెడ్డవారు కారని, మంచివారూ ఉంటారని నిరూపిస్తుంది.

కుబేరయ్య (భూస్వామి): అగ్రకుల ఆధిపత్యాన్ని ప్రదర్శించే ప్రతినాయక పాత్ర. ఇతని దురాగతాలను వెంకన్న ఎదుర్కొంటాడు.

**మాస్టారు**: 'ఉపకారి' పాత్ర. వెంకన్న చదువుకోవడానికి సహాయం చేసి, అతని ఎదుగుదలకు మార్గదర్శకుడవుతాడు.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)

అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి

Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

**కవి మనోగతం:** బోయి భీమన్న ఈ నాటకం ద్వారా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకున్నారు.దళితులు తమ హక్కులను ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా సాధించుకోవాలని,అస్పృశ్యతను పాటించేవారిని చట్టం ద్వారా నిరోధించాలని సందేశాన్నిచ్చారు.విద్య యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పాలేరుగా పనిచేయాల్సిన వెంకన్న, చదువుకుని డిప్యూటీ కలెక్టరుగా తన సొంత గ్రామానికే తిరిగి వచ్చి, భూస్వాముల అన్యాయాలను అడ్డుకోవడం ద్వారా 'విద్యే నిజమైన ఆయుధం' అని చాటిచెప్పారు.

**సామాజిక చైతన్యం:** కర్మ సిద్ధాంతం పేరుతో అగ్రవర్ణాలు దళితులను తరతరాలుగా వంచించిన తీరును వివరిస్తూ, ఆ భ్రమలను వీడి, ఆత్మగౌరవంతో జీవించాలని నాటకం ముగుస్తుంది. ఈ నాటకం బోయి భీమన్న సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉంది, ఇది సామాజిక చైతన్యాన్ని కలిగించే దిశగా చేసిన గొప్ప ప్రయత్నం. ప్రస్తుత పరిస్థితులలో చట్టాల భయంతో, సమాజంలో వచ్చిన చైతన్యంతో అంటరానితనం, అసమానత చాలావరకు నిర్మూలింపబడినప్పటికీ, ఇంకా నేటి సమాజంలో ధనిక పేద అనే భేదభావం సమాజంలో సమతా భావానికి తూట్లు పొడుస్తున్నది. ఈ పరిస్థితులు మారాలంటే అందరికీ సమానమైన అవకాశాలు కల్పించాలి.

**ముగింపు:** మన జాతిపిత మహాత్మగాంధీ గారు చెప్పినట్లుగా "ప్రతి ఇల్లు విద్యాగంధంతో గుబాళించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది" అన్న సూక్తితో విద్యలోనే సమాజంలో అసమానతలు రూపుమాపుతాయనేది అక్షర సత్యం. ఇటువంటి నాటకాల ద్వారా ప్రజలలో గొప్ప చైతన్యాన్ని కలిగింపజేసి సమాజాభివృద్ధికి దోహదపడతాయి. అంతేకాక ఇటువంటి నాటకాలను ప్రత్యక్షంగా తిలకించడం చేత ప్రేక్షకులు రసానుభూతికి లోనవుతారు. తద్వారా అలౌకికమైన ఆనందాన్ని పొందగలుగుతారు.నేటి కాలంలో ఉన్న అనేక సమాజ రుగ్మతలను, మూఢనమ్మకాలను ఇటువంటి నాటక రచన ద్వారా రూపుమాపవచ్చు. అసమానతలకు తావు లేని సమసమాజాన్ని స్థాపించడంలో నాటకం నేటికీ ఒక విశిష్టమైన స్థానాన్ని అలంకరించింది.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## నల్లద్రాక్ష పందిరి - దళిత చైతన్యం

**డా. నెల్లూరు విజయకుమార్**
ఎం.ఏ. ఎం.ఫిల్. పిహెచ్.డి.,సెల్. నెం.: 6303569929
ఈమెయిల్: vijayakumartelugu6@gmail.com

**వ్యాస సంగ్రహం:**

డా. ఎండ్లూరి సుధాకర్ గారు రచించిన 'నల్లద్రాక్ష పందిరి' ఒక ప్రతీకాత్మక వచన కావ్యం. ఇది దళిత చైతన్యానికి నిలువెత్తు నిదర్శనం. ఇది ఆత్మకథనాత్మక కావ్యం. అమెరికా తెలుగు సంఘం (ATA) వారి ఆహ్వానం మేరకు అంతర్జాతీయ వేదిక మీద తన 'నల్లద్రాక్ష పందిరి' పుస్తకాన్ని ఆవిష్కరించారు డా. ఎండ్లూరి సుధాకర్ గారు. ఇందులో పలు విలక్షణమైన కవితలున్నాయి. కులము, మతము, అస్పృశ్యత, పేదరికము, కుటుంబ సంబంధాలు, విద్యావ్యవస్థ, రాజకీయవ్యవస్థ మొదలగు విధాలైన సామాజిక చైతన్యాన్ని రచయిత ఇందులో ప్రస్తావించారు. ప్రస్తుత వ్యాసంలో ఎండ్లూరి వారు 'నల్లద్రాక్ష పందిరి' కావ్యంలో వ్యక్తపరిచిన దళిత చైతన్యాన్ని పరిశీలించడం జరుగుతుంది. ఆత్మకథ, కొత్తకల, నల్లతల్లి, నిమ్నలిపి వంటి కవితలు ఎండ్లూరి గారు నల్లద్రాక్ష పందిరిలో చూపిన దళిత చైతన్యానికి నిలువెత్తు నిదర్శనాలు. తరతరాలుగా దళితులను అంటరానివారుగా సమాజం ఎంత చిన్న చూపు చూసిందో కవి తన కవితల్లో విషాదస్వరంతో ఆలపించారు. ప్రతి అక్షరం కవి ఆవేదన వ్యక్తపరుస్తుంది. కవి గుండెల్లోని ఆవేదన ఉప్పొంగి అక్షరమై పాఠకుల కళ్ళల్లో ఆవిష్కృతమౌతుంది.

1959 వ సంవత్సరంలో ఎండ్లూరి దేవయ్య, శాంతాబాయి దంపతులకు ఎండ్లూరి సుధాకర్ గారు జన్మించారు. వీధిబడి నుండి విశ్వవిద్యాలయ ఆచార్య స్థాయి వరకు ఎదిగారు. తన చిన్న నాటి అనుభవాలను, చదువుకున్న రోజుల్లోని ఆకాంక్షలను, ఆచార్యుడయ్యాక అనుదినం పొందిన ఆవేదనను నల్లద్రాక్ష పందిరి కవితాసంపుటిలోని ప్రతి కవితలోనూ వ్యక్తపరిచారు. "నానృషికృతే కావ్యం" ఋషికాని వాడు కవికాలేడని అర్థం. ఎండ్లూరి సుధాకర్ గారు అటువంటి కవితా తపస్సు చేశారు. తన జాతిని ఉద్ధరించడానికి కవితా వినీలాకాశంలో అయిదవ సూర్యుడిగా ప్రకాశించాడు. ఆయన రాసిన ప్రతి కవితలో దళితుల ఆత్మగౌరవం, దళిత సామాజిక చైతన్యం, అభివృద్ధి, ఆకాంక్షలు వ్యక్తమౌతున్నాయి.

**ఉపోద్ఘాతం:**

ఆధునిక దళిత కవుల్లో ఆబాలగోపాలాన్ని అలరించే కవిత్వం రాసిన వారు డా. ఎండ్లూరి సుధాకర్ గారు. వీరి రచనల్లో 'నల్లద్రాక్ష పందిరి' అంతర్జాతీయ ఖ్యాతిని పొందింది. అమెరికా తెలుగు సంఘం (ATA) వారు పంపిన ఆహ్వానం మేరకు అమెరికాలో ఎండ్లూరి సుధాకర్ గారు నల్లద్రాక్ష పందిరి

కవితా సంపుటిని ఆవిష్కరించారు. అమ్మగాజులు, ఆత్మకథ, ఇందిరాపార్కు, ఈసారి ఉగాది, తేపికోత, నీలిక, మైసమ్మ మరణం వంటి కవితలు పలు సమస్యలను ప్రస్తావించాయి. కులంపరంగా, ఆత్మగౌరవంపరంగా, విద్యా ఉద్యోగాలపరంగా దళితులు ఎదుర్కొన్న సామాజిక సమస్యలను, అస్పృశ్యతను ఈ కవితా సంపుటిలో ఎండ్లూరి వారు వర్ణించారు.

అంటరానితనం ఎంత దారుణంగా ఉందో దళితుల మానసిక ఆవేదన లోలోపల ఎలా రగిలిపోతుందో ఎండ్లూరి వారు ప్రత్యక్షర ఆవేదనతో వర్ణించారు. పాతాళగంగ పైకెగసినట్లు కవి గుండెల్లోని ఆవేశం అక్షర రూపం దాల్చింది. తన నల్లజాతి పందిరికి అల్లుకున్న ద్రాక్ష తీగ వంటిదని కవి ఈ కావ్యానికి 'నల్లద్రాక్ష పందిరి' అని పేరుపెట్టారు. ప్రతి కవితలోనూ దళిత జాతి చైతన్య కాంక్ష ప్రతిఫలిస్తున్నది.

**నల్లద్రాక్ష పందిరి - దళిత చైతన్యం:**

డా.ఎండ్లూరి సుధాకర్ గారు బాల్యం నుండి ఎన్నో తిరస్కారాలను, అంటరానితనాన్ని, పేదరికాన్ని అనుభవించారు. తండ్రి, తాత మొదలైనవారు సమాజంలో అస్పృశ్యులుగా ఎంత దీనంగా, హీనంగా జీవించేవారో తన కళ్ళారా చూశారు. ఊరి చివర పూరిపాకల్లో చిరిగిన బట్టలతో వారు అనుభవించిన అస్పృశ్యతను కవి ప్రతి కవితలోను వ్యక్తపరిచారు.

తాను ఉన్నత చదువులు చదివి విశ్వవిద్యాలయ ఆచార్య పదవిని చేపట్టారు. అమెరికా తెలుగు సంఘం ఆహ్వానం మేరకు అమెరికా వెళ్ళిన సందర్భంలో 'ఆత్మకథ' అనే కవితను రాశారు. ఇందులో తన మానసిక ఆవేదనను క్రింది విధంగా రాశారు.

**"మయసభలో నా ఆత్మకథ ఆవిష్కరించబడింది**
**బహిరంగ వేదికమీద నా సన్మానం మొదలయ్యింది**
**ఇప్పుడు నా మెడలో దండలుపడుతుంటే**
**నా గాయాలు ఉలిక్కిపడుతుంటాయి" (నల్లద్రాక్ష పందిరి, పుట: 14)**

ఇక్కడ మయసభ అనగా అమెరికాలోని సన్మాన సభ. తనకి సన్మానం జరుగుతుంటే లోలోపల నిన్న తన కులం వారు ఎదుర్కొన్న అంటరానితనం గాయాలు ఉలిక్కిపడుతున్నాయని దళిత జాతి తరపున ప్రతినిధియై స్పందించాడు. "నా తలమీద పూలు చల్లుతున్నపుడు లోలోపల ముళ్ళకొరడాలు చరుస్తుంటాయి నామీద అభినందన పత్రాలు చదువుతున్నపుడు నా కడుపులో అవమానాల చురకత్తులు గుచ్చుకుంటాయి" (నల్లద్రా, పుట: 5) అని తనకు సన్మానం జరుగుతున్నందుకు గర్వించకుండా తన జాతి ఎదుర్కొన్న అవమానాల చురకత్తులు గుర్తుకుతెచ్చుకున్నారు ఎండ్లూరి గారు. తన మీద పూలు చల్లుతున్నపుడు అవి ముళ్ళకొరడాల్లా కవి చరుస్తుంటాయి అన్నారు.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

సన్మానాలు సత్కారాలు తన ఉన్నతికి, తన పదవికి లభించిన గౌరవాలు మాత్రమే అంటారు కవి. నిజంగా దళితుడిని గుండెలకు హత్తుకొనే సహృదయత ఈ మనుషులకు లేదంటాడు. వీరు చూపే ఆదరాభిమానాలు పైపైవి మాత్రమే. లోలోపల దళితులపట్ల ఈసడింపు, ఛీత్కారభావం మనుషులకు లేకపోలేదంటారు కవి.

సమాజంలో దళితులు ఊరికి చివర వెలివాడల్లో నివసించారు. మోకాళ్ళపై వంగి నీళ్ళు తాగేవారు. వీపుకు తాటాకు కట్టుకొని, మెడకు గంట కట్టుకొని వీధిలో తిరిగేవారు. చెప్పులు కుట్టి జీవించే దళితులు సమాజంలో పెద్దల ముందు చెప్పులు లేకుండా నడిచి వెళ్లేవాళ్ళు.ఇటువంటి దళితుల దీనస్థితిని 'ఆత్మకథ' కవితలో కవి వర్ణించారు.

**"సభా వేదికమీద నన్ను కూర్చోబెట్టినపుడు**
**ఊరి పొలిమేర దగ్గర నిలబడ్డ మా తాత మొహం గుర్తొస్తుంది**
**నా ముందు నీళ్ళునిండిన గాజుగ్లాసులు పెట్టినపుడు**
**మోకాళ్ళపై వంగి నీళ్ళు తాగిన ఎడారి దృశ్యాలు వేడిగా తగులుతాయి" (నల్ల, పుట: 6)**

దళితులు తినడానికి తిండిలేక, కట్టుకోవడానికి బట్టలేక దీనంగా బ్రతికారు. దళిత స్త్రీల పరిస్థితి మరింత ఘోరంగా ఉండేది. దీన్ని కవి ఇలా వర్ణించాడు.

**"నా బుజాల చుట్టూ శాలువా కప్పుతున్నపుడు**
**జాకెట్టులేని నా జేజమ్మ మసక రూపం గుండెల్ని కోస్తూ**
**పట్టువస్త్రాలు నాకు అర్పణంగా పెడుతున్నపుడు**
**చిరిగి పేలికలైన మా తాత ముతక పంచలు**
**కళ్ళ తీగలపై వేలాడుతుంటాయి" (నల్ల: పుట 14)**

సభలో తనకు జరుగుతున్న సన్మానం చూసి కవి గుండెలోతుల్లో విలపించారు. తన తాత ముత్తాతలు తిండిలేక, కప్పుకోవడానికి బట్టలేక ఎంత హీనంగా జీవించారో ఇందులో వివరించారు. 'ముతక పంచలు కళ్ళతీగలపై వేలాడుతుంటాయి' ఇది చాలా గొప్ప అభివ్యక్తి. పక్షి జంట ఆవేదన చూసి వాల్మీకి నోట శ్లోకం అవ్యక్తంగా అవతరించింది. అలాగే దళితుల దీన గాథల్ని కళ్ళారా చూసిన ఎండ్లూరి సహజ దళిత కవిగా ఎదిగారు. ప్రతి అక్షరంలో దళిత జాతి అభివృద్ధిని ఆకాంక్షించారు.

ఎండ్లూరి గారు అత్యంత పేదరికం నుండి విశ్వవిద్యాలయ ఆచార్య పదవి వరకు ఎదిగారు. ఖండాంతరాలను దాటి ఆయన కవిత్వం అంతర్జాతీయ వేదికమీద ఆవిష్కరించబడింది. దీన్ని కవి కవితాత్మకంగా ఇలా వర్ణించారు.

**"నాలుగు మబ్బుల నీలి గోడల్ని చీల్చుకుంటూ**
**నేను అయిదవ సూర్యుడినై ఉదయించాను**
**ఈ వేళ నా రక్త కిరణాలు చంద్ర తలం మీద ప్రతిబింబిస్తున్నాయి**
**ఇప్పటి కొత్త సూర్యుడి వెలుగులో**
**కాలం నా ఆత్మకథను**
**పాఠ్యగ్రంథంగా చదువుకుంటుంది" (నల్ల: పుట 16)**

దళిత చైతన్య కాంక్షకి పై కవితా పంక్తులు మచ్చుతునకలు. అమెరికా వెళుతున్న సందర్భంలో ఆకాశంలో ప్రయాణిస్తున్న ఎండ్లూరి అయిదవ సూర్యుడిగా ఉదయించానని అంటాడు. పంచముడిగా సమాజంచేత గుర్తించబడిన ఇతడు ఇప్పుడు ప్రకాశవంతమైన అయిదవ సూర్యుడయ్యాడట, ఈయన వెదజల్లేది ఆవేదనతో కూడిన రక్త కిరణాలట, కొత్త సూర్యుడు వెలుగులో ప్రస్తుత కాలపు విద్యార్థులు తన ఆత్మకథను పాఠ్యగ్రంథంగా చదువుతున్నారట. అనగా తన కవితలు విశ్వవ్యాప్తం అయ్యాయని, ప్రపంచమంతా తన కవిత్వం చదివి ఆస్వాదిస్తుందని, ఒకప్పటి పంచముడు నేడు ప్రపంచమంతా జ్ఞానకిరణాలు వెదజల్లే అయిదవ సూర్యుడయ్యాడని ఆత్మకథనాత్మకంగా వర్ణించారు.

**'కొత్తకల' అనే కవితలో కవి ఈ విధంగా ఆకాక్షించారు**
**"ఆకలితోనో**
**అవమానంతోనో**
**తలవంచుకొని**
**నీ చర్మపుజోళ్ళు**
**కుట్టుకుంటున్నా తాతా**
**ఈ ప్రపంచం**
**ఉంగటంగా మారి**
**నీ ముంగాలి బొట్టివేలిని**
**ముద్దు పెట్టుకోవాలని**
**కలలుగంటున్నాడు" (నల్ల: పుట; 30)**

నల్లద్రాక్ష పందిరి కవితా సంపుటిలోని 'కొత్తకల' కవితలో దళితుల అభివృద్ధిని కవి ఆకాంక్షించారు. అనాదిగా ఆకలితో అలమటించి అవమానాలెదుర్కొని చర్మపుజోళ్ళు కుట్టుకొని జీవించిన దళితుల బొటనివేలిని ఈ ప్రపంచం ముద్దు పెట్టుకోవాలని కవి కలలుగంటున్నాడట. ఇది ప్రతి దళితుడి ఆకాంక్ష కూడా. భారత రాజ్యాంగంలో "ప్రజలందరూ సమానులే" అని ఉన్నది. కులము,

మతము, జాతి పరంగా ఎటువంటి వివక్షతలు లేకుండా ప్రజలు జీవించాలని రాజ్యాంగపిత అంబేద్కర్ కోరుకున్నారు. చర్మకారులన్న తక్కువ భావంతో దళితులు సమాజంచేత వెలివేయబడ్డారు. వారికి కృతజ్ఞతగా ప్రపంచము వారి బొటనవేలిని మొక్కాలని ముద్దు పెట్టుకోవాలని కవి ఆకాంక్షించారు.

'నల్లతల్లి' అనే కవితలో ఎండ్లూరి వారు దళిత స్త్రీ మనోవేదనని కళ్ళకుకట్టినట్లు వర్ణించారు. హృదయ విదారకమైన అస్పృశ్యతా జాఢ్యాన్ని ఈ దేశంలో కూకటివేళ్ళతో సహా పెకలించివేయాలని కవి ఇందులో పిలుపునిచ్చారు.

**"ఎవరైనా దయ తలిచి పిలిస్తే**
**ఒక మూల బిక్కుబిక్కున నక్కినక్కి కూర్చొని**
**సిగ్గుతో అన్నం తిని**
**చెంబు చంకలో పెట్టుకొని**
**విస్తరాకు ఎత్తుకొని**
**భయం భయంగా అర్ధాకలితో వెళ్ళిపోయే దానిని" (నల్ల: పుట; 70)**

గ్రామంలో పేరంటానికి అందరినీ ఆహ్వానించే స్త్రీలు దళిత స్త్రీలను మాత్రం చులకనగా చూస్తారు. వారిని ఏ కార్యానికి సాధారణంగా ఆహ్వానించరు. ఒకవేళ దయతలిచి పిలిస్తే అస్పృశ్యతా నెపంతో ఒక మూలన కూర్చోబెట్టేవారు. నలుగురిలో సిగ్గుతో అన్నం తినవలసి వచ్చేది. అందరు తిన్నాక మాత్రమే మిగిలిన అన్నం దళితులకు దక్కేది. భోజనం చేశాక వారు తెచ్చుకున్న చెంబు మిగిలిన వారికి తగలకుండా విస్తరాకు తీసుకొని భయంగా అర్ధాకలితో దళితులు వెళ్ళిపోయేవారు. ఇటువంటి దీనస్థితిని నేటికీ దళితులు అనుభవిస్తున్నారు. బుద్ధిజీవులయిన మానవులు విచక్షణారహితంగా సాటి మనుషులను వెలివేసినట్లు హీనంగా చూస్తున్నారు.

దళితులపట్ల మనుషులకు నిజంగా ఆదరాభిమానాలుంటే దళితులకు ఆరాధ్య దైవం వంటి రాజ్యాంగ పిత అంబేద్కర్ విగ్రహాన్ని దళిత వీధుల్లో కాకుండా కులప్రముఖుల గుమ్మాల ముందు నిలబెట్టమంటూ కవి ఇలా తన ఆవేదనను వ్యక్తం చేశాడు.

**"రాజ్యాంగ పిత విగ్రహాల్ని**
**దళిత వీధుల్లో కాదు**
**కులప్రముఖుల గుమ్మాల ముందు నిలబెట్టండి**
**పూలదండలే పడతాయో చెప్పుల దండలే వేలాడతాయో**
**కాలం నిరూపిస్తుంది" (నల్ల: పుట; 98)**

కులప్రముఖుల ఇల్లముందు డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాల్ని పెట్టినపుడు ప్రజలు ఆయనను గౌరవించి పూల దండలు వేస్తారో ! లేదా అవమానకరంగా చెప్పుల దండలు వేస్తారో ! కాలం నిరూపిస్తుందని ఎంతో చైతన్యవంతంగా కవి పై కవితలో వ్యక్తీకరించారు.

అంతేకాదు దళితులు కేవలం అస్పృశ్యతా నివారణతో సరిపెట్టకుండా వారు విశ్వ మానవులుగా ఎదగాలని కోరుతున్నాడు కవి.

**'నిమ్నలిపి' కవితలో,**

**“చరిత్ర కోరలు నా రక్తంతో ఎరుపెక్కాయి**
**నా కాలు సోకని గర్భాలయాలు గొడ్రాళ్ళయ్యాయి**
**నేనొక చండాల దేశంగా మారక ముందే**
**వెలివాడల్ని విముక్త ప్రాంతాలుగా ప్రకటించండి**
**అందులోంచి విశ్వ మానవులు బయటికి వస్తారు” (నల్ల: పుట; 100)**

గత చరిత్రలో దళితులకు జరిగిన అన్యాయపు విలువలని, అన్యాయపు విషయాలని రక్తంతో ఎరుపెక్కాయని దళితులకు ప్రవేశంలేని గర్భాలయాలు గొడ్రాళ్ళుగా మారాయని కవి గత చరిత్రను ప్రశ్నించాడు. ఈ భారతదేశం అస్పృశ్యత కలిగిన దేశంగా మారకముందే వెలివేసిన దళితులను గ్రామాల్లోకి ఆహ్వానించండి. వారిలోనుండి ప్రపంచం గర్వించదగిన విశ్వ మానవులు బయటకి వస్తారని ఎండ్లూరి వారు చైతన్య ప్రబోధ చేశారు. అందుకు కావాల్సింది సానుభూతి కాదని సర్వ సమానత్వం కావాలని ఎండ్లూరి గారు ఆకాంక్షించారు.

**ముగింపు:**

'నల్లద్రాక్ష పందిరి' కవితా సంపుటిలో ఎండ్లూరి సుధాకర్ గారు ప్రతి అక్షరంలోను దళిత చైతన్యాన్ని కాంక్షించారు. సాటి మానవులను అంటరాని వాళ్ళుగా చూడటం హేయమైందని, దళితులకు ఆత్మగౌరవం కావాలని ప్రబోధించారు. సమాజంలోని మిగిలిన వర్ణాల వారితో దళితులు ఏమాత్రం తీసిపోరని వారిని వెలివాడల నుండి విముక్తి చేస్తే వారు విశ్వ మానవులుగా ఎదగగలరని కవి ఉద్ఘాటించారు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# నిలిమేఘాలు కవితాసంపుటి – స్త్రీ చైతన్యం

**డా. గోపినాథ్ రాథోడ్ పి**
అసిటేంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ,పిజి సెంటర్ గద్వాల్,పాలమూరు
విశ్వవిద్యాలయం,call:7989692288,gopinathrathod1984@gmail.com

**వ్యాస సంగ్రహం:-**

ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీవాద సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. పురాతన సమాజపు కట్టుబాట్లను, బానిసత్వాన్ని తిరస్కరిస్తూ రాయబడిందే స్త్రీవాద కవిత్వం. ఆంగ్ల సాహిత్య ప్రభావం వల్ల తెలుగులో స్త్రీవాదం (ఫెమినిజం) వెలువడింది. ఇందులో భాగంగా వెలువడిందే 'నిలిమేఘాలు కవితా సంపుటి' తెలుగులో వెలువడిన ప్రసిద్ధ స్త్రీవాద కవిత సంపుటి ఇది. ఇందులో కొండేపూడి నిర్మల ,ఓల్గా, విమల, పాటిబండ్ల రజని, వసంత కన్నాబిరాన్, అస్మిత వంటి చాలామంది కవయిత్రులు ఈ సంపుటిలో కనిపిస్తారు. పురుషాధిక్యతను ధిక్కరిస్తూ, ఆదర్శ దాంపత్యం పేరుతో జరిగిన స్త్రీ శారీరక, మానసిక, హింసను, ఈ సంపుటిలో ఎండగట్టారు. స్త్రీని వంటింటి కుందేలుగా, పిల్లల్ని కనే యత్రంగా, రోజంతా విశ్రాంతి లేకుండా పని చేసే మరమనిషిగా ఈ సమాజం స్త్రీని కట్టుబాట్ల బంధాల మద్య బంధించి బానిసను చేసింది.

ఇటువంటి బంధనాల నుండి స్త్రీ జాతి విముక్తి పొందాలని, స్త్రీకి ఆత్మగౌరవం, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం కావాలని కాంక్షిస్తూ కవయిత్రులు రాసిన కవితలు ఈ నిలిమేఘాలు కవితా సంపుటి లో చోటు పొందాయి.

**ఉపోద్ఘాతం:-**

ప్రాచీన కవులు స్త్రీని అంగాంగ వర్ణనలు చేస్తూ శృంగార రసాధిదేవతగానో, ఆదర్శపతివ్రతగానో, మాతృమూర్తిగానో చిత్రీకరించారు. అలాంటి స్త్రీ ఆచారాలు, కట్టుబాట్లు వంటి అనేక ఆంక్షలు నుండి బయటకు వచ్చి స్త్రీ అస్తిత్వాన్ని ఆవిష్కరించాలనేది స్త్రీవాద రచయిత్రుల ప్రధాన ఆశయం.
స్త్రీ బాల్యంలో తండ్రి చాటు బిడ్డగా, యవ్వనంలో భర్త చాటు భార్యగా, వృద్ధాప్యంలో కొడుకుల చాటు తల్లిగా చేసి స్త్రీని ఒక భోగ వస్తువుగా మార్చి, అనేక బంధాల గొలుసుతో బంధించబడిన స్త్రీ సమాజాన్ని ఎదిరించి విముక్తికావాలని, స్వేచ్ఛ, సమానత్వం కావాలని, పురుషాదిక్యతను ప్రశ్నిస్తూ విద్య, ఉద్యోగ రంగాలలో సమన అవకాశాలు కావాలని కాంక్షించారు. నీలి మేఘాలు కవిత సంపుటి స్త్రీల అస్తిత్వానికి, చైతన్య పోరాటానికి నిలోవేత్తు నిదర్శనం, పురుషాదిక్యతపై తిరుగుబాటు చేసి లైంగికస్వేచ్ఛ, జీవనభద్రత, స్వాతంత్ర్యం ఆధునిక స్త్రీ కోరుకుంటున్న సామాజిక అసమానతలు ఇందులో చిత్రించబడ్డాయి.

**స్త్రీ చైతన్యం:-**

ఈ కవితా సంపుటిలో రచయిత్రులు తమ జీవితాల్లో జరిగిన లేదా చూసిన సంఘటనలను, సన్నివేశాలను వర్ణించారు. 'అస్మిత' అనే కవితలో వసంత కన్నబిరామన్ స్త్రీగా ఉండడం అంటే ఏమిటో కవితాత్మకంగా వర్ణించారు.

"స్త్రీగా ఉండటమంటే ఏమిటో
నేనిప్పుడు తెలుసుకున్నాను
పదిహేను వసంతలుగా విప్పారిన వయస్సులో
నేనడచిన దోవంతా
వెంటాడే విలాస చంచల దృక్కుల నడుమ
నన్ను పడదోసుకుపోతున్న
కాంక్షల కెరటాలపై
ఎత్తుగా గర్వంగా జ్వలిస్తూ
ముందుకి నడిచి పోయి నప్పుడా ...?" (నిలిమేఘాలు పుట -23)

సమాజంలో స్త్రీ దుస్తుతి ఎలాగుందో కవయిత్రి కళ్ళకు కట్టించారు. పదిహేను సంవత్సరాల వయస్సు రాగానే విలాసవంతమైన పురుషుల కళ్ళు వెంటాడటం ప్రరంబించాయి. కోరికలు కెరటాలుగా మారి స్త్రీని దాటి ముందుకు పోతున్నాయి. ఇటువంటి సమాజపు చంచల చూపుల మధ్య ఆశల కెరటాలపై గర్వంగా ఎదురించి ముందుకు సగినపుడే నేను స్త్రీగా ఉండటాన్ని గమనించాను. నిజంగా స్త్రీగా బతకడం ప్రారంబించాను అంటుంది కవయిత్రి.

" నేతి నేతి అనే నిర్వచనంలో
నేను బంధినై వున్నానని తెలిసి
నా ఏమిలేని తనాన్ని సూటిగా
చూసుకోవటానికి ధైర్యం చేసినపుడు కదూ
శూన్యం లో ఉండే సాహసం చేసినపుడు కదూ
నన్ను మొత్తంగా చేరిపెసుకునే
అపాయాన్ని ఎదుర్కొని నిల్చి
నా ఉనికిని మళ్ళీ కొత్తగా ఏర్పరచుకున్నప్పుడు కదూ
స్త్రీగా ఉండటమంటే అర్ధం ఏమిటో
నేను తెలుసుకున్నది." (నీలి మేఘాలు –పుట ,25)

పై కవితలో కవయిత్రి స్త్రీ చైతన్యం అంటే ఏమిటో వివరిచారు. స్త్రీకి సమజలో ఎటువంటి ఉన్నత స్థానం లేదు. స్త్రీ ఏమి చేయలేని స్థితిలో ఉందని, తనని తాను సూటిగా పరిశీలించుకోవడానికి, ధైర్యం చేయాలని కవయిత్రి కోరుకున్నారు. స్త్రీ ఉనికిని కొత్తగా ఏర్పరచుకొన్నప్పుడు.స్త్రీని పూర్తిగా కాలరాసే స్థితిని ఎదుర్కొని నిలిచినపుడే అసలైన స్త్రీగా జీవిచాడమని వసంత కన్నాభిరామన్ స్త్రీ చైతన్యాన్ని ప్రభోదించారు. 'ఉసరవెల్లి' అనే కవితలో రాజేశ్వరి గారు స్త్రీల సమస్యలను ప్రస్తావించారు

'తాళికట్టిన మృగం
తాగి ఇంటికి వచ్చి చేసే ఉన్మాద క్రియల్లో
కంచం ఎగిరి దురాన పడుతుంది
వీణానిక్వణ మొనరిచే
కరకంకణాలు విరిసి ముక్కలవుతాయి
అన్నం మెతుకులు
గాజు ముక్కలు
ఎర్రటి దానిమ్మ గింజలవుతాయి' (నీలి మేఘాలు,పుట -53)

తాళి అనే బంధం తో బంధింప బడ్డ స్త్రీలు భర్తలతో పడుతున్న గృహ హింస, శారీరక హింసను, తాగి భార్యను తిట్టి కొట్టి చేసే ఉన్మదపు పనులకు ఎదిరించాలని రచయిత్రి కోరారు. అన్నం తినే గిన్నెలను విసిరికోట్టినా గాజులు పగులగోట్టినా మౌనంగా భరించాల్సిన అవసరం లేదని, సమాజపు కట్టుబాట్లను బద్దలు కొట్టాల్సిన అవసరం ఉందని, తాళి మాటున జరిగే గృహహింసను ధైర్యంగా ఎదురించాలని కవయిత్రి పిలుపునిచ్చారు.

'దాంపత్యం' అనే కవితలో 'ఓల్గా' గారు దంపత్యపు కట్టుబాట్లను,భందాలను, ఇవిధంగా వివరించారు.

'ఏ రాగానికీ చలించక
ఏ స్పర్శకు జ్వలించక
చిలక్కొయ్యకు తగిలించిన
లుంగీ చీరల్లా
డబుల్ కాట్ ఫోమ్ పరుపులపై
మనల్ని మనం వేలదదీసుకున్నప్పుడు
ఆదర్శ దంపతులారా – మీరు
చేరువకాక తప్పదనే

సామాజిక పెనుపాముల బుసలకు
ఉలిక్కిపడి పెనవేసుకుంటాం'                    (నీలి మేఘాలు ,పుట -49)

సమాజంలో దాంపత్య జీవనం ఆదర్శాల పేరుతో భార్య భర్తల మధ్య ఎన్ని విభేదాలు వచ్చినా, వారి మధ్య ఐక్యత లేకపోయినా, ఎటువంటి స్పర్శకు అవతలి వ్యక్తి స్పందించక పోయినా, సమాజపు పెనుపములు అంటే పెద్దలు ఏర్పరచిన కట్టుబాట్ల సంకెళ్ళ మధ్య ఇష్టం లేకపోయినా కలిసి జీవిస్తున్నారు. కావున ఇటువంటి సంకెళ్ళ నుండి బయట పడాలని స్వేచ్ఛ, స్వాతంత్ర్యం స్త్రీలకు రావాలని, భార్య భర్తల మధ్య నిజమైన ప్రేమాభిమానాలు ఉండాలని, కృత్రిమమైన దాంపత్యం ఉండకూడదని, ఓల్గా గారు సూచించారు.

ప్రతి విషయంలో స్త్రీలు పురుషులతో రాజీపడుతున్నారు. ఇటువంటి రాజీవనమహోత్సవాల గురించి పాటిబండ్ల రజనిగారు 'రాజీ వనాలు' అనే కవితలో ఇలా వర్ణించారు.

"ఆదర్శ దాంపత్యపు అనివార్యపు థియరీ
అత్యవసరంగా ప్రతిపాదించబడుతుంది
ఛీ – మొహం చూడనన్నంతటి ద్వేషాన్నీ
ఛూ – నువ్వెంత పొమ్మనంత రోషాన్నీ
మొదలంటూ తవ్విపోసి
ఎప్పటికప్పుడు కొత్త ప్రమాణాలు అట్టహాసంగా
నాటుకునే
ఈ 'రాజీ' వన మహోత్సవాలు
మానవోన్నతులమై చేసే మార్జాల దాంపత్యాలు "                    (నీలి మేఘాలు, పుట – 44)

దాంపత్యం అనేది సమాజంలో ఒక తప్పనిసరి సిద్ధాంతంగా ఉంది. ఇది అత్యవసర సామాజిక కట్టుబాటుగా ఉంది. పెళ్లి చేసుకోకపోతే 16 సంవత్సరాలకే స్త్రీని సూటిపోటి మాటలతో మానసిక వేదనకు గురిచేయడం జరుగుతుంది. ఈ దాంపత్యంలో కొన్ని సార్లు నీ మొహం చూడను అన్నంత ద్వేషం వచ్చినా కట్టుబాట్లకు భయపడి కృత్రిమంగా సంసారం చేయవలసి వస్తుంది. దీన్నే 'మార్జాల దాంపత్యం' అనడం చాలా మంచి అభివ్యక్తి.

స్త్రీ సౌందర్యం పేరిట తమ శరీరాన్ని తాము ఎలా హింసించుకుంటున్నారో, భర్త మెప్పుకోసం తనను తాను ఇంతలా శ్రమపడి అలంకరించడం ఎందుకని విమలగారు 'సౌందర్యాత్మక హింస' కవితలో వర్ణించారు.

'మన సమస్త జీవిత లక్ష్యాన్ని చేసిన చోట

ఎంత హింసను అనుభవిస్తున్నామో కదా
చెవులకి, ముక్కుకి రంధ్రాలు పొడిచి
లోలాకులు, ముక్కెరలు వేలడదీస్తాం
పెదవులకు, వేళ్ళకు, కళ్ళకు,కనుబొమ్మలకు
రంగుల్ని అద్దుకుంటాం
మెడనూ, నడుమునూ,కాళ్ళనూ
రకరకాల గొలుసులతో బందిస్తాం
సౌందర్య సాధనాలతో క్షణక్షణం
శరీరాన్ని గాయపరుచుకుంటూ ...” (నిలిమేఘాలు, పుట -36)

స్త్రీలకు జీవిత లక్ష్యం ఉండాలి. కానీ నేడు ఆ లక్ష్యాన్ని మరచి కేవలం శరీరాన్ని అలంకరించుకోవడానికే సమయం వెచ్చిస్తున్నారు. రకరకాల ఆభారణాలలతో శరీర భాగాలను అలంకరించుకొని భర్తకు ఆనందాన్ని కలిగిస్తుంది స్త్రీ. ఇదే మహిళల జీవితానికి పరమావధిగా మారింది. ఇలాంటి సౌందర్యాత్మక హింస కన్నా సహజమైన శరీర సౌందర్యమే మంచిదని విమలగారు ప్రభోదించారు.

“అందాన్ని ఖరీదు చేయలేని కోట్లాది మంది స్త్రీల
అందవిహీనతని మనం ప్రేమిద్దాం,
శ్రమ సౌందర్యాన్నీ, మనవ విలువల్నీ,ప్రేమిద్దాం
అందరికోసం అద్భుత సౌందర్యాన్ని
సహజ సౌందర్య భరిత ప్రపంచాన్నీ సృష్టిద్దాం” (నీలి మేఘాలు, పుట- 38)

సమాజంలో ఎంతోమంది స్త్రీల అందవిహీనతను కలిగి వున్నారు. అటువంటి వారిని ప్రేమిద్దాం. శారీరక సౌందర్యం కన్నా మానసిక సౌందర్యం గొప్పదని, శ్రమజీవన సౌందర్యాన్ని ప్రేమించాలని, అందాల పోటి పేరుతో స్త్రీలు తమ అవయవాలను అంగట్లో సరుకులా ప్రదర్శించడం, సౌందర్యం పేరుతో అవయవాల కొలతలతో స్త్రీలు హింసకు గురికావడం మంచిది కాదని ప్రభోదించారు.

‘శరీరం’ అనే కవితలో వసంత కన్నాభిరామన్ గారు తారతరాలుగా వస్తున్న సమాజపు కట్టుబాట్ల నుండి స్త్రీ బయటకు రాలేకపోతుందని ఇలా అన్నారు.

“నన్ను మెలిదిప్పి, గాయపరిచి
ఒక మూసలొ బిగించారని తెలిసినా
నా శత్రువులతో సహా
నన్ను నేను నాశనం చేసుకుంటానన్నా

భయంతో ఎంత ప్రయత్నించినా
ఆ మూసను బద్దలు కొట్టలేక పోతున్నా." (నీలి మేఘాలు, పుట- 33)

స్త్రీని సమాజం కట్టుబాట్ల చట్రంలో బంధీనిచేశారని, బంధాల మాటున స్త్రీ తనను తాను నాశనం చేసుకుంటుంది. కట్టుబాట్ల నుంచి, పురుషాధిక్యపు బానిసత్వం నుండి బయటకు రాలేక పోతుందని చెబుతూ స్త్రీ స్వేచ్ఛగా, ఆత్మ గౌరవంతో జీవిన్చినపుడే నిజమైన స్వాతంత్ర్యం అని కాంక్షించారు.

**ముగింపు :-**

పై విధంగా నీలి మేఘాలు కవితా సంపుటిలోని కవితలు స్త్రీల చైతన్యాన్ని అకాంక్షించాయి. పురుషాధిపత్యం సమాజం ఆదర్శ దాంపత్యం పేరుతో స్త్రీని బానిసను చేశారని, సామజిక కట్టుబాట్లతో అన్ని విధాల బంధిని చేశారని, స్త్రీని కేవలం ఒక భోగ వస్తువుగా, పిల్లలు కనే యంత్రంలా వంటింటికే పరిమితం చేసిన సామజిక కట్టుబాటు అనే బానిస సంకెళ్ళ నుండి స్త్రీ విముక్తి పొందాలని కోరుకున్నారు. అదేవిధంగా శారీరక హింస నుండి, సౌందర్యాత్మక హింస నుండి బయటకు రావాలని, 'శారీరక సౌందర్యం కన్నా మానసిక సౌందర్యం మిన్న' అని శ్రమైక జీవన సౌందర్యాన్ని ఆకాంక్షిస్తూ స్త్రీకి స్వేచ్ఛ, సమానత్వం రావాలన్నదే స్త్రీవాద కవయిత్రుల ఆశయంగా బావించవచ్చు.

ఆధార గ్రంథాలు

1. నీలి మేఘాలు ( స్త్రీవాద కవిత్వం) – అస్మిత సంస్థ
2. స్త్రీ పర్వం – కొలకలూరి స్వరూపరణి
3. స్త్రీవాద కవిత్వం – ఆవిర్భావం ఆవశ్యకత – సూరేపల్లి పద్మావతి

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# వాసిరెడ్డి సీతాదేవి కథలలో సామాజికత

**డా. వాసిరెడ్డి భవాని**
తెలుగు అధ్యాపకురాలు,ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర),గుంటూరు
చరావాణి: 9441289475

## పరిచయము:

" ఆంధ్ర పెర్ల్ బక్" బిరుదు పొందిన వాసిరెడ్డి సీతాదేవి గారు 1933 వ సంవత్సరం డిసెంబర్ 15వ తేదీన గుంటూరు జిల్లా చేబ్రోలు గ్రామంలో సామాన్య మధ్య తరగతి రైతు కుటుంబాల్లో జన్మించారు. మధ్యతరగతి కుటుంబాలలో ఉండే సామాజిక సమస్యలపై చిన్ననాటి నుంచే అవగాహన కల్పించుకున్నారు. వ్యక్తిగా రచయిత్రిగా ఆమెకు వేర్వేరు కోణాలు లేవు. తన జీవితంలోనైనా రచనలోనైనా ఆమెకు నచ్చిన దారినే ఎంచుకునేవారు. ఆమె తల్లికి ఈమెను బాగా చదివించాలని కోరిక ఉండేది. ఐదో తరగతి వరకు చదివించింది ఆరో తరగతి చదవాలంటే ఆ వీధి దాటి వెళ్ళాలి ఆ గ్రామంలో అలా ఆడపిల్లని బయటకు ఎవరూ పంపేవారు కాదు కాబట్టి ఆమె చదువు అప్పటితో ఆగిపోయింది. అప్పుడే చిన్నారి సీతాదేవి మనసులో తొలి ప్రశ్న మొదలైంది. మగపిల్లలకు లేని ఆంక్షలు ఆడపిల్లలకు ఎందుకు అని ఈ క్రమంలోనే ఆమె మనసులో రచనలకు పునాది పడింది అని చెప్పుకోవచ్చును.

తల్లి కలలను సాకారం చేయాలనే ఆలోచనతో హిందీ ప్రచారక్ ద్వారా సాహిత్య రత్న ఉత్తీర్ణులయ్యారు. 1950లో "జీవితం అంటే" అనే మొదటి నవలతో రచనలు మొదలుపెట్టారు.1952లో "సాంబయ్య పెళ్లి" అనే తొలి కథను రాశారు. 1972లో ఈమె వ్రాసిన "మట్టి మనిషి" నవల నేటికీ ప్రజాదరణ లో ఉన్నది 1982లో ఈమె రాసిన "మరీచిక" నవల నక్సలిజం అంశం ప్రధానంగా ఉన్నదని అప్పటి రాష్ట్ర ప్రభుత్వ నిషేధానికి గురైంది. వీరు 5 సార్లు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డులు పొందారు. 1989లో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి పద్మావతి విద్యాలయం నుండి గౌరవ డి.లిట్ పట్టా పొందారు. 1994లో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుండి సాహిత్యంలో విశిష్ట పురస్కారం అందుకున్నారు. అప్పటి సమైక్య ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉన్న మూడు అత్యున్నత పురస్కారాలు సీతాదేవి గారికి లభించాయి. తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కారం, ఆత్మగౌరవ పురస్కారం, హంస అవార్డు అందుకున్న రచయిత్రిగా ఈమెకు మంచి గుర్తింపు ఉన్నది.

## ఉపోద్ఘాతము

సీతా దేవి గారు రచనల్లో కేవలం సామాజిక స్పృహ మాత్రమే కాదు సమాజంలో చైతన్యం తీసుకురావాలనే సంస్కరణ దృక్పథం ఉండేది. ఆమె సాహిత్యం గురించి ఆమె మాటల్లోనే" నా సాహిత్య

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

నేపథ్యం ఏ గొప్ప పుస్తకాలు కావు- గొప్ప మేధావుల సత్సాంగత్యం-కాదు కేవలం నా చుట్టూ ఉన్న ప్రపంచం- నా లోపల ప్రపంచం రెండింటి సంఘర్షణలో తలెత్తిన ప్రశ్నలకు అందిన సమాధానాలు" అని స్పష్టం చేసిన రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి. ఈమె దాదాపు 100 వరకు కథలు రాసినట్లుగా చెబుతూ ఉంటారు. అందులోని 50 కథలను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారు ఎంపిక చేసి 2002లో సంపుటిగా ప్రచురించారు. ఈమె కథలకు వాస్తవికతే పునాదిరాయి. కథా సాహిత్యంలో వాసిరెడ్డి సీతాదేవి గారు ఒక విశిష్ట సంతకంగా చెప్పవచ్చును. అందులోని ఒక ఐదు కథలలోని సామాజికతను మనం పరిశీలించుదాం "తరాలు అంతరాలు" "సాంబయ్య పెళ్లి" "అమ్మ మనసు" "ఆమె నవ్వింది" "సౌందర్యం".

## తరాలు అంతరాలు

ఈ కథలో రచయిత్రి తన సొంత విషయాలనే మనతో పంచుకున్నట్లుగా ఉంటుంది. తన నాయనమ్మ తరం నుంచి తన తరం వరకు జరిగిన విషయాలన్నింటినీ గుర్తుకు తెచ్చుకుంటూ స్త్రీల పరిస్థితులు తన నాయనమ్మ కాలంలో ఎలా ఉన్నాయో తన తల్లి రోజులలో ఎలా ఉండేవో తన చిన్నతనంలో ఎలా గడిచాయో తాను ఇప్పుడు చూస్తున్నవి ఎలా ఉన్నాయో మననం చేసుకుంటూ ఈ కథను వ్రాయడం జరిగింది.

చాలాకాలం తర్వాత స్వగ్రామానికి వచ్చిన రచయిత్రి అక్కడి పరిస్థితులకు కొంత సంతృప్తి చెందినట్లుగా కనిపిస్తుంది. తాను కూడా 15 సంవత్సరాల తర్వాత పుడితే బాగుండేదని భావిస్తుంది. తనని ఐదో తరగతితో చదువు మాన్పించడం, ప్రైవేట్ గా మెట్రిక్ పాస్ అయి ఉన్నత చదువులకు మద్రాసు వెళ్లి అక్కడే ఉద్యోగం చేయడం, తన తరం వారికే తను నచ్చకపోవడం, తనతో సరిగా మాట్లాడకపోవడం, తలుచుకుని బాధపడుతుంది. ఒకరోజు తన తల్లి నాయనమ్మ పెరట్లో మాట్లాడుకుంటూ తన వదిన తల్లిని లెక్క చేయడం లేదని ఆమె నాయనమ్మతో చెప్పుకుంటూ బాధపడుతుంది. ఆ సమయంలో రచయిత్రి తన తల్లి ఏ విధంగా నాయనమ్మకు భయపడేదో గుర్తు తెచ్చుకుంటుంది. ఆ విషయాన్ని నాయనమ్మతో ప్రస్తావిస్తుంది. అప్పుడు ఆ నాయనమ్మ తన అత్త తనని ఎన్ని కష్టాలు పెట్టిందో వివరిస్తుంది. అప్పుడు రచయిత్రి ఇలా అంటుంది. "అవును నాయనమ్మ ఒక్కోతరం మారుతుంది నీ తరంలో ఆడవాళ్లు మగవాళ్ళతో సమంగా తిండి తినకూడదు. అమ్మ తరంలో ఆడది అత్తమామల భర్త అదుపులో అణిగిమనిగి ఉంటే చాలు. కానీ మా తరంలో యుగయుగాలుగా అణచబడిన స్త్రీ అన్యాయాన్ని ప్రశ్నించే స్థితికి వచ్చింది. ఈ పిల్లల తరంలో అత్తలు, కోడళ్ళు, ఒకరినొకరు అర్థం చేసుకుని బ్రతకడానికి ప్రయత్నించవచ్చు. అని చెప్పడంలో "ఆడదానికి ఆడదే శత్రువు" అనే ఆలోచనను తుడిచివేయాలని ప్రయత్నించినట్లుగా కనిపిస్తుంది. స్త్రీల

అభ్యున్నతిని ఆకాంక్షించినట్లుగా మనం అర్థం చేసుకోవచ్చును. తను చూసిన సమాజాన్ని కళ్ళకు కట్టినట్లుగా కథగా మలచినట్లుగా ఈ తరాలు అంతరాలు అనే కథ మనకి సాక్షాత్కరిస్తున్నది.

## సాంబయ్య పెళ్లి

ఈ కథ ఈమె మొదటి కథగా చెబుతూ ఉంటారు సాంబయ్యకు ఈ ప్రపంచంలో నా అనే వాళ్ళు ఎవరూ లేరు. ఇరువు పొరుగు ఇండ్లలో పనిచేసి పొట్ట నింపుకుంటూ ఉండేవాడు. చిన్నతనంలో పిల్లలు కూడా అతన్ని ఆటలకు రానిచ్చే వాళ్ళు కాదు. పైగా చెదల మొఖం అంటూ వెక్కిరించేవాళ్లు. అందుకే అతను ఎవరితో కలవకుండా తన పని తాను చేసుకునేవాడు. అతనికి జ్ఞానం తెలిసిన నాటి నుంచి నలుగురి ముందు తిరగడానికి కూడా బాధపడేవాడు. తను మనుషుల మధ్య కాకుండా అడవి మృగాల మధ్య ఉన్నట్లుగా భావించేవాడు. ఇప్పుడు అతనికి 27 ఏళ్లు. ఇంతవరకు చౌదరి గారి ఇల్లు తన ఇల్లు తప్పితే వేరే ప్రపంచం తెలియదు.తనఈడు వాళ్ళ పెళ్లిళ్లు జరుగుతుంటే తాను మాత్రం పగటి కలలతో పొద్దు వెళ్ళబుచ్చేవాడు కానీ పెళ్లి కోసం ఏ ప్రయత్నం చేయలేకపోయాడు. తనకు పిల్లనిచ్చే దౌర్భాగ్యుడు ఈ ప్రపంచంలో ఉంటాడా అని కృంగిపోయేవాడు. అలాంటి సమయంలో ఒకనాడు హఠాత్తుగా వెంకన్న వచ్చి తన మేనకోడలు నిచ్చి పెళ్లి చేస్తానంటే తనని తానే నమ్మలేకపోయాడు.

రేపే పెళ్లి సాంబయ్య దగ్గర పెళ్లికూతురికి ఒక చీర కొనడానికి కూడా డబ్బు లేదు. జీవితంలో రెండు రూపాయలే మిగిలి ఉన్నాయి. అని ఆలోచిస్తున్న సాంబయ్యకి గడప తగిలి పడిపోతాడు. అది చూసిన యజమాని మా లక్ష్మమ్మ ఏమంత పరధ్యానం అని అడుగగా సందేహిస్తూ తన పెళ్లి విషయం చెబుతాడు. అందుకు ఆమె పిల్లలు గురించి వాకబు చేసావా? కొంపతీసి ఏ కుంటిదో గుడ్డదో కాదు కదా అని అంటుంది. సాంబయ్యకు మనసు చివుక్కు మంటుంది. మా లక్ష్మమ్మ పది రూపాయల నోటు సాంబయ్యకి ఇచ్చి రెండు రోజులు పనికిరావద్దులే అంటుంది.

సాంబయ్య ఇంటికి చేరేటప్పటికి పిల్ల మేనమామ ఎదురుచూస్తూ నీకు పిల్లని ఇచ్చేది కాక ఎంత సేపు పంచలు పట్టుకొని పడి ఉండాలి అని విసుక్కుంటాడు. అతనితో కలిసి నడుస్తూ మధ్యలో పిల్ల గురించి అడగడానికి ధైర్యం చాలక ఊరుకుంటాడు. ఊరు దగ్గరకు వస్తున్న కొద్దీ ఆనందం ఒకవైపు మరొకవైపు ఒకవేళ పిల్ల కుంటిదో గుడ్డిదో అనే భయం వెంటాడుతున్నాయి. నడికప్పున ఆకులు లేని ఒక పూరిగుడిసెలోకి సాంబయ్యను తీసుకువెళ్తారు. ఎదురుగా పిల్లను తెచ్చి కూర్చోబెడతారు. పిల్లనుచూసి పిల్ల కుంటిది గుడ్డిది కాదని నిర్ధారణ చేసుకుంటాడు. పెళ్లి చేసుకుని ఇంటికి తీసుకువెళ్తాడు

ఇంట్లోకి వెళ్ళాక నెమ్మదిగా తనే పలకరించుదామనుకొని నీ పేరు ఏమిటి అని అడిగితే ఆ అమ్మాయి తనకు మాటలు రావని సైగ చేస్తుంది. **మోసం** అని అరుస్తూ ఆ పిల్లని బయటకు వెళ్ళగొడతాడు మంచం పై పడి వెక్కి వెక్కి ఏడుస్తాడు. హృదయం తేలిక పరుచుకొని తలుపు తీసి

బయటకు వెళితే ఆ అమ్మాయి అతని రెండు కాళ్లు పట్టుకుని ఏడుస్తుంది. సాంబయ్య హృదయం ద్రవించి ఆమెను తన హృదయానికి హత్తుకుంటాడు. ఈ కథలో ఆత్మన్యూనతా భావం కల సాంబయ్య తనను చూసి అందరూ ఎగతాళి చేస్తారేమోనని భయంతో మూగదైన భార్యను స్వీకరించడానికి కూడా భయపడతాడు ఇప్పటికే తనకున్న కురూపితనం వల్ల తలెత్తుకు తిరగలేని స్థితి. సమాజంలో ఉండే ఇలాంటి పాత్రలను మన కళ్లెదుట ఉంచడమే ఈ కథలోని వాస్తవికతగా మనం చెప్పుకోవచ్చును భార్యను స్వీకరించడం అతనిలో కలిగిన కనువిప్పుగా రచయిత్రి చిత్రీకరించారు.

**అమ్మ మనసు :** ఈ కథలో అమ్మే సర్వస్వంగా భావించిన వినయ్ ఒకానొక పరిస్థితుల్లో అమ్మను గూర్చి చెడుగా విని సహించలేక ఇల్లు వదిలి ఊరు వదిలి వెళ్ళడానికి నిర్ణయించుకుని బల్లమీద అమ్మ చేతి వ్రాతతో ఉన్న ఉత్తరాన్ని చదవడంతో ఈ కథ మొదలవుతుంది. "చెడ్డ స్త్రీ ఉంటుంది చెడ్డ కూతురు ఉంటుంది చెడ్డ భార్య ఉంటుంది చెడ్డ తల్లి మాత్రం ఉండదు బాబు" అంటూ సంజాయిషీ ఇచ్చుకుంటూ ఉత్తరం మొదలు పెడుతుంది తల్లి.

నీ తండ్రి చనిపోయే సమయానికి నీవు నా కడుపులో ఉసురు పోసుకున్నావు. నాకు జీవితమంతా అంధకారంగా అనిపించినా మినుకు మినుకుమని మెరిసే నీ కళ్ళే నాకు కాంతిని ప్రసాదించాయి. మీ పెదనాన్న నాతో అసభ్యంగా ప్రవర్తించి నింద నాపై వేసి నన్ను ఇంటి నుండి వెళ్లగొట్టారు. అవమానంతో పుట్టింటికి వెళ్లలేక అతి కష్టం మీద హైదరాబాద్ చేరుకున్నాను. ఒక ప్లీడర్ గారి ఇంట్లో వంట మనిషిగా చేరాను. అక్కడ తెలియని వయసులో నువ్వు చేసిన దొంగతనం నాపై పడి నన్ను వెళ్ళగొట్టారు. చలపతి అనే షావుకారి ఇంట్లో పనికి కుదిరాను అతనికి భార్య లేదు ఆ సమయంలో నీకు చిన్నతనం కావడం వల్ల చూసిన ప్రతి వస్తువు కావాలనే వాడివి లేదంటే దొంగిలించే వాడివి. అందరూ నిన్ను దొంగ దొంగ అని అనడం భరించలేకపోయాను నేను పని చేసే షావుకారు నన్ను చేరదీసి నిన్ను చదివిస్తానని అన్నాడు. నాకు ఇష్టం లేదని మొఖం మీద చెప్పాను అయినా అతను వినలేదు. నువ్వు యవ్వనంలో ఉన్నావు నేను కాకపోతే ఇంకెవరైనా నీ వెంట పడతారు ఈ లోకంలో ఒంటరిగా బిడ్డను చదివించడానికి కష్టమవుతుందన్నాడు నీ భవిష్యత్తు నా కళ్ళ ముందు కదిలింది నువ్వు బికారి కాకూడదని షావుకారికి నా నిర్ణయం చెప్పేశాను. అన్న మాట ప్రకారం ఆయన నీ చదువుకు సాయం చేశాడు నిన్ను కోరుకొండ స్కూల్లో చేర్పించాను.నువ్వు ఎంత అడిగినా నిన్ను నేను ఇంటికి రానివ్వలేదు. ఆయన చనిపోయాక నా మకాం మార్చి పాత జీవితానికి స్వస్తి చెప్పాను. అంటూ తన పరిస్థితిని ఎదురుగా చెప్పలేక ఉత్తరం ద్వారా చెబుతుంది. ఈ కథలో ఈ ఆనాటి వితంతు స్త్రీల పరిస్థితి, భర్త లేకుండా, ఆస్తి లేకుండా బిడ్డను సాకాలంటే ఉండే కష్టాలు పిల్లల మానసిక స్థితి,

అవకాశవాదుల ఆగడాలు, అన్ని అవకాశాలు ఉన్నవారు అవకాశం లేని ఒక అబలని ఏ విధంగా అపార్థం చేసుకున్నారో లోకం పోకడ ఎలా ఉంటుందో వివరించడం జరిగింది.

**ఆమె నవ్వింది :**ఈ కథలో అమల ఒక మధ్యతరగతి ఆడపిల్ల. ఎవరితో ఎక్కువగా మాట్లాడేది కాదు. ముఖ్యంగా మగవాళ్ళతో అసలే మాట్లాడేది కాదు. ఆమె పెద్ద అందగత్తె కాదు అయినా కూడా ఆమె ప్రవర్తన అందర్నీ ఆకర్షించేది. కాలేజ్ రోజుల్లో ప్రకాష్ రావు అనే అందగాడు ధనవంతుడు తెలివైనవాడు అమలను నవ్వించాలని మాట్లాడించాలని ఎంతో ప్రయత్నించాడు కానీ సాధ్యపడలేదు.కొత్తగా వచ్చినా ఆంగ్ల అధ్యాపకుడు ఆనందరావు స్ఫురద్రూపి ఆయన అప్పుడప్పుడు అమల్ని పలకరిస్తూ ఉండేవాడు పాఠం చెప్పినంత సేపు చూపు అమలపైనే ఉండేది. అయినా ఆమె స్పందించేది కాదు దానికి స్నేహితురాలు కారణం అడిగితే నేను ఆయన వంక చూసి చనువుగా నవ్వితే ఆయన ఏదేదో ఊహించుకుంటాడు.చనువు తీసుకుని మాట్లాడుతాడు అలాంటి మాటలు నాకు ఇష్టం ఉండదని నీకు తెలుసు అని చెప్పేది. అయితే అమల ఇంటర్ చదువుతూ ఉండగా తండ్రి చనిపోవడంతో ఇంటి బాధ్యత మీద పడి ఒక ఆఫీసులో తాత్కాలిక ఉద్యోగంలో చేరింది. అక్కడ మేనేజర్ రంగనాథం అతను చాలా వెకిలివాడు ఆడపిల్ల కనిపిస్తే అమాంతం మింగేయాలి అనే మనస్తత్వం అతనిది తనతోటి ఉద్యోగులు విమలా కమల రంగనాథంతో సర్దుకుపోయేవారు. ఒకనాడు బస్టాండ్ లో ఉన్న తనను రంగనాథం కాఫీ కి పిలుస్తాడు ఆమె చాలా కోపంగా నిరాకరిస్తుంది. దాని ఫలితంగా రంగనాథం ఆమెను బెదిరించడం మొదలుపెట్టాడు ఆ పరిస్థితుల్లో అమల ఆఫీసులో ఇమడలేకపోయేది చివరకు రాజీనామా చేద్దామనుకుంది. కాని ఇంట్లో జబ్బు పడ్డ తల్లి చెల్లెలు తమ్ముళ్లు గుర్తుకు వచ్చి మనసు చంపుకుని రంగనాథం వైపు చూసి నవ్వింది. ఆ రోజుల్లో ఆఫీసుల్లో ఇలాంటి పరిస్థితులు ఎక్కువగా ఉండేవి. ఈ పరిస్థితి అమలది మాత్రమే కాదు విమల కమలతో పాటుగా ఆఫీసుల్లో ఉద్యోగం చేయాలంటే ఆడవాళ్ళు ఇలా నటించడం నేర్చుకోవాల్సిందే. అధికార అహంకారంతో ఉద్యోగినులను లొంగదీసుకోవడానికి అధికారులు ఇలాంటి పన్నాగాలు పన్నుతూ ఉండేవారు వారి లోడేలు మనస్తత్వాలను ఆ క్రమంలో ఉద్యోగినులు పడే బాధలను చెప్పడం ఈ కథను వ్రాయడంలో రచయిత్రి ఉద్దేశ్యంగా భావింప వచ్చును.

**సౌందర్యం**

రేఖ సన్నగా పొడవుగా అందంగా ఉండేది. ఆమె భర్త సుందర్ రావు పెళ్లినాటికి నల్లగానే ఉండేవాడు పెళ్లయిన పదేళ్లకి లావుగా బట్టతలతో వికారంగా తయారయ్యాడు అయితే రేఖ ఎప్పుడు తన భర్త రూపాన్ని గురించి ఆలోచించేది కాదు. అయితే సుందర్ రావు కి రేఖ అంటే పంచప్రాణాలు. కొడుకుని స్కూల్లో చేర్పించడం కోసం సుందర్రావు రేఖ బస్సులో హైదరాబాద్ బయలుదేరారు. బస్సులో సుందర్రావు చేసే ప్రతి చేష్టా ఈమెకి వికృతంగా కనిపిస్తుంది. సుందర్రావు మాత్రం అవేమీ పట్టించుకోకుండా

రేఖని ఎప్పుడూ కూడా అరటిపండ్లు కావాలా కాఫీ కావాలా అని అడుగుతూ ఉంటాడు. అతనితో కాఫీ కి వెళ్లడానికి కూడా ఇష్టం లేక రానని విసుక్కుంటుంది ఇడ్లీ తెస్తాను అన్న వద్దంటుంది. బస్సు ఆగినప్పుడు అప్రయత్నంగా ముందు సీట్లోకి చూస్తుంది రేఖ ఒక భార్య భర్త కూర్చుని ఉంటారు భర్త అందగాడు భార్య మోస్తరుగా ఉంటుంది ఆమెను నువ్వంటేనే నాకు అసహ్యం పిల్లల కోసం తప్పక అని ఆమెని తిడుతూ ఉంటాడు. ఆమె తలనొప్పిగా ఉంది ఒక కప్పు కాఫీ యాస్ప్రిన్మాత్ర తెమ్మంటే అతను క్రూరంగా నవ్వి దిగిపోతాడు ఆమె కళ్ళు తుడుచుకుంటుంది. అంతలో సుందర్రావు రేఖ కోసం ఇడ్లీ కాఫీ తెచ్చిస్తే విసుక్కుంటుంది రేఖ అది చూసిన ముందు సీటు ఆమె భర్త అందరికీ దొరుకుతాడు ప్రేమించే భర్త దొరకడం మీ అదృష్టం అంటుంది భర్తని కాఫీ ఏది అని అడిగితే నీ ముఖానికి కాఫీ కూడా అనవసరం అంటాడు. ఇది చూసిన రేఖకు అందం అంటే ఏమిటో అర్థం అయింది. హృదయ సౌందర్యం లేని చోట బాహ్య సౌందర్యం ఉన్నా వ్యర్థం అని ఇక్కడ సౌందర్యం అంటే మనసుకు సంబంధించి చూడాలి గానీ కేవలం బాహ్యరూపం మాత్రమే కాదు అనేది రచయిత యొక్క అభిప్రాయంగా మనం భావించాలి. అందమైన రూపం వెనుక ఎన్ని వికృత మనస్తత్వాలు ఉంటాయో రేఖకి స్పష్టంగా అర్థమైంది.

**ముగింపు**

వాసిరెడ్డి సీతా దేవి గారు తన అనుభవంలోని సంఘటనలను అక్షర రూపంలో అందంగా మలిచారు. ఆనాటి సమాజంలో స్త్రీల పట్ల పురుషుల ప్రవర్తనను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. స్త్రీకి స్వేచ్ఛ ఉండాలని పురుషులతో సమానమైన హక్కులు ఉండాలని స్త్రీ పురుషులు ఇద్దరు స్నేహంగా ఉండాలని ఆకాంక్షించేవారు. అలాగే తన కథల్లో అత్త కోడలు సఖ్యతతో ఉండాలని ఒకరిపై ఒకరు ఆధిపత్యం చూపించుకోకూడదని తెలియజేశారు. సమాజంలో ఉద్యోగం చేసే స్త్రీ పట్ల చులకన భావం కలిగి ఉండడాన్ని తీవ్రంగా ఖండించారు.సాహిత్యం అంటే సమాజానికి ప్రయోజన కారిగా ఉండాలి. క్షుద్ర సాహిత్యాన్ని ఎండగట్టారు. స్త్రీల పక్షాన తన స్వరాన్ని వినిపించి తన కలాన్ని గురి పెట్టారు. అలాగే సమాజంలోని దొంగ స్వాములను ఆశ్రమంలో ఆధిపత్యం కోసం జరిగే పోరును దుయ్యబట్టారు. ఆనాటి రాజకీయాలను విమర్శిస్తూ మీ ఓటు నాకే అని కథలోవిమర్శించారు. సీతాదేవి గారి కథలను చదువుతున్నప్పుడు ఆనాటి సమాజాన్ని మనం దర్శించగలుగుతాం ఈ విధంగా సమాజంలోని చెడుని ఎత్తి చూపిస్తూ దాని ఫలితాలను వివరిస్తూ ఈమె రచనలు చేశారనడం నిస్సందేహం.

**ఆధార గ్రంథాలు**

**వాసిరెడ్డి సీతాదేవి కథలు -కథా స్రవంతి – విశాలాంధ్ర బుక్ హౌస్**

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# శ్రీశ్రీ మహాప్రస్థానం – ప్రతీకలు

**డా. దోమల ధాత్రికుమారి**
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ. ప్ర.)
గుంటూరు
చరవాణి: 9989753424

**వ్యాస సంగ్రహం**

మహాకవి శ్రీశ్రీ అభ్యుదయ భావజాలం నుంచి సృజింపబడిన మహాప్రస్థానంలో ప్రతీకలు కవిత్వ సౌందర్య సాధనాలుగా మాత్రమే కాకుండా, సామాజిక వాస్తవికతను సంకేతాత్మకంగా వ్యక్తీకరించే భావనాత్మక సాధనాలుగా పనిచేస్తాయి. పాశ్చాత్య ప్రతీకవాద శిల్పాన్ని భారతీయ సాంస్కృతిక నేపథ్యంలో, మార్క్సిస్టు భావజాలంతో మేళవించిన తీరు శ్రీశ్రీ కవిత్వానికి ప్రత్యేక గుర్తింపునిస్తుంది. ఈ మహాప్రస్థానంలోని ప్రతీకలు ఎలా సామూహిక చైతన్యం, విప్లవ దృక్పథం, అభ్యుదయ భావజాలాన్ని నిర్మించాయో స్పష్టీకరించడమే ఈ వ్యాస లక్ష్యం.

**ముఖ్య పదాలు:** శ్రీశ్రీ; మహాప్రస్థానం; ప్రతీకలు; ప్రతీకాత్మకత; అభ్యుదయ కవిత్వం; సామాజిక భావజాలం

**ఉపోద్ఘాతం**

*"కుక్కపిల్లా,*
*అగ్గిపుల్లా,*
*సబ్బుబిళ్ళా*
*హీనంగా చూడకు దేన్నీ !" –*

ఈ కవితా పంక్తులతో **శ్రీశ్రీ** ఆధునిక తెలుగు కవిత్వానికి ఒక కొత్త దృష్టి/దిశను సూచించాడు. కవిత్వానికి అర్హమైన విషయాలు, వస్తువులు, అనుభవాలు అన్న భావనను ఆయన ఈ పంక్తుల్లోనే ప్రశ్నించాడు. ఈ దృష్టి అభ్యుదయ కవిత్వానికి బలమైన పునాది వేసింది.

సంప్రదాయ తెలుగు కవిత్వం చాలా కాలం పాటు వ్యక్తిగత భావాలు, ప్రకృతి సౌందర్యం, ఆధ్యాత్మిక అనుభూతుల చుట్టూనే కేంద్రీకృతమైంది. అయితే ఇరవయ్యో శతాబ్దంలో సమాజంలో ఏర్పడిన రాజకీయ, ఆర్థిక మార్పులు కవిత్వ దృష్టికోణాన్ని కూడా మార్చాయి. ఈ మార్పులతో కవిత్వం సమాజాన్ని ప్రశ్నించే సాధనంగా మారింది. ఈ పరిణామ దశలో అభ్యుదయ కవిత్వం పుట్టుకొచ్చింది. శ్రీశ్రీ

సమాజంలోని సాధారణ జీవితం, శ్రమ, పారిశ్రామిక వాతావరణం వంటి అంశాలను కూడా కవిత్వ కేంద్రంగా నిలబెట్టాడు. ఈ దృష్టే అభ్యుదయ కవిత్వానికి బలమైన పునాది అయింది.

అభ్యుదయ కవిత్వంలో భావాలను నేరుగా ప్రకటించడంకన్నా, సంకేతాల ద్వారా సూచించడం ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సంకేతాలే ప్రతీకలు. ఒక దృశ్యం, ఒక రంగు, ఒక శబ్దం సామాజిక అర్థాన్ని సూచించినప్పుడు అది ప్రతీకగా మారుతుంది. ఈ కోణంలో చూస్తే **మహాప్రస్థానం** ప్రతీకల అధ్యయనానికి అత్యంత ప్రాధాన్యమైన కవితా సంపుటిగా నిలుస్తుంది.

ప్రతీకల అధ్యయనం లేకుండా అభ్యుదయ కవిత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

**మహాప్రస్థానం-నిర్వచనం:**

"మహాప్రస్థానం అనేది వ్యక్తిగత ప్రయాణాన్ని మించి, విస్తృత సామాజిక మార్పును సూచించే సామూహిక ప్రయాణ భావన".

ఇది వ్యక్తిగత మోక్షానికి సంబంధించినది కాకుండా, సమాజం మొత్తం మార్పు వైపు సాగాల్సిన దీర్ఘ పోరాటానికి సంకేతంగా మారుతుంది.

**ప్రతీక, ప్రతీకవాదం : భావనాత్మక నేపథ్యం మరియు నిర్వచనం**

ప్రతీక అనేది ఒక పదం లేదా దృశ్యం ద్వారా ఒకకంటే ఎక్కువ అర్థాలను సూచించే కవితా సాధనం.

ప్రతీక, ప్రతీకవాదం అనే పదాలు ఈనాడు తెలుగులో ఆంగ్లంలోని *symbol, symbolism* అనే పదాలకు అనువాదాలుగా ఉపయోగించబడుతున్నాయి. ఆధునిక కవిత్వంలో ఈ పదాలను వినియోగించినప్పుడు పాశ్చాత్య *Symbolist Movement* ను దృష్టిలో ఉంచుకోవడం సాధారణం. సాంప్రదాయ అలంకారశాస్త్రంలో ప్రతీక రూపకం, లాక్షణిక ప్రయోగాలకు సమీపంగా ఉన్నప్పటికీ, ప్రతీకవాద ఉద్యమ కాలంలో ఈ భావన మరింత విస్తృతమైన భావనను సంతరించుకుంది. ఒక పదం తన వాచ్యార్థంతో పాటు, రంగు, ఆకారం, శబ్దసౌందర్యం, కదలిక, సాంస్కృతిక జ్ఞాపకం, సామాజిక అనుభూతి వంటి అనేక భావస్థరాలను కలిగి ఉంటుందన్న అవగాహన ప్రతీకకు కేంద్రంగా మారింది. శ్రీశ్రీ కవిత్వంలో ప్రతీకలు అలంకారంగా మాత్రమే కాకుండా, భావజాలాన్ని నిర్మించే సాధనాలుగా పనిచేస్తాయి. అందువల్ల మహాప్రస్థానంలోని ప్రతీకలను అర్థం చేసుకోవడం అంటే, ఆ కవిత్వం వ్యక్తపరిచే అభ్యుదయ దృష్టిని అర్థం చేసుకోవడమే.

**మహాప్రస్థానంలో ప్రతీకల మూలాలు**

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

శ్రీశ్రీ మహాప్రస్థానం లోని గేయాల్లో తన ప్రతీకలని భారతీయ సాంస్కృతిక వాతావరణం లోనుంచి , ముఖ్యంగా పురాణాలలో పురాణాలు, ఇతిహాసాలు, సంప్రదాయ భావనల నుంచి సంఘటనలు, పాత్రలు, భావనలు, భావాలలో నుంచి తీసుకున్న ప్రతీకలకు ఆయన పూర్తిగా భిన్నమైన అర్థాలను ఆపాదించారు.

అవి సంప్రదాయ భావజాలాన్ని బలపరచడానికి కాకుండా, దానిని ప్రశ్నించే సాధనాలుగా మారాయి. ఉదా: జగన్నాథుని రథచక్రాలలు, గోమాత, శని దేవత, రక్తచక్రపుటిరుసులు, వృకోదరుడు, ధనంజయుడు, వృకోదరుడు, ధనంజయుడు, వైతరణీనది, మహాప్రస్థానం, ఉష్ణ రక్త కాసారం, కాళిక నాలుక వంటివి పుష్కలంగా ఉపయోగించుకన్నారు. సాంప్రదాయిక విమర్శకులు దీనిని శ్రీశ్రీ లోని "సంప్రదాయవాసన' గా అభివర్ణించారు. ప్రతీక వాచ్యార్థాన్ని కాదు, ధ్వన్యర్థాన్ని మోస్తుందన్న దృష్టితో చూస్తే, ఈ ప్రతీకలు తరచూ పురాణ భావనలను తిరగరాస్తాయి. కొందరు మార్క్సిస్టు విమర్శకులు కూడా శ్రీశ్రీ ఇలా చేయకుండా ఉండాల్సిందని విచారాన్ని వ్యక్తం చేసారు.

**మహాప్రస్థానంలో ప్రతీకల (Symbols) విశ్లేషణ**

ప్రతీకాత్మక కవిత్వంలో కవి తన అనుభూతులు, సామాజిక దృక్పథం, రాజకీయ విమర్శ లేదా తాత్విక ఆలోచనలను **వస్తువులు, దృశ్యాలు, చర్యలు, ప్రకృతి అంశాలు** వంటి వాటి ద్వారా ప్రతీకలుగా నిర్మిస్తాడు. ఈ ప్రతీకలు కేవలం అలంకారాలుగా కాకుండా, **అర్థ నిర్మాణ (meaning construction)** లో క్రియాశీలక పాత్రను పోషిస్తాయి. పాశ్చాత్య ప్రతీకవాదంలో ప్రతీకలు ఎక్కువగా వ్యక్తిగత అనుభూతులు, అచేతన మనస్సు, అంతర్ముఖ భావాల చుట్టూ తిరిగితే, శ్రీశ్రీ కవిత్వంలో అవే ప్రతీకలు సామాజిక చైతన్యాన్ని రేకెత్తించే సాధనాలుగా మారాయి.

ప్రతీకవాద కవులు కవిత్వంలోని శాబ్దిక సౌందర్యం, శ్రావ్యతా గుణం, భావనలు ఏ విధంగా ధ్వనింప చేస్తూంది వివరించిన పద్ధతిలోనే శ్రీశ్రీ

"రాబందుల రెక్కల చప్పుడు, పొగ గొట్టపు భూంకార ధ్వని,

ఝుంఝూనిల షడ్జ ధ్వానం కావాలోయ్ నవకథనానికి!"

అంటూ మార్క్సిస్ట్ కవిత్వానికి కావలసిన శాబ్దిక ప్రతీకాత్మకతను నిర్దేశించారు.

మహాప్రస్థానంలో ప్రతీకలు **వ్యక్తిగత భావోద్వేగాలకే కాకుండా సామాజిక–రాజకీయ చైతన్యానికి** ప్రతినిధులు. శబ్దాలు, దృశ్యాలు, కదలికలు అన్నీ కలిసి **విప్లవ కవిత్వాన్ని** నిర్మిస్తాయి.

**పురాణ–సాంస్కృతిక ప్రతీకలు (పురాణ ప్రతీకల పునర్నిర్వచనం)**

మహాప్రస్థానంలో పురాణాలు, ఇతిహాసాల నుంచి తీసుకున్న ప్రతీకలు సంప్రదాయ భావనలను నిలబెట్టవు. 'మహాప్రస్థానం' అనే పదం మహాభారతంలో పాండవుల స్వర్గయాత్రను సూచించినా, శ్రీశ్రీ కవిత్వంలో అది సమసమాజ స్థాపన కోసం సాగాల్సిన దీర్ఘ సామాజిక ప్రయాణానికి ప్రతీకగా మారుతుంది. ఈ గేయంలో కనిపించే ప్రయాణ భావం ఒక వ్యక్తి గమనం కాదు. అది దోపిడీ నుంచి విముక్తి కోసం సాగాల్సిన సామూహిక కదలిక. ఇక్కడ పాండవుల యాత్ర భావం తొలగిపోయి, ప్రజల చారిత్రక ప్రయాణ భావం స్థాపితమవుతుంది. ఈ ఉదాహరణలో మహాప్రస్థానం అభ్యుదయ కవిత్వానికి కేంద్ర ప్రతీకగా మారుతుంది.

'అవతారం' అనే కవితలో 'అవతారం' అనే భావన దైవిక చర్య నుంచి దూరమై, ప్రజలు కలిసి చేపట్టే సామూహిక మార్పు ప్రయత్నానికి సంకేతంగా మారుతుంది. అదేవిధంగా *అవతారం* అనే పదాన్ని భగవంతుని అవతరణ భావన నుంచి దూరంగా తీసుకువెళ్లి, దోపిడీ నిర్మూలన కోసం జరిగే సామాజిక చర్యకు సంకేతంగా ఉపయోగించారు. ఇక్కడ అవతారం వ్యక్తి కాదు; సామూహిక కార్యలక్ష్యం. ఈ గేయంలో ప్రతీకలు వ్యక్తి కేంద్రీకృత ఆలోచనలను తొలగించి, వర్గకేంద్రిత దృష్టిని ముందుకు తెస్తాయి.

**సామాజిక–విప్లవాత్మక ప్రతీకలు**

రక్తం, ఎర్రజెండా, జనసమ్మర్దం, పోరాటం వంటి ప్రతీకలు వ్యక్తిగత వేదనకు పరిమితం కాకుండా, వర్గ చైతన్యాన్ని సూచిస్తాయి. ఎరుపు రంగు ఇక్కడ సౌందర్యానికి సంబంధించినది కాదు; శ్రమ, త్యాగం, విప్లవానికి సంకేతంగా మారుతుంది**.** ఈ ప్రతీకల ద్వారా కవిత్వం వ్యక్తి స్థాయి నుంచి సామూహిక స్థాయికి ఎదుగుతుంది.

శ్రీశ్రీ పాశ్చాత్య కవిత్వంలోని ప్రతీకవాద శిల్పాన్ని మార్క్సిస్టు సందేశాన్ని మేళవించడంలో అనితర -సాధ్యంగా మలచారు. 'నవకవిత' అనే కవితలో ఈ సందేశం కనబడుతుంది. ప్రతీకవాద కవులు రంగుకు గల ప్రతీకాత్మక భావాన్ని విశదీకరించిన పద్ధతిని మార్క్సిస్టు పంథాలో –

సింధూరం, రక్తచందనం,
బంధూకం, సంధ్యారాగం,
పులిచంపిన లేడి నెత్తురూ,
ఎగరేసిన ఎర్రని జెండా,
రుద్రాలిక నయన జ్వాలిక
కలకత్తా కాళిక నాలిక"
-నవకనానికి కావాలంటాడు శ్రీశ్రీ,

**ఆధునిక సాంకేతిక, పారిశ్రామిక ప్రతీకలు**

భారతీయ సాంస్కృతిక వాతావరణం నుండే కాక పాశ్చాత్య సంస్కృతి లోని, భారతీయ విద్య వంతులకు సుపరిచితమైన అంశాల నుండి కూడా శ్రీశ్రీ తన ప్రతీకలను ఏరుకున్నారు.

ఉదా: 'నయాగరా', 'శివసముద్రము'

'అగ్ని కిరీటము', నరక లోకపు జాగిలమ్ములు,
టార్పిడో, టార్నిడో, విషవాయువు, మరఫిరంగి"

మొదలైన ఆధునిక సాంకేతిక వాతావరణం నుంచి ఎగిరే లోహశ్చేనం, వికసించిన విద్యుత్తేజం లాంటి ప్రతీకలను ప్రౌఢంగా ఎన్నుకొని ప్రయోగించి పారిశ్రామిక ప్రపంచాన్ని కవిత్వంలోకి తీసుకువచ్చాయి. ఈ విధంగా కవిత్వం గ్రామీణ–ప్రకృతి పరిమితులను దాటి ఆధునిక జీవితాన్ని ప్రతిబింబించింది.

యంత్రాలు, లోహాలు, విద్యుత్తు, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ వంటి సాధారణ వస్తువులు కూడా మహాప్రస్థానంలో ప్రతీకలుగా మారతాయి. **ఇలా సాధారణ వస్తువులు కవిత్వంలో ప్రవేశించడం ద్వారా కవిత్వానికి అర్హమైన అంశాల పరిధి విస్తరించబడుతుంది.** ఇవి పారిశ్రామిక జీవితం, కార్మికుల శ్రమ, ఆధునిక సమాజపు వాస్తవికతకు సంకేతాలుగా పనిచేస్తాయి. ఈ విధంగా కవిత్వం ప్రకృతి పరిమితులను దాటి ఆధునిక జీవితాన్ని అంగీకరిస్తుంది. అందువల్ల ప్రతీకాత్మక కవిత్వం పాఠకుడిని సహ రచయితగా మారుస్తుంది.

**సామాజిక–రాజకీయ ప్రతీకాత్మకత**

ఆధునిక కవిత్వంలో ప్రతీకలు వ్యక్తిగత భావాలకన్నా ఎక్కువగా **సామూహిక అనుభవాలను** ప్రతిబింబిస్తాయి. రక్తం, ఎర్రజెండా, జనసమ్మర్ధం, పోరాటం వంటి ప్రతీకలు వ్యక్తిగత వేదనకు పరిమితం కాకుండా, వర్గ చైతన్యాన్ని సూచిస్తాయి. నవకవితలో ఎరుపు రంగు ఇక్కడ సౌందర్యానికి సంబంధించినది కాదు; శ్రమ, త్యాగం, విప్లవానికి/విప్లవ చైతన్యానికి సంకేతంగా మారుతుంది. ఈ ప్రతీకల ద్వారా కవిత్వం వ్యక్తి స్థాయి నుంచి సామూహిక స్థాయికి ఎదుగుతుంది. దీనినే

" నూటెక్కిన గంధక ధూమం,
పోటెత్తిన సప్త సముద్రాల్,
----------------------
చెలరేగిన జనసమ్మర్ధం
కావాలోయ్ నవకథనానికి"

అంటూ విప్లవ చైతన్యాన్ని కలిగించగలిగిన దృశ్య స్వరూపాలను ఉదాహరణగా పేర్కొన్నారు.

- "రక్తం" → త్యాగం/విప్లవం/అణచివేత
- "చీకటి" → అజ్ఞానం/దోపిడీ వ్యవస్థ

- "వెలుగు" → చైతన్యం / విముక్తి

ఇక్కడ ప్రతీకలు **సామాజిక వాస్తవికతను (social reality)** సంకేత రూపంలో ప్రతిపాదిస్తాయి. ఇది ప్రతీకాత్మక కవిత్వాన్ని సాహిత్య–సామాజిక విమర్శగా మారుస్తుంది.

ఈ రంగు ప్రతీక మార్క్సిస్టు భావజాలంలో ఉన్న విప్లవ చిహ్నాలతో అనుసంధానమై, కవిత్వానికి స్పష్టమైన సామాజిక దిశను ఇస్తుంది. ఈ విధంగా ప్రతీకవాదం–మార్క్సిజం మేళవింపు మహాప్రస్థానంలో సహజంగా ఏర్పడింది.

మహాప్రస్థానంలో ప్రతీకల అధ్యయనం కేవలం శిల్ప విశ్లేషణకే పరిమితం కాకుండా, అభ్యుదయ కవిత్వ స్వభావాన్ని అర్థం చేసుకునే ముఖ్యమైన పరిశోధనాత్మక అంశంగా నిలుస్తుంది. ప్రతీకల ద్వారా శ్రీశ్రీ సమాజ మార్పు ఆలోచనను కవిత్వంగా మలిచాడు.

*ఓ కవితా! ఓ కవితా!* వంటి గేయాల్లో అచేతన మనస్సు నుంచి వచ్చే దృశ్యాలు కూడా సామాజిక చైతన్యంతో ప్రతీకలుగా రూపాంతరం చెందుతాయి. అయితే ఇవి పూర్తిగా వ్యక్తిగత మనోవ్యవహారాలకు పరిమితం కాకుండా, సామాజిక చైతన్యంతో అనుసంధానమవుతాయి. ఈ విధంగా సర్రియలిస్టు ధోరణి కూడా అభ్యుదయ భావజాలంలోకి మిళితమవుతుంది.

ప్రతి ఉదాహరణంలోనూ ఉదాహరణలన్నింటిలోనూ గమనించదగిన అంశం ఏమిటంటే, ప్రతి ప్రతీక ఒకే దిశలో — సామాజిక చైతన్యం వైపే — పనిచేస్తుంది. అందువల్ల మహాప్రస్థానంలోని ప్రతీకలు యాదృచ్ఛికంగా కాకుండా, స్పష్టమైన భావజాల లక్ష్యంతో నిర్మించబడ్డవిగా కనిపిస్తాయి.

**పాశ్చాత్య ప్రతీకవాద ప్రభావం**

బాడ్లేర్, మలార్మే, టి.ఎస్. ఎలియట్ వంటి పాశ్చాత్య కవులు ప్రతీకవాదంలో చేసిన ప్రయోగాలను శ్రీశ్రీ లోతుగా అధ్యయనం చేశారు. అయితే ఆ శిల్పాన్ని అనుకరణగా కాకుండా, తెలుగుదనం ఉట్టిపడేలా ప్రతీకవాద శిల్పాన్ని మార్క్సిస్టు సందేశంతో మేళవించిన తీరు ఆయన కవిత్వాన్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది.

**సర్రియలిజం మరియు అచేతన మానస ప్రతీకలు**

ప్రతీకవాద ఉద్యమానికి దోహదం చేసిన ధోరణి సర్రియలిజం లేదా అధివాస్తవిక ధోరణి. ఇది ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ సిద్ధాంత ప్రభావంతో ఏర్పడింది. కవి తన అచేతన మనస్సులోని స్వప్నసదృశ్య అనుభూతులను ప్రతీకలుగా కవిత్వంలో వ్యక్తీకరించడమే ఈ ధోరణి లక్ష్యం. *ఓ కవితా! ఓ కవితా!* వంటి కవితల్లో శ్రీశ్రీ ఈ అచేతన మానస స్థితిని వ్యక్తపరుస్తూనే, దానిని పూర్తిగా సామాజిక దృక్పథంలోకి మళ్లించారు.

**ఆధునిక సాంకేతిక ప్రతీకలు**

శ్రీశ్రీ ప్రతీకల మూలాలు భారతీయ, పాశ్చాత్య సంస్కృతులతో పాటు ఆధునిక సాంకేతిక వాతావరణంలోనూ విస్తరించాయి. నయాగరా, శివసముద్రం వంటి ప్రకృతి దృశ్యాలు, టార్పిడో, టార్నిడో, విషవాయువు, ఎగిరే లోహశ్యేనం, వికసించిన విద్యుత్తేజం వంటి ప్రతీకలు

**ముగింపు**

శ్రీశ్రీ మహాప్రస్థానంలో ప్రతీకలు అలంకారాలుగా కాకుండా, భావనాత్మక నిర్మాణాన్ని నిర్వహించే కీలక సాధనాలుగా పనిచేస్తాయి. భారతీయ సంప్రదాయం, పాశ్చాత్య సంస్కృతి, ఆధునిక సాంకేతిక ప్రపంచం అనే మూడు ధారలను సమన్వయం చేస్తూ, అభ్యుదయ భావజాలాన్ని స్పష్టంగా ధ్వనింప చేయడంలో ఈ ప్రతీకలు కీలక పాత్ర పోషించాయి. మహాప్రస్థానంలోని ప్రతీకల విశ్లేషణ ఆధునిక తెలుగు అభ్యుదయ కవిత్వాన్ని అర్థం చేసుకునే పరిశోధనాత్మక అవకాశాలను విస్తృతంగా చేసిందని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు

1. మహా ప్రస్థానం – శ్రీశ్రీ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, మే, 2012.
2. తెలుగు సాహిత్య సమీక్ష – రెండవ సంపుటం, డాక్టర్ జి.నాగయ్య, నవ్య పరిశోధక ప్రచురణలు, చతుర్థ ముద్రణ, ఆగష్టు, 2004
3. అధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు: ప్రయొగములు – డా. సి. నారాయణరెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ఏడవ ముద్రణ, నవంబరు,2011.
4. తెలుగు సాహిత్య చరిత్ర – డాక్టర్. ద్వా. నా. శాస్త్రి, ప్రగథి పబ్లిషర్స్, హైదరాబాదు, పరివర్ధిత చతుర్థ ముద్రణ, జూన్, 2008.
5. వర్గ కవి శ్రీశ్రీ – హనుమారెడ్డి బి, శ్రీలక్ష్మి ప్రెస్, గుంటూరు, ప్రథమ ముద్రణ, 2014.
6. తెలుగు సాహిత్య చరిత్ర – ప్రొఫెసర్ వెలమల సిమన్న – దళితసాహిత్య పీఠం, విశాఖపట్నం మూడో ముద్రణ, 2014

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## సగం తెరిచిన తలుపు – జీవిత గమ్యానికి మలుపు

డా. పరుచూరి విజయలక్ష్మి,
ప్రభుత్వ మహిళా కళాశాల (స్వ.ప్ర) గుంటూరు,
7702519119

కథ, కవిత, విమర్శ రంగాలలో సాహితీ త్రిముఖుడుగా పేరుపొందిన అగ్రశ్రేణి రచయిత డా.పాపినేని శివసంకర్ గారు. వీరుగుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం నెక్కల్లు గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మిచారు. గుంటూరు జె కె సికళాశాలలో, ఆంధ్ర యూనివర్సిటీ పిజి సెంటర్ నల్లపాడులో ఉన్నత విద్యాభ్యాసం చేసారు.సాహిత్యం- మౌలిక భావనలు" అనే విషయం మీద పరిశోధన చేసి ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుండి పిహెచ్.డి పట్టా తో పాటు గోల్డ్మెడల్ సాధించారు. తాడికొండ బి ఎస్.ఎస్ బి కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్ గా చేసి పదవీ విరమణ పొందారు.
స్తబ్దత-చలనం, ఒక సారాంశం కోసం, ఆకుపచ్చని లోకంలో, ఒక ఖడ్గం - ఒకపుష్పం, రజనీగంధ కవితా సంపుటాలు, మట్టిగుండే, సగం తెరిచిన తలుపు, కథా సంపుటాలు, సాహిత్యం-మౌలిక భావనలు, నిశాంత, తల్లీ నిన్ను దలంచి, ద్రవాదునికత అనే విమర్శ గ్రంధాలు వెలువరించారు. వీరి సహ సంపాదకత్వం లో వార్షిక కథ, కవితా సంకలనాలు వెలువడుతున్నాయి. కవితా!ఓకవితా!, విస్మృత కథ, రైతుకవిత సంకలనాలకు ముఖ్య సంపాదకులు.

వీరి రజని గంధ రచనకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందారు. దానితోపాటుగా ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డ్, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, విశాలాంధ్ర, నాగాబైరవ కలాపీఠం మొదలైన సంస్థల పురస్కారాలు పొందారు. దేవరకొండ బాలగంగాధర తిలక్, ఆవత్స సోమసుందర్ కవితా పురస్కారాలు మొదలైన ఎన్నో పురస్కారాలు పొందారు.

వీరు రచించన "సగం తెరిచిన తలుపు"కథా సంపుటిలోని కొన్ని కథలను ఇక్కడ పరిశీలిద్దాం. ఇందులో ఈనాటి కాలానికి సరిగ్గా అతికే కథ "ఒక్క వానకోసం" తాత పంటలు పండే వాన కోసం ఎదురు చూస్తున్నాడు. మనవడు కాసుల వాన కోసం ఎదురుచూడటం కాదు, ఆ వానకోసం పరుగులు పెడుతున్నాడు . రెండుతరాల జీవన విధానంలో వచ్చినమార్పు. మనవడు తండ్రి పెంపకంలో పదవతరగతి నుంచే పరుగు మొదలు పెట్టాడు. చదువు తప్ప ఇంకేమి పట్టించుకోకూడదు.ఆటపాటలు స్నేహితులు ఆహ్లాదాన్ని అన్నింటినీవదులుకోవాలి. అప్పుడే అందరికంటే ముందు పరుగెత్తి నల్లమబ్బుల కింద నిలబడగలం ముద్దముద్దగా తడవగలం.అంటూ పరుగెత్తడమే లక్ష్యంగా

పెంచాడు.మనవడితో పాటు పరుగెత్తుతున్న రూమ్మేట్ ఉన్నట్లుండి బోర్లా పడ్డాడు.ఒకరాత్రిపూట తన పరుగు ఆపి సీలింగ్ ఫ్యాన్ కి వేలాడబడ్డాడు. పరిగెట్టడం కంటే వేలాడడమే నయమనుకున్నాడేమో

ప్రస్తుత సమాజంలో పిల్లలు పడుతున్న వత్తిడి మనకకళ్ళెదుట పెట్టారు.ఇప్పటి విద్యా విధానానికి ప్రతీక ఈ కథ. చదువు మార్కులు రాంకులు తప్ప అసలు పిల్లల ఆలోచనలేంటి కోరికలేంటి అని తలిదండ్రులే పట్టించుకోవడం లేదు. కాలేజీలేమో రాంకులు తెచ్చిపెట్టే బంగారు బాతుల్ల చూస్తూ వత్తిడి పెడుతూ విద్యావ్యాపారం చేస్తూ ఎలా సంపాదిస్తున్నారో ఒకసారి ఆలోచించండి అని చెబుతుంది కథ.

"పోటీ ఇందిరా నీ మొహం ఈ నేలమీద ఎవడికుండే చోటు వారికుంటుంది.ఎవుడికెవడు పోటీ గాదు.ఎక్కువ తక్కువలు పెపంచకంలోమామూలె అని చెబుతాడు తాత. అందుకే తాత అన్ని సం|| లు వచ్చినా ప్రశాంతంగా ఆరోగ్యంగా ఉండడం జరిగింది. చివర్లో మనుమడు అనుకుంటాడు. తాత తన జీవితంలో ఎప్పుడు దేనికి ఆందోళన పడలేదు.దేనికీ అసంతృప్తి చెందలేదు. ఆయన ఉన్న దానికి లేనిదానికి తపించలేదు. సంతృప్త జీవి తాతయ్య. ఆయన కోల్పోయిందేమిటి? నేను పొందినది ఏమిటి? అని ఆలోచించుకొని సమాధానం పొందుతాడు.డాలర్ల వేటలో ఎండమావుల వెంట పరుగెత్తే క్రమంలో కోల్పోతున్న విలువలు ,మానవ సంబంధాలపై దృష్టి సారించండి అని చెప్పే కథే "ఒక్క వానకోసం".
చివరి పిచ్చుక కథలో మానవుడు తన సౌకర్యాల కోసం నివాసాలకోసం, ప్రకృతిని ఏవిధంగా ధ్వంసం చేస్తున్నాడో చెబుతుంది.భూ సారాన్ని మింగేస్తూ రుచి పచి లేని పంటలు పండిస్తూ, పురుగుమందులతో నిండిన ఆహారాన్ని తింటూ తానేదో పొందాలనే ఆరాటంలో చిన్నప్రాణుల ఉనికి లేకుండా చేస్తున్నాడు నేటిమానవుడు. బహుసా ఈ రోబో 2.0 సినిమాకు ఈ కథకూడా దోహదం చేసి ఉండవచ్చేమో? పొద్దుటే కిచకిచ మంటూ నిద్రలేపే పిచుకలు కాంక్రీటు వనములో నిలువనీడ లేక, కల్తి లేని పంట లేక కనుమరుగైన విధానాని వర్ణించాడు కవి. మానవుడు ప్రకృతిని నాశనం చేస్తే ఆ ఎడారిలోనే బ్రతకాలని శపించిన పిచ్చుకమాటల ద్వారా అయినా మేల్కొని ప్రకృతిని రక్షిస్తూ మానవుడు రక్షణ పొందాలనేది కవి ఆరాటం.

ఈరోజు డర్టీ ఇండియా అన్నవాడు రేపు డర్టీ ఇండియన్ వైఫ్ అనడా? బ్రతుకు తెరువుకోసం అమెరికా పోవచ్చుకాని పుట్టి పెరిగిన దేశం మీద భక్తి లేకపోతే ఎట్లా? అనే ప్రశ్న తోనే జవాబు చెప్పిన కథ "డాలర్ మోహము అను అమెరికా పెళ్లి సంబంధము".
విధ్వంసమవుతున్న రైతు జీవితంలోని సంఘర్షణని రాజకీయ ఆర్థిక అంశాలతో ముడిపెట్టి ప్రకృతికి దూరమవుతున్న జీవితాన్ని తెలిపే కథ"చింతల తోపు"

కథాసంపుటికి పెట్టిన పేరుతో ఉన్న కథ "సగం తెరిచిన తలుపు" రామకృష్ణ పల్లెనుంచి పట్టణానికి వచ్చి ఒక ఎడిటర్గా ఉద్యోగం చేస్తున్నాడు. చుట్టూ అందరూఉన్నా బాల్యంలోని తాజాదనం యౌవ్వనం లోని చురుదనం, మెల్లమెల్లగా ఇగిరిపోవడం చాన్నాల్లదాకా గుర్తించలేదు రామకృష్ణ. గుర్తించిన తరువాత తీరని అశాంతి మిగిలింది. రామకృష్ణకు ఎప్పుడు ఒక కల వస్తుంటది.ఆ కలలో ఒకగది. కిటికీలు లేవు. సగంతెరిచిన తలుపు. లోపల ఏముందో తెలియదు కనుచీకటి. తలుపు పూర్తిగా తెరవడానికి సంకోచం. లోపలికి అడుగు వెయ్యటానికి బెరుకు.లోపల ఏముందో చూడాలని ఉన్నా సాధ్యంకాదు. తలుపు బిగుసుకుపోయింది. ఇంతకి వెలుతురు రాదు. లోపలి వ్యక్తి కనిపించాడు. విచిత్రమైన కల. ఈ కలే ఈ కాలంలో హృదయతలుపులు మూసుకున్న మనిషికి ప్రతీకగా చెప్పారు కవి. ఈనాటి జీవితాలు అవేకదా. అహంకారాలతో, స్వార్థాలతో నిండిపోయిన మనిషి కథ ఇది.వాచ్యంలో ఇది కలగా అనిపిస్తుంది కాని ఇది మనిషి అంతర్లీన మానసిక ఆలోచన. ఆతలుపు తెరిచి రామకృష్ణ లోపలున్నదానిని ఎలా చూసాడు అన్నదే ఈకథ.

తనస్నేహితుడి కూతురు పెళ్లి శుభలేఖతో పాటు తమ్ముడి ఆరోగ్య బాగాలేదు అనేకబురు అందుకుంటాడు రామకృష్ణ. ఆవిషయం భార్యకుచేబితే, స్నేహితుడి కూతురు పెళ్లి అంటున్నారుకదా! వెళ్ళిరండి. అక్కడవరకు వెళ్లి మీ తమ్ముడి ఇంటికి వెళ్ళకపోతే బాగోదు కనుక పలకరించి రండి అని చెబుతుంది. అన్నదమ్ముల సంబంధం ఎప్పుడో తెగిపోయింది కదా! అంటాడు అపుడు రామకృష్ణ కూతురు "తెగిపోయిన వాటిని ముడేసుకో కూడదా నానా!" అనడిగితే తల్లి తండ్రి ఆ మాటకు ఆశ్చర్యపోతారు. ఆ ఆలోచనను ఆమోదించలేక "ఒకవేళ వాళ్ళు మన అభిమానాన్ని అందుకోకపోతే"అనడుగుతాడు. వెంటనే కూతురు నర్మద"అప్పుడది వాళ్ళ తప్పవుతుంది.అసలు అభిమానమే చూపకపోతే అది మన తప్పేగదా!" అంటుంది బంధాలు కావాలి అనుకుంటే అహంకారాన్ని వదలాలి.అనేమాట చిన్న పాప మాటలో కనిపిస్తుంది. వెంటనే రామకృష్ణ తమ్ముడి దగ్గరకు వెళ్లి వాళ్ళు పంచిన ప్రేమలో కరిగిపోతాడు. ఇన్నాళ్ళు ఈ బంధాలకు దూరమయ్యాను కదా అని బాధపడతాడు. స్నేహితులతో కలిసి పాతజ్ఞాపకాలు పంచుకుంటూ హాయిగా చెరువులో ఈదుతూ తననుంచి తానే విముక్తమవుతూ ఆనందములో మునిగిపోతాడు.

నేటి సమాజంలో చిన్నచిన్న అభిప్రాయ భేదాలతో బంధాలు తెంచేసుకుంటున్నారు కాని తెగిన బంధాలను ముడివేసుకుంటే జీవితం ఎంత ఆనందంగా ఉంటుందో తెలిపే కథ ఇది. "సహితస్య హితం భావం సాహిత్యం" అనే మాటకు అర్థానిచ్చిన కథ.

"సముద్రం" అనేకథ. ఒక అల్జీమర్స్ వ్యాధి బారిన పడిన స్నేహితుడికి గతాన్ని గుర్తుచేయడం ప్రధాన అంశ ముగా కనిపిస్తుంది. కానీ జ్ఞాన వారసత్వాన్ని పంచుకునే వాళ్ళు లేక విలవిలలాడిన ఒక తండ్రికథ. ఇందులో ఉన్న స్నేహితుడు పుస్తకమాలి. పుస్తకాలతోనే గడిపిన వ్యక్తి. భార్య ఉన్నంతకాలం అతడికి ఏ లోటు తెలియలేదు. కాని భార్య మరణించిన తరువాతే జీవిత బాధలు తెలిసాయి. ఆయన కూతురు ఉత్తరం రాస్తూ "డాడి! నువ్వు గొప్ప వాడివి కావచ్చు కాని పిల్లలని గొప్పవాళ్ళని చెయ్యాలి గదా! సాటివాళ్ళంతా ఆర్థికంగా మెట్టుమెట్టుగా పైకెదుగుతుంటే నువ్వు అప్పటి టికి ఇప్పటికి అదే మెట్టుమీద కూలబడి దిక్కులు చూస్తున్నావు. అదే మెట్టుమీద ఉన్నవాళ్లకే నన్నిచ్చి చేశావు.ఏం సుఖ పడ్డాను. చాలి చాలని బతుకు. ఏ కోరికలూ తీరవు. ఎన్నటికీ పైమెట్టు ఎక్కలేని నిస్సహాయత. నిన్నిప్పుడు ద్వేషించలేను. అలాగని ప్రేమించనూ లేను".అని రాస్తుంది అది చూసి మెట్టంటే ఏమిటి? అని అడిగి,.ఆర్థిక సోపానాలు తప్ప ఇంకేమెట్లు లేవా? అని, నేనున్న మెట్టుమీద నన్ను నన్నుగా నా కన్నకూతురు ఆమోదించలేక పోయింది.అని బాధపడతాడు.. ఇక కొడుకు ఖండాంతరాలలో తల్లితో మాట్లాడటానికి కూడా తీరికలేని సంపాదనా పరుడు. అతడికి సంపాదనా పరుగు తప్ప ఇంకేమి పట్టదు.అలా ఆలోచిస్తూనే అనా రోగ్యంతో మరనానినికి దగ్గర పడుతూ ఈ సముద్రాన్ని ఎక్కడ పారబోయను? అని అడుగుతాడు. చివరికి మరణిస్తాడు.

ఇది ఈనాటి చాలామంది తలిదండ్రుల కథ. "మనుషులు అనంత దూరంలో ఉన్నా మనసుల్ని తాకుతూ మాట్లాడోచ్చు.దూరం కావటమే మనకు తెలుసు. దూరంగా ఉండీ దగ్గర కావటం తెలియదు" అంటాడు కవి ఇది కానలేని నిజం. ఇక వారసత్వం అంటే సంపద (ఆస్తులు) మాత్రమే అనుకుంటున్నారు కాని జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయం కుడా వారసత్వమే అని ఎవరూ అనుకోవడం లేదు. ఈ స్నేహితుడి దగ్గర ఉన్న పుస్తకాలు గాని, జ్ఞానానికి కాని ఎవరు వారసులు లేరు. అందుకే ఈజ్ఞాన సముద్రాన్ని ఎక్కడ పారబోయాను అంటాడు ఎంతటి విషాదమో కదా! ఈనాడు గతితప్పుతున్న యువత ఆలోచనా విధానాన్ని ఆవిష్కరించిన కథ ఇది.

ఒకప్పుడు అగ్ర కులాలలోనే కొంతమంది ఆడపిల్లలు చదువు కోనేవారు కాలంమారింది ఇపుడు అందరు ఆడపిల్లలు చదువులో ముందడుగు వేస్తున్నారని సంతోషంతో రాసిన కథ "బళ్ళు ఓడలు"కథ. ఒక ఉపాధ్యాయుడుగా తన అనుభవంతో రాసిన కథ ఇదని చెప్పవచ్చు. మార్పు సమాజానికి చాలా అవసరమని సూచించే కథ.

శరీరం మాత్రమే జీవితం అనుకుంటూ పదిహేడేళ్ళు కాపురం చేసిన భార్య శరీరం ఒదులైందని మరో స్త్రీని కాం క్షించి ఆమెను లోబరుచుకోవాడానికి ప్రయత్నిస్తున్న చక్రపాణి బారినుండి స్థిరమైన ఆలోచనతో తప్పించుకున్న మధుబాల కథే "మనుషులు వొదులవుతారు". శరీరం కన్నా మానసిక ప్రేమాను బంధమే ముఖ్యమని చెప్పే కథ.

సాఫ్ట్వేర్ ఉద్యోగాలలోని డొల్లతనాన్ని, అక్కడ ఒకరిని పడగొట్టి మరొకరు ఎదగాలనుకొనే రాజకీయాలను, సంపాదనకి బానిసలై జీవితాన్ని జయిస్తున్నామన్న భ్రమలో కూరుకుపోయి క్షణిక సుఖాల కోసం జీవితాల్ని నాసనంచేసుకుంటున్న ఆధునిక యువత ఆర్తిని ద్రుస్యమానం చేసే కథ " వర్చ్యుయల్ రియాలిటి".

శారీరక పవిత్రత కన్నా మానసిక పవిత్రతే ముఖ్యం, తన ప్రమేయం లేకుండా ఎవడో ఆమె శరీరంమీద దాడి చేస్తే అది ఆమె తప్పా? దానికి జీవితాంతం చెడిపోయింది అనే నిందమోస్తూ బ్రతకడం సమాధానం కాదు అని స్త్రీని అర్ధం చేసుకొని వివాహం చేసుకోవడానికి ముందుకొచ్చిన యువకుడికథ. అదేవిధంగా జరిగినదానికి బాధపడకుండా "అప్పుడు పిరికి తనంతో ఎందుకు అబలనైపోయానా అని విచారిస్తున్నాను" అని తనకు జరిగిన దానిని తెలిసి అర్ధం చేసుకోగలిగిన వాడినే వివాహం చేసుకుంటానని ధైర్యంగా చెప్పిన యువతికథ "సుశీల" ఈ కథ ద్వారా ఆడపిల్లలు ఆత్మ స్థైర్యాన్ని కోల్పోకుండా తమ ప్రమేయం లేకుండా తమీద జరిగిన దాడిని తాట్టు కొని ఎదురునిలిచి బ్రతికి చూపించాలేకాని పిరికితనంతో పారిపోకూడదు అనే చైతన్యాన్ని స్త్రీలలోకలిగిస్తుంది సుశీల.
ఈ విధంగా సగం తెచిన తలుపు కథా సంపుటిలోని కథలన్ని సమాజంలో జరుగుతున్న విషయాలను, సమస్యలను తీసుకొని విశ్లేషిస్తూ, సమస్యా పరిష్కారాలను, వాచ్యంగానో, ధ్వన్యాత్మకంగానో తెలియజేస్తూ సమాజాన్ని మేల్కొలపడానికి పాపినేని శివ శంకర్ గారు చేసిన ప్ర్రయత్నమిది. సాహిత్యం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమాజ హితానికి, సమాజాన్ని మేల్కొలపడానికి ఉపయోగపడుతుంది అనేమాటను నిజం చేసిన సాహితీ త్రిముఖుడు శివ శంకర్ గారు.

**ఆధార గ్రంథాలు:**

సగం తెరిచిన తలుపు కథా సంపుటి.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# తెలుగు కథాసాహిత్యంలో స్త్రీల గిరిజన కథలు

**డా. గుగులోతు పూల్ సింగ్**
పరిశోధకుడు ,సూర్యాపేట ,తెలంగాణ
సెల్: 9866217572
Email: poolsinghgugulothu12@gmail.com

గిరిజనులు కొండకోనల్లో జీవించే ఆదిమ జనం. వేల ఏళ్లుగా అడవులు, కొండ ప్రాంతాలు, నదీతీర ప్రాంతాల్లో జీవిస్తున్నారు. నాగరిక ప్రపంచానికి దూరంగా ప్రకృతిలో కలిసి మనుగడ సాగిస్తున్నారు. పోడు వ్యవసాయమే వీళ్ల జీవనాధారం. అడవుల్లో దొరికే ఆకులు అలములు, దుంపలు, తేనెల్ని ఆహారంగా తీసుకుంటున్నారు. గుంపులు గుంపులుగా కలిసి బతుకుతున్నారు. అడవుల్లోనే నివాసం ఏర్పర్చుకున్నారు. అనేక గుంపులు కలిసి 'తెగ' లేదా 'గణం'గా ఏర్పడ్డాయి. వీళ్లను భారత ప్రభుత్వం తెగలుగా గుర్తించింది. వీళ్లంతా గిరిజనం. ఆదిమ తెగలు.

'గిరిజనులు' పదంలో 'గిరి' అంటే 'కొండ'. 'జనులు' అంటే 'ప్రజలు', కొండ ప్రాంతాల్లో నివసించే వాళ్లని అర్థం. గిరిజనుల్నే ఆదివాసీలుగా వ్యవహరిస్తారు. 'ఆది' అంటే మొదట. 'ఆదివాసులు' అంటే మొదటి నుంచి భూమిపై ఉన్న వాళు - ఆంగ్లంలో గిరిజనులకు సమానార్థకం TRIBE ఈ పదం TRIBUS అనే లాటిన్ పదం నుండి ఏర్పడింది. ఈ పదాన్ని మొదట రోమన్లు క్రీ.పూ.241లో వాడారు. TRIBE అనే పదం బైబిల్లో 'గోత్రము' అర్థంలో ప్రయోగించారు. గోత్రము అంటే 'వంశము', 'పేరు', 'అడవి', 'కొండ' అని శబ్ద రత్నాకరంలో అర్థాలు.(బహుజనపల్లి సీతారామాచార్యులు, 1996, పు.329)

గిరిజనులకు పర్యాయంగా 'ఆటవికులు', 'నిషాదులు', 'అనాగరికులు' అని వ్యవహరిస్తున్నారు. ప్రాచీన మహాభారతం, కుమార సంభవం, పండితారాధ్య చరిత్ర, శివరాత్రి మహాత్మ్యం, హరవిలాసం, భోజరాజీయం, శృంగార శాకుంతలం, సింహాసన ద్వాత్రింశిక, మనుచరిత్ర, ఆముక్త మాల్యద, రామాభ్యుదయం, శ్రీకాళహస్తి మహాత్మ్యం, వాల్మీకి చరిత్రం, పంచతంత్రం, కథాసరిత్సాగరం, విష్ణుపురాణం, కాదంబరి, హర్షచరిత్ర మొదలైన ప్రాచీన తెలుగు సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన కన్పిస్తుంది. ఆయా కావ్యాలు, ప్రబంధాల్లో గిరిజనుల ఆచార సంప్రదాయాలు, సంస్కృతి కన్పిస్తాయి.

చరిత్ర పొడవునా ఆదివాసీలు, గిరిజనుల నెత్తురు చిందని పోరాటం లేదు. వాళ్ల చెమటా, నెత్తుటితో తడవని నేల లేదు. జల్, జంగల్, జమీన్, ఇజ్జత్ కోసం వాళ్లు పోరుబాటను ఎంచుకున్నారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా మొట్టమొదట పోరాడింది గిరిజనులే. తొలి తిరుగుబాటు బావుటాలెగరేసింది గిరిజనులే. ఇవి చరిత్రకెక్కని చరితార్ధ పోరాటాలు. ఈ నేల విముక్తి కోసం గొంతెత్తి నినదించిన ఉద్యమాలు, ఊపిరినే ఉప్పెనగా మలిచి పోరుకెటాలై గర్జించారు

**1.తెలుగు సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన :**

తెలుగు సాహిత్యానికి వెయ్యేళ్ల చరిత్ర ఉన్నది. రాతపూర్వకంగా ఉన్న సాహిత్యం క్రీ.శ. 11వ శతాబ్దం నుంచే లభిస్తున్నది. అంతకంటే వేల ఏళ్ల ముందే మౌఖిక సాహిత్యం ఉన్నది. ఆ సాహిత్యంలో ఆనాటి ప్రజల జీవితం, సంఘర్షణ ఉన్నది. సాహిత్యం ఆయా కాలాల నాటి, రాజకీయ, ఆర్థిక, సాంఘిక ప్రతిబింబిస్తుంది. లిఖిత సాహిత్యానికి మూలం మౌఖిక సాహిత్యమే. ప్రజలు సాహిత్యాన్ని వేల ఏళ్లుగా మౌఖిక రూపంలోనే ఒక తరం నుంచి మరో తరానికిఅందించారు. చాళుక్యుల కాలం నుంచే తెలుగు భాషలో సాహిత్యం లభ్యమవుతోంది. సంప్రదాయ సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన అనేక గ్రంథాల్లో కన్పిస్తుంది.

తెలుగు సాహిత్యంలో రామాయణం, మహాభారత కావ్యాల్లో, శివకవి యుగానికి చెందిన 'బసవ పురాణం', 'పండితారాధ్య చరిత్ర' వంటి కావ్యాలలో గిరిజనుల ప్రస్తావన కనిపిస్తుంది. దీనివల్ల గిరిజనుల స్వరూపం జీవన విధానం, సమాజంలో స్థానం తెలుసుకునే అవకాశం ఉంది.నన్నయ, తిక్కన్న, ఎర్రన వ్యాస మహాభారతాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించారు. 'ఆంధ్ర మహాభారతం' ఆదిపర్వం ద్వితీయ శ్వాసం గరుడ ప్యాఖ్యానంలో నిషాదుల ప్రస్తావన ఉంది. నిషాదులు అనే మాట గిరిజనులకు సమానార్థంగా ప్రయోగించారు.

**2.ఆధునిక తెలుగు కథలో గిరిజనుల ప్రస్తావన పరిచయం :**గిరిజన, సంచార జాతుల గురించి మొట్టమొదటి సారిగా చింతా దీక్షితులు కథ రాశాడు. సుగాలి కుటుంబం' (1920), 'చెంచు దంపతులు' (1922), 'చెంచురాణి' (1925) కథలు గిరిజన జీవితాల నేపథ్యంలో రాశాడు. 'చెంచురాణి' కథ గిరిజన మహిళ జీవిత నేపథ్యంలో నుంచి రాశాడు."సాహు, దాశరథి రంగాచార్యులు, అరుణ, కేశవరెడ్డి, పులుగు శ్రీనివాస్, సాధన, అప్పల్నాయుడు, మంజరి మొదలైన రచయితలు గిరిజన జీవితాన్ని, పోరాటాన్ని వస్తువుగా తీసుకొని నవలా రచనకావించారు"(తెలుగు కథాసాహిత్యం-గిరిజన జీవితం: డా. జి.శైలమ్మ, 2021, పు.61)తరతరాలుగా పితృస్వామ్య వ్యవస్థ స్త్రీలను అణచివేతకు గురిచేస్తోంది. ఆనాటి ఆంగ్లేయులు గిరిజన స్త్రీలను శారీరక సుఖాలకోసం వినియోగించుకొనేవారు. తర్వాత వాళ్లను వదిలించుకునేవాళ్లు. అట్లా ఒంటరిగా మిగిలిన గిరిజన స్త్రీలను అడవుల్లోని ఆదివాసీ సమూహాలు చేరదీసేవి, ఆశ్రయమిచ్చేవి. ఈ కథలో 'చెంచురాణి' అనే 'లచ్చి' జీవితంలో లైంగిక దోపిడీ జరిగింది. ఈ సంఘటన కేంద్రంగా రాసిన కథ ఇది.

'సుగాలి కుటుంబము' కథ తీవ్రమైన కరువును చిత్రించిన కథ. కరువు వల్ల గిరిజనం జీవితాలు ఎంత కల్లోలానికి గురవుతాయో చెప్పిన కథ. ఒకవైపు కరువు, మరోవైపు గిరిజనులపై మైదాన ప్రాంతవాసుల దౌర్జన్యం గురించి చిత్రించాడు.ఈ కథలో రూపాల్ నాయక్, చంద్రి భార్యాభర్తలు. కూలీలుగా పనిచేస్తున్నారు. ఓ ఏడాది తీవ్రమైన కరువు వచ్చింది. పనులు దొరకడం కష్టమైంది. దీంతో అడవుల్లో చింతగింజలేరుకొని వాటితో గంజి కాచుకొని బతికారు. ఆ గింజల్ని పిండి చేసి రొట్టెలు చేసుకొని తిని, కొన్నాళ్లు బతికారు. మరికొంత కాలం చింతచిగురు ఉడకబెట్టుకొని తిన్నారు. కొన్నాళ్లకు అది కూడా దొరలేదు. దీంతో రూపాల్ నాయక్ అడవికి వెళ్లి దేవదారు ఆకును దొంగిలించాడని ఫారెస్ట్ గార్డులు అతణ్ని అరెస్టు చేశారు. జైలుకు పంపారు. కొన్నాళ్లకు జైలు నుంచి ఇంటికి తిరిగివచ్చాడు. అప్పటికే అతని కుటుంబం చెల్లా చెదురైంది. కరువు కాటుకు చెట్టుకొకరు పుట్టకొకరుగా మారారు. ఇట్లా గిరిజనుల జీవితాల్లో కరువు ఎంత కల్లోలం రేపిందో చిత్రించిన కథ ఇది.

దట్టమైన అడవుల్లో చీకట్లో మగ్గుతున్న గిరిజన జీవితాలను కొందరు రచయితలు బయటి సమాజానికి తెలిసేలా చేశారు. సాహు, అల్లం రాజయ్య ప్రముఖులు. సాహు ఆదిలాబాద్ అడవుల్లోకి వెళ్లి గిరిజనుల్ని కలిశాడు. చాలా కాలం పాటు వాళ్లతో ఉన్నాడు. వాళ్ల భాష నేర్చుకున్నాడు. వాళ్ల సంస్కృతినీ, జీవితాన్ని అధ్యయనం చేశాడు. ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు జీవితమంతా వెచ్చించాడు. అమాయక ఆదివాసీలపై కొనసాగుతున్న దోపిడీని ఎదిరించేందుకువాళ్లను చైతన్యం చేశాడు. సాహు గోండీ భాష నేర్చుకున్నాడు. దానికి లిపిని రూపొందించాడు. గోండీ లిపిలో అనేక పాటలు రాశాడు. గోండు ప్రజల పోరాటాన్నీ, జీవితాన్నీ డాక్యుమెంట్లా రాశాడు. అల్లం రాజయ్యతో కలిసి అడవుల్లో గోండుల పోరాటాన్ని అధ్యయనం చేశాడు. నిజాం నవాబుకు వ్యతిరేకంగా ఆదివాసీలను సంఘటిత పోరాటాల్లోకి నడిపిన కొమురం భీం గురించి తెలుసుకున్నారు. 'జల్, జంగల్, జమీన్, ఇజ్జత్' నినాదంతో అతడు చేసిన పోరాటాన్ని రచనలోకి తీసుకువచ్చారు. ఆదిలాబాద్ అడవుల్లో కొమురం భీం రగిలించిన పోరాటాన్ని నవలగా రూపొందించారు. అదే కొమురం భీం నవల. ఈ నవల కొమురం భీం, అతని అనుచరుల వీరోచిత పోరాటాలను సృజనాత్మకంగా చిత్రించారు.

తొలి గిరిజన కథలు కరువు నేపథ్యంలోనే వచ్చాయి. అడవుల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న నీటి కరువు నేపథ్యంలో సాహు 'కన్నీటి కథ-నీటి కథ' అనే కథ రాశాడు. ఇది 'సృజన'లో ప్రచురితమైంది. అడవుల్లో తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న కష్టాలను చిత్రించిన కథ ఇది. తాగు నీటి కోసం గిరిజనులు మైళ్లకు మైళ్లు నడవాల్సిన దుస్థితి. అడవి దారుల్లో క్రూరజంతువులు ఎదురై వాళ్లపై

దాడిచేసేవి. నీళ్ల కోసం వెళ్తూ క్రూర మృగాల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన గిరిజనుల కన్నీటి గోసను చిత్రించాడు.

ఆదిలాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో వేలాది మంది గిరిజనులు భూపోరాటాల్లోకి నడిచారు. భూమి, భుక్తి, విముక్తి కోసం వీరోచిత త్యాగాలు చేశారు. గిరిజన, ఆదివాసీ పోరాటాల గురించి ప్రగతిశీల రచయితలు కవిత్వం, పాటలు, కథలు, నవలలుగా రాశారు. గిరిజనోద్యమ కథలు రాసిన వారిలో సాహు, అల్లం రాజయ్య, బి.ఎస్.రాములు, పి.చంద్, సాధన, గోదావరి ముఖ్యులు. ఈ రచయితలందరూ అడవుల్లో ఉవ్వెత్తున ఎగసిన గిరిజనోద్యమాలను సృజనాత్మక సాహిత్యంగా మలిచారు.తెలుగు సాహిత్య చరిత్రలో ఆదివాసి గిరిజనుల గురించి 'కన్నీటి కథ నీటి కథ'(1981), పెండ్లి కావాలి(1981), ఐదు రూపాయల కథ(1981), నిర్ణయం (1982), రక్తపింజర (1982), జెండా కథ(1982) మొదలైన కథలు సృజన పత్రికలో వచ్చాయి.1985లో అడవిలో వెన్నెల కథ సంపుటి బిఎస్ రాములు సంపాదకత్వంలో వచ్చింది. 1993లో అంగలకుర్తి విద్యాసాగర్ 'భద్రాచలం మన్యం కథలు', 2009లో జయధీర్ తిరుమల రావు, జివన్ల సంపాదకత్వంలో 'ఇప్పపూలు' పేరుతో మొదటి గిరిజన కథా సంకలనం వచ్చింది. ఇందులో మొత్తం 40 కథలున్నాయి. 2009లో డాక్టర్ జె.రాజారామ్ సంపాదకత్వంలో 'బంజారా మౌఖిక కథలు' వచ్చాయి. 2017లో వి.ఆర్. రాసాని 'విషప్పురుగు' పేరుతో గిరిజన సంచార తెగల కథలు రాశాడు. డా. సూర్యధనంజయ్ సంపాదకత్వంలో 'కేసులా' పేరుతో గోర్ బంజారా కథలు (2022) వచ్చాయి. ఇందులో యాభై ఐదు కథలున్నాయి. శివరాత్రి సుధాకర్ ప్రధాన సంపాదకత్వంలో 'ఎరుక' ఆదిమ అర్ధసంచార తెగ ఎరుకల కథలు 2024లో 19 కథలతో వచ్చింది. పలమనేరు బాలాజీ 'వసంత మేఘం' పత్రికలో ఎరుకల జీవితాల మీద కథలు రాస్తున్నాడు.

గిరిజన స్త్రీల జీవితాలపై వచ్చిన కథలు భూమికోసం, కన్నీటి కథ నీటి కథ, జంగు బాయి, ఆకలి, పుడంగి, యాడి, కొండమల్లే, కోయ కన్నె, గోరపిట్ట, చుక్క, సుక్కి, పడుపు వృత్తి, ఇప్ప పూలు, చెంచు రాణి, ఎదురీత, పోషవ్వ, అడవి మల్లె, అడవితనం, అరణ్య రోదన, అరణ్యరోధనం, ఇప్పమొగ్గలు, విషప్పురుగు, కొండమల్లె, ఆదివాసీలు, శిల కోల ఇంకా మరికొన్ని కథలు గిరిజన స్త్రీల జీవితాలపై వాళ్లు పడుతున్న బాధలను వాళ్లు వాళ్ళ అమాయకత్వాన్ని, నిరక్షరాస్యతను, లైంగిక దోపిడీ, షావుకార్ల దోపిడీపై కథలు రాశారు.

తెలుగు సాహిత్య చరిత్రలో గిరిజన మహిళల కథలు చాలా తక్కువ వచ్చాయి. గిరిజన మహిళలు ఈ సమాజానికి 'చాలా దూరంగా ఉన్నారు. ఇప్పుడిప్పుడే కొంతమంది గిరిజనులు

చదువుకొని, వాళ్ల సంస్కృతి సంప్రదాయాలను ఆచారాలను కట్టుబాట్లను కథలు, నవలలుగా రాస్తున్నారు. అల్లం రాజయ్య, సాహూ, జయధీర్ తిరుమలరావు, వి.ఆర్. రాసాని, ఏ. విద్యాసాగర్, పి.చంద్, బి.ఎస్. రాములు, డా. తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి, డా. శివరాత్రి సుధాకర్ లాంటి గిరిజనేతర రచయితలు గిరిజన జీవితాల గురించి కథలు రాస్తున్నారు. సాహు గిరిజన భాష నేర్చుకొని గిరిజన జీవితాలు, వాళ్ల పోరాటాలు, వీరోచిత త్యాగాల గురించి సమాజానికి అందించాడు.

తమ గిరిజన జాతి జీవితాలపై పలమనేరు బాలాజీ, డా. భూక్యా తిరుపతి, డా.ఏ. సిల్మా నాయక్, పద్దం అనసూయలు గిరిజనుల జీవితాల గురించి చాలా కథలు వెలుగులోకి తీసుకొచ్చారు. గిరిజన జీవితాలు, నిజ జీవితంలో వాళ్లు పడుతున్న కష్టాల గురించి కథలు అల్లుతున్నారు. గిరిజన మహిళల గురించి రచయితలు మహిళల గిరిజన మహిళల జీవితాలు, వాళ్లకు నిజ జీవితంలో సమస్యల గురించి, కష్టాల గురించి, గిరిజనేతరుల, షావుకార్ల మోసాల గురించి వివరించారు.తెలుగు కథా సాహిత్యంలో గిరిజన స్త్రీల కథల గురించి చర్చించడం ఈ పరిశోధన పత్రం ముఖ్య ఉద్దేశం. ఇందులో గిరిజన స్త్రీల జీవితాన్ని చిత్రించిన ఐదు కథల్ని విశ్లేషించాను.

1. జంగుబాయి
2. ఎదురీత
3. పోషవ్వ
4. నల్లపూసలు
5. అడవి మల్లె

**2.1 జంగుబాయి :**

మూఢ నమ్మకాల వల్ల గిరిజన జీవితాల్లో చీకట్లు నిండుతున్నాయి. తరతరాలుగా వస్తున్న కొన్ని అశాస్త్రీయ ఆచారాల వల్ల ఆగమవుతున్నారు. ఆదివాసీ బాలికలు రజస్వల అయితే మూడు రోజుల దాకా ఇంట్లోకి రానివ్వరు. ఆరుబయటే ఉ ండాల్సిన దుస్థితి. బిడ్డ పుట్టిన మూడో రోజే తల వెంట్రుకలు తీయడం ఆనవాయితీ. గోండుల ఆచారాలు, మూఢ నమ్మకాలు వాళ్ల జీవితంలో ఎంత కల్లోలం రేపుతున్నాయో చెప్పిన కథ 'జంగుబాయి'.

కథ ఆదిలాబాద్ జిల్లా గోండు ప్రాంతంలో మొదలైంది. గోండు గూడెంలో ఉపాధ్యాయుడిగా వచ్చిన ఓ టీచర్ అక్కడి ప్రజల జీవితాన్ని అర్థం చేసుకున్నాడు. తన భార్య గోపి భాగ్యలక్ష్మి, ఆమె తమ్ముడు రాజుతో కలిసి వచ్చాడు. వాళ్లకు గోండు ప్రజలు ఓ ఇంటిని ఇచ్చారు. రచయిత అక్కడి ప్రజల

జీవితాన్ని గమనించి, అర్థం చేసుకున్నది. ఆచారాల పేరుతో స్త్రీలపై కొనసాగుతున్న అణచివేతను కథగా రాసింది.

ఆ గోండు గూడెంలో జంగు అనే అమ్మాయికి పదహారేళ్లు. తల్లి లచ్చుంబాయి, తండ్రి భీము, ఓ అక్క, చెల్లె రుక్మ ఉన్నారు. జంగుబాయికి చిన్నప్పుడే పెళ్లయింది. కానీ ఆమెకు ఆ పెళ్లి ఇష్టం లేదు. పుట్టింట్లోనే ఉంటున్నది. జంగు రజస్వల అయింది. గోండు బాలికలు రజస్వల అయినా, స్త్రీలు బహిష్టు అయినా ఐదురోజులూ ఇంటి బయటే ఉంచుతారు. తిండీ, నిద్రా అన్నీ అక్కడే. ఎండనకా వాననకా అక్కడే ఉంటారు. గతంలో జంగుబాయి అత్త జ్వరంతో మూలిగి మూలిగి ఇలాగే చనిపోయింది.జంగుబాయి రజస్వల అయితే, తన తల్లి ఆమెను ఇంటి బయటే ఉంచింది. జోరు వానలోనూ ఆ పిల్ల చూరు కింద నిలబడి ఉన్నది. చలికి వణుకుతున్నా ఎవ్వరూ పట్టించుకోరు. ఇలా చేయడం వాళ్ల ఆచారం. రెండో రోజూ జంగుబాయి అలాగే నిలబడి వుంది. గమనించిన రచయిత ఆమెను తన ఇంటికి తీసుకెళ్లింది. అదే రాత్రి గూడెంలోకి పులి వచ్చింది. ఓ మేకను పట్టుకెళ్లింది. జంగుబాయి ఆచారం తప్పడం వల్లనే పులి వచ్చి మేకను పట్టుకుపోయిందని గ్రామస్తుల నమ్మకం. ఆ పులిని దేవరే పంపిందని గ్రామపెద్ద అన్నాడు.జంగుబాయి అక్క పెళ్లి చేయడానికి తన భీము భూమిని షావుకారు దగ్గర కుదువపెట్టాడు. షావుకారు అధిక వడ్డీవేశాడు. దీంతో భీము వడ్డీ కట్టలేకపోయాడు. భూమిని వదులుకున్నాడు. గోండుల్లో బిడ్డ పుట్టిన మూడే రోజే తలవెంట్రుకలు తీయడం ఆచారం. తెల్లారే ఆ పిల్లవాడికి తీవ్రమైన జ్వరం వచ్చింది. సరైన వైద్యం అందక చనిపోయాడు.

గోండుల్లో బాల్యవివాహాలు చేయడం ఆచారం. జంగు బాయికి కూడా చిన్నప్పుడే పెళ్లయింది. తల్లిదండ్రులతోనే ఉ న్నది. ఆమె యుక్త వయసుకు వచ్చిందని తెలిసిన అత్త జంగును తీసుకుపోవడానికి వచ్చింది. అప్పటికే జంగుబాయి అదేగూడెంలో ఓ యువకుణ్ని ఇష్టపడింది. ప్రేమించింది. అతని ఇంట్లోకి వెళ్లింది. ఇక చేసేదేమీ లేక కుల పెద్దలతో పంచాయితీ పెట్టించారు. ఆ పంచాయితీలో జంగుబాయిని తీసుకుపోవడానికి వచ్చిన వాళ్లకు మూడు వందల రూపాయలు చెల్లించాడు. జంగుబాయి ఇష్టమైన వ్యక్తితోనే ఉన్నది. అడవుల్లోనూ అంటరానితనం పాటిస్తున్నారు. పాఠశాలలో గోండు పిల్లలతో పాటు దళిత పిల్లలు కూర్చుంటే మైలపడతారని గ్రామపెద్ద టీచర్కు తెలిపాడు.

ప్రేమించి వ్యక్తి పెళ్లికి నిరాకరించడంతో కమల అనే లంబాడీ అమ్మాయి ఉరేసుకొని చనిపోయింది. ఒకవైపు ఆచారాలు, సంప్రదాయాల పేరుతో మహిళలపై తీవ్రమైన అణచివేత, ఇంకోవైపు మైదాన ప్రాంతం వాళ్ల చేతుల్లో మోసపోవడం లాంటి అంశాల నేపథ్యంలో రాసిన కథ ఇది. ఇలాంటి

వైరుధ్యాల మధ్య జీవిస్తున్న ఆదివాసీ బతుకుల్ని చిత్రించిన కథ జంగుబాయి. ఈ కథ 'శ్వేతరాత్రులు' కథా సంకలనంలో ప్రచురితమైంది. కాళీపట్నం రామారావు సంపాదకత్వం వహించారు. ఇది 1993 ఆగస్టులో వచ్చింది. గోపీభాగ్యలక్ష్మి రాసిన తొలి కథ ఇది.

**2. 2: ఎదురీత:**ఇది ఏటికి ఎదురీదిన గిరిజన మహిళల కథ. సమాజం నుంచి, కుల కట్టుబాట్ల నుంచి ఎదురీదుతూ అందరికీ ఆదర్శంగా నిలిచిన మహిళల జీవిత యధార్థ గాధ, కూతాటి అంజమ్మది సూర్యాపేట జిల్లాకి 50 కిలోమీటర్ల దూరంలో ఉ న్న వెంపటి అనే ఊరు. ఆమెది ఎరుకల కులం. ఆమెకు ఐదుగురు అక్కాచెల్లెళ్లు. అంజమ్మ పెద్దది. నిరుపేదలు. రెక్కాడితే డొక్కాడని బతుకులు. కులం చేత సమాజం నుంచి తీవ్ర ఇబ్బందులు పడింది. ఇంటా బయటా అనేక వెలివేతలు, గ్రామ భూస్వాముల నుంచి లైంగిక దాడుల్ని ఎదుర్కొన్నది. చివరికి ఊరు విడిచి పట్నం చేరుకున్నది. జీవిక కోసం అనేక పనులు చేసింది. కూలినాలి పనులు చేస్తూనే బిడ్డను చదివించింది. ఆ అమ్మాయి యూనివర్సిటీలో చదివింది. రాత్రనకా పగలనకా చదివి గ్రూప్-1 అధికారిగా ఎన్నికయింది. పరిమిత వనరులలోనే అపూర్వ విజయాన్ని సాధించింది. తన బిడ్డను ప్రయోజకురాలిగా చేసిన కష్టం వెనక ఎన్ని కన్నీళ్లున్నాయో అర్థంగా చిత్రించారు.

అంజమ్మ చెల్లెళ్లతో కలిసి పందులను తోలుకొని చెరువుల పొంటి, కాలువల పొంటి మేపేది. తన చెల్లెళ్లు కష్టపడకూడదని బడికి పంపింది. కానీ ఐదు రోజులకే బడి మానుకున్నారు. "ఎందుకు పోవట్లేదు?" అని అక్క అడిగింది. "అక్కా.. మనం ఎరకలోల్లమట. మమ్మల్ని ఎవరు కూడా దగ్గరికి రానీయట్లేదు. ఎవరిదగ్గర కూర్చోనియ్యట్లేదు. బాగా ఏడుపొస్తుంది అక్కా బడికి పోద్ది కావడం లేదు" అని సమాధానం ఇచ్చారు. అంజమ్మ మనసు చాలా బాధపడ్డది. అలా తనతో పాటే చెల్లెళ్లు కూడా పందులు మేపుతూ బతికారు.

పందుల్ని మేపుతున్న క్రమంలో ఓ రోజు కొన్ని పందులు చెరువుగట్టు పక్కన ఉన్న పొలంలోకి వెళ్లాయి. దూరాన ఉన్న పొలం యజమాని చూసి, "ఒసేయ్ ఎరుకల లంజల్లారా. పందులు చేనంత నాశనం చేస్తున్నయి. కండ్లల్ల ఎం పెట్టుకున్నరే? పందులు చేనంతా ఆగం చేస్తుంటే ఏం పీకుతున్నరు? మీ అయ్య జాగీరా? మీ తాత జాగిరా? మీ అమ్మలను కుక్కల్ దెం..." అంటూ కడుపులో తన్నాడు. తను అమాంతంగా ఎగిరి పడ్డది. బొక్కబోర్ల పడ్డది. తుంటికి బలమైన గాయమయింది. ప్రాణం పోయేంత పనైపోయింది. ముఖమంతా నెత్తురు. దీంతో పందుల్ని తోలుకొని అక్కడ నుంచి వెళ్లిపోయింది.

కొద్దిరోజుల తర్వాత అంజమ్మను వాళ్ల మేనత్త కొడుకుతో పెళ్లి చేశారు. కానీ ఆమెకు బావంటే అస్సలు ఇష్టం లేదు. తను ఒక తాగుబోతు, తిరుగుబోతు, బాధ్యత లేని మనిషి, అంజమ్మ వాళ్ళ అత్త

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

చాలా గయ్యాల్ది. ఏ చిన్న తప్పు జరిగినా వాళ్ళ అత్త అంజమ్మను రాచిరంపాన పెట్టేది. ఎవరితో మాట్లాడినా లైంగిక సంబంధం అంటగట్టేది. ఈ గాయాల మధ్యే అంజమ్మకు పాప పుట్టింది. ఆడపిల్ల పుట్టిందని వాళ్ళ అత్త పందుల మీద, కోళ్ల మీద వంక పెట్టుకుని అంజమ్మను సూటిపోటి మాటలతో తిట్టేది.

ఒకరోజు ఆ పసిపాపను వీపు మీద జోలె కట్టుకొని పందులను తోలుకొని చెరువు వద్దకు పోయి పందులను మేపుతున్నది. వాళ్ళ ఊరి ద్వారా మామిడి తోట నుంచి బయటికి వచ్చిన దొర, "అంజమ్మ… ఇటోపాలి రావే' అనిపిలిచిండు. దగ్గరికి పోయింది. "అంజి, ఇందాక పెద్ద సుడిగాలొచ్చింది. కంట్లో దుమ్ము పడ్డది. మంట లేస్తున్నది. గర గర మంటున్నది. కాస్త నీ చనుబాలు పిండి నా కంటె పొయ్యి, కంట్లే ఉన్న దుమ్ము ధూళి ఆ పాలతోటి కలిసి బయటికి వస్తుంది. జర ఈ ఒక్క పని చెయ్యి. నీకు పుణ్యం ఉంటది" అని ప్రాధేయపడ్డడు. కానీ అంజమ్మ మనసు ఒప్పుకోలేదు. దొర బతిమాలిండు. దండం పెడతా అన్నడు. దొరకెంత బాధ అవుతుందో ఏమో అనుకొని ఓ దొప్పలో పాలు పిండి దొర కంట్లో పోసింది. అప్పుడు దొర, "అయ్యో అంజమ్మ… అట్ల కాదే. అట్ల పోస్తే నలుసు బయటికి రావట్లేదు. నువ్వు నా కంటి దగ్గరికి రొమ్ము పెట్టు. పాలను కంట్లకు చిమ్ము. ఆ వేగానికి నలుసు బయటకు వస్తది" అని రెండు చేతులు జోడించి దండం పెట్టిండు. "అంజీ… నీ రొమ్ములు నా కంటి దగ్గరికి పెట్టు. నా చేతితోనే నీ చనుమొన పట్టుకొని కంట్లకు పాలు పిండుకుంట అని రెప్పపాటులోనే ఆమె రొమ్ము పట్టుకొని కంట్లో పాలు పిండుకున్నడు. చనుమొనల్ని పిసికిండు. వంగి ఆమె పాదాలకు నమస్కారం పెట్టి వెళ్లిపోయిండు. కొద్దిసేపటి తర్వాత పందులు వేరేచోటికి వెళ్లడం, తను కూడా వేరే చోటికి వెళ్ళింది. కొద్ది దూరంలో మాటలు దగ్గరగా వినిపిస్తున్నాయి. ఇద్దరు దొరలు కలిసి మాట్లాడుకుంటున్నారు. "ఏం సంగతి బావ! పందెంలో ఓడిపోయిన నువ్వు రాసిస్తానన్న ఎకరం భూమి ఎప్పుడు రాసిస్తావు? అబ్బా ఏం అదృష్టం బావా నీది! అంత అందగత్తె సండ్లు పిసికిన మొనగాడివి" ఇంకోదొర."ఏం మాట్లాడుతున్నవ్ బావ! నేను కన్నేస్తే ఎవ్వతి తప్పించుకోలేదు. ఎంత అందగత్తె అయినా నా పక్కలకు రావాల్సిందే" అన్నాడు. వాళ్ళ మాటలతో అంజమ్మ మనసు ముక్కలైపోయింది. దొరల దుర్మార్గాన్ని అసహ్యించుకుంది.

ఓసారి ఊర్లో విష జ్వరాలు రావడం వల్ల పందుల వల్లనే విష జ్వరాలు వస్తున్నాయని అధికారులు, సర్పంచ్ అందరూ కలిసి పందులను చంపేశారు. బతుకుదెరువు కోసం అంజమ్మ దగ్గర్లో ఉన్న ఓ పట్టణానికి చేరుకుంది. అంజమ్మ కూలి పని చేసుకుంటూ పాపను గిరిజన పాఠశాలలో చదివించింది. అనేక కష్టాలు పడి తన బిడ్డను ఉస్మానియా యూనివర్సిటీలో చదివించింది. అక్కడ కూడా వాళ్ళ పాపను ఉన్నత వర్గానికి చెందిన ఎంతోమంది తోటి విద్యార్థులు తన కులాన్ని కించపరుస్తూ

ఎన్నో రకాలుగా అవమానించారు. ఈ అవమానాల మధ్యే రాత్రింబగళ్లు కష్టపడుతూ చదివింది. కొద్ది రోజులకు గ్రూప్స్ పరీక్షలు రాసి ఆర్డీవోగా ఎంపికైంది. అప్పుడు అంజమ్మ కష్టాలన్నీ ఒక్క క్షణంలో మర్చిపోయింది. తన ఆనందానికి అవధులు లేకుండా పై మర్చిపోయింది. తన కూతురు లక్ష్మి తన జాతి మనుషులు కూలిపోయిన భూములను ఇండ్లలను ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తిరిగి వాళ్ల వాళ్లకు పంచి పెట్టింది. ఇక్కడ ఒక ఎరుకల మహిళ అంజమ్మ ఎలా కష్టపడి కూతురిని ప్రయోజకురాల్ని చేసిందో ఈ కథ సారాంశం. కాలానికి ఎదురీదిన ఎరుకల మహిళ బతుకు చిత్రమిది.

**2.3. పోషవ్వ:**

తమ కులంలో నచ్చిన స్త్రీకి 'ఓలి' ఇచ్చి సొంతం చేసుకోవడం ఒకనాటి ఎరకల ఆచారం. 'పోషవ్వ' కథలో డాక్టర్ తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి ఓలి పేరుతో ఓ గిరిజన మహిళ జీవితం ఎట్లా కల్లోలమైందో చిత్రించారు.

పోషవ్వ చిన్న తాత చావు చూడటానికి వచ్చిన మల్లన్న అనే వ్యక్తి ఆమెను చూసి ఇష్టపడ్డాడు. దీంతో ఆమె గురించి ఆరా తీశాడు. ఆమె విషయాలన్నీ ఇతరుల ద్వారా తెలుసుకున్నాడు. ఓ రోజు ఆమె భర్త లింగయ్య దగ్గరికి ఓ మనిషిని పంపి, "ఇయాల ఓలి కడత. నీ పెండ్లం కావాలె" అని రాయబారం పంపించాడు. ఈ సంగతి విన్న లింగయ్య విపరీతంగా తాగివచ్చి తీవ్రంగా కొట్టాడు. దెబ్బలకు తట్టుకోలేక, పక్కనే ఉన్న ముత్తవ్వ ఇంటికి వెళ్లింది, ముత్తవ్వ ఆమెను ఓదార్చి తన దగ్గరే ఉండమని చెప్పింది. మరుసటి రోజు ఉదయం నుండి ఎరుకల వాడలో ఎవరూ పనులకు వెళ్లలేదు. ఎవ్వరి ఇంట్లో పొయ్యి వెలగలేదు. పందులను మేపడానికి తీసుకుపోలేదు. అందరూ ఊరి బయట ఉన్న చింత చెట్టు దగ్గరికి చేరుకున్నారు. కుల పెద్ద, కుల పెద్దమనుషులు అందరూ కలిసి మంచం మీద కూర్చున్నారు. అక్కడే పెద్ద మీసంతో మొహం లో చిరునవ్వుతో ఓలి కట్టడానికి వచ్చిన మల్లన్న ఉన్నాడు. లింగన్న తన ముగ్గురు కొడుకులు కూడా వచ్చారు. చింత చెట్టు కింద నడివయసు ఆడవాళ్లు, ముసలి వాళ్ళు ఉన్నారు. కొద్దిసేపటి తర్వాత ముత్తయిదులు అందరూ కలిసి పోషవ్వను చింత చెట్టు దగ్గరికితీసుకు వచ్చారు.

ఆ బరువు ఎక్కిన క్షణాల మధ్య అందర్నీ ఒక మారు కలియచూస్తూ కుల పెద్ద గొంతును సవరించుకుంటూ, విడాకులు కావాలి అనేది ఓలి కడుతున్న వారి కోరిక అని కుల పెద్ద అన్నాడు. అందరూ కలిసి పెద్దమనుషుల వెంట లింగన్న మల్లన్న పోషవ్వ సహా ఊరు బయట కుల పెద్ద ఆదేశంతో వేపమాను మీద పసుపు కుంకుమలు పూసి పూలు కట్టిన గొడ్డలితో మూడు గాట్లు వేశాడు, లింగన్న,

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

పెద్దమనుషుల సాక్షిగా, జనం సాక్షిగా ప్రకృతి సాక్షిగా లింగన్న పోషవ్వలకు విడాకులు జరిగినట్లు నిర్ణయం అయింది. దీంతో భార్యాభర్తల మధ్య బంధం తెగిపోయింది.

మరుక్షణం పోషవ్వ దగ్గరగా ఏడ్చింది. అది చూసి లింగన్న భుజంపై ఉన్న తువ్వాలను తీసుకొని ముఖం దాచుకొని ఎక్కిఎక్కి ఏడవడం, తల్లిదండ్రులు ఏడుస్తున్న దాన్ని చూసి పిల్లలు కూడా బాగా ఏడవ సాగారు. తర్వాత మల్లన్న విడాకులకు పది రూపాయలు, పిల్లల పోషణకు ఇరవై రూపాయలు, మొత్తం ముప్పై రూపాయల నష్టపరిహారం ఇచ్చి ఇచ్చి మల్లన్న పోషవ్వను తీసుకొని వెళ్లిపోయాడు.లింగన్నను రెండో పెళ్లి చేసుకోమని ఎంత చెప్పినా వినలేదు. పిల్లల పోషణ సవతి తల్లి చూసుకోదని మరలా పెళ్లి చేసుకోలేదు. తల్లి తండ్రి తానై చూసుకున్నాడు పిల్లల్ని.కొన్నేండ్ల తర్వాత మల్లన్న చనిపోయాడు. పోషవ్వ మరలా ఊరికి వచ్చింది. కానీ, పిల్లలు ఆమెను చూడడానికి ఇష్టపడలేదు. పలకరించటానికి కూడా ఇష్టపడలేదు. చేయని నేరానికి కుటుంబానికి దూరమై, బలవంతపు కాపురం కాపురంలో బలైపోయింది. ఇట్లా తరతరాలుగా ఎందరెందరో ఎరుకల మహిళల జీవితాల్లో ఓలి అనే దురాచారం కల్లోలం రేపింది. వాళ్ల జీవితాలను నాశనం చేసింది. పురుషాధిక్యత ఎన్ని రూపాల్లో ఉంటూ ఎంతెంత గాయం చేస్తుందనే విషయాన్ని రచయిత్రి అద్భుతంగా చిత్రించారు.

**2.4. నల్లపూసలు :**

ఇది ఎరుకల మహిళ బతుకు కథ. ఆమెకు పిల్లలు పుట్టక సమాజం నుంచి ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నదో, ఎన్ని చిత్ర హింసలు అనుభవించిందో చిత్రించాడు డాక్టర్ వి.ఆర్.రాసాని,

నాంచారి ఎరుకల మహిళ, నాంచారిని తన మేనత్త కొడుకు యాదన్న ఓలి ఇచ్చి పెళ్లి చేసుకున్నాడు. నాంచారికి పిల్లలు పుట్టకపోవడంతో యాదన్న ఆమెను వదిలేశాడు. కొన్ని రోజులకు అజ్జప్ప ఓలి కట్టి ఆమెను వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజులు ఇద్దరి జీవితం సాఫీగా సాగింది. పిల్లలు పుట్టకపోవడంతో మొక్కని దేవుడు లేదు. తిరగని చోటు లేదు. సూటి పోటి మాటలతో అజ్జప్ప తట్టుకోలేక నాంచారిని వదిలేశాడు. దీంతో నాంచారి మూడో పెళ్లి చేసుకుంది.

పండంటి బిడ్డను జన్మనిచ్చింది. తర్వాత అతను కూడా వేరొక అమ్మాయి మోజులోపడి నాంచారిని వదిలేశాడు. దీంతో నాంచారి ఒంటరైంది. కొన్ని రోజులకు ముగ్గురు మాజీ భర్తలు ఆమెను ఉంచుకుంటామని అడిగారు. వాళ్లను కొట్టి వెళ్లగొట్టింది. నాంచారి ఇలా అంటుంది, "ఏ తప్పు చేయలేదు అబ్బా. నేను నిప్పులాంటి దాన్ని. అంతే అబ్బాయా. మా కులంలో ప్రతి మొగ నా కొడుకు ఆదడాన్ని ఒక వస్తువు మాదిరిగా చూస్తారు. మాసిపోగానే వదిలేసే కట్టు గుడ్డలాగా కట్టుకున్న దాన్ని వదిలేస్తారు. ములకు ములతాడు మార్చినట్లు ఆడదాన్ని మార్చేస్తారు" అన్నది. బయటి సమాజంలో ఉన్నట్టుగానే

ఎరకల్లోనూ పితృస్వామ్యం ఎన్ని రూపాల్లో మహిళలను అణచివేస్తుందో అద్భుతంగా చిత్రించాడు రచయిత.

**2.5. అడవి మల్లె:**

ఇది ఎన్నెన్నో ఆశలతో జీవితాన్ని నిర్మించుకుందామనుకున్న అమ్మాయి కథ. కలలు వాస్తవం కాకముందే ఈ లోకాన్నే వదిలివెళ్లిన ఎరుకల అమ్మాయి గుండెగాయాల కథ. మంగ నిరుపేద కుటుంబంలో పుట్టింది. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం, పందుల గుడిసెల మధ్య పెరిగింది. అదే ఊరిలో చదువుకున్నది. సెలవుల్లో అమ్మతో కలిసి కూలి పనులు చేస్తూనే చదువుకున్నది. పదో తరగతిలో జిల్లా టాపర్గా వచ్చింది. ఇంటర్మీడియెట్ కోసం ఓ కార్పొరేట్ కాలేజిలోచేరింది. ఆమె లక్ష్యం డాక్టర్ కావడం. డాక్టరయ్యాక తన జాతి జనం కోసం పాటుపడాలనుకున్నది. అందుకోసమే ఈ లక్ష్యాన్ని ఎంచుకున్నది. ఊర్లో ఉన్నపుడే ఆమెకు ఉస్మానియా యూనివర్సిటీలో చదివే రీసెర్చ్ స్కాలర్ పరిచయమైంది. ఆమె మంగకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. కథలు, నవలలు, కవిత్వం, చరిత్ర, సామాజిక శాస్త్రాల పుస్తకాలను పరిచయం చేసింది. దీంతో మంగలో జిజ్ఞాస పెరిగింది. ప్రతీది కొత్తగా ఆలోచించే తార్కిక జ్ఞానం వచ్చింది. కొంతకాలమయ్యాక ఎంసెట్ పరీక్ష కోసం చదివింది. ఈ పరీక్షల వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురైంది. ఇంటర్మీడియెట్ ఉచితంగా చేర్చుకున్న కాలేజీ యాజమాన్యం, లెక్చరర్లు ఆమెను టార్చర్ చేశారు. ఎంసెట్ ర్యాంకు కోసం విపరీతంగా చదవాలని ఒత్తిడి చేశారు. మదిలో మెదిలే లక్ష్యం ఒకవైపు. వీళ్లందరి టార్చర్ ఒకవైపు. ఇదంతా ఆ చిన్నారి మనసులో కల్లోలం చెలరేగింది. ఆ ఒత్తిడి ఆమెను సూసైడ్ చేసుకునేలా ప్రేరేపించింది. ఎంసెట్ పరీక్ష రాసి ఊరికి వచ్చిన రాత్రే, గుడిసె ఎనగర్రకు ఉరివేసుకొని చనిపోయింది.

ఒక్కగానొక్క బిడ్డ చనిపోయాక మంగ తల్లి తీవ్రమైన మనో వేదనకు గురైంది. తల్లడిల్లింది. ఈ సంగతి తెలిసిన ఆ రీసెర్చ్ స్కాలర్ కూడా మంగను తలుచుకొని కుమిలి ఏడ్చింది. ఆ ఊరిలోని ఎరుకల వాడంతా భోరున ఏడ్చింది. కోటి కలలతో, ఉన్నతమైన ఆశయంతో పట్నానికి వెళ్లిన ఎరుకల అమ్మాయి ఊపిరి చివరికి ఈ లోకాన్నే వదిలిపోయింది. ఆమె చనిపోవడానికి దారితీసిన సామాజిక పరిస్థితుల గురించి చిత్రించిన కథ ఇది.

**ముగింపు:**తెలుగు కథా సాహిత్యంలో గిరిజన స్త్రీల జీవితాన్ని చిత్రించిన కథలు పరిమిత సంఖ్యలో మాత్రమే వచ్చాయి. సమాజంలో పితృస్వామ్య వ్యవస్థ వల్ల స్త్రీలు అనేక హింసలు ఎదుర్కొంటున్నారు. ఇంటా బయటా వివక్షే అదనంగా కుటుంబ హింస కూడా తోడయింది. దీంతో ఆకాశంలో సగంగా ఉండాల్సిన మహిళలు వంటింటికి మాత్రమే పరిమితమవుతున్నారు. కొత్త ప్రపంచాన్ని చూడాల్సిన స్త్రీలు అజ్ఞాతంగా, అనామకంగా ఇంట్లోనే బందీగా ఉండాల్సిన దుస్థితి వచ్చింది. గిరిజన స్త్రీల బతుకులు

మరీ దుర్భరంగా మారాయి. పేదరికం, నిరక్షరాస్యత, కుల కట్టుబాట్లు ఒకవైపు, ఆచారాల పేరుతో హింస మరోవైపు వాళ్లను చీకట్లో ఉంచుతున్నాయి. పోరాటంలోకి వచ్చిన మహిళలపై అదనంగా రాజ్యహింస పెరిగింది. మహిళలకు ఇంట్లో పోరాటమే. విముక్తి కోసం రాజ్యంతో పోరాటమే. మొత్తంగా తమ జీవితాలనే ఆయుధాలుగా మలుచుకొని యుద్ధభూమిలో నిలిచి పోరాడుతున్నారు. ఇవి కథలు కాదు, వాస్తవ జీవిత గాధలు.

**ఉపయోగించిన పుస్తకాలు :**

1. జీవన్ (సంపా.) : ఇప్పపూలు, ప్రతిభా ప్రచురణలు, ఖమ్మం, జులై 2023
2. డా. రాసాని, వి.ఆర్. విషప్పురుగు, ప్రజాశక్తి బుక్ హౌజ్, మే 2017
3. విద్యాసాగర్ : భద్రాచలం మన్నెం కథలు, ప్రియదర్శిని, ప్రచురణలు, హైదరాబాద్, మార్చ్, 2006
4. సుధాకర్, శివరాత్రి; పూల్ సింగ్, గుగులోతు; స్వాతి, పల్లపు (సంపా.): ఎరుక, కొలిమి ప్రచురణలు, హైదరాబాద్, మే 2024

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## రూబిడి (తెలంగాణ కథ-2019)- సామాజిక స్పృహ

**డా. డి. లక్ష్మీనరసింహం**
అసిస్టెంట్ ప్రొఫెసర్,ప్రభుత్వ డిగ్రీ కళాశాల,కాగజ్ నగర్
Mail: darishetty@gmail.com
Phone: 7013607011

2019లో తెలింగాణ కవులు రచించన సుప్రసిద్ధ కథలలో 12 కథలను ఎంపిక చేస సింగిశెట్టట శ్రీనివాస్ డాకటర్ వెలదిండ శ్రీధర్ "రూబిడి తెలింగాణ కథ 2019" పేరిట ప్రచురించారు. ఈ 12 కథలను ఏంపిక చేయడింలో వస్తువు , శిల్పాలతో పాటు బాషను సైతం ప్రతిపదికగా తీసుకుననటు సింపాద్కులు మిందుమాటలోనే తెలియజేయడం గమనించద్గగ విషయం ఆధునిక సమాజంలో అంతా బాగుందని అంద్రూ అనుకునేలా వ్యవస్థలు . కానీ అదొక డొల్ల అని పేర్కొంటూ ఈ సింపుట్టలో సమకాలీన సమాజాన్ని ఔపోసన ప్టటన కథలే దీనికి తిరుగలేని రూబిడి (సాక్ష్యం) అని సింపాద్కులు వాసువానిన తెలియజేశారు.అంతా బాగింది అనే నినాదం వెనుక గల రూబిడి సింపుట్టలోని కథలు ఏతు చూపుతున్నయి. ఇందులోని కథ సమకాలీన సమాజానిన అద్బుతంగా చతిరించన ఆణిమత్యిం అనే చేప్పుకోవాలి . ఇక రూబిడి (తెలింగాణ కథ 2019)లోని కథలోని సామాజిక చత్రణను మనకు చాలా విషయాలు అవగత్మైతాయి. రూబిడి అంటే నిర్ధధరణ, నిరూప్ణ అనే అర్ధం ఉంది.ఇందులోని వరతమాన సమాజానికి ప్రతిబింబాలని తెలిపారు .

**రూబిడి కథలు- సామాజిక స్పృహ**

ఈ కథా సింపుట్టలోని తొలి కథ "అలివి వల" దీనిని జడురుకచెందిన ఉద్యమత్ర (యాద్గిరి) రచించాడు. "యాడికి పోతున్ననవ్వుతూ అడిగాడు పసువుల కాప్రి" అంటూ అచుమైన తెలింగాణమండలికింలో సాగిన ఈ కథ ఇద్దరూ తెలింగాణ వయకుతలు సహజింగా మాట్లుడుకుననటురా సాగుతుంది. ఇక ఇందులో అడవిలోఉండే అమాయకపుచెంచుల జీవన విధానింపై ఆధునిక కంపెనీ వ్యవస్థ ఎంత ప్రబావం చూపిందో రచయిత చక్కగా వివరించారు.అలివి వాళ్ళ అనే శీర్షిక లోనే కథా సారం మనం అర్ధం చేసుకోవచ్చు.చెంచులు అడవిలోని నదిలో చిన్న చిన్న వలలు వేసి చేపలు పట్టుకొని జీవిస్తుంటే కంపెనీ రాకాసి పెద్ద వలతో వచ్చి వారి జీవితాలను ఎలా చిన్న భిన్నం చేసిందో రచయిత చక్కగా ఇందులో వివరించడం జరిగింది.

ఇక ఈ కథ సంపుటిలో రెండో కథ “ఎక్కాలు రానోడు”దీనిని ఖమ్మం జిల్లాకు చెందిన హనీఫ్ రచించాడు.నేటి కలం లో చదువ్ రాకపోతే మార్కెట్ శక్తులు మనల్ని ఎలా మోసం చేస్తాయో షరీఫ్ పాత్ర ద్వారా చూపగలిగాడు. రైతులు పండించిన పంటను దళారులు ఎలా భోంచేస్తారో వేశ్లేసిస్తూ చేయని

నేరానికి శిక్ష దరిదాపుల్లోకి వెళ్ళిన షరీఫ్ చివరికి నిజాయితి పరుడైన పోలీస్ అధికారి అండతో అక్రమ కేసు నుండి బైట పడిన వైనం మన వ్యవస్థలోని మంచి,చెడులను మనసుకు హత్తుకునేలా చిత్రించింది.షరీఫ్ నిరక్షరాస్యుడు.ఈ అదునుక లోకం మీద అవగాహనా లేని వాడని చెప్పడం కొరకు రచయిత "ఎక్కాలు రానోడు"అనే శీర్షికను ఎంచుకోవడం బాగుంది.

"భూమాట"అనే మరో కథను వరంగల్ జిల్లాకు చెందిన వడ్డేబోయిన శ్రీనివాసు రచించాడు. ఇందులో సమకాలిన రాజకియ పరిస్థితిని రాజాలు అనే పాత్ర ద్వారా మనకు చక్కగా వివరించాడు. ప్రభుత్వాలు ఎన్నికల కోసం ఎన్నో వాగ్దానాలు చేసి గెలిచిన తర్వాత ఎలా మర్చిపోతాయో ఈ కథలో వివరించడం జరిగింది. తెలంగాణలో తరతరాల నుండి ఉన్న భూమి సమస్యను ప్రదానంగా చిత్రించిన ఈ కథకు "భుమాట" అని పేరు పెట్టడం ఎంతో సహేతుకంగా ఉంది. ఇక ఈ సంపుటిలో తర్వాతి కథ మేడి చైతన్య రాసిన "ఇత్తరాకుల కట్ట" కథ. శీర్షికలోని వైవిధ్యం చూపిన యువ రచయిత చైతన్య నేటి కుటుంబ సంబంధాలు, అవి శిధిలమైనప్పుడు కలిగే బాదలు ఎంతో హృద్యంగా ఈ కథలో చిత్రించాడు. ఈ కథ రచయిత ఉత్తమ పురుషలో నడపడంతో పాటు చిన్నతనంలో తనను ఎంతో ఆదరించి అక్కున చేర్చుకున్న పిన్ని ఒక రోజు బాబాయితో గొడవ పడింది ఇంట్లోంచి వెళ్ళిపోయాన తిరు చివరకు వారి కొడుకు పెళ్ళిలో పిన్ని మళ్ళి ప్రత్యక్షమైనప్పుడు కలిగిన భావోద్వేగాలను ఎంతో బాగా ఈ కథలో చూపెట్టడం జరిగింది. చిన్న చిన్న విషయాలను భార్య భర్తల మధ్య జరిగే గొడవలు సంసారాలను ఎలా విడదిస్తాయో ఈ కథ మనకు వివరిస్తుంది. రెండు కుటుంబాలను గత వస్తువుగా చేసుకొని రచయిత ఈ కథను నడిపిన తిరు ప్రశంసనీయం కుటుంబం తనను ఎంతగా వేలివేసినప్పటికీ ఒక సగటు మహిళా కుటుంబం కోసం చివరివరకు ఎంతగా ఆలోచిస్తుందో ఈ కథ మనకు తెలియచేస్తుంది.

ఇక ప్రముఖ కథా రచయిత పెద్దింటి అశోక్ కుమార్ రాసిన మరో కథ "ఏకగ్రీవం"(అను ఓ ఎన్నికలా కథ).ఈ కథ గ్రామీణ ప్రాంతాలలో నేటి రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతుంది.గ్రామ పంచాయితీ ఎన్నికల సమయం లో గ్రామీబ్న ప్రాంతాలలో రాజకీయాలు ఎలా ఉంటాయో చెప్పడం తో పాటు నేటి ఎన్నికల దభు,దానం ఎలాంటి పాత్రను పోషిస్తాయో ఈ కథ లో రచయిత ఎంతో బాగా వివరించగలిగాడు.డబ్బున్న భగవంతం లాంటి వారు ధన బలంతో రాజకీయాలను ఎలా శాసించాలనుకుంటారో దానికి బాల మల్లు లాంటి తిరుగుబాటు మనస్తత్వం కలిగిన వారు ఎలా అడ్డు కట్ట వేసారు ఈ కథ మనకు తెలియజేస్తుంది.ధనవంతులు ఏకగ్రీవం పేరిట ప్రజాస్వామ్యాన్ని దభుతూ ఎలా పరిహాసం చేస్తున్నారో ఈ కథ ఎంతో చక్కగా చిత్రించింది.

కావేటి సరిత రచించిన "ఆరు తప్పులు"అనే మరో కథలో నిన్ను కులాల పై అగ్రకులాల దౌర్జన్యం ఈ నాటికి ఏ విధంగా మన సమాజంలో పాతుకుపాయిందో వివరిస్తుంది."గుండె నిండా

జేలుబండనే " కథను మాదిగ వారి జీవితాలు ఏంత దయనీయ స్థితిలో వున్నాయో అర్థం అవుతుంది .రెడ్డి చదువుతున్నప్పుడు కులానికి చెందినవారు వారి శ్రమను దోచుకోవడమే కాదు ప్రభుత్వ వారికీ ఇచ్చిన భూముల్లోని బండలను బలవంతంగా నలుగగొట్టి కంకర అమ్ముకున తీరును మన వ్యవస్థలోని బలహీనతలను బయటపెట్టింది. నాగావర్ధాన్ రాయల రచించిన పెసిరెంట్ పోశేట్టి కథ ఆర్టిసి బస్సులు. ఆర్టిసి కార్మికులకు సమ్మె ప్రభుత్వం స్పందించిన తీరును చక్కగా వివరించింది. సమకాలిన పరిణామాలను ఆద్యంతం ఈ కథ ఆస్కతికరంగా చిత్రించి వాస్తవానికి దగ్గరగా రచయిత కథను మలిచిన తిరు బాగుంది. బంగారు రమేష్ యాదవ్ రచించిన జొండ్లపాతర కథ చదువుతున్నంతసేపు పాతకాలపు వ్యవసాయ విధానం మన కల్ల ముందుంటుంది. ఒకప్పుడు జొన్నలు ప్రధాన పంటగా ఉండి పుట్ల కొద్ది పండించేవారు.కానీ నేడు ఆ పంట పేరు పైన లేదని రచయిత ప్రస్తుతం వాణిజ్య వ్యవసాయ విధానాన్ని స్తుతి మెత్తగా విమర్శించిన తిరు బాగుంది.

ఇక ఈ సంపుటిలో చివరి కథ చందు తులసి రచించిన "గడి" ఒకప్పుడు నిజం కాలంలో తెలంగాణాలో గడిల సంస్కృతి ఉండేది .అప్పుడు ఆడ బాప అనే సాంఘిక దురాచారం ఉండేది. దొర కూతురికి పెళ్లి జరిగితే కూతురులో పాటు ఓ అమ్మాయిని కూడా దొర గడికి పంపేవారు. అలా వెళ్ళిన పూలమ్మ అక్కడ పడ్డ కష్టాలు చివరికి ముత్యాలు దళంతో ఆ గడిని బద్దలు కొట్టి దొర పీడ విరగడ చేసిన తీరును ఈ కథ చక్కగా చిత్రించింది. ఆనాటికి దొరల ఆగడాలను వారి చేతుల్లో సామాన్యులు సమిదలైన తీరును ఈ కథను ఎంతో కరుణ రసాత్మకంగా చిత్రించింది. ఈ విధంగా 2019లో వచ్చిన రూబిడి కథ సంపుటిలోని ప్రతి కథ సమకాలిన సమజాని చిత్రించిన తీరు ఎంతో బాగుంది.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## సంస్కరణల స్వరం -ఆధునిక తెలుగు నాటక త్రయం

**డా. ఎం. పద్మగౌరి**
తెలుగు అధ్యాపకురాలు,
బొమ్మూరు. రాజమహేంద్రవరం,

**ఉపోద్ఘాతం**

ఆధునిక సాహిత్యాన్ని దృష్టిలో ఉంచుకొని చూస్తే **సంఘం** అనే పదానికి నిర్దిష్టమైన అర్థ పరిమితి లేదు. స్త్రీలు–పురుషులు, దరిద్రులు–ధనికులు, కష్టపడేవారు–కష్టపెట్టేవారు, నీతిపరులు–అవినీతిపరులు వంటి అనేక వర్గాలు సంఘంలో అంతర్భాగాలుగా ఉంటాయి. సంఘం అనేది ఏకైక అంశం కాదు. అనేక కోణాలు, అనేక విభాగాలు కలిసిన సమిష్టి నిర్మాణం.

**ఉద్యమం** అనేది సాధారణ ప్రయత్నం కాదు. ఒక నిర్దిష్ట లక్ష్య సాధన కోసం అవిశ్రాంతంగా, వ్యవస్థీకృతంగా సాగించే ప్రయత్నమే ఉద్యమం. అలాగే, మనిషి ప్రవర్తనలో గానీ, సమాజంలో గానీ లోపాలు ఉన్నప్పుడు వాటిని సరిదిద్దుకునే ప్రయత్నమే **సంస్కరణ**. సంఘ సంస్కరణోద్యమ సందర్భంలో 'సంస్కరణ' అనే పదాన్ని తేలికపాటి అర్థంలో గ్రహించడానికి వీల్లేదు.

ఆనాటి సమాజంలో స్త్రీలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, విద్య, పురుషులతో సమానత్వం లేకుండా అణచి వేయబడటం కూడా ధర్మంగానే పరిగణించబడింది. శాస్త్ర సంపన్నులమని భావించిన పండితులు కూడా ధర్మం కాలానుగుణంగామారుతుంది. అనే సత్యాన్ని గ్రహించలేకపోయారు. అటువంటి కాలంలో వేగు చుక్కలా ఉదయించిన మహానుభావుడు కందుకూరి వీరేశలింగం. ఆయన జీవించిన కాలానికి సమాజం తీవ్ర పతన స్థితిలో ఉంది. ఆధునిక దృష్టితో పరిశీలిస్తే ఆనాడు సంస్కరించుకోవలసిన అంశాలు అనేకం. విగ్రహారాధన, లంచగొండితనం, వితంతు వివాహాలు, స్త్రీవిద్యకు అడ్డంకులు, వేశ్యావృత్తి, బాల్య వివాహాలు, వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, వరకట్నం, అస్పృశ్యత, కుల–మత–వర్ణ ఆధిపత్యం, మూఢాచారాలు, మూఢనమ్మకాలు వంటి అనేక దురాచారాలు సమాజాన్ని పట్టి పీడిస్తున్నాయి.

**ఆనాటి కాల పరిస్థితులు** ఆధునిక కాల ఆరంభానికి ముందు మిషనరీ పాఠశాలలు మాత్రమే ఉండేవి. ఆంగ్లేయ అధికారులు తమ పరిపాలనా అవసరాల కోసం మద్రాస్ సెంట్ పోర్టులో ఒక కళాశాలను స్థాపించారు. తరువాత మద్రాస్, బొంబాయి, కలకత్తాలలో విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. 1875 ప్రాంతానికి స్వదేశీయులు కూడా పాఠశాలలు స్థాపించడం ప్రారంభించారు. స్వదేశీ పాఠశాలలు

ఏర్పడినప్పటికీ స్త్రీలకు చదువుకునే స్వేచ్ఛ లేదు. అదే సమయంలో వీరేశలింగం గారి సంఘసంస్కరణ భావాలు క్రమంగా వ్యాపించసాగాయి. రాజమండ్రికి సమీపంలోని ధవళేశ్వరంలో 1874లో బాలికల పాఠశాలను ప్రారంభించడం ఒక విప్లవాత్మక సంఘటనగా నిలిచింది. ఆనాటి సమాజంలో కులవ్యవస్థ బలంగా ఉంది. దళితులు ఇతరులతో సమానంగా కలిసి జీవించే పరిస్థితి లేదు. స్త్రీలతో పాటు దళితులు కూడా విద్యకు, సామాజిక అవకాశాలకు దూరంగా ఉంచబడ్డారు.

**సంఘసంస్కరణ నేపథ్యం**

వీరేశలింగం గారు సంఘసంస్కరణకు పూనుకున్న కాలంలో వేశ్యావృత్తి విపరీతంగా వ్యాప్తిలో ఉండేది. తీర్థాలు, వివాహాలు,శుభకార్యాల సందర్భాలలో భోగం మేళాలు నిర్వహించడం సాధారణమై పోయింది. ధనికులు తమ ప్రతిష్ఠ కోసం ఈ మేళాలను ప్రోత్సహించేవారు. అదే కాలంలో బాల్యవివాహాలు, వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, వరకట్నం వంటి అనేక దుష్టాచారాలు విస్తృతంగా ఉన్నాయి. మూఢాచారాలకు, మూఢనమ్మకాలకు మతమే మూలమై, వాటి దుష్పరిణామాల భారం ప్రధానంగా స్త్రీలే మోసేవారు.

ఈ అన్యాయాలను గుర్తించి సమాజాన్ని జాగృతం చేయడానికి అనేక మహానుభావులు ముందుకు వచ్చారు. సమాజంలో జరుగుతున్న అరాచకాలను కళ్లకు కట్టినట్లుగా రచనల ద్వారా చూపించారు. ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు గ్రామ గ్రామాల్లో నాటక ప్రదర్శనలు నిర్వహించేవారు. ఎందరో కవులు తమ రచనల ద్వారా దుష్ట సంస్కృతిపై తిరుగుబాటు చేశారు.

**కందుకూరి వీరేశలింగం – నాటకాలు**

రాజా రామ్మోహన్ రాయ్ ప్రతిపాదించిన బ్రహ్మసమాజ సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని వాటిని ఆచరణలో పెట్టేందుకు జీవితాంతం శ్రమించినవారు కందుకూరి వీరేశలింగం. మానవులందరినీ ఒక కుటుంబంగా చూడాలన్న ఆలోచన పూర్తిగా ఫలించకపోయినా ఆ సిద్ధాంతానికి పునాదులైన హేతువాదం, మానవత్వం, సమానత్వం సంఘసంస్కరణకు బలమైన ఆధారాలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆయన అనేక నాటకాలను రచించారు. బ్రహ్మవివాహం, వ్యవహార ధర్మబోధిని, అభిజ్ఞాన శాకుంతలం, సత్యహరిచంద్ర, రత్నావళి వంటి నాటకాలు ప్రసిద్ధి చెందాయి.

"బ్రహ్మవివాహం" నాటకంలో ముక్కుపచ్చలారని బాలికను కన్యాశుల్కం కోసం ముసలివాడికి ఇచ్చివివాహం చేయడాన్ని తీవ్రంగా నిరసించారు. డబ్బుపై ఆశతో తల్లిదండ్రులు తమ పిల్లల జీవితాలను ఎలా నాశనం చేస్తున్నారో హేళనాత్మకంగా చూపించారు.

"వ్యవహార ధర్మబోధిని "అనే ప్రహసన నాటకంలో న్యాయాన్ని కాపాడాల్సిన న్యాయవాదులు సమాజాన్ని ఎలా చులకనగా చూస్తున్నారో హాస్యరసంతో ఎండగట్టారు.వస్తువు, ప్రక్రియ,సంఘలోపం - ఈ మూడింటిని సమన్వయం చేస్తూ ప్రయోజనాత్మకంగా రచించిన నాటకం ఇది. ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి శ్రావ్య కావ్యాలకంటే నాటకాలే ప్రభావవంతమని విశ్వసించిన వీరేశలింగం గారు మొత్తం 16 నాటకాలు రచించారు.

**గురజాడ అప్పారావు – నాటకాలు**

గురజాడ అప్పారావు గారి పేరు వినగానే ముందుగా గుర్తుకొచ్చేది కన్యాశుల్కం. ఇది కేవలం ఒక నాటకం మాత్రమే కాదు.ఆనాటి సంఘసంస్కరణకు, భాషా సంస్కరణకు ప్రాణం పోసిన శక్తివంతమైన రచన. కన్యాశుల్కం నాటకం ద్వారా స్త్రీలు ఎదుర్కొన్న దుర్భర పరిస్థితులు, వితంతు వివాహాల నిరాకరణ వల్ల కలిగే పరిణామాలు, వృద్ధ వివాహాల వికృత రూపం, వేశ్యావృత్తి వెనుక ఉన్న సామాజిక వాస్తవాలు కళ్లకు కట్టినట్లుగా చూపించారు. ఆంగ్లవిద్యను బాహ్యాడంబరంగా ఉపయోగించి ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో గిరీశం పాత్ర ద్వారా వెల్లడించారు.

"కొండు భట్టీయం ' నాటకంలో వైదిక బ్రాహ్మణుల ద్వంద్వచరిత్రను, పురోహిత వర్గం చేస్తున్న మోసాలను సంభాషణల ద్వారా బట్టబయలు చేశారు. నిత్యం జపహోమాదులతో అనుష్ఠాన్ని నిర్వహించడం, సత్యం పలకడం,మృదు భాషణ, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండటం వంటి సత్కర్మలతో ప్రజల మన్నలను పొందడం పురోహితుని యొక్క జీవితం అలాంటి గుణగణాలు కలిగిన వాడు తమకు దేవుడు యొక్క ఆశీస్సులు అందజేస్తారని నమ్మకంతో ప్రజలు అతడిని గౌరవిస్తారు .ఇలాంటి వృత్తిలో ఉన్న కొండుభట్టీయం సదాచారాలు పాటించడు ఒక్క మంచి పని కూడా చేయకుండా అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ ఉంటాడు.'కన్యాశుల్కం' రాసిన తరువాత కూడా తన మనసును దులుస్తున్న అంశాలైన వైదిక మత నిరసన నాటి పురోతి వర్గం చేస్తున్న మోసాలను వీధిన పెట్టాలని కోరికతో బ్రహ్మ సమాజం కార్యాచరణను నాటకంగా రాసి ప్రజల వద్దకు తీసుకువెళ్లాలి అనే ఉద్దేశంతో ఈ నాటకాన్ని రచించారు.

"మతములన్నయు మాసిపోవును
జ్ఞానం ఒక్కటి నిలిచిపోవును"

అన్న గురజాడ మతం మానవత్వం మాత్రమే మతమే జ్ఞానాన్ని కొంత హరిస్తుంది అని గిరీశం పాత్ర ద్వారా తెలియజేశారు. మానవత్వమే నిజమైన మతమని ఆయన దృక్పథం.

**బిల్హణీయం నాటకం**

గురజాడ అప్పారావు గారు రచించిన బిల్హణీయం తెలుగు సాహిత్యంలో ఒక ముఖ్యమైన ఆధునిక నాటకం. ఈ నాటకం ప్రాచీన కవి బిల్హణుడు (కాశ్మీర దేశానికి చెందిన పండితుడు) జీవితం, అతని ప్రేమ కథను ఆధారంగా చేసుకున్నప్పటికీ గురజాడ గారు దీనిని కేవలం చారిత్రక కథగా మాత్రమే కాకుండా సమకాలీన సామాజిక సమస్యలను ప్రతిబింబించే నాటకంగా మలిచారు. ఈ నాటకం ద్వారా ముఖ్యంగా స్త్రీ స్వాతంత్ర్యం, స్త్రీ–పురుష సమానత్వం, మానవతా విలువలు స్పష్టంగా ప్రతిపాదించబడ్డాయి. స్త్రీని భోగ్య వస్తువుగా, ఆజ్ఞాపాలకురాలిగా చూడకూడదని, ఆమెకు తన భావాలు వ్యక్తపరచే హక్కు, స్వేచ్ఛాయుత జీవనం గడిపే హక్కు ఉన్నదని గురజాడ గారు ఈ నాటకంలో బలంగా చెప్పారు.

బిల్హణీయం నాటకంలోని స్త్రీ పాత్రలు సంప్రదాయ బంధనాల్లో చిక్కుకున్న బలహీన ప్రతిమలు కాకుండా, ఆలోచించే శక్తి కలిగిన వ్యక్తులుగా దర్శనమిస్తాయి. ఇది ఆనాటి సమాజానికి ఒక విప్లవాత్మక దృష్టికోణం. స్త్రీ ప్రేమ, భావోద్వేగాలు, ఆత్మగౌరవం ఇవన్నీ మానవత్వానికి మూలాధారాలనే సందేశాన్ని ఈ నాటకం అందిస్తుంది.

వ్యవహార భాషకు ప్రాధాన్యం ఇచ్చిన తొలి ఆధునిక నాటకాలలో బిల్హణీయం ఒకటి. ప్రాచీన శైలికి దూరంగా, ప్రజల నిత్యజీవితంలో వినిపించే సహజమైన భాషను నాటక సంభాషణల్లో వినియోగించడం ద్వారా గురజాడ గారు తెలుగు నాటకానికి ఆధునికతను పరిచయం చేశారు. ఈ కారణంగా బిల్హణీయం తెలుగు సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

**కాళ్ళకూరి నారాయణరావు – సంఘసంస్కరణాత్మక నాటకాలు:** మాజాన్ని పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకొని, ప్రజల హృదయాలను తాకేలా నాటకాలు రచించిన ప్రముఖ నాటకకర్త కాళ్ళకూరి నారాయణరావు.

**చింతామణి**

చింతామణి నాటకం ద్వారా వేశ్యావృత్తి వెనుక దాగి ఉన్న సామాజిక అన్యాయాలను, ఆ వృత్తిలోకి స్త్రీలు నెట్టబడే పరిస్థితులను హృదయ విదారకంగా చిత్రించారు. వేశ్యావృత్తిని ఒక వ్యక్తిగత దోషంగా కాకుండా సమాజం సృష్టించిన దురవస్థగా చూపిస్తూ దాని నిర్మూలనకు సమాజం మొత్తమే బాధ్యత వహించాలనే భావనను ప్రతిపాదించారు. ఈ నాటకం వేశ్యావృత్తి నిర్మూలన ఉద్యమానికి బలమైన మేధోపూర్వక ఆధారంగా నిలిచింది.

**వరవిక్రయం**

వరవిక్రయం నాటకంలో వరకట్న సమస్య ఎంతటి తీవ్రమైన సామాజిక రుగ్మతగా మారిందో కాళ్ళకూరి గారు స్పష్టంగా చూపించారు. వరకట్నం కోసం స్త్రీలు ఎదుర్కొంటున్న అవమానాలు, హింసలు, మరణాలు ఇవన్నీ ఈ నాటకంలో కళ్లకు కట్టినట్లుగా చిత్రించబడ్డాయి. సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఈ సమస్యను ఇతివృత్తంగా తీసుకొని ప్రజారంజకమైన శైలిలో నాటకాన్ని మలిచిన తీరు కాళ్ళకూరి గారి రచనా ప్రతిభకు నిదర్శనం.

**మధుసేవ**

**మధుసేవ** నాటకం ద్వారా మద్యపాన వ్యసనం వల్ల వ్యక్తిగత జీవితాలు ఎలా విచ్ఛిన్న మవుతున్నాయో,కుటుంబాలు ఎలా ఛిన్నాభిన్నమవుతున్నాయో, హృదయవేదనతో చూపించారు. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజలను పట్టిపీడిస్తున్న ఈ వ్యసనాన్ని సామాజిక సమస్యగా చిత్రించి, మద్యనిషేధం అవసరాన్ని బలంగా ప్రతిపాదించారు.

కాళ్ళకూరి నారాయణరావు గారి నాటకాలు సుమారు మూడు దశాబ్దాల పాటు తెలుగు నాటక రంగాన్ని ప్రభావితం చేశాయి. ప్రతి గ్రామంలోనూ ఆయన నాటకాలు ప్రదర్శించబడటం ఆయన రచనల ప్రజాదరణకు నిదర్శనం. సమాజంలో మార్పు తీసుకురావాలనే దృఢ సంకల్పంతో, ప్రజల నిత్యజీవిత సమస్యలను నాటక రూపంలో ఆవిష్కరించిన సంఘసంస్కరణాత్మక నాటకకర్తగా కాళ్ళకూరి నారాయణరావు ప్రత్యేక స్థానం సంపాదించారు.

**ముగింపు**

ఆధునిక తెలుగు నాటకాలు కేవలం వినోద సాధనాలుగా మాత్రమే కాకుండా, సమాజాన్ని జాగృతం చేసే శక్తివంతమైన ఆయుధాలుగా పనిచేశాయి. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, కాళ్ళకూరి నారాయణరావు వంటి నాటకకర్తలు తమ రచనల ద్వారా సమాజంలో వేళ్లూనుకున్న దురాచారాలను ప్రశ్నించి మార్పు కోసం ప్రజలలో చైతన్యం నింపారు. స్త్రీ స్వాతంత్ర్యం, మానవతా విలువలు, సమానత్వం, హేతువాదం వంటి భావాలను నాటక రూపంలో ప్రజల ముందుకు తీసుకువెళ్లడం ద్వారా వారు సంఘసంస్కరణ ఉద్యమానికి దిశానిర్దేశం చేశారు.

వీరేశలింగం గారి నాటకాలు సంస్కరణకు సిద్ధాంతాత్మక పునాదులు వేసినవిగా నిలిచితే, గురజాడ గారి నాటకాలు ఆ సంస్కరణ భావాలను జీవవంతమైన ప్రజాభాషలో వ్యక్తం చేశాయి. ముఖ్యంగా కన్యాశుల్కం, బిల్హణీయం వంటి నాటకాలు స్త్రీ సమస్యలను,మానవత్వ విలువలను అత్యంత స్పష్టంగా ప్రతిబింబించాయి. కాళ్ళకూరి నారాయణరావు గారి నాటకాలు సమాజంలోని

నిత్యజీవిత సమస్యలను వేశ్యావృత్తి, వరకట్నం, మద్యపానం వంటి వాటిని ప్రజల హృదయాలకు హత్తుకునేలా చిత్రించి, సామాజిక బాధ్యతను గుర్తు చేశాయి. ఈ విధంగా ఈ ముగ్గురు నాటకకర్తల రచనలు కలిసే ఆధునిక తెలుగు నాటక త్రయంగా నిలిచి, సంఘసంస్కరణల స్వరంగా ప్రతిధ్వనించాయి.

నేటి సమాజాన్ని పరిశీలిస్తే రూపాలు మారినా సమస్యల మూలాలు పూర్తిగా అంతరించలేదని స్పష్ట మవుతుంది. స్త్రీలపై వివక్ష, వరకట్న దురాచారం, మద్యపాన వ్యసనం, అంధ విశ్వాసాలు ఇప్పటికీ ఏదో రూపంలో కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆధునిక తెలుగు నాటకాలు ప్రతిపాదించిన సంఘసంస్కరణ భావాలు నేటికీ అత్యంత ప్రాసంగికమైనవే. అప్పటి నాటకాలు సమాజానికి అద్దంలా నిలిచినట్లే, నేటి సమాజం కూడా వాటిని స్వీయ పరిశీలనకు మార్గదర్శకాలుగా ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది.

నాటకం ఒక కాలానికి పరిమితమైన కళ మాత్రమే కాదు. అది ప్రతి తరానికి సమాజాన్ని ప్రశ్నించే మార్పు కోసం ప్రేరేపించే జీవంతమైన సాధనం. వీరేశలింగం, గురజాడ, కాళ్ళకూరి గారి నాటకాలు నేటి తరానికి కూడా సామాజిక బాధ్యతను గుర్తు చేసే మార్గదర్శక దీపస్తంభాలుగా నిలిచాయి. సమాజం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందాలంటే ఈ నాటకాలు ప్రతిపాదించిన మానవత్వం, సమానత్వం, స్త్రీ స్వాతంత్ర్యం వంటి విలువలను ఆచరణలోకి తీసుకోవడం మాత్రమే నిజమైన సంస్కరణకు దారితీస్తుంది.

**ఆధార గ్రంథాలు**

**కందుకూరి వీరేశలింగం**-బ్రహ్మ వివాహం, వ్యహార ధర్మబోధిని. రాజమండ్రి: సరస్వతి ప్రెస్, 1870–1900.
**గురజాడ అప్పారావు**-కన్యాశుల్కం. రాజమండ్రి: ఆంధ్ర పత్రిక, 1892.
**గురజాడ అప్పారావు** -బిల్హణీయం. రాజమండ్రి: ఆంధ్ర సాహిత్య పరిషద్, 1900.
కాళ్ళకూరి **నారాయణరావు**- చింతామణి, వరవిక్రయం / మధుసేవ. హైదరాబాద్: తెలుగు నాటక పరిషద్, 1920–1950

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# సమకాలీన కథా సాహిత్యంలో ఆధ్యాత్మిక సత్యాలు: ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిగారి కథలు.

**-ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు,**
తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు, మానవీయ శాస్త్రాల విభాగం,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ( సెంట్రల్ యూనివర్సిటీ), హైదరాబాద్-500 046,
ఫోన్: 9989628049

**పరిశోధన పత్ర సారాంశం (Abstract)** తెలుగు కథా సాహిత్యం పరిణామ క్రమంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక కోణాలను స్పృశిస్తూనే, మానవ అంతరాత్మను ప్రభావితం చేసే ఆధ్యాత్మిక సత్యాలను కూడా అక్షరబద్ధం చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి గారి 'ICU కరోనా కథలు' సమకాలీన సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని ఆక్రమించాయి. ఈ పరిశోధన పత్రం రచయిత తన వ్యక్తిగత ఆసుపత్రి అనుభవాల నుండి సేకరించిన వాస్తవిక గాథలను, బైబిల్ ప్రతిపాదించిన నిత్య సత్యాలతో ఎలా సమన్వయం చేశారో విశ్లేషిస్తుంది. కరోనా మహమ్మారి సృష్టించిన ప్రాణ సంకట స్థితిలో, మరణం ముంగిట నిలబడిన మనిషి అహంకారం, భయం, పశ్చాత్తాపం, దైవకృప కోసం పడే ఆరాటాన్ని కృపాచారిగారు 'స్కెచ్ స్టోరీ' ప్రక్రియలో అత్యంత ప్రభావవంతంగా చిత్రించారు. పాపం-పుణ్యం, ప్రార్థన శక్తి, 'విత్తినదే కోయడం' (Law of Retribution) వంటి ఆధ్యాత్మిక సిద్ధాంతాలు ఈ కథల్లో సామాజిక సత్యాలుగా ఎలా ప్రతిబింబించాయో ఈ పరిశోధన వ్యాసం చర్చిస్తుంది. ముఖ్యంగా, సామాజిక అవినీతికి దైవ న్యాయం ఎలా సంభవిస్తుందో, మతాతీతమైన ప్రేమ ఎలా మనిషిని స్వస్థపరుస్తుందో సోదాహరణంగా వివరించబడింది. పరిశోధకుడు ఒక ఫలితాంశాన్ని వెల్లడించినట్లుగా, ప్రతి కథ చివరిలో రచయిత ఒక బైబిల్ వాక్యంతో ముగించడం ఈ కథల శిల్ప రహస్యాల్లో ఒకటి. సమకాలీన సమాజంలో విలువల క్షీణతను అరికట్టడానికి, మానసిక పరివర్తన ద్వారా నూతన జీవితాన్ని ప్రారంభించడానికి ఈ కథలు ఒక దిక్సూచిలా ఎలా పనిచేస్తాయో ఈ పత్రం విశ్లేషిస్తుంది.

కీలక పదాలు (Keywords):సమకాలీన తెలుగు కథ, ఆచార్య కృపాచారి, ఆధ్యాత్మిక సత్యాలు, బైబిల్ విలువలు, ఐసియు కథలు, సామాజిక ప్రతిఫలనం, పశ్చాత్తాపం.

**ఉపోద్ఘాతం (Introduction):** "సాహిత్యం సమాజానికి దర్పణం" అన్నది ఎంత సత్యమో, సాహిత్యం మనిషి అంతరాత్మను శుద్ధి చేసే ఒక సాధనం అన్నది కూడా అంతే సత్యం. కథా సాహిత్యం కేవలం వినోదం కోసం మాత్రమే కాక, సామాజిక రుగ్మతలను ఎత్తిచూపుతూ, నైతిక విలువల వైపు మనిషిని నడిపించే

బాధ్యతను కలిగి ఉంటుంది. సమకాలీన తెలుగు కథా సాహిత్యంలో వస్తు వైవిధ్యం పెరుగుతున్న తరుణంలో, ఆధ్యాత్మిక సత్యాలను వాస్తవిక జీవిత గాథలతో ముడిపెట్టి చెప్పే ప్రక్రియకు ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి గారి రచనలు ఒక దిక్సూచిగా నిలుస్తున్నాయి.

**నేపథ్యం - ICU కథల ఆవిర్భావం:** 2020-21 కాలంలో ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి మనిషి అస్తిత్వాన్ని ప్రశ్నించింది. మరణం అతి సమీపంలోకి వచ్చినప్పుడు మనిషి తన హోదాను, అధికారాన్ని, ఆస్తిపాస్తులను మర్చిపోయి అత్యంత నిస్సహాయ స్థితికి చేరుకుంటాడు. ఆచార్య కృపాచారి గారు స్వయంగా కరోనా బాధితుడిగా ఐసియు (ICU) లో గడిపిన కాలంలో, అక్కడ రోగుల ప్రవర్తనను, వారి మానసిక స్థితిగతులను ఒక సైకాలజిస్టు వలె, అంతకంటే మిన్నగా ఒక సహృదయ రచయితగా గమనించారు. ఆ పరిశీలనల ఫలితమే 'స్పందన' పత్రికలో ప్రచురితమైన 'ICU కరోనా కథలు'. (2021-22)

**ఆధ్యాత్మిక సత్యాల సమన్వయం:** ఈ కథల విశిష్టత ఏమిటంటే, ఇవి కేవలం ఆసుపత్రి కష్టాలను చెప్పే కన్నీటి గాథలు కావు. ప్రతి కథ వెనుక ఒక ఆధ్యాత్మిక సత్యం (Spiritual Truth) అంతర్లీనంగా ఉంటుంది. బైబిల్ ప్రతిపాదించిన 'ప్రేమ, పశ్చాత్తాపం, ప్రార్థన, మరియు దైవ న్యాయం' అనే సూత్రాలను రచయిత నిత్య జీవిత దృశ్యాలలో సమన్వయం చేశారు. మనిషి తన జీవిత కాలంలో చేసిన తప్పులకు ప్రతిఫలం ఎలా అనుభవిస్తాడు, ప్రాణం పోయే గడియల్లో కూడా అహంకారం ఎలా వెన్నాడుతుంది, మరియు దైవకృప మనిషిని ఎలా పునర్జీవింపజేస్తుంది అనే అంశాలను ఈ కథలు చర్చిస్తాయి.

**పరిశోధన లక్ష్యం:**ఈ పరిశోధన పత్రం ప్రధానంగా ఆచార్య కృపాచారి గారి కథలలోని శిల్ప వైవిధ్యం, వాటిలో ప్రతిఫలించే సామాజిక స్పృహ, మరియు వాటి వెనుక ఉన్న బైబిల్ సత్యాల ప్రాముఖ్యతను విశ్లేషించడానికి ప్రయత్నిస్తుంది. మనిషి తనను తాను సంస్కరించుకోవడానికి దేవుడు ఇచ్చే 'చివరి అవకాశం'గా ఆసుపత్రి అనుభవాలను ఎలా భావించవచ్చో ఈ వ్యాసం ద్వారా నిరూపించడం జరుగుతుంది. ఈ పత్రం ద్వారా ఆధ్యాత్మిక విలువలను ఇక్కడ చర్చించడం ప్రధాన ఉద్దేశం.

**ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి గారి పరిచయం:** ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిగారు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 1979 నుండి 2010 వరకు సుమారు మూడు దశాబ్దాల పాటు సుదీర్ఘ సేవలు అందించారు. తర్వాత గుంటూరులోని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ గా ఉన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వారు కేవలం ఆచార్యుడిగానే కాకుండా, తెలుగు, ప్రాచ్యభాషల శాఖ విభాగాధిపతి (Head of the Department), డీన్ (Dean) వంటి ఉన్నత

పరిపాలనా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, విశ్వవిద్యాలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. సాహిత్య పరిశోధనలో వారిది అందెవేసిన చేయి. వారి కలం నుండి 29 ఉత్తమ గ్రంథాలు జాలువారాయి. జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి పరిశోధన పత్రికలలో 349 పరిశోధన పత్రాలను (Research Papers) సమర్పించి, తెలుగు సాహిత్య వైశిష్ట్యాన్ని ప్రపంచ వేదికలపై చాటిచెప్పారు. వారి మార్గదర్శకత్వంలో 75 మంది పి.హెచ్.డి (Ph.D.) పట్టాలను, 69 మంది ఎం.ఫిల్ (M.Phil) డిగ్రీలను అందుకోవడం వారి విధినిర్వహణలో చూపిన నిబద్ధతకు, పరిశోధనా పటిమకు నిదర్శనం. భాషా సాహిత్యాలపై వారికున్న పట్టు అసాధారణమైనది. ఇంటర్మీడియట్ (+2) స్థాయి నుండి డిగ్రీ (UG), పి.జి (PG) వరకు తెలుగు పాఠ్యగ్రంథాల రూపకల్పనలో ప్రధాన సంపాదకులుగా (Chief Editor) వ్యవహరించి, తెలుగు విద్యా ప్రణాళికలను తీర్చిదిద్దారు. విద్యా రంగంలో వారు చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 'రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ' అవార్డుతో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకున్నారు. వారి మేధో సంపత్తి కేవలం భారతదేశానికే పరిమితం కాలేదు. థాయ్‌లాండ్, ఈజిప్ట్, ఇజ్రాయెల్, పాలస్తీనా, జోర్డాన్, రోమ్, జపాన్, అమెరికా వంటి అనేక దేశాలను సందర్శించి, అంతర్జాతీయ వేదికలపై ప్రసంగిస్తూ తెలుగు భాషా సంస్కృతులను పరివ్యాప్తం చేశారు.

ఆచార్యకృపాచారిగారి పేరు చెప్పగానే ఆయన క్రైస్తవ సాహిత్యంపై చేసిన పరిశోధనే గుర్తొస్తుంది. అంత ప్రామాణికమైన సిద్ధాంత గ్రంథంగా పేరొచ్చింది. ఆచార్య కృపాచారి గారి ప్రాథమిక మరియు ఉన్నత విద్యాభ్యాసం క్రమశిక్షణతో కూడిన వాతావరణంలో సాగింది. 1963 నుండి 1965 వరకు గుంటూరు జిల్లాలోని  నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్‌లో వారు విద్యాభ్యాసం చేశారు. ఆ తదుపరి, ఉన్నత చదువుల కోసం గుంటూరులోని ప్రసిద్ధ ఆంధ్రా క్రిస్టియన్ కాలేజ్ (AC College) లో చేరారు. ఆంధ్రా క్రిస్టియన్ కాలేజ (ACC) తెలుగు సాహిత్యానికి, క్రైస్తవ విలువల మేళవింపుకు పెట్టింది పేరు. ఇక్కడ చదువుకోవడం వల్లనే కృపాచారి గారికి తెలుగు భాషా సంప్రదాయాలతో పాటు, బైబిల్ లోని నైతిక విలువలపై పట్టు చిక్కిందని మనం భావించవచ్చు. ఈ విద్యాసంస్థల నేపథ్యం వారిలోని పరిశోధనా తృష్ణను, సామాజిక స్పృహను పెంపొందించడంలో కీలకమైన పాత్ర పోషించాయి. తర్వాత, ఎం.ఏ., పిహెచ్.డి చేశారు. ఆచార్య తూమాటి దొణప్పగారి పర్యవేక్షణలో డాక్టరేట్ చేశారు. *వారు అనేక గ్రంథాలను ప్రచురించారు.* ప్రాసంగిక వ్యాసావళి (1983) గుజ్జర్లమూడి కృపాచారి, బండారు జ్యోతి స్వరూపరాణి గార్లు కలిసి రాసిన వ్యాససంపుటి.

**ఐసియు కరోనా కథల పరిచయం:** ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి గారు గొప్ప సహృదయులు, ప్రేమ మూర్తి. ఇతరుల మనసులను అర్థం చేసుకోవడంలో ఒక సైకాలజిస్టులా సరిగ్గా అంచనా వేస్తుంటారు.

మానవ సంబంధాల్లో మనం గుర్తించలేనంత సున్నితమైన విషయాలను కూడా ఆయన తెలియజేస్తూ అప్పుడప్పుడు కథలుగా రాస్తుంటారు. ''స్పందన'' ఆధ్యాత్మిక మాసపత్రికలో ఆయన ''ICU కరోనా కథలు'' పేరుతో (2021-2022)లో కొన్ని ప్రత్యేకమైన జివన చిత్రాలను కథలుగా ఒక్కపేజిలో సరిపోయేలా రాశారు. అవన్నీ మనం నిత్యం చూస్తున్న దృశ్యాలే అయినా వాటిని మరలా మనం ఇలా అక్షర రూపంలో చదువుతుంటే ఆ జీవితాలలో జరిగిన కార్యాలు ఆశ్చర్యమనిపిస్తుంది. సమకాలీన కథా సాహిత్యంలో ఆధ్యాత్మిక సత్యాలను ఆవిష్కరించిన తీరు తెలుగు కథా సాహిత్యంలోనే ఒక నూతన పార్శ్వాన్ని ఆవిష్కరిస్తుంది.

అక్టోబరు 2021 సంచికలో కరోనాతో ఆసుపత్రిలో చేరిన ఒక ముసలావిడ చేసిన హడావిడిని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. వాస్తవాన్ని పేషెంట్లకు వాస్తవంగా చెప్పడానికి ఆసుపత్రిలో సిబ్బంది ఎన్ని అవస్థలకు గురవుతుంటారో ఈ కథ మనకి తెలియజేస్తుంది.

నవంబరు 2021 సంచికలో కరోనా సోకిన తన కొడుకునెలాగైనా కాపాడుకోవాలని ఒక తల్లి ఆసుపత్రిలో చేరిస్తే, వైద్యులు తమ నిస్సహాయతను వ్యక్తం చేస్తారు. అయినా తన కొడుకుని చూస్తూ ఆమె ఆందోళనతో నిద్రలేకుండా రాత్రంతా ఆందోళన పడుతూనే ఉంటుంది. తెల్లవారుతుందనగా తనకు తెలియకుండానే ఆ తల్లి నిద్రలోకి జారుకుంటుంది. ప్రొద్దున కొడుకు నవ్వుతూ, సంతోషంగా మాట్లాడుతూ కనిపిస్తాడు. అంత ఆందోళన పడుతున్న సమయంలోనే ఒక పాస్టర్ వచ్చి ప్రార్ధన చేసి వెళ్ళిపోయిన సంఘటన అప్పుడు గుర్తుకొస్తుంది. ఆ వచ్చింది పాస్టర్ రూపంలో దేవుడేనని గమనించిన ఆమె మనసంతా కృతజ్ఞతాస్తుతులతో నిండిపోతుంది. మనుషులకు సాధ్యం కానిది ఉండవచ్చునేమో, కానీ, దేవునికి సాధ్యం కానిది ఉంటుందా! ప్రార్ధనలో ఉన్న మహిమను, ఎవ్వరూ నిర్లక్ష్యం చేయడం గానీ, చులకన చేయడం గానీ చేయకూడదనే సత్యాన్ని ఆ వాస్తవిక కథ ద్వారా రచయిత తెలియజేశారు.

డిసెంబర్ 2021 సంచికలో 'కరోనా కలిపిన క్రిస్మస్' లో మతాలు వేరైనా వారి అభిమతాలు ఒకటి కావడానికి మనుషుల మధ్య కనిపించిన నిజమైన ప్రేమే కారణమైందని వివరించారు. ఫిబ్రవరి 2022 లో కొంతమంది తమ చివరి ఘడియల్లో కూడా మనుషుల్ని ప్రేమించలేని వాళ్లు ఉంటారని, అది అంతా తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించడానికి చేసే ప్రయత్నమైనా, దానివల్ల ఎంత మంది మనః క్షోభకు గురౌతారో చక్కగా తెలిపారు.

మార్చి, 2022 సంచికలో ఒక ముసలమ్మ ఆసుపత్రిలో చేరిన తర్వాత, ఆమె పొట్టలో రాళ్ళున్నాయని, ఆపరేషన్ చేసి తీయాలని వైద్యులు చెబుతారు. ఆమె పాఠశాల విద్యార్థులకు పెట్టవలసిన కోడిగుడ్లు, కూరగాయలు సరిపడా పెట్టకుండా, దొంగ చాటుగా తన ఇంటికి పట్టుకొని వెళ్ళి తృప్తిగా తినేదని, దాని ఫలితంగానే ఇలా ఆసుపత్రి పాలయ్యిందని ఆమెను చూసుకోవడానికని వచ్చిన ఆమె ప్రక్కవాళ్ళతో చెబుతుంది. మనం చేసిన పాపానికి పరిహారం తప్పదని, దానికి దేవుడు ఏదోక రూపంలో శిక్షిస్తాడని హెచ్చరిస్తాడు కథకుడు.

ఇలా తాను కూడా కరోనాబాధితుడిగా ఆసుపత్రిలో చేరి, దాన్ని జయించిన తర్వాత తాను గమనించిన అనేకమంది జీవిత గాథలను ఐసియు కథలుగా రాస్తూ, కొన్ని జీవిత సత్యాలను సాక్ష్యాలుగా మన ముందు అక్షర దృశ్యంలా ఆవిష్కరించారు కథా రచయిత.

ఒక్క పేజీలో, చక్కని తెలుగు వాక్యాలతో, సందర్భోచితమైన పలుకుబడులతో, వాస్తవ జీవితాలను ఒక కథలా అందించడం ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిగారి సృజన నైపుణ్యానికి నిదర్శనం. సాధారణంగా జీవితంలో ఏదోక నాడు ప్రతివారూ ఏదోక అనారోగ్య సమస్యతో ఆసుపత్రిలో చేరతారు. అది మానవుని ఆలోచనా విధానాన్నే మార్చేయవచ్చు. అది కూడా మనిషి క్రొత్త జీవితానికి పయనించడానికి దేవుడు మనకిచ్చే మరో చివరి అవకాశం కూడా కావచ్చు. ఒక గొప్ప మానసిక పరివర్తన కలగవచ్చు, లేకపోతే తాను చేసిన పాపాన్ని గుర్తించలేని మూర్ఖత్వంలో కూడా మరణించవచ్చు. ఒక ఆసుపత్రి ద్వారా మన జీవన గమనం ఎలా ఉంటుందో, ఆ జీవన గమనం ద్వారా నేర్చుకోవలసిన జీవిత పాఠాలను మనకిలా అందించడానికే దేవుడు ఆచార్య కృపాచారి గారిని కూడా కరోనా నెపంతో ఆసుపత్రిలో ఉండేలా చేశారేమో అనిపిస్తుంది. ఈ కథలు దేవుని మహిమను, ఘనతను తెలియ జేస్తున్నాయి. దేవుణ్ణి వ్యతిరేకించే వ్యక్తుల జీవితాలు ఎలా పతనమై పోతాయో తెలియజేస్తున్నాయి. తాను సేకరించిన వాస్తవాల నుండి పరిశోధకుడు ఆ ఫలితాంశాల్ని వెల్లడించినట్లు, రచయిత కృపాచారిగారు మానవుడు తన జీవితంలో జీవించిన విధానాన్ని బట్టి ఆ జీవితానికి భగవంతుడు ఎలాంటి ఫలితాన్ని ఇస్తాడో పరిశుద్ధ గ్రంథంలోని ఒక వాక్యం ద్వారా ఆ కథను ముగించడం ఈ కథల్లో కనిపించే ఒక గొప్ప కొసమెరుపు. ఒక సంఘటన ద్వారా జీవితాన్ని అంతటిని చూపించడం అనేది ఈ కథలో కనిపించే గొప్ప శిల్ప రహస్యం. చిన్న కథల్లో కూడా మరీ చిన్న కథలా ఒక గీత గీసి, దానికి అటూయిటూ దాటకుండా వాస్తవజీవిత సత్యాన్ని దృశ్యాత్మకంగా వర్ణించే కల్పనా సాహిత్య ప్రక్రియలో ఇటువంటి దాన్ని స్కెచ్ స్టోరీ అని పిలిచే అవకాశం ఉంది. ఇలాంటి రచనల్లో రచయితలు సూచన ద్వారా చెప్పవలసినవెన్నో ఉన్నావాటిని పాఠకునికే వదిలేస్తారు. దీనివల్ల కథ చిన్నదే కావడం, మబ్బుల మాటునో, చెట్టు రెమ్మలు, కొమ్ములు, ఆకుల

మాటునో దాగిన వాటినో వెతుకుతుంటే, తొలుత దొరకనివేవో వెతికితే ఒక్కొక్కటీ దొరుకుతుంటే పొందే సంతోషంలాంటిదేదో పాఠకుడు పొందుతూ ఆ చిన్ని కథను మరలా మరలా చదివే అవకాశం ఉంటుంది. ఈ లక్షణాలన్నీ ఆచార్య కృపాచారి గారు రాసిన ఈ కథలలో కనిపిస్తాయి. మానవ జీవితం పరిపూర్ణమవుతున్నప్పుడు ఆ ప్రేమామృతాన్ని అందరికీ పంచాలనుకోవడం దివ్యమైన గుణం. అది ఆధ్యాత్మిక జీవనంతో ముడిపడి ఉంటుంది. ఆధ్యాత్మికత మానవుని అస్తిత్వాన్ని, ఈ భౌతిక ప్రపంచాన్ని, మనిషి నిత్యం చూసే సత్యాలు, అసత్యాలు శాశ్వతాలు, ఆశాశ్వతాలు, లౌకికం, పారలౌకికం మొదలైన తాత్వకాంశాలపై నిరంతరం ఆలోచించేలా చేస్తుంది. తానేమిటో తనకు తెలిసిన తర్వాత లోకమంతా ప్రేమమయంగా కనిపిస్తుంది. ఆ ప్రేమ, ఆ పవిత్రత, వాటిని తినేవాళ్ళందరికీ పంచాలనే తపనే ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిగారి ఈ చిన్ని కథల్లో కనిపించే పెద్ద ఆశ.

**ఆధ్యాత్మిక వాస్తవికత (Spiritual Realism): సైద్ధాంతిక విశ్లేషణ** ఆధ్యాత్మిక వాస్తవిక వాదం (Spiritual Realism) అనేది సాహిత్య విమర్శలో ఒక విశిష్టమైన సిద్ధాంతం. ఇది భౌతిక జగత్తులోని యదార్థాలను (Realism), కంటికి కనిపించని దైవిక లేదా నైతిక సత్యాలను (Spiritual Truths) ఏకకాలంలో చిత్రించే ప్రక్రియ.సాధారణ 'వాస్తవిక వాదం' మనిషి కంటికి కనిపించే సామాజిక పరిస్థితులను, భౌతిక సంఘటనలను మాత్రమే వివరిస్తే, 'ఆధ్యాత్మిక వాస్తవిక వాదం' ఆ సంఘటనల వెనుక ఉన్న దైవ సంకల్పాన్ని లేదా ఆత్మ సంబంధిత పరిణామాలను అన్వేషిస్తుంది.

సాహిత్య విమర్శలో 'వాస్తవికత' (Realism) అనేది సమాజంలోని పరిస్థితులను, మానవ ప్రవర్తనను ఉన్నదున్నట్లుగా చిత్రించే ఒక పద్ధతి. అయితే, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి గారి కథలను లోతుగా పరిశీలిస్తే, అందులో కేవలం భౌతిక వాస్తవికత మాత్రమే కాక, అంతకుమించిన 'ఆధ్యాత్మిక వాస్తవికత' (Spiritual Realism) గోచరిస్తుంది.

**సిద్ధాంత నిర్వచనం:** ఆధ్యాత్మిక వాస్తవికత అనేది భౌతిక జగత్తులోని సంఘటనలను దైవిక సత్యాలతో అనుసంధానించే ఒక ప్రక్రియ. ఇది మనిషిని కేవలం ఒక సామాజిక జీవిగా మాత్రమే కాకుండా, ఒక 'ఆధ్యాత్మిక ఉనికి'గా (Spiritual Being) గుర్తిస్తుంది. ఐసియు (ICU) వంటి మరణ శయ్యల వాతావరణంలో మనిషి పొందే వేదన శరీరానికి సంబంధించింది అయితే, ఆ వేదన ద్వారా కలిగే అంతర్మథనం మరియు పశ్చాత్తాపం ఆత్మకు సంబంధించినవి. ఈ రెండింటి కలయికనే ఆధ్యాత్మిక వాస్తవికత అంటారు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

**సైద్ధాంతిక మూలాలు:** ఈ సిద్ధాంతానికి ప్రధానంగా బైబిల్ లోని 'ఉపమానాలు' (Parables) పునాదిగా నిలుస్తాయి. నిత్య జీవితంలోని సామాన్య సంఘటనల ద్వారా పరలోక సంబంధమైన గంభీర సత్యాలను బోధించడం ఇందులోని విశిష్టత.

రైన్‌హోల్డ్ నిబర్ (Karl Paul Reinhold Niebuhr[a] (1892 – 1971) ): తన 'క్రిస్టియన్ రియలిజం' సిద్ధాంతంలో మనిషిలోని నైతిక వైఫల్యాలను (Sin), దైవకృప (Grace) ఎలా సరిదిద్దుతుందో వివరించారు. రీన్‌హోల్డ్ నిబర్ వంటి గొప్ప దైవశాస్త్రవేత్తలు ప్రతిపాదించిన 'క్రిస్టియన్ రియలిజం' ఆచార్య కృపాచారి గారి కథల్లో ఒక సజీవ రూపంగా కనిపిస్తుంది. నిబర్ తన ప్రసంగాల్లోను, గ్రంథాల్లోను ఏ సత్యాలైతే చర్చించారో, కృపాచారి గారు వాటిని ఐసియు లోని సామాన్య పాత్రల ద్వారా దృశ్యాత్మకంగా వర్ణించారు. మనిషి తన బలహీనతలను (Human Frailty) గుర్తించి, దైవ సన్నిధిలో తగ్గించుకున్నప్పుడే నిజమైన స్వస్థత లభిస్తుందనే విశ్వజనీన సత్యాన్ని ఈ కథలు చాటి చెబుతున్నాయి.

దోస్తోవిస్కి ( Fyodor Mikhailovich Dostoevsky, 1821 – 1881): రష్యన్ సాహిత్యంలో ఈయన భౌతిక కష్టాలను ఆత్మ శుద్ధికి మార్గాలుగా చిత్రించారు.రష్యన్ రచయిత దోస్తోవిస్కి తన రచనల్లో 'బాధ ద్వారా ఆత్మశుద్ధి' అనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆచార్య కృపాచారి గారి ICU కథల్లో కూడా ఈ సిద్ధాంతం సజీవంగా కనిపిస్తుంది. ఐసియు వార్డులో రోగి అనుభవించే భౌతిక వేదన, అతని అంతరాత్మను మేల్కొలిపి, దైవ ప్రకాశం వైపు నడిపిస్తుంది. దోస్తోవిస్కి నవలల్లోని పాత్రల వలెనే, కృపాచారి గారి కథల్లోని వ్యక్తులు కూడా కష్టాల గుండా ప్రయాణించి, తమలోని అహంకారాన్ని వదిలి, పశ్చాత్తాపం అనే పునీత మార్గాన్ని ఎంచుకుంటున్నారు.

Fyodor Dostoevsky రచించిన ప్రసిద్ధ నవల ‘Crime and Punishment’(1866). ప్రపంచ సాహిత్యంలో గొప్ప రచనలలో ఒకటి. దీనిలో కథానాయకుడు రస్కోల్నికోవ్ తను చేసిన హత్యకు పశ్చాత్తాపం చెంది, సైబీరియా జైలులో కష్టాలు అనుభవిస్తూ బైబిల్ ద్వారా ఆత్మశాంతిని ఎలా పొందాడో వివరిస్తుంది. ఇటువంటి కథే కృపాచారి గారి కథల్లోని 'పశ్చాత్తాపం' అనే కథలోనూ చూడొచ్చు.

The Varieties of Religious Experience అనే గ్రంథంలో William James మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు పొందే ఆధ్యాత్మిక అనుభవాల (Religious Experiences) గురించి ఇది శాస్త్రీయంగా

వివరిస్తుంది. ఆచార్య కృపాచారిగారి కథలను మరింత సైద్ధాంతికంగా అవగాహన చేసుకోవడానికి ఈ గ్రంథం ఉపయోగపడుతుంది.

విలియం జేమ్స్ (William James) తన సుప్రసిద్ధ గ్రంథం "The Varieties of Religious Experience" (మతపరమైన అనుభవాల వైవిధ్యం) లో మనిషి పొందే ఆధ్యాత్మిక అనుభవాలను మనస్తత్వశాస్త్ర కోణంలో విశ్లేషించారు. ఆచార్య కృపాచారి గారి 'ICU కథలు' ఈ గ్రంథంలోని సిద్ధాంతాలకు సజీవ ఉదాహరణలుగా నిలుస్తాయి.

**విలియం జేమ్స్ సిద్ధాంతం - కృపాచారి కథల విశ్లేషణ**

**1. జబ్బుపడిన ఆత్మలు (The Sick Soul):** విలియం జేమ్స్ తన గ్రంథంలో మనుషులను రెండు రకాలుగా విభజించారు. ఒకటి 'సహజసిద్ధంగా సుఖవంతులు' (Once-born), రెండు 'జబ్బుపడిన ఆత్మలు' (The Sick Soul/Twice-born).

కృపాచారి గారి కథల్లోని పాత్రలు ఎక్కువగా 'జబ్బుపడిన ఆత్మల' కోవకు చెందుతాయి. అంటే, వారు తమ జీవితంలో కష్టాలను, పాపాన్ని, మరణ భయాన్ని ఎదుర్కొన్నప్పుడు మాత్రమే దైవ చింతన వైపు మొగ్గు చూపుతారు. ఐసియు (ICU) లోని రోగి తన నిస్సహాయతను గుర్తించినప్పుడు, విలియం జేమ్స్ చెప్పినట్లుగా "ప్రపంచం తన అసలు రూపమైన దుఃఖాన్ని" చూపిస్తుంది. ఈ దుఃఖమే వారిని ఆధ్యాత్మిక మార్పుకు పురికొల్పుతుంది.

**2. మనఃపరివర్తన (Conversion):** జేమ్స్ సిద్ధాంతం ప్రకారం 'కన్వర్షన్' అంటే మతం మారడం మాత్రమే కాదు, ఒక వ్యక్తి యొక్క ప్రాధాన్యతలు మారి, దైవిక అంశాలు అతని కేంద్ర బిందువుగా మారడం.

నవంబర్ 2021 సంచికలోని తల్లి కథ దీనికి అద్భుతమైన ఉదాహరణ. కొడుకు ప్రాణం కోసం కొట్టుమిట్టాడుతున్న ఆ తల్లికి, ఒక పాస్టర్ రూపంలో దేవుడు వచ్చి ప్రార్థన చేసినప్పుడు ఆమెలో కలిగిన ఆనందం, కృతజ్ఞత విలియం జేమ్స్ వివరించిన 'Sudden Conversion' (ఆకస్మిక పరివర్తన). భయం స్థానంలో విశ్వాసం వచ్చి చేరడం ఇక్కడ కనిపిస్తుంది.

**3. ప్రార్థన యొక్క ప్రభావం (The Efficacy of Prayer):** విలియం జేమ్స్ ప్రార్థనను ఒక "మానసిక శక్తి ప్రవాహం"గా అభివర్ణించారు. ప్రార్థన ద్వారా మనిషి ఒక అతీత శక్తితో అనుసంధానమై, తనలోని ఆందోళనను పోగొట్టుకుంటాడని ఆయన చెప్పారు.

కృపాచారి గారి కథలలో ప్రార్థన కేవలం ఒక ఆచారం కాదు, అది స్వస్థతనిచ్చే ఒక ఔషధం. మనుషులకు సాధ్యం కానిది దేవునికి సాధ్యమని రచయిత చెప్పడం, విలియం జేమ్స్ చెప్పిన "ప్రార్థన ద్వారా మానవ మేధస్సు ఒక ఉన్నత శక్తితో ఏకమవుతుంది" అనే భావనతో ఏకీభవిస్తుంది.

**4. యోగ్యతా సిద్ధాంతం (Fruits for Life):** ఒక ఆధ్యాత్మిక అనుభవం నిజమైనదా కాదా అని తేల్చడానికి విలియం జేమ్స్ 'ప్రాగ్మాటిక్' (Pragmatic) పద్ధతిని వాడారు. అంటే ఆ అనుభవం వల్ల ఆ వ్యక్తి ప్రవర్తనలో మార్పు వచ్చిందా లేదా అనేదే ముఖ్యం.

మార్చి 2022 కథలో ముసలమ్మ పొట్టలో రాళ్లు రావడం ద్వారా ఆమె తన తప్పును తెలుసుకోవడం ఒక పాఠం. ఆమెలో కలిగే ఆ పశ్చాత్తాపం ఆమె తదుపరి జీవితాన్ని మారుస్తుంది. రచయిత కథలను బైబిల్ వాక్యంతో ముగించడం అనేది, విలియం జేమ్స్ చెప్పినట్లుగా ఆ ఆధ్యాత్మిక అనుభవం యొక్క 'ఫలితాన్ని' (Fruit) నిర్ధారించడమే.

మొత్తం మీద"విలియం జేమ్స్ తన 'The Varieties of Religious Experience'లో వివరించినట్లుగా, మనిషి తన పరిమితులను గుర్తించి, సంక్షోభంలో ఉన్నప్పుడే దైవత్వం పట్ల అత్యంత లోతైన అనుభూతిని పొందుతాడు. ఆచార్య కృపాచారి గారి కథలలోని ఐసియు వాతావరణం, విలియం జేమ్స్ చెప్పిన 'జబ్బుపడిన ఆత్మలను' స్వస్థపరిచే ఒక వేదికగా మారింది. ఇక్కడ వ్యాధి కేవలం భౌతికమైనది కాదు, అది ఆత్మను సరిదిద్దే ఒక ప్రక్రియ. ప్రార్థన, పశ్చాత్తాపం ద్వారా రోగి పొందే మానసిక ప్రశాంతత విలియం జేమ్స్ ప్రతిపాదించిన ఆధ్యాత్మిక ప్రాయోగికతకు (Spiritual Pragmatism) నిదర్శనంగా నిలుస్తాయి.

**కృపాచారి గారి కథలలో అన్వయం:** ఈ సిద్ధాంతాలన్ని ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి గారి కథలలో ఈ అంశాలను తెలియజేస్తాయి.

నైతిక క్రమం (Moral Order): సమాజంలో మనిషి చేసే పనులు దేవుని కంటికి మరుగై ఉండవని, ఏదో ఒక రూపంలో దానికి ప్రతిఫలం ఉంటుందని రచయిత నిరూపిస్తారు. ఉదాహరణకు, ముసలమ్మ కథలో

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

ఆమె చేసిన అక్రమం 'శారీరక వ్యాధి'గా బయటపడటం కేవలం కాకతాళీయం కాదు, అది ఒక ఆధ్యాత్మిక న్యాయం.

దైవకృప, ప్రార్థన (Providence & Prayer): వైద్యశాస్త్రం పరిమితులు ముగిసిన చోట, అదృశ్య శక్తి అయిన దేవుడు ప్రార్థన ద్వారా రోగిని స్వస్థపరచడం 'అతిభౌతిక వాస్తవికత'కు (Metaphysical Realism) నిదర్శనం.

పశ్చాత్తాపం - పునర్జన్మ: ఆసుపత్రి అనుభవాలు మనిషిని మార్చి, ఒక నూతన సృష్టిగా (New Creation) తీర్చిదిద్దుతాయని రచయిత బలంగా విశ్వసిస్తారు.

ఆచార్య కృపాచారి గారి కథల్లో ప్రతి పాత్ర ఒక 'నైతిక పాఠం'. ఐసియు లోని ప్రతి గడియ ఒక 'ఆధ్యాత్మిక పరీక్ష'. ఇక్కడ 'వాస్తవికత' అనేది 'సత్యం' వైపు ప్రయాణించడానికి ఒక వాహనం మాత్రమే. రచయిత ఉద్దేశంలో మనిషి అనారోగ్యం పాలవ్వడం అనేది కేవలం ఒక శారీరక ఇబ్బంది కాదు, అది దేవుడు మనిషికి తనను తాను సరిదిద్దుకోవడానికి ఇచ్చే ఒక 'దివ్యమైన పిలుపు' (Divine Call).

**ముగింపు:** "తెలుగు కథా సాహిత్యంలో ఆధ్యాత్మిక సత్యాలు: ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారిగారి కథలు" అనే ఈ పరిశోధన ద్వారా మనం గ్రహించవలసిన ప్రధానాంశం ఏమంటే - సాహిత్యం కేవలం అక్షర విన్యాసం కాదు, అది ఒక జీవన మార్గదర్శి. నరసరావుపేట మున్సిపల్ స్కూల్ నుండి నాగార్జున విశ్వవిద్యాలయం డీన్ వరకు, ఏసీ కాలేజి విద్యార్థి నుండి అంతర్జాతీయ పరిశోధకుడి వరకు సాగిన కృపాచారి గారి సుదీర్ఘ ప్రస్థానం వారి కథల్లో పరిణతిగా కనిపిస్తుంది. సమకాలీన సమాజంలో మనిషి పరాయీకరణకు గురవుతున్న తరుణంలో, కృపాచారి గారి 'ICU కథలు' మనిషిని మనిషిగా ప్రేమించమని, దేవుని యందు భయభక్తులు కలిగి జీవించమని ప్రబోధిస్తున్నాయి. ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో ఇవి 'ఆధ్యాత్మిక వాస్తవికత'కు (Spiritual Realism) చిరునామాగా నిలుస్తాయి.ఆధ్యాత్మిక సత్యం అనేది పుస్తకాలలో చదివేది కాదు, అది అనుభవపూర్వకంగా తెలుసుకునేది. ఆచార్య కృపాచారి గారు ఐసియులో తాను పొందిన, గమనించిన ఆ అనుభవాలనే 'కథల' రూపంలో సాక్ష్యాలుగా మన ముందుంచారు. వాస్తవం కళ్లకు కనిపిస్తే, సత్యం మనస్సుకు తడుతుంది. ఈ కథలు మన మనస్సును తట్టి లేపే ఆధ్యాత్మిక సత్యాల సంహితలు.

**ఆధార గ్రంథ సూచిక (Bibliography)**


- కృపాచారి, గుజ్జర్లమూడి. ICU కరోనా కథలు, స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక (2021-2022).
- James, William. The Varieties of Religious Experience. Longmans, 1902.
- Niebuhr, Reinhold. Moral Man and Immoral Society. Scribner's, 1932.
- Dostoevsky, Fyodor. Crime and Punishment. (1866 Russian)Translated by Richard Pevear and Larissa Volokhonsky, Vintage Classics, 1992.
- కృపాచారి, గుజ్జర్లమూడి.ప్రాణహిత కథల సంపుటి, వంగూరి ఫౌండేషన్, 2015

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# శారద లేఖలు స్త్రీల చైతన్యం

దిట్టకవి కృష్ణమాచార్యులు
పరిశోధక విద్యార్థి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

## వ్యాస సంగ్రహం

ఆంధ్ర వాఙ్మయంలో స్త్రీల అభ్యున్నతి కొరకు, స్త్రీల స్వేచ్ఛకు, గౌరవానికి నాంది పలికినటువంటి స్త్రీవాదంలో మొదట స్త్రీ విషయ రచనలు తక్కువగా ఉన్న సందర్భంలో అప్పుడే ఊపందుకుంటున్న స్త్రీవాదానికి ఊతమిచ్చి ముందుకు లాగినటువంటి రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు అని చెప్పవచ్చును. 'శారద' అనే కలం పేరుతో వీరు రాసినటువంటి లేఖలు తెలుగు సారస్వతంలో చాలా ప్రాచుర్యాన్ని పొందాయి. శారద కల్పలతల మధ్య నడిచిన లేఖలు శారద లేఖలు. వరలక్ష్మమ్మ గారు 'సౌభాగ్యవతి కల్పలతకు' అని మొదలుపెట్టి శారద లేఖలను రాశారు. ఇందులో 1929 నుంచి 1934 వరకు జరిగినటువంటి సామాజిక అంశాల మీద ముఖ్యంగా స్త్రీల అభ్యున్నతికి దోహదపడే శారద చట్టం, స్త్రీల యొక్క నాటక రంగ ప్రవేశం, స్త్రీలకు గౌరవ బిరుదులు, మద్యనిషేధన ప్రచారంలో స్త్రీలు, సంఘసంస్కరణ ఉద్యమంలో స్త్రీలు, స్వాతంత్ర్యోద్యమంలో స్త్రీలు, మొదలైన అంశాలను విశదీకరిస్తూ రాశారు ఇవే కాక సంఘసంస్కరణ మహాసభల గూర్చి, కాళహస్తీశ్వర క్షేత్రం గురించి, సరోజినీ దేవి గారి ప్రసంగం గూర్చి, శారదనికేతన్ వార్షికోత్సవం గురించి, దక్షిణ దేశ యాత్రలను గూర్చి, ఆంధ్ర మహిళా సభలను గూర్చి,స్వదేశీ వస్తువుల వాడకం గూర్చి క్షుణ్ణంగా రాసినటువంటి లేఖల రూపంలో వచ్చిన వ్యాసాలు మొదటి సంపుటంలో ప్రచురించబడ్డాయి. 'గృహలక్ష్మి' ద్వారా వెలువడిన ఈ శారదా లేఖలలోని స్త్రీల అభ్యున్నతి, చైతన్యం, గౌరవం అనే అంశాలను విశదీకరిస్తూ నేటి సమాజానికి కూడా అన్వయించే విషయములను ఈ వ్యాసం ద్వారా పరిచయం చేయదలచాను.

## రచయిత్రి పరిచయం

బాపట్లలో 1896లో అక్టోబర్ 6న వరలక్ష్మి గారు జన్మించారు తల్లిదండ్రులు హనుమాయమ్మ, పాలపర్తి శేషయ్య. ఆమెకు ఏడుగురు తోబుట్టువులు.1909 లో కనుపర్తి హనుమంతరావుతో వివాహం జరిగింది. తన అన్న, తరువాత భర్త ప్రోత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించి ఆమె ఎన్నో రచనలు అనువాదాలు చేశారు. ఈమే మొదటి కథ 'సౌదామిని' 1919లో ఆంగ్ల అనువాదం చేశారు. సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో ఆమె రచనలు చేశారు. 'లేడీస్ క్లబ్', 'రాణి మల్లమ్మ', 'మహిళా మహోదయం', 'పునః

ప్రతిష్ట' వంటి నాటికలు. 'ద్రౌపది వస్త్ర సంరక్షణ', 'సత్యా ద్రౌపది సంవాదం', 'నాదు మాట' మొదలైన పద్య రచనలు. 'నమో ఆంధ్ర మాత' పేరుతో గేయం. గాంధీ మీద దండకం కూడా రచించారు. ఇవే కాకుండా పిల్లల కోసం అనేక పాటలు నవలలు పిట్టకథలు రచించారు. బాలికల అభ్యున్నతి కోసం బాపట్లలో 'స్త్రీ హితైషిని మండలి'ని స్థాపించి స్త్రీల కొరకు ఎన్నో కార్యక్రమాలు జరిపారు. గుంటూరు జిల్లా బోర్డు సభ్యురాలిగా కొనసాగారు. గుడివాడ ప్రజలు ఆమెను 'కవితా ప్రవీణ' అని పిలుచుకునేవారు. ఇక ఆంధ్ర పత్రికలో వచ్చిన వసంతలేఖలను చూచి ఈమెకు కూడా లేఖలు రాయాలనిపించినది అప్పుడు 'ఆంధ్రలక్ష్మి' అను మాసపత్రికకు ఒక లేఖ రాసి పంపారు ఆ పత్రిక నడిచినంత కాలం శారద లేఖలు కూడా క్రమము తప్పకుండా ప్రచురించారు. తరువాత పత్రిక ఆగిపోయినది. తరువాత 'అనసూయ' పత్రికలో రెండు మూడు లేఖలు రాశారు తర్వాత పత్రిక ఆగిపోయినది. తర్వాత 'గృహలక్ష్మి పత్రిక' ప్రకటించినప్పుడు పత్రికాధిపతులు శారద లేఖలను రాయమని కోరారట అప్పుడు ఆరంభమయి 1929 నుంచి 1930 వరకు ధారావాహికంగా శారద లేఖలు అనే శీర్షికతో వచ్చాయి. 1934లో తన రచనలకు గాను గృహలక్ష్మి 'స్వర్ణ కంకణాన్ని' అందుకున్న మొదటి మహిళ. మద్రాసు, విజయవాడ ఆకాశవాణి కార్యక్రమాలలో పాల్గొన్న మొదటి మహిళ. ప్రపంచ తెలుగు మహాసభలో సన్మానం పొందిన రచయిత్రి కూడా వరలక్ష్మమ్మ కావడం అభినందనీయం.

**కీ వర్డ్స్** : స్త్రీ అభ్యుదయము, సంఘసంస్కరణము, అతి బాల్య వివాహము, శారద చట్టం, స్త్రీ డైవర్స్ చట్టము, స్త్రీ విద్య, నాటక రంగంలో స్త్రీ, సమాజంలో స్త్రీల చిత్రణ.

స్త్రీ జనాభ్యుదయ ఉద్యమము సాగుతున్న రోజులలోస్త్రీ విద్య, బాల్యవివాహములను గూర్చి,స్త్రీల నాటక రంగ ప్రవేశం, స్త్రీలకు రాజకీయాలలో అవకాశం, స్త్రీల అభ్యున్నతికి సమితుల స్థాపనలు మొదల మొదలైనవి జరుగుతున్న సందర్భంలో శారద లేఖలు లో ఆనాటి స్థితిగతులను అనుసరిస్తూ అప్పటి పరిస్థితులు మార్పులను జరుగుతున్న ఉద్యమాలను సభలను మొదలైన వాటిని గూర్చి చెబుతూ వాటిని చర్చిస్తూ వాటి ద్వారా స్త్రీలకు కలిగే అభ్యున్నతిని మనకు తెలియజేస్తూ ఈ శారద లేఖలు సాగుతాయి. "మద్రాసులో జరిగిన సంఘ సంస్కార సభ కేవలం స్త్రీ జనాభ్యుదయ చింతనమునుకై ఏర్పడిన సహాయనియే చెప్పవచ్చును సభలోని ముత్తు లక్ష్మీరెడ్డి గారు స్త్రీ విద్యను గూర్చి, ప్రౌఢ వివాహాలను గూర్చి, పునస్సంధాన వయో నిర్ణయముల గూర్చి, స్త్రీలవారసత్వపు హక్కులను గూర్చి, బాల వితంతువుల గూర్చి, వేశ్య సంఘాల గూర్చి వారు ఇచ్చినటువంటి సందేశాలు అమూల్యమైనవి" అని తెలిపింది. దీనిని బట్టి ఆ రోజులలోనే స్త్రీల అభ్యుదయం కోసం ఎంత పాటు పడ్డారో మనం

గమనించవచ్చు, నేటికీ కూడా కుగ్రామాలలో బాలికలను చదవనివ్వకుండా ఉంచడం, మొగ పిల్లలకు ఇచ్చిన ప్రాధాన్యత ఆడబిడ్డలకు ఇవ్వకపోవడం గమనించవచ్చు.

స్త్రీల యొక్క వంటింటి చాకిరీని గూర్చి చెప్తూ లేఖలలో నిరంతరం బదలీలు అయ్యే ఉద్యోగాలు ఉన్న భర్తను వివాహమాడితే ఆ స్త్రీ పరిస్థితి ఎలా ఉంటుందో చిత్రించారు "ఊరుగాయ జాడీలకు, పచ్చడి బానలకు మాత్రమే రైలులో నొక పెట్టెయు, యింటియందొక గదియు మనకుఁ గావలయును. కావుననే "తమిళ స్త్రీలవలె మీకు క్లుప్తత చేతగాదు. ప్రయాణమునకు మీరు పనికి రా"రని మగవా రనుట మనకు పరిపాటియైనది. ఈ మధ్య మన ప్రాంతమునుండి యొక రీగ్రామమున కుద్యోగ సందర్భమున నేతెంచిరి. వారి సామాను నాలుగైదు బండ్లనిండ యుండెను. అయిదాఱు మంచములను గూడ దెచ్చిరి. ఈ ప్రాంతమున మంచముల నాడుకొను అభ్యాసము లేదు. శిశువులు, వృద్ధులు, వ్యాధి గ్రస్తులు, నిండుచూలింతలు, పచ్చి బాలెంతలుగూడ క్రిందనే పడుకొందురు. కాన పైఁజెప్పిన వారి సామానులను ముఖ్య ముగా మంచములను బండ్లనుండి దింపుచుండగా నిచ్చటి వా రాబాలవృద్ధు లతిచోద్యముతో సర్కసు కంపినీవారి సామా నును చూచినట్లు మూగిమూగి చూడసాగిరి" (శా.లే పుట 4) తక్కువ పరికరాలతో గృహ కృత్యాలను వంటలు వండడం నేర్చుకోవడం ఇటువంటి స్త్రీలకు ఎంతో దోహదకమని సలహా ఇచ్చారు. బాలెంత స్త్రీలు కూడా కిందనే నేలపైనే పడుకోవడము అనే దుర్భర విషయాన్ని, స్త్రీ పట్ల ఎంత కారుణ్య హీనముగా ఉన్నారో గమనించవచ్చు.

**సహాయ నిరాకరణ ఉద్యమం- స్త్రీ కర్తవ్యం :** శ్రీకాళహస్తీశ్వరుడు క్షేత్రమును గూర్చి తెలుపుతూ అక్కడ స్త్రీ యొక్క సహజమైన గుణమైనటువంటి సౌందర్య అంశాలను చెబుతూకాళహస్తి క్షేత్రంలో కొయ్య దువ్వెనలను, నల్లగాజులు తయారీ, ప్రత్యేకత గురించి చెబుతుంది. నేడు మనం వాడే ప్లాస్టిక్ దువ్వెనలు గురించి కూడా కొంచెం విచారకరమైనటువంటి భావనను తెలియజేస్తుంది "విదేశములనుండి దిగుమతియైన యా దువ్వెనల నిగనిగలరసి మోహపడువారేగాని మానుతో జేయఁబడిన యీమేలి దువ్వెనల జూచి మెచ్చువా రెవ్వరు? చెక్క దువ్వెనయా! ఛీ ఛీ. ఎంత యవమానము. తలలో బెట్ట గనే పుటుకు పుటుకున పండ్లు రాలుచున్ననుసరే, తిల దూరక పోయిననుసరే, పేలు రాక పోయిననుసరే, మెఱుఁగున్న చాలును. మెఱుగే మన కన్నులలో కంపకొట్టుచున్నది. దువ్వె సలకు మెఱుగు, గాజులకు మెఱుగు, గుడ్డలకు మెఱుగు, మొగ ములకు మెఱుగు! అన్నిటను మెఱుగే నవనాగరికులకు కావల సినది. ఈ వి దేశపు మెఱుఁగులు మన మెఱుగును రూపు మాపుచున్నవను మెఱమెఱ యొక్కరికిని లేదు." (శా.లే పుట 15) విదేశీ వస్తువుల బహిష్కరణ చిత్రిస్తూ తను విదేశంలో అమ్మబడే గాజులను కొనకుండా ఉండడం ఎక్కడ చూసిన విదేశీ గాజులే ఉండడం గమనార్హమని శ్రీకాళహస్తిలో స్వదేశీ గాజులు దొరికాయని, 250 గాజులు చేయించి

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

తీసుకున్నానని చెప్తుంది. అంటే దేశం పై ఒక స్త్రీకి ఎంత స్వాభిమానం ఉండాలో ఈ వాక్యాల ద్వారా మనకు తెలుస్తుంది. "కాని మన స్త్రీలకు వన్నె చిన్నెలపై వ్యామోహము నశింపనివఱకు మన దేశపు పరిశ్రమ లభివృద్ధి జెందవు. దేశీయపరిశ్రమ లభివృద్ధి జెందినగాని మన దేశ మభివృద్ధి జెందదు" (శా.లే పుట 18). దీని ద్వారా స్వదేశీ వస్తువులని కొనాలని విదేశీ వస్తువులను బహిష్కరించాలని చెబుతున్నది కవయిత్రి.

**వివాహ వ్యవస్థ- స్త్రీ- శారద చట్టం** : ఇక సమాజంలో స్త్రీలకు వివాహ వ్యవస్థలో ఉన్న స్థానాన్ని వివరిస్తూ 50 ఏళ్లు వచ్చిన తర్వాత కూడా మగవాడు భార్య మరణిస్తే మరొక పెళ్లికి సిద్ధమవుతాడు అని రైలులో ఒక స్త్రీ యొక్క తండ్రి చేసినటువంటి స్థితిని గూర్చి వివరిస్తూ ఈ విధంగా అంటుంది "మగడు చావగనే మగువ వాంఛ లేవిధముగా నడుగంటి పోవునో మగువ చావగనే మగవాని కోరికలావిధముగా నీరిక లెత్తుచుండును. భర్తృహీన పసిదేయగుగాక, లడవి పువ్వులవలె నిరుపయోగముగ రాలిపోవలెను. కళత్ర విహీనుడు వృద్ధుడేయగుగాక, వాని వాంఛలు మ్రోడు మ్రాకున చిరువులెత్తినట్లు చిగిరించవలెను. ఇది యెట్టి న్యాయము? బాలవిధవ వైరాగ్యమునకు సిద్ధపడవలెనా? నష్ట కళత్రుఁడగు వృద్ధుడు భోగలాలసతకు సిద్ధపడవలెనా? ఆ పసి, దాని మోమున భస్మరేఖలును నీ ముసలివాని మోమున చాదుచుక్కయునా? అయ్యో! ధర్మాధర్మ విచక్షణ లోక ములో నడుగంటినదనుట కీతార్కాణము చాలదా? వివరింప సాధ్యముగాని యా దురన్యాయములనుగూర్చి మనలో మన మూహించుకొనిన చాలును. న్యాయము మనకే తెలియును." (శా.లే పుట 32)

పెళ్లి విషయాలలో స్త్రీ -పురుష అసమానతలను చూపుతూ, తల్లిదండ్రుల నిర్ణయాలకు బలయిన స్త్రీ గురించి చెపుతూ "కూతుండ్ర కాపురము కూలద్రోచియైన కొమరుని నొక యింటివానినిజేయు దురాచా రము మన దేశమున ననాదినుండి యున్న దేగదా! కొమరుడే వారిబిడ్డ, వాని క్షేమము విచారింప వలయుటే వారి ముఖ్య కర్తవ్యము. అందుకు కుమార్తెను బలిగావించుట వారి కొక తప్పుగాదోచదు; కడుపున బుట్టిన బిడ్డయైనను నాడుదియైనంత మాత్రమున నెంత నిర్దయయో కనుడు!" (శా.లే పుట 32) ఇవి అన్నీ కూడా రైలులో ఉండే ఒక స్త్రీ కథను చిత్రిస్తుంది రచయిత్రి. 50 ఏళ్లు వచ్చిన తర్వాత కూడా తండ్రి పెళ్లి చేసుకొని తక్కువ వయసులో సవతి తల్లితోపడిన కష్టాల్ని, ఆమెను ఒక పిచ్చివాడికిచ్చి పెళ్లి చేస్తే ఆమె పడిన పాట్లు, తండ్రి అప్పు చేసి సొమ్మునంతటిని అప్పు వాళ్ళు తీసుకుపోగా, తండ్రి చనిపోయి, పినతల్లి దగ్గర ఉండలేక, పినతల్లి చేసే కార్యక్రమాలు సహించలేక ఆమె గెంటేస్తే ఎటు వెళ్ళాలో తెలియక దిక్కు తోచని స్థితిలో ఉన్న ఒక స్త్రీ విషాదకథను మనకి చెప్తుంది. బాల్య వివాహాల రద్దు చట్టాన్ని తేవడం వల్ల ఉపయోగాలు, అలాగే అతిబాల్య వివాహాల్ని

నిర్మూలించడం వల్ల సంఘంలో జరిగే మార్పులను ఈ పాత్ర ద్వారా వరలక్ష్మమ్మ గారు మనకి తెలియజేస్తున్నారు.

అదే రైలులో మరొక స్త్రీ ని గూర్చి ప్రస్తావిస్తుంది మంచి విద్య గల కుటుంబం తండ్రి మంచి ఉద్యోగం చేస్తూ ఉంటాడు, విద్య గలవారు అని చెప్పి అతనికి ఇచ్చి పెళ్లి చేస్తే అతను ఆమె పెద్దమనిషి అయిన తర్వాత కూడా తన ఇంటికి తీసుకుపోకుండా, కాపురానికి పిల్లని తీసుకెళ్లమని మామ అడిగినప్పుడు నా ఇష్టపూర్వకముగా వివాహము చేశారా, నేను ఆమెను కాపురానికి ససేమిరా తీసుకురాను అంటూ, పెళ్లి ఇష్టమా లేదో కనుక్కోకుండా పెళ్లి చేసే తల్లిదండ్రులు ఉన్నందుకు ఆమెకు ఆ కర్మ తప్పదు అని నిర్మొహమాటంగా చెప్తాడు. ఈ విధంగా విద్య ఉన్నా కూడా మానవతా విలువలు లేకుండా ప్రవర్తించే వారి తీరును గూర్చి చర్చిస్తుంది. ఈ వ్యవహారం వల్ల ఆ స్త్రీకి మొహంలో చిరునవ్వు పోయింది అది ఈ విధంగా వివరిస్తుంది "ఒక స్త్రీ ప్రాణముదీసిన నేరముకంటె నొకస్త్రీ సుఖమును, సంతోషమును, ఉత్సాహోల్లాసములను నాశముజేసి జీవన్మృతురాల నుగాఁ జేసిననేరము బలవత్తరమైనది." (శా.లే పుట 4x)

వీటిని రూపు మాపటానికి శారద చట్టం ఎంతో అవసరమని, స్త్రీల అభ్యున్నతికి పాటుపడుతున్నటువంటి శారదానికేతన్ కృషిని కూడా ఆమె లేఖలలో తెలుపుతుంది. స్త్రీల పాలిట కల్పతరువు అని స్త్రీల విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పి ఆమె తెలియజేస్తుంది.

**వేశ్యలు - సాంఘిక స్త్రీల పై ప్రభావము** "దేవవేశ్యలైననేమి మర్త్యవేశ్యలై ననేమి; వేశ్య జాతి మూలకముగా స్త్రీసంఘమునకు చెందిన యపఖ్యాతి అపారము, కాని యీజాతిని సృష్టించినవారును పురుషులే, దూషింపుచున్న వారును పురుషులే. కాన వీని నన్నింటిని బాగుగా గుర్తించి నూతనోద్యమమునకు చేయూత నిచ్చుటో నిరసించుటో యనెడు బాధ్యత ప్రతిస్త్రీపైనున్నది. ఇది మనదిగాదని యూరకొనుట మనజాతి సౌభాగ్యమును నష్ట పఱచుకొనుట, మఱియు దీనివలన గలిగెడు మంచి చెడ్డలు స్త్రీలవే కాబట్టి పురుషులకంటె స్త్రీలే ఈవిషయమును పూర్ణ ముగా విచారించి కర్తవ్యమును నిర్ణయించుకొనవలసినవారై యున్నారు." (శా.లే పుట 101) ఈ మాటల ద్వారా ఒక సామాన్య స్త్రీ,సంఘంలో గౌరవంగా బతకాలనుకునే స్త్రీకి ఎన్ని ఇక్కట్లో తెలుసుకోవచ్చు. నేటికీ కూడా వేశ్యా ప్రవృత్తిని మాని సంఘంలోకి ప్రవేశించాలి అంటే ఒక స్త్రీ పడే కష్టాన్ని ఎవరు గుర్తించరు, ఆ బాధను పడే ఆమెకు మాత్రమే తెలుసు, నేటికీ వేశ్యలను అడ్డుపెట్టుకొని సాంసారిక జీవనాన్ని సాగించే ఎంతో మంది స్త్రీలను అవమానించుట పరిపాటి అయినది. ఇప్పటికీ కూడా నీలి చిత్రాల పేరున ఎంత మంది స్త్రీలు బలయ్యారో గమనించవచ్చు.

**నటన రంగం స్త్రీ ప్రవేశం:** నటన రంగంలోకి స్త్రీలను ప్రవేశించమని వాదన ఎత్తినది దాని గురించి వరలక్ష్మమ్మ గారు చక్కని లేఖను రాశారు స్త్రీలకు జరిగే అవమానాలను ఇప్పుడు రెచ్చగొట్టేవారు రేపు నాటకాలు విడిచిన తర్వాత స్త్రీలను అనే సూటి పోటీ మాటలను ఆపలేరు కదా అంటూ నిరసన వ్యక్తం చేశారు. శీలం కోసం ఆత్మార్పణ కి సిద్ధపడినటువంటి భారతీయ స్త్రీలు వారి కష్టాన్ని నేడు మనం ఈ నాటకారంగా ప్రవేశం ద్వారా వ్యర్థం చేసినట్లే అని భావించారు- "కాన ఒక ప్పుడు శీలమునకై యాత్మార్పణము గావించి యశోవిశాలమైన భారతమహిళ నేడు నాటకకళకు బలియై తన పూర్వౌ న్నత్యమును చెఱుచుకొనుట యుత్కృష్టమో, నాటకకళకు లోపముకల్గిన గల్గుగాక తన శీలమునే ప్రాధాన్యముగా బెట్టు కొని నాటకరంగములకు వెలిగానుండుట యుత్కృష్టమో, స్త్రీలును స్త్రీసంఘాభ్యుదయపరులగు పురుషవరేణ్యులును యోచింతురు గాక." (శా.లే పుట 109) నాటక రంగంలో స్త్రీల ప్రవేశంపై ఈమె ముభావాన్ని చూపుతూ శారద లేఖలో రాస్తే దానికి కొందరు దుమ్ము పట్టడం మొదలుపెట్టారు, దానికి ప్రతిస్పందనగా నిజముగా స్త్రీ అభ్యున్నతి కోరువారు నాటక రంగమున స్త్రీలు ప్రవేశించాలని ఇప్పుడు వారు కోరుతున్నారు అందరూ నాటక రంగంలో ప్రవేశించమని చెప్పే వారే గాని ధైర్యంగా స్త్రీలు ముందడుగు వేయడానికి ఎవరైతే నాటక రంగంలో స్త్రీలు రావాలని కోరుతున్నారో వారి ఇళ్లలో ఉండే స్త్రీలను ముందుగా నాటక రంగంలోకి ప్రవేశింపజేసి ఆ తరువాత ఇటువంటివి చెప్పినా సమంజసంగా ఉంటుందని భావించారు. వీరి ఉద్దేశంలో నాటక రంగంలోకి ప్రవేశించిన స్త్రీలను సమాజంలో కొంత ఎత్తిపొడుపులకు గురవ్వాల్సి వస్తుంది. ఎవరైతే స్త్రీలను ఉద్రేక పరుస్తూ నాటక రంగంలోకి రమ్మని చెప్తారో వారు ఈ ఎత్తిపొడుపులను ఆపలేరు నాటక రంగంలోకి వచ్చిన తర్వాత ఆ స్త్రీకి జరిగే అన్యాయాన్ని వీరు తిరిగి ప్రశ్నిస్తారు అనే నమ్మకము లేదు, ఇలా వివాదాస్పదమైన విషయాల పైన కూడా వాస్తవమైన దృష్టిని చూపుతూ కఠినంగా ఉన్నా సరే నిజాన్ని చెప్పడానికే సిద్ధపడ్డారు వరలక్ష్మమ్మ గారు

**రచనలో స్త్రీ అశ్లీలత :** ఇక స్త్రీ సౌందర్యాన్ని గూర్చి విచ్చలవిడిగా కవితలు రాసేటువంటి భావకవులను గూర్చి కూడా కొంత నిరసనగా వ్రాశారు. అవి వాస్తవాలు కూడా, కొన్ని భావ కవితలు విపరీతమైనటువంటి సౌందర్య చిత్రణ , ప్రణయ గాథలు మొదలగునవి గూర్చి రాయడం వలన చిన్న వయసులోని వారు కూడా స్త్రీని ఒక సౌందర్య బొమ్మలాగా చిత్రించుకోవడం జరుగుతుంది. కానీ దాని ద్వారా జరుగు పరిణామాన్ని, వాస్తవాన్ని శారద చెప్పడం మనం గమనించవచ్చు. "బిడ్డ తండ్రికి చదివి వినిపింప దగినవికావు. సోదరుఁడు తోబుట్టువు నాకథలను జదువుమని చెప్ప సాహసింపజాలడు. స్నేహితుఁడు ఒకన్నే హితునిముంద రాకథలను సిగ్గువిడిచి చదువజాలడు. తుదకు అగ్నిసాక్షిగా * పెండ్లాడిన ఆలుమగలు కాదుగదా కూరిమికిగూడిన స్త్రీపురుషు లైన ఆకథలను జదివి మోదింపజాలరు."

(శా.లే పుట 116) "మనసున తలపరాని వాక్కున నుచ్చరింపరాని యట్టి వృత్తాంతము లిప్పుడు విద్యాధికుల లేఖనీ సన్మానమునందుచు రమణీయకథలై పత్రికలలో పొత్తములలో నెక్కుచున్నవి. ఆహా ! కాలమహిమ !" (శా.లే పుట 116) అటువంటి రచనలకు మాత్రం నేడు సన్మాన పత్రములు అందిస్తున్నారని, అటువంటి కవులకు సన్మానములపై బాధని వ్యక్తం చేస్తుంది. ఒక కథను రాసేటప్పుడు, ఒక రచన చేసేటప్పుడు విద్యార్థులు, బాలురు, బాలికలు వృద్ధురాలు, వృద్ధులు పతి అనురక్తి అయిన ఇల్లాలు, మొదలగు అన్ని రకాల వారు చదువును అందరికీ అర్థమైనదిగా అందరూ చదువుటకు అర్థమైనదిగా రచన సాగవలెనని ఆమె అభిప్రాయము.

**స్త్రీలకు బిరుదులు :** సభలలో పురుషులకు గౌరవబిరుదులు ఇస్తూ స్త్రీలకు గౌరవ బిరుదులు ఇవ్వడం లేదని అప్పట్లోనే రచయితలు కొంత నిరసన భావంగా రచనలు చేసినట్లు చూడవచ్చు. దాని గురించి అసలు బిరుదులు అనేటువంటివి అర్హత, అనర్హతలను చూసి పరికించిన తరువాత బిరుదులు ఇవ్వడం జరుగుతుంది. బిరుదులు అనేవి కులాన్ని, వర్ణాన్ని, జాతిని చూసి ఇచ్చేవి కావు అర్హత, దక్షత, యోగ్యత ఉన్నవారికి మాత్రమే ఇచ్చేవి. దీనికి విరుద్ధంగా అప్పటిలో స్త్రీలకు కూడా బిరుదులు ఇవ్వవలెనని, బ్రాహ్మణ ఇతరులకు కూడా బిరుదులు ఇవ్వవలెనని ఇలాంటి వాదనలు వచ్చినాయి. వాటికి వాస్తవాన్ని చూపిస్తూ బిరుదులు అనేవి అర్హతను చూసి ఇచ్చేవి గాని జాతిని చూసి ఇచ్చేవి కాదు అని నొక్కి వక్కాణించి చెప్పారు. సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా ప్రభుత్వం వారు ఇచ్చే బిరుదులైన రావు సాహెబ్, రావు బహదూర్ వంటి బిరుదులను వద్దనుకున్న గొప్పవారు ఎంతోమంది ఉన్నారు. అప్పుడే దేశభక్త, దేశ బంధు మొదలైన బిరుదులు దేశసేవ పరాయాణులకు ఇవ్వడం ప్రారంభమైంది. బిరుదులను ఇవ్వడం వలన ఒకరి స్థాయి తగ్గినది లేదు ఇచ్చినందువలన పెరిగినది లేదు అని శారద అభిప్రాయము. దేశసేవ పరాయణలకు ఒక విధంగా బిరుదులు ఇవ్వడం ద్వారా వారి సేవా కార్యక్రమాలను ఉద్యమాలను మొదలైనటువంటి వాటిని ఒక బిరుదు ద్వారా విశాలమైన భావాలను సైతం కుచింప చేసినట్లుగా ఉంటుంది అని అభిప్రాయపడ్డారు. కాశీనాధుని నాగేశ్వరరావు గారికి 'దేశోద్ధారక' అనే బిరుదు ఇవ్వడం జరిగింది దాని గూర్చి ఇలా అన్నారు "దేశోద్ధారక బిరుద మొసంగుట సూర్యునకు దివిటీదానము చేసినట్లున్నది. ఇందు వలన పంతులుగారికి ఇనుమడించెడి గౌరవములేదు. చేకూరెడి లాభములేదు. కాని అసాధారణమగు వారి దాతృత్వమునకు మహాసభవా రొక కొలమాన మేర్పరచినట్లైనది. సర్వతోముఖ మగు వారి కృషి, కొకముఖ మేర్పరచినట్లైనది. అపరిమితమగు వారి దేశసేవకు పరిమితి నేర్పఱచినట్లైనది." (శా.లే పుట 122)

అయినా ప్రతి పని యందు కర్మణి ఆచరించుట పట్ల మన మనసు ఉండాలి కానీ దాని ప్రతిఫలమున పట్ల అంత ఆసక్తి చూపరాదని రచయిత్రి ఉద్దేశం. మనకి మనం చేసే కృషి వలన బిరుదులే

మనలను వచ్చి చేరవలెను గాని మనం బిరుదుల వెంట పడకూడదని అభిప్రాయము, దానికి ఉదాహరణగా బాలగంగాధర్ తిలక్ నకు 'లోకమాన్య' అని బిరుదు, గాంధీ గారికి 'మహాత్మా' అనే బిరుదు ఒక సభ వారు లేదా ఒక సంస్థ వారు నిర్ణయిస్తే వచ్చినవి కావు అని వారి దేశ సేవకు కృషికి, ఔన్నత్యానికి ఆ బిరుదములే వచ్చి వారికి స్థిరపడినాయని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ విధంగా మన కృషి మన ఫలితములే మనకు కీర్తిని తెస్తాయని బిరుదులు కావని, నేటి తరం కూడా సోషల్ మీడియా అనే వలలో చిక్కుకోకుండా, అందరూ మనల్ని గుర్తించాలి అనే ధోరణి మార్చుకుంటే ఉన్నత శిఖరాలను చేరుతారు.

**సమానత్వంతో కూడిన స్త్రీ సాధికారత** : శారద లేఖలలో ఒకపక్క స్త్రీకి కావలసినటువంటి సాధికారతను గూర్చి తెలియజేస్తూనే, స్త్రీకి సంఘాల్లో కావాల్సిన గుర్తింపును చెప్తూనే, మరొక పక్క స్త్రీ సాధికారత స్త్రీ అభ్యుదయం పేరుతో కొందరు స్త్రీలదౌర్జన్య ప్రవర్తనను, స్త్రీలకు కల్పించిన చట్టములను అడ్డుపెట్టుకొని వారు చేసే హింసలను వారి సొంత లాభం కోసం స్త్రీ చట్టాలను అడ్డుపెట్టుకునే వారిపైన నిరసనను వ్యక్తం చేశారు "నిష్కారణముగా భార్యను దుఃఖపెట్టెడి దుర్జనుడు నాకెట్లు కోపకారణుఁడో, భర్త నల్లాడబెట్టెడి దుశ్చరితయు నాకట్లే శత్రురాలు, అభము శుభము నెఱుగని పసిబాలయగు కోడలిని కోడంట్రికము పెట్టెడి అత్త నాకెట్టి శత్రువో, అత్తపొత్తుగిట్టని గయ్యాళియు నాకట్లే పగతురాలు, దేశములోని సదుద్యమ ముల నిర్మూలింప యత్నించెడి దుశ్శీలురు నాకెట్టి పగతురో, దురుద్యమముల వ్యాపింపఁ జేయువారును నాకట్లేపగతురు" (శా.లే పుట 125)

**స్త్రీలకు డైవర్స్ చట్టం** : స్త్రీలకు డైవర్స్ చట్టాన్ని గూర్చి కూడా వారి వ్యాసాలలో తెలిపారు కుష్టి రోగులకు, కుంటివారికి, గుడ్డివారికి ఇచ్చి పెళ్లి చేసి, విద్యావంతులైన వారికి ఇచ్చి పెళ్లి చేసి వారి చేత హింసలు పడడం కంటే వారి దగ్గర నుంచి బాంధవ్యాన్ని తొలగించుకొనుట కొంతవరకు ఉపయోగకరమని వారు భావించారు. అప్పటి సంఘంలో స్త్రీలకు పూర్తి స్వేచ్ఛ ,స్వాతంత్ర్యములు లేవనే చెప్పవచ్చు, ఈ దృష్ట్యా మనం చూస్తే స్త్రీలు ఏ కారణం చేతనైనను భర్త నుంచి విడిపోయారని తెలిస్తే వారిని వెలివేసే పరిస్థితి ఉండవచ్చు అని శారద ద్వారా తెలిపారు. అయితే "స్త్రీ డైవర్స్ చట్టాన్ని ఆమోదించిన తర్వాత కూడా డైవర్స్ చట్టాన్ని పాటించకుండా ఉన్నట్లయితే దానికి ఆమోదం తెలపనట్లే అవుతుంది" (శా.లే పుట 166) కదా అనే ప్రశ్నని కూడా వేశారు. అనగా సమాజంలో ఉండే చాందసమనే పంకిలాన్ని ఒకనాటితో తుడిచి వేయలేమని ఈమె అభిప్రాయము. స్త్రీలకు డైవర్స్ చట్టం ద్వారా స్త్రీలకు మేలు కలుగుతుంది, కాని కొన్ని కొన్ని చట్టల ద్వారా స్త్రీలకు ప్రత్యక్షంగా మేలు జరిగినా పరోక్షంగా కొంత సామాజిక వెలివేతకు గురి కావలసి ఉంటుంది, సమాజంలోని పోకడలను ఒక్కరే ఎదుర్కోవాల్సి ఉంటుంది.

**మధ్య నిషేధం ప్రచారంలో స్త్రీల పాత్ర** : సాంఘిక ఉద్యమంలో భాగంగా మద్యనిషేధం గూర్చి ఉద్యమాలు సాగుతున్నవి ఈ మధ్య నిషేధం ప్రచారమునకు స్త్రీలను కూడా ఐక్యం చేయడం గురించి కొందరి స్త్రీలు. స్త్రీలకు మద్యం అలవాటు ఉండదు కదా కనుక వారు ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనుట ఎందుకు అని ప్రశ్న- దానికి సమాధానంగా వరలక్ష్మమ్మ గారు ఈ విధంగా రాశారు స్త్రీలలో త్రాగుడు లేదనుట మాట వాస్తవమే ఎక్కడైనా నూటికి కోటికి ఒక స్త్రీ తాగుట మరిగినను అది నిషేధం ప్రచారం చేసేటంత పెద్ద విషయము కాదు, కానీ స్త్రీ పురుషుల ఇద్దరి కలయికచే కుటుంబం ఏర్పడుతున్నది కుటుంబంలో డబ్బు సంపాదించి కుటుంబ పోషణ చేయవలసిన బాధ్యత ప్రధానంగా పురుషుడి పైనే ఉన్నది. అటువంటి పురుషుడు తన సంపాదనలో నిత్యము త్రాగుడు కొరకు కొంత వ్యయపరచుచున్నచో ఆ నష్టము స్త్రీకే కదా! అలాకాకుండా ఆ పురుషుడి యొక్క సంపాదనను దుర్వినియోగం చేయకుండా జాగ్రత్త పెట్టినచో ఆ లాభం స్త్రీకే దక్కుతుంది కదా! కుటుంబ సంరక్షణకి ఇది దోహదపడుతుంది కుటుంబంలో భాగమైన స్త్రీ మద్య నిషేధ ప్రచారమునకు వెళ్ళుట సమంజసము అని తెలిపినది. అలాగే త్రాగుబోతు మొగుని చేత బాధపడే వనితలందరికీ ఇటువంటి ప్రచారం ద్వారా కూడా సహోదరికి కొంత సహాయం చేసినట్లు ఉంటుంది. ఇదే విషయాన్ని గూర్చి ఉదాహరిస్తూ ఒక వనిత కథను తెలుపుతుంది దాని ద్వారా కూలి పనివాడు మద్యం బానిసయితే ఇంట్లో ఒక రకమైన హింస, జమిందారీ స్థాయిలో ఉన్నవాడు మద్యానికి బానిస అయితే ఇంకొక రకమైన హింస, ఇక పిల్లలు గల వారి పరిస్థితి అయితే ఎంత దుర్భరమో చెప్పలేనిది అని తాగుబోతుల సతుల కష్టాలను వివరంగా తెలియజేశారు.

## ముగింపు

స్వాతంత్ర సమరంలో పోరాడినటువంటి నారీమణులను గుర్తు చేస్తూ నేటి యువత కూడా ధీరులై సాగాలని, వీరుల వలే సమాజంలో ఉండే రుగ్మతలను గూర్చి, అన్యాయాలను గూర్చి పోరాడాలని ఇది ఒక నిరంతర పరిశ్రమని, అలాగే పోరాటం తర్వాత సాధించినటువంటి అభ్యున్నతిని, సాధికారతని తప్పుదోవ పట్టించకుండా తమ స్వార్థం కోసమో, తమ ఆనందం కోసమో సాధించిన ప్రగతిని దుర్వినియోగం చేసుకోకుండా మసలాలని ఆమె అభిప్రాయం. కొందరు స్త్రీల వల్ల స్త్రీ జాతి అంతటికి ఎలా అయితే చట్టాల ద్వారా, ప్రభుత్వం ద్వారా మేలు చేకూరుతుందో అలాగే కొందరి స్త్రీల వల్ల కూడా యావత్తు స్త్రీ జాతిని తప్పుగా చిత్రీకరించేటువంటి పరిస్థితులు ఏర్పడతాయి. కాబట్టి స్త్రీలు అందరూ కూడా తాము ఒక ఉద్యమాన్ని లేవనెత్తేముందు, ఒక ఆలోచనని సమాజంలోకి తీసుకువచ్చే ముందు అది స్త్రీల అభ్యున్నతికి పరంపరకు ప్రగతికి స్వేచ్ఛకు గౌరవానికి ఎంతవరకు ఉపయోగకరమైన

ఆలోచించి ముందడుగు వేయాలని మంచిని చెడును రెండింటినీ దృష్టిలో ఉంచుకోవాలని నేటి యువత శారద లేఖల ద్వారా తెలిసుకోవాల్సిన విషయం.

**పాద సూచికలు** :1.శారద లేఖలు కనుపర్తి వరలక్ష్మమ్మ గృహలక్ష్మి కార్యాలయం యగ్మూరు మద్రాసు

**ఆధార గ్రంధాలు**

1.లేఖ సాహిత్యం అబ్బూరి ఛాయాదేవి ఎం ఎస్ కో పబ్లికేషన్స్ అక్టోబర్ 2 2015.

2. శారద లేఖలు కనుపర్తి వరలక్ష్మమ్మ గృహలక్ష్మి కార్యాలయం యగ్మూరు మద్రాసు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## తెలుగు సాహిత్యంలో నూతన సారస్వత, భావోద్యమాల

డా. పి. జన్నమ్మ,
చరిత్ర ఉపన్యాసకులు,
జె.ఎమ్.జె. మహిళా కళాశాల, తెనాలి

19వ శతాబ్దంలో తెలుగు సారస్వతానికి బంధవిముక్తి కలిగి స్వేచ్ఛావాయువులను పీల్చింది. ఈ కాలాన్ని ఆధునిక కవిత్వ యుగంగా లేదా నవ్యకవితా మహోదయంగా వ్యవహరించవచ్చు. ఈ నవ్యకవిత్వ ఉషోదయానికి అనేక కారణాలు దోహదం చేశాయి.

**1. సంఘ సంస్కరణోద్యమం :**

రాజమహేంద్రవరంలో కందుకూరి వీరేశలింగం పంతులుగారు, కాకినాడలో రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు, సంఘసంస్కరణోద్యమ ముఖ్య సారథులు. వీరేశలింగంగారు సాహిత్యాన్ని ఆలంబనగా చేసుకొని సంఘసంస్కరణకు పూనుకొన్నారు. ఆయన 'వివేకవర్ధని'లో రాసిన వ్యాసాలు దురాచారాలపట్ల, లంచగొండులపట్ల వజ్రాయుధంగా పనిచేశాయి. తెలుగు సాహిత్యంలో ఆయన అనేక ప్రయోగాలు చేశారు. రఘుపతి వేంకటరత్నం నాయుడు రచనలు, ఉపన్యాసాలు, గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం', 'ముత్యాలసరాలు' ఆనాడు కరడుగట్టిన దురాచారాలను రూపుమాపడానికి ప్రయత్నించాయి. ఈ సంస్కరణోద్యమం ఆనాటి యువకవుల మానసిక పరిణామానికి ఎంతగానో ఉపకరించింది. వారి భావనలకు, ఆశయాలకు కొత్త ఊపిరి పోసినట్లైంది.

**2. ఆంగ్ల విద్యావ్యాప్తి :**

19వ శతాబ్ద ఉత్తరార్ధంలో ఆంధ్రదేశంలో ఆంగ్లభాష వ్యాప్తమైంది. అనేక కళాశాలలు స్థాపితమయ్యాయి. క్రైస్తవ మిషనరీలు విద్యాసంస్థలు స్థాపించి మత ప్రచారం చేశారు. ఈ ఆంగ్ల విద్యావ్యాప్తి ఆంధ్రుల ఆంగ్ల సారస్వత అవగాహనకు దోహదం చేసింది. టెన్నిసన్, వర్డ్స్‌వర్త్, షెల్లీ, కీట్స్, షేక్స్‌పియర్ వంటి ప్రఖ్యాత ఆంగ్ల కవుల రచనలు, విమర్శనా గ్రంథాలు తెలుగు పాఠకులకు నూతన వికాసం, కావ్యోత్సాహం కల్పించింది. బృహత్తర సమాసాలతో, కఠిన పదాలతో పద్యకావ్యాలు రాయడం మాని చిక్కని, చక్కని మాటలతో కవిత్వం చెప్పవలెననే నవ్య రీతులలో ఖండ కావ్యాలు రాయనారంభించారు. మరొకవైపున సామాన్య ప్రజలలో సాహిత్యం పట్ల ఆసక్తి అభిరుచి పెంపొందింది. ఆంగ్ల విద్యా విధానం దేశంలో నవజాగృతి కలిగించింది.

**3. వ్యావహారిక భాషోద్యమం:**

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

ఈ ఉద్యమకర్త గిడుగు రామమూర్తి పంతులుగారు. ఆయనకు పూర్వమే కొందరు కరడు గట్టిన భాషా సంప్రదాయాలను ఎదిరించారు. కాని గిడుగు గురజాడ కృషివల్లనే ఇది మహోద్యమంగా మారింది. నిఘంటువులలో ఉన్న మాటలు రచనకుపకరించవని, రచయితలకు శిష్ట వ్యావహారికమే శరణ్యమని వారు భావించారు. ప్రజా బాహుళ్య విద్యావ్యాప్తికి వ్యావహారిక బాష తప్పనిసరి అని, భాషకు శాశ్వతంగా ఒక వ్యాకరణం రూపొందించడం దానికి సమాధి కట్టటమేనని వారు వ్యాఖ్యానించారు. గిడుగు వారు గ్రాంథిక భాషను సమర్థించే ఉద్దండ పండితుల నెదుర్కొని, వ్యావహారిక భాషలోని రచనలు పునరుద్ధరించాలని ఉద్ఘాటించారు. "ఏ తరంలోని సాహిత్యమైనా, తన కాలపు ఆలోచనా, స్వభావాలను ప్రతిబింబిస్తుంది. ఒక యుగం వెనుకటి యుగపు సాహిత్య ప్రమాణాలను గుడ్డిగా అనుకరించదు. అది వర్తమాన కాలం నుంచి ఆవేశాన్ని పొందుతుంది", అని గిడుగు వారు వాదించారు. గిడుగు, గురజాడల బాటన ఎందరో కవులు ముందుకు సాగారు. వ్యావహారిక భాషోద్యమం యువకుల ప్రోత్సాహాన్ని, విద్యార్థుల మన్ననలను అందుకొన్నది. ఈ ఉద్యమ లక్షణాలైన స్వేచ్ఛా ప్రయత్నం, నవ్యత ఆనాటి వారి స్వచ్ఛంద రీతికి, సరికొత్త రచనలకు దోహదం చేసింది.

**4. పత్రికా వ్యాప్తి :**

19వ శతాబ్దపు ద్వితీయార్థంలో విద్యా విజ్ఞానాలను సామాన్య ప్రజలలో పరివ్యాప్తం చేయడానికి ఎన్నో పత్రికలు వెలువడ్డాయి. సంఘ సంస్కరణకు, జాతీయోద్యమానికి ఆనాటి పత్రికలు ప్రధాన వాహికలయ్యాయి. క్రమంగా సాహిత్య, సారస్వత పత్రికలు వెలుగులోకి వచ్చాయి. ఈ పత్రికలు నవ్య కవితాధోరణులకు ప్రోత్సాహమిచ్చాయి. పత్రికలలో ఖండ కావ్యాలు, వ్యాసాలు ప్రచురితమయ్యేవి. ఈ ఖండ కావ్యాలకు ఆనాటి సాంఘిక, రాజకీయద్యమాలు నూతన కవిత్వ వస్తువులను ప్రసాదించాయి.

**5. వచన రచనలు :**ఆధునికాంధ్ర వచన సాహిత్యానికి చిన్నయసూరి మార్గదర్శకుడు. వారి ఒరవడిలో వీరేశలింగంగారు అనేక వచన రచనలు చేసి సాహిత్యంలో నూతన ప్రక్రియలు ప్రారంభించారు. నవలా సాహిత్యం ఆరంభమైంది. నాటకాలు, కథలు జానపద పాటల పుంఖాను పుంఖిగా వెలువడ్డాయి. ఇవన్నీ నవ్య కవిత్వోదయానికి హేతువులయ్యాయి.

**6. స్వదేశీయోద్యమం :**

సంఘ సంస్కరణోద్యమం, వ్యావహారిక భాషోద్యమం ఆంధ్రులను ఉత్తేజపరచగా, స్వదేశీయోద్యమం వారిని మరింతగా చైతన్యవంతులను చేసింది. స్వరాజ్య వాంఛ, వందేమాతర... స్వదేశీ మమకారం, విదేశీ అహంకరణ మొదలైన భావాలన్నీ స్వదేశాభిమానానికి పునాదులేయాయి. ఆంధ్రులలో దేశాభిమానం వెల్లువిరిసింది. తెలుగు విద్యార్థులకు పర ప్రభుత్వం అంటే రోతపుట్టింది. వారిలో తిరుగుబాటు మనస్తత్వం సంతరించుకునే బహిష్కరణోద్యమం, పర ప్రభుత్వ దురాగతాలు

వారిని అగ్రశ్రేణి శూరులని చేశాయి. ప్రబోధ గీతాల ప్రసారమయ్యాయి. విప్లవ మాదిరి భావగీతాలు పరవళ్ళు తొక్కాయి. అనేక ఖండకావ్యాలు వెలువడ్డాయి.

గాంధీగారి జీవితం, అహింసోద్యమం, ప్రముఖుల జీవితచరిత్రలు ఆనాటి కావ్యవస్తువులయ్యాయి. దేశభక్తి భావాలు, స్వదేశాభిమానం ఆనాటి కవులను ఉత్తేజపరచగా, రాయప్రోలువారి 'ఆంధ్రప్రశస్తి' మొదలైన గీతాలు వెలువడ్డాయి. జలియన్ వాలాబాగ్ దురంతాలు, ఉప్పు సత్యాగ్రహం, 'క్విట్ ఇండియా' ఉద్యమం సందర్భంగా ఎన్నో దేశభక్తి గేయాలు, కావ్యాలు, నాటకాలు వెలువడ్డాయి. కొందరు కవులు తమ రాతల మూలంగా జైళ్ళకు వెళ్ళారు. గడియారం శేషశాస్త్రి గారి 'శివభారతం', ఏటుకూరి వెంకట నరసయ్య గారి 'పల్నాటి భారతం' మొదలైన దేశభక్తి ప్రబోధ కావ్యాలు అనేక మంది ప్రశంసలందుకున్నాయి.

**7. అభ్యుదయ వాదం :**

'కవిత్వం కేవలం కవిత్వం కోసమే కాదు, ప్రజలకోసం, ప్రజాక్షేమం దాని ధ్యేయం' అనే వాదమే అభ్యుదయ వాదం. సామాన్య ప్రజల స్థితిగతుల చిత్రణ, సమకాలీన ఆర్థిక, సాంఘిక విషయాల విశ్లేషణ, సామ్యవాద, హేతువాద, మానవతావాద ప్రచారాల ఊపిరి ఈ ఉద్యమంలో, అభ్యుదయ కవిత్వంలో గోచరిస్తాయి. రైతుల కడగండ్లు 'కూలి', 'కూలీల బిడ్డల ఆకటి చీకటి చిచ్చులు', దోపిడీ విధాన దుర్మార్గాలు, ఆనాటి కవితావస్తువులయ్యాయి. ఈ నూతన భావోద్యమాలు, నూతన సారస్వత ప్రక్రియలకు దోహదం చేయగా, నవ్యకవిత్వం, తెలుగు సాంప్రదాయ సాహిత్యాన్ని, సారస్వతాన్ని బంధవిముక్తంచేసి, నూతన పంథాలో నడిపించింది.

**ఆంధ్రదేశంలో నవ్యకవిత్వ ధోరణులు - నవ్యకవిత్వ వైతాళికులు :**సాహిత్య రంగంలో నూతన ప్రక్రియల ప్రవేశానికి వీరేశలింగం గారు మార్గదర్శి. వారి అభిప్రాయాలకు నవ్యత్వాన్ని కల్పించినవారు కట్టమంచి రామలింగారెడ్డిగారు. వారి కావ్యం 'ముసలమ్మ మరణం' కరుణరసాత్మకమైన సాంఘిక ఇతివృత్తం. నాయికా నాయకులు సామాన్య కుటుంబీకులు. ఈ కావ్యం నవ్యకవితా ప్రభావానికి వేగుచుక్క అని పింగళి లక్ష్మీకాంతంగారు ప్రశంసించారు. తిరుపతి వేంకటకవులు తెలుగు సాహిత్యాంబరంలో అర్ధశతాబ్ద కాలం విశృంఖల కవితావిహారం చేశారు. అవధానాలు, ఆశుకవిత్వాల ద్వారా కవిత్వాన్ని ఒక ఉద్యమంగా నడిపారు.

గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు గారు నవ్యకవిత్వ యుగకర్తలు. ఎవరు తమ రచనల ద్వారా, వర్తమాన కాలంలోనే కాకుండా, భవిష్యత్తరాలవారిని కూడా ప్రభావితులు చేయగలరో, ఎవరు తమ తరువాతి కవులకు మార్గదర్శకులు అవుతారో వారిని సాహిత్య యుగకర్తలుగా ప్రశంసిస్తారు. ఆనాటి యువకవులు దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, వేదుల, చింతా దీక్షితులు,

రాయప్రోలు, గురజాడ రచనలతో ఉత్తేజం పొందారు. వీరుభయులపైన ఆంగ్ల కవిత్వంలోని 'కాల్పనికోద్యమం' (Romanticism) ప్రభావం కనిపిస్తుంది. ఈ ఉద్యమ లక్షణాలైన ప్రకృతి ప్రశంస, ప్రణయతత్వం, పురాణవైభవ పునరుద్ధరణ ఆనాటి కవులలో ముఖ్యంగా రాయప్రోలు, కృష్ణశాస్త్రి, వేదుల, దువ్వూరి రామిరెడ్డి రచనలలో కనిపిస్తాయి.

**భావకవిత్వం**

నవ్యకవిత్వంలో ముఖ్యమైన ఉద్యమాలు రెండు - భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం. భావకవులు ప్రకృతి వర్ణనను, ప్రణయాన్ని, దేశభక్తిని కవితా వస్తువులుగా స్వీకరించారు. కవి హృదయంలో మెరుపు మాదిరి అకస్మాత్తుగా మెరిసే భావాలకు అక్షర రూపమే భావ కవిత్వమని శ్రీ శ్రీ చెప్పారు. భావ కవులలో రాయప్రోలు, విశ్వనాథ, నాయని, అబ్బూరి, దేవులపల్లి ప్రముఖులు. భావకవిత్వంలో స్త్రీ అంగసౌందర్యానికే కాక ఆత్మ సౌందర్యాన్ని దర్శిస్తారు. దేవులపల్లి వారి 'ఊర్వశి', విశ్వనాథ వారి 'కిన్నెరసాని', నండూరి వారి 'ఎంకి' వారిని కదలించి రూపుదిద్దుకున్న కవితామూర్తులు.

దేశభక్తి కవిత్వంలో రాయప్రోలు వారి 'జన్మభూమి' శిరోభూషణం. విశ్వనాథ, జాషువా, తుమ్మల సీతారామమూర్తి, కొడాలి వెంకటరత్నం రచనలు శ్లాఘనీయాలు. ప్రకృతి ప్రశస్తిలో పింగళి, కాటూరిలు, దువ్వూరి రామిరెడ్డి, కవికొండల, అడవి బాపిరాజు అగ్రగణ్యులు. సంఘ సంస్కరణ సాహిత్యానికి గురజాడ, జాషువా, గరిమెళ్ళ సత్యనారాయణ, చిలకమర్తి మార్గదర్శకులు.

భావకవిత్వంలో భాగాలుగా 'భక్తికవిత్వం' (Mystic Poetry), స్మృతి కావ్యాలు (Elegies), పదచిత్రాలు (Images) ఆనాటి భావకవుల కవిత్వంలో ప్రత్యక్షమవుతాయి.

**అభ్యుదయ కవిత్వం**

1930 వరకు తెలుగు సాహిత్య రంగంలో భావకవిత్వం మూడు పద్యాలు, ఆరు గీతాలుగా విస్తరిల్లింది. దీని ప్రభావం కవులందరిపైనా కనిపిస్తుంది. 1930 తరువాత భావకవిత్వంపై తిరుగుబాటు ఉద్యమంగా అభ్యుదయ కవిత్వం వచ్చింది. శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీ శ్రీ), శ్రీరంగం నారాయణబాబు, పఠాభి, ముద్దుకృష్ణ, పురిపండ అప్పలస్వామి ప్రభృతులు విప్లవ గళమెత్తి గర్జించారు. నూతనత్వం కావాలనే ఆకాంక్ష, పాశ్చాత్య సాహిత్యంలోని అతివాదరీతులు, భారతదేశ, అంతర్జాతీయ సాంఘిక, రాజకీయ పరిస్థితులు ఈ అభ్యుదయ ఉద్యమ హేతువులయ్యాయి.

**ముగింపు:** ఈ భావోద్యమాలు తెలుగు సాహిత్యాన్ని కేవలం పండిత రంజితం నుండి ప్రజా రంజితం వైపు నడిపించాయి. కవిత్వం కేవలం కవిత్వం కోసమే కాదు, ప్రజా శ్రేయస్సు కోసమని నిరూపించాయి.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# మేల్కొన్న మనుష్యులు నవల-సామజిక చైతన్యము

**యం. నిర్మల**
హిందీ విభాగం,
జె.యం.జె కళాశాల, తెనాలి.

నీలగిరి అనే గ్రామంలో పేరు వినడానికి ఎంతో అందంగా ఉన్న, ఆ గ్రామ జీవితంలో మాత్రం ఎన్నో మౌన వేదనలు దాగి ఉన్నాయి. ఆ గ్రామం ఒకప్పుడు ఉద్యమాలకు, ఆలోచనలకు కేంద్రంగా ఉన్నది. కాని కాలం గడిచే కొద్ది ప్రజలు ప్రశ్నించడం మానిసారు. అన్యాయం కనిపించినా చూసి చూడనట్లు పోవడం అలవాటుగా మారింది.

గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాటశాల భవనం కుడా అదే మౌనానికి ప్రతీకల నిలిచింది. ఉపాధ్యాయులు ఉన్నారు, విద్యార్థులు ఉన్నారు..... కానీ ఆలోచనలు లేవు.

అలాంటి గ్రామానికి ఉద్యగం కోసం వచ్చిన యుకుడు “రఘు”
రఘు ఒక సామాజిక సాశ్త్రంలో డిగ్రీ పూర్తి చేసాడు. అతడికి ఊరు అంటి బాధ్యత, సమాజం అంటే ప్రేమ. మొదట్లో అతడు గ్రామాన్ని గమనించదానికే ఎక్కువ సమయం కేటాయించాడు. ప్రతి ఇంట్లో ఒకే సమస్య-పేదరికం, నిరుద్యోగం, అవగాహన లోపం.

ఒక రోజు గ్రామ సభ జరిగింది. సభకు వచ్చిన ప్రజలు కూర్చున్నారు. మాట్లాడలేదు. అధికారులు మాట్లాడలేదు, ప్రజలు వినలేదు.
అది రఘూను తీవ్రంగా కలచి వేసింది.
రఘు తనలో తానే ఇలా అనుకున్నాడు- “మాటలే లేని సమాజం, మౌనంగా నశిస్తుంది.”
ఆ రోజు నుండి రఘు చిన్నగా అడుగులు వేయడం మొదలు పెట్టాడు.

మొదట పిల్లలతో మాట్లాడాడు. వారిని కథలు చేపమని అడిగాడు. “మీ ఊర్లో ఏం తప్పుగా జరుగుతుంది?” అని ప్రశ్నించాడు. పిల్లలు మొదట భయపడ్డారు రఘుతో మాట్లాడటానికి, కానీ క్రమంగా నిజాలు చెప్పడం మొదలు పెట్టారు. పాటశాలకు రాని నిధులు, పని చేయని పథకాలు మహిళలపై జరిగే

అన్యాయాలు అన్ని బయపడ్డాయి. ఇవి అన్నీ తెలుసుకున్న రఘు పిల్లల దగ్గర నుంచి పెద్దలతో మాట్లాడటం మొదలు పెట్టాడు.

ఒక రోజు రఘు ఒక అఆలోచన్ చేసాడు. అది ఏమిటంటే ప్రతి ఆదివారం సాయంత్రం పాటశాల ఆవరానములో చర్చా వేదిక ఏర్పాటు చేసాడు. మొదటి రోజు కొంత మంది వ్యక్తులు మాత్రమే పాటశాల ఆవరనముకు వచ్చారు.

"మా ఊరు గురించి మాట్లాడితే మాకేమి వస్తుంది?" అన్నారు కొందరు మనుష్యులు. అప్పుడు రఘు ప్రశాంతంగా ఇలా అన్నాడు.- " మన ఊరి సమస్యలు గురించి మనం మాట్లాడకపోతే మనకు ఏమి రాదు. మన సమస్యల పరిష్కారం దొరకదు".

రఘు మాట్లాడిన మాటలు, మరియు అతని ప్రయత్నాలు కొందరి వ్యక్తులు మనస్సులో మార్పును తీసుకువచ్చాయి.

రఘు మాటలను మరియు అతని ప్రయత్నాలు చుసిన కొందరు మహిళలు ముందుకు వచ్చారు. తమ సమస్యలను అతనితో చెప్పుకున్నారు. యువకులు ఉద్యోగాల కోసం కాకుండా, తమ హక్కుల కోసం మరియు సామాజిక చైతన్యం కోసం మాట్లాడటం మొదలు పెట్టారు.

ఒక ఆదివారం గ్రామంలో ఉన్నవారు అందరు పాటశాల ఆవరణలో జరుగుతున్న చర్చా వేదికకు వచ్చారు. ఆ వేదికలో ఒక వృధుడు లేచి ఇలా మాట్లాడాడు. "ఇన్నాళ్ళు మనము మౌనంగా ఉండటం మనం చేసిన పెద్ద తప్పు. ఇప్పుడు మన సమస్య గురించి గ్రామ అధికారులతో మాట్లాడడం." అని ఆ పాటశాల ఆవరానములో జరిగిన చర్చా వేదికలో ప్రజలు మాట్లాడుకున్నారు. "ఆ రోజు గ్రామం నిజంగా మేల్కొంది."

పై విషయాలు అన్ని జరిగిన తరువాత ఒక గ్రామంలో గ్రామ సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఆ గ్రామ సభలో గ్రామ ప్రజలు అందరు పాల్గొన్నారు. ఆ గ్రామ సభలో గ్రామ అధికారులు అడిగారు, ప్రశ్నించారు. లెక్కలు అడిగారు. గ్రామ అధికారులు ఆశ్చర్యపోయారు. మొదట వారు ప్రజలందరి పట్లా నిర్లక్ష్యం చేసిన వాళ్ళే ఇప్పుడు గ్రామ ప్రజలకు భయపడుతున్నారు.

రఘు చేసిన ప్రయత్నం వాల్ల పాటశాల మళ్ళి జీవం పోసుకుంది. అది చదువుకు మాత్రమే కాదు.

-సామాజిక చైతన్యానికి కేంద్రంగా మారింది – రఘు ఒక రోజు పిల్లలతో ఇలా అన్నాడు. సమాజాన్ని మార్చే శక్తి ఎవరిదో తెలుసా? ప్రశ్నించే ధైర్యం ఉన్న వాళ్లది. ఆ మాటలు పిల్లల గుండెల్లో నాటుకుపోయాయి.

సంవత్సరం గడిచింది. నీలగిరి గ్రామం ఇప్పుడు జిల్లా అధికారులకు ఆదర్శ గ్రామంగా మారింది. ప్రజలు ఐఖ్యంగా కలిసి మెలసి ఉన్నారు. మహిళలు స్వావలంబన దిశగా అడుగులు వేసారు. యువతి తమ బాధ్యతను గుర్తించింది.

ఇంతగా గ్రామంలో మార్పు తీసుకొని వచ్చి, సామాజిక చైతన్యానికి కారణం అయిన రఘు మాత్రం ఎక్కడా కుడా గొప్పగా కనిపించలేదు. ఒక మూలలో నిలబడి ఆ సామాజిక మార్పును చూస్తూ చాల సంతోషంగా ఉన్నాడు.

రఘు అనుకున్నాడు "సామాజిక చైతన్యం అనేది నేర్పించేది కాదు-మేల్కొలిపేది."

1. సామాజిక చైతన్యం అంటే తిరుగుబాటు కాదు.
2.ప్రశ్నించే అవగాహన.
3.సామాజిక చైతన్యం అంటే బాధ్యత యువతపై పౌరసత్వం.
4.మౌనం విడిచే ధైర్యం.

### తెలుగు Reference Books

1. డా.కె.వి.రమణారావు - తెలుగు నవల - వికాసం విశ్లేషణ.
2. డా.నిఖలేశ్వర్ – తెలుగు నవల – సామాజిక దృక్కోణం.
3. డా.ఎన్.గోపాల కృష్ణ – ఆధునిక తెలుగు నవలలు
4. డా.సి.నారాయణ రెడ్డి – సాహిత్య విమర్శ [నవలల విశ్లేషణ ఉపయోగకరం]

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## తిలక్ కథలు – సామాజిక చైతన్యం

పి. నాగచందన

**పరిచయం:-**

ఆధునిక సాహిత్యంలో అనేక రచనలు మానవులను ప్రభావితం చేసాయి. నవలలు, నాటకాలు, కథలు ఇలా ఎన్నో రచనలు వెలుగులోకి వచ్చాయి. సాహిత్య లోకంలో 'కథ' కు పెద్ద స్థానం ఉంది. అందులోనూ దేవరకొండ బాలగంగాధర్ తిలక్ గారి కథలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. అందుకు నిదర్శనం తిలక్ గారి 'దొంగ' కథ.

కథ వస్తువు చిన్నదైనప్పటికీ దొంగలో మార్పుకు కారణం అయ్యింది. జీవిత విలువలతో కూడిన పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం సమాజంలో దొంగతనం తో ఆగిపోకుండా హత్యలు మొదలైన ఉదంతాలకు దారి తీస్తాయి. ఒకప్పుడు ఆకలి కోసం జరిగిన దొంగతనాలు ఇప్పుడు విలాసాల కోసం జరుగుతున్నాయి. ఆదిలోనే అరికట్టాలి. 'మొక్కైవంగనది మానై వంగునా'. తిలక్ గారి రచనలు ఒక్కొక్క కథలో ఒక్కొక్క సందేశం ఉంటుంది. 'దొంగ' కథలో గోపాలం ఒక దొంగ. దొంగతనానికి వెళ్ళిన ఇంట్లో ఆ పిల్లలు భర్త యొక్క దాక్షితం చూస్తాడు. దొంగ స్థానంలో ఉండికూడా భర్తకు చెప్తాడు. చివరకు ఏ వస్తువు కోసం దొంగతనానికి వెళ్ళాడో ఆ గొలుసును ఇల్లలికి అప్పచేప్తాడు. గోపాలంలో వచ్చిన 'సామాజిక చైతన్యం' మనకు అవగతమవుతుంది. కరుడుకట్టిన నేరస్తుడైన, ఉగ్రవాదైనా, ఎప్పుడోకప్పుడు మారతారని, మార్పు సహజమని తిలక్ తన కథలో నిరూపించాడు. పరిస్థుతులు మనుషులను మారుస్తాయని తిలక్ కథలోని మరో కోణం మనం గమనించవచ్చు.

**పరిసోధకురాలిగా నా స్వానుభవ:-**

తిలక్ దొంగ కథ అనుగుణంగా నా నిజజీవితంలో జరిగిన సంఘటనను ఇక్కడ చెప్పడం జరిగింది. మా ఎదురింట్లో అద్దెకు ఉంటున్న కుటుంబం ఊరు వెళ్ళింది. ఆ ఇంటిగల ఆయన భార్య వారస్తుడా అద్దె ఇంట్లో ఆరు బయట ఉన్న బాత్రూమ్లోకి వెళ్లారు. ఇదంతా గమనిస్తున్న నేను మా అక్కకు చెప్పి అలా అద్దే భాత్రూమ్లోకి వెళ్ళటం తప్పుకదా అని మాట్లాడాను. "నువ్వు ఊరుకోవే ఒక్కసారి వెళితే ఏమవుతుంది" అని అన్నది. దానికి నేను ఇప్పుడు ఊరు వెళ్ళిన వారు వస్తే పరిస్థితి ఏంటి? అన్నాను. 'అమ్మ రూలాన్సుమానుజం' అని అక్క నవ్వింది. ఇంతలో అద్దెకు ఉన్నవారు ఊరి నిండి రావటం బాత్రూం డోర్ తియ్యడానికి ప్రయత్నం చేసారు. మా అక్క ఆశ్చర్యాన్కికి అంతులేదు. డోర్ అటూ, ఇటూ లాగడం వారి వంతు అయ్యింది. ఇదంతా గమనిస్తూ నవ్వడం మా వంతు అయ్యింది.

**ముగింపు:-**

తిలక్ 'దొంగ' కథలో గోపాలం దొంగ అయినా ఆడకూతురు బాధను స్వానుభవం వలన తెలుసుకొని 'సామాజిక చైతన్యం' దిశగా మార్పు చెందాడు. ఇంకా నా కథకు వస్తే స్వానుభవం వలన ఇలా కుడా జరుగుతుంది అని తెలియజేయటం జరిగింది. తిలక్ తన రచనలో అన్ని రకాల అంశాలు ప్రస్తావించారు. 'సామాజిక చైతన్యం' దిశగా దేవరకొండ బాలగంగాధర్ తిలక్ రచనలు మార్గదర్శనీయం, ఆచరణీయం. కథలో సామాజిక స్పృహ, మానవీయ కోణం ఇలా అనేక అంశాలు మిళితమైన కథ వస్తువును పాఠక లోకానికి అందించడం జరిగింది. కథలో 'గోపాలం' లో మార్పు, నా కథలో మా అక్క ఆలోచనలలో మార్పుకు తిలక్ గారి రచనలు నాకు స్ఫూర్తిదాయకం.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# అతడు అడవిని జయించాడు - ప్రతీకాత్మకత

పరిశోధకుడు: **ముత్తె జ్యోతి శివ కాళీ కృష్ణ**
పర్యవేక్షకులు: **ఆచార్య ఇరపని మాధవి**
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
చరవాణి : 6309182439. s

**ప్రవేశిక:**

" నవాన్ విశేషాన్ లాతి గృహ్ణాతీతి నవలా ". నిత్యనూతనమైన మానవ సామాజిక జీవితంలోని అనేక అంశాలను తీసుకొని, పట్టినిలిపి, హృద్యంగా ఆవిష్కరించే ఆధునిక వచన రూప రచన ప్రక్రియే నవల అని దీనికి అర్థం. 'Novel' అనే ఆంగ్ల పదానికి సమానార్థక పదంగా తెలుగులో 'నవల'ను వ్యవహరిస్తున్నాం. అయితే కవిత్వం మనిషిలోని భావోద్వేగాల నుండి పుడితే, నవల వ్యక్తి అనుభవంలో నుండి పుడుతుందని పండితుల అభిప్రాయం. విదేశీయుల రాకతో భారతదేశ ఆర్థిక, సాంఘిక, రాజకీయ, మత, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో గణనీయమైన,వినూత్నమైన, విశిష్టమైన మార్పులు చోటుచేసుకున్నాయి. దీనిలో భాగంగా తెలుగు సాహితీ రంగంలో సహితం నవల వంటి అనేక నూతన ప్రక్రియలు వెలబడ్డాయి. ఇలా తెలుగులో ప్రవేశించిన నవల ప్రక్రియ జీవిత ప్రతిబింబంగా నిలిచి, బహు పార్శ్వాలలో విస్తరించి మనోవైజ్ఞానిక, హేతువాద, జానపద,హాస్యాది విభిన్న అంశాలలో సృష్టించబడి, ప్రతికాత్మక భావజాలంలోను అవతరించింది. ఈ విధంగా ప్రతీకాత్మక దృష్టితో వెలువడిన ఒకానొక నవలే 'అతడు అడుగున జయించాడు' నవల.

**రచయిత పరిచయం :**

'అతడు అడవిని జయించాడు' నవల రచయిత పెనుమూరు కేశవరెడ్డి. ఈయన 1946లో మార్చి 10వ తారీఖున చిత్తూరు జిల్లాలోని తలుపులపల్లెలో జన్మించారు. వీరు వృత్తిరీత్యా వైద్యులు.తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో ఉన్న డిచ్పల్లి విక్టోరియా ఆసుపత్రిలో వైద్యులు గా పనిచేశారు. ఈయన భార్య ధీరమతి. వీరికి ఇద్దరు పిల్లలు. కేశవరెడ్డి గారు ఏ వాదానికి,ఉద్యమానికి సంబంధించిన రచయిత కాకపోయినా 8 నవలలు రాసి పాఠకుల మన్ననలు పొంది,ఆధునిక నవలా సాహిత్యంలో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న వ్యక్తి. ఈయన అతడు అడవిని జయించాడు నవలతో పాటు మునెమ్మ, మూగవాని పిల్లనగ్రోవి, స్మశానం దున్నేరు, సిటీ బ్యూటిఫుల్,చివరి గుడిసె, రాముడుండాడు రాజ్జముండాది, ఇన్క్రెడిబుల్ గాడాస్ అనే నవలలను కూడా రాశారు.వీటిలో కొన్ని హిందీలోనూ ఇంగ్లీష్ లోను తర్జుమా చేయబడ్డాయి. వృత్తిలో భాగంగా ఈయన కుష్టి రోగులకు విశేష

సేవలు అందించారు. ఇందులో భాగంగా కుష్టువ్యాధి పై వివిధ సెమినార్లలో వీరు సమర్పించిన పరిశోధన పత్రాలు అతి విలువైనవి,విషయసంబంధమైనవిగా పేరుపొందాయి. ఇటు రచయితగా సహృదయ పాఠక లోకానికి,అటు వైద్యుడిగా తెలుగు సమాజానికి గణనీయమైన సేవలు అందించిన కేశవరెడ్డి గారు 2015 ఫిబ్రవరి 13న అనారోగ్య కారణంగా చికిత్స పొందుతూ నిజామాబాదులో ఒక ఆసుపత్రిలో కన్నుమూశారు. ప్రస్తుతం నా గోష్టి పత్ర ప్రధానాంశం వీరు రచించిన 'అతడు అడవిని జయించాడు' నవలలోని ప్రతీకాత్మకాంశాలను తెలియజేయడం.

**ప్రతీకవాదం - ప్రతీకాత్మకత :**

ముందు చెప్పుకున్నట్టు ఆధునిక తెలుగు కవిత్వాన్ని ప్రభావితం చేసిన ఆధునిక కవితా ధోరణులలో ప్రతీకవాదం ఒకటి. ఆంగ్లంలో దీన్ని 'Symbolism' (సింబాలిజం) అంటారు.సింబల్ అనే పదం గ్రీకు నుండి ఆంగ్లం లోకి ప్రవేశించింది. చెప్పే విషయంలో ఒక శబ్ద భావాన్ని ప్రకటించకుండా మార్మికంగా సూచించడమనేది ఈ ప్రతీకాత్మకత పునాది.ఏ కళకైనా ప్రధాన లక్షణం వాతావరణ కల్పనమే అని ప్రతీకవాదుల భావం. అందుకే వెలుతురును జ్ఞానానికి సుఖమయ్య జీవితానికి, చీకటిని అజ్ఞానానికి దుఃఖానికి ప్రతీకలుగా సూచించడం సుబోధకమైన విషయమే. ఇలా ఎన్నో,ఎన్నెన్నో ప్రతీకతలను మనం రోజువారీ జీవితంలో గమనిస్తూనే ఉంటాం. అయితే అసలు ఈ ప్రతీక అంటే ఏంటి? ప్రతీకలు ఎందుకు? అంటే - "ఒక విధమైన అనుభూతికి సమాంతరంగా ఉండే శాబ్దిక రూపం ప్రతీక" అని చార్లెస్ బాడ్విక్ ప్రముఖుని నిర్వచనం. ఈ ప్రతీకలతో కూడుకొని ఉండేది ప్రతీకాత్మకత.ప్రతీకాత్మకతతో కూడుకొని ఉండే రచన ప్రతీకాత్మక రచన. కవి ఒక వస్తువును తన చర్మచక్షువులతో దర్శిస్తాడు. ఇది దాని భౌతిక రూపం మాత్రమే. అయితే ప్రతి వస్తువుకు ఇంచుమించుగా తాత్విక రూపం కూడా ఒకటి మానవ నేత్రానికి కనిపించకుండా ఉంటుంది. ద్రష్ట అయిన రచయిత ఆ తాత్విక రూపాన్ని కూడా దర్శించి, ఈ ప్రతీక ద్వారా భావవ్యక్తీకరణ చేస్తాడు. కొన్ని కొన్ని సార్లు వాస్తవికమైన భౌతిక జీవనంలోంచి కాకుండా కవుల భావన క్షేత్రాలలోంచి ఈ ప్రతీకలు సృజించబడటం వల్ల ఈ ప్రతీకాత్మక అంశాలు కొంత అస్పష్టంగా ఉంటాయనేది వాస్తవం. భావన క్షేత్రాలలో నుండి ఉద్భవించినా,చాలా సందర్భాల్లో ఈ ప్రతీకలు భౌతిక వస్తు జీవజాలానికి సంబంధించినవైయుండొచ్చు. అన్యాపదేశంగా ఒక వస్తువును లేదా విషయాన్ని అంగీకార యోగ్యంగా వ్యాఖ్యానించి, ఉపమాన రూపకాది అలంకార సహితంగా చెబుతూ, మనలో నిద్రాణంగా ఉన్న అనుభూతులను తట్టి లేపి, ఉత్తేజ పరచడం ఈ ప్రతీకాత్మకత ప్రయోజనం.ఒక రచనలోని ప్రతీకలను, వాటి నేపథ్యంలో ఉన్న ఈ ప్రతీకాత్మకతను చర్చించుకోవడానికి ఈ ప్రాథమిక విషయావగాహన కొంత తప్పనిసరి. ప్రతీకాత్మకంగా చెప్పేది ఏదైనా సరే పాఠకుడిని కుదిపివేసి, అతని

ఆలోచనకు అధికమైన పని కల్పిస్తుంది. ఇది మనిషి మార్పుకు,తద్వారా సామాజిక సంస్కరణకు దారితీస్తుంది. ఇదే నేటి సాహిత్యపు పరమప్రయోజనం.

**నవలా వస్తువు :**

రచయిత కేశవరెడ్డి గారు ఒకరు ముసలివాడు తన సంపద అయిన సుక్కపంది, దాని పిల్లల కోసం పడిన ఆరాటాన్ని, చేసిన పోరాటాన్ని, అలాగే చివరికి వాటిని కోల్పోయి నీరుగారి, తిరిగి తెలివి తెచ్చుకొని, మానసిక ధైర్యాన్ని,స్థైర్యాన్ని పొంది, భవిష్యత్ కార్యోన్ముఖుడవడమనే అంశాన్ని వస్తువుగా తీసుకొని ఈ నవలేతివృత్త నిర్మాణం గావించారు.

**నవలేతివృత్తం :**

ఈ నవలలో ప్రధాన పాత్రలు ముసలివాడు, సుక్కపంది మాత్రమే. నవలలో కథంతా ఈ రెండింటి చుట్టే నడిచింది. వీటితోపాటు ముసలివాడి మనవడు,పశువుల కాపరులైన గొల్లవాడు,ఇతర సహకాపరులు, మరో సుక్కపంది, తోటిపిట్టా, నక్కలు, రాబందులు, చెట్లు, చేమలు,రాళ్లు, గుట్టలు మొదలైన ఇతరేతరమైనవి అనేకం సందర్భానుసారంగా ఎదురవుతూ ఉంటాయి. ఊరి చివర గుడిసెలో ఉంటారు ముసలివాడు అతను మనవడు. ఇందులో ఏ మానవ పాత్రకు రచయిత పేరు పెట్టలేదు. వీళ్ళు పందుల్ని పెంచుతూ ఉంటారు. ఈ పందుల గుంపులో రెండు చుక్క పందులు కడుపుతో ఉంటాయి.నెలలు నిండి ఒక పౌర్ణమికి ముందు ఒక సుక్కపంది ఇంటి దగ్గరే ఈనుతుంది.మరో సుక్కపంది మాత్రం ఈనలేదు. దాన్ని చూసి ముసలివాడు రాబోయే పౌర్ణమికి ముందురోజో, పౌర్ణమి నాడో ఈనుతుందనుకుంటాడు. ముసలివాడికి ఆరోగ్యం బాగాకపోవడం వల్ల అతని మనవడు పౌర్ణమి నాటి ముందు రోజు తానే పందుల్ని మేపడానికి అడవికి లోలుకు వెళ్తాడు.వెళ్లాక సాయంత్రం తిరిగి వచ్చే సమయానికి కడుపుతో ఉన్న సుక్కపంది గుంపు నుండి తప్పుకొని, ఈనడానికి పొదను వెతుక్కుంటూ వెళ్లిపోవడం వల్ల మనవడికి అది కనిపించదు. చీకటి పడేదాకా కొంతసేపు వెతికి, కనిపించకపోవడం వల్ల ఏడుస్తూ గుడిసెకు పయనమవుతాడు. ఈలోపు చీకటి పడటం వల్ల కలవరపడి ముసలివాడు వెతుక్కుంటూ మనవడికి పందులుకి ఎదురొస్తాడు. విషయం కనుక్కుని, మనవాడిని మందలించి ఇంటికి పంపేసి, తాను ఆ రాత్రిలో అడవిలో సుక్కపంది కోసం వెతుకులాడుతూ వెళ్తుంటాడు. అప్పటికే సుక్కపందిఈని 10 సలుగుల్ని కంటుంది. ముసలివాడు దారిలో ఎన్నో ఇబ్బందులను, అడ్డంకులను, ఆలోచనలను దాటుకుంటూ,జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ, యుక్తితో తెలివిగా సుక్కపంది ఉన్నచోటికి చేరుకుని, ఎక్కడుందో కనిపెడతాడు.దాని పిల్లల్ని రక్షించాలనే ఉద్దేశంతో ప్రమాదమని తెలిసి కూడా సుక్కపందిని సమీపించాడు.ఇందులో భాగంగా సుక్కపంది చేతిలో గాయాల పాలై చివరికి

ఎలాగో తప్పించుకొని, దగ్గర్లోనే ఉన్న ఒక చెట్టెక్కి కూర్చుని కాపలా కాస్తూ, ఆ పందిని దాని సలుగుల్ని రక్షించే ప్రయత్నం చేస్తాడు. అర్ధరాత్రి సమయంలో మూడు నక్కలు దాడి చేయడంతో సుక్కపంది ఒక నక్కని చంపేస్తుంది. ఈ లోపు మరో రెండు నక్కలు చెరొక సనుగుని కరుచుకుని పరుగుపెడతాయి. దానికి పంది,ముసలివాడు ఇద్దరూ బాధపడతారు.

కొంతసేపటికి పెద్ద నక్కల గుంపు సుక్కపంది,సనుగుల వైపుకు రావడం గమనించిన ముసలివాడు చేసేదిలేక నిస్సహాయ స్థితిలో తన చేతులతో పెంచిన సుక్కపందిని తానే ఈటెను విసిరి చంపి, నక్కల గుంపును చదరగొడతాడు. తర్వాత వెదురుతోను తీగలు ఆకులతోనూ బుట్ట అల్లి, అందులో మిగిలిన 8 సనుగులనుంచి, దాన్ని తలకెత్తుకొని,తెల్లవారిలోపు గుడిసెకు చేరాలని నడక మొదలు పెడతాడు. కానీ వయసు రీత్యా, సుక్కపంది దాడి వల్ల కలిగిన గాయాల వల్ల,తద్వారా కలిగిన మానసిక దౌర్బల్యం వల్ల చేరుకోలేడు. మార్గమధ్యంలో దాహం వల్ల, ప్రయాణపు బడలిక చేత ఒక సరస్సు వద్ద ఆగి, దాహం తీర్చుకొని కాస్త నడుంవాల్చాడు. పైకారణాలతోనూ, రాత్రి నిద్ర లేకపోవడం వలన, అనారోగ్యం కారణంగా ఆదమర్చి  నిద్రలోకి జారుకుంటాడు. ఈలోగా వెదురు బుట్టలోని ఎనిమిది సనుగులని రాబందులు చంపి తింటూ ఉంటాయి. ఈ శబ్దానికి మెలకువ వచ్చిన ముసలివాడికి 8 సలుగుల స్థానంలో ప్రాణంలేని 8 మాంసం ముద్దలే కనిపిస్తాయి. ఆ దృశ్యం చూసి నిరాశతో పరిపరి విధాల ఆలోచిస్తూ, బాధపడుతూ చివరికి తెలివి తెచ్చుకుంటాడు. ఇది తనకు గుణపాఠంగా భావించి జడత్వాన్ని, అచేతనత్వాన్ని వదిలి, మళ్లీ నా కార్యాచరణలో నిమగ్నం అవ్వాలని ఆలోచిస్తాడు. అలా అనుకుంటూ నడుస్తూ గుడిసె చేరి నేలకత్తుకొని నిద్రపోయాడు.ఒంటినిండా గాయాలతో నేలకు కరుచుకొని పడుకున్న ముసలివాన్ని చూసిన మనుమడు కాళ్ల దగ్గర పడి కన్నీరు కారుస్తుండే సన్నివేశంతో నవల ముగుస్తుంది.ఇదీ 'అతడు అడవిని జయించాడు' నవలలోని ఇతివృత్తం.

**నవలలోని పాత్రలు,సన్నివేశాలు - ప్రతీకాత్మకత :**

ముందు చెప్పుకున్నట్టు ఒక ముసలివాడు తన సుక్కపంది, దాని పిల్లల్ని కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నం, పడిన సంఘర్షణ ఇందులో ప్రధాన విషయం.ఇదంతా  భౌతికంగా కనిపించే విషయం. ఈ దృష్టితో చూసినప్పుడు వస్తువు పరంగా ఇది పిల్లల నవలగానో, సాహస గాధగానో, జానపద కథలానో కనిపించవచ్చు. కాని ప్రకాత్మక దృష్టికోణంతో చూస్తేఇందులోని ఆంతర్యం బోధపడుతుంది. ఇది ఆధునిక ప్రక్రియైనా దీన్ని చదివినప్పుడు జగన్నాధ పండితరాయలు, విశ్వనాథుడు చెప్పిన కావ్య నిర్వచనాలు, ఆనంద వర్ధనుడి అభినవగుప్తుడి ధ్వనివాదం గుర్తుకు వస్తాయి. రచయిత ఈ నవలలో ముసలివాడు అనే పేరు లేని పాత్ర ద్వారా  దయనీయమైన చిన్న సన్నకారు రైతుల జీవిత యాత్రను, తల్లి లాంటి భూమి కోసం, తద్వారా రెక్కలు ముక్కలు చేసుకోవడంతో సాధించుకున్న పంట కోసం పడే ఆరాటాన్ని, చేసే

పోరాటాన్ని చిత్రించాడు. చివరికి ఎంతలా కష్టించి,ప్రాణాలకు తెగించి ముందడుగులు వేసినా రైతులు అటు భూమిని,ఇటు పంటను కోల్పోయే విధానాన్ని, ఇవన్నీ మరచి మళ్లీ రైతుగా తను కర్తవ్యోన్ముఖుడు కావడం అనే అంశాన్ని ప్రతిబింబించే విధంగా, ప్రతీకాత్మక భావనతో రచయిత దీని వినూత్నంగా ఆవిష్కరించాడు .

ఈ నవల్లోని ప్రధాన మానవ పాత్రైనా ముసలివాడు బాగా వయసు మళ్ళిన,మంచి అనుభవం కలిగిన,బడుగు బలహీన చిన్న,సన్నకారు రైతులకు ప్రతిరూపం.ఇలాంటి రైతుల జీవితం, స్థితిగతులు, ఇల్లు, వాకిలి ఎలా ఉంటాయో రచయిత నవల ప్రారంభంలోనే హృద్యంగా చూపించాడు. మరో ప్రధాన పాత్ర సుక్కపంది రైతు వ్యవసాయ భూమికి ప్రతీక. సుగాలోల అడవి మార్కెట్ వ్యవస్థకు చిహ్నం. ఇందులో అడుగడుగునా మోసం, దగా, కుట్రలు, కుతంత్రాలు నిండి ఉంటాయి. ఇందులో ఎందరు రైతులు బలైపోయారో చెప్పలేం.ఇది తెలియజేస్తూనే రచయిత "నా చుట్టూ ఉన్న వాతావరణం చాలా చెడ్డది. కళ్ళు తెరిస్తే మృత్యుపాలైన ప్రాణులు హింసపాలైన ప్రాణులు కనిపిస్తాయి. ఈ అడవిలోని ప్రతి పొదలోనూ,గుహలోనూ లోబత్వము, నీచత్వము దాగి ఉన్నాయి.ఈ దారిలో మృత్యువు తాండవిస్తుంది" ( డా. కేశవరెడ్డి - అతడు అడవిని జయించాడు, పుటసంఖ్య - 69 ) అని ముసలివాడు తలపోసేలా చేస్తాడు. ఈ మార్కెట్ వాతావరణాన్ని సుగాలోల్ల అడవిలోని చీకటి రాత్రికి ప్రతిబింబంగా రచయిత నిలబెట్టాడు. పౌర్ణమి వెన్నెలను వ్యవసాయ భూమిపై,అందులో కష్టించి పండించుకున్న పంటపై తనకు గల ఆశావహ దృక్పథానికి నిలువుటద్దంగా రచయిత నిలబెట్టాడు. రచయిత ముసలివాడు అడవిలో ఎదుర్కొనే రకరకాల అడ్డంకులు, అవరోధాలు మొదలైన వాటిని రైతు పంటను పండించే క్రమంలో ఎదుర్కొనే సమస్యలకు, సవాళ్లకు, ప్రకృతి అవరోధాలకు ప్రతీకలుగా చిత్రించాడు. ఇక నక్కలను వడ్డీ వ్యాపారులకు, భూస్వాములకు, ఆసాములకు, పెట్టుబడిదారులకు ప్రతినిధులుగా గుర్తించవచ్చు. నవలలో ముసలివాడు నక్కలను 'లోభినా కొడుకులు' అంటాడు. అలాగే యుక్తులలో దాన్ని పడగొట్టేవాడు లేడు అంటాడు.భూస్వాములు వడ్డీ వ్యాపారులు మొదలైన వారి వ్యక్తిత్వాన్ని మనస్తత్వాన్ని ఈ వాక్యాలు సూచిస్తాయి మరియు వీరికి ప్రతిరూపాలే నక్కలనే సత్యాన్ని తెలియపరుస్తాయి. ఇక రాబందులు దళారులుగా కానువస్తాయి. గొల్లవాడి విషయంలో ఇది మరింత స్పష్టంగా అర్థం అవుతుంది.

దుక్కి దున్ని, నాట్లు వేసి, కలుపుతీసి, పండించి,కోత కోసి, కుప్పనూర్చి, కష్టించి వ్యవసాయం చేసిన రైతుకు పంట చేతికి అందే సమయాన్ని, చేతికొచ్చిన పంట భూమిని ప్రతిబింబింప చేస్తూ రచయిత కేశవరెడ్డి సుక్కపంది నెలలు నిండి, ఈనడానికి సిద్ధంగా ఉన్నట్లుగా చూపించారు. సాధారణంగా చిన్న సన్న గారు నిరుపేద రైతులది రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. కాబట్టి పంట

పొలంలో ఏ పని చేయాలన్నా అందుకోసం వడ్డీ వ్యాపారస్తులు భూస్వాముల వద్ద, ఆసాముల దగ్గర కావాల్సినంత అప్పులు చేయడం సహజం.వీరిని రచయిత ఈ నవలలో నక్కలుగా చూపించారని ముందే చెప్పుకున్నాం. రైతు యొక్క ఈ స్థితిని అదునుగా భావించి ఈ గుంట నక్కలు పొలాల్లో పంటను కాజేయొచ్చన్న దురుద్దేశంతో తమ బుద్ధి చూపించి, అనేక యుక్తులు పన్ని, ఎక్కువ వడ్డీతో రైతులను అప్పుల ఊబిలోకి దించుతారు. దిక్కులేని రైతు అంత వడ్డీకి పొలమో,ఇల్లో, గూడో, గుడిసో తాకట్టు పెట్టి మరీ అప్పు తీసుకోవాల్సిన పరిస్థితి. పంట చేతికి వచ్చేసరికి ఈ నక్కలన్నీ రైతును, అతని పంటని ముట్టడించడం ఖాయం. దీంతో రైతుగతి 'ముందు నుయ్యి వెనక గొయ్యి' లాగా మారుతుంది. ఇది రాచపుండై రైతుల్ని మానసికంగానూ, శారీరకంగాను గాయపరిచి వర్ణించలేని బాధను కలిగిస్తుంది.ఇవేవి వడ్డీ వ్యాపారులకి పట్టవు.వాళ్ళ కడుపు నిండటమే వారికి ప్రధానం. అందుకే వీరి ప్రతిరూపాలైన నక్కల మనస్తత్వాన్ని తెలుపుతూ వాటిని ''లోభినాకొడుకులు '',"యుక్తులలో దాన్ని పాడగొట్టేవాడు లేడు" ( పుట 50) అంటాడు.దీనికంతటికి కారణం రైతు పంటనాశించి, పంట భూమిపై అప్పు తేవడం. అంటే ఇక్కడ భూమి, దానిపై గల ఆశ రైతు ఈ పరిస్థితి కారణం అన్నమాట. దీనికి సంకేతంగానే రచయిత ఈనిన సుక్కపంది ముసలివాడి మీద దాడి చేసిన సంఘటనను సృష్టించాడు.

తన దారిద్రయాన్ని, అప్పుల బాధను చూసి,వాటి నుండి తన కుటుంబాన్ని రక్షించుకునే క్రమంలో సాయశక్తులా ప్రయత్నిస్తూ చివరికి తన పొలాన్ని అమ్మడానికి సైతం ఉపక్రమిస్తాడు. ఇదంతా జరిగేలోపు రైతుపండించిన దానిలో కొంత పంటను కూడా భూస్వాములు మొదలైన నక్కల చేతులు కోల్పోవచ్చు.దీన్ని సూచించేదే రెండు నక్కలు రెండు సలుగులను తీసుకొని పోవడం. వీటిని చూసి మిగతా నక్కలన్నీ గుంపులుగా రావడమనేది మిగతా వడ్డీవ్యాపారుల గుంటనక్కలకు ప్రతిరూపక్రియ. వీటి నుండి తప్పించుకోవడానికి రైతుకు పొలం అమ్మి, బాకీ తీర్చడం ఒక్కటే మార్గం. దీనికి ప్రతిబింబమే ముసలివాడు తన చేతులారా పెంచిన సుక్క పందిని తనే చంపి, ఆ తర్వాత నక్కల గుంపును తరిమే సంఘటన. అంటే పొలం అమ్మగా వచ్చిన డబ్బుతో వడ్డీ వ్యాపారులను వదిలించుకోవడం. దీని తాలూకు బాధను ముసలివాడి చేత రచయిత "ఇంతటి చిత్రహింస నేను ఎప్పుడూ ఎవరి చేతా అనుభవించలేదు" ( డా. కేశవరెడ్డి - అతడు అడవిని జయించాడు, పుటసంఖ్య - 40 ) అని పలుకిస్తాడు. అలాగే ఈ విషయంలో తన నిస్సహాయతను గురించి రైతు తలపోస్తూ ఉండే స్థితిని చెబుతూ "వేరేదోవ లేకపోయే సనుగుల్ని కాపాడుకునే దానికి వేరే దోవలేకపోయే" ( డా. కేశవరెడ్డి - అతడు అడవిని జయించాడు, పుటసంఖ్య - 75 ) అని ముసలివాడు అనుకునేలా చేస్తాడు. పొలం పోతే పోయిందిలే అనుకుని,కనీసం పంటను కాపాడుకుని కడుపు నింపుకుందాం అనుకుంటే, మభ్యపెట్టి మాయ చేసి, గిట్టుబాటు ధర రానివ్వకుండా అడ్డుకుని, పంటను బొక్కేసే దళారులను, ముసలివాడు తన

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

సంపద అయిన ఎనిమిది పనుగులను తీసుకొని గుడిసెకు వచ్చే సందర్భంలో రాకాసి రాబందుల రూపంలో రచయిత కనపరిచాడు. అలాగే రచయిత గొల్లవాడి కథను దీనికి నిదర్శనంగా చూపిస్తూ ఇందులో పశువులను పంటగా, వర్షం గాలి వంటి వాటిని ప్రకృతి విపత్తులకు ప్రతీకలుగా, రాబందులను పంటను దోచుకోవడానికి కాచుకుని ఉండే దళారులుగా,గొల్ల కాపరి ఆత్మహత్యను రైతు ఆత్మహత్యగా అద్భుతంగా ప్రతీకాత్మకంగా నిర్మించాడు.

ఇక దళారుల పాలై రైతు పొందిన ప్రతిఫల శూన్యం రైతును కృంగదీసి జడత్వాన్ని, అచేతనత్వాన్ని కలిగిస్తాయి. దీన్ని భరించలేని రైతులు కొందరు గొల్ల కాపరిలాగా ఆత్మహత్యలు చేసుకుంటారు. కానీ ఈ నవల్లోని రైతైన ముసలివాడు మాత్రం అలా కాకుండా సర్వం కోల్పోయి "యుద్ధం ముగిసింది. నేను పూర్తిగా ఓడిపోయాను" ( డా. కేశవరెడ్డి - అతడు అడవిని జయించాడు, పుటసంఖ్య - 86 ) అనుకున్నా "కానీ నేనీ ఆలోచనకు స్వస్తి చెప్పాలి. అలసిపోయిన నా మనసుకు ఒకింత విశ్రాంతి ఇవ్వాలి.ఆ తర్వాత నేచేయాల్సిన పనులు చాలా ఉన్నాయి.ఈరోజు నేను విపరీతమైన దురదృష్టాలకు లోనయ్యాను.లెక్కలేనన్ని ఎదురుదెబ్బలు తిన్నాను. అయినా ఇది నా చివరిరోజు కాదు " ( డా. కేశవరెడ్డి - అతడు అడవిని జయించాడు, పుటసంఖ్య - 88 ) అనుకుంటూ రైతుగా తన బాధ్యతను,విధిని గుర్తించి భౌతికంగా భూస్వాములు, వడ్డీ వ్యాపారులు,దళారులతో నిండి విషమయమైన కుటిల మార్కెట్ వ్యవస్థ అనే అడవిని జయించలేకపోయినా, మానసికంగా జయించి భవిష్యత్ కార్యోన్ముఖుడై ముందుకు సాగడంతో "అతడు అడవిని జయించాడు" అని అనిపించుకున్నాడు. ఇది నామౌచిత్యాన్ని సుసంపన్నం చేసి దానికి సార్థక్యాన్ని చేకూర్చింది.ఈ మార్కెట్ వ్యవస్థ విషపూరిత వాతావరణాన్ని రచయిత వివరిస్తూ ముసలివాడిగా తానే "నా చుట్టూ ఉన్న వాతావరణం చాలా చెడ్డదని,ఎవరి ప్రణాలనైనా హరించగలదని అంటూ ఏ సంభవానికైనా అవకాశం ఉన్న ఈ అడవిలో తన సుక్కపంది చిక్కుకుపోయిందని,ఇక అది తనకు దక్కదని,ఈ అడవిలో ప్రాణమెదిగినంతగా మనసు ఎదగదని" అంటాడు. ఈ వాక్యాలు రచయిత నిశిత దృష్టికి,పరిశీలనకు తార్కాణాలు

**ముగింపు** :నవలా వస్తువు గురించి ముందు చెప్పుకున్న విధంగా పందులను పెంచే ఒక ముసలివాడి గాథను, ఆ పందుల సంరక్షణ కోసం అతడు పడే అవస్థలను, సలిపే పోరాటాన్ని వస్తువుగా తీసుకొని రచయిత ఈ నవలను నిర్మించినట్లు సామాన్య పాఠకుడికనిపిస్తూ ఉండొచ్చు. కానీ రచయితను పట్టుకున్న సహృదయుడైన పాఠకుడు, రచయిత ముసలివాడిని రైతుగా, సుక్కపందిని పశువులను వాటి పిల్లలను పంట భూములు, వాటిలో పండిన పంటగాను,నక్కలను భూస్వాములు ఆసాములు వడ్డీ వ్యాపారులుగా, రాబందులను దళారులుగా, అడవిని మార్కెట్ వ్యవస్థగా, చీకటిని మార్కెట్లోని

వాతావరణానికి, రైతును కమ్ముకున్న దళారీ వడ్డీ వ్యాపారుల మోసానికి చిహ్నంగా, పౌర్ణమి వెన్నెలను పంట ఇచ్చే ప్రతిఫలంపై రైతు పెట్టుకున్న ఆశకు ప్రతిరూపంగా చిత్రించి,ప్రతీకాత్మక దృక్కోణంలో నవలలను సృష్టించిన నైపుణ్యాన్ని గ్రహించి హృదయవేద్యం చేసుకుంటాడు. ఇది సామాజికుడిలో రసావిష్కరణకు, తద్వారా మనో చైతన్యానికి, చిత్తశ్లాఘనకు కారణమయ్యి, రైతు కష్టాన్ని గుర్తించి గౌరవించడానికీ, రైతే రాజన్న వాస్తవాన్ని నిజం చేయడానికి ఊతంగా నిలుస్తాయి. సాధారణ పాఠకుడు ఈ నవలలో ఉన్న ప్రతీకాత్మకతను అందుకోలేకపోయినా 'నహిరసాదృతే కచ్చితర్థం ప్రవర్తతే' అని భరతుడు అన్నట్లు ఇందులో ఉన్న కరుణ రసం పాఠకుడి హృదయకమలాన్ని చేరుకొని, హత్తుకుపోయింది. ఈ కారణంగానే ఇది 'రాసేనైవ సర్వం జీవతి కావ్యం' అనేఅభినవ గుప్తపాదుని వాక్యాన్ని నిజం చేస్తూ తెలుగు నవలా సాహిత్యంలో సుస్థిర స్థానాన్ని పొందగలిగింది.

**సంప్రదింపు గ్రంథాలు :**

1) అతడు అడవిని జయించాడు - డా. కేశవరెడ్డి, నవోదయ
పబ్లిషర్స్, విజయవాడ, 1985.

2) ఆధునిక కవిత్వంలో ప్రతీకాత్మక ధోరణులు - డా. తంగిరాల వ్యాసం, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి, 1992.( తెలుగులో ఆధునిక కవితా రీతులు - డా. మద్దూరి సుబ్బారెడ్డి ( సంపాదకులు ).

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# కర్షకుని –సౌశీల్యము

**ఫణి రాజ్య లక్ష్మి**
తెలుగు లెక్చరర్
సెయింట్ ఆన్స్ కాలేజ్ గుంటూరు

**సారాంశం (Abstract)**

ఆధునికాంధ్ర సాహిత్యంలో రైతు జీవితం, గ్రామీణ సౌభాగ్యం, శ్రమ విలువలను కేంద్రంగా చేసుకొని రచించిన కవుల్లో దువ్వూరి రామిరెడ్డి ప్రముఖుడు. ఆయన రచించిన *కృషీవలుడు* కావ్యం రైతు దైనందిన జీవితాన్ని, అతని నిస్వార్థ సేవను, శారీరక శ్రమను, ఆర్థిక కష్టాలను గాఢంగా ప్రతిబింబిస్తుంది. వ్యవసాయమే సమస్త పరిశ్రమలకు మూలమని, సమాజ సౌఖ్యసౌభాగ్యాలకు రైతే ఆధారమని కవి స్పష్టంగా ప్రతిపాదిస్తాడు. రైతు ప్రపంచానికి ఆహారం అందించినా, తనకు మాత్రం జీవన మౌలిక అవసరాలు కూడా కష్టంగా లభిస్తున్న దారుణ వాస్తవాన్ని కవి కవితాత్మకంగా ఆవిష్కరిస్తాడు. పాశ్చాత్య పాస్టరల్ కవిత్వ ప్రభావంతో పాటు స్వదేశీ భావజాలాన్ని సమన్వయపరుస్తూ, కవి రైతును భారత భూమండలంలోని వీరుల్లో శ్రేష్ఠుడిగా చిత్రిస్తాడు. మారుతున్న కాలంలో ఆధునిక కవిత్వానికి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటూ, రైతు జీవితంపై తన అపారమైన అనుభూతిని ధైర్యంగా వ్యక్తం చేస్తాడు. ఈ విధంగా *కృషీవలుడు* కావ్యం సాహిత్యపరంగా మాత్రమే కాక సామాజిక దృష్టిలోనూ ఉన్నత స్థానం సంపాదించుకుంది.

**కీలక పదాలు (Keywords):**దువ్వూరి రామిరెడ్డి,కృషీవలుడు కావ్యం,రైతు జీవితం,ఆధునికాంధ్ర సాహిత్యం,వ్యవసాయ తత్త్వం

శ్రమ లేకయేఫలములు దుముకబోవు
పిండి కొలది యే

అని కర్షకుని గురించి చెప్పినవాడు దువ్వురి.ఆధునికాంధ్ర సాహిత్యములో కృషివల కవివనికి పదులు తీసిన కవిగా, ప్రసిద్ధి కెక్కిన ఉత్తమ శ్రేణి కవి దువ్వూరి రామి రెడ్డి ఆంగ్ల సాహిత్యములోను పాస్టర ల్ పోయెట్రీ ప్రభావము ఈయన మీద ఉన్నది . గ్రామీణ సౌభాగ్యాన్ని , కర్శకుని దైనందిన జీవితాన్ని వర్ణిస్తూ కృషీవలుడు కావ్యాన్ని రచించాడు .

ఓ రైతున్నా నీ జీవితాన్ని వర్ణించాలి అని నేను అనుకున్న వెంటనే సెల యేరు ప్రవాహములాగా వాక్కులు అనెడి ప్రవాహము పరుగెత్తుతుంది . అది చుసిన కొంత మంది ఈర్ష్య పరులు నన్ను కర్షక

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

పక్షపాతి అంటున్నారు అని వాపోయాడు . దీనిని బట్టి ఆయనకు రైతు జీవితముమీద, అతని దిన చర్య మీద ఎంత పట్టు ఉన్నదో మనము అర్ధము చేసుకోవచ్చు . పంజరములోని చిలుక ఎలా స్వాతంత్ర్యాన్ని కోరుకుంటుందో నేను కూడా ఆధునిక కవిత్వము పట్ల స్వాతంత్ర్యాన్ని కోరుకుంటునాన్నని ధైర్యముగా చెప్పినవాడు దువ్వూరి. ఎవరు ఏమనుకున్న ఈ కాలములో మార్పు కలగాతము సహజము .ఈ మార్పుతో మన ఆలోచనలను వెల్లడించ టానికి భయ పడవలసిన పని లేదు అని అంటాడు.

కృషివలా! నువ్వు భారత భూమండలము లోని వీరులలో శ్రేష్టుడవు రాజు పాలనా దండము కూడా నీ హాలము కన్నగొప్పదికాదు నీ కోర్కెలు నిత్యావసరాలకు మించి ఉండవు . నీ ఆలోచన ఊహ నైపుణ్యంపచ్చని పైరు పొలాల మధ్య నే ఉంటుంది . సూర్యోదయమునుంచి సూర్యాస్తమయము దాక పొలములో కష్ట పడి పని చేస్తావు కానీ ఇరుగు పొరుగు వారి సంపదలు చూచి అసూయా చెందవు నీ హృదయము అనే మొగ్గ ఎంత స్వచ్ఛమైన దో అని కర్శకుని పొగడటమూ చూస్తే దువ్వూరి గారిని కర్షక పక్ష పాతి అని అనటము నిజము అని పిస్తుంది . ఎందుకంటే ఇక్కడ ప్రత్యక్షముగా కర్షకుని స్వచ్ఛ మైన మనస్సు గురించి తెలియజేస్తున్నాడు .

వ్యవసాయమే సకల పరిశ్రమలకు మూలం. సమాజంలోని అధిక సౌభాగ్యాలకు, సౌఖ్య కారణం నీవు. సంవత్సరంతం నీవు కష్టపడి పనిచేస్తే నీ వల్ల పంచ భాక్ష్యపరమాన్నలకు తిమ్తున్నవారు నీ గురించి ఆలోచించారు. నీవు ప్రపంచానికి భోజనము పెడతావు కాని నీకు తినటానికి తిండి కట్టుకోవటానికి బట్ట దొరకటం కష్టంగానే ఉంటుంది. ఫలాలు పండిస్తావు. దాన్ని అనుభవిస్తూ ఆనందానుభూతి పొందుతూ పండులోని మాధుర్యాన్ని చవిచుస్తూ ఉంటారు. కాని ఎనాడైన ఆ చెట్టును పెంచి పోషించిన రైతు గురించి అతని జీవన విధానం గురించి, ఆర్ధిక పరిస్తుతులను గురించి ఆలోచించారు.

అల గుర్తించక పాయిన రైతు మాత్రము నిస్వార్ధము వారికి మంచి ఫలాలు అందించాలని సదుద్దేస్యముతో ఉంటాడు. ఇలా ఆలోచించే రైతుకు మాత్రము ఎప్పుడు తిండి, బట్టకు కోరవగానే ఉంటుంది. కర్షకుడు వ్యవసాయము సాగించే సమయంలో తన శరీరం ఎముకల గూడు అయినా, ఇతివృష్టి కురిసినా, కరువు వచ్చినా శారీరక బలమే ఆధారంగా చేసుకొని జీవితం కొనసాగిస్తాడు. ఇట్లా కష్టపడుతున్న కర్శకుని సేవలు ఎవరు గుర్తించరు. వెలుగుకు ముందు, చీకటి వర్షానికి ముందు మేఘాలు ఆడంబరాన్ని ప్రదర్సిస్తాడు. ఇది ప్రకృతి సహజం చక్రానికున్న ఆకులు క్రిందవి పైకి లేచినట్లే జేవితం కూడా ఎగుడుదిగుడుగానే ఉంటుందన్న సత్యాన్ని గుర్తిస్తారు రైతు. నిరంతరం శ్రమిస్తూ కష్టాలలో కొట్టు మిట్టడుతున్న రైతుమీద పెత్తనం సాగించేవాడు. ఆత్మజ్ఞానం లభించడం కవి, రైతుకు ఆత్మ జ్ఞానంతో

నిండిన వ్యక్తికి అభివర్ణించాడు. ఆత్మజ్ఞానం లభించటం కవి పూర్వజన్మ సుకృతం. దారిద్రవ్యము అనే పెద్ద ఓడను దాటటానికి రైతుకు స్వేచ్ఛా అనే తెడ్డు అవసరమంటాడు కవి.

ఈ కష్టాలు ఎదురైనా వారు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతారని చెప్తాడు. ఒత్తిడికి లొంగకుండా కోరికల్ని తొలగించుకొని కష్టాల్ని తొలగించుకొని కష్టాల్ని సహించి ముందుకు సాగాలి. కర్శకునితో ఏది ఏమైనా పనిని ప్రారంభించడాన్ని మానుకోవద్దని, ధైర్యాన్ని వదలవదని హితం తో చెప్తాడు. ధైర్యము తో కార్యము ప్రారంబిస్తే ఫలితము అదే వస్తుంది అంటారు .రైతుల కష్టాన్ని వివరిస్తూ వారికీ హిత బోధ చేసాడు . వారు చేసే వ్యవసాయము పై దేశ భవిష్యత్తు ఆధార పడిఉంటుంది అని చెప్పాడు ఈ వృధముగా కృషీ వలుడు కావ్యానికి సాహిత్య ప్రపంచములో ఒక ఉన్నత స్థానము దక్కినది .

### సూచన గ్రంథాలు (References)


1. దువ్వూరి రామిరెడ్డి – *కృషీవలుడు* కావ్యం, వివిధ ముద్రణలు.
2. ఆచార్య కేతవరపు రామకోటేశ్వరరావు – *ఆధునికాంధ్ర కవిత్వ వికాసం.*
3. వెల్చేరు నారాయణరావు – *తెలుగు సాహిత్య చరిత్ర.*
4. శ్రీశ్రీ – *ఆధునిక కవిత్వంపై వ్యాసాలు.*

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# కొవ్వలి నవలల్లో అణచబడిన స్త్రీ స్వరం

**డాక్టర్.డి.జ్యోతమ్మ**
అసిస్టెంట్ ప్రొఫెసర్ ,ప్రసారాంగ (పబ్లికేషన్స్),
పరిశోధన పర్యవేక్షకురాలు,(రీసెర్చ్ గైడ్)
ద్రావిడ విశ్వ విద్యాలయం ,కుప్పం
చరవాణి :9959361867

**అరిగెల శ్రీకాంత్**
తెలుగుపరిశోధకవిద్యార్థి ,
ద్రావిడ విశ్వ విద్యాలయం ,కుప్పం
చరవాణి :7981941623

**పరిచయం**

కొవ్వలి లక్ష్మీనరసింహారావు (1912–1975) తెలుగు నవలా సాహిత్యంలో ప్రత్యేక స్థానం కలిగిన ప్రముఖ రచయిత. ఆయన 20వ శతాబ్దంలో సాధారణ ప్రజల జీవితాల, మధ్యతరగతి మరియు గ్రామీణ ప్రజల కష్టాల, ఆర్థిక సమస్యలు, మరియు స్త్రీల భావప్రవాహాలను ప్రతిబింబించే సాహిత్యాన్ని సృష్టించారు. ఆయనకు విశేషమైన ఘనత ఏమిటంటే, సుమారు **1001 నవలలు** రాశారని చెప్పబడుతుంది, ఇది ఏ ఇతర తెలుగు రచయిత సాధించని రికార్డు.ఈ విస్తృత రచనా సంఖ్య కొవ్వలి సమాజాన్నిప్రతిబింబించే సామర్థ్యాన్ని, ప్రజలకు చేరువైన భాషలో సంక్లిష్ట భావాలను వ్యక్తపరిచే శైలిని, మరియు సామాజిక చైతన్యానికి ఆయన కట్టుబాటును స్పష్టంగా చూపిస్తుంది.

కొవ్వలి రచనలు కేవలం పాఠకుల వినోదానికి పరిమితం కాకుండా సమాజంలోని అసమానతలు, ఆర్థిక కష్టాలు, కుటుంబం మరియు వ్యక్తిగత సమస్యలపై లోతైన అవగాహన కలిగించేవిగా ఉంటాయి. కొవ్వలి వ్యక్తిత్వ లక్షణాలు- స్వతంత్ర ఆలోచన, సమస్యలను సవాళ్లుగా ఎదుర్కోవడం, మరియు పాఠకుల జీవితంలో సానుభూతి కలిగించడం ఆయన రచనలకు ప్రత్యేక ప్రభావాన్ని అందించాయి. అంతేకాక, ఆయన సులభమైన, వ్యవహారిక భాషలో రచించడం ద్వారా నవలలను మధ్యతరగతి, గ్రామీణ పాఠకుల మధ్య విస్తరింపచేసి, సాహిత్యాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం సాధ్యమైంది.

కొవ్వలి లక్ష్మీనరసింహారావు గారి రచనా శైలి, సామాజిక దృష్టి, మరియు ఆయన అనుభవజ్ఞ జీవితం పాఠకుడికి లోతైన అవగాహనను కలిగించే బలమైన పునాదిని వేస్తాయి. వెయ్యికి పైగా (1001) నవలల ద్వారా ఆయన సాధించిన విస్తృత పాఠక ప్రసారం, కేవలం సాహిత్య

విజయంగా కాకుండా, సామాజిక చైతన్యాన్ని వ్యాప్తి చేసిన అసాధారణ సాధనగా నిలుస్తుంది. సామాన్య పాఠకుడిని సైతం ఆలోచన వైపు నడిపించే సామర్థ్యం, సమాజంలోని అణగారిన వర్గాల సమస్యలను సాహిత్య రూపంలో ప్రతిబింబించే నైపుణ్యం ఆయన సృజనాత్మక ప్రతిభకు నిదర్శనం. అందువల్ల కొవ్వలి గారి సాహిత్యం, ఆయన జీవన దృక్పథాన్ని, వ్యక్తిత్వాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి అవసరమైన ప్రాముఖ్యమైన పరిచయంగా నిలుస్తుంది.

గుడ్డిదర్బార్ ,తీరనికోరిక నవలలో కొవ్వలి గారు స్త్రీ స్థితిగతులపై లోతైన అవగాహనను, సున్నితమైన పరిశీలనను ప్రదర్శించారు. సమాజంలో స్త్రీలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక, భావోద్వేగ పరమైన కష్టాలు, కుటుంబం మరియు ప్రేమ పేరిట చేయబడే పరిమితులు, స్వతంత్ర వ్యక్తిత్వ వికాసానికి ఎదురయ్యే అడ్డంకులు ఇవన్నీ ఈ నవలలో స్పష్టంగా ప్రతిఫలిస్తాయి. అదే సమయంలో ఆ పరిమితులను దాటాలని స్త్రీలు చేసే అంతర్మథనాలు, ప్రతిఘటనలు, స్వతంత్రత కోసం చేసే ప్రయత్నాలు కూడా రచయిత సున్నితంగా చిత్రించారు.

గుడ్డిదర్బార్ , తీరనికోరిక నవలలోని స్త్రీల సమస్యలను, వారి వ్యక్తిత్వ వికాసాన్ని విశ్లేషించడం ద్వారా, కొవ్వలి గారి సాహిత్య చైతన్యం మరియు సామాజిక దృష్టి మరింత స్పష్టంగా అవగతమవుతుంది. స్త్రీ పాత్రలను కేవలం బాధితులుగా కాకుండా, ఆలోచించే, ప్రశ్నించే, మార్పుకు దోహదపడే వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో కొవ్వలి గారి రచనా వైశిష్ట్యం ఈ నవలలో స్పష్టంగా కనిపిస్తుంది

**గుడ్డిదర్బార్ – స్త్రీ జీవితాలపై పితృస్వామ్య, సామాజిక మోసాల విమర్శ**

కొవ్వలి లక్ష్మీ నరసింహరావు రచించిన 'గుడ్డిదర్బార్' నవల, ఆడపిల్లల వివాహాల చుట్టూ నిర్మితమైన అర్థరహిత ఆడంబరాలు, ఆస్తి మోహం, పితృస్వామ్య విలువల కారణంగా స్త్రీల జీవితాలు ఎలా బలి అవుతున్నాయో గాఢంగా ఆవిష్కరిస్తుంది. ఇది ఒక వ్యక్తిగత జీవిత సంఘటనలా ప్రారంభమైనప్పటికీ, దాని అంతర్లీనంగా విస్తృత సామాజిక అజ్ఞానం, మోసపూరిత విలువలు, నైతిక పతనం దాగి ఉన్నాయి. ఈ కారణంగా 'గుడ్డిదర్బార్' ఒక స్త్రీ కథ మాత్రమే కాకుండా సమాజపు అంధత్వంపై సాగిన గట్టి విమర్శగా నిలుస్తుంది.

నవల రైల్వే స్టేషన్ అనే ప్రజాస్థలంలో ప్రారంభమవడం గమనార్హం. ఇది సమాజపు నడిబొడ్డులో జరిగే అన్యాయాలకు సంకేతంగా భావించవచ్చు. కథానాయకుడు విద్యావంతుడైన (బి.ఏ. పాసైన) వ్యక్తి అయినప్పటికీ, స్త్రీలను పరిశీలించే అతని దృష్టిలో కూడా ఒక రకమైన పురుషాధిపత్య భావన తొలుత కనిపిస్తుంది. అయితే కథ క్రమంగా ముందుకు సాగేకొద్దీ, అతడు మానవీయత, బాధ్యత, నైతికత వైపు మలుపు తిరుగుతాడు. ఈ పరిణామం ద్వారా రచయిత వ్యక్తి మార్పు సాధ్యమనే సందేశాన్ని అందిస్తాడు.

ప్లాట్‌ఫారమ్‌పై ఒంటరిగా ఉన్న యువతి తారను ప్రజలు అనుమానంతో చూడటం, ప్రశ్నల వర్షం కురిపించడం సమాజంలో స్త్రీపై ఉండే సహజ అనుమాన దృష్టిని ప్రతిబింబిస్తుంది. స్త్రీ ఒంటరిగా ఉంటే ఆమె తప్పు చేసినదే అన్న భావన సమాజంలో ఎంత లోతుగా పాతుకుపోయిందో ఈ ఘట్టం స్పష్టంగా చూపిస్తుంది. తారను ఆ గందరగోళం నుంచి కాపాడి ఇంటికి తీసుకువచ్చే కథానాయకుడి చర్య మానవత్వానికి ప్రతీకగా నిలుస్తుంది. అతని తల్లి, భార్య తారను ఆదరించే విధానం స్త్రీ–స్త్రీ మధ్య సానుభూతి, సహకారం ఎంత ముఖ్యమో సూచిస్తుంది.

తార తన జీవితకథను వెల్లడించే సందర్భం నవలలో అత్యంత కీలకమైన ఘట్టం. తల్లిదండ్రులు ఆస్తుల మోహంతో, ధనవంతుడన్న మోసపు మాటలు నమ్మి ఒక వృద్ధుడితో ఆమెకు వివాహం చేయడం ద్వారా, స్త్రీ జీవితాన్ని తల్లిదండ్రులే ఎలా తాకట్టు పెడతారో రచయిత తీవ్రంగా విమర్శిస్తాడు. భర్త ధనవంతుడు కాదని, అప్పుల్లో కూరుకుపోయి చివరకు ఆమెను వ్యభిచారంలోకి నెట్టే ప్రయత్నం చేసిన వాస్తవం, పితృస్వామ్య వ్యవస్థలోని క్రూరత్వాన్ని బహిర్గతం చేస్తుంది. ఇక్కడ తార వ్యక్తిగత బాధ, సమాజపు విలువల వైఫల్యానికి ప్రతినిధిగా మారుతుంది.

కథానాయకుడు తార కోరికను తిరస్కరించడం, ఆమెను సోదరిగా భావించడం ద్వారా రచయిత నైతిక విలువలను ప్రతిపాదిస్తాడు. ఈ సంఘటన ద్వారా అన్ని పురుషులు దోపిడీదారులే అన్న భావనను రచయిత సమర్థించడు. అదే సమయంలో వ్యవస్థలోని లోపాలను మాత్రం నిర్ఘాటంగా ప్రశ్నిస్తాడు. తారను శరణాలయానికి చేర్చాలనే నిర్ణయం, మోసపోయిన స్త్రీలకు సమాజంలో ఆశ్రయం అవసరమనే ఆలోచనను ముందుకు తెస్తుంది.

మిషన్ కుట్టే మహిళ ఘట్టం ఈ నవలలో మరో ముఖ్యమైన సామాజిక వ్యాఖ్యానంగా నిలుస్తుంది. ఆమె బలహీనతను కాకుండా, ఆమె ఎదుర్కొన్న మోసాన్ని కేంద్రంగా చేసుకుని రచయిత సమాజంలో ఉన్న అవకాశవాద పురుషుల స్వభావాన్ని బయటపెడతాడు. ఇది స్త్రీల అప్రమత్తత అవసరాన్ని సూచిస్తూనే, అసలు బాధ్యత మోసగాళ్లదేనన్న స్పష్టమైన నైతిక దృక్పథాన్ని వ్యక్తం చేస్తుంది.

నవలలో మలుపు తార భర్త శరణాలయానికి రావడం ద్వారా ఏర్పడుతుంది. అతడు మరో అమాయక యువతిని మోసం చేయాలనే ఉద్దేశంతో అక్కడికి రావడం అతని నీచ స్వభావాన్ని పూర్తిగా బహిర్గతం చేస్తుంది. ఈ సంఘటన ద్వారా వ్యక్తిగత దుష్టత్వం ఎలా సామాజిక సమస్యగా మారుతుందో రచయిత చూపిస్తాడు. తారకు న్యాయం జరిగే దిశగా పరిస్థితులు మారినప్పటికీ, ఆమెకు సంపూర్ణ స్వేచ్ఛ లేదా సంపూర్ణ ఆనందం లభించకపోవడం గమనార్హం. ఇది సమాజం స్త్రీపై వేసే మానసిక గాయాలు తక్షణమే మానవని సూచిస్తుంది.

'గుడ్డిదర్బార్' ముగింపు పూర్తిగా నిరాశాత్మకం కాదు. తారకు కనీస మానవ గౌరవం, జీవించడానికి ఆశ్రయం లభించడం విజయంగా చిత్రించబడుతుంది. మోసగాళ్లు ఉన్న సమాజంలో మానవత్వం కలిగిన వ్యక్తులు కూడా ఉన్నారన్న ఆశావాద దృక్పథాన్ని రచయిత ప్రతిపాదిస్తాడు.

మొత్తంగా 'గుడ్డిదర్బార్' నవల ద్వారా కోవ్వలి లక్ష్మీ నరసింహరావు స్త్రీల జీవితాలను నాశనం చేసే అంధ సంప్రదాయాలు, ఆస్తి,ఆడంబరాల మోహం, పితృస్వామ్య వ్యవస్థపై గట్టి ప్రశ్నలు వేశారు. ఇది ఒక వ్యక్తిగత కథ రూపంలో సాగినా, సమాజపు అజ్ఞానం, నైతిక పతనంపై సాగిన లోతైన రాజకీయ,సామాజిక విమర్శగా నిలుస్తుంది

**తీరని కోరిక – కుటుంబ వ్యవస్థలో స్త్రీ భావోద్వేగాల అణచివేత**

తీరని కోరిక నవలలో కథ మొదటి వ్యక్తి వాచకంలో సాగుతుంది. కథ చెప్పేవారు తన దాంపత్య జీవితంలో ఎదురైన సంఘటనను గుర్తుచేసుకుంటూ, ఆ సంఘటన తన కుటుంబ జీవన విధానంపై ఎలా ప్రభావం చూపిందో వివరిస్తాడు. కథానాయకుడు తన భార్య సీతను పరిచయం చేస్తాడు. సీత అనుమాన స్వభావం కలిగిన స్త్రీ. భర్తపై ప్రేమ కలిగినప్పటికీ,

పరిసరాలపట్ల జాగ్రత్తగా ఉండటం ఆమె స్వభావ లక్షణం. కుటుంబ భద్రత, గౌరవం మరియు సమాజపు మర్యాదలు ఆమెకు అత్యంత ముఖ్యమైనవి.

కథ ప్రారంభంలో సీత–భర్త అద్దె కోసం కొత్త ఇల్లు వెతుకుతాడు. భర్త ఒక ఇల్లు చూసి నచ్చిందని చెప్పినప్పుడు సీత ఆ ఇంటి యజమానులు ఎవరు? వారి స్వభావం ఎలా ఉంటుంది? అక్కడ నివసించడం సురక్షితమా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తుంది. భర్తకు కొన్ని ప్రశ్నలు అసహనంగా అనిపించినా, సీత ఆందోళన వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకుంటుంది. సీతకు ఇంటి యజమానులు వృద్ధుడు ఆచారి మరియు వయసులో చిన్నదైన, అందమైన భార్య తాయారు అని తెలిసినప్పటికీ, తక్కువ అద్దె, ఇంటి సౌకర్యాలు మరియు ఆర్థిక పరిమితుల కారణంగా ఆ ఇంట్లో నివసించడానికి ఆమె ఒప్పుకుంటుంది. ఇది మహిళలు ఆర్థిక, సామాజిక పరిస్థితుల ప్రభావం వలన తీసుకోవాల్సిన నిర్ణయాలను ప్రతిబింబిస్తుంది.

ఇంటి లోపల తాయారు మొదట మౌనంగా, మర్యాదగా ప్రవర్తిస్తూ. ఇంటి పనులన్నీ తానే చూసుకుంటూ భర్తకు సేవ చేయడం సీత గమనిస్తుంది. కొద్ది రోజులలోనే తాయారు సీతతో సన్నిహితంగా మారి తన జీవితంలోని చిన్న విషయాలను ఒకరితో ఒకరు పంచుకుంటారు. సీతను 'అక్క' అని పిలవడం ద్వారా స్త్రీ–స్త్రీ మధ్య సాన్నిహిత్యం, స్నేహం మరియు సామాజిక మద్దతు ప్రతిబింబిస్తుంది. తాయారు తరచూ సీతకు వంటకాలు తీసుకురావడం, సీత కూడా ఆమెను ఆదరంగా చూసుకోవడం. ఇలా ఇద్దరి సన్నిహిత సంబంధం పెరిగిన కొద్దీ, ఆచారి అసహనం, అనుమానం మరియు కోపం వ్యక్తం చేస్తాడు. ఇది సమాజంలోని లింగ ఆధారిత నియంత్రణ, స్త్రీలపై అణచివేతను గుర్తుచేస్తుంది

తీరని కోరిక నవలలో తాయారు సీతతో ఒంటరిగా ఉన్నప్పుడు తన భర్తపై కోరిక మరియు ప్రేమను బయటపెడుతుంది. సీత ఒక్కసారిగా షాక్ లో పడుతుంది. ఈ సందర్భం ఇంటి వ్యవహార సౌభావ్యం, లింగ ఆధారిత నియమాలు మరియు సమాజపు ఆచారాల మధ్య వ్యక్తిగత సంకటాన్ని చూపిస్తుంది. తాయారు కోరికలు మరియు వ్యక్తిగత భావాలను సమాజపు నియంత్రణలు పరిమితం చేయడం, మహిళల భావోద్వేగాలను సమాజం ఎలా ఆంక్షించే అంశాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది.

సీత భర్త ఈ సంఘటనను గమనిస్తాడు. మొదట అర్థం చేసుకోకపోయినా, తరువాత నైతిక బాధ్యత, కుటుంబ సమతుల్యత మరియు సరైన ప్రవర్తనను అర్థం చేసుకుంటాడు. కానీ ఆచారి ఆ దృశ్యం చూస్తాడు. తాయారును దారుణంగా కొడతాడు. తాయారు ఇంట్లో ఎదురైన హింస వల్ల, శారీరకంగా మరియు మానసికంగా బలహీనత పొందుతుంది. ఆమె శరీరం క్షీణత చెందడం, కోరిక తీరకపోవడం కారణంగా అనారోగ్యానికి గురవుతుంది.

తీవ్ర అనారోగ్యానికి గురైన తాయారు ఆసుపత్రికి తరలించబడుతుంది. భర్త ఆచారి, తాయారు చివరి కోరిక మేరకు సీత ఇంటికి వచ్చి, సీతను మరియు ఆమె భర్తను ఆసుపత్రికి తీసుకెళ్తాడు. అక్కడ తాయారు సీత భర్త చేతిలో తల పెట్టి ప్రాణాలు విడిచే ఘట్టం నవలలో హృదయ విదారకంగా ఆవిష్కృతమవుతుంది. ఈ దృశ్యం ద్వారా రచయిత కేవలం ఒక వ్యక్తిగత విషాదాన్ని కాదు, స్త్రీ జీవితంలోని అణచివేతకు లోనైన భావోద్వేగాల పరాకాష్ఠను ప్రతీకాత్మకంగా చూపించాడు.

**స్త్రీ తన కోరికలను బహిరంగంగా చెప్పగలదా?**

సాంప్రదాయ సమాజంలో స్త్రీ కోరికలు నైతికత, పరువు, కుటుంబ గౌరవం అనే పేర్లతో నియంత్రించబడతాయి. తాయారు జీవితమంతా భార్యగా, ఇంటి బాధ్యతల బందీగా, వయోభేదం ఉన్న భర్తకు విధేయురాలిగా జీవించింది. ఆమె వ్యక్తిగత ఆకాంక్షలకు స్వేచ్ఛ దొరకలేదు. మరణశయ్యపై చెప్పిన మాటలు ఆమె అణచివేతకు గురైన తీరనికోరికల చివరి విస్ఫోటనం.

నేటి స్త్రీ ఆకాంక్షల కాంతిలో చూస్తే తాయారు పలుకులు అసహజంగా కాకుండా సహజంగా కనిపిస్తాయి. ఆధునిక స్త్రీ తన భావాలను, ప్రేమను, అసంతృప్తిని, కోరికలను వ్యక్తం చేసే ధైర్యం సంపాదించుకుంటోంది. కానీ సమాజం ఇంకా పూర్తిగా ఆ మార్పును అంగీకరించలేకపోతోంది. అందుకే తాయారు చెప్పిన మాటలు ‘తప్పు’గా ముద్ర వేయబడతాయి. నిజానికి అవి స్త్రీ తన జీవితంపై తనకున్న హక్కును ప్రకటించిన ఒక నిస్సహాయ స్వరం.

ఈ నవల ద్వారా రచయిత లింగపరమైన నియంత్రణ, స్త్రీల కోరికలపై విధించిన పరిమితులు, ఇంటి బాధ్యతల భారంతో నలిగిన వ్యక్తిత్వం, **మరియు** వ్యక్తిగత ఆకాంక్షలు–సామాజిక నియమాల మధ్య ఉన్న సంకటాన్ని లోతుగా ప్రతిబింబించాడు. తాయారు పాత్ర ద్వారా, స్త్రీ కోరికలు అనైతికం కావని, అవి కూడా మానవ సహజ భావాలేనని రచయిత స్పష్టంగా

సూచిస్తాడు. స్త్రీ తన కోరికలను చెప్పగలగాలి. కానీ చెప్పేధైర్యానికి సమాజం కూడా స్థలం కల్పించాలి. తాయారు మరణశయ్యపై పలికిన మాటలు వ్యక్తిగత కోరికల వాచికం మాత్రమే కాదు. అవి నేటి స్త్రీ చైతన్యానికి పూర్వస్వరంలా నిలుస్తాయి.

**ముగింపు:**

కోవ్వలి లక్ష్మీ నరసింహరావు రచించిన 'గుడ్డిదర్బార్' మరియు 'తీరని కోరిక' నవలలు సమాజంలో స్త్రీల జీవితాలపై పితృస్వామ్య, ఆస్తి మోహం, లింగ పరిమితులు, సాంప్రదాయ నియమాలు, కుటుంబ బాధ్యతల ప్రభావం ఎలా ఉంటుందో వివరించింది. ఈ నవలలు వ్యక్తిగత జీవిత కథనాల రూపంలో ఉన్నప్పటికీ వాటి వెనుక విస్తృత సామాజిక,నైతిక సమస్యల భూభాగం కనిపిస్తుంది.

'గుడ్డిదర్బార్'లో తార పాత్ర ద్వారా ఆడపిల్లల వివాహాలకు మించి, సమాజంలోని మోసపూరిత విలువలు, పితృస్వామ్య వ్యవస్థలోని క్రూరత్వం, ఆస్తి–ఆడంబరాల మోహం స్త్రీ జీవితాలను ఎలా నాశనం చేస్తాయో స్పష్టంగా చూపబడుతుంది. తారకు ఎదురైన అన్యాయం, భర్త యొక్క స్వార్థ ప్రవర్తన, తల్లిదండ్రుల ఆస్తి మోహం, మరియు సమాజపు పాతకాలపు నియమాలు ఈ నవల ద్వారా పాఠకులకు మానవీయత, నైతిక బాధ్యత, సామాజిక చైతన్యం అనే పాఠాలను బోధిస్తాయి

'తీరని కోరిక'లో తాయారు పాత్ర ద్వారా వ్యక్తిగత కోరికలు, ప్రేమ, స్నేహం, కుటుంబ నైతిక బాధ్యత, సమాజపు నియమాలు మధ్య స్త్రీల భావోద్వేగ సంకటాలు ప్రతిబింబించబడ్డాయి. తాయారు తన కోరికను వ్యక్తపరిచినప్పటికీ, సమాజపు ఆంక్షలు, లింగ ఆధారిత నియమాలు, ఇంట్లో ఎదురైన హింసలు ఆమె వ్యక్తిత్వానికి, ఆరోగ్యానికి ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. ఈ సంఘటనలు స్త్రీల స్వతంత్ర భావన, కోరిక, మరియు వ్యక్తిగత ఆనందం కోసం సమాజంలో ఎంతమంది అడ్డంకులు ఉంటాయో సూచిస్తాయి.

ఈ రెండు నవలల ద్వారా స్త్రీలు వ్యక్తిగత కోరికలు, స్వతంత్రత కోసం ప్రయత్నించినా, పితృస్వామ్య నిర్మాణం, ఆస్తి–ఆడంబరాల మోహం, సమాజపు నియమాలు ఎంతగా

ప్రతిబంధకమవుతాయో. ఈ నవలలు కేవలం వ్యక్తిగత దృశ్యాలు మాత్రమే కాక, సమాజంలో లింగ, నైతిక, ఆర్థిక వ్యవస్థల పరిమితులపై తీవ్రమైన విమర్శగా నిలుస్తాయి.

ఈ రచనలు పాఠకులకు సామాజిక చైతన్యం, లింగ సమానత్వం, వ్యక్తిగత గౌరవం, కుటుంబ సంబంధాల సరిగా నిర్వహణ, మరియు మానవీయ విలువల పరిరక్షణపై సందేశాన్నిస్తూ. తార, తాయారు వంటి స్త్రీ పాత్రలు తమ జీవితంలో ఎదుర్కొన్న బాధ, అన్యాయం, కోరిక తీరకపోవడం, సమాజపు నియమాల ప్రభావం ద్వారా స్త్రీల పరిస్థితులను, సమాజపు లోపాలను ప్రతిబింబిస్తాయి. మొత్తం మీద, 'గుడ్డిదర్బార్' మరియు 'తీరని కోరిక' నవలలు సమాజంలో స్త్రీ–పురుష సంబంధాల, లింగ చైతన్య, వ్యక్తిగత కోరికల, పితృస్వామ్య నిర్మాణాల పరిమితులపై తీవ్రమైన విశ్లేషణ, విమర్శ, మరియు పాఠకులకు ఆత్మచింతనకు ప్రేరణ ఇస్తాయి. ఈ రచనలు ఆధునిక సమాజంలో స్త్రీల స్థితిగతులపై మనం పరిశీలించాల్సిన దారిని సృష్టిస్తాయి.

**ఆధార గ్రంథాలు**

1.తెలుగు సాహిత్య చరిత్ర -ద్వానాశాస్త్రి
2.కొవ్వలి నవలలు -3 కొవ్వలి లక్ష్మీనరసింహరావు, ఎమెస్కో ,హైదరాబాద్
3. కౌముది సంచిక -2008-వెయ్యినవలల కొవ్వలి –గొల్లపూడి మారుతీరావు
4. ఆధునిక తెలుగు కవిత్వ పరిణామం- వెల్చేరు నారాయణరావు, ఎమెస్కో, హైదరాబాద్.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# తెలుగు కథానిక ప్రక్రియ ఆవిర్భావం – వికాసం

**కట్ట రజిత**
తెలుగు అధ్యాపకురాలు,
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మంచిర్యాల,
చరవాణి : 8523844631.

**ఉపోద్ఘాతం:**

చిన్నప్పుడు పిల్లల్ని నిద్రపుచ్చడానికి పెద్దవాళ్లు కథలు చెప్పేవారు. మనం చిన్నప్పుడు విన్న కథలు నిద్రపుచ్చేవైతే ఇప్పటి ఆధునిక కథానిక సమాజాన్ని, రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, సామాజికంగా చైతన్య పరిచేది. ప్రాచీన సంప్రదాయమైన ప్రక్రియ కథ అయితే ఆధునిక ప్రక్రియ కథానిక. క్రీ.శ.19వ శతాబ్దిలో ఆంగ్లం నుండి వచ్చిన వచన సాహితీ ప్రక్రియలలో కథానిక ఒకటి. కథ ప్రక్రియ విస్తృతమైంది కాగా కథానిక అంత విస్తృతం కాదు. తెలుగు సాహిత్యంలో కథ, కథానిక పర్యాయపదాలుగా వాడబడుతున్నాయి. కానీ వేర్వేరు. కథానిక అనే పదము "కథ్" అనే ధాతువు నుంచి పుట్టింది. దీనికి చెప్పుట, మాట్లాడుట, సంభాషించుట అనే అర్థాలు ఉన్నాయి. ప్రపంచ కథానికలకు ఆద్యబ్రహ్మ గుణాఢ్యుడుగా చెప్పవచ్చు. ఈయన పైశాచి భాషలో బృహత్కథను రాశాడు. కథానిక ప్రస్తావన అగ్ని పురాణంలో కనిపిస్తుంది. భయానక, కరుణ రసాలతో మిక్కిలి ఆహ్లాదాన్ని కలిగిస్తూ అద్భుతమైన విషయాలతో సంక్షిప్తంగా ఉండే ఉదాత్తమైన సాహితీ ప్రక్రియ కథానిక అని అగ్ని పురాణంలో ఉంది. ఆంగ్లంలోని "షార్ట్ స్టోరీ" అనే పదానికి సమానార్థకంగా తెలుగులో "కథానిక" అనే పదాన్ని వాడుతున్నారు. 1936లో ప్రతిభ అనే పత్రికలో వ్యాసం రాస్తూ "ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి"కథానిక అనే పేరు సూచించారు.

**విషయము:**

**కథానిక నిర్వచనాలు:**

1. "కొంత సత్యాంశతో కూడిన కల్పిత గద్య గ్రంథం -తెలుగు అకాడమీ నిఘంటువు."[1]
2. "ఏకాంశవ్యగ్రమై స్వయం సమగ్రమైన కథాత్మక వచన ప్రక్రియ కథానిక- పోరంకి దక్షిణామూర్తి."[2]
3. "సాధారణంగా నాతి విస్తృత క్షేత్రము కలిగి ఒకానొక సంవేదనతో కూడి స్వయం సంపూర్ణమై దానిలోని విభిన్నతత్వాలను ఏకోన్ముఖంగా చూపించే ఇతివృత్తాత్మక గద్య

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

కవితా శిల్ప ఖండం కథానిక- బొడ్డపాటి కుటుంబరాయ శర్మ (తెలుగు విజ్ఞాన సర్వస్వం)"[3]

**కథానిక లక్షణాలు:**

పోరంకి దక్షిణామూర్తి రచించిన "కథానిక వాఙ్మయం" తెలుగు కథానిక తొలి సిద్ధాంత గ్రంథం. ఇందులో సంక్షిప్తత, ఏకాంశవ్యగ్రత, నిర్భరత, స్వయం సమగ్రత, సంవాద చాతుర్యం, ప్రతిపాద్య ప్రవణత, ప్రభావాన్వితి అనునవి కథానిక లక్షణాలుగా వివరించారు. సంక్షిప్తత, ఏకాగ్రత సమగ్రత, నిర్భరత కథానిక ప్రధాన లక్షణాలు.

**కథానిక సాహిత్యం వర్గీకరణ:**

శ్రీ పోలాప్రగడ సత్యనారాయణమూర్తి గారు తెలుగు కథా సాహిత్యాన్ని నాలుగు విధాలుగా వర్గీకరించారు. అవి తొలిదశ (1910-1940), మహోన్నత దశ (1940-1952), ఉజ్జ్వలదశ (1952-1965), మహోజ్జ్వలదశ (1965-1992)

**ప్రసిద్ధ కథానికలు-రచయితలు :**

20వ శతాబ్దము మొదటి పాదంలో ప్రసిద్ధ కథా రచయితలు కథా రచనకు పూనుకున్నారు. తెలుగులో తొలి కథానిక గురజాడ అప్పారావు 1910 లో రచించిన "దిద్దుబాటు". దీనిని ఆంధ్రభారతి పత్రికలో ప్రచురించారు. దీనికి మొదట పెట్టిన పేరు కమలిని. "దిద్దుబాటు కథ"లో పెడదారి పట్టిన భర్తను దారికి తెచ్చుకున్న కమలిని కథ.ఇందులో సామాజికాంశము ఉంది. మీపేరేమిటి?, మెటిల్డా, పెద్ద మసీదు వీరి ఇతర కథానికలు. చింతా దీక్షితులు మొట్టమొదటిసారిగా గిరిజనుల జీవితాల్ని గురించి రాసిన కథ దాసరి పాట. సంచారజీవనుల్ని గురించి రాసిన కథ సుగాలి కుటుంబం ఇది మొదటి కరువు కథ. తెలుగు వ్యవహారిక భాషలో, నుడికారంలో కథలు రాసినవారు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి. వీరు మూఢాచార నిరసనను వితంతు వివాహాన్ని గురించి "అన్నంతపని జరిగింది కథ"లో, సంసార జీవితంలోని మాధుర్యాన్ని "గూడు మారిన కొత్తరికం"లోను, స్త్రీ స్వాతంత్ర్యాన్ని గురించి "కీలెరిగివాత"లోను, అంటరానితనాన్ని గురించి "ఇలాంటి తువ్వాయి వస్తే" లోను మనిషి నైతిక పతనాన్ని గురించి "కలుపు మొక్కలు" కథలో రాశారు. అక్షరాన్ని ఆయుధంగా మలిచి, కథన శైలిలో కొత్త అందాన్ని సృష్టించి ఓ పువ్వు పూసింది, మాకర్మమిట్లా కాలింది, హంపీకన్యలు,సినిమా జ్వరం,ఆమె త్యాగం, ఆ రాత్రి, పాప ఫలాలు, ఆమె పెదవులు మొదలైన కథలు చలం రాశారు. తెలంగాణలోని వెట్టి చాకిరి వంటి దురాచారాలను స్త్రీల అసహాయతను సామాన్యుని వేదనలను చిత్రిస్తు "మొగులాయి కథలు", "నిరీక్షణ", "అపరాధం"సురవరం ప్రతాపరెడ్డి, "హృదయ శల్యము", "మల్లికా గుచ్ఛం" మాడపాటి హనుమంతరావు, "ఒట్టు", "మాపూరు" కనుపర్తి వరలక్ష్మమ్మ మొదలైనవారు రాశారు.

మానవసంబంధాలు కర్మానుబంధాలను "ఏమిబంధము"లో ప్రజాస్వామ్యంలో బిచ్చగాళ్ళ రాజ్యాన్ని గురించి ముగ్గురు "బిచ్చగాళ్ళు"లో "మాక్లీ దుర్గంలో కుక్క" వంటి కథలు రాసి తెలుగు కథా సాహిత్యంలో మొదటిసారిగా తాత్వికతను విశ్వనాథ సత్యనారాయణ ప్రవేశపెట్టారు. మల్లాది రామకృష్ణ శాస్త్రి కథాకథన చాతుర్యము కళ్ళకు కట్టినట్లు ఉండే పాత్ర చిత్రణలతో రంగవల్లి, ముని గోరింట, మత్త కోకిల, కాముని పున్నమి, వెన్నెల గులాబిలు మొదలైనవి రాశారు. కొడవటిగంటి కుటుంబరావు నీకేంకావాలి, దత్తపుత్రుడు, అమాయకురాలు, కులద్వేషం,పక్షి కోసం వెళ్లిన పంజరం, ఆడజన్మ మొదలైనవి రాశారు. ఉజ్వల కవిత్వంతో పాటు ఊరి చివర ఇల్లు, దేవుళ్ళు చూసిన వాడు, అద్దంలో జిన్న, లిబియా ఎడారిలో కథలు రాసిన వారు తిలక్. సంఘంలోని మంచి చెడ్డల్ని నిశిత పరిశీలనతో మానవతావాదంతో త్రిపురనేని గోపీచంద్ తండ్రులూ- కొడుకులూ, ధర్మ వడ్డీ, హిందూ పాతివ్రత్యం, గీతాపారాయణం, మమకారంవంటివి రాశారు. ప్రపంచ కథల పోటీలో "గాలివాన"కు ద్వితీయ బహుమతి లభించింది ఈ కథను రాసిన వారు పాలగుమ్మి పద్మరాజు. కుంకుడాకు బండ పాటు,కుక్కుటేశ్వరం, చిన్నాజీ, వాయులీనం మొదలైనవి రాసిన వారు చాగంటి సోమయాజులు.బుచ్చిబాబు చైతన్యస్రవంతి ధోరణితో గాజుమేడ, మూడు కోతులు,కొత్త వంతెన -పాత నీరు, దేశం నాకిచ్చిన సందేశం మొదలైన కథలు రాశారు.తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట నేపథ్యంలో ఆవుల పిచ్చయ్య రచించిన కథలు దొరా, ఊరేగింపులు, దినచర్య, వెట్టి చాకలి. తెలంగాణ గ్రామీణ జీవన విధానాన్ని చిత్రిస్తూ పాకాల యశోదారెడ్డి రచించిన కథలు మా ఊరి ముచ్చట్లు, ఎచ్చమ్మ కథలు, ధర్మశాల. ఇల్లిందల సరస్వతిదేవి రచించిన కథలు ముత్యాల మనసు,స్వర్ణకమలాలు,పండుగ బహుమానము, జైలు లోపల,స్త్రీ నీకు రక్షణ ఎక్కడ?.మధురాంతకం రాజారాం కథలు పాంథ శాల,పొద్దు చాలని మనిషి, కూనలమ్మకోన, స్వస్థానం. బీనా దేవి కథల్లో ప్రముఖమైనవి రాధమ్మ పెళ్లి ఆగిపోయింది, రిబ్బను ముక్క.

**కథానిక వస్తు వైవిధ్యం :**

1950 తర్వాత కథా రచన కాలక్షేపంగా కాక సాహిత్య ప్రక్రియగా నిలదొక్కుకుంది. రచయితలు పాఠకుల్ని జాగృతం చేసే, వారి ఆలోచనలకు పదను పెట్టే, మనసుల్ని రంజింప చేసే కథలు రాశారు. దేశ పరిస్థితుల్ని అంచనావేసి కుటిల రాజకీయాలు, విలువల పతనము, అవినీతి, శ్రమ దోపిడీ, స్త్రీ అణచివేత వీటిని దృష్టిలో పెట్టుకొని కథలు రాసిన పాత తరం కొత్త తరం రచయితలు రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు, మధురాంతకం, మాలతి చందూర్, అబ్బూరి ఛాయాదేవి, శీలా వీర్రాజు, ఆచంట శారదా దేవి మొదలైనవారు . స్వాతంత్ర్య అనంతరం రెండో తరానికి చెందిన రచయితల రచనలు పరిశీలిస్తే శ్రీపతి మంచు పల్లకి, అల్లం శేషగిరిరావు వరుడు, నరమేధం, జొన్నవిత్తుల వంజె ఈ

కథలన్నింటిలో పల్లె వెతల్ని, పట్టణ బాగోతాల్ని చిత్రించారు. వస్తు వైవిధ్యమును చూపే కథలు అన్ని ప్రాంతాల నుండి వస్తున్నాయి. రాయలసీమ విషయానికి వస్తే నీటి సమస్య కాకుండా కక్షలు కార్పణ్యాలు, వాటి వల్ల చిద్రమయ్యే వారి జీవిత దృశ్యాలు. రైతుల సమస్యలు తెలంగాణ ప్రాంతంలో జన జీవితాన్ని విస్తృత కోణాల్లో కథల్ని పరిచయం చేశారు. వారిలో అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, బిఎస్ రాములు. కథా సాహిత్యంలో మూడవ తరానికి చెందిన రచయితల్లో 1970 నుండి కథలను ప్రారంభించారు. అల్లం రాజయ్య మధ్యవర్తులు, శివ శంకర్ మట్టి గుండె, బి.ఎస్. రాములు అడవిలో వెన్నెల, ఓల్గా రాజకీయ కథలు. 1980 తర్వాత యువతరం రచయితల కథలు అస్త్రాలుగా, శస్త్రాలుగా, ఆయుధాలుగా మలిచి కథా పరిధిని పెంచారు. మహేంద్ర జర్తే, ఇంధనం, నరేంద్ర మిత్ర, నాలుగు కాళ్ల మండపం, అప్పలనాయుడు ఓ తోట కథ, బిఎస్ రాములు మెరుగు, అల్లం రాజయ్య మనిషి లోపలి విధ్వంసం, కాలువ మల్లయ్య ఊరు ఉమ్మడి బతుకులు. 1985 తర్వాత స్త్రీవాద, దళితవాదాలను రచయితలు, రచయిత్రులు ప్రచారంలోకి తెచ్చారు ఓల్గా, జలంధర, సత్యవతి, రజని, సుజాత,వరలక్ష్మి,కె.నిర్మల, సుమతి మొదలైన వాళ్లు స్త్రీల జీవితాలలో వెలుగులోకి రాని అంశాలన్నీ కథలుగా మలిచారు. 1985 తర్వాత దళితవాద కథలు కొలుకలూరి ఇనాక్, బిఎస్ రాములు, మద్దూరి నగేష్ బాబు, పైడితేరేశ్ బాబు, సతీష్ చందర్, ఎండ్లూరి సుధాకర్ మొదలైన వారు రాశారు.

**కథానిక సాహిత్యం పై వచ్చిన పరిశోధనలు:**

1. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి
2. తెలుగు కథానిక – అవతరణ, వికాసాలు - సి. హెచ్ శారద
3. పాలగుమ్మి పద్మరాజు కథానికలు - ఒక పరిశీలన- ఎం. సామ్రాజ్యలక్ష్మి

**ముగింపు:** కథానిక కనుపర్తి వరలక్ష్మమ్మ “స్త్రీ విద్య”తో మొదలై ఆచంట సాంఖ్యాయన శర్మ, గురజాడ అప్పారావుల కలం బలంతో ముందుకు దూసుకెళ్లిన కథా స్రవంతి కథానిక. నన్నయతో తెలుగు కవిత్వం మొదలుకావడం ఎంత విశేషమో సామాజిక స్పృహగల గురజాడ దిద్దుబాటుతో తెలుగు కథానిక ప్రక్రియ మొదలుకావడం అంతే విశేషం అనిపిస్తుంది. చింతా దీక్షితుల చేతిలో అందాలు దిద్దుకొని చలం చేతిలో సాంఘిక దురాన్యాయాలను ఎదిరించి శ్రీపాద, వేటూరి, మల్లాది వంటి వారి చేతుల్లో కథానిక సామాజిక ప్రయోజన వాహికగా రూపొంది ఓ మంచి సాహిత్య ప్రక్రియగా వెలుగొందింది. కుటుంబము, భార్య భర్తల అనురాగము మునిమాణిక్యం నరసింహారావు

హాస్యదృష్టిలో వివరించాడు. విశ్వనాథ, పాలగుమ్మి, బుచ్చిబాబు, కొడవటి గంటి, గోపీచంద్,కరుణ కుమార, మధురాంతకం, రావిశాస్త్రి, రమణ, కాళీపట్నం రామారావు ,త్రిపుర, శ్రీదేవి,రంగనాయకమ్మ, సత్యవతి, వోల్గా, జయప్రద,నిర్మలా, రజనీ, అల్లం రాజయ్య మొదలైన వారి చేతుల్లో కథానిక పెరిగి పెద్దయి నేడు అన్ని సాహిత్య ప్రక్రియల్లో ఒకటిగా వెలుగొందుతుంది.

**కీలక పదాలు**: కథానిక, కథానికవస్తువు, రచయితలు, వర్గీకరణ, కథానిక పరిశోధనలు.

**పాదసూచికలు**:

1.పు.సం-131- సాహితీ దుందుభి.

2.పు. సం-175- తెలుగు కథానిక స్వరూప స్వభావాలు.

3.పు. సం-122- తెలుగు భాష,సాహిత్యం.

**ఆధార గ్రంథాలు**


1. హిస్టరీ ఆఫ్ తెలుగు లిటరేచర్, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి
2. తెలుగు భాష,సాహిత్యం, 2017, తెలుగు అకాడమి, హైదరాబాద్.
3. సాహితీ దుందుభి, డిగ్రీ తృతీయ సంవత్సరం, 2023, తెలుగు అకాడమి, హైదరాబాద్.
4. దక్షిణామూర్తి పోరంకి,1988,తెలుగు కథానిక స్వరూప స్వభావాలు.
5. డా ||. మద్దిలేటి. ఎస్. కె, తెలుగు సాహిత్య దీపిక, 2017, విశ్వవాణి పబ్లికేషన్స్, కర్నూలు.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# *అభ్యుదయ కవిత్వం - భావజాల* *విస్తృతి*

**డాక్టర్. జి. వి. ఎస్. జయపాల రావు,**
అధ్యాపకులు,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయనగరం టౌన్.
ఫోన్ నెంబర్: 9492020115
మెయిల్ ఐడి:gvsjayapalarao@gmail.com

నవయుగ వైతాళికుడు, అభ్యుదయ సాహిత్య మార్గదర్శి, గురజాడ అప్పారావు స్వయంగా ఇంగ్లీషు లెక్చరర్ మరియు లాటిన్, ఫ్రెంచ్ మొదలగు భాషలను అధ్యయనం చేసి చరిత్ర ఉపన్యాసకులుగా పని చేయడం వలన, సాహిత్యాభిలాషతో సంస్కృతము నేర్చుకోవడం వలన, విరివిగా గా పాశ్చాత్య సాహిత్యాన్ని చదవటం వలన అభ్యుదయ భావాలు అతనిలో వెల్లి విరిసాయి.గురజాడ అప్పారావు రచించిన గేయాలు అన్ని కలిపి 100 పేజీలు ఉన్నప్పటికీ నాలుగు ప్రధానమైనటువంటి అంశాలను ఎజెండాగా ఇచ్చి అభ్యుదయ సాహిత్యం ముందుకు నడిపించాడు.1) అత్యంత ఆధునిక సమస్యలను సాహిత్య పరంగా తీసుకోవడం 2) దేశభక్తికి మార్గదర్శకంగా నిలిచే కవిత్వం 3) ప్రేమ కవిత్వాన్ని బీజావహనం చేయడం 4) జీవిత కథా వస్తువును కావ్యంగా రాయడం అనే నాలుగు సమస్యలను ప్రయోజనాత్మకంగా ఆయన సృష్టించారు. ఉదాహరణకు అమానుషపు పోకడలకు నిరసనగా గురజాడ రాసిన "మనిషి,"దేశభక్తి ప్రబోధాత్మకంగా ప్రపంచ పౌరులకు ఉద్బోధగా వ్రాసిన దేశభక్తి గీతం, వర్ణ రహిత వ్యవస్థ ఆకాంక్షను చెప్పిన "లవణ రాజు కల, "స్త్రీ చైతన్య ప్రతీకగా గురజాడ "కన్యక",

హృదయం కదలి కరిగించే గేయంగా పూర్ణమ్మ,
జాగృతం చేసే గీతిక" లంగరెత్తుము,"
సగటు మనిషి అంతరంగాన్ని
తెలియజేసే "లంగర్ దించుము" వంటి,

సమాజంతో మనిషి ముడిపడినటువంటి, మార్పును కోరే అభ్యుదయ సాహిత్యం వైపు గురజాడ నడిపించిన తీరు, సాహితీ లోకానికి మార్గదర్శకం అయింది.

మన దేశం ఎలా ఉంది? మన జాతి ఎలా ఉంది? ప్రపంచం ఎలా ఉంది? అనే విషయాల దృక్పథం కలిగిన మహానుభావులు 19వ శతాబ్దంలో పుట్టారు. 19 శతాబ్దం 20వ శతాబ్దానికి కన్న తల్లి లాంటిది.

ఇక్ష్వాకుల కాలం నుంచి ఇంగ్లీష్ వాడి పాలన వరకు పచ్చి ఫ్యూడలిజమే మనల్ని పరిపాలించింది. సహజంగా సాహిత్యం కూడా దాని చుట్టూ తిరిగింది. బానిసత్వం పుట్టినప్పుడే పోరాటం పుట్టింది బానిసత్వం పోయే వరకు పోరాటం సాగుతుంది.అంతవరకు అభ్యుదయ సాహిత్యమూ బతికే ఉంటుంది. స్వేచ్ఛ అన్ని రంగాల్లో ముందుకు జరిగింది. కవిత్వంలో కూడా జరిగింది ఎప్పుడైతే ఫ్రీడమ్ వచ్చిందో ప్రతివాళ్ళు అభ్యుదయ కవిత్వం రాయడం ప్రారంభించారు.

అభ్యుదయ సాహిత్యం అంటే ఏంటని మన ప్రశ్నించుకుంటే?.
అభ్యుదయ సాహిత్యం అనేది సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలు, దోపిడీ వ్యవస్థను ప్రశ్నిస్తూ ప్రజలను నిరంతరము చైతన్యవంతులను చేసే సాహిత్య ప్రవాహమే అభ్యుదయ సాహిత్యం.

"అహంభావాపు ఆధిపత్యాన్ని కాదని
గురజాడ కన్యక వీధుల్లోకి వచ్చినప్పుడు
కావ్య కన్యకగా ప్రజలకు పరిచయమై
అంతఃపురాన్ని వదిలి
ప్రజా బాహుళ్యం లోనికి ఆధునిక సాహిత్యమై వచ్చింది.
ప్రకృతి సొగసు చుట్టూ కదిలికలను
భావ కవిత చిత్రాలన్నారు.
శబ్దాలంకారాలతో
ప్రజల గోడ విన్నవించి
విస్తృత స్వాగతమిచ్చినారు
డప్పు,డమారాలతో ఊరేగించి ప్రజాసందడి చేసినారు...

మువ్వ కట్టి, రక్తి కట్టించినారు..
ప్రజలకు అర్థమయ్యే బాషలో
నేను నిత్యం కలుస్తూ.
స్మరిస్తూ, గానం చేస్తూ, ప్రజారంజకం చేసినారు.
నీ చిత్ర రూప విన్యాసాలనే ప్రదర్శిస్తూ
నిన్ను ఆనందింప చేయుటకు ప్రయత్నిస్తూనే ఉన్నారు
ప్రగత శీల కాముకలుగా చరిత్ర సృష్టిస్తూనే ఉన్నారు.

ఆచంద్ర తారార్కం
అభ్యుదయ సాహిత్య సేవలోనే ఉంటారు.
అని నేను రాసిన" స్వేచ్ఛ నా సందేశం "కవిత సంకలనంలో ఒక కవిత.

అభ్యుదయ సాహిత్యానికి మూలం 20 శతాబ్దం ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన సామాజిక రాజకీయ మార్పు లే ఆధారం.అయితే గురజాడ మానవతా విలువల ప్రాతిపదికన అభ్యుదయ సాహిత్యం ప్రారంభించాడు. రష్యా విప్లవం ప్రభావం మార్కిస్ట్ సిద్ధాంతాల వ్యాప్తి,భారతీయ అన్ని బాషల్లో వచ్చిన సాహిత్యం పై గణ నీయమైన మార్పుని తీసుకొచ్చింది. మానవ హక్కుల పరిరక్షణ ప్రధాన అంశంగా అభ్యుదయ సాహిత్యం సాగుతుంది.దీంతో సాహిత్యం కూడా సమాజానికి జవాబుదారీగా ఉండాలని భావన బలపడింది. వ్యక్తి సమస్యల కన్నా సామాజిక సమస్యలు ముఖ్యమైనవన్న దృక్కోణం.అదే భావన అభ్యుదయ సాహిత్య పునాది గా నిలిచింది.

గురజాడ తర్వాత తరంలో బహు భాషా కోవిదుడు,ఆచార్య రోణంకి అప్పలస్వామి అభ్యుదయ సాహిత్యానికి మహోపకారం చేశారు. పాశ్చాత్య బాషలు అనేకము నేర్చుకోవడం వలన విజయనగరంలో చాగంటి సోమయాజులు ఇంటివద్ద, శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర, శ్రీరంగం నారాయణబాబు లతో నిత్యము సాహిత్య చర్చలు జరిపి పాశ్చాత్య సాహిత్యంలో వచ్చినటువంటి మార్పులు, అభ్యుదయ భావాలు అనుసరించవలసిన పద్ధతులుగురించి వీరు చర్చించేవారు.

శ్రీశ్రీ వరకు వచ్చినప్పుడు, స్విన్ బర్న్, రోణంకి అప్పల స్వామి, అబ్బూరి రామకృష్ణారావు ప్రభావం అతని మీద ఉంటుంది.పారిశ్రామికంగా ఎదుగుతున్న విశాఖపట్నంలో కార్మికుల యొక్క కష్టసుఖాలు ప్రత్యక్షంగా విన్నాడు.అభ్యుదయ సాహిత్య బావజాలం ప్రధానంగా శ్రమజీవుల జీవితం చుట్టూ తిరుగుతుంటుంది. రైతులు, కార్మికులు, దళితులు, పేదలు, అణగారిన వర్గాల బాధలు, ఆశలు, ఆకాంక్షలు,ఈ సాహిత్యంలో స్పష్టంగా ప్రతిఫలిస్తాయి. దోపిడీ వర్గ విభజన, కుల వ్యవస్థ,లింగ వివక్ష, వంటి సమస్యలను బహిర్గతం చేయడం ద్వారా ఈ సాహిత్యం సామాజిక ప్రయోజనాల ఆశించి,ప్రశ్నించే శక్తిగా రూపాంతరం చెందింది.అభ్యుదయ సాహిత్యం సమాజంలో ఉన్న అసమానతలు,అన్యాయాలు, దోపిడీ వ్యవస్థను ప్రశ్నిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసే సాహిత్య ప్రవాహం. దీన్ని బావజాల విస్తృతిని మనం పరిశీలిస్తే మార్కిస్ట్ ఆర్థిక విశ్లేషణ ప్రాతిపదికగా మానవతావాదం, ప్రజాస్వామ్య విలువలు,లౌకికత,శాస్త్రీయ దృక్పథం వంటి భావనలు ఇందులో ఇమిడిపోతాయి. వ్యక్తి స్వేచ్ఛ, గౌరవం, సమాన హక్కులు వంటి అంశాలు అభ్యుదయ సాహిత్యంలో కీలక స్థానాన్ని పొందాయి.

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

కేవలం కవిత్వంలోనే కాకుండా కథలు, నవలలు, నాటకాలలో కూడా అభ్యుదయ భావజాలం వ్యక్తం అయింది. సామాజిక వాస్తవాన్ని యదార్ధంగా చిత్రించడం, పాత్రల ద్వారా సామాజిక సంఘర్షణలు చూపించడం, అభ్యుదయ సాహిత్యం యొక్క ప్రత్యేకత.దీనిని అర్థమయ్యే బాషలో చెప్పడం వలన సాహిత్యం ప్రజల కోసమే అనే భావనను కార్యరూపంలోకి తీసుకొచ్చింది. అందుకే దీనిని ప్రజాసాహిత్యం అని కూడా అంటారు. అభ్యుదయ రచయితలు, కళా విలువలు,మరియు సామాజిక బాధ్యత రెండు కలిసి వారి రచనలు ద్వారా pనడిపించారు. సమకాలీన పరిస్థితుల్లో అభ్యుదయ సాహిత్యం కొత్త రూపాల్లో కొనసాగులోంది.గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్,కార్పొరేట్ సంస్కృతి వంటి ఆధునిక భావనలను కూడా ఇది సృజిస్తోంది.భావజాలం మారినప్పటికీ అన్యాయంపై ప్రశ్నించే తత్వం మాత్రం మారలేదు.అందుకే అభ్యుదయ సాహిత్యం నేటికీ కొనసాగుతూనే ఉంది.

అభ్యుదయ సాహిత్యం లో శ్రీ శ్రీ రచించిన మహాప్రస్థానం ముఖ్యమైన పాత్ర పోషించింది.తెలుగు కవిత్వాన్ని ప్రజల వైపు మళ్లించిన విప్లవాత్మక గ్రంథం గా భావించబడుతుంది.అతను కవిత్వంలో కార్మికుడి శ్రమ,ఆకలి, ఆగ్రహం,స్పష్టంగా వినిపిస్తాయి. అలాగే ఆరుద్ర, చలం,తుమ్మలపల్లి సీతారామమూర్తి రచయితలు ద్వారా భావించాలని విస్తృతంగా వ్యక్తీకరించారు.

అభ్యుదయ సాహిత్యానికి పితామహుడుగా గుర్తింపు పొందిన శ్రీశ్రీ తన కవిత్వం లో రష్యా విప్లవ ప్రభావంతో "నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను, "గర్జించి రష్యా గాండ్రించి రష్యా అనేటువంటి కవితలు వచ్చాయి.వర్గ పోరాటం తీవ్రంగా నిరసించాడు. పేదల పక్షాన నిలబడి, దగా పడిన స్త్రీల గురించి రాస్తూ "పతితులారా, బ్రష్టులారా, బాధా సర్పద్రష్టులారా? ఏడవకండి ఏడవకండి అంటూ అండగా నిలబడడమే కాకుండా కవిత్వ వస్తువు మార్పునకు సంకేతం ఇచ్చాడు.

పేద ధనికుల వ్యత్యాసాల గురించి రాస్తూ,

"ఎండాకాలం మండినప్పుడు
గబ్బిలం వలె క్రాగి పోలేదా?
వానకాలం ముసిరినప్పుడు
నిలువు నిలువునా నీరు కాలేదా?"

అంతేలే పేదల బ్రతుకులు,అంటూ..

కావున లోకపుటన్యాయాలు
కాల్చే ఆకలి,
కూల్చే వేదన,దారిద్యాలు, దౌర్జన్యాలు అంటూ తీవ్రంగా పేదరికం మీద తిరుగుబాటు చేశాడు.
కార్మికుల దుఃఖం గురించి మాట్లాడుతూ
"నరాలు బిగువు కరాళసత్తువ
వరాల వర్షం కురిపించాలని... అని గొంతెత్తాడు.

అదే బాటలో అభ్యుదయ సాహిత్యాన్ని చేస్తూ ఆరుద్ర
పట్టణ పేదల జీవితాల గురించి రాస్తూ

"ఓహో ఏమిటి జీవ ప్రవాహం యంత్రాల ముకిరి మనుసులు
ప్రాణాలు పిడికిట పట్టుకుని
గుండులు చేపట్టుకొని,అంటారు

నిరుద్యోగ గురించి రాస్తూ
ఏ బి సి డి లు రాని
ఎన్జీవో లంటూ ఉంటే
ఎన్ని యోగ్యతలు ఉన్నా
ఎం.ఏ ట్రేడ్ ఏమిటి?

మేధో వర్గ బాధ్యత గురించి రాస్తూ

ఆగదే ఆకలితో పోరాటం
ఆరదే దహించే ఆరాటం
అశాంతి కోటిన్నర వోట్లులు
ఎక్కడ చూసినా రివోల్ట్ లు అంటారు.
1940-50 దశ్శకంలోనే కుందుర్తి ఆంజనేయులు

ఒకవైపున అధికారులు వస్తే
మరోవైపు డొక్కల కరువు అంటాడు మధ్యతరగతి బాధల గురించి

సామాజిక కష్తత్వం గురించి చెబుతూ

జగత్తులో నిప్పుల యజ్ఞం
చేయించిన నియంతలారా
కాలానికి కట్టులు కట్టిన
కర్కాటక ప్రభువుల్లారా
నాగరికత పేరిట జరిగే
నరహత్యలకట
జాతీయోన్నతి మిషతో సాగే
నర పీడనం
ఉత్తర వాదులు మీరే
ఉరికంబం పిలుస్తోంది. అని సామాజిక కపటత్వం గురించి ఆంజనేయులు గారు రాసిన కవిత.

చరబండ రాజు రాసిన అభ్యుదయ కవితలో వందేమాతరం అనే కవితను పరిశీలిద్దాం.

ఓ నా ప్రియమైన మాతృదేశమా
తల్లివి,తండ్రివి, దైవానివి, నీవేనమ్మా
దుండగులతో పక్కమీద కులుకుతున్న శీలం నీది
అంతర్జాతీయ విపణి లో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది
సంపన్నుల చేతుల్లో మైమరిచి నిద్రిస్తున్న యవ్వనం నీది
ఒంటిమీద గుడ్డలతో జండాలు పుట్టించి వ్యవస్థలో ఊరేగుతున్న ధైర్యం నీది"
అంటూ 1940-50 దశకంలోనే సామాన్య ప్రజల యొక్క దయనీయ పరిస్థితిని, సంపద సంపన్నుల చేతుల్లోకి ఏ విధంగా వెళ్లిపోతుంది,
కర్షకులు,కార్మికులు ఏ విధంగా శ్రమదోపిడీకి గురవతున్నారు.
పెట్టుబడిదారీ వ్యవస్థ ఏ విధంగా
అంతర్జాతీయ మార్కెట్లో కాలునుకుంటున్నదన్న విషయాలు మీద స్పష్టంగా చెప్పారు.

రుధిర జ్యోతి కావ్యంలో శ్రీరంగం నారాయణబాబు ఇలా అంటారు.

ఆకలి తీర్చని
మానము గొప్పని
దేశం కోసం మట్టి ప్రమిదలో
వత్తే కాలింది
మానిని ఈనాడు..

ఇదే పంధాను కొనసాగిస్తూ బాలగంగాధర్ తిలక్

"కూడులేని లోకంమిది
గుండె లోతు తాపం ఇది
సోమయాజి శాపం ఇది
భూమి అడుగు లోకం యిది "
అని చెబుతూనే

నేను చూస్తాను నిజంగా నిరంధ్ర వర్షాల వంతెన కింద
నిండు చూలాల ప్రసవించి మూర్ఛలను దృశ్యాన్ని…

వరవరరావు తదుపరి దశలో విప్లవ రచయిత అయినప్పటికీ మొదటి దశలో అభ్యుదయ కవిత్వంతోనే ఆయన సమాజ నిర్మాణంలో దోపిడీ స్వరూపం గురించి తీవ్రంగా ప్రశ్నించారు.

కవిత్వం దాచనక్కర్లేని నిజం
ప్రభుత్వం అక్కరలేని ప్రజ
అమృతం అక్కర్లేని జీవితం" అంటారు పీడిత వర్గాల హక్కుల గురించి వరవరరావు.

విప్లవ చైతన్యం గురించి రాస్తూ
నా కవిత్వం
ఒక బాధ తంత్రి
ఒక క్రోధ తంత్రీ తెగినట్లు
కన్నీటిని వెలిగించేవి చావులైనట్లు
ప్రవహిస్తూనే ఉంటుంది

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

రుద్రాక్షల నదిగా ". అంటారాయన.

అలాగే గద్దర్ కవిగా మాత్రమే కాక ప్రజా గాయకుడిగా కూడా సామాజిక అసమానతులపై పోరాడని వ్యక్తి. దళిత ఆదివాసి దోపిడీ గురించి శ్రమకు న్యాయం గురించి అనేక ప్రజా ఉద్యమాలు చేశారు.

తల్లి, భూమి, మనిషి మధ్య అనుబంధం ద్వారా మానవతా భావాలను పెంపొందించేటువంటి కవితలు గోరేటి వెంకన్న గారు రాసిన అమ్మ,భూమి కోసం కవితలు.

అదేవిధంగా మానవ స్వేచ్ఛ, భావ ప్రకటనకు మౌనాన్ని ప్రశ్నించే కవిత్వం "నా గొంతుక, చెరువులు" అనే కవితలు రాసిన కాళోజి నారాయణరావు గారి సాహిత్యం.

ఆధునిక సాహిత్యం గురించి గంటెడ గౌరినాయుడు గారి మాటల్లో చెప్పాలంటే,

ఇప్పుడు కవిత్వమంటే
పన్నీటి జలకాలపాట కాదు
కన్నీటి కథనాల వేట
ఇప్పుడు కవిత్వం అంటే
గుండెను మండించి
బ్రతుకుని వెలిగించడం
ఇప్పుడు కవిత్వం అంటే
మాటను మంత్రం చేసి జాతికి జవసత్వాలు అందించడం."అని అంటారు.

పురుష సామాజిక వ్యవస్థను ప్రశ్నిస్తూ, స్త్రీ స్వరాన్ని, స్వతంత్రంగా ప్రతిష్ఠించే సాహిత్య ధోరణి స్త్రీవాద సాహిత్యం.
వివాహ వ్యవస్థ,కుటుంబం, లైంగికత, పని -జీతం,అసమానతలు, గృహ హింస మొదలైన అంశాల మీద ఉంటుంది.కానీ వాస్తవానికి స్త్రీవాద స్త్రీవాద సాహిత్యం సమానత్వం కోరుకుంటుందే తప్ప విభేదాలు కాదన్న విషయాన్ని మనం గమనించాలి.

అదేవిధంగా దళిత సాహిత్యం జాషువా రచించిన గబ్బిలంతో మొదలై,ప్రత్యేకంగా దళితులు వారి జీవితఅనుభవఅవమానాలు,బాధలు, పోరాటాలు, ఆశలు, ఆత్మగౌరవ భావనలు, వ్యక్తపరిచే సాహిత్య

ప్రవాహం.దీనిని దళిత సాహిత్యంగానే చూడకుండా సామాజిక రాజకీయ అసమానతులకు ఉద్యమస్వరంగా మనం భావించాలి. ఆగ్రహం,ఆత్మ పరిశిలన, ప్రతిఘటన, దళిత సాహిత్యానికి మూలధనం..

కవిత వస్తువులు ఏమిటంటే అంటరానితనం శ్రమదోపిడి, సామాజిక అవమానం, పేదరికం మానవ హక్కులు సామాజిక న్యాయం ఇవన్నీ కవిత వస్తువులుగా ఉంటాయి.

కత్తి పద్మారావు, జయరాజు, శ్యాం ప్రసాద్, ఎండ్లూరి సుధాకర్, చింత కింది మురళిధర్ వంటి వారు దళిత సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తున్నారు.

ఫ్యూడల్ వ్యవస్థలో ఉన్నటువంటి సమాజంలో సాహిత్యం అదే ఇతి వృత్తంగా సాగింది. మరి ప్రస్తుతము మనము ప్రజాస్వామ్య పరిపాలనలోఉన్నాము,ప్రజాస్వామ్యకు భావనలు తప్పుదారి పట్టినప్పుడు, ప్రైవేటైజేషన్,గ్లోబలైజేషన్ కార్పొరేట్ సంస్కృతి పక్కదారి పట్టినప్పుడు ఆ అంశాలను కూడా తీసుకొని మనము కవిత్వకరించాలి.రాజకీయ అవినీతి, ప్రజాస్వామ్య అధికారుల దుర్వినియోగం,నాయకుల స్వార్థపరుత్వం, ప్రజాస్వామ్యం మూల స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయి. ప్రజాస్వామ్య విలువల ముఖ్యాంశాలుగా అభ్యుదయ కవిత్వంలో ప్రజల సార్వభౌమాధికారం,

భావ ప్రకటన స్వేచ్ఛ, సామాజిక న్యాయం, శ్రామికుల హక్కులు, అన్నగారిని వర్గాల గొంతుకగా అభ్యుదయ కవితా వస్తువుగా ఉండాలి. ప్రస్తుతము పాలకుల యొక్క భావజాలం గురించి నేను రాసి, ప్రచురించిన "స్వేచ్ఛ నా సందేశం" అను కవితా సంకలనంలో ఒక చిన్న కవిత.

"పులి రాజు భావజాలం
గొంగళి పురుగు చిత్ర విచిత్ర వేషాలు
అల్ప బుద్ధి కోతుల విన్యాసాలు
ఊసరవెల్లి పార్టీల మార్పులు
చింపాంజీలకు గోముఖాలు
మేకలకు ఎలుగుబంటి ముఖాలతో మార్పింగులు గొర్రెల మందకు చెప్పే తోడేలు కబుర్లు గ్యాషిప్స్
వెదజల్లే పిల్లులు నేటి రాజకీయంలో నిత్య వార్తలు.

అభ్యుదయ సాహిత్యం సమానత్వం, న్యాయం, మానవ గౌరవం, అనే విలువలు మీద ఆధారపడింది. దీనిని ఒక సామాజిక ఉద్యమంగా శ్రీ శ్రీ మొదలుకొని వరవరరావు గద్దర్ వరకు అభ్యుదయ కవిత్వాన్ని

ఆయుధంగా మలిచారు. అందుకే అభ్యుదయ సాహిత్యం తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది.

ఒక్క మాటలో చెప్పాలంటే
"మారేది మార్పించేది,
పెను నిద్దుర వదిలించేది,
మునుముందుకు నడిపించేది,
కలకత్తా కాళీ నాలిక
కావాలోయి నవకవనానికి....ఈ మాటలే అభ్యుదయ సాహిత్యానికి దశ, దిశలు అని చెప్పక తప్పదు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1) అభ్యుదయ సాహిత్యం- ఆరంభవికాసాలు వ్యాసం.., రచయిత అవంత్స సోమ సుందర్, ప్రచురణ: తెలుగు వెలుగు పరిశోధనాత్మక వ్యాసమంజుష : సంపాదకులు డాక్టర్ అరిపిరాల నారాయణ రావు
2). అభ్యుదయ సినిమా, వ్యాసం. రచయిత: శ్రీ ధవళ సత్యం: ప్రచురణ తెలుగు వెలుగు పరిశోధనాత్మక వ్యాస మంజూష
3). స్వేచ్ఛ నా సందేశం., రచన: డాక్టర్ జి.వి. ఎస్. జయపాల రావు, అరసం ప్రచురణలు : విజయనగరం శాఖ.
4) మహాప్రస్థానం., రచయిత శ్రీశ్రీ., ప్రచురణ: విశాలాంధ్ర బుక్ పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
5). ఖడ్గ సృష్టి., రచయిత శ్రీశ్రీ, ప్రచురణ: విశాలాంధ్ర బుక్ పబ్లిక్ సింగ్ హౌస్, విజయవాడ.
6) ఆరుద్ర కవితలు
7). చెరబండ రాజు కవితలు : ప్రచురణ: దిక్ సూచి, హైదరాబాద్
8). రుద్రజ్యోతి, రచయిత: శ్రీరంగం నారాయణబాబు, ప్రచురణ: ఎస్.కె పబ్లికేషన్స్ విజయనగరం, సంపదకులు, ఎస్. కే. బాబు.
9). గంటేడ గౌరునాయుడు సాహిత్యం
ప్రచురణ: సాహితీ మిత్రులు, స్నేహ కళా సమితి, పార్వతీపురం

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# సినిమా చాటున ప్రశస్తి కోల్పోయిన నాటక రంగ కథే 'రంగస్థలం' నాటకం

1. డాక్టర్ పి. శ్రీనివాసులు,
అధ్యాపకులు, తెలుగు విభాగం,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెబ్రోలు, గుంటూరు జిల్లా -522 212
2. డాక్టర్ కె. బలరామ్,
అతిది అధ్యాపకులు,
తెలుగు మరియు ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు

**పరిచయం :** ఇది ఒక సాంఘిక నాటకం. రచన సంగీత, సాహిత్య, నటసార్వభౌమ శ్రీ కోడూరుపాటి సరస్వతీ రామారావు. 1962 జనవరి నెలలో గుడివాడలో జరిగిన ఆంధ్ర నాటక కళాపరిషత్ లో ఉత్తమ నాటక ప్రదర్శనగా, ఉత్తమ నటి, ఉత్తమ హాస్యనటులకు కూడా బహుమతులు తెచ్చిపెట్టిన నాటకం ఇది.

ఈ నాటకాన్ని జులై 1962వ సంవత్సరంలో ప్రచురించారు. ఈ నాటకానికి దర్శకత్వం వహించిన వారు శ్రీ తంగిరాల వెంకట శివరామకృష్ణ ప్రసాద్. ఈ నాటక వస్తువులో కొంత పౌరాణిక ఛాయలతో కలిపి, గత సమాజంలో నాటకాలకి ఉన్న ప్రాధాన్యతను, నాటక సంఘాల మధ్య పోటీ తత్వం, నాటకాల్లో పాత్రలకు నాటి సమాజంలో ఉన్న అభిమానాలు, నాటక ప్రదర్శనల్లో దళారీ వర్గం, సినిమా చాటున మసక బారిన నాటక రంగం వంటి అంశాలు ఈ నాటకంలో ప్రధానంగా కనిపిస్తాయి.

**'రంగస్థలం' నాటకం - విశ్లేషణ :** ఇది నాలుగు అంకాల సాంఘిక నాటకం. వరంగల్ ప్రాంతానికి చెందిన రంగారావు అనే వ్యక్తి సికింద్రాబాద్ ప్రాంతంలో ప్రదర్శించిన ఒక నాటకాన్ని చూసి, అందులో ప్రధాన నటుడు రాజ్ ప్రదర్శన తన మనసుని ఎంతో ఆకట్టుకున్నది కావటంతో దానిని మరలా తన ఊర్లో ప్రదర్శింపజేసి, తాను ఆనందపడినట్లే తన ఊరు ప్రజలు కూడా ఆనందపడాలనే ఆకాంక్షతో ఆ నాటక సమాజాన్ని వెతుక్కుంటూ ఆంధ్రా ప్రాంతానికి చెందిన కళా నిలయం' అనే నాటక సమాజాన్ని సందర్శిస్తాడు. ఇది నాటకాలను కాంట్రాక్ట్ కి ఏర్పాటు చేసే సంస్థ. దాని ప్రొప్రైటర్ శ్రీ కంఠం. నాటకంలో అద్భుతమైన నటనను ప్రదర్శింపజేసి ప్రజల మన్ననలు పొందిన నాటక కళాకారుడు రాజ్ తో పాటు తాను ప్రదర్శింపజేసే నాటకంలో సినిమా

యాక్టర్ లిల్లీ కూడా ఉండాలన్నది రంగారావు ఆకాంక్ష. 'ఎంత ఖర్చు అయినా రాజ్, లిల్లీలతో కలిపి నాటకం ఏర్పాటు చేయాలన్నది తన ఆలోచన' అని శ్రీ కంఠం తో చెబుతాడు రంగారావు. అలాగే ఎర్పాటు చేస్తానని చెప్పి వాళ్లని పిలిచే లోపు తన కొట్టులో అలంకరణలతో ఉన్న కృష్ణ, భీమ పాత్రధారులైన 'పంతులు', 'పెంటి రాజుల'ను పరిచయం చేస్తాడు. మచ్చుకు రంగారావు ముందు తమ పాత్రలను ప్రదర్శిస్తారు. రాజ్యాన్ని పణంగా ఎట్టి జూదమాడటం తప్పు కాదా? అంటూ రంగారావును ధర్మరాజుగా భావించి భీమ పాత్రధారి అతనిపై గదతో విరుచుకు పడతాడు. రంగారావు భయపడటంతో కృష్ణ పాత్రధారి భీముడిని వారిస్తాడు. అంతలో 'లిల్లీ' రావడంతో ఆమెతో 'రాజ్ పక్కన నాటకంలో నటించాలని' కొంత భయంతో అడుగుతాడు శ్రీ కంఠం, అంత పెద్ద డ్రామా యాక్టర్ తో నటించే అవకాశం రావడం నా అదృష్టం అంటుంది లిల్లీ. అయితే 'వప్పందం మాట్లాడు కుందాం' అని లిల్లీతో చెప్పి, కళానిలయానికి రమ్మని రాజ్ కు కబురు పంపిస్తాడు శ్రీకంఠం.

రాజ్ పేరొందిన నాటక కళాకారుడు. నాటకాల ఆదరణ కోల్పోయినా గానీ ఇంకా నాటకాలే ప్రాణంగా బ్రతుకుతున్న వ్యక్తి. ఈ పరిస్థితికి కారణం 'నాటకాలు పై వ్యాపారం చేసే కాంట్రాక్ట్ సంస్థలు పుట్టుకు రావడమే అన్నది రాజ్ ఉద్దేశం. నాటకంలో ప్రతిభావంతులకు ఒకనాటి ఆదరణ, గౌరవం తగ్గడం వలన వారి ఆర్థిక సామాజిక పరిస్థితులు హీనంగా మారాయనటానికి నిదర్శనం రాజ్ పాత్ర. ఊరి చివర అద్ద గుడిస, అనారోగ్యంతో మంచాన పడ్డ భార్య, ఆకలితో అలమటిస్తున్న ఇద్దరు మగ బిడ్డలు. తల్లి పరిస్థితి చూడలేక, ఆకలితో చావలేక పదహారేళ్ళ వయసులో ఉన్న పెద్దకొడుకు రాము, చేతగాని తండ్రిని ఇంటినుండి వెళ్లగొట్టమని తల్లితో చెప్పడం బట్టి గొప్ప నాటక నటుడిగా ప్రఖ్యాతి గాంచిన రాజ్ దీన స్థితిని తెలియజేస్తుంది. అటుగా వచ్చిన కురగాయలమ్మే అప్పమ్మ రాజ్ ఒకనాటి గొప్పతనాన్ని తెలియజేస్తుంది. అంతటి గొప్పవాడికి బిడ్డగా పుట్టడం నీ అదృష్టమంటూ రామును మందలిస్తుంది. తల్లి దండ్రులను పోసించుకోలేని చేతగాని కొడుకువా? అంటూ తల్లి కొడుకుని మందలిస్తుంది.

రాజ్ నటనికి అభిమాని అయిన అప్పమ్మ చేతులెత్తి దండం ఎట్టేటంతటి గొప్ప నటుడుకి నడు జరుగుతున్న అవమానాన్ని చూసి తట్టుకోలేకపోతుంది. డబ్బులు ఇవ్వకపోయినా పర్వాలేదు కూరగాయలు తీసుకోమని రాజును ప్రాధేయపడుతుంది. కళానిలయం నుండి రమ్మని వచ్చిన కబురుకు వెళ్లడానికి డబ్బులు లేవని సమస్య ఇస్తున్న

తరుణంలో తన దగ్గర డబ్బులు తీసుకుని వెళ్ళమంటుంది. అందుకు రాజు అంగీకరించడు. తన దగ్గర నగ తాకట్టు పెట్టి ఐదు రూపాయలు తీసుకొని కనిపించకుండా తిరుగుతున్న రమణ ను వెతుక్కుంటూ వెళ్ళిపోతుంది అప్పమ్మ. భార్యకు బాగోలేదని డాక్టర్ని పిలుచుకు రావడానికి వెళ్తాడు రాజు. రమణ డాక్టర్ ను తీసుకొని రాజు ఇంటికి వస్తాడు. డాక్టర్ కి కూడా రాజ్ అంటే అభిమానం. రాజు భార్య పరిస్థితి చూసి సరైన మందులు వాడి మంచిగా విశ్రాంతి తీసుకోమని తెలియజేస్తాడు. అంతలో ఇంటి యజమాని చిన్నయ్య వచ్చి తన కూతురుని మోసం చేసి, మాయమాటలు చెప్పి ఆమె దగ్గర బంగారం దొంగిలించినట్టుగా రాజు భార్యపై నిందలు వేస్తాడు. పోలీసులు కూడా కంప్లైంట్ ఇస్తాడు. దొంగతనం అపవాదానికి రాజు అవమానంతో కుంగిపోతాడు. వచ్చిన పోలీసులతో నిజా నిజాలు తెలుసుకుని ప్రవర్తించాలని డాక్టర్ అంటాడు. పోలీస్ స్టేషన్ కి వెళ్లడానికి రాజు ఇబ్బంది పడతాడు. పోలీస్ స్టేషన్కు వెళ్లడం అంటే ప్రాణం పోయేటంత అవమానంగా భావిస్తాడు. అంతలో అప్పమ్మ వచ్చి తనకి గిట్టునగా తన కాగా రమణ పెట్టినట్లు పోలీసులకు తెలియజేస్తుంది. నిజం బయటపడిన తర్వాత చిన్నయ్య చిన్నబుచ్చుకుంటాడు. కొద్దిపాటి సమయంలోనే పెద్ద తుఫాను వచ్చి వెళ్ళిపోయినట్లుగా భావిస్తాడు రాజు.

కళామందిరానికి వెళ్లి రావడానికి బయలుదేరుతాడు రాజు. అక్కడ లిల్లీ కనిపించి మీతో నటించడానికి నేను గర్వంగా భావిస్తున్నానని అందుకు మీరు ఒప్పుకోవాలని రాజ్ తో అంటుంది. సినిమా యాక్టర్స్ పక్కన లేకుండా తనను ఒంటరిగా అభిమానించే రోజులు పోయినందుకు బాధపడతాడు రాజు, అలాగే తన గురువుగా భావించే కృష్ణ పాత్రధారి పంతులను చూసి ప్రణామం చేసి పగటివేషగాళ్ల లాగా కొట్లో వేషాలు వేసుకొని ఉండటాన్ని చూసి బాధపడతాడు. నాటక కళాకారుల దిగజారిన దుస్థితిని చూసి సిగ్గుపడతాడు. తమ నైజాం ప్రాంతంలో రంగస్థలం పైన సినిమా యాక్టర్ కనిపించకపోతే నాటకం ప్రజాదరణ నోచుకోదని రాజుతో రంగయ్య అంటాడు. లిల్లీ తో కలిసి నాటకం వెయ్యడానికి ఒప్పుకోవాలని రాజును రంగయ్య ప్రాదాయపడతాడు. కొట్టు లోపలికి వెళ్లి ఒప్పంద మాట్లాడుకుందామని లోపలికి తీసుకువెళ్తాడు. అప్పటికే ఏర్పాటుచేసిన మద్యపానాన్ని తీసుకోవాలని అడుగుతాడు. నాటకానికి నాటక కళాకారులకు సమాజంలో ఏర్పడిన అవమానాలని తట్టుకోలేక తాగకపోయినా తాగినట్లు ప్రవర్తిస్తాడు. ఈ దుస్థితికి రావడానికి ప్రధాన కారణం నాటక కాంట్రాక్టర్లు నాటకాన్ని నాటక కళాకారులని వ్యాపార దృక్పదంతో చూడటమే అంటూ బాధపడతాడు. ఇటువంటి పరిస్థితుల్లో నాటకాలు ప్రదర్శించడం

తన మనసు అంగీకరించదు. ఆత్మగౌరవం లేని నటన నటుడికి మరణంతో సమానమని భావించి ఒప్పందాన్ని తిరస్కరిస్తాడు.

తండ్రి ప్రవర్తన చూసి నిచ్చేస్టుడై ఇంటికి బయలుదేరుతాడు రాము. తల్లికి ఎంతో అవసరమైన ఇంజక్షన్ త్వరగా తీసుకు రమ్మంటాడు డాక్టర్. నాటక ఒప్పందం కుదుర్చుకుంటే తండ్రికి అడ్వాన్స్ వస్తుందని భావించినప్పటికీ అలా జరగకపోయేసరికి డబ్బులు లేక ఒట్టు చేతులతో వెళ్తాడు రాము. అప్పటికే తల్లి మరణిస్తుంది. ఇంటికి చేరుకుంటాడు రాజు. 'వెళ్లిన పని అయిందా?' అని డాక్టర్ రాజును అడుగుతాడు.

అందుకు రాజ్ 'ఎందుకు అవ్వదు! పూర్తి! సంపూర్తి! నా ఆశయాన్ని నెరవేర్చుకునే వచ్చాను డాక్టర్! విష సమస్యలో చిక్కినా ధర్మం కోసం ధనాన్ని దిక్కరించగలిగిన వాడే ధైర్యశాలి; చిక్కులకు లొంగిపోతాడు మానవుడు. వాటిని ఎదురించగలిగిన వాడే దేవుడు. అట్టివానికి సర్వాభిష్టాలు నెరవేరుతాయి. అప్పుడీ రాజ్ ! మహారాజ్! ఇక నా శ్యాముకు కష్టమక్కడిదండి? శాశ్వత సుఖం..' అంటాడు. అలాగే అప్పటికే మరణించిన భార్య గురించి ఆమె ఆరోగ్యం ఎలా ఉందని డాక్టర్ని అడుగుతాడు. 'అరవకండి! ఆమె జీవించి లేరు' అనగానే నిచ్చేష్టుడై ప్రాణాలు ఒదులుతాడు. విగత జీవులుగా పడిఉన్న దంపుతులను చూసి అందరూ బాధపడతారు.

**ముగింపు :** సమాజాన్ని చైతన్య పరిచిన నాటక సమాజాలూ, నటులూ ప్రజల మన్ననలు పొంది, చారిత్రకంగా ఎంతో ఉచ్చ స్థితికి చేరి, క్రమేపీ సమాజంలో వచ్చిన కాంట్రాక్ట్ విధానాలు, ప్రజల అభిరుచుల్లో మార్పులు, సినిమా రంగం విస్తృతి వంటి పరిస్థితులు వలన నాటక రంగం, దాన్ని నమ్ముకున్న నటులు బతుకు రంగస్థలం పై జీవచ్ఛవాలుగా మారిని దుస్థిధియే ఈ రంగస్థలం నాటకం.

**ఆధార గ్రంధాలు :**

1. 'రంగస్థలం' నాటకం - శ్రీ కోడూరుపాటి సరస్వతీ రామారావు
2. నూరేళ్ల తెనాలి రంగస్థలి- నేతి పరమేశ్వర శర్మ
3. తెలుగు సాహిత్య విమర్శ వి. సిమ్మన్న
4. తెలుగు సాహిత్య చరిత్ర- ద్వా. నా. శాస్త్రి.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# "వచన కవితా వనమాలి కుందుర్తి"

డా॥ కె॥ సురేష్ కుమార్
తెలుగు శాఖాధిపతి
ప్రభుత్వ కళాశాల మహిళ (స్వ), గుంటూరు.

'కుందుర్తి'గా తెలుగు సాహితీ లోకలో ప్రసిద్ధి పొందిన వీరి పూర్తి పేరు 'కుందుర్తి ఆంజనేయులు (16-12-1992 - 1982) 'వచన కవితా వాల్మీకి' అని సమకాలికుల చేత పిలువబడినవాడు, వచన కవితా పితామహుడు'గా ప్రసిద్ధి పొందినవాడు. అభ్యుదయకవి, రచయిత ఆంధ్రదేశంలో వచన కవితోద్యమానికి ఆద్యుడు. గుంటూరు జిల్లా నరసరావు పేట దగ్గర కోటా వారి పాలెంలో 1922 డిసెంబరు 16న రామయ్య, నరసమ్మ దంపతులకు జన్మించారు. చిన్న గ్రామంలో సాంప్రదాయిక వైదిక కుటుంబంలో మొదలైన వీరి జీవితం క్రమంగా ఎదురైన జీవితానుభవాలతో సంప్రదాయ సరిహద్దును దాటుకుని, సాటి మనుషుల బాధలకు సహృదయంతో స్పందించే స్థాయికి చేరింది. సాహితీ రంగంలో కూడా, చిన్ననాటి నుండి సహృదయులైన గురువులఉ, మిత్రులు, పెద్దల సహకారం లభించింది. ఫలితంగా విశాలమైన దృక్పథం అలవడింది. సాహిత్యాన్ని వ్యవస్థ మార్పుకోసం ఉపయోగించే దిశగా వీరు పనిచేశారు. ఆ క్రమంలో ఎన్నో రచనలు చేశారు, బహుమతులు గుర్తింపు పొందారు. 'వచన కవిత' అనే ప్రక్రియను పెంచి పోషించారు. ఆధునిక తెలుగు కవిత్వంలో 'వచనకవిత్వం' ముఖ్యమైనది. ఈ వచన కవిత మొగ్గదశ నుండి అదొక పెద్ద వటవృక్షంలా ఎదగటం, నిలబడటం వెనుక కుందుర్తి హస్తం ఉంది ఈ దిశలో వీరు చేసిన కృషిని స్థూలంగా పరిచయం చేయటానికి ప్రయత్నిస్తాను.

ఆధునిక తెలుగు సాహిత్యంలో 'కవిత్వం' అనేక కొత్త పుంతలు తొక్కింది. ఇందులో 'వచనకవిత్వం' బాగా ప్రసిద్ధమైనది. దీనికి మొదట్లో 'వచన పద్యం' 'వచన గీతం' అనే పేర్లు వినిపించాయి. కుందుర్తి, 'వచన గేయం' అనే పదాన్ని ప్రచారంలోకి తెచ్చారు. 'వచన కవిత' అనే మాటనూ ఉపయోగించారు. చివరికి 'వచన కవిత' అనే పేరు వ్యవహారంలో నిలిచింది.

'వచన కవిత' అనే ప్రక్రియ తెలుగు సాహితీ క్షేత్రంలో మొలకెత్తడానికి దోహదం చేసిన పరిస్థితులు చూద్దాం. ఆధునిక తెలుగు సాహిత్యంలో అనేక మార్పులకు ఆద్యులుగా కందుకూరి, గిడుగు,

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

గురజాడలను పేర్కొనాలి. కందుకూరి సాహిత్యంలో ప్రయోజన వాదాన్ని తిరిగి ప్రవేశపెట్టడం, గిడుగు భాషారంగంలో పిడుగులా వ్యవహారిక భాషా వాదాన్ని నిలబెట్టడం, గురజాడ పై రెండింటిని సమర్థంగా ఉపయోగించి రచనలు చేయడం.. వీరి ప్రేరణ, కృషి ఆనాడు మారిన సామాజిక పరిస్థితిల్లో కవిత్వం సంప్రదాయ పద్యమార్గాన్ని దాటి, వ్యవహారిక భాషలో దేశిఛందస్సులతోనూ, ఛందోబంధాల నుండి విముక్తి పొందిన వచన కవిత నిలదొక్కుకోవడానికి దోహదం చేసింది.. మరోపక్క జాతీయంగానూ అంతర్జాతీయగానూ ఉన్న పరిస్థితులు దోహదం చేశాయి.

ఆధునిక తెలుగు కవిత్వంలో శిష్ట్లా ఉమామహేశాన్ని తొలి 'వచన కవిత' వ్రాసిన వానిగా చెప్తారు. నవ్యులలో అతినవ్యుడుగా పేరొందారు. 'విష్ణుధనువు', 'నవమి చిలక' అనే కావ్యాలు వెలవరించారు. 'వచన కవిత'ను ఒక ప్రక్రియగా నిలబెట్టే స్పష్టమైన దృక్పథంతో వీరు కృషి చేయలేదు. ప్రయోగాల పేరుతో ప్రక్కకు మళ్ళినట్లు చూస్తాం. శిష్ట్లా తర్వాత శ్రీశ్రీ, శ్రీరంగం నారాయణబాబు, కవి కొండల వెంకటరావు, పఠాభి మొ॥ వారు వచ్చారు. వీరిలో శ్రీశ్రీ బాగా ప్రసిద్ధి పొందారు. 'కుందుర్తి వచన కవితా' త్రయంగా శిష్ట్లా, శ్రీశ్రీ. నారాయణబాబులను పేర్కొంటాడు.

శ్రీశ్రీ ఆధునిక కవిత్వాన్ని నిర్దేశించి తనదైన ముద్రవేశాడు. ముఖ్యంగా అభ్యుదయ కవిత్వానికి నాయకత్వం వహించారు. శ్రీశ్రీ రాసిన కవితలు ఆయనకున్న పాండిత్యం, ప్రతిభ చేత ప్రకాశించాయి. మాత్రాఛందస్సులు, సంస్కృత పదజాలం, ప్రతీకలు దీర్ఘ సమాసాల... వీరి వచన గేయాలు కనిపిస్తాయి. గురజాడ సాహిత్యాన్ని ప్రజానీకానికి దగ్గర చేయడానికి ముత్యాల సరాలు వంటి కొత్త ఛందస్సులు /మాత్రా ఛందస్సులు తీసుకొచ్చారు. భాషలో 'వ్యవహారికం' చేర్చారు. శ్రీశ్రీతో భాషా పాటవ ప్రదర్శన పెరిగింది. ఇది వ్యవహార భాష, వచన కవితకు దూరం జరిగినట్లయింది. పఠాభి, నారాయణ బాబు, ఆరుద్ర, కవికొండల మొదలగు వారు పలు ప్రయోగాలు చేశారు. మొత్తం మీద చూసినపుడు 'వచన కవిత' ఆవశ్యకతను, దాని పాత్రను, సమగ్రంగా దర్శించి, దానిని కాచి కాపాడుకుంటూ వచ్చిన వాడు ఒక్క కుందుర్తి మాత్రమే. అందుకే వచన కవితను తను మొదలు పెట్టకపోయినా 'వచన కవిత' వికాసానికి అచ్చంగా వచన కవితలు, కావ్యాలు, వ్యాసాలు, పీఠికలు, ఉపన్యాసాలు. మొ॥వి ఇచ్చి దానిని నిలబెట్టారు. ఈ క్రమంలో కుందుర్తిని ఒకసారి చూద్దాం.

కుందుర్తి గుంటూరు జిల్లా నరసరావు పేట దగ్గరి కోటావారి పాలెంలో జన్మించారు. తండ్రి చిన్నతనంలోనే చనిపోవటం బరువు బాధ్యతలు తెలియడం, ఒక పక్క మంచి గురువులు లభించడం. గుర్రం జాషువ వినుకొండలో, విశ్వనాధ సత్యనారాయణ విజయవాడలో.. అలాగే మంచి స్నేహితులు ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసు, అనిసెట్టి సుబ్బారావు, పెద్దలు పులుపుల వెంటకశివయ్య లాంటి కమ్యూనిస్టు.. ఇంకా ఎందరో వీరికి చిన్నతనం నుండి పరిచయం. ప్రాచీన సాహిత్య పరిచయం.. ఇలా జీవిం గురించి.. ముఖ్యంగా పేదల గురించి వ్యవస్థల స్వభావం గురించి వారి జీవితాలలో వీటి స్వరూప స్వభావాల్లోనూ రావలసిన మార్పు గురించి, సాహిత్యం నిర్వహించాల్సిన పాత్ర గురించి అనేక ఊహలు చేసి స్థిరమైన అభిప్రాయాలు ఏర్పరచుకున్నవాడు.

ముఖ్యంగా కవిగా, సంస్థ నిర్వాహకుడిగా, వచనకవిత ఉద్యమ కార్యకర్తగా, నాయకునిగా కుందుర్తి వ్యక్తిత్వం, నిర్వహించిన కార్యక్రమాలు, ప్రచురించిన పుస్తకాలు నేటి తరానికి ఆదర్శం.

నరసరావుపేట, వినుకొండ, విజయవాడ, గుంటూరులలో గడిపిన జీవితంలో తనకెదురైన అనుభవాలు, ఏర్పరచుకున్న అభిప్రాయాలు విలువైనవి. ముఖ్యంగా గుంటూరు బ్రాడీపేట పక్కన రైల్వే ట్రాక్ దగ్గర రోజుల కొద్దీ, గంటకొద్దీ సాహిత్యం గురించి మిత్రులతో చర్చించినవాడు. ఉద్యోగ రీత్యా హైదరాబాద్ చేరిన తర్వాత పూర్తి స్థాయిలో 'వచన కవిత' కోసం పనిచేసినవాడు. సాహిత్యంలో వస్తువు, రూపం గురించి సాహిత్య ప్రయోజనం గురించి నిర్దిష్టమైన అభిప్రాయాలున్నవాడు ఈ క్రమంలో కుందుర్తి వచన కవితా వనమాలి' అనే విషయాన్ని స్థూలంగా చూద్దాం.

ఏ సాహిత్యంలోనైనా ఒక కొత్త ప్రక్రియ పుట్టడం సాహిత్య ప్రగతికి చిహ్నం. అది ప్రయోగ గౌరవాన్ని పొందడం సాహిత్య వికాసానికి చిహ్నం. ప్రక్రియ పరిణత రూపాన్ని పొందడం సాహిత్య వ్యక్తిత్వావిష్కారానికి చిహ్నం.

A 'Genre' closely Resembles a human personality in the way it may incorporate elements rom many other personality types while still conforming to one basic type it self some one whose funda-mental configuration is obsessive may include elements of the depressive much as a genre that is primarily epic may also participate in Romance and Pastoral. GENRE. (P. 117) - Heather Dubrow

ప్రక్రియ పుట్టడానికి కారణంగా ఈ రెండు అంశాలు ప్రధానం. 1. రసభావాభిరుచి, 2. సాంఘిక /మతపరమైన అవసరం అన్నారు పెద్దలు. తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలించినపుడు ఈ విషయం గమనిస్తాం. ఇక ప్రక్రియలో 'యాటిట్యూడ్', 'టోన్' అనేవి అంతర రూపంగానూ, 'లాంగ్వేజి', 'మీటర్' బాహ్యరూపంగానూ చెప్తాం. ప్రక్రియ 'ఆంతరమైన రూపం' కవి సాహిత్య దర్శన శక్తి నుండి పుడుతుంది. ప్రక్రియ బాహ్యరూపం కవి సాధించదలుచుకున్న లేదా ఉద్దేశించిన అభిరుచి నుండి గాని పుడుతుంది. ఈ క్రమంలో వచన కవితా ప్రక్రియను చూద్దాం.

ఒక కొత్త ప్రక్రియ సాహితీ రంగంలో నిలదొక్కుకోవడం వెనుక ఎంతోమంది కృషి ఉంటుంది. వచన కవిత్వం తెలుగులో శిష్ట్లతో మొదలైంది అనే విషయం అందరూ అంగీకరించారు. కవిత్వంలో పామరుడికి సంబంధించిన స్పృహను శిష్ట్లనే మొదలుపెట్టాడు. భావకవిత్వం మీద తిరుగుబాటు జెండా ఎగురవేశాడు. అయితే దానిని సమర్థవంతంగా ముందుకు తీసుకువెళ్ళడంలో ముందుకు వెళ్ళలేదు. శ్రీశ్రీ ఆ కృషి బాగా చేశాడు. శ్రీశ్రీలో మాత్రాఛందస్సుల ప్రభావం ఎక్కువ. అయినా శిష్ట్ల, శ్రీశ్రీ లాంటి మా ముందుతరం వారు వేసిన పునాదుల మీద మాయుగం వారు మరింత కృషి చేయవలసిన చారిత్రక అవసరం ఏర్పడిందని ఆనాడు మేం భావించాం' అంటారు కుందుర్తి ఇంతకు ముందు ప్రస్తావించినట్లు తన ముందు వారికి తన సమకాలికులకు లేని స్పష్టమైన అవగాహన కుందుర్తికి ఉంది... చూద్దాం.

**'ప్రాచీనం పద్యమైతే వర్తమానం వచనకవిత' ది అన్నారు.**

మారిన పరిస్థితుల్లో సాహిత్యలో ఏమి ప్రతిఫలించాలి? కావ్యవస్తువు మారిన పరిస్థితుల్లో సాహిత్యంలో ఏమి ప్రతిఫలించాలి, కావ్య వస్తువుగా ఏం ఉండాలి ఒక్క మాటలో చెప్పాలంటే సాహిత్య ప్రయోజనం ఏమిటి? అనే విషయంలో నిర్దిష్టమైన అభిప్రాయాలున్నవాడు.

'కమ్యూనిజం' భావజాలమున్న కుందుర్తి సహజంగానే పీడితుల పక్షాన నిలబడ్డాడు. పీడితుల కోసం వ్రాయాలంటే వారికనువైన భాషలోనే వ్రాయాలంటాడు, దీనికి వచన కవిత్వం సరైనదని గ్రహించాడు. అందుకే ఎవరేమన్నా పర్వాలేదు. 'వచన కవిత'ను నేను 'ఉద్యమం'గా చెప్తాను అన్నాడు. ఒక ఉద్యమంలా నడిపాడు. 'వచన కవితకు వనమాలిగా నిలిచి పెంచి పోషించాడు. ఇందుకోసం కావ్యాలు వ్రావాడు, పీఠికలు, అభిప్రాయాలు, వ్రాశాడు పని కట్టుకుని పదుగురితో చర్చలు చేశాడు.

ఆధునిక కాలంలో నిజమైన ఉద్యమం అభ్యుదయ కవితా విప్లవం అంటాడు. 'వచన కవితా' ఉద్యమ లక్ష్యాలు అభ్యుదయ కవితా ఉద్యమ లక్ష్యాలే అని స్పష్టపరిచారు.

**వచన కవిత పేరు** : వచన పద్యం, వచన గీతం, వచన గేయం.. ఇలా పలు పేర్లు వినిపిస్తున్న తొలినాళ్ళలో.. ఆనాటి విమర్శకులు, మిత్రులు, పెద్దలు పలు సందేహాలను వెలిబుచ్చినపుడు ఆ పదాల మీద చర్చచేశాడు. ఆధునిక కాలంలో 'పద్యం'ను ఆదరించని కాల్పనిక కవులు తమ రచనలకి పద్యం బదులుగా 'గీత పద్యం' అనే పదాన్ని వాడారు. పద్యేతర ఖండికలని తెలియజేయడానికి 'గీతం' సరిపోవడం లేదని భావించిన శ్రీశ్రీ వాటిని 'వచన గీతాలు' అని పిలిచాడు. అయినా ఆ పదం ప్రజల వ్యవహారంలో/ సాహితీ లోకంలో నిలదొక్కుకోలేదు.

**వచన గేయం** : 'గేయమనే మాటకి సంప్రదాయ ఛందో రీతిలో 'రాయనిది' అనే అర్థం జన వ్యవహారంలో స్థిరపడింది. మాత్రా ఛందస్సులు, ఛందో రహిత ఖండికలు కూడా తనలో ఇముడ్చుకుని పాడడానికి యోగ్యమైనదనే తన అసలు అర్థాన్ని మనకు తెలియనంతగా వాడుకలో అర్థ వైశాల్యాన్ని పెంచుకుంది. మరిక 'వచన' అనే విశేషణం దేనికంటే దాని వ్యుత్పత్త్యర్థాన్ని స్పష్టంగా ఖండించడానికి, పాడడానికి ఉద్దేశించబడలేదని చెప్పడానికి, ఇప్పుడు 'గేయం' అంటే ఎంకి పాటలు, కిన్నెరసాని పాటలు చెబితే చాలదు. మరో ప్రపంచం, దేశ చరిత్రలు చెప్పినా కూడా చాలదు. 'త్వమేవాహం' వగైరా గేయ కావ్యాలను గురించి కూడా చెపితే సమగ్రమవుతుంది' అంటారు.

వచనం, గేయం వేర్వేరు ప్రక్రియలు కదా, వాటి తత్త్వాలు, రూపురేఖలు, వేరుగదా కవిత్వమైన దానికి వచనమనే విశేషణ మెందుకని కొందరి ప్రశ్న' దీనికి 'వచన పద్యం, వచన గేయం, రెండూ ఒకటే. వచనానికి నేడు ఎక్కువ ప్రజాదరణ ఉంది. వచనం, కవిత్వం రెండూ సమానమైన గౌరవస్థాయిలో ఉన్నాయి. వచనం విశేషణం అయినంత మాత్రాన నష్టమేమీ లేదు. కాబట్టి ప్రస్తుతానికి 'వచన గేయం' అనే పేరు వాడుకుందామని ప్రతిపాదిస్తున్నాను అని 'వచన గేయం' పేరును ప్రచారం చేశారు

'తెలుగు కవిత్వం తెలుగు కవిత్వం అనిపించుకునేటట్లు ఉండాలి. అంతేగాని అనవసరంగా ఆంగ్ల, సంస్కృత పదాలను చేర్చవద్దు అంటాడు. తెలుగు భాషమీద పట్టులేక ఆంగ్లంలోనే భావాన్ని ఆలోచించడం వలన ఆంగ్ల పదాలు చేరుతున్నాయంటాడు సింగరాచార్య, పఠాభి, ఆరుద్ర, మాదిరాజు రంగారావు.. మొ॥ వారి కవితలను ఉదాహరిస్తారు.

ఆధునిక కవిత్వంలో వస్తున్న పోకడల్ని నిశితంగా పరిశీలించి 'డాడాయిజం', 'సర్రియలిజం' పోకడలు ఎక్కువవుతున్నాయని యువకవులను హెచ్చరిస్తాడు. ప్రయోగాలు ప్రయోజనవంతంగా ఉండాలి లేదంటే నిలవవు అంటారు. కుందుర్తి యువకవులకు ఆధునిక సమాజం, సాహిత్యంలో వస్తున్న మార్పులతో బాటు, సంప్రదాయ సాహిత్య పరిజ్ఞానం అవసరమంటాడు. అలాగనే వచన కవిత బహుముఖాలుగా వికసించటానికి సంప్రదాయ వాదుల మద్దతు కూడగట్టడానికి ప్రయత్నించాడు. సంప్రదాయ కవులు కూడా చివరికి 'వచనకవిత్వం' వ్రాయకపోతే కవులు కామనే దశకు 'వచన కవిత' వర్ధిల్లేలా చేశాడు.

యువకవులు పాశ్చాత్య దేశాల్లోని సాహిత్య సిద్ధాంతాల ద్వారా ప్రభావితమై రాసిన కవిత్వంలో ఎక్స్ప్రెషన్ చాలా లోపభూయిష్టమై వ్యక్తం కావడం గమనించినపుడు అటువంటి వాటిమీద, ఆయా కవుల మీద హెచ్చరిస్తూ వ్యాసాలు రాశాడు.

కవుల ఎక్స్ప్రెషన్ చాలా లోపభూయిష్టమైనందు వలన అది ఆధునిక కవిత్వం పట్ల ప్రజల వ్యతిరేకతను బాగా రెచ్చగొడుతుంది అంటారు.

'నిద్రలేని సగం అర్ధ ఒకటిన్నర రాత్రిలో
చీకటి కాటుక కానుగచెట్టు ఆకుల జుట్టులోని
ఈ నెల నరాల్లో కన్నీళ్ళూ, చలిగాలీ, నేను
రైలు దిగి రహస్యాయాశ్వమెక్కి వచ్చాం
ఎర్ర ద్రాక్షాపళ్ళూ తెల్లన్నం పుచ్చుకుని...

ఇటువంటి పాదాలు చదివినపుడు అర్థాన్ని అడవిలో వదిలేసినట్లుగా రాయడం బాగా అలవాటయ్యింది. ఇది 'సర్రియలిజం' ప్రభావం. సబ్ కాన్షియస్ స్టేట్లో మెరుపులా తోచిన ఆలోచనా రేఖ ఈ అవ్యవస్థకు కారణం అంటాడు.

'కవితా నిర్మాణం'లో కూడా కవి భావన లేదా ఊహ పుష్కలంగా ఉన్నా వచన గేయం అందంగా వచ్చినా గేయం మొత్తం చదివిన తర్వాత అసంతృప్తి కలుగుతుంది. గేయంలోని భావన / ఊహ పుష్కలంగా ఉన్నా అది స్థిరంగా ఉండక మారిపోతుండటం సరైనది కాదు అంటారు అలాగే 'సెంట్రల్ థీమ్' అనేది లేనందువలన పంక్తులు అందంగా వచ్చినా గేయం మొత్తం చదివాక అసంతృప్తి కలుగుతుంది. గేయంలోని కొన్ని పంక్తులు మొత్తం గేయానికి ఎదురు తిరిగి మాట్లాడుతున్నట్టున్నాయి అని ఎత్తి చూపారు. ఇదంతా ప్రయోగాల యుగమని సరిపెట్టుకున్నా వచన కవిత నిలవాలంటే ఇదొక అవాంతరంగా భావించారు.

'శోభకృత్తులో వివాహమైన నవవధూవరులారా! అని ఒక కవితలో ఉంది. ఈ పంక్తి ఇక్కడ విరిగి వధూవరులకు నేర్పాటు కల్పించి ఏమి ప్రయోజనం సాధించబడిందో తెలియదు. ఏ పంక్తి ఎందుకు ఎక్కడ ఆగిందో చెప్పవలసిన బాధ్యత 'ఫ్రీ వెర్స్' రాసే వారందరి మీద ఉంది అంటారు.

'పిడేలు రాగాల డజన్'లో పఠాభి అనుసరించిన పద్ధతి ఏం ప్రయోజనం సాధించింది అని ప్రశ్నిస్తారు. స్వేచ్ఛ భావప్రకటనకు అనువైనదని ఫ్రీ వెర్స్లో వ్రాస్తుంటే దానిలోని పంక్తులను, మన భావాల నడకకు తప్పనిసరిగా సంబంధం ఉండాలి లేదంటే నిలవవు అంటాడు.

'ఫ్రీ వెర్స్' రచనా పద్ధతి విజయవంతం కావాలంటే ప్రతిగేయానికి ఒక సెంట్రల్ థీమ్, సెంట్రల్ ఐడియా ఉండాలి. అది కవి తనలో తాను భావించుకున్నవిగాక వాడిన శబ్దాల ద్వారా పఠితకు అందజేసేదిగా ఉండాలి. అలాగే అర్థం పర్థంలేని కొత్త శబ్దార్థాల ప్రయోగాలు చేయాల్సిన అవసరం లేదంటాడు.

వచన గేయం వ్యవహారిక భాషా ప్రయోగ సంపన్నమైతేనే తెలుగు వారిని ఆకట్టుకోగలుగుతుంది అంటే కవిత్వం తెలుగు వారి సహజ సంభాషణా స్థాయికి రావాలి. తెలుగు పలుకుబడి, తెలుగు నుడికారములందులో పూర్తిగా ప్రవేశించాలి. తెనుగు యిడియం పుష్కలంగా వుండాలి. అప్పుడే కవిత్వం వ్యవహారిక భాషా సౌందర్యాన్ని పూర్తిగా వినియోగించుకొని ప్రజల హృదయాలను చేరుకోగలుగుతుంది. వ్రాసిన కవి మాట్లాడేటప్పుడు ఎంతగా అలాంకారాలు సంభాషణల్లో ప్రవేశిస్తాయో అంతవరకే వ్రాసిన కవితలో ప్రవేశించాలి అప్పుడే కవిత రాణిస్తుంది అంటారు. అయితే ఇక్కడ గణ ఛంధస్సులు, మాత్రా ఛందస్సులు ఏమి అవసరం లేదు ఫ్రీ వెర్స్ పద్ధతిలో మాత్రమే ఈ మార్పు సాధ్యం అంటారు.

తెలుగు పదజాలాన్ని వచనకవితలో విరివిగా వాడి తెలుగు భాషకు ప్రచారం కల్పించాలంటారు. అలా అని ఇతర భాషా పదలను వద్దనడు. తెలుగులో కలిసిపోయి జన వ్యవహారంలో నలిగిన ఏ భాషా పదాన్నయినా వాడవచ్చు అంటారు. ఇటువంటి లోపాలు తనలో ఉన్నా ఒప్పుకున్నాడు.

ఆధునిక వచన కవిత్వం వ్రాస్తున్న కవులంతా పట్నవాసులవడం వలన పల్లె జీవితం తెలియకుండాపోయింది. అంటాడు. లోపాలను ఎత్తి చూపినట్లే ఆధునిక జీవితంలోని చాలా వస్తువులు కావ్య వస్తువులుగా మారిపోవడాన్ని కూడా అభినందిస్తూ మాట్లాడతాడు. తర్వాత కాలంలో పల్లె జీవితానికి సంబంధించి గిజిగాడు, తూనీగ, తుమ్మచెట్టు, ఈతచెట్టు, కృషీవలుడు, తొలకరి, రిక్షావోడు, మొ॥ అలాగే నగర జీవితంలోని కిరాణా కొట్టు ధరలు పెరగడం, గుమస్తాల బాధలు మొ॥వి కావ్య వస్తువులు అవడాన్ని ప్రస్తావించి స్వాగతిస్తాడు. ఇలా చూడగలగాలే గాని ఆధునిక జీవితంలో ఎంతో కావ్య వస్తువు ఉందని అది వచన కవితలో చక్కగా ప్రతిఫలిస్తుందని చెప్పారు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

యువకవుల విషయాల్లో ఎలా స్పందించారో, సంప్రదాయ కవుల విషయంలో కూడా అంతే స్పందించారు. అందుకే కుందుర్తి రాసే పీఠికలు, ముందు మాటలు, మొ॥ వాటిలో కవుల పరిచయం, శైలి మొ॥ వాటికంటే 'వచన కవిత' దశ, దిశ వీటికి సంబంధించిన అంశాలు ఎక్కువగా కనిపిస్తాయి. చాలా మంది కుందుర్తి పీఠికల్లో ఆయన 'స్వంత ఘోష' ఎక్కువగా ఉంటుందనేవారు. 'స్వంత ఘోష' అంటే వచన కవితకు సంబంధించిన విషయాలు. వచన కవులు లెక్కకు మించి రాస్తున్నప్పుడు, వారి కవితలు చప్పగా ఉంటున్నాయనే విమర్శలు పెరిగాయి. ఇటువంటి సమయంలో వీరి పక్షాన నిలబడ్డాడు. మొగ్గలోనే వీరిని తుంచటం ఎందుకు ఎదగనిద్దాం అని మాట్లాడారు. నగ్నముని, చెరబండరాజు లాంటి వారి తొలిదశ కవితలు నేను చూశాను. వారు పరిణతి చెందినట్లే ఈనాటి యువ కవులుకూడా పరిణతి చెందగలరని వారి పక్షాన నిలిచి మాట్లాడారు.

వచనంలో కవిత్వం ఎక్కడుంటుంది అనే వారికి ప్రాచీన కావ్యాల నుంచి, పద్యంలోనైనా, గద్యంలోనైనా కవిత్వాంశ గురించి వివరిస్తారు. కవిత్వం ఒకే మూస కరిగించిన బంగారమే అయినా వివిధ ఆభరణాల రూపంలో దర్శనమిస్తుంది. ఒక్కొక్కచోట రెండు మూడు పంక్తులలోని భావన మనల్ని కదిలిస్తుంది. మరోచోట పద్యం యొక్క 'టోటల్ ఎఫెక్ట్' మన హృదయం మీద చెరగని ముద్రవేస్తుంది. సంప్రదాయ సిద్ధమైన ఛందస్సులతో సహా మనం కవితా లక్షణాలని అనుకుంటునన వాటిలో ఏ ఒక్కటి విడిగా కవిత్వం కాలేదు. వీటి అన్నిటి సమన్వయ రూపమే కవిత్వం. జీవిత పరమసత్యాన్ని స్పృశించటానికి ప్రయత్నం జరిగిన చోట కవిత్వం నిరాడంబరంగా ఉన్నా, నిరలంకారంగా ఉన్న హృదయానికి తగులుతుంది అంటారు. అభ్యుదయ కవితా విప్లవమే ఆధునిక తెలుగు సాహిత్యంలో వచ్చిన నిజమైన విప్లవం అంటారు. ఈ లక్షణాలే వచనకవితా ఉద్యమ లక్ష్యాలు అంటారు.

వ్యవహారిక భాషకు ఆలంబనగా నిలిచింది వచన కవిత్వం అంటారు. గురజాడతో మొదలైన మార్పు (వస్తువు, భాష, భావనల విషయంలో) శ్రీశ్రీతో విస్తృతమైంది. అయితే భాష, ఛందస్సుల విషయంలో మాత్రం కావ్యలోకాల వైపు కదం తొక్కుతూ పరుగెత్తింది. ఆ పరుగును ఆపి, వ్యవహారిక భాషలో వాక్యర్థం చెప్పుకుంటూ పోయి దానిని కవిత్వంగా ఒప్పింపజేసే బాధ్యత, వచన కవిత్వం స్వీకరించింది. కావ్య భాషకూ, మాట్లాడే భాషకూ వుండే తేడా నమ్మలేనంతగా

తగ్గిపోయింది ఇది వచన కవిత్వం సాధించిన ఘన విజయమని, ప్రజా విజయమని నేను భావిస్తాను' అంటారు.

ఈ విజయం వలన అనేకమంది సంప్రదాయవాదులు కూడా వచన కవిత్వం రాయకపోతే కవులు కాదు అంటారేమో అని స్థితి వచ్చింది. దానితో వచన కవిత్వం రాయటం మొదలు పెట్టారు. దీనితో వచన కవిత్వంలో వస్తువు ప్రేమ, భక్తి, మొ॥ వాటితో విస్తరించింది.

బోయి భీమన్న, సుప్రసన్న, సంపత్కుమార, ముదిగొండ వీరభద్రమూర్తి, గుంటూరు శేషేంద్ర శర్మ మొ॥ వారు ఇందుకు ఉదాహరణ. సారళ్యమూ, కథాంశ అనే రెండు లక్షణాలు లేకుండా కవిత్వం ప్రజల దగ్గరకు పోదు వారిని చైతన్యవంతం చేయలేదు. ఆధునిక యుగంలో గురజాడ ఒక్కడే ఈ రెంటినీ మేళవించి కవిత్వం రాయగలిగాడు. గురజాడ మార్గం ఆదర్శనీయం అంటాడు.

'మినీ కవితలు' గురించి కూడా నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. 'క్లుప్తత' పేరుతో అర్థం లేని కవితలు రాస్తున్నారంటాడు. జీవితం, జీవిత సంఘర్షణ ఉండాలి కాని అర్థంలేని పదాలు, భావచిత్రాలు, అనర్థం అంటాడు.

ఎంతోమంది యువకవుల కావ్యాలకు 'పీఠికలు' వ్రాశారు. 'పీఠికా బ్రహ్మ'గా పేరొందారు. వీరి 'పీఠికలు' గురించి 'కుందుర్తి పీఠికలు'లో ముందుమాట వ్రాస్తూ వారి మిత్రుడు ఇలా అంటారు. 'పీఠికలో గ్రంథకర్త పేరు అతని కవితా గుణాలను గురించి చిన్న వివరణ మాత్రమే ఉంటుంది ఎక్కువ బాగం తాను నమ్మిన సామ్యవాద కావ్య సిద్ధాంతాలను గురించిన చర్చకే వినియోగించుకుంటాడు" అని కుందుర్తి ఈ పీఠికా ప్రక్రియని అభ్యుదయ కవితా సిద్ధాం ఆలను ప్రచారానికి పదునైన సాధనంగా మలచుకున్నాడు.

యువ కవులతో ఎంతసేపైనా మాట్లాడటం, చర్చించడం కుందుర్తి దినచర్య. 1957లో వచ్చిన కలం కలలు (గోపాల చక్రవర్తి) కావ్యానికి మొదటిసారిగా పీఠిక వ్రాశారు. ఇది మొదలు

చాలా కావ్యాలకు పీఠికలు రాశారు. కొడగట్టిన సూర్యుడు (శీలా వీర్రాజు కావ్యం), అమృతం కురిసిన రాత్రి (దేవరకొండ బాలగంగాధర తిలక్ కావ్యం).

**కుందుర్తి రచనలు:** సాప్తికం, రసధుని, అమావాస్య, నా ప్రేయసి, నయాగారా, తెలంగాణా, దండియాత్ర, ఆషా, నగరంలో వాన, నాలోని నాదాలు, హంస ఎగిరిపోయింది, తీరా నేను కాస్తా ఎగిరిపోయాక, మేఘమాల, ఇది నా జెండా, కుందుర్తి సమగ్ర రచనలు 1974లో వెలువడ్డాయి. కుందుర్తి వ్యాసాలు, కుందుర్తి పీఠికలు, బతుకుమాట మొదలైన ముఖ్యమైన రచనలు.

తను ఆధునిక వచన కవిత్వానికి లక్ష్య గ్రంథాలుగా రచనలు చేయడం, ఆకాలపు యువకవులను ప్రోత్సహించడం, వారి రచనల్లో లోటుపాట్లు తెలపడం, మెళకువలు చెప్పడం, వారి కావ్యాలకు పీఠికలు వ్రాయడం,

సభలు సమావేశాల్లో వచన కవిత్వం తరపున వకాల్తా పుచ్చుకుని వాదించడం, రచనలను ప్రచురించడం, బహుమతులు ఏర్పాటు చేయడం నవ్యకళా పరిషత్తు, ఫీవర్స్ ఫ్రంట్ వంటి, సాహితీ సంస్థలను మిత్రుల సహకారంతో స్థాపించి నిర్వహించడం, 'వచన కవిత్వం' మీద పలు విషయాలపై చర్చలు, వాదోపవాదాలు సంప్రదాయవాదులు, అభ్యుదయవాదులలో కొందరితో జరిపారు. వచన కవితను ఒక ఉద్యమంగా నడిపి ఎప్పటికప్పుడు ఒడిదుడుకులు సవరిస్తూ వాటిని నలుగురితో ఒప్పిస్తూ కాపాడి వచన కవితావనం, వసంత శోభతో వెల్లివిరియడానికి జీవితాన్ని అంకితం చేసిన కుందుర్తి 'వచన కవితా పూదోటకు వనమాలి'.

**ఆధార గ్రంథాలు:**

a. మహతి, యువభారతి
b. రజత రంజని, రంజని రజతోత్సవ సంఘం ప్రచురణలు (చీకోలు సుందరయ్య)
c. కుందుర్తి పీఠికలు, కుందుర్తి
d. వచన కవిత, (చేరా, సుప్రసన్న వ్యాసాలు)
e. 18. Genre Heather Dubrow
f. కుందుర్తి వ్యాసాలు, కుందుర్తి

g. ఆధునికాంధ్ర తెలుగు కవిత్వంలో సంప్రదాయాలు, ప్రయోగాలు సి.నా.రె.
h. తెలుగు సాహిత్యంలో చర్చనీయాంశాలు- ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం (తెలుగు అకాడమి 1991)
i. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణలు -ఆచార్య కె.కె. రంగనాధాచార్యులు (ఎయస్.పి. )
j. నా వాఙ్మయ మిత్రులు
k. అమృతం కురిసిన రాత్రి బాలగంగాధర తిలక్
l. శిష్ట్లా కుమారేశ్వరరావు కవిత్వం, సమాలోచన, (సం) ఏటుకూరి ప్రసాద్ వేల్చేరు నారాయణరావు
m. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం
n. తెలుగు సాహిత్యం మరోచూపు ఆచార్య కె.కె. రంగనాధాచార్యులు

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## కాకాణి చక్రపాణి - శీల పరీక్ష

**మల్లెంబాక ఉదయశ్రీ** ఎం.ఏ. తెలుగు, సెట్
నెల్లూరు
7993170901
udayarao1998@gmail.com

రచయిత సమాజం నుండే ఉద్భవిస్తాడు, తన చుట్టూ జరిగే, సామాజికాంశాలకు సంఘటనలకు, సంబంధించిన వ్యక్తులను గూర్చి అక్షరీకరిస్తాడు. కాకాణి చక్రపాణి ఇందుకేమీ మినహాయి ంపు కాదు. తాను రచించిన 12 నవలల్లోనూ రాజకీయాంశాలను, సంస్కృతి వారసత్వ పరమైన చారిత్రిక విహారయాత్ర స్థలాల ప్రాముఖ్యతను, సినిమా కథల తయారీ లాంటి విభిన్న సామాజికా ంశాలను చర్చించడం జరిగింది.

1974లో హైదరాబాదులోని "ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రాచ్యకళాశాల"లో ఆంగ్ల అధ్యాప - కునిగా కుదురుకున్నాడు. ఆ కళాశాలలోనే తన ఆంగ్ల భాష అధ్యాపక వృత్తి నుండి 2000లో ఉద్యోగ విరమణ చేశారు.

ఇకపోతే, కాకాణి గారి నవలల్లో సామాజిక చైతన్యాన్ని పరిశీలిస్తే.... వార్తా పత్రికలో వచ్చి న వార్తను ఆధారం చేసుకొని రచించబడిన నవల "శీలపరీక్ష". మూఢ నమ్మకాలను విస్మరించిన వాతావరణంలో పెరిగినందున ఈ నవలలోనూ ప్రధానంగా అదే చిత్రితమైంది. నిమ్మకులాల్లోని ని రక్షరాస్యులు ఆచరించే మూఢనమ్మకాలను గూర్చి చర్చిస్తూ వ్రాయబడింది ఈ నవల.

పురుష అహంకారంతో శీలం స్త్రీలకే పరిమితం చేసి, వారి శీలాన్ని నిరూపించుకొనుటకు నిర్వహించే 'కాలుతున్న నిప్పు కొర్రులు' పట్టుకోవడమనే దానిలోని అశాస్త్రీయతను వివరించాడు. ఈ నవలలో శీలపరీక్ష కేవలం స్త్రీలకే కాదనీ పురుషులు కూడా ఆచరించాలనీ తెలిపే అగ్రవర్ణీకు లైన అనసూయమ్మ, ఎర్రం నాయుడు పాత్రల ద్వారా 'శీలపరీక్ష' తెలియజేశాడు.

*** **శీలపరీక్ష:-** 2008 ఫిబ్రవరి 'చతుర' మాసపత్రికలో ప్రోత్సాహక బహుమతితో ప్రచురింపబడింది. నవ లలోని కథాకాలం 1925-2008 కాలం నాటిది. 'శీలపరీక్ష' అన్న నవలా వస్తువు రచయిత స్వక పోలం కాదు. 2008లో తెలంగాణలో జరిగిన 'కొర్రు పరీక్షలు' కారణాన సమిధలైపోయిన ఆడబిడ్డల జీవితాలను వార్తా పత్రికల ద్వారా తెలుసుకున్న రచయిత, వాస్తవ సంఘటనల సమాహారంగా ఈ నవలను మలిచాడు. తెలంగాణ ప్రాంత భౌగోళిక, రాజకీయ, సామాజిక, ఆర్థిక పోరాటాలను నేపధ్యాంగా ఎంచుకొని ప్రతీ అంశాన్ని పడుగు పేకల్లా అల్లుకుంటూ పాఠకుల ముందు ఆవిష్కరించాడు.

ఎంచుకున్న కథా వస్తువుకు అనుగుణంగా, శీర్షిక 'శీలపరీక్ష'ను నిర్ణయించడమే కాకుండా, ప్రధాన పాత్రధారి అనసూయమ్మ ద్వారా "స్త్రీల పాటలు"ను సమయ సందర్భానుసారంగా పలికిస్తూ, సీత అగ్ని ప్రవేశపు పాటతో 'శీల పరీక్ష' జరుగు సందర్భాన్ని బరువెక్కించడం ద్వారా పాఠకుల హృదయాలను చెమ్మగిల్లింపచేశాడు రచయిత. స్త్రీల పాటలన్నీ రామాయణ భారతాల నుండి వచ్చినవే కాబట్టి 'సుభద్రా స్వప్న' సన్నివేశంతో శీల పరీక్ష నవలను ప్రారంభించడం సమ యోచితంగా కనిపిస్తుంది.

ఈ నవలలో ప్రధానమైన పాత్రలు మూడు. శీర్షికు తగినట్లుగా ప్రధానమైనవి అనసూయమ్మ, మరియమ్మ, రేణుక స్త్రీ పాత్రలు. కాగా, విజయరామారావు, ఎర్రమనాయుడు, నారాయణరావు, దేవదానంలు తమతమ కులాల మతాలకు ప్రతినిధులుగా వారి పోకడలను చదవగలము.

'శీల పరీక్ష' శీర్షికకు తగినట్లుగానే, 'శీలం' కేవలం స్త్రీకి మాత్రమే పరిమితమా? అనే మీ మాసంతో ప్రారంభమై, కులం కట్టుబాట్లు, మగవాని ఆభిజాత్య ప్రవర్తనల కారణాన స్త్రీలు ఎలా సమిధులుగా మారిపోతున్నారో అగ్రవర్ణీకురాలైన అనసూయమ్మ, నిమ్నకులస్థురాలైన రేణుక పాత్ర లుగా మాత్రమే ఆభరణంగా పరిమితం చేసిన పురుషులు 'శీలం' స్త్రీకి మాత్రమే ఆభరణంగా, పురుషుల పరిమితం చేసిన పైనాన్ని విహంగ వీక్షణంలో కనిపించినా, అంతర్లీనంగా... అనసూయ మ్మ భర్త ఎర్రం నాయుడు లోని పోరాట, చైతన్య భావ పరంపరల కారణాన, తన భార్యకు లేని దాంపత్య జీవనం. తనకు మాత్రం ఎందుకు? అనే భావనతో జీవితాంతం

బ్రహ్మచారిగా తన జీవి తాన్ని చాలించాడు. మరి 'శీలం' పురుషునికి కూడా ప్రామాణికమైనదేననే విషయాన్ని ఎర్రమనాయ డు పాత్ర ద్వారా పాఠకులకు రచయిత తెలియజేశాడు.

ఈ నవలలో ప్రధాన పాత్రలు మూడు అనసూయమ్మ అగ్రవర్ణీకురాలు మరియూ జమీందా రిణి. ఆమె స్నేహితురాలు మరియమ్మ మరియూ ఆమె కుమార్తె రేణుకలు నిమ్నకులస్థులు. శీలపరీక్షకూ గురైన వారు మరియు తట్టుకొని నిలబడ్డ వారు అనసూయమ్మ మరియు రేణుకలు.

'మొగుడు' అనే బొమ్మతో తాళి కట్టించుకున్న పదేళ్ళ బాలిక అనసూయకు ఆ క్షణాన తెలీదు తన జీవితం తండ్రి, భర్తల అహంభావానికి గుర్తై, ఫలించకనే మోడు బారిపోతుందని తానున్న 'జమీ' లో తాను పంజరంలోని చిలక లాగ బందీగా మారిపోయానని తెలుసుకునేటప్పటికీ తన జీ వితం, అహంతో కూడిన కులం, సాంప్రదాయపు చెరలో చిక్కుకు పోయిందని ఆలస్యంగా తెలుసుకొని చింతించడం తప్ప మరేమి చేయలేని నిస్సహాయురాలిగా తన యువ్వన జీవితాన్ని చివరి వరకూ మోడువార్చుకుంది.

ఇక సామాజికంగానూ, ఆర్థికంగానూ నిమ్నకులస్థురాలైన రేణుక, వయస్సు ఆకర్షణతో ఒకసారి, భర్త దౌష్ట్యానికి మరొకసారి తన జీవితాన్ని కడగండ్లపాలు చేసుకుంది. తాగుబోతు, తిరు గుబోతు అయిన భర్త నారాయణ దుర్మార్గపు ప్రవర్తనకు సమిధిగా మారేందుకు, తన కులపు కట్టు బాట్లు కూడా తోడవ్వడంతో సాటి కులస్థులు, బంధువుల సమక్షంలో, "ఎల్లమ్మ" సాక్షిగా ఎర్రగా కాలే కొర్రులను చేతబూని తన పాతివ్రత్యాన్ని నిరూపించుకోవల్సి వస్తుంది. రేణుక శీలవతేననే వి షయాన్ని రుజువుపరచుకునే సందర్భాన్ని, పాఠకుల హృదయాలను కదిలించే విధంగా అక్షరీకరిం చాడు రచయిత కాకాణి.

అదృష్టవశాత్తు ప్రకృతి కరుణతో అకాల వర్షం పడటంతో ఎర్రటి కొర్రులు కాస్త చల్లబడటంతో, అప్పటి వరకూ వినోదార్థులైన సాటి కులస్థులు, బంధువులు రేణుకను శీలవతిగా నిర్ధారిం చారు. వెంటనే దుర్మార్గుడైన భర్త నారాయణకు కూడా శీల పరీక్ష నిర్వహించాల్సిందేననే

ఆలోచన ఆ సమూహానికి రావడం వారి ఆలోచనను ముందుగానే పసిగట్టిన నారాయణ భయంతో పారిపో వడంతో 'శీల పరీక్ష' నిలిచి పోయింది.

అంటే 'శీలపరీక్ష' కేవలం స్త్రీలకు మాత్రమే కాదనీ, పురుషులకు కూడా వర్తిస్తుందని ఎవరికి వారే, తమ తమ అంతరాత్మలకు జవాబుదారీతనం వహించడమే నిజమైన శీలపరీక్ష అంటూ రచ యిత కాకాణి చక్రపాణి స్పష్టపరిచాడు.

ఈ క్రమంలో, నిమ్నకులాల పుట్టుక విధానాన్ని 'జాంబపురాణం' ఆధారంగా వివరించారు రచయిత. అలాగే మతాంతరీకరణ విధానాన్ని, దుష్ఫలితాలను కూడా దేవదానం, శౌరయ్య పాత్ర ల ద్వారా చర్చించడం జరిగింది. "మనిషిని మనిషి మాత్రమే ఆదుకోగలడనీ, అందుకు మతమూ, దేవుడూ రెండూ అక్కరకు రావని, మనిషిలోని మానవత్వమే దైవత్వమంటూ" దళిత క్రిష్టియనైన దేవదానం స్వానుభవం ద్వారా తెలుసుకోవడాన్ని తెలియబరిచాడు రచయిత.

సమాజ ఉద్ధరణకు తుపాకులతో పోరాటమే పరిష్కారం కాదన్న సత్యాన్ని తెలుసుకునే క్రవ ంలో తన దాంపత్య జీవితాన్ని, ఆరోగ్యమును పోగొట్టుకొని పశ్చాత్తాపానికి గురైన పైనాన్ని ఎర్రమ నాయుడు పాత్ర ద్వారా పాఠకులు తెలుసుకోగలరు. తన భార్యకు లేని దాంపత్య జీవితం తనకు మాత్రం ఎందుకనుకున్నాడు. అభ్యుదయ భావాలు గల ఎర్రమనాయుడు. చివరికి తను కూడా తన భార్య అనసూయమ్మ లాగ బ్రహ్మచార జీవితాన్ని గడపటం ద్వారా 'శీలం' పురుషులకు కూడా వర్తిస్తుందనే సత్యాన్ని తెలియజెప్పాడు.

నిజాం రాజ్య దోపిడీ నుండి విడువడ్డ తెలంగాణ ప్రజానీకం మెల్లమెల్లగా ప్రజాస్వామ్య ప్ర భుత్వ స్థాపనకు దారితీసే క్రమంలో 'ఓట్ల' ప్రాముఖ్యతను కూడా తెలియబరుస్తూ, ఓటుకు కులం, మతం లేవని తెలుపుతూ జమీందారులైనా సరే, ఓటు హక్కు కలిగిన నిమ్నకులస్థులైన సగటు ఓ టరుకు ప్రణమిల్లే సందర్భాలను చదవగలమీ నవలలో.

"ఇప్పటి దాకా మనం ఇతరులు పరువు కోసం, ఆలోచనల కోసం బతుకుతున్నాం. మన కోసం కూడా మనం బతకాలి. సమాజం కోసం కూడా బతకాలి" అంటూ అనసూయమ్మ మరియూ మరియమ్మతో ఒప్పందం చేసుకుంది. ఫలితంగా తనకున్న కాసుల పేరును అమ్మడం ద్వారా, తన చేతికందిన డబ్బుతో అనసూయమ్మ అవాంతరాలను అధిగమించి నిమ్న వర్గ స్త్రీలంద రికీ దళితవాడలోనే కుట్టుమిషన్ కేంద్రాలను ఏర్పరిచింది. ఇందులో జీతంలేని టీచర్ మరియమ్మ. అనసూయమ్మ తన మేనల్లుడి సాయంతో ఖమ్మం జిల్లా కలెక్టర్ను కలుసుకొని తన ఆలోచనతో టైలరింగ్ శిక్షణా సంస్థకు "యూనిఫాం" తయారు చేసే టెండర్ను దక్కించుకుంది.

అకస్మాత్తుగా రెండవ ప్రసవ సమయంలో మరియమ్మ గుర్రపు వాతం కారణాన మరణించి ంది. అనసూయమ్మకు మరియమ్మ మరణం శరాఘాతమైంది.

మరియమ్మ కూతురు రేణుక. తండ్రి వారించినప్పటికీ అనసూయమ్మ ఒత్తిడితో ఖమ్మంలో ఇంటర్ వరకూ పూర్తి చేసింది. ఈ సమయంలో మాదిగ కులస్థుడు నారాయణతో ప్రేమలో పడి, వివాహానికి ఒప్పుకోవాల్సి వచ్చింది. అయితే కట్న కానుకల కింద శౌరయ్య లక్ష రూపాయలను డి మాండు చేయడం, ఆర్థికంగా బలహీనుడైన మాలకులస్థుడు దేవదానం నిశ్చేష్టుడు కావడంతో నా రాయణ - రేణుకల పెళ్ళి ఆగిపోయింది.

వారం, పదిరోజుల తర్వాత అనసూయమ్మకు ఈ సంక్లిష్టపరిస్థితులు తెలిశాయి. వెంటనే ఆమె గంధసిరిలోని గ్రామ పెద్దలతో ఒక సమావేశం ఏర్పరిచింది. దానికి శౌరయ్య - దేవదానం లు కూడా హాజరైనారు. అనసూయమ్మ తన అనుభవాన్ని, వివేకాన్ని, దాతృత్వాన్ని రంగరించి శౌర య్యను తన కొడుకు పెళ్ళికి అంగీకరింపజేసి, కట్నంగా తనవంతు యాభైవేలు త్వరలో ఇస్తానని, వెంటనే పెళ్ళి జరిపించమని శౌరయ్యను ఆజ్ఞాపించింది. శౌరయ్య ఒప్పుకోక తప్పనిసరి అయింది. వివాహం జరిగింది. రేణుక కట్టుబాటు తప్పడానికి తన పెంపకంలో ఏదో లోపముందని ఆత్మ విమర్శ చేసుకుంది. జరగబోయే పెళ్ళి తనకిష్టమేనా అని అనసూయమ్మ కూడా రేణుకను అడగలేకపోయింది.

ఆ సమయంలో డెబ్బై యేళ్ళ అనసూయమ్మకు అప్పటి వరకూ తనకు కంటికి కనిపించకుండా ఉన్న 'బొమ్మ మొగుడు' మరణ వార్తను తెచ్చింది తన మరిది ద్వారా వచ్చిన ఉత్తరం. "తన బతుక్కు ఆయనతో జీవితం పంచుకున్నది లేదు. చివరకు తనకు వైధవ్యం రాసిపెట్టాడు." ఓ క్షణం పిచ్చె క్కినట్లయింది ఆమె బోరుమని ఏడ్చింది. నిస్త్రాణంగా పడుకుండిపోయింది. కొంత తేరుకున్నాక, తన పుని స్త్రీ పరిత్యాగమంతా తానే నిర్వహించుకుంది. ఎప్పుడూ ఆమె ఒంటరే. కానీ భర్త మరణ వార్తతో ఈ ఒంటరితనం మరింత దుర్భరమైపోయింది. భర్త ముఖం ఆమెకు గుర్తు లేకున్నా ఆ భావన ఆమె మనస్సులో నిత్యం జాగృతమై ఉండేది. తను చేసే పనుల్లో ఉద్వేగరహితమైన, నిరాస క్తకరమైన ప్రోత్సాహాన్నిచ్చేది ఆ ప్రపంచమే. భావుకతలో నిర్మించుకున్న ఆమె పీఠం కదిలిపోయిం ది. మనసు నిరామయమై పోయింది.

ఆ ఉత్తరం భర్త మరణ వార్తతో పాటు అతని అవసాన దశలో తన తమ్ముళ్ళతో తన మన స్సులోని చెప్పిన ఆలోచనలను చదివి ఆమె ఆశ్చర్యపోయింది. "నా ఆస్తిలో ఒక వాటా నా భార్యకు ఇవ్వాలని ఉంది. అభిమానం గల మనిషని విన్నాను. ఎప్పుడో పదేళ్ళ పిల్లగా నా చేత తలంబ్రా లు పోయించుకున్న ఆమె నాకు గుర్తు. ఇప్పుడెలా ఉంటుందో నాకు తెలియదు. నాకంటే ఆరేళ్ళు చిన్నది అంటే డెబ్బైయేళ్ళు, కనీసం ఈ అవసాన సమయంలో ఆమెకు ఆర్థికంగా అయినా సాయం చేయాలి. ఆమె స్వీకరిస్తుందో లేదో నాకు తెలియదు. మీ వదినకు- నాకు గుర్తులేని నా భార్యకు - ఓ పది లక్షలు పంపండి. ఆమె స్వీకరిస్తే నేను ధన్యుడిని అవుతాను. కనీస న్యాయం నా భార్య కు జరిగిందని నేను సంతోషిస్తాను". అని చదివి, అతను మళ్ళీ పెళ్ళి చేసుకొని ఉంటాడని భావిం చిన అనసూయమ్మకు, భర్త కూడా తనలానే నిష్ఠుర జీవితం గడిపాడని తెలుసుకొని ఆమె మనస్సు విహ్వలమైపోయింది. తానూ శీలవంతుడిగా బతికాడు, తనకూ శీలపరీక్ష పెట్టాడు. "ఆయన నిజ ంగా తన భర్త!" ఈ ఆలోచనతో ఆమె మనస్సు ఉప్పొంగిపోయింది. ఆమె మనసులోని కల్లోలం శమించి ప్రశాంతమైంది.

"మరిది"కి కృతజ్ఞతలు తెలుపుతూ క్లుప్తంగా ఉత్తరం రాసింది. "నా భర్త పంపిన డబ్బును నేను స్వీకరిస్తున్నాను. భర్త ఇచ్చింది స్వీకరించడంలో అభిమానమేముంటుంది? మీ భార్యపిల్లలతో మీరంతా సుఖంగా ఉండాలని ఆశీర్వదిస్తున్నాను" అని రాసింది.

తన కుటీర నిర్మాణం, వేణు గోపాలస్వామి గుడి నిర్మాణం, రేణుక పెళ్ళి ఖర్చులు అన్నీ క లిపి నాలుగు లక్షలు పోగా, మిగిలిన ఆరు లక్షలను బ్యాంకులో జమ చేసుకొని వచ్చే వడ్డీతో తన శేష జీవితానికి ప్రణాళిక వేసుకుంది. ఇప్పుడామె దృష్టంతా వేణు గోపాలస్వామి మీదనే నిలిపింది.

తను దగ్గరుండి నిలబెట్టిన రేణుక జీవితం శీల పరీక్షకు గురికాబోతుందని తెలుసుకున్న అనసూయమ్మ నిశ్చేష్టురాలైంది. శీలాన్ని మనసుకి కాక, శరీరానికి పరిమితం చేసిన పితృస్వామ్యపు వ్యవస్థ దానిని ఆడదాని మెడకు ఉరితాడులా బిగించే పైనాన్ని ఎరిగి ఉన్నందున, శీలపరీక్ష జరిగే ప్రదేశాన్ని చేరుకొని, 'రంకుతనం, జారతనం శిక్షార్హమైనదే! రేణుకకు శీల పరీక్ష పెట్టి మంచిపని చేశారు' అంటూ సంభ్రమాశ్చర్యాలతో కూడిన సంభాషణను మొదలు పెట్టి, 'ఆమెను కొరువులు కాల్చకపోతే, నారాయణ కొరువులు పట్టుకోవాలి. తన భార్యపై అపనింద వేసిన భర్త నారాయణ తన తప్పు లేదని నిరూపించుకోవటానికి అతనూ మండుతున్న కొరువులు పట్టుకోవాలి' అని సమ న్యాయాన్ని ప్రతిపాదించింది.

కణకణకాగిన కొరువులు కాల్చకమానవు. అది ప్రకృతి!శీల పరీక్షకై కొరువులు పట్టుకోవడం అన్న అమానీవీయ పని చట్టవిరుద్ధమైనదీ మరియూ శిక్షార్హమైనదీ. ఈ విషయం సంబంధిత పో లీసు అధికారులకు మాజీ సర్పంచ్ చంద్రుడి ద్వారా ఫిర్యాదు చేయించి ఉంది అనసూయమ్మ. పో లీసు సిబ్బంది వచ్చి ఆ పనిని ఆపేంతవరకూ, నిర్భయంగా, నిమ్మలంగా ఉండి కాలయాపన సాగించేందుకు… అనసూయమ్మ వచ్చిన సంగతిని సైతం గమనించలేనంతటి యాంత్రికావస్థలోకి జారిపోయింది రేణుక. ఆ నిమిషానికి ఆమె మదిలో అనసూయమ్మ నేర్పిన 'సీత అగ్ని ప్రవేశం' గింగెర్లెత్తుతుంది. “అనుజుడా తమ్ముడా ఓయి లక్ష్మణుడా!/ కుక్క ముట్టిన కుండ కుదరదు మాకు! ....."అగ్నిజొచ్చి నేను వోడితినైనా! నెలకు మూడు వర్షాలు కురువవెన్నటికీ / శ్రీరాము సతిగాను శ్రీ లక్ష్మణుండ!/ జనకుని కూతరనే గాను అనెను! పాటలో సీత అన్న మాటలు ఆమె గుండెను కలచి వేశాయి.

అనసూయమ్మ కాలయాపన చేసేందుకు గాను... "స్నానం చేసి శుచిగా వస్తే గాని కొరువులు ముట్టుకోకూడదు" అనే మాటలపై రేణుక స్నానానికి బయల్దేరేప్పటికి కొన్ని

చినుకులు రాలాయి అవి పెద్దయ్యాయి. రేణుక మనస్సు సీత ఇక్కట్లను ఊహిస్తుంది. "ప్రదక్షిణం చెయ్యాలి. మూడుసార్లు అగ్ని హోత్రుడి చుట్టూ ఆపైనే "నా బిడ్డ కొర్రులు పట్టుకుంటుంది" కాలయాపన చేయిస్తుంది అనసూయమ్మ. ప్రదక్షిణలు పూర్తికాగానే అకాల వర్షం మొదలైంది, వేదికపై నిప్పులు ఆరిపోయాయి. ఇనుప కడ్డీలు చల్లబడ్డాయి. ఆకాశగంగ రేణుకను రక్షించింది. ఆమెను పరీక్షించ అవసరం లేదని అగ్నిదేవుడూ చల్లబడ్డాడు. రేణుకకేమీ తెలియదు. ఆమె మనస్సు సీత మీద లగ్న మై ఉంది. సీత గెలిచింది. పునీత సీతను చూసి శ్రీరామ చంద్రుడు లక్ష్మణునితో....

"ఆడువారికి కలవు అగ్ని మంత్రములు! మండేటి మంటలకు మారు మసిలేరు!...
కాగేటి యెసరయిన కలియ దీసేరు! ..."

"నా బిడ్డ పతివ్రత! అగ్ని దేవుడంత పవిత్రమైంది" అంది అనసూయమ్మ. జనం పొంగిపో యారు. మెల్లగా తీర్పు వెలువరించాడు కుల పెద్ద మళ్ళాపరీచ్చ అవసరం లేదని, రేణుక ఇహలోక ంలో లేదు. అశరీరవాణి

"సీత పతివ్రతయని సిద్ధముగ బల్కె! దుందుభులు మ్రోగె తుంబురులుపాడె!
పుష్ప వర్షము గురిసె నా పృథ్వియందు!...

స్త్రీ లోకమంతా ఒక్క గొంతుతో రేణుక భర్త నారాయణ కొరువులు పట్టుకోవాలన్నారు. "నా బిడ్డ పతివ్రత కనుక దాని చేతులు కాలవు వాడు దుష్టుడు... వాడి చేతులు కాలటం తథ్యం! ఎంతైనా నా బిడ్డ మొగుడు. వాడి చేతులు కాలితే నా బిడ్డ ఓర్చుకోలేదు. వాడిని క్షమించి వదిలేయ్యండి" అంది అనసూయమ్మ.

అప్పుడు వచ్చింది అనసూయమ్మ ఎదురు చూస్తున్న పోలీసు జీపు. ముచ్చెమటలు పట్టిన సర్పంచ్ నారాయణ, జనం గమనించే లోపే క్షణంలో యేటిని ఈది ఆవలి గట్టుకు చేరాడు. పోలీ సులకు నచ్చజెప్పి, కేసును విరమించుకుంది.

అనసూయమ్మ ఆ గిరిధారికి శత సహస్రనమోవాకాలు అర్పించింది. పోలీసులు ఆలస్యం చేసినా, తను నమ్మిన వేణు గోపాలుడు ఆలస్యం చేయలేదు. అకాల వర్షం కురిపించి, శిష్ట రక్షణ చేశాడు.

తన కళ్ళెదుటే కూతురికి జరుగుతున్న అన్యాయాన్ని ఆపకుండా "ఏసుప్రభువుకే తప్పలేదు, నా కూతురెంతంటూ?" అసమర్థమాటలతో ఊరకుండిన దేవదానం, ఇప్పుడు ఏసు ప్రభువును కన్న మేరీ మాతవు నువ్వు, నా బిడ్డను రక్షించావు అని అనసూయమ్మ కాళ్ళ మీద పడిపోయాడు.

“యేసు ప్రభువుకు విన్నవించుకో, ఇక నీ బిడ్డను నా దగ్గర ఉంచుకుంటాను. ఆ వేణు గో పాలుడికీ, యేసు ప్రభువుకూ అభ్యంతరం ఉండదు" అంది సువార్త చేతిలోని రేణుక బిడ్డను తన చంకనేసుకుంటూ అనసూయమ్మ.

రేణుక ఇంకా సమాధి నుండి మేలుకోలేదు. ఆమెను కుడి చేత్తో పొదివి పట్టుకొని నడిపిం చింది అనసూయమ్మ 21వ శతాబ్దం లోనికి. శీల పరీక్ష అందరికీ తప్పదు. ఎవడి శీలపరీక్ష వాడే జరుపుకుంటాడు. కాలచక్ర సంవర్తనంలో అందరి శీలాలు పరీక్షింపబడుతాయి! ఎవరి శీలాన్నైనా పరీక్షించటానికి మానవ మాత్రులెవరు?

**ఆధార గ్రంథాలు :-**

1. కాకాణి చక్రపాణి - శీల పరీక్ష

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

# వీధినర్తకి' నవల – సామాజికత - అనుశీలన

*పరిశోధకుడు: - గొల్ల నరేష్ కుమార్ ,*
*పర్యవేక్షకులు:-ఆచార్య ఇరపని మాధవి,*
*తెలుగు & ప్రాచ్య భాషా విభాగం ,*
*ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం*
*చరవాణి: - 8179864227*

**1)ఉపోద్ఘాతం**: కాల ప్రవాహంలో భాగంగా మిగిలిన అన్ని భాషా సాహిత్యాల్లో లాగానే తెలుగులో కూడా కాలానుగుణంగా నాటకం ,నవల, కథానిక ,వచన కవిత్వం వంటి అనేక నూతన ప్రక్రియలు ఆవిర్భవించాయి. వాటిలో నవలా ప్రక్రియ విశేష ప్రజాదరణ పొందింది. ఈ ప్రక్రియలో కలుగోట్ల విజయత్రేయ గారు రచించిన ఒకానొక నవలే "వీధి నర్తకి". ఈ నవల నాయిక ప్రాధాన్యం కలిగిన నవల. ఈ నవలా రచయిత కలగోట్ల విజయాత్రేయ కర్నూలు జిల్లా గడివేముల మండలంలోని గని గ్రామవాసి. వీరు 22- 7 - 1935 న జన్మించి 25- 9- 1995 లో మరణించారు. ఈయన అసలు పేరు కలుగోట్ల సుబ్బారావు. విజయాత్రేయ అనేది ఈయన కలం పేరు. విజయాత్రేయ 4 నాటకాలు, 9 పద్య కావ్యాలు, 59 ఖండ కావ్యాలు, 2 క్షేత్ర మహాత్మ్య వచన రచనలు, 100 దాకా నవలలు రచించినట్లు తెలుస్తుంది. ఈయనకి ఆధునిక పద్యకవి, కవి సర్దార్ ,కవిజహాపన, సరసకవితిలక, కవితాకిరీటి, తెలుగు జయదేవ అనే బిరుదులు కలవు. వీరి సాహిత్యం పై ప్రముఖులైన సి నారాయణరెడ్డి, గుంటూరు శేషేంద్ర శర్మ, జయప్రభ వంటి వారు ప్రశంసలు కురిపించారు. అయితే కవిగా ఈయనకు లభించినంత గుర్తింపు నవలా రచయితగా లభించకపోవడం గమనించదగిన అంశం .

**2) వీధినర్తకి నవలేతృతం:** ఈ నవలలో ప్రధాన పాత్ర పేరు హేమతార. ఈమెనే ఈ నవలలోని కథా నాయిక.ఈమె ఐశ్వర్యవంతురాలు కుటుంబంలో పుట్టినా,కాలం కలిసి రాక పరిస్థితులు తారుమారై, కుటుంబ పోషణ కోసం జీవనోపాధి నిమిత్తమై కళను నమ్ముకుని, తెనాలికి చెందిన ఒక ప్రసిద్ధ కళాబృందంలో వీధినార్తకిగా జీవనం సాగిస్తుంది.ఈమె అద్భుతమైన నాట్యకత్తె. తన సౌందర్యం, ప్రతిభలతో ప్రేక్షకులను మైమరింపజేసి, మంత్రముగ్ధులను గావించగల

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

నైపుణ్యవంతురాలు. మరియు మంచి గాయకురాలు.చందనాపురం గ్రామ యువకులు కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చి, అక్కడ హేమతార నృత్యాన్ని చూసి, తమ గ్రామంలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాల్లో ఈమె ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆ ప్రదర్శన చూడ్డానికి అందరిలాగే ఆ ఊరి సంపన్న కుటుంబీకుడైన యామిని చరణ్ అనే యువకుడు కూడా వస్తాడు. ఇక్కడ హేమతార యామిని మధ్య ఒక అపరిచిత ఆకర్షణ, మానసికమైనటువంటి స్పందన ఏర్పడతాయి. ప్రదర్శన ముగిశాక యామినిచరణ్ ఒక ఆహ్వాన పత్రికనిచ్చి, తన సేవకుడైన గంగారాం సింగ్ జీతో అతిథిగా రావాల్సిందిగా కోరుతూ హేమ తారకు కబురు పంపిస్తాడు. హేమతార మొదట తిరస్కరించినా యామిని ఇంటికి వస్తుంది. యామిని హేమతారను తన ఇంట్లో పదిరోజులు అతిధిగా ఉండమని అడుగుతాడు.ఆమె దానికి వీలు పడదని, తన కుటుంబపు దీనస్థితినిచెబుతుంది . దానికి యామిని అతిథిగా ఉన్నన్ని రోజులు జీవనోపాధి ఇస్తానని చెప్పి, ఆమెను ఉండడానికి ఒప్పిస్తాడు. ఇలా అతిథిగా ఉన్న రోజుల్లో వీరి మధ్య అనేక విషయాలకు సంబంధించిన విషయాలు, వ్యక్తిగత అంశాలు చర్చకు వస్తాయి. యామిని ,అతని స్నేహితుడు శశి కిషోర్ తో నడుపుతున్న హోటల్ మూన్ లైట్ గురించి, అటువంటి ఆధునిక విశ్రాంతి భవనాల్లో జరిగే పాశ్చాత్య సంస్కృతి పోకడలను విమర్శిస్తాడు. ఇద్దరి మధ్య ప్రేమానురాగాలు ఏర్పడతాయి. కొన్ని రోజులు గడుస్తాయి.యామిని హేమతారను వీధినర్తకి నుండి కళా సామ్రాజ్ఞిగా చూడాలన్న ఉద్దేశంతో అవకాశాల కోసం హైదరాబాదుకు తీసుకువెళ్తారు. యామిని చరణ్ చొరవతో హేమతారకు ప్రముఖ గాయని రాగలక్ష్మితో పరిచయమేర్పడి, ప్రసిద్ధ రవీంద్ర భారతిలో నాట్యప్రదర్శన చేసే అవకాశం లభిస్తుంది. ఇంతలో తన కుటుంబాన్ని హైదరాబాద్ తీసుకురావడం, క్రమంగా తను ప్రసిద్ధ నాట్యకారిణిగా మారడం జరుగుతుంది. ఒకరోజు యామిని చరణ్ పనిమీద హైదరాబాద్ వచ్చి,హేమతార వాళ్ళ ఇంటికి వెళ్తాడు. అక్కడ హేమతార అక్కయ్యను చూసి తనను ఇష్టపడతాడు. హేమతార అక్కయ్య భ్రమరబాల కూడా యామినిని చూసి ఆకర్షితురాలవుతుంది. తర్వాత కొన్ని రోజులకు యామిని చరణ్ ఇరు కుటుంబాలను ఒప్పించి భ్రమరబాలను పెళ్లి చేసుకుంటాడు. వారి దాంపత్యానికి గుర్తుగా కొడుకు పుడతాడు. ఇదే సమయంలో హేమతారా దేశ విదేశాల్లో నాట్యప్రదర్శనలో నిమగ్నమై ఉంటుంది. దీంతో యామిని చరణ్ ఊహించినట్టు హేమతార కళా సామ్రాజ్ఞిగా ఎదిగి ,తన విదేశాలలో తన ప్రదర్శనలు ముగించుకొని తిరిగి హైదరాబాద్ లోని తమ ఇంటికి వస్తుంది. అలా వచ్చాక కొన్నాళ్ళకు ఒక సందర్భంలో బావగారిని మీ కోరిక నెరవేరిన్నట్టేగా అంటుంది హేమతార. లేదు, నన్ను పెళ్లి

చేసుకోవడం మిగిలి ఉందంటాడు యామిని చరణ్. దానికి హేమతార నిరాకరిస్తుంది. నేను నా జీవితం కళకు అంకితం ఉంటుంది. ఇంట్లో వారందరూ హేమతారకి నచ్చచెప్పి యామినిని వివాహం చేసుకోవాలని అంటారు. అందుకు హేమతార అంతా మీఇష్టమేనా, మీనిర్ణయమేనా అంటుంది. భ్రమరబాల కలుగజేసుకొని లేదమ్మా ఇదంతా దేవికృప అని చెప్పడంతో నవల ముగుస్తుంది.

**3) ' వీధినర్తకి' నవల సామాజిక అంశాల:**

రచన ఏదైనా, దాని రచయిత ఎవరైనా సరే ఆ రచనలో రచయిత యొక్క ఆత్మీయతతో పాటు అతని కాలానికి సంబంధించిన, రచయితకు అవగాహన ఉన్న సమకాలీన సామాజిక అంశాలు తప్పకుండా ప్రతిఫలిస్తాయి. వీధినర్తకి నవల అందుకు మినహాయింపేమి కాదు .ఈ నవలలో రచయిత సందర్భానుసారంగా అనేక సాంఘిక అంశాలను ప్రస్తావించడం మనం గమనించవచ్చు. వాటిని ఈ క్రింది విధంగా కొన్ని ఉపశీర్షకులు ద్వారా క్లుప్తంగా వివరించవచ్చు.

**3.1 కళలు, కళాకారుల పట్ల నాటి సమాజపు కోణం:**

సమాజంలో శాస్త్రీయ కళల పట్ల ఉన్న గౌరవం జానపద వీధి నాట్యాల పట్ల ఉండదు. ఎక్కువమంది వీటిని వినోదం గానూ లేదా కొంత తక్కువ చూపుతో భావిస్తారు. కానీ రచయిత ఈ నవలలో పైన చెప్పుకున్నట్టు ఉన్నత వర్గాలలో, వృద్ధులలో ఉన్న చులకన భావానికి విరుద్ధంగా యువత ఆ కళపట్ల చూపించే ఆదరణ భావాన్ని, మార్పును ఎత్తు చూపిస్తుంది. ఈ విషయం చందనాపురంలో తెనాలికి చెందిన కళాబృందం వారి ప్రదర్శన ఏర్పాటు చేసిన సన్నివేశంలో మనం గమనించవచ్చు.

**3.2 కళాకారుల సామాజిక స్థితిగతులు- ఎదుర్కొనే వివక్ష:**

కళాకారులు వేదికపై వెలుగులు విరజిమ్ముతున్నా,వారి జీవితంలో సామాజిక రక్షణ, గుర్తింపు కోసం పడే తాపత్రయం మరియు ఎదుర్కొనే వివక్షను రచయిత ఇందులో చక్కగా చూపించాడు. ముఖ్యంగా ఒక మహిళా కళాకారిణిగా హేమతార

సమాజం యొక్క వెక్కిరింతలను, పురుషుల వక్రదృష్టిని తట్టుకుంటూ తన వృత్తిని ఎలా కొనసాగించిందో మనం ఇందులో చూడొచ్చు. ఈ సందర్భంలోనే యామినీ చరణ్ కు హితబోధ చేస్తూ, తన స్థాయిని అతని స్థాయిని గుర్తు చేస్తుంది. "కడుపు కోసం ఊరూరా, వాడవాడలా తిరిగే మాలాంటి వారితో మీకేమి పని ?" 1 ప్రశ్నించడం ద్వారా సమాజంలో తమ లాంటి అట్టడుగు వర్గాల పట్ల ఉన్న వివక్షను, వారి దీనస్థితిని, తమ సహచర్యం అపకీర్తికి, అప్రతిష్టకు దారి తీసే దౌర్భాగ్య సామాజిక దుస్థితిని ప్రకటిస్తుంది. అలాగే హేమతార సమాజంలో తనను తాను వీధి నర్తకి, పాతకత్తె, బజారుగత్తె అని పిలిపించుకోవడంలో ఉన్న నైరాశ్యం, సమాజం ఆమెను చూసే చులకన భావం నేటి సమాజంలో సైతం అనేక కారణాలవల్ల వీధి నర్తకి లాంటి వివిధ వృత్తులను అవలంబించిన మనుషుల దౌర్భాగ్యాన్ని ఈ నవల ప్రతిబింబిస్తుంది.

### 3.3సామాజిక భద్రత మరియు భయం:

గంగారం హేమ తారను తీసుకొని వెళ్లడానికి వచ్చినప్పుడు "మీ గ్రామంలో బలవంతంగా బంధి చేయరు కదా!" 2 అని హేమతార అడుగుతుంది. దీని ద్వారా పరాయి ఊర్లలో మహిళలకు ఉండే అభద్రత భావాన్ని రచయిత ఓలస్తావించాడు.అధికారంలో ఉన్నవారు సామాన్యులను హింసించే తీరును నిరసిస్తూ "ప్రభు భక్తి, క్రమశిక్షణ పూర్తిగా లోపించిన ఈ రోజుల్లో, కలుషిత జానపద వాతావరణంలో జీవించడానికి మీసాల పులులు, చేతి బాంబులు కావలసిన వస్తున్నాయి" 3 అనే మాటలను రచయిత వాడుతాడు.

### 3.4 స్త్రీల పట్ల సమాజ దృక్పథం:

ఒక యువతి వృత్తి కోసమో,ఉద్యోగం నిమిత్తమో బయటకు వచ్చినప్పుడు సమాజం ఆమెలోని ప్రతిభను కాకుండా, ఆమె అందాన్ని, స్త్రీ తత్వాన్ని మాత్రమే చూడటాన్ని రచయిత దుయ్యపట్టాడు. ఇది హేమతార ప్రదర్శననిచ్చే సమయంలో, అలానే వైద్యం కోసం తాను డాక్టర్ వద్దకు వెళ్ళినప్పుడు ఆమెతో వైద్యుడు అసభ్యంగా ప్రవర్తించిన సన్నివేశంలో మనం చూడవచ్చు. "గడప దాటితే సర్వులకు నా సౌందర్యమే అభిలాషీనీయమని తోచింది" 4 అని హేమతార అన్న మాటలు సమాజం స్త్రీని కేవలం ఒక భోగ వస్తువుగా చూస్తుందనే చేదు నిజాన్ని చాటి చెబుతాయి. యామిని చరణ్, హేమతార అభివృద్ధిని కాంక్షించినా హేమతారను పొందాలని అనుకోవడం, అలానే భ్రమరబాలతో వివాహమైనా హేమతారను కాంక్షిస్తూ "ఔను, బావ నీ ఆశలు

తీర్చడమే మిగిలింది కదూ" 5 అని కామ దృష్టితో అనడాన్ని బట్టి స్త్రీని భోగ వస్తువుగా భావిస్తూ సర్వులు తన సౌందర్యాన్ని కోరుతున్నారన్నా హేమతార మాటలు నిజమనిపిస్తాయి.ఈ ఒక్క గుణం యామిని చరణ్ వ్యక్తిత్వంలోని యామిని మచ్చగా మరి అంతటి మూర్తిమత్వాన్ని కూల్చివేసింది.

**3.5పేదరికం,ఆకలి మరియు వలసలు :**

మధ్యతరగతి మరియు దిగువ తరగతి ప్రజలు ఎదుర్కొనే ఆకలి బాధలు, అనుభవించే పేదరికాలను ఈ నవల సృష్టించింది.

' గంజితాగి పస్తులు ఉంటూ' సరైన తిండి లేక ఆరోగ్యానికి గురవడం వంటి దృశ్యాలు ఆనాటి సామాజిక అసమానతలు, స్థితిగతులకు అద్దం పడతాయి. అలాగే పేదరికం మనిషిని ఎంతటి కష్టానికి అయినా అవమానానికైనా సిద్ధపడేలా చేస్తుందని ఈ నవల తెలియజేస్తుంది. ఉన్నత సంపన్న కుటుంబంలో జన్మించిన హేమతార, కాల ప్రభావం వల్ల కుటుంబ పోషణ కోసం వీధి నర్తకి గా జీవిస్తున్న సంఘటనే దీనికి ప్రత్యక్ష నిదర్శనం. ఇలాంటి హేమతారను చూసి

"వీధి నర్తకి!!

ఒక బజారు ఆటకత్తె - పాటకత్తె ,భగవాన్! ఏమిటి నీ లీలలు, నీకే తెలియాలి.

కడుపు చేత్తో పట్టుకొని వచ్చిన పేదరాలా? అబ్బ! దారిద్ర్యంతో ఆ కళా హృదయంలోని రాజసం ఎంత దహించుకొని పోయిందో", "బీద తనాన్ని మించిన బాధాకరమైన విషయం మరేదీ లేదు కాబోలు. అందుకనే వినాదిన్యేన జీవనమో అంటూ పూర్వులల్లా మొరపెట్టుకున్నారు" 6 అంటూ యామిని అన్న మాటలు పేదరికం ఆకలి తాలూకు పైన పేర్కొన్న మాటలను ప్రతిబింబిస్తాయి. అలానే పేదరికం వల్ల నానా అవస్థలు పడుతూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినప్పుడు ఎదురయ్యే సామాజిక సవాళ్ళు కూడా ఈ నవలలో అంతర్లీనంగా కనిపిస్తాయి. అంతేకాకుండా డబ్బు లేని పేదవారికి సరైన వైద్యం అందకపోవడం, వైద్యులు కూడా స్వార్థంతో ప్రవర్తించడం వంటి అంశాలు నాటికి నేటికి సమాజానికి వర్తించే సామాజిక సమస్యలు కూడా కొన్ని ఇందులో చెప్పబడ్డాయి.

**3.6 గ్రామీణ ఉత్సవాలు – ఐక్యత :**

గ్రామీణ ప్రాంతాలలో శ్రీరామనవమి, శివరాత్రి వంటి పండుగల సమయంలో ఉండే కోలాహలం, ఉత్సవాల నిర్వహణలో ఉండే సామూహిక కృషిని రచయిత చందనాపురం గ్రామంలోని శ్రీరామనవమి ఉత్సవాలలో చూపించాడు. ఇదే సందర్భంలో తరానికి తరానికి మధ్య ఉండే వ్యత్యాసాన్ని కూడా రచయిత కనిపింప చేశాడు .

**3.7 ఆచారాలు, జీవనశైలి :**

నవలలో ప్రస్తావించిన వస్తువులు ( చీరలు, గాజులు,గడియారం వంటివి)మరియు ప్రాతఃకాల పూజా కార్యక్రమాలు ,శ్రీరామనవమి, శివరాత్రి వంటి పండుగలు ఉత్సవాలు ఆనాటి సమాజంలోని ప్రజల జీవన శైలిని ఆచార సాంప్రదాయాలను వ్యక్తం చేస్తున్నాయి.

**3.8 నవ సమాజం – పాశ్చాత్య సంస్కృతి ప్రభావం :**

రచయిత ' నవ సమాజం' అనే పదాన్ని విమర్శనాత్మక కోణంలో ప్రయోగించి ఆధునికత పేరుతో సమాజంలో నైతిక విలువలు క్షీణిస్తున్నాయని, మనుషులు ఆచార వ్యవహారాలును వదిలిపెట్టి, కేవలం భౌతిక సుఖాల వెంటపడుతున్నారని యామిని పాత్ర ద్వారా వివరిస్తాడు. పాశ్చాత్య పోకడల ప్రభావంతో భారతీయ సమాజంలోకి క్లబ్బులు, బార్లు, విదేశీ తరహా విశ్రాంతిభవనాలు (హోటల్ మూన్ లైట్ వంటివి) పెరిగాయని, మన సంస్కృతితో సంబంధంలేని బాల్రూం నృత్యాల వంటివి పెరిగి గౌరవప్రదమైనవిగా చలామణి అవుతున్నాయని తెలియజేస్తూ వాటిని నిరసిస్తాడు.

**3.9 స్నేహం మరియు కృతజ్ఞత:**

ఆర్థిక లావాదేలు ఎక్కువగా ఉన్న నేటి సమాజంలో కూడా శశికుమార్ తన ఆస్తిలో సగం వాటా యామిని కి ఇవ్వడం అనేది సమాజంలో మనుషుల మధ్య ఇంకా మమతానురాగాలు, స్నేహ స్వభావం, కృతజ్ఞత శీలం మిగిలి ఉన్నాయని ఒక ఆశాభావాన్ని, దృక్పథాన్ని కలిగిస్తుంది.

**4) ముగింపు:**

ఈ విధంగా కలుగోట్ల విజయాత్రేయ వీధి నర్తకి నవల లో ఒకపక్క నాయిక హేమతార యొక్క జీవితాన్ని హృద్యంగా చిత్రిస్తూనే, మరోపక్క అనేకానేక సామాజిక అంశాలను, సమస్యలను ప్రస్తావిస్తూ చర్చకు తీసుకువచ్చాడు. వీటితో పాటుగా సందర్భానుసారంగా ఆయన విద్య ద్వారా వచ్చే సంస్కారం, సాలార్జంగ్ మ్యూజియం నూతన భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి రావడం, ఆ వేడుకలను సామాన్య ప్రజలు ఆసక్తిగా చూడటం వంటి నాటి సామాజిక రాజకీయ పరిస్థితులను చూపించాడు. అలానే ఇంద్రనాద్ వంటి పాత్ర ద్వారా వ్యసనాల వల్ల కుటుంబాలు ఎలా నాశనమయ్యేది చూపించడం మరియు చలనచిత్ర సంబంధ విషయాలు, మానవ సంబంధాలు వంటి మరెన్నో సాంఘిక అంశాలను ప్రస్తావించి నవలకు వాస్తవికతను జోడించాడు.

**పాద సూచికలు:**

1) కలుగోట్ల విజయాత్రేయ – వీధినర్తకి , పుటసంఖ్య – 36
2) కలుగోట్ల విజయాత్రేయ – వీధినర్తకి, పుటసంఖ్య – 36
3) కలగొట్ల విజయాత్రయ – వీధినర్తకి, పుటసంఖ్య – 40
4) కలుగోట్ల విజయాత్రేయ – వీధినర్తకి, పుటసంఖ్య – 164
5) కలుగోట్ల విజయాత్రేయ – వీధినర్తకి, పుటసంఖ్య - 191
6) కలగొట్ల విజయాత్రేయ – వీధినర్తకి, పుట సంఖ్య – 24

**ఆధార గ్రంధాలు:**

1) కర్నూలు జిల్లా రచయితల చరిత్ర - కే ఎన్ ఎస్ రాజు, కర్నూలు జిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం ప్రథమ ముద్రణ 1994
2) కర్నూలు జిల్లా సంస్కృతి విశేషాలు – జె. ఎస్. ఆర్ కే శర్మ ,జె. ఎస్ శ్యామసుందర శాస్త్రి. ప్రాచీన సాహిత్య పరిషత్ భారత్ కుంజ్ 18/199 - 2 బాలాజీ కాలనీ ,సి. క్యాంప్ కర్నూల్, ప్రథమ ముద్రణ 1997
3) వీధినర్తకి –కలుగోట్ల విజయాత్రేయ . వాహిని ప్రచురణ ప్రథమ ముద్రణ 1971

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

## 'రైతుకోసం మహిళా పోరాటం' నాటకం - సామాజిక చైతన్యం

**పాలపర్తి. ఫిలిప్ రాజు**
**తెలుగు టీచర్**
**వివేకానందా'స నెక్స్ట జెన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మార్టూరు**
**చరవాణి : 7794918274**

**ఉపోద్ఘాతం:-** 'కావ్యేషు నాటకం రమ్యం' అని పెద్దల మాట. ఈ నాటకాలు ఎప్పటినుండో ప్రజలకు వినోదాన్ని కలిగించే ప్రక్రియగా ఉన్నాయి. ఇవి ప్రజల హృదయాలను ఆకట్టుకున్నాయి. అందుకని వీటిని ఆధారంగా చేసుకొని, నాటకాల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకొనిరావచ్చనే ఉద్దేశంతో ఎంతో మంది రచయితలు ఆధునిక కాలంలో నాటకాలను రచించడం మొదలుపెట్టారు. .వాటిలో సాంఘిక నాటకాలకు పెద్దపీట వేశారు. వాటిలో భాగంగా తెలుగు సాహితీ ప్రపంచంలో అవతరించిన ఒక సాంఘిక నాటకమే "రైతు కోసం మహిళా పోరాటం". ఈ నాటకాన్ని మోదుగుల పార్థసారధి గారు రచించారు. ఇందులో రైతుల కోసం స్త్రీలు ఏ విధంగా నడుంకట్టారో మోదుగుల పార్థసారథి గారు చక్కగా వివరించారు. మోదుగుల పార్థసారథి గారు సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు. వీరిది నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట. వీరి తల్లిదండ్రులు మోదుగుల వెంకయ్య ,మోదుగుల సుభద్రమ్మ.వీరి భార్య మోదుగుల పద్మమ్మ. పార్థసారధి గారు ఈ నాటకంలో రైతులు పడుతున్న కష్టాలు నష్టాలు గురించి ఐదు అంశాలుగా వివరించారు.రాత్రి పగలు అనే తేడా లేకుండా కష్టపడి శ్రమించి పంట పండించిన రైతులకు సరైన ఫలితం దొరకటంలేదని,వారు ఎంతో ఆవేదనకు గురవుతున్నారని, ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, స్వయంగా వారు చూచి " యదార్థాన్ని చూస్తున్న వాడిని, నేను కూడా స్వతహాగా రైతుని" అని చెప్తూ పోరాటం అనేది రావాలని ఆశ పడుతున్నాను. అది కూడా మహిళ నుండి రావాలని అంటూ "ఎందుకంటే వ్యవసాయంలో మహిళల పాత్ర కూడా చాలా ఉన్నది. సారా ఉద్యమం ఎలా జయప్రదం అయిందో చూసాము. అలాగే రైతు సమస్యలు పరిష్కారం కావాలని పండించిన పంటకు గిట్టుబాటు ధర కోసం ప్రజలకు అందుబాటులోకి సరైన ధరలు నాణ్యమైనవిగా అందాలని ఈ పుస్తకం రైతు కోసం మహిళా పోరాటం రాశాను" అని స్వయంగా మీరే ఈ పుస్తకంలో చెప్పుకున్నారు.

ISSN: 3048-5908 సాహిత్య తరంగిణి Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

**నాటకంలోని పాత్రలు:-**ఈ నాటకంలో సుబ్బలక్ష్మి (సుభాషిణి), ఆర్. కె నాయుడు, సుబ్బయ్య, సత్య, రాజేష్, కృష్ణమూర్తి ,రమేష్ ,సరోజ MSc, b.Ed , రమేష్ ,సావిత్రి ,పి. సారధి ,సుచరిత్రా ,(కవిత, సిఐ ,జడ్జ్, దుర్గాబాయి, మేనేజర్ ,అరుణ, అరిగెల , ఆర్.డి.ఓ, డి.ఎస్. పి, ఎస్.పి ,చీఫ్ సెక్రటరీ) మొదలుకున్న పాత్రలు ఉన్నాయి. ప్రతి పాత్ర చాలా విలక్షణంగా మలిచారు రచయిత మోదుగుల పార్థసారథి. ఇందులో ప్రధాన పాత్రలు 10 ఉండగా వాటితో పాటు ఉన్న చిన్న, చిన్న పాత్రలు అక్కడక్కడ కనబడుతున్నాయి. అయితే నాటకంలో ప్రతి పాత్రను రచయిత సమాజ చైతన్యం కోసం తీర్చిదిద్దాడు. లక్ష్మి పాత్ర మాత్రం సమాజంలో ఉన్న అన్ని వర్గాల మహిళలకు ఆదర్శప్రాయంగా ఉంది. ఈ నాటకంలో కథ నాయికి సుబ్బలక్ష్మి.సుబ్బలక్ష్మి తను చదువుకున్న రోజుల నుండి పేదవాడి చెమటలో ధనమున్నది అని అభిప్రాయం కలిగి ఉంటుంది. దీని ద్వారానే రైతులకు చేదోడు వాదోడుగా ఉంటుంది. నేనున్నాను అన్నా నంటూ భర్తకు,ఊరిలో ఉన్న రైతులకు, తన స్నేహితులకు భరోసాను ఇస్తుంది. ఇలా ఈ పాత్ర చాలా విలక్షణంగా మనకు దర్శనమిస్తుంది.

**నాటకేతివృత్తం** :- సుబ్బలక్ష్మి, నాయుడు ఇద్దరు భార్యాభర్తలు.వీరిలో భర్త కొద్దిగా చదువుకొని వ్యవసాయం చేసేవాడు. సుబ్బలక్ష్మి బిఎస్సి అగ్రికల్చర్ చదువుకొని తన బావైన నాయుడిని వివాహం చేసుకుంది. ఇద్దరు కలిసి కుటుంబాన్ని నడుపుతున్నారు. ఒకరోజు నాయుడు తన భార్యతో వరి పంట వేద్దాము అని అడుగుతాడు. సరే బావ అంటుంది. సరే మరి పెట్టుబడికి డబ్బులు ఎట్లా అంటాడు నాయుడు. దానికి లక్ష్మి నా గొలుసు, ఉంగరం తీసుకువెళ్లి బ్యాంకులో పెట్టి డబ్బులు తీసుకుని వచ్చి, పెట్టుబడికి పెట్టు అని చెప్తుంది. సరే అని అవన్నీ తీసుకొని వెళ్లి బ్యాంకుకు వెళ్లి డబ్బులు తెస్తాడు. తెచ్చి విత్తనాలు కొని వరి పంటను వేస్తాడు.వరి పంట బాగానే పండుతుంది.ఈరోజుతో నా కష్టాలు తీరతాయని అనుకుంటాడు. కానీ వరి పంట చేతికి వచ్చిన తర్వాత సరైన గిట్టుబాటు రాక బాధపడతాడు .అంతలో లక్ష్మి బాధపడకు బావ ఏమి కాదులే ఇంకో పంటలో మంచి దిగుబడి వస్తుంది అని ధైర్యం చెబుతుంది. కొన్ని రోజులకు వేరుశనగ పంట గురించి వింటాడు లక్షల దిగుబడి వస్తుందని ఆశించి వేరుశనగ పంటను వేస్తాడు . వేరుశనగ పంట బాగా పండుతుంది. పక్కనున్న గ్రామంలో వేరుకు శనగ పంటకు ఎర్ర వైరస్ వచ్చిందని వింటాడు బాధతో ఇంటికి వచ్చి లక్ష్మితో చెప్తాడు లక్ష్మి మిషన్ కుట్టుకుంటూ నేను టీవీలో

చూశాను అని అంటుంది ఈ వైరస్ ఇప్పటికీ 30 గ్రామాలకు సోకింది మన గ్రామానికి కూడా వస్తుంది అన్న భయం ఉంది. రైతులందరూ ఈ ఎర్ర వైరస్ వల్ల గ్రామాలు వదిలి వెళ్ళిపోతున్నారు కొందరైతే ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నాయుడు లక్ష్మి రైతుల కష్టం తీరేది ఎప్పుడు అని అడుగుతాడు. నేను సరోజతో వేరుశనగ కాయలు ఆకులు రిపోర్టుకు పంపించాను బావ అవి వచ్చాక ఎందువల్ల ఇలా జరిగిందో చూద్దాం అని చెబుతుంది.

సరోజ అక్క ఇంకా రిపోర్ట్ రాలేదు అంటుంది .సరేనంటూ లక్ష్మి మిషన్ కుట్టుకుంటుంది .అంతలో రాత్రి 12 గంటలకు మెయిల్ కు  పంపుతారు రిపోర్టు అక్క మెయిల్ కు రిపోర్ట్ వచ్చింది చూడు అని చెబుతుంది. లక్ష్మి నిజమే సరోజా మనం అనుకున్నది. అదే జరిగింది .అధిక స్ప్రే చేయడం ద్వారా ఈ తెగులు వచ్చింది. సరే ఈ తెగులు రాకుండా ఉండడానికి కొన్ని మందులు, రసాయనకి ఎరువులు అన్ని రాసి అవి జిరాక్స్ తీపించి అన్ని గ్రామాలలో అతికించండి. అప్పుడు రైతులకు మంచి జరుగుతుంది. జిరాక్సు్ల అన్ని గ్రామాలలోనూ ఊరు బయట లను అతికిస్తారు. బావ రైతులు గ్రామం వదిలి వెళ్ళిపోతే పట్టణాల్లో ఏ వ్యాపారం చేసినా గౌరవంగా చూడరు గౌరవం ఉండదు. అందుకని రైతులందరూ గ్రామాలలో వ్యవసాయంతో పాటు ఆదాయం వెతుక్కోవాలి .ఆ రోజులు వస్తున్నాయి. పాలు ,కూరగాయలు, టైలరింగ్ ,పచ్చళ్ళు ,వొళ్ళు, ఊరగాయ ,అప్పాలు, పచ్చి పరోటాలు ఇలాంటివి అన్ని కొత్త కొత్త ఉత్పత్తులు వస్తున్నాయి. దాని ద్వారా ఏ ఊరికి వెళ్లకుండా గౌరవంగా బ్రతకవచ్చు. రైతులకు మంచి ధరలు రావాలంటే శాస్త్రీయ పద్ధతి వ్యవసాయం ,రసాయనకి, ఎరువులు పురుగుమందులు లేని వ్యవసాయం చేయడం నేర్పించాలి. రంగు సారా, బెల్ట్ షాపులు గ్రామాల నుండి పంపిస్తే గ్రామాలు, కుటుంబాలు ప్రశాంతంగా ఉంటాయి.

లక్ష్మి తెల్ల బంగారం అంట వేస్తే లక్షలు వస్తాయి అంట అని విన్నాను మరి పత్తి పంట వేద్దామా అంటాడు నాయుడు .లక్ష్మి సరే బావ అంటుంది. పెట్టుబడికి డబ్బులు అని అడుగుతాడు. లక్ష్మి నా గొలుసు, పిల్ల గొలుసు తీసుకువెళ్లి డబ్బులు తీసుకురా అంటుంది .సరే అని డబ్బులు తీసుకువచ్చి పత్తి పంట వేస్తాడు కొన్నాళ్ళకి పత్తి బాగా వస్తుంది .అయితే కొన్ని గ్రామాలలో తెగుళ్లు ఏర్పడతాయి. నీటి సమస్య వస్తుంది. వాటి కారణంగా వేసిన పంట వేసినట్టుగా నాశనం అవుతుంది .అది చూసి రైతులు చాలామంది ఆత్మహత్యలు చేసుకుంటారు. లక్ష్మి రైతుల కష్టం ఎలా తీరుతుంది. ఏ పంట వేసినా సరే నష్టపోతున్నారు అంటాడు. లక్ష్మి

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

పేదవాడి చెమటలో ధనమున్నది అన్నది వాస్తవం. ఎవరు కూడా ఇలాంటి అగ్రెత్యాలకు పాల్పడవద్దు. మరో శుభవార్త రైతు సంఘం వారు. సుప్రీంకోర్టు పత్తి రైతుకు సంబంధించిన పత్తి విత్తనాలు 200 గ్రాములు రూ నాలుగు వేలు పెట్టి కొన్నాము. అది అన్యాయమని కేసు దాఖలాలు చేస్తే 490 కి అమ్మాలని కార్పొరేట్ వారికి నోటీసులు ఇస్తూ తీర్పు చెప్పింది. అలాగే రైతుకు ప్రతి పంటకు ప్రభుత్వమే ఉచితంగా భీమా చేయాలని తీర్పు చెప్పింది. అలాగే ఇప్పుడు పత్తిలో నష్టపోయిన ఎస్టి, ఎస్సి లకు ప్రభుత్వమే నష్టం పరిహారం వెంటనే బ్యాంకుల ద్వారా చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినట్లు ఆన్లైన్లో ఈ దినం చూశాను.ఇది రైతు సంఘాల పోరాటం ఫలితం .అందువల్ల రైతులు రైతు కూలీలు ఒకటవ్వాలని చెబుతుంది. సారధి గారు వచ్చారు వారికి అతిధి మర్యాదలు చేశాను వారు నీలాంటివారు రైతు పోరాట సంఘంలో ఉంటే మంచిది అన్నారు నేను భావ నడిగి చెప్తాను అని చెప్పాను . నాయుడు సరే అంటాడు.

లక్ష్మి బీఎస్సీ అగ్రికల్చర్ చదువుకున్న అమ్మాయి. ఈమెకు అన్ని పంటల మీద అవగాహన ఉంది. ఈమె రైతుల కోసం ప్రతి దినం ఏదో ఒక పుస్తకం చదివేది. రైతుల కోసం కొన్ని వ్యాసాలు, ఉపన్యాసాలు ఇస్తూ ఉండేది. వీటిని చూసి తను చదువుకున్న కాలేజీలో ఒకరోజు అగ్రికల్చర్ విద్యార్థులకు ఉపన్యాసం ఇవ్వడానికి పిలుపునిస్తారు. లక్ష్మి బావని అడిగి కాలేజీకి వెళుతుంది. అక్కడ రైతుల గురించి, రైతుపడుతున్న కష్టాల గురించి ,వాళ్లు చల్లుతున్న మందులు గురించి, వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చెప్పి మనం ముందడుగు వేయాలి. మనం నడుం కట్టాలి అంటూ ఉపన్యాసం ఇస్తుంది. ఆ తర్వాత ఇంటికి వస్తుంది. నాయుడు బావ వచ్చి మిరప పంట వేద్దాం లక్ష్మి సంవత్సరానికి మూడు కోతలు అంట మంచి దిగుబడి వస్తుంది అని చెప్తాడు. లక్ష్మి సరే అంటుంది. పెట్టుబడికి బంగారం ఇస్తాను. బ్యాంకులో పెట్టి డబ్బులు తీసుకొని రా వడ్డీ తక్కువ. వద్దు లక్ష్మి పిల్లకు పెళ్లి కుదుర్చుకోవడానికి మీ అన్న వాళ్ళు వచ్చేటట్లు ఉన్నారు. వచ్చినప్పుడు బోసిమెడతో ఎలా ఉంటారు అందుకని వేరే వాళ్ళ దగ్గర వడ్డీకి తీసుకుంటాను అని చెప్తాడు. సరే విత్తనాలకు ఎప్పుడు వెళ్తున్నారు. అందరూ కలిసి వెళ్ళండి బాబాయ్ కి చేదోడువాదోడుగా ఉండు బాగుంటుంది పెద్దవాడు అంటుంది . లక్ష్మి సరే అని అందరూ వెళ్లి మిరప విత్తనాలు తెచ్చుకొని మిరప పంట వేస్తారు.

మిరప పంట బాగానే పెరుగుతుంది. కానీ ధరలు అనేవి చాలా తక్కువగా ఉన్నాయి. ఇలా ఉంటే మరోపక్కం చేలకు పసుపు తెగులు వచ్చింది. కాయలు అన్ని

రాలిపోయాయి. చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. బాబాయి కూడా పురుగుమందు తాగి హాస్పటల్లో అడ్మిట్ అయ్యాడు. ఇది చాలా దురదృష్టకరం రైతు కష్టపడి పంట పండిస్తే ఆ పంటకు సరైన గిట్టుబాటు లేక మందులు ఎక్కువగా చల్లడం వల్ల ఇటువంటి నష్టాలు వస్తున్నాయి. అంటూ నాయుడు బాధపడతాడు. లక్ష్మి బాధపడకు బావ ఏమి కాదులే అని హాస్పిటల్ వారికి ఫోన్ చేసి చెప్తుంది. వాళ్లు సరే మేడం అంటూ ఎమర్జెన్సీగా వాళ్లని రికవర్ చేస్తారు. లక్ష్మి సరోజ మిర్చి పంటపై రీసెర్చ్ చేస్తారు ఒక 20 చెట్లను మూల నుంచి వాటిపై రీసెర్చ్ చేయాలని అగ్రికల్చర్ ఏ.డి గారితో మాట్లాడతారు. రైతు కోసం రైతు లోకం చూశాను దానిలో మీ ఉపన్యాసాలు చాలా చక్కగా ఉన్నాయి. మిరప చెట్లు పసుపు తెగులు వచ్చింది. తెగులుకు మందులు లేదా ఈ కార్పొరేట్ సంస్థల ప్రభావం వల్ల అధికంగా విషపూరిత మందులు స్ప్రే చేసినప్పుడు ఈ వైరస్ వస్తుంది. ఏం చేయాలో ఏం అర్థం కావట్లేదని లక్ష్మి అడుగుతుంది. సలహాలు సూచనల ప్రకారం రీసెర్చ్ మొదలు పెడతారు. అయితే ప్రతిరోజు కవిత, సరోజ ఫోన్లో మాట్లాడుకుంటారు. 20 రోజులు గడిచింది. అక్క కవిత మేడం ఈ దినం వీడియో చూసి 20 చెట్లకు కంచ కట్టండి పేడ ఎరువు పెట్టమంది. ఆవు పంచకం, పేడ, బెల్లం పిచికారి చేసి చల్లమంది.

**పూత నిలవడానికి:** లక్ష్మి ప్రతిరోజు పరిస్థితిని డైలీ రాస్తూ ప్రతి వారానికి ఒకసారి రైతులకు సంబంధించిన పత్రికలో ప్రకటిస్తున్నది. ఫోన్ కవిత గారు అధికారులు, అగ్రికల్చర్ విద్యార్థులు, రైతులు పెద్ద ఎత్తున వచ్చి చూస్తున్నారు కాయలు కాచాయి. ల్యాబ్ కు పంపించాము మంచి ఫలితం వచ్చినట్లు రిపోర్ట్ వచ్చింది. రిపోర్ట్ కోసం కార్పొరేట్ కంపెనీలు ప్రచురిత సంస్థలు వచ్చాయి .నేను సరోజ స్వయంగా తయారు చేసిన రిపోర్ట్ 300 పేజీలు రహస్యంగా ఉంచింది సరోజ. లక్ష్మినీకు సరోజ కి అభినందనలు. మీ పరిశోధన పూర్తి రిపోర్టు జయప్రదం అని వచ్చింది .రిపోర్టు జాగ్రత్త చేయండి. ఈ భూమిలో ఏ మందు చల్లారో మీకు పెడతాను.అది కూడా మీ పరిశోధనలో తేలింది. మిర్చి రిపోర్టును కోర్టుకు పంపిస్తారు. అలా ఉండగా చెరుకు పంట గురించి నాయుడు వింటాడు. లక్ష్మికి చెప్పి. చెరుకు పంట విత్తనాలు కొనుగోలుకు ఫ్యాక్టరీ వారు వ్యాన్ పెట్టి తమిళనాడుకు తీసుకువెళ్లారు .చెరుకు విత్తనాలు కొని ఇంటికి వచ్చి విత్తనాలు నాటుతారు. చెరుకు పంట బాగా పెరుగుతుంది .చెరుకు నరకడానికి సమయం వస్తుంది. రైతులందరూ చెరుకు పంట నరికి ఫ్యాక్టరీలకి తరలిస్తారు. ఫ్యాక్టరీ వారు వీరికి ఒక అగ్రిమెంట్ ఇస్తారు.

కొన్ని రోజులకి రైతులను మోసం చేసి ఫ్యాక్టరీని అమ్ముకోవాలని చూస్తారు. అంతలో ఆ విషయం అంత లక్ష్మికి తెలిసి లక్ష్మి ఆ ఫ్యాక్టరీ వారికి అడ్డుపడుతుంది. రైతులకు న్యాయం జరగాలి అంటూ రైతులు కోసం స్త్రీలను చైతన్య పరుస్తూ స్త్రీలకు అన్ని విషయాలలో నైపుణ్యం కలిగి ఉండాలని ట్రాక్టర్లు నేర్పించి వ్యవసాయం చేసే విధానాన్ని నేర్పిస్తుంది. స్వయంగా ఉద్యమం ఎలా నడపాలో కూడా చూపుతుంది. ఎలా అంటే సారా వ్యతిరేక ఉద్యమం ఎలా అయితే సాగిందో ఎలా జయప్రదం అయిందో అలా మన ఉద్యమం కూడా జయప్రదం కావాలి అంటూ రైతులకు మంచి గిట్టుబాటు రావాలి అని చెరుకు ఫ్యాక్టరీ పై ముట్టడి చేస్తుంది. లక్ష్మిని కార్పోరేట్ వారు పలుకుబడి ఉపయోగించి జైలుకు పంపిస్తారు. కానీ లక్ష్మి వెంటనే విడుదలవుతుంది. ఇలా ఈ నాటకం ముగుస్తుంది.

**సామాజికాంశాలు - చైతన్య ప్రబోధ** :-మోదుగుల పార్థసారథి గారు ఈ నాటకంలో ఐదు అంశాలుగా రైతు గురించి , తాను చూచిన ,సంఘటనలను, సన్నివేశాలను, రైతుల జీవన విధానాన్ని ,వారి కష్టసుఖాల్ని ,వారి ఆవేదనని ,ఆ క్రోధాన్ని, ఆవేశాన్ని చిత్రించారు. రైతుల ఆర్థిక స్థితిగతి, రైతుల ఆత్మహత్యలు, కార్పోరేట్ దోపిడీ, స్త్రీ సాధికారత ,శాస్త్రీయ వ్యవసాయం ,స్వయం ఉపాధి, ప్రభుత్వ వ్యవస్థ న్యాయపోరాటం, సంఘీభావం, వంటి సామాజిక అంశాలు మనకు కళ్ళకు కట్టినట్టు చూయించారు. ఇవన్నీ ప్రజల జీవన విధానం అద్దం పట్టేలా ప్రతిఘటిస్తున్నాయి.

1.**రైతుల ఆర్థిక స్థితి**:- రైతు భారతదేశంలో ఆర్థిక వ్యవస్థకు పునాది వంటి వాడు. 'అన్నదాత సుఖీభవ' అనే మాటలు సిద్ధాంతంలో మాత్రమే సరిగా ఉండి వాస్తవ జీవితంలో రైతు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నాడు. రైతులు పెట్టుబడుల కోసం వారికున్నటువంటి వస్తువులను తాకట్టు పెట్టడం. అప్పుచేసి తీసుకు వచ్చిన డబ్బును పంటలకు పెడుతున్నారు .అయితే రైతులు ఆ పంట మీద ఎన్నో ఆశలు పెట్టుకొని వారి ఆశయాలను ఆశలను కోర్కెలను వదులుకొని పంట చేతికి వస్తే కుటుంబం సమస్యలు తీరతాయని రైతులు ఎదురుచూస్తూ ఉంటారు కానీ సమయానికి వర్షాలు పడకపోవడం వాతావరణ మార్పుల వల్ల రైతుల కలలు కలలుగానే మిగిలిపోతున్నాయి ఎంత కష్టపడి పనిచేసిన సరైన ఆదాయం లేక వచ్చిన పంటకు సరైన గిట్టుబాటు లేక ఆర్థికంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా రైతు పరిస్థితి అక్కడే ఉంది .అప్పులు పెరిగి వడ్డీలతో పరిగెత్త లేక రైతులు పురుగుమందులు తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు తినడానికి తిండి లేక త్రాగడానికి నీరు లేక కుటుంబం పోషించుకోలేక రైతుల

పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయింది ఆర్థికంగా, శారీరకంగా ,మానసికంగా రైతు కృంగిపోయారు వచ్చిన డబ్బులు కూలి వాళ్ళకి ,పురుగు మందుల వారికి , బాకీ వాడికి ఇవ్వటానికి సరిపోతున్నాయి.చేసిన కష్టానికి కూడా ప్రతిఫలం దొరకటం లేదు .ఇంకా ఆర్థికం గానే మిగిలిపోతున్నారు అని మనకు కనపడుతుంది.

2. **రైతుల ఆత్మహత్యలు:-** మన రైతుల జీవితం ఎంతటి విషాదంగా మారిందో ఈ నాటకంలో చూపించారు రచయిత . రైతుల కుటుంబాల ఆవేదన కనబడుతుంది. పొలం పండక, ఆదాయం లేక, అప్పులు కుప్పలుగా పెరిగి కుటుంబంలో కలహాలు మొదలవుతున్నాయి. పిల్లల భవిష్యత్తు నాశనం అవ్వడంతో, పిల్లలకు సరైన భవిష్యత్తు ఇవ్వలేక ,వారి వివాహ బాధ్యతలు, చదువు విషయం అన్నిటిలో రైతు వెనుకబడిపోయినాడు. ఎందుకంటే తను నమ్ముకున్నటువంటి వ్యవసాయం లో సరైన దిగుబడి రాక ,అనుకున్న ధర పలకక ఎన్నో సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాడు. వేసిన పంటలకు తెగుళ్లు రావడం. అసలుకే మోసం రావడం. ఇలాంటి విషయాలన్నిటిలో రైతు కృంగి, కుషించి ఇక నేను బ్రతకకూడదు అనుకొని పురుగుల మందు తాగి ,ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ నాటకంలో చాలామంది రైతులు ఆత్మహత్యలే కాదు గ్రామంలో బ్రతకలేక పట్టణాలకు వెళ్ళారు. కొందరు రైతులు వ్యవసాయం మానరు. ఏ పంట వేసినా రైతుల నష్టాలే చవిచూశారు అందుకే  రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

3. **కార్పొరేట్ దోపిడీ:-** ఈ కార్పొరేట్ సంస్థవారు రైతులకు నాణ్యమైన విత్తనాలు ఇస్తామని. వాటితో పాటు మందులు కూడా మేమె తక్కువ ధరకు ఇస్తామని. రుచి చూయించి ,ఆశపెట్టి వారికి నకిలీ విత్తనాలు అమ్మేవారు. రైతులు ఎంతో ఆశతో ఆ విత్తనాలు కొన్ని పంటలు వేస్తే, ఆ పంటలకు మందులు ,స్ప్రేలు చల్లినప్పుడు ఆ పంటకు వైరస్లు రావడం. తెగుళ్లు రావడం. పంట దిగుబడి రాకపోవడం. వంటి సమస్యలు ఈ నాటకంలో ఎక్కువగా కనిపించాయి. రైతులు ఈ సమస్యను ఎక్కువగా ఐదు అంశాల్లో ఎదుర్కోవాల్సి వచ్చింది. విషపూరితమైన మందులు ఇవ్వడం వల్ల ఎంతో మంది రైతులు ప్రాణ త్యాగాన్ని కూడా కారణమయ్యాయి. అదే విధంగా చక్కెర ఫ్యాక్టరీ రైతులకు మోసం చేయడం. ఇస్తానన్న ధరలు ఇవ్వకుండా1 ఫ్యాక్టరీని ఇక్కడి నుండి మార్చాలి అనుకోవడం. ఇక్కడ ఒక పెద్ద విషాదంగా మనకు కనిపిస్తుంది. రైతులందరూ సామూహికంగా ఉంటే దేనిన జయించగలరు అంటూ రైతుల్లో చైతన్యం తీసుకువచ్చి పోరాటం చేయాలని లక్ష్మి

ముందుకు నడిచింది. ఇలా ఆ కార్పొరేట్ దోపిడీ నుండి లక్ష్మి రైతులను కాపాడింది. కార్పొరేట్ సంస్థలు ఇలా రైతుల కష్టాల్ని ఒక వ్యాపారంగా చేసుకొని వారి వారి శక్తిని దోచుకుంటున్నాయి .వారి రక్తాన్ని తాగుతున్నాయి కార్పొరేట్ సంస్థలు అని ఈ నాటకంలో మనకు కనిపిస్తుంది. ఈ దేశానికి రైతుకు పెట్టుబడిదారీ వర్గం, కార్పొరేట్ సంస్థలు ఒక శని. బ్రిటిష్ వారి కంటే ప్రమాదం. కార్పొరేట్ సంస్థలను తిరస్కరించింది లక్ష్మి.

4. **శాస్త్రీయ వ్యవసాయం** :- లక్ష్మి ,సరోజాలు పత్తి2 పంట,మిరప పంటలు వేసిన రైతులు వైరస్ లతో ఎంతో ఆందోళనకు గురవుతుండడంతో వాటిమీద రీసెర్చ్ చేసి వాటికి తగిన పరిష్కారం కనుక్కొని గ్రామం మొత్తం వాడవలసిన మందులను జిరాక్స్ తీయించి చుట్టుపక్కల ఉన్న గ్రామంలో వారి గ్రామంలో అన్నిచోట్ల అతికించి శాస్త్రీయమైన వ్యవసాయం చేయమని రైతులందరినీ ప్రోత్సహించారు ఎంత మోతాదులో మందులు చల్లాలో ఎంత మోతాదులో నీరు పెట్టాలో వంటి విషయాలను కూడా రైతులకు చక్కగా చెప్పేవారు రైతులకు అండదండలుగా లక్ష్మి నాయుడు ఎప్పుడు ముందుండే వారు లక్ష్మి బిఎస్సి అగ్రికల్చర్ చదువుకున్నటువంటి విద్యావంతురాలు రైతులకు శాస్త్రీయ పద్ధతులు నేర్పించి వారికి మార్గదర్శకురాలుగా ఉంటుంది రైతుల కష్టాన్ని తన కష్టంగా భావించి ప్రతి సమస్యకు చక్కటి పరిష్కారాన్ని వెతుకుతుంది అదేవిధంగా

5. **స్త్రీ సాధికారత**:- ఈ నాటకంలో సుబ్బలక్ష్మి ఎన్నో3 పుస్తకాలు చదివి ఎన్నో వ్యాసాలు ఉపన్యాసాలు ఇస్తుంది లక్ష్మి. స్త్రీలలో చైతన్యం రావాలి అంటూ .స్త్రీలు ఉద్యమంలో పాల్గొనాలలి.స్త్రీల శక్తిని సమాజానికితెలియజేయాలంటూ వారు తలుచుకుంటే ఏదైనా సాధించగలరని స్త్రీలలో ఉద్యమ భావాలను రేపడం. స్వయంగా తానే ఉద్యమకారిణిగా ముందుండి .అన్ని విధాల ప్రోత్సాహాన్ని అందించడం. గొప్ప విశేషంగా మనకు కనబడుతుంది. స్త్రీలు కూడా ఏకీభవించి వారి శక్తిని ప్రతిభని తెలుసుకొని హుషారుగా ఉద్యమంలో చేరతారు. చేరడానికి కారణం లక్ష్మి చెప్పిన 'సారా వ్యతిరేక ఉద్యమం' గురించి అందరి నరాల్లో ఇమిడిపోయింది. ఎందరో స్త్రీలు ఉద్యమాలలో ఉండి తమ కష్టాలు అధిగమిస్తున్నారంటూ స్త్రీ చైతన్యమే సమాజానికి మేలు అవుతుంది. చదువుకున్నాం ఎస్సీ ఎస్టీ స్త్రీలు కూడా ముందుకు రాకుండా వెనకబడిపోతున్నారని వారి అన్ని రంగాల్లో ముందుండాలని వారిలో ఉద్యమ

భావాలను రేపడంతోపాటు రైతులకు సహాయ సహకారాలు అందించడంతోపాటు నాయకురాళ్లుగా తీర్చిదిద్దడమే లక్ష్మీ దేహంగా పెట్టుకొని స్త్రీలను చైతన్య బాటలో నడిపించడం. వ్యవసాయంలో కూడా స్త్రీల పాత్ర ఉంది అంటూ రచయిత స్త్రీ చైతన్యమే నవ్య పునాది .అంటూ స్త్రీ సాధికారత ఈ నాటకంలో మనకి స్పష్టంగా కనబడుతుంది.

6. **స్వయం ఉపాధి:-** గృహిణిగా జీవిస్తున్నటువంటి స్త్రీలకు ఉపాధి కల్పించాలి అంటూ గ్రామంలో ఉన్నటువంటి స్త్రీలందరికీ స్వయం ఉపాధిగా కుట్టుమిషన్ నేర్పించడం మొదలుపెట్టింది. డాక్టర్లు నడపడం కూడా స్త్రీలకు నేర్పిస్తుంది.ఇలా అం దరికీ వారి జీవితాలు మీద వారి కుటుంబం మీద అవగాహన కలిగేటట్లు చేస్తుంది లక్ష్మి. అదేవిధంగా స్త్రీలు పురుషుల మీద ఆధారపడకూడదని కుటుంబ బాధ్యతలో కూడా స్త్రీ పాత్ర ఎంతో ఉన్నతమైనది. అందుకే మనం కూడా కష్టపడి పని చేయాలంటూ మన కష్టార్జితం పిల్లల చదువులకి కుటుంబం గడవడానికి ఉపయోగపడుతుంది., స్వయంగా ఉపాధి అవకాశం కల్పిస్తుంది. స్త్రీలు తమ కాళ్ళ మీద వాళ్ళు నిలబడగలదు అంటూ స్త్రీలలో స్వయం ఉపాధి ఆలోచనలు కలిగిస్తుంది. అదేవిధంగా రైతుల కూడా వ్యవసాయం మీదే ఆధారపడకుండా కొన్ని ఉపాధి సలహాలు కూడా ఇస్తుంది లక్ష్మి .5 ఖాళీ సమయాలలో పాలు, కూరగాయలు, పచ్చళ్ళు ,వంటి ఉపాధి అవకాశాలు కల్పించుకొని వీటి మీద కూడా ఆధారపడి జీవించవచ్చు . రైతులు ఎదుర్కొంటున్న సమస్యల నుండి ఒక చక్కటి పరిష్కారాన్ని చూయిస్తుంది లక్ష్మి.

చక్కెర ఫ్యాక్టరీలో ఉన్నటువంటి కార్మికులకు కూడా ఉపాధి వేతనాలు సకాలంలో అందించాలంటూ వారికి కూడా స్వయం ఉపాధి ఉండాలి అని చేయూతనిస్తుంది. ఇలా అందరిలో ఆత్మ ధైర్యాన్ని నింపి వ్యవసాయంతో పాటు వారి జీవితాన్ని మార్చుకోవడానికి వారి జీవితాన్ని సాగించడానికి స్వయం ఉపాధి ని అందరికీ అందుబాటులో తెచ్చిది .చాలా వరకు గ్రామాలు వదిలి పట్టణాలకు వెళుతున్నటువంటి రైతులను గ్రామంలో ఉండే ,ఉపాధిని పొందవచ్చు అంటూ వారికి ప్రోత్సాహంగా వారిలో ఆత్మ ధైర్యాన్ని నింపి చేయూతనిస్తుంది. సూపర్ మార్కెట్ ఒకటి పెట్టాలి అప్పుడు కొంతమంది రైతుల కైనా పని జరుగుతుంది 50 గ్రామాల వారికి దగ్గరగా అన్ని సదుపాయాలు ఏర్పడతాయి. మరియు పుట్టగొడుగుల పెంపకం,

కోళ్లు, ఎరువుల తయారు చేయడం వంటివి మహిళలకు మంచి ఉపాధిగా ఉంటాయి. ఆర్థిక సమస్యను ఎదుర్కొనవచ్చు అని చెబుతుంది.

7. **ప్రభుత్వ వ్యవస్థ - న్యాయపోరాటం:-** పాలుకల వైఫల్యాన్ని ఎత్తిచూపుతు ఎన్నో దశాబ్దాలు గడిచి నా రైతు సమస్యలు అసలు పరిష్కారం కావడం లేదు. అని విమర్శ చేశారు. పాలకులు వాగ్దానాలు మాటలకే పరిమితం అయినాయని ఒక్క రైతు కూడా ఆర్థికంగా, శారీరకంగా ,మానసికంగా, తన కష్టాల నుంచి బయటపడలేదు. అందుకే లక్ష్మి రైతు సంఘాల పోరాటం కోసం కృషి చేసింది. ఎలాగైనా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి అంటూ రైతు సంఘం లో సభ్యురాలుగా చేరి. ఉద్యమం గురించి అందరికీ అవగాహన కలిగించి అందరూ ఉద్యమంలో పోరాడాలి అంటూ మద్దతునిస్తుంది. 6దిల్లీలో జరిగే రైతాంగ పోరాటానికి మద్దతునిస్తుంది.రైతులు వేసిన పంటకు వైరస్ రావటం వల్ల దానిపైన రీసెర్చ్ చేసి. ఆ రీసెర్చ్ అంతా6.1 300 పేజీ డాక్యుమెంట్ చేసి సుప్రీంకోర్టులో కేసు వేస్తుంది. ఆ కేసు రైతుల పక్షాన న్యాయం చేకూరే విధంగా లక్ష్మి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోరాడుతుంది. చివరికి సుప్రీంకోర్టు తీర్పు ద్వారా రైతులకు న్యాయం జరుగుతుంది. పాలన వ్యవస్థలో న్యాయం కోసం 50 గ్రామాలలో ఉన్న అందరూ సామూహికంగా గలమెత్తడం. చాలా గొప్ప విషయంగా మనకు కనబడుతుంది. రైతు కోసం స్త్రీలు పోరాడడం గొప్ప విషయం.

**8. విద్యాభివృద్ధి:** లక్ష్మి7 బి ఎస్ సి అగ్రికల్చర్ కాలేజీలో మోటివేషన్ స్పీకర్ గా వెళుతుంది. అక్కడ కాలేజీ పిల్లలందరికీ విద్యాభివృద్ధి గురించి. విద్య వల్ల సమాజానికి మనం ఏవిధంగా సహాయ పడగలనము అని చక్కగా చెబుతుంది .బిఎస్సి అగ్రికల్చర్ చదువుతున్న మీరందరూ శాస్త్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించలి. రైతులకు మంచి జరిగేటట్లు రైతుల పక్షాన మేమున్నాము అంటూ బరో సాన్ని ఇవ్వాలి అని చెబుతుంది. విద్యార్థులందరికీ వారి బాధ్యతను గుర్తు చేస్తుంది .ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల దోపిడి నుంచి రైతులను కాపాడాలి మీ విద్య అని ప్రోత్సహిస్తుంది . మీరు చదువుకున్న చదువుకి న్యాయం జరుగుతుంది అని విద్యార్థులను బలపరుస్తుంది లక్ష్మి.

9. **సంఘీభావం:** 'ఐకమత్యమే మహాబలం' అనే సూత్రంతో అన్నదాతకు జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ సహించేది లేదని, సంఘటితంగా పోరాటపటిమను ప్రదర్శించి ఉద్యమిస్తేనే న్యాయం సాధ్యమనే ఉత్తదాన్ని రచయిత పార్థసారధి గారు నాటకం రూపంలో మంచి సందేశాన్ని అందించారు. భారతదేశంలో వ్యవసాయ దేశంగా ఇప్పటికే 70% ప్రజలు వ్యవసాయం వ్యవసాయ ఉత్పత్తి రంగాల ద్వారా జీవనం సాగిస్తున్న నేపథ్యంలో మానవ జీవన మనుగడకు జీవం పోస్తున్న రైతుకు అన్ని రకాలుగా అండగా ఉంటూ అందుకోవలసిన ప్రభుత్వాలు పాలకుల వారి పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలను ఏ విధంగా దాసోహం చేస్తున్నారో పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక చేసిన తీర్పులు తీర్చలేక అప్పులు ఊబిలో కూలిపోయి రైతులు ఆత్మహత్యలు పాల్పడడం జరుగుతుంది.రైతులకు న్యాయం జరగాలి అంటే ఒక్కరే పోరాడితే సరిపోదు. అందరు కలిసి పోరాడాలి అని పిలుపునిస్తుంది.అదికూడా ముందుగా స్త్రీ లకె పిలుపునిస్తుంది .8దిల్లీలో జరిగే రైతాంగ పోరాటానికి మద్దతునీయటం జరుగుతుంది.విద్యార్థులు , రైతులు , మహిళలు అందరూ కలిసి పనిచేయాలి. అందరు 'ఐకమత్యమే మహా బలం' అన్నట్టు గా అందరు సామూహికంగా కలిసి ఉంటే ఎంతటి సమస్యనిన పరిష్కారం చూపవచ్చు అని వ్యవసాయాన్ని నిలబెట్టే మార్గంగా చూపుతుంది సంఘీభావం

**10. గ్రామ అభివృద్ధి- రైతు చైతన్యం :-** సరైన నాయకురాలు ఉంటే గ్రామం బాగుపడుతుందని, రైతులలో చైతన్యం కలుగుతుంది. రైతు కోసం సంఘం పొందడం. **9**సొసైటీ ప్రెసిడెంట్ గా పోటీ చేస్తుంది.అయితే అనూహ్యంగా ఏకగ్రీవంగా గెలుస్తుంది. లక్ష్మి గ్రామ అభివృద్ధి కోసం **10**సొసైటీకి ఫిక్స్ డిపాజిట్లు చాలా తక్కువగా ఉన్నవి. ఒక సంవత్సరం కాలంలో 10 కోట్లు ఫిక్స్డ చేయాలని మా డైరెక్టర్ చెప్పారు. ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సేకరించాలని నిర్ణయించారు. దీన్ని సాధించగలం. దీనివల్ల మన సొసైటీ సిబ్బంది పట్నం వెళ్లి బ్యాంకు పనిగా వెళ్లనవసరం లేదు. 10 కోట్లు ఫిక్స్డ ఉంటే ఎస్ .సి. సి బ్యాంక్ బ్రాంచ్ మన సొసైటీ ఆవరణంలోనే పెట్టవచ్చు ఏ టీ ఎం ఒకటి పెట్టించవచ్చు మన ప్రాంతంలో ఉన్న ఉద్యోగులు డిపాజిట్ చేస్తారు. సొసైటీ అభివృద్ధి అవుతుంది. అలాగే ప్రజలకు పొదుపు చేసే ఆలోచన వస్తుంది.ఫండ్స్ అడిగి వెనుకబడిన రైతులకు చెత్తనివ్వటం.వారికి ఆర్థికంగా సహాయం చేయటం.వచ్చిన డబ్బును రైతుల కోసమే ఉపయో గించటంచేస్తున్నారు.గ్రామ అభివృద్ధి కోసం కొత్త మార్పులు తెచారు.

**11. ఆదర్శ వివాహాలు:-** ఈ నాటకంలో లక్ష్మి తో పాటుగా సరోజ చేయూతనిస్తూ ఉద్యమానికి నాంది పలికి ఉద్యమంలో తన బాధ్యతను నిర్వర్తిస్తూ ఉంటుంది. సరోజ చదువుకున్న అమ్మాయి. రమేష్ అనే వ్యక్తి తనను ప్రేమిస్తాడు అభిమానిస్తాడు ముఖ్యంగా తన్ను భార్యగా స్వీకరించాలని అనుకుంటాడు.11 సరోజినీ నాయుడు లక్ష్మి వివాహం చేసుకోవచ్చుగా అని అడుగుతారు అడిగితే అప్పుడు సరోజ ఈ ఉద్యమం పూర్తవ్వాలక్కా మనం అనుకున్న గమ్యం చేరాలి రైతులకు మంచి జరగాలి అప్పుడే మా వివాహం అని చెబుతుంది. మిగిలిన సత్య కృష్ణమూర్తి రాజు కమల వీళ్లు కూడా ఈ ఉద్యమంలో పాల్గొని ఉద్యమం అయిన తర్వాత వివాహం చేసుకోవాలని అనుకుంటారు. అందుకే వీరి వివాహాలు ఈ నాటకంలో ఆదర్శ వివాహాలుగా మనకు కనబడుతున్నాయి. సత్యా కృష్ణమూర్తి, సరోజా రమేష్, రాజు కమల కు మూడు గంటలకు సభాముఖంగా ఆ సభలోని పెద్దల ఆశీర్వాదంతో కుటుంబ సభ్యుల అభిప్రాయంతో సారథి గారు పూలదండలిచ్చి మార్పించాడు జనం అంత చప్పట్లు పూలు చల్లారు. ఇలా వారి వివాహం ఆదర్శప్రాయంగా మిగిలింద

**ముగింపు:-** 'అన్నదాత సుఖీభవ' అనే మాటలు కాగితాలకు మాత్రమే పరిమితం కాకుండా రైతు నిజంగా సుఖంగా ఉండాలంటే వ్యవస్థలో రావాల్సిన మార్పులను ఈ నాటకం కళ్ళకు కట్టినట్లు చూపించింది. భారతదేశంలో రైతులు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులకు ఇది ఒక ప్రతిబింబంగా కనబడుతుంది. రైతు చైతన్యమే దేశానికి శ్రీరామరక్ష అంటూ మోదుగుల పార్థసారథి రైతుల జీవిత విధానాన్ని కళ్ళకు కట్టినట్లు వారు ఎదుర్కొంటున్న సమస్యలను మన ముందు ఉంచారు. ఈ నాటకంలో పోరాటపాటి మా స్త్రీ శక్తి ఐకమత్యం శాస్త్రీయ దృక్పథం ఆదర్శ వివాహాల వల్ల సామాజిక బాధ్యతలు అనివి కూడా మనకు చాలా ప్రాముఖ్యమైనవి అంటూ వివరించారు. రైతు కేవలం అన్నదాత మాత్రమే కాదు ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక అని చాటి చెప్పారు మోదుగుల పార్థసారధి. అందుకే యువత విద్యావంతులు మరియు మహిళలు రైతులకు అండగా నిలవాలంటు ఈ నాటకాన్ని సమాజానికి పరిచయం చేశారు. స్త్రీ తలుచుకుంటే ఏదైనా సాధించగలదు అంటూ ఇన్ని విధాలైన అంశాలతో చైతన్యం కలిగిస్తూ,ఈ నాటకంలో

ISSN: 3048-5908 **సాహిత్య తరంగిణి** Impact Factor: 5.379(SJIF)
అంతర్జాతీయ సాహిత్య పత్రిక, Indexed in Google Scholar, సమ్మేళన పరిశోధన వ్యాస సంపుటి
Volume-3 | ప్రత్యేక సంచిక – 2; జనవరి, 2026

గొప్పగా నాయికను ప్రధాన పాత్రగా ఉంచి నాటకాన్ని రసవత్తరంగా, అద్భుతంగా తీర్చిదిద్దారు రచయిత మోదుగుల పార్థసారథి..

**ఆధార గ్రంథాలు:-**


1. తెలుగు నాటక వికాసం- పి .ఎస్. ఆర్ .అప్పారావు.

2. నాటక శిల్పం-ఆచార్య మొదలి నాగభూషణ శర్మ.

3.రైతు కోసం మహిళా పోరాటం (నాటకం)- మోదుగుల పార్థసారధి. పద్మసారతి చారిటబుల్ ట్రస్ట్ సంపాదకీయం. విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం-విజయవాడ,2025.